ఆర్షవిద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# Samkshipta Bhagavadgita

# సంక్షిప్త భగవద్గీత

స్వామి పరమార్థానంద

శ్రీభగవాన్ ఉవాచ
అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥

## స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

## వారి ఆశీస్సులతో

## తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

First edition  - Year 2024 Guru Purnima day 1000 copies

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368

Email: raghavkasturi@gmail.com
for softcopy http://telugubhakti.com/telugupages/main.htm

Title - Samkshipta Bhagavadgita

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP – Sri S Rajendra Kumar 98661 15622

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 500

# బ్రహ్మయజ్ఞం

గీతాజయంతి వేడుకల్లో భాగంగా 2021లో స్వామీజీ సందేశం వినిపిస్తూ, స్వామీజీ మాకొక కొత్త అసైన్‌మెంట్‌ను ఇచ్చారనీ, భగవద్గీత అధ్యాయాల సారాంశం తను ప్రత్యేకంగా ఆంగ్లంలో బోధించారనీ, దానిని మేము తెలుగులోకి అనువాదం చేస్తే, భగవద్గీత అంటే ఏమిటో తెలియని సామాన్య ప్రజలకు కూడా తేలికగా అర్థమవుతుందన్నారనీ, మేము సంతోషంగా స్వామీజీ మాటను వేదవాక్కుగా భావిస్తామన్నామనీ చెబుతున్నాను. నా మాటలు ఇంకా పూర్తి కాకుండానే, నన్ను అడ్డుకున్నారు విష్ణుప్రియగారు.

ఏమిటో అనుకున్నాను! ఆ బ్రహ్మయజ్ఞానికి ఎంత ఖర్చయినా దానికి తమ దంపతులం ఇస్తామని అప్పటికప్పుడే సభాముఖంగా ప్రకటించారు. వారి ఉదారబుద్ధికి, ఆ సత్సంకల్పానికి ఎంతో మురిసిపోయాము. కాని మధ్యకాలంలో వారి శ్రీవారు కిషన్ రెడ్డిగారు బ్రహ్మైక్యం పొందారు. మీకు ఇబ్బందైతే మొహమాడపడవద్దని చెప్పినా వినకుండా, ముందే మేము ఏర్పాటు చేసుకుని పెట్టుకున్నామని, ఇంకా నేను అన్ని అధ్యాయాలూ పూర్తిగా రాయకుండానే, ఆ పుస్తక ప్రచురణకు సరిపడా చెక్కు తీసుకువచ్చి మా చేతిలో పెట్టేశారు.

ఈశ్వరకృప, శాస్త్రకృప, గురుకృప అంటే ఇదేనేమో! ఇంకా ఆత్మకృపే వెనకబడింది. మేము ఈ **సంక్షిప్త భగవద్గీత**ను రాసి, పుస్తకరూపం ఇవ్వటానికి మూడు సంవత్సరాల సుదీర్ఘకాలం పట్టింది.

**సంక్షిప్త భగవద్గీత** గ్రంథప్రచురణ అనే **ఈ బ్రహ్మయజ్ఞానికి శ్రీ చింతకింది కిషన్‌రెడ్డి గారి పేరిట వారి** సతీమణి **శ్రీమతి విష్ణుప్రియ గారు** బృహత్తరంగా సహకారాన్ని అందించారు. వీరి పెద్దకుమారుడు శ్రీ చరణ్‌రెడ్డి, కోడలు శ్రీమతి శివకుమారి; వారి ఇద్దరు కూతుళ్ళు – ధాత్రిరెడ్డి, ఆకాంక్షరెడ్డి; చిన్నకుమారుడు శ్రీ మధుకర్‌రెడ్డి, కోడలు శ్రీమతి శిరీష; వీరి ఇద్దరు కుమారులు – హేమంత్‌రెడ్డి, ఆకాష్‌రెడ్డి. విష్ణుప్రియగారికీ, వీరందరికీ భగవంతుడు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక చింతన, జ్ఞానప్రాప్తి కలుగచేయాలని ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | |
|---|---|
| 01 బ్రహ్మయజ్ఞం | 03 |
| 06 పరిచయ ఉపచారం | 05 |
| 03 అనన్య గురువు అందించిన ఆశీస్సుల తోరణాలు | 07 |
| 04 స్వామీజీ బోధనా పటిమ | 11 |
| 05 శ్రీ మాత్రే నమః శ్రీ గురుభ్యో నమః | 21 |
| 06 ముందు మాట | 23 |
| 07 అధ్యాయం 1– అర్జునవిషాదయోగము | 27 |
| 08 అధ్యాయం 2– సాంఖ్యయోగము | 46 |
| 09 అధ్యాయం 3 – కర్మయోగము | 88 |
| 10 అధ్యాయం 4 – జ్ఞాన, కర్మసన్న్యాసయోగము | 110 |
| 11 అధ్యాయం 5 – కర్మసన్న్యాసయోగము | 133 |
| 12 అధ్యాయం 6 – ధ్యానయోగము | 159 |
| 13 అధ్యాయం 7 – జ్ఞాన, విజ్ఞానయోగము | 185 |
| 14 అధ్యాయం 8 – అక్షరబ్రహ్మయోగము | 202 |
| 15 అధ్యాయం 9 – రాజవిద్యారాజగుహ్యయోగము | 224 |
| 16 అధ్యాయం 10– విభూతియోగము | 244 |
| 17 అధ్యాయం 11– విశ్వరూపదర్శనయోగము | 258 |
| 18 అధ్యాయం 12– భక్తియోగము | 278 |
| 19 అధ్యాయం 13– క్షేత్ర–క్షేత్రజ్ఞవిభాగయోగము | 299 |
| 20 అధ్యాయం 14– గుణత్రయవిభాగయోగము | 319 |
| 21 అధ్యాయం 15– పురుషోత్తమయోగము | 339 |
| 22 అధ్యాయం 16– దైవాసురసంపద్విభాగయోగము | 359 |
| 23 అధ్యాయం 17– శ్రద్ధాత్రయవిభాగయోగము | 381 |
| 24 అధ్యాయం 18– మోక్షసన్న్యాసయోగము | 401 |

# పరిచయ ఉపచారం

ఓం తత్ సత్

గీతాశాస్త్ర ఆసక్తులైన మీ భాగ్యాన్ని ప్రశంసిస్తూ నా ఈ చిన్న పరిచయ ఉపచారం ద్వారా గ్రంథ, గ్రంథకర్త అయిన ఉపన్యాసకులు, దానిని తెలుగుసేత ద్వారా మీకందరకూ అందించిన అనువాదకుల గురించి రెండు మాటలు చెప్తాను.

ఇక్కడ ఉపచారం ముఖ్యవస్తువును, స్వయంజ్యోతికి దీపారాధన చేసినట్లు, పరిచయం చేయడం మాత్రమే! అంతేగానీ అముఖ్యవస్తువుకు ప్రాధాన్యం ఇచ్చినట్లు కాదు సుమా!

శ్రీమతి రాజ్యశ్రీ, శ్రీ రాఘువరావు గార్లు గురుభక్తులు, గురుశాస్త్రసేవాతత్పరులు, శాస్త్రవిషయగ్రహణంద్వారా సత్త్వశుద్ధి పెంపొందించుకున్నవారు, మీకందరకు బహుపరిచయమున్నవారు. వారికి సాధువాదములు.

స్వామి పరమార్థానంద సరస్వతి వారు దేశవిదేశాలలో బహుఖ్యాతి పొందిన మహాత్ములు. వీరు పూజ్య స్వామి దయానంద సరస్వతి వారి ప్రధాన శిష్యులలో ఒకరు. కాబట్టి సహజంగానే శాస్త్రప్రామాణ్యాన్ని ఒంటపట్టించుకొని, అదేవిధంగా వారి శిష్యబృందానికి శాస్త్రప్రామాణ్యాన్ని ఒంటపట్టించేవారు. వారికి నా నమోవాకములు. నారాయణ స్మరణములు.

నేను కూడా పూజ్య స్వామి దయానంద సరస్వతి వారి బోధనల ద్వారా శాస్త్రప్రామాణ్యబుద్ధి విశేషాన్ని ఎంతో కొంత గ్రహించిన వాణ్ణి కాబట్టి ఈ మాట చెప్పగలను.

ఇక్కడ ప్రకృతవిషయము, గ్రంథము, సంక్షిప్త గీతాసారము. ఇది రెండు రకాల వారికి ఉపయోగపడుతుంది. ఒక రకంవారు ఏమి తెలియని వారు, అంటే వేదాంతపరిచయం లేని వారు. మరొకరకంవారు అన్ని వేదాంతబోధోపకరణాలనీ అధ్యయనం చేసిన తరువాత ఒక గుళిక లాగా వేదాంతసారాన్ని మాత్రం ఆస్వాదించాలనుకునే వారు!

బాగా తెలిసిన మహాత్ములు చెప్పే మాట ఏమిటంటే, శ్రీకృష్ణ భగవానుని మాటలను వ్యాసదేవుడు గ్రథితం చేసిన విధానము, దానిపై ఆచార్య శంకరులు భాష్యం వ్రాసిన విధానము చూస్తే, ఇది ఉపనిషత్సారమే గాక, షడ్దర్శనాలలో మిగిలిన 5 దర్శనాలలోని విషయాలను స్పృశించి వాటిలో గ్రహణయోగ్యమైనవి మాత్రం భగవానుడు తన అభిమతంగా చెప్పినట్టు కనిపిస్తుంది, అని.

ముఖ్యంగా సారం అంటే సామాన్యం అని అర్థం. అట్టి సార్వజనికమైన ఏకాత్మతత్వం ఈ సంక్షిప్త గీతాసారం ద్వారా ఆవిష్కరించబడుతుంది, పరిచయం చేయబడుతుంది.

ఈ గ్రంథపఠనంద్వారా మన బుద్ధిలో ఈ మన ఆత్మయే ఆ సర్వాత్మ, విశ్వాత్మ, ఏకాత్మ అని, బ్రహ్మాభిన్నమైన బుద్ధి కలిగినా లేదా కనీసం ఆ అభిన్నత్వానికి అవకాశం ఉంది అని ఒక కొత్త విచారం పుట్టినా ఫలితం లభించినట్లే!

ఈ గ్రంథపఠనంద్వారా, నదిలో కట్టుకొని పోయేవానికి ప్రాను ఊతంగా దొరికినట్లు, ఈ లౌకిక జీవితంలో అటు ఇటు ఊగుతూ వ్యాకులపడే వారికి, శాస్త్రమనే దృఢమైన ఊతం దొరికి జీవితం, జీవితగమ్యం అనే విషయాలపై అవగాహన, నిశ్చయబుద్ధి కలుగుతుందని ఆశిస్తాను.

నమో నారాయణాయ

ఓం తత్ సత్

**స్వామి పరాకాష్ఠానంద గిరి**

# అనన్య గురువు అందించిన ఆశీస్సుల తోరణాలు

**న నరేణావరేణ ప్రోక్త ఏష సువిజ్ఞేయో బహుధా చిన్త్యమానః।**
**అనన్యప్రోక్తే గతిరత్ర నాస్తి అణీయాన్హ్యతర్క్యమణు ప్రమాణాత్॥**

ఆత్మ అణువుకన్నా సూక్ష్మమైనది. తర్కానికి అందనిది. దీనిని అనేకవిధాలుగా అర్థం చేసుకుంటున్నారు. అనన్య గురువు బోధించకపోతే చక్కగా గ్రహించబడదు. ఆత్మజ్ఞానాన్ని సమర్థవంతమైన గురువు బోధిస్తే, వద్దనుకున్నా విషయం అర్థమైపోతుందని పరమార్థానంద స్వామీజీ చెప్పినది, స్వామీజీ విషయంలో అక్షరసత్యం.

పరమార్థానంద స్వామీజీ బోధలో నూతనత్వం ఉంది, స్పష్టత ఉంది, విజ్ఞత ఉంది, విశ్లేషణ ఉంది, విశిష్ఠత ఉంది. ఏది బోధించినా ఒక క్రమపద్ధతిలో, ఒక గొలుసుకట్టులా చాలా విపులంగా, ఎంతో విస్తారంగా ఒక క్లాసురూమ్ టీచింగ్‌లా ఉంటుంది.

మొదటిసారి బ్రహ్మసూత్రాల్లో మొదటి సూత్రాన్ని టూకీగా ఇంగ్లీషులో రాసి చూపించి, ఇది సరిగ్గా ఉంటే, మా తెలుగుభక్తి పేజెస్ వెబ్‌సైట్‌లో పెడతామని కోరాను. బాగుంది, అలాగే పెట్టుకోండి అన్నారు. ఇది **మొట్టమొదటి ఆశీస్సు**.

అప్పట్నుంచీ స్వామీజీ బోధించినది ఏది విన్నా దానికి అక్షరరూపం ఇవ్వాలని ఉత్సాహం ఉరకలు వేస్తుండేది. స్వామీజీని కలిసిన కొత్తల్లో, 'స్వామీజీ ఈ చిన్ని మెదడులో ఎన్నో పెద్ద ప్రణాళికలు ఉన్నాయి. భగవద్గీత వింటే అది రాయాలనిపిస్తుంది; ఉపనిషత్తులు వింటే అవి రాయాలనిపిస్తుంది; బ్రహ్మసూత్రాలు వింటే అవి రాయాలనిపిస్తుంది,' అంటే చేయి పైకెత్తి మనసారా దీవించారు. 'అన్నీ రాస్తావు, అన్నీ అక్షరరూపం దాలుస్తాయి,' అన్నారు. ఇది **రెండవ ఆశీస్సు.**

స్వామీజీ ఆశీస్సులు ఫలించాయి. ప్రస్థానత్రయం గ్రంథరాజాలు తేటతెనుగులో ప్రచురించగలిగాము.

ఇంకొక సందర్భంలో 'స్వామీజీ నేనేదైనా రాయాలని మీరు ప్రత్యేకించి కోరుకుంటున్నారా,' అన్నాను. అప్పుడు తన బీరువాలోంచి నాలుగు చిన్న పుస్తకాలు తీసిచ్చి, నేను **వేదిక్ స్నాక్స్** పేరిట ప్రత్యేక సందర్భాలలో బోధ చేస్తాను. అవి అందరికీ ప్రయోజనకరంగా ఉంటాయి, అవి చేయమన్నారు. అప్పుడు స్వామీజీ ఆడియో క్యాసెట్స్ మరికొన్ని కొని, వేదాంత జీవనవిధానం పేరిట 46 ప్రసంగాలు ప్రచురించాము. అది **మూడవ ఆశీస్సు**.

భగవద్గీత మూడవషట్కం స్వామీజీచేత విడుదల చేయించుకోవటానికి వెళ్ళినప్పుడు మావారు రాఘవరావుగారు, స్వామీజీతో ఇలా అన్నారు. 'స్వామీజీ, ఈ భగవద్గీతలోంచి

అధ్యాయాల సారాంశాలు విడదీసి, ఒక పుస్తకంలా వేయాలని ఉంది.' 'వేసేశారా, వేయాలనుకుంటున్నారా?' అన్నారు స్వామీజీ. 'లేదు స్వామీజీ! మీతో ఆ ఆలోచన పంచుకుంటున్నాము,' అంటే, 'అయితే ఆగండి. నేను సంస్కృత అకాడమీలో భగవద్గీత అధ్యాయాల సారాంశాలు చెప్పాను. అది కూడా రోజుకో గంటన్నరపాటు చెప్పాను. ఆ బోధ భగవద్గీత అసలు వినని వారికి చేశాను. మీరు చెప్పేది భగవద్గీత చాలా లోతుగా అధ్యయనం చేశాక నేర్చుకునే సారాంశం. ఇదయితే అందరికీ బాగుంటుంది. సంస్కృత అకాడమీ వారు ఆ బోధను ఆంగ్లంలో ప్రచురించారు. దానికి చాలా ఆదరణ లభించింది. ఇప్పటికే రెండు, మూడు రీప్రింట్స్ కూడా వచ్చాయి. ఆ బోధను మీరు తెలుగులో అనువదిస్తే, మరింత ఎక్కువమందికి ప్రయోజనకరంగా ఉంటుంది,' అన్నారు.

మాతోపాటు స్వామీజీ శిష్యులు బాలసుబ్రమణ్యంగారు కూడా స్వామీజీ దగ్గరకు వచ్చారు. ఆయన ఆ పుస్తకాలు నా దగ్గర ఉన్నాయి, నేను ఇస్తాను అనటమే కాక, వెంటనే మాకు తెచ్చి ఇచ్చారు. ఇలా భగవద్గీత సారాంశం రాయమని ఆదేశించటం స్వామీజీ మామీద కురిపించిన కరుణాకటాక్షాలకు మరొక విశేషమైన నిదర్శనం. అది **నాలుగవ ఆశీస్సు**.

మేము వేదాంతశిబిరాన్ని కంచిలో ఏర్పాటుచేసుకుని తిరిగి వస్తున్నప్పుడు మా సత్సంగ్ సభ్యులకు స్వామీజీ బోధ చేస్తున్నచోట దర్శనభాగ్యాన్ని కలిగించమని వేడుకున్నాము. వెంటనే అంగీకరించారు. 70మంది సభ్యులం భగవద్గీతమీద స్వామీజీ చేస్తున్న బోధని తనివితీరా విని, స్వామీజీకి భిక్ష సమర్పించుకుని, దొరుకునా ఇటువంటి సేవ అని మురిసిపోయాము. స్వామీజీ పేరు పేరునా ప్రతి ఒక్కరినీ దీవించారు. వారితో ఫోటోలు దిగారు. అది **ఐదవ ఆశీస్సు**.

గొల్లపూడి శ్రీనివాసులుగారు know your Scriptures అని ఆంగ్లంలో రాసినదానికి తెలుగుసేత కావాలని వారు అనుకుంటే, స్వామీజీయే స్వయంగా మాకు ఫోను చేసి, మమ్మల్ని ఆ పుస్తకాన్ని అనువదించమని కోరారు. వేదాంతం తెలుసుకుందాం పేరిట రాసి ఇచ్చాము. అది మరొక మరుపురాని ఆశీర్వచనం స్వామీజీది. అది **ఆరవ ఆశీస్సు**.

ఉపనిషత్తులలో మకుటాయమానమైన మాండూక్యోపనిషత్తు ప్రచురణతో ప్రస్థానత్రయం ప్రచురణ పూర్తి అవుతుందని, ఆ సందర్భంగా మమ్మల్ని దీవించమని కోరితే, తను చేసిన బోధల కాధారంగా మాండూక్యోపనిషత్‌ను ప్రచురిస్తున్నందుకు చాలా సంతోషమనీ, దీనితో ప్రస్థానత్రయం అంతా వస్తుందని వింటే, ఇంకా చాలా సంతోషంగా ఉందనీ, ఈ గ్రంథరాజాలు జనబాహుళ్యంలోకి వెళ్ళి మరెందరో ప్రభావితులై జీవన్ముక్తి పొందాలనీ మనసారా ఆశీర్వదిస్తూ లేఖ రాశారు. మా జన్మ ధన్యమైపోయింది. అది **ఏడవ ఆశీస్సు**.

ఈ గీతాజయంతి వేడుకలలో చేసుకుంటున్న **మా కృతజ్ఞతాభివందనాలు – గురువులకు సన్మానమహోత్సవాలు** దిగ్విజయంగా చేసుకోవటానికి స్వామీజీ ఆశీస్సులు కోరుతూ, వారిని ఆహ్వానించటానికి డా॥ యాదగిరిగారు, వారి సతీమణి సుమంగళిగారు, మా శ్రీవారు రాఘవరావుగారు, నేనూ చెన్నై వెళ్ళాము.

ముందుగా మా దంపతులం ఇలా ప్రస్థానత్రయం గ్రంథరాజాలుగా వెల్లివిరిస్తున్న శుభసందర్భంలో, ఈ బృహత్కార్యానికి మమ్మల్ని ప్రోత్సహించిన సన్నిహితులకు, మాకు అద్వైతబోధకు బంగారుబాట వేసిన హితులకు, మా ఉన్నతి కోరే వంశవృక్ష పెద్దలకు, ఇంతటి విద్యను అందించిన గురుపరంపరకు, గ్రంథాలకు అక్షరరూపం ఇచ్చిన డి.టి.పి. ఆపరేటర్లకు, వాటిని తీర్చిదిద్దిన ప్రూఫ్‌రీడర్లకు, ప్రచురించి పెట్టిన ప్రచురణకర్తలకు, వాటిని వెలుగులోకి తీసుకురావటానికి దోహదం చేసిన మహారాజపోషకులకు, వాటిని భద్రపరుస్తున్న ఆల్ఫోన్సా యాజమాన్యానికి, సిబ్బందికి మేము సన్మానాలు చేస్తున్నామని చెప్పాము. అదికాక, మా బోధ విని గురువులుగా మారిన వారిని, మాకు క్యాంపులు ఏర్పాటుచేస్తున్న కార్యకర్తలను కూడా అభినందిస్తున్నామని తెలిసి చాలా సంతోషించారు. నిజమే, మీ విజయం వెనక అనేకమంది సహాయసహకారాలు ఉంటాయి అన్నారు.

డా॥ యాదగిరిగారు మాకు ఆర్షవిద్యా తరంగిణి తరపున సన్మానం చేస్తున్నామని, ఈనాటి కార్యక్రమానికి విచ్చేయమని ఆహ్వానించటానికి వచ్చామని చెబితే మృదువుగా తిరస్కరించారు. ఒక శిష్యుని కార్యక్రమానికి వెళితే, అనేక కార్యక్రమాలకి వెళ్ళవలసి ఉంటుంది, అదికూడా ప్రపంచవ్యాప్తంగా, అన్నారు.

చెన్నైలోని ఆయన కుటియాలోనే ఆయనకు చిరుకానుక సమర్పించుకుని, కృతజ్ఞతాభివందనాలు తెలియజేసుకున్నాము. మాండుక్యోపనిషత్ పుస్తకావిష్కరణ చేయించాము. స్వామీజీ మీకొక సర్‌ప్రైజ్ అని ఆయనచేత ఒకటి ఓపెన్ చేయించాము. ఓపెన్ చేస్తూ ఏదో ఫోటోలాగా ఉందని అన్నారు. అది నిజమే! స్వామీజీతో, ఇంతవరకూ వచ్చిన 19 పుస్తకాలతో, మా దంపతులిద్దరం దిగిన ఫోటో బహుకరించుకుని, మా కృతజ్ఞతాభివందనాలు తెలియజేసుకున్నాము.

స్వామీజీకి శాస్త్రమే ఆయన ఊపిరి. ఒకసారి మాకేదైనా సందేశం ఇవ్వమని కోరితే, 'ఫాలో ది శాస్త్ర,' అన్నారు. ఇప్పుడు కూడా మా సభ్యులకు ఏదైనా సందేశం ఇవ్వమంటే, అదే అర్థం వచ్చేటట్టుగా చెప్పారు.

**'శాస్త్రం అర్థం శాసనాత్ త్రాయతే ఇతి శాస్త్రమ్.'** మనిషిని శాసించి, రక్షించేది శాస్త్రం. శాస్త్రం తన బోధద్వారా మనిషిని సంసారంనుంచి రక్షిస్తుంది. సంసారం అంటే జీవితంలో

ఎదుర్కొనే అనేక సమస్యలు, వీటిని ధైర్యంగా ఎదుర్కొని సమత్వం పెంపొందించుకోవాలంటే దానికి చాలా అంతర్గతశక్తి కావాల్సి ఉంటుంది. నేటి సమాజంలో ఐక్యూ ఎంత అవసరమో, ఇక్యూ అంతకన్నా ఎక్కువ అవసరం. ఇక్యూ అంటే ఎమోషనల్ కోషెంట్. ఆ మానసిక స్థైర్యాన్ని ఒక శాస్త్రమే ఇవ్వగలదు.

కాని వచ్చిన చిక్కేమిటంటే, శాస్త్రం గురించి చాలామందికి చాలా అపోహలు ఉన్నాయి. శాస్త్రాన్ని స్వామీజీలు మాత్రమే నేర్చుకోవాలనీ లేదా ఉద్యోగంనుంచి విరమించాక వృద్ధాప్యంలో నేర్చుకోవాలనీ అనుకుంటారు. చివరికి తల్లిదండ్రులు కూడా వారి పిల్లలు శాస్త్రంమీద శ్రద్ధ చూపితే, వారిని ప్రోత్సహించకపోగా, ఇప్పట్నుంచీ ఎందుకు అని వారి ఉత్సాహంమీద నీళ్ళు జల్లుతారు.

అది పొరపాటు. శాస్త్రం గురించిన సరియైన అవగాహన లేకపోవటంవల్ల వచ్చింది. శాస్త్రం అందరూ నేర్చుకోవాలి. మీరు దాన్ని వీలున్నంత ఎక్కువగా జనబాహుళ్యంలోకి విస్తరింపజేయాలి. అద్వైతవేదాంతాన్ని నలుగురూ స్వీకరించగలిగినా, లేకపోయినా నేర్పించే బాధ్యత మీకు ఉంది. పూజ్యస్వామీజీ అంటారు, శాస్త్రాన్ని మీరు అంగీకరించటానికి సిద్ధంగా లేకపోయినా, మీరు దేనితో ఏకీభవించటం లేదో దాని గురించి మీకు సరిగ్గా తెలియాలి. చివరగా 'I am very very very happy for you,' అని మనసారా ఆశీస్సులను కురిపించారు. ఇది **ఎనిమిదవ ఆశీస్సు**.

ప్రస్థానత్రయం తేటతెలుగులో వెల్లివిరుస్తున్నందుకు తన హర్షం వెలిబుచ్చారు. ఆయన శిష్యులు బాలసుబ్రమణ్యం, 'They have done it so wonderfully well,' అన్నారనీ, ఆయనే కాక, ఇద్దరు ముగ్గురు అదేమాట చెప్పారనీ, స్వామీజీ వారి ఎదురుగా కూర్చుని తెలుగులో చెబితే ఎలా ఉంటుందో అలా ఉందని చెప్పారని ఆనందంగా చెప్పారు. శ్రీనివాసులుగారి పుస్తకానికి అనువాదం బాగా వచ్చింది, 'It is because you have done it,' అని హర్షం వెలిబుచ్చారు.

గీతాజయంతి వేడుకలకు రానని మృదువుగా తిరస్కరిస్తూనే, బాధపడకండి, నేను సూక్ష్మశరీరంతో మీతోనే ఉంటాను అని హామీ ఇచ్చారు. అది అక్షరసత్యం కూడా! ఆరోజు నేను హాలులోకి అడుగు పెడుతుండగానే, స్వామీజీ శిష్యురాలు భవాని, 'మేడమ్! మీకొక సర్‌ప్రైజ్,' అంది. విప్పిచూస్తే చిరునవ్వులు చిందిస్తూ స్వామీజీ ఫోటో! స్వామీజీ సూక్ష్మశరీరంతో ఉంటానన్నదానికి ఇంతకన్నా నిదర్శనం ఏంకావాలి? గీతా జయంతి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయంటే, స్వామీజీ అదృశ్యంగా మన వెన్నుతట్టి ఉండటమే! ఇది **తొమ్మిదవ ఆశీస్సు**.

**మద్దూరి రాజ్యశ్రీ**

# స్వామీజీ బోధనా పటిమ

శంకరాచార్యులవారు మన ప్రస్థానత్రయానికి భాష్యం రాశారు. స్వామీజీ ఒక సందర్భంలో శంకరాచార్యుల వారి భాష్యాన్ని మెచ్చుకుంటూ, శంకరాచార్యులవారి భాష్యం చదివినకొద్దీ శిరస్సు వంచి పదే పదే సాష్టాంగ ప్రణామాలు చేయాలనిపిస్తుందని, ప్రణామం చేశాక పైకి లేవబుద్దేయదనీ చెప్పారు. అదే పూజ్యభావన స్వామీజీ బోధలు వింటే మనకు కూడా స్వామీజీమీద కలుగుతుంది.

స్వామీజీ ఉపనిషత్తులను మూడు కోణాల్లో వివరిస్తారు. మూలం, శంకరభాష్యం, అనుభూతి ప్రకాశిక. అలాగే భగవద్గీతను కూడా మూలం, శంకరభాష్యం బోధిస్తారు. ఈ రెండు పద్ధతులూ కాక, సంస్కృత అకాడమీలో భగవద్గీత అధ్యాయాల సారంగా **సంక్షిప్త భగవద్గీత**ను బోధించారు. మామూలుగా స్వామీజీ బోధ గంటసేపు ఉంటుంది. కాని ఇది గంటన్నరపాటు ఉంది. అదికాక, భగవద్గీత అంటే ఏమిటో తెలియని సామాన్య మానవునికి భగవద్గీతమీద కొంత అవగాహన, శ్రద్ధ ఏర్పడటానికి బోధించారు.

స్వామీజీ బోధించిన మూడు స్థాయిల్లోనూ చాలా స్థాయీభేదం ఉంది. ఈ **సంక్షిప్త భగవద్గీత**లో చాలా తేలికగా, ఉపనిషత్తుల జోలికి పోకుండా, చిన్నపిల్లవానికి బుజ్జగించి చెప్పినట్టుగా చెప్పుకొచ్చారు. మూలం బోధించినప్పుడు భగవద్గీత ఎలా ఉపనిషత్తుల సారమో వివరించుకొస్తారు. అవసరమైనచోట ఉపనిషత్తులలోకి వెళ్ళి, ఆ పరిభాషని వాడి, అలాగని భయపెట్టకుండా, దాన్ని తేలిక భాషలో అర్థమయ్యేలాగా వివరిస్తారు.

అదే భాష్యం బోధించేటప్పుడు శంకరాచార్యులవారు ఒక్కొక్క పదాన్నీ ఎలా వివరిస్తారో, దానిలో పూర్వపక్షికి–సిద్ధాంతికి ఎలా వాదోపవాదాలు సాగుతాయో లోతుగా వివరించుకొస్తారు. అదీ స్వామీజీయొక్క బోధనాపటిమ. అలా మూడు స్థాయిల్లో ఎలా ఉంటుందో మీరే చూడండి. ఆత్మ లక్షణాలను ఈ **సంక్షిప్త భగవద్గీత**లో ఎలా వివరించారో, గీత **మూలం**లో ఎలా ఉపనిషత్తులనుంచి తీసుకొచ్చారో, ఆత్మ లక్షణాల్లో ఒకటైన అప్రమేయం పదాన్ని శంకరులవారు **భాష్యం**లో విశ్లేషించిన దాన్ని స్వామీజీ ఎలా వివరించారో మీరే చదివి, ఆస్వాదించి, తరించండి.

**సంక్షిప్త భగవద్గీతలో ఆత్మ లక్షణాలు –**

జ్ఞానయోగాన్ని ఒక్కమాటలో నిర్వచించాలి అంటే మీ స్వస్వరూపాన్ని తెలియజేసేది జ్ఞానయోగం. ఈ స్వస్వరూపం తెలుసుకోవటమెలా?

ఈ స్వస్వరూపం తెలుసుకోవాలంటే మీరు ప్రధానంగా రెండు అంశాలను జీర్ణించుకోవాలి. అవి –

1. అనుభవించే నేను, అనుభవించబడే వస్తువుకు భిన్నంగా ఉన్నాను.

2. అనుభవంలోకి వచ్చే గుణాలు అనుభవించబడే వస్తువుకు చెందుతాయి కాని, అనుభవించే నాకు కాదు. వీటిని వివరంగా చూద్దాము.

1. **అనుభవించే నేను, అనుభవించబడే వస్తువుకు భిన్నంగా ఉన్నాను**

ఈ సూత్రం వేదాంతంయొక్క ప్రాథమిక సూత్రం. నిజానికి, వేదాంతం ఈ పునాది మీదనే లేచింది. అనుభవం వేరు, అనుభవించే వ్యక్తి వేరు; సబ్జెక్టు అయిన నేను, ఆబ్జెక్ట్ అయిన వస్తువుకు భిన్నంగా ఉన్నాను. ఈ ప్రాథమిక సూత్రాన్ని మన దైనందిన జీవితంలోని అనుభవాలనుంచి తెలుసుకోగలము.

కన్ను ఉదాహరణే తీసుకోండి. ప్రపంచంలో ఉన్న వస్తువులన్నింటినీ కన్ను చూడగలదు. కాని మీ కంటితో మీ కన్నును చూడలేక పోతున్నారు. అంటే అన్నింటినీ చూసే కన్ను, తనను తాను చూసుకోలేకపోతున్నది.

అనుభవించే మీరు, అనుభవించబడే వస్తువు కాలేరు ఎన్నటికీ. సబ్జెక్ట్ ఎప్పటికీ సబ్జెక్టే, ఆబ్జెక్ట్ ఎప్పటికీ ఆబ్జెక్టే. సబ్జెక్ట్, ఆబ్జెక్టుగా చూడబడలేదు. సబ్జెక్టు చూసే దృక్ మాత్రమే, చూడబడే దృశ్యం ఎన్నటికీ కాలేదు. ఇది మొదటి సూత్రం. రెండవ సూత్రానికి వెళ్ళేముందు ఈ మొదటి సూత్రంనుంచి కొన్ని ఉపసిద్ధాంతాలను చూద్దాము.

ఎ) **నేను జగత్తు కాదు** – మొదటి సూత్రం సారం ఏమిటి?

**నాకు అనుభవంలోకి వచ్చేది ఏదీ, నేను కాదు**

ముందు ఈ సూత్రాన్ని, జగత్తుకు అన్వయించి చూద్దాము. నేను జగత్తును అనుభవిస్తున్నాను కాబట్టి, నేను జగత్తు కాదు. అది నాకు అనుభవంలోకి వచ్చే వస్తువు మాత్రమే. అందువల్ల నేను జగత్తును కాను. నేను మాట్లాడటానికి వాడే మైకుని కాను, నేను రాయటానికి వాడే పెన్నుని కాను,

బి) **నేను శరీరం కాదు** – నేను ప్రపంచం ఆబ్జెక్టు అని ఎంత స్పష్టంగా తెలుసుకుంటానో, ప్రపంచాన్ని ఎంత స్పష్టంగా అనుభవిస్తానో, అదే విధంగా, అంత స్పష్టంగానూ

ఈ శరీరాన్ని కూడా అనుభవిస్తాను కాబట్టి, నాకు అనుభవంలోకి వస్తున్న ఈ శరీరాన్ని కూడా నేను కాదు అంటుంది వేదాంతం.

ఆ శరీరం నేను కాదు అనే ఉపసిద్ధాంతాన్ని జీర్ణించుకోవటం కష్టం. కష్టమైనా, దాన్ని త్రోసిపుచ్చకండి. మీ మనస్సులో ఒకమూల ఉంచుకోండి. ముందు ముందు మీరే అర్థం చేసుకుంటారు. అప్పుడు ఈ సందేహం పటాపంచలు అవుతుంది.

సి) **నేను మనస్సు కాదు** – నేను శరీరం కాదు అనే సత్యాన్నే మీరు జీర్ణించుకోలేకపోతే, 'నేను మనస్సు కాదు,' అనే సత్యాన్ని జీర్ణించుకోవటం ఇంకా కష్టం. కాని శరీరానికి వాడే సూత్రాన్నే ఇక్కడా వాడాలి. శరీరం ఎలా మీకు అనుభవంలోకి వస్తున్నదో, అలాగే మనస్సు కూడా మీకు అనుభవంలోకి వస్తున్నది. అంటే మీ మనస్సులో ఏముందో ఎదుటి వారికి తెలియదు, మీకు మాత్రమే తెలుసు. మీకు తెలుసు అంటే ఏమిటి అర్థం. మనస్సు ఆబ్జెక్టుగా మీ అనుభవంలోకి వస్తున్నది. అది కూడా ప్రపంచంలో ఒక భాగం మాత్రమే. అందువల్ల అనుభవంలోకి వస్తున్నదేదీ నేను కాదు సూత్రం ప్రకారం, మనస్సు కూడా నేను కాదు.

**నేను చైతన్యాన్ని** – వేదాంతం నేర్చుకున్నాక మనం నేర్చుకునే మొదటిసూత్రం నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు, అవి కూడా జగత్తులోకే వస్తాయి. నేను మనశ్శరీరాలకు భిన్నంగా ఉండి, వాటిద్వారా వ్యవహారం నడుపుతాను. కళ్ళజోడుతో ప్రపంచాన్ని చూసినట్టుగా, మనశ్శరీరాలతో ప్రపంచంతో వ్యవహారం నడుపుతాను. కళ్ళజోడు సబ్జెక్టా, ఆబ్జెక్టా? కంటికి చాలా దగ్గరగా ఉంది కాబట్టి కళ్ళజోడు నాలో ఒక భాగం అనిపిస్తుంది కాని, నిజానికి కాదు. అది కూడా బాహ్యవస్తువే! నేను ప్రపంచాన్ని చూడటానికి వాడతాను.

అదే విధంగా జ్ఞానికి ఈ శరీరం కూడా తాత్కాలికంగా వాడే మాధ్యమం మాత్రమే. కొన్ని సంవత్సరాలు వాడుకుని, ఎప్పుడో సమయం ఆసన్నమైనప్పుడు వదులుకోవాలి అని అర్థం చేసుకుంటాడు జ్ఞాని.

ఆ మాటకొస్తే, కళ్ళజోడు తీసి పక్కన పెట్టినట్టుగా, ఈ మనశ్శరీరాలను కూడా రోజూ తీసి పక్కన పెడతాము. ఎప్పుడు? గాఢనిద్రలో. సుషుప్తిలో నేను ఉన్నాను, అప్పుడు నా మనస్సు, నా శరీరం పడుకుంటాయి; అంటే అవి పనిచేయవు. అందువల్ల నాకు బాహ్యప్రపంచం అనుభవంలోకి రాదు. కళ్ళజోడు తీసి పక్కన పెడితే, ఏమీ చదవలేను. మనశ్శరీరాలనే కళ్ళజోడు తీసి పక్కనపెడితే, ఏమీ అనుభవించలేను. పొద్దున్న లేచాక, మళ్ళీ మనశ్శరీరాలనే కళ్ళజోడు ధరించగానే, మళ్ళీ జాగ్రద్ ప్రపంచం అనుభవంలోకి వస్తుంది. బెడ్‌కాఫీతో మొదలవుతుంది నా అనుభవం.

ఆ విధంగా, మొదటిసూత్రం – అనుభవించే నేను, అనుభవించబడే వస్తువుకు భిన్నంగా ఉన్నాను ప్రకారం నేను జగత్తు కాదు, నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు, నేను వాటికి భిన్నంగా ఉన్న చైతన్యాన్ని అని అర్థం చేసుకుంటాము.

2. **అనుభవంలోకి వచ్చే గుణాలు, అనుభవించబడే వస్తువుకు చెందుతాయి కాని, నాకు కాదు.**

ఇప్పుడు రెండవసూత్రం ప్రకారం నా స్వరూపమేమిటో చూద్దాము. నేను చైతన్యాన్ని అని ఒక అంశం తెలిసింది కాని, ఇంకా లోతుగా వెళ్ళాలి. ఈ పుస్తకాన్ని చూస్తే నీలం రంగు అనే గుణం నాకు అనుభవంలోకి వస్తున్నది. ఇప్పుడు చెప్పండి – ఆ నీలం రంగు ఎవరికి చెందుతుంది? అనుభవంలోకి వస్తున్న నీలం రంగు, అనుభవంలోకి వస్తున్న పుస్తకానికి చెందుతుంది. నేను నీలంగా ఉన్నాను అనను. పుస్తకంయొక్క నీలిరంగును చూస్తాను అంతే. రంగు, రూపు అనే గుణాలు కూడా అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టుయొక్క గుణాలు.

దీన్నుంచి ఒక ఉపసిద్ధాంతం చూద్దాము.

**నేను నిర్గుణం** – దీనివల్ల మీకు ఏ రంగు, రూపు తెలిసినా, అది అనుభవంలోకి వస్తున్నది. ఏ గుణం తెలిసినా, అది అనుభవంలోకి వస్తున్న గుణం. ఎందుకంటే అనుభవంలోకి రాకపోతే, దాని గురించి మీకు తెలియదు. ఆ విధంగా ఏ గుణం చూసినా అనుభవంలోకి వస్తుంది. అనుభవంలోకి వచ్చే ఆ గుణం, అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టుకు చెందుతుంది. ఆబ్జెక్టు అంటే ప్రమేయం లేదా వస్తువు. అనుభవించే మీకు ఏ గుణమూ చెందదు. దీనివల్ల మనం అర్థం చేసుకునే ఉపసిద్ధాంతం – అనుభవించే నేను గుణాలకు భిన్నంగా ఉన్నాను. నేను నిర్గుణం.

కాని ఇక్కడ 'నేను నిర్గుణం' అంటే ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. నేను ఎవరో తెలుసుకోవటానికి మొదటి సూత్రానికి వెళ్ళాలి. నేను జగత్తు కాదు, నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు, నేను చైతన్యాన్ని అని మొదటి సూత్రంలో చూశాము. జగత్తు ఆబ్జెక్టు, శరీరం ఆబ్జెక్టు, మనస్సు ఆబ్జెక్టు. వాటి గుణాలు వాటికి ఉన్నాయి. అందువల్ల, నాకు ఏదైనా గుణం అనుభవంలోకి వస్తున్నదీ అంటే ఆ గుణం ఈ మూడింటిలో దేనికైనా చెందినదని అర్థం. ఆ గుణాల్లో ఏవీ నాకు చెందవు. నేను నిర్గుణచైతన్యాన్ని.

మొదటి సూత్రం నేను చైతన్యాన్ని అని నిరూపిస్తే, రెండవ సూత్రం నేను నిర్గుణచైతన్యాన్ని అని నిరూపించింది. నేను **నిర్గుణచైతన్యాన్ని** అని అర్థం చేసుకుంటే, దాన్నుంచి అనేక ఉపసిద్ధాంతాలను ఏర్పరచుకోవచ్చు. కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో చేసిన బోధ

ఆధారంగా కొన్ని ఉపసిద్ధాంతాలను చూద్దాము. నాకు గుణాలు లేవు అంటే ఏ గుణాలు లేవు?

ఎ) **నేను నిత్యం** – జగత్తులో చూసే ప్రతివస్తువుకూ కాలపరిమితి ఉంటుంది. దానికి ఒక పుట్టినతేదీ, ఒక మరణించే తేదీ ఉంటాయి. కొన్నింటికి కాలపరిమితి చాలా ఎక్కువ ఉండవచ్చు కాని, పరిమితి అంటూ ఉంటుంది.

ఇప్పుడు ఈ కాలపరిమితి గుణాన్ని చూస్తే అది వస్తువుకు చెందినది కాబట్టి నాకు చెందదు. అందువల్ల నాకు చావు–పుట్టుకలు లేవు. నేను నిత్యం. నేను అంటే ఏమిటో మర్చిపోకూడదు. నేను శరీరాన్ని కాను, నేను మనస్సు కాను. ఈ రెండూ కూడా జగత్తులాగా ఆబ్జెక్టులే. నేను అంటే వీటిని అనుభవించే చైతన్యాన్ని. నేను చైతన్యతత్త్వం, చిత్‌తత్త్వం. నేను కాలాతీతం.

**నేను నిత్యం.**

బి) **కార్యకారణ విలక్షణం** – కాలపరిమితిలోకి వచ్చిన ఏ వస్తువైనా సరే, అది కార్యమో, కారణమో అవాలి. కాని నేను కాలాతీతం కాబట్టి నేను కార్యమూ కాదు, కారణమూ కాదు. నేను కార్యాకారణవిలక్షణం.

సి) **సర్వవ్యాపకం** – ఇప్పుడు కాలపరిమితి అనే గుణాన్ని చూద్దాము. ఏ వస్తువు గురించైనా మనం అడిగే ప్రశ్నలు రెండే! ఎప్పుడు? ఎక్కడ? ఎప్పుడు అంటే ఏ కాలానికి చెందినది? ఎక్కడ అంటే ఏ దేశానికి చెందినది? ప్రతివస్తువుకూ దేశపరిమితి, కాలపరిమితి ఉంటుంది. నేను గుణాతీతం కాబట్టి, కాలపరిమితి అనే గుణం కూడా వస్తువుకు చెందినది కాబట్టి, నాకు దేశపరిమితి కూడా లేదు. దేశపరిమితి లేకపోతే, నేను ఎక్కడ ఉన్నాను అనే ప్రశ్నకు చోటే లేదు. నేను సర్వవ్యాపకం, ఏకం, అద్వితీయం. సర్వవ్యాపకం అయినవి ఎన్ని ఉంటాయి? ఒకటే ఉంటుంది.

**అహం సర్వగతః అస్మి; అహమ్ అఖండః అస్మి; అహమ్ ఏకః అస్మి; అహమ్ అచలః అస్మి;**

నేను సర్వవ్యాపకం కాబట్టి సర్వగతం; సర్వగతం కాబట్టి నాకు భాగాలు లేవు; అఖండం కాబట్టి ఉన్నది ఒకటే. సర్వగతం కాబట్టి చలనం లేదు. దేశపరిమితి ఉంటే, ఒకచోటి నుంచి ఇంకొక చోటికి వెళ్ళవచ్చు; అంతటా ఉంటే ఎక్కడికి వెళతాను? అందువల్ల స్థాణుః, అచలః.

సి) **అకర్తా** – అచలం కాబట్టి, ఏ కర్మా చేయలేను. కర్మ చేయాలంటే, ఒకచోటినుంచి ఇంకొక చోటికి కదలాలి. కర్మ చేసే వ్యక్తిని కర్తా అంటారు; నేను కర్మ చేయను కాబట్టి అహం అకర్తాః.

నాకు పుట్టుక, ఎదుగుదల, నాశనం, మరణం లేవు. శరీరం మరణించినా, ఆత్మనైన నాకు మరణం లేదు. ఎప్పుడైతే నేను ఈ ఆత్మజ్ఞానం పొందుతానో, అప్పుడు నేను **అహం బ్రహ్మ అస్మి** జ్ఞానం పొందుతాను. నేను = ఆత్మ = బ్రహ్మ. ఈ జ్ఞానం పూర్ణత్వభావనను ఇస్తుంది. ఎప్పుడైతే నేను పూర్ణ ఆత్మను లేదా బ్రహ్మ ఆత్మను, ఈ మనశ్శరీరాలు నాకు వ్యవహారం నడపటానికి తాత్కాలికంగా ఇవ్వబడ్డాయి అని అర్థం చేసుకుంటానో, అప్పుడే నాకు మృత్యుభయం పోతుంది; అభద్రతా భావన పోతుంది. శరీరం కూడా తాత్కాలికమే, దానికి రాకపోకలున్నాయి; పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదని అర్థం చేసుకుంటాను.

మీ సమస్య మరణం కాదు; ప్రతిరోజూ కొన్ని వందలమంది మరణిస్తారని మీకు తెలుసు. మీ సమస్య మరణం కాకపోతే, మరి ఏమిటి మీ సమస్య? 'నేను అనిత్యం' సమస్య. నేను అనిత్యం ఎందుకు సమస్య అయింది అంటే, నేను శరీరం అని మీరు అనుకోవటంవల్ల. ఎప్పుడైతే మీరు, 'నేను శరీరం కాదు,' అనే సత్యాన్ని జీర్ణించుకుంటారో, అప్పుడే ఈ మృత్యుభయం పోతుంది. ఎందుకంటే ఈ మృత్యుభయం శరీరానిది, ప్రయాణం మనస్సుది. మీరు మనశ్శరీరాలు కాదు. మనశ్శరీరాలను కలిపి **కార్యకరణసంఘాతం** అంటారు. మీరు కార్యకరణసంఘాతం కాదు, మీరు ఆత్మ. ఆత్మ స్వరూపం సత్–చిత్–ఆనందస్వరూపం. ఆత్మ పరబ్రహ్మస్వరూపం. ఇదీ జ్ఞానయోగ సారాంశం.

## గీత మూలంనుంచి ఆత్మ లక్షణాలు –

**ఎ) ఆధ్యాత్మిక దృష్టి పరంగా శ్లోకాలు 12–25** – వేదాంతపరంగా చూసేటప్పుడు, ఆత్మ గురించిన ప్రాథమిక విషయాలు కొన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. ఇవి తత్త్వబోధలో చూస్తాము (అది వేదాంతంలో ప్రాథమిక శాస్త్రం).

**ఆత్మా కః? స్థూలసూక్ష్మకారణశరీరాత్ వ్యతిరిక్తః। పఞ్చకోశాతీతః సన్। అవస్థాత్రయ సాక్షీ। సచ్చిదానన్ద స్వరూపః సన్। యస్తిష్ఠతి సః ఆత్మా ॥**

ఆత్మ అంటే ఏమిటి? స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు భిన్నమైనది, పంచకోశాలకు అతీతమైనది, అవస్థాత్రయ సాక్షి, సచ్చిదానంద స్వరూపంగా ఏది ఉందో అది ఆత్మ.

అంటే ప్రతివ్యక్తిలో ఒక చైతన్యం ఉంటుంది. దాన్ని 'చిత్' అంటారు. దాని స్వభావమేమిటి?

చైతన్యం శరీరం ఉన్నా లేకపోయినా ఉంటుంది. శరీరం ఉంటే వ్యక్తచైతన్యం, లేకపోతే అవ్యక్త చైతన్యం అవుతుంది. ఇలా నిత్యమూ ఉండే చైతన్యాన్ని ఆత్మ అంటారు. శరీరాన్ని అనాత్మ అంటారు. శరీరం అంటే మనస్సు కూడా వస్తుంది. బాడీ మైండ్ సెన్స్ కాంప్లెక్స్

అంటారు – అంటే కార్యకరణసంఘాతం. ఆత్మ ఈ శరీరానికి భిన్నంగా ఉంటుంది. దీన్నిబట్టి ప్రతివ్యక్తీ కూడా ఆత్మ, అనాత్మల మేలుకలయిక అని అర్థమవుతున్నది. మీరు ఎవరినైనా చూస్తే, రెండు విషయాలు చూస్తున్నట్టు. అవి ఆత్మ, అనాత్మ. దీనికి చేయి–కాంతి ఉదాహరణ చూద్దాము. దీన్ని మూడు దశల్లో అర్థం చేసుకోవాలి. మీరు చేతిని చూపించి ఇక్కడేముంది అని అడిగితే –

1. చేయి ఉంది
2. చేయి + కాంతి ఉంది
3. అన్నింటినీ ప్రకాశింపజేసే కాంతి ఉంది

అని దశలవారీగా నేర్చుకుంటాము. ముందు చేతిని మాత్రమే చూస్తే, మూడవ దశలో చేతిని ప్రకాశింపజేసే కాంతిని చూస్తాము. ఈ విడదీయటం భౌతికంగా చేయము. చేతిని కోసుకోము. కాని అది బుద్ధిలో కలిగే మార్పు.

ఇప్పుడు ఈ దృష్టాంతాన్ని ఆత్మ, అనాత్మలకు అన్వయించి చూద్దాము. నేను ఎవరు అని అడిగితే –

1. నేను శరీరాన్ని
2. నేను శరీరం + చైతన్యాన్ని
3. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని

అని దశలవారీగా నేర్చుకుంటాము. ముందు నేను శరీరాన్ని మాత్రమే అనుకుంటాము. తరువాత నేను ఆత్మ, అనాత్మల మేలుకలయికను అని తెలుసుకుంటాము. రెండింటిని విడదీసి చూడగలిగాక, నేను ఆత్మనా, అనాత్మనా? నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి.

ఇలా అనాత్మనుంచి ఆత్మ వైపుకు మనదృష్టిని మరల్చటానికి శాస్త్రం అనేక మార్గాలను సూచిస్తుంది. అందులో ఒక పద్ధతి **దృగ్దృశ్య వివేకమ్**. దృక్ అంటే చూసే నేను. దృశ్యం అంటే చూడబడే వస్తువు. ఆ చూసే నేను ఎవరో విడమర్చి చెప్పేది వివేకం.

మనలో చూసే అంశాలు మూడు ఉన్నాయి –

| | |
|---|---|
| బాహ్యప్రపంచం దృశ్యం 1, కన్ను దృక్ | – దృక్ 1 |
| కన్ను దృశ్యం 2, మనస్సు దృక్ | – దృక్ 2 |
| మనస్సు దృశ్యం 3, సాక్షి దృక్ | – దృక్ 3 |

కన్ను, మనస్సు సాపేక్షిక దృక్కులయితే, సాక్షి ఆత్యంతిక దృక్. అంటే కన్ను జాగ్రత్‌లో పనిచేస్తుంది కాని స్వప్నంలో, సుషుప్తిలో పనిచెయ్యదు. మనస్సు జాగ్రత్‌లో, స్వప్నంలో

పనిచేస్తుంది కాని సుషుప్తిలో పడుకుంటుంది. అందువల్ల ఇవి సాపేక్షిక దృక్కులు. కన్ను అంటే అన్ని ఇంద్రియాలనూ తీసుకోవాలి. సాక్షి అంటే సాక్షిచైతన్యం. అది మూడు అవస్థలలోనూ పనిచేస్తుంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తుంది. అందువల్ల అది ఆత్యంతికం. అదే ఆత్మ. అది నిత్యచైతన్యం. దీన్నిబట్టి మనకు అర్థమైనది ఏమిటి? మనం ఆబ్జెక్టుగా (అంటే వస్తువుగా) చూడగలిగినదేదీ సబ్జెక్టు అయిన నేను కాదు. ఆబ్జెక్టు అయిన ప్రతిదానికీ రాకపోకలు ఉంటాయి అంటే చావు, పుట్టుకలు ఉంటాయి. వస్తుప్రధాన అనాత్మ ద్వారా నేను చేతన ఆత్మను అని తెలుసుకోవాలి. అంటే నేను స్కూటర్‌ను వాడతాను కాని, నేను స్కూటర్‌ను కాను అని తెలుసుకోవాలి.

ఇటువంటి ఆత్మ గురించి కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. ఈ శ్లోకాల్లో ఆత్మ లక్షణాలు కొన్నింటిని వెలిబుచ్చుతున్నాడు. అవి ఆత్మ **నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా అభోక్తా, నిర్వికారం.**

**ఎ) ఆత్మ నిత్యం** – ఆత్మ నిత్యం. వ్యక్తరూపంలో ఉన్నా, ఉండకపోయినా ఆత్మ నిత్యం. చేయి, కాంతి ఉదాహరణ తీసుకుంటే, అక్కడ చేయి ఉంటే, కాంతి ఉన్నట్టు తెలుస్తుంది. చేయి లేకపోతే తెలియదు. అంత మాత్రాన కాంతి లేనట్టు కాదు. అలా ఆత్మ నిత్యం.

**బి) ఆత్మ సత్యం** – ఆత్మకు స్వాభావికమైన ఉనికి ఉంది. అలా అది సత్యం.

**సి) ఆత్మ సర్వవ్యాపకం** – ఆత్మ సర్వవ్యాపకం. చేతిని తీసుకుంటే దానికి సరిహద్దులు ఉన్నాయి. కాని దాన్ని ప్రకాశింపజేసే కాంతికి సరిహద్దులు లేవు. అది చేతి సరిహద్దులని దాటి ఉంది. అలా ఆత్మ శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు. శరీరం బయట కూడా ఉంది. అలా ఆత్మ సర్వగతం, సర్వవ్యాపకం.

**డి) ఆత్మ అప్రమేయం** – ఆత్మ ఎన్నటికీ అనుభవించబడే వస్తువు కాదు.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**

**ఎప్పటికీ అనుభవించే నేను అది, ఎన్నటికీ అనుభవించబడే వస్తువును కాను**

ఉదాహరణకు కెమెరా విషయమే తీసుకోండి. ఒక ఫోటో చూస్తే అందులో కెమెరా ఉండదు. ఫోటోలో కెమెరా ఉండకపోయినా, కెమెరా ఉందా లేదా అని దానికి ఋజువుకోసం చూస్తామా? చూడము! ఎందుకంటే కెమెరా లేకుండా ఫోటో రాలేదు. అలాగే నన్ను నేను అనుభవించలేను కాని, అన్ని అనుభవాలలోనూ నేను ఉన్నాను. అలా ఆత్మ అప్రమేయం.

**ఇ) ఆత్మ అకర్తా అభోక్తా** – ఆత్మ పని చేయదు కాబట్టి అకర్తా; పని చేయకపోతే అనుభవించే ఫలం ఉండదు కాబట్టి అభోక్తా. నేను చేయితో ఏదో ముట్టుకుంటాను. ఆ చేతికి మట్టి అంటుకుంటుంది. అప్పుడేమయింది? ముట్టుకోవటం చేతిని కర్త చేసింది, మట్టి అంటుకోవటం చేతిని భోక్త చేసింది. కాని అదే చేతిమీద ప్రసరించే కాంతి దేన్నీ ముట్టుకోనూలేదు, దానికి మట్టి అంటనూ లేదు. ఆ విధంగా కాంతి అకర్తా, అభోక్తా. అలా ఆత్మ కూడా అకర్తా, అభోక్తా.

**ఎఫ్) ఆత్మ నిర్వికారం** – ఆత్మకు మార్పు లేదు. కాంతి సమక్షంలో చేయి కదిలినా, కాంతి కదలదు. ఇక్కడ చేయిగా, అక్కడ పుస్తకంగా, ఇంకోచోట బల్లగా ప్రకాశింపబడుతుంది. కాని కాంతి మార్పు చెందదు. కాంతి అంటే ట్యూబ్‌లైటు కాంతి తీసుకోకూడదు. సహజసిద్ధంగా ప్రకాశించే కాంతి. అలాగే ఆత్మకు మార్పులేదు.

**ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా అభోక్తా, నిర్వికారం.**

## భాష్యంలో ఆత్మ లక్షణాల్లో ఒక్క అప్రమేయం పదవివరణ –

**అనాశినోఽ ప్రమేయస్య** – 2.18

**పూర్వపక్షి వాదన** – అప్రమేయస్య అంటే ఆబ్జెక్టుగా తెలుసుకోబడేది కాదు. ప్రమాణాలకు అందదు. కాని పూర్వపక్షి (వేదపూర్వభాగాన్ని ఆధారంగా చేసుకుని వాదించే వ్యక్తి) ఆత్మ తక్కిన ప్రమాణాలకు అందదేమో కానీ, శాస్త్రప్రమాణానికి అందుతుంది అంటాడు. ఆత్మను **ఔపనిషదః పురుషః** అనీ, **సర్వం బ్రహ్మోపనిషదమ్** అనీ నిర్వచిస్తారు. అంటే ఆత్మ ఉపనిషత్తుల ద్వారా తెలుసుకోబడేది అని అర్థం. శాస్త్రప్రమాణం ద్వారా తెలుసుకోబడేది అంటే ఆత్మ ప్రమేయం అవుతుంది కాని అప్రమేయం ఎలా అవుతుంది? ఇది మొదటి వాదన.

రెండవ వాదన శాస్త్రానికి రాకముందు ఆత్మను ప్రత్యక్షప్రమాణాల ద్వారా తెలుసుకుందాము. నా గురించి నేను మాట్లాడుతున్నాను అంటే, ఆత్మ నాకు ప్రత్యక్ష ప్రమాణవిషయం. అంటే ప్రమేయం. ఆత్మ అంటే నేను.

ఆ విధంగా ఆత్మ రెండు ప్రమాణాలకు అందుతుంది; వేదాంతానికి రాకముందు ప్రత్యక్ష ప్రమాణానికీ, వచ్చాక వేదాంత ప్రమాణానికీను. అందువల్ల ఆత్మ **ప్రమేయం.**

**శంకరాచార్యుల వారి జవాబు** – ఆత్మ ఏ ప్రమాణం ద్వారానూ తెలుసుకునేది కాదు. ముందు మూడు సాంకేతిక పదాలను అర్థం చేసుకోవాలి. అవి ప్రమాతా, ప్రమాణం,

ప్రమేయం. ప్రమాతా అంటే ఒక విషయం గురించి తెలుసుకునే నేను అంటే సబ్జెక్ట్. దేని గురించి తెలుసుకుంటానో, అది ప్రమేయం – అంటే ఆబ్జెక్ట్. దానికి నేను వాడే పరికరం ప్రమాణం. అంటే ఇన్స్ట్రుమెంట్. ప్రమాతా అయిన నేను ఒక ప్రమాణాన్ని వాడి ఒక ప్రమేయం గురించిన జ్ఞానం పొందుతాను.

ఇప్పుడు చెప్పండి! నేను ప్రమాణం ఎన్నుకునే ముందు నేను ప్రమాతను అని నాకు తెలుసా, తెలియదా? కన్ను అనే ప్రమాణం వాడేముందు నేను ఉన్నానో లేదో అనే సందేహం వస్తుందా? అలాంటప్పుడు సబ్జెక్ట్ అయిన నన్ను నేను ప్రమాణం ద్వారా ఎలా తెలుసుకుంటాను? ఆబ్జెక్టును మాత్రమే ప్రమాణం ద్వారా తెలుసుకోగలను. అలా ప్రమాణం ద్వారా తెలుసుకోబడే వస్తువు ప్రమేయం. ఏ ప్రమాణమూ లేకుండానే స్వయంగా తెలిసేది ప్రమాతా. ఆత్మ ప్రమేయం కాదు. ఎందుకంటే ఆత్మ స్వతఃసిద్ధం. ప్రమాత స్వతఃసిద్ధం, ప్రమేయం ప్రమాణ సిద్ధం. అందువల్ల ప్రమాత తనను గురించి తెలుసుకోవటానికి కాదు, ఆబ్జెక్టుల గురించి తెలుసుకోవటానికి ప్రమాణాన్ని వాడతాడు. ఆత్మ ఎన్నటికీ తెలియని వస్తువుకాదు.

**సందేహం** – ఆత్మ స్వతఃసిద్ధం అయితే, ఆత్మను శాస్త్రప్రమాణం ద్వారా తెలుసుకోలేము అంటే ఆత్మజ్ఞానం పొందటం ఎందుకు? శాస్త్రాన్ని అధ్యయనం చేయటం ఎందుకు?

**జవాబు** – శాస్త్రం ఆత్మ గురించి చెప్పదు. అందువల్ల కొత్తగా ఆత్మ అనుభవంకోసం ప్రయత్నించకండి అంటున్నారు శంకరాచార్యులవారు. మనకు ఆత్మ అనుభవం ఉంది కాని ఆత్మజ్ఞానం లేదు. ఆత్మ గురించిన అనేక అపోహలు ఉన్నాయి. శాస్త్రం ఆత్మమీద ఆరోపించిన అనాత్మ లక్షణాలను నిషేధించుకుంటూ వస్తుంది. శాస్త్రం ప్రమాత హోదాను కూడా కొట్టివేస్తుంది. అప్పుడు నేను అప్రమాతను అవుతాను. నేను అప్రమాతను అయితే ఏ ప్రమాణాన్ని వాడతాను; ఏ ప్రమేయం గురించి తెలుసుకుంటాను? అందువల్ల శాస్త్రం ప్రమాతృప్రమాణప్రమేయ త్రిపుటి లేదు అంటుంది. శాస్త్రం మూడింటినీ కొట్టివేస్తే, శాస్త్రప్రమాణం సంగతేమిటి? జ్ఞానం పొందాక, జ్ఞానికి శాస్త్రప్రమాణం కూడా ఉండదు.

**మద్దూరి రాజ్యశ్రీ**

## శ్రీ మాత్రే నమః
## శ్రీ గురుభ్యో నమః

కీ॥శే॥ శ్రీ చింతకింది కిషన్‌రెడ్డిగారు – తల్లి మల్లమ్మ, తండ్రి మల్లయ్య పుణ్యదంపతులకు తేదీ 14.5.1943న కరీంనగర్‌లో జన్మించారు. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం వేములవాడ గురుకుల పాఠశాలలో జరిగింది. వీరి నాన్నగారు హైదరాబాద్ నిజాం సంస్థానంలో పనిచేయుటవలన బాల్యం ఎక్కువగా హైదరాబాద్‌లోనే గడిచింది. వేదికవర్ధిని కళాశాల, సీతారాంబాగ్, హైదరాబాద్‌లో సంస్కృతంలో బి.ఓ.ఎల్. ఉన్నతవిద్యను పూర్తిచేసి, తెలుగు పండిత్‌గా పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు.

శ్రీమతి విష్ణుప్రియగారిని 1969లో వివాహమాడి గృహస్థులయ్యారు. భార్య శ్రీమతి విష్ణుప్రియగారు ఆరోగ్యశాఖలో ఉద్యోగం చేస్తూ, సహధర్మచారిణిగా తన కర్తవ్యబాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. కిషన్‌రెడ్డిగారు కూడా తన కుటుంబంపట్ల ఎంతో బాధ్యతతో మెలిగేవారు. వీరికి ఇద్దరు కుమారులు. కిషన్‌రెడ్డి గారికి హైదరాబాద్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చినా కూడా భార్య ఉద్యోగం, పిల్లల చదువులను దృష్టిలో ఉంచుకొని, దూరం వెళితే వారికి న్యాయం చేయలేమోనని భావించి, లెక్చరర్ ఉద్యోగంలో చేరలేదు.

వీరి ఆశయానికి తగ్గట్టుగానే, వీరి పిల్లలు చదువులో మంచి శ్రద్ధాసక్తులను కనబరిచి, ఆర్.ఇ.సి. కళాశాలలో సీట్లు సంపాదించుకున్నారు. కిషన్‌రెడ్డిగారికి భాషాభిమానం ఎక్కువ. కుమారులకు సంస్కృతం, హిందీ, తెలుగు భాషల్లో ప్రావీణ్యతను పెంపొందించారు. ప్రస్తుతం పెద్దకుమారుడు శ్రీ చరణ్‌రెడ్డి, కోడలు శ్రీమతి శివకుమారి వ్యాపారరంగంలో కొనసాగుతున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు – ధాత్రిరెడ్డి, ఆకాంక్షరెడ్డి. చిన్నకుమారుడు శ్రీ మధుకర్‌రెడ్డి, కోడలు శ్రీమతి శిరీషలు అమెరికాలో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు– హేమంత్‌రెడ్డి, ఆకాష్‌రెడ్డి.

శ్రీ కిషన్‌రెడ్డి గారు స్త్రీవిద్యను ప్రోత్సహించేవారు. వీరు వృత్తిలో కొనసాగుతున్నప్పుడు ప్రతిసంవత్సరానికి ఒక అమ్మాయిని దత్తత తీసుకుని, వారిని చదివించి, వారికి అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందించి, వారి జీవితాలను తీర్చిదిద్దేవారు. శ్రీ కిషన్‌రెడ్డి గారు ఉపాధ్యాయవృత్తిలో ఉన్నందున, విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చేవారు. పెద్దకోడలు ఇంటికి వచ్చాక నేను చదువుకుంటాను మామయ్యా అని అడగగా, వెంటనే మద్రాసులోని డా॥ ఎమ్. జి. ఆర్ కళాశాలలో చేర్పించి, ఎం.సి.ఏ. చదివించారు.

శ్రీ కిషన్‌రెడ్డి గారు పదవీవిరమణ అనంతరం హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అక్కడ సత్సంగంతో నిత్యం కాలక్షేపం చేస్తూ ఉండేవారు. కాలక్రమంలో భార్య సద్గురువులను ఆశ్రయించి ఆధ్యాత్మిక చింతనలో పడినప్పుడు, వీరు కూడా పరోక్షంగా వారితోపాటు గురుబోధనలను వినేవారు.

శ్రీ కిషన్‌రెడ్డి గారు 13.9.2022న భగవత్ సన్నిధిని పొందారు. వీరి భార్య శ్రీమతి విష్ణుప్రియగారు భర్త అందించిన మనోధైర్యాన్ని అందిపుచ్చుకొని ప్రశాంతంగా ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతున్నారు. గురువులు కొనసాగిస్తున్న బ్రహ్మయజ్ఞానికి తనవంతుగా సహకారాన్ని అందిస్తున్నారు. సద్గురువులు లభించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తుంటారు.

ఓం తత్సత్.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు.

**చింతకింది కుటుంబ సభ్యులు**

# ముందు మాట

ముముక్షువులు కోరుకునేది మోక్షము. అది 'బ్రహ్మవిద్య' ద్వారా సాధ్యమని మనందరికి తెలుసు. దీనిని తెలుసుకోవటానికి ప్రస్థానత్రయము – ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత – మూడు మార్గములు కలవనీ తెలుసు.

మరి ఈ మూడు మార్గములు విభిన్నమైన మార్గములా? కాదు. పోనీ, మూడు మజిలీలా? కాదు. ఒకే రహదారి – హైవేలాగా. త్యాగరాజస్వామి చెప్పిన "చక్కని రాజమార్గముండగా సందుల దూరనేల? ఓ మనసా" అన్నట్లు మనకున్నది ఒకే రాజమార్గము. హైవేలో చూసినట్లయితే మనకు మూడు దారులు కనబడతాయి. సమాంతరముగా ఉండి, పక్కపక్కనే ఉండి మనలను గమ్యము చేర్చుటకు ఉపయోగపడతాయి. ఈ మూడు దారులను మనకు ప్రస్థానత్రయముగా అనుకోవచ్చు. అవసరం వచ్చినప్పుడు, ఏదైనా అడ్డు వచ్చినప్పుడు హైవేలో ఒకదారినుంచి మరియొక దారిలోకి వెళ్ళి గమ్యమును సులభముగా ఎలా చేరతామో, అట్లే మనకి ఈ మూడు గూడా – ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత – మన సాధన మార్గమును సులభమగునట్లు చేస్తాయి.

సంస్కృతభాషలోనున్న ఈ ప్రస్థానత్రయము, వాటి భాష్యములను, అది చదివే పరిజ్ఞానము లేనివారికి, శ్రీ పరమార్థానందస్వామిగారు ఇంగ్లీషులో శిష్యులకు కొన్ని దశాబ్దములుగా బోధిస్తున్నారు. అందులో భాగమైన ఈ భగవద్గీత గ్రంథము వారు చేసిన కొన్ని ప్రవచనములకు మూలము. స్వామివారు నారికేళపాకమైన శంకరభాష్యమును, కదళీపాకము చేసి ఉపన్యసిస్తే, దానిని ద్రాక్షపాకముగా మనందరికి అందించిన శ్రీమతి రాజ్యశ్రీగారు ఎంతయో అభినందనీయురాలు.

శ్రీమతి రాజ్యశ్రీగారి అనువాద పుస్తకములను పరికించుట జరిగినది. స్వామివారి భాషణలకు అనువాదమైననూ, రాజ్యశ్రీగారి ప్రత్యేకత (stamp – watermark) ప్రతిపేజీలోనూ కనబడుతుంది. సాధారణ మందబుద్ధులకు ఎట్లు ఈ విద్యను అందచేయాలా అనే తపన కనబడుతూ ఉంటుంది. అందులో వారు సఫలీకృతులైనారనుటలో ఎంతమాత్రమూ సందేహము లేదు.

ముఖ్యముగా ఈ 'సంక్షిప్త భగవద్గీత' విషయానికి వస్తే – ఇది ఒక గంగా ప్రవాహంలా సాగుతూ, అవిరోధములు కలుగకుండా, ఎక్కడా అర్థం కాకపోవటం మూలంగా ఆగవలసిరాకుండా, చాలా సాఫీగా సాగుతుంది.

ఎందుకంటే, ఎలాగైతే ఒక లేన్ నుండి మరొక లేన్‌లోకి అప్పుడప్పుడు అవసరంగా ప్రయాణం చేస్తామో, అట్లే ఎక్కడ అవసరం ఉందో అక్కడ ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు,

ధర్మశాస్త్రాల ప్రస్థావన తీసుకువస్తూ, పాఠకులకు కలిగే సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తూ ఈ పుస్తకరచన సాగుతుంది.

ఈ పుస్తకమునకు **సంక్షిప్త భగవద్గీత** అనే పేరు చాలా సముచితంగా ఉంది. ఎందుకంటే సంక్షిప్తముగా అంటే క్లుప్తముగా, సంగ్రహించబడిన లేదా సంక్షిప్తము – చక్కగా క్షిప్తము (ప్రస్థానత్రయమును) చేయబడుటచే ఇది సంక్షిప్తమే!

నేను 3 లేక 4 సంవత్సరముల క్రితం స్వామి పరమార్థానంద గారి బృహదారణ్యక ఉపనిషత్తు దాదాపు 150 గంటల ఉపన్యాసాలు వినటం జరిగింది. దానితో నేను ఏకలవ్య శిష్యుడనై, వారి ఉపన్యాసాలను తెలుగు ప్రజలకు అందిస్తే బాగుంటుందనే భావన కలుగగా, ఆ పనిని శ్రీమతి రాజ్యశ్రీగారు అప్పటికే చేసేశారని తెలిసి, శ్రీమతి రాజ్యశ్రీ, శ్రీ రాఘవరావుగార్లను కలవటం జరిగింది. దానిమూలముగా ఈ సంక్షిప్త భగవద్గీత ప్రూఫ్‌రీడింగ్ చేసే భాగ్యము నాకు కలిగినది. నేను ఈ పుస్తకమును చదువునపుడు దానితో ప్రేమలో పడ్డాననుటలో సందేహము లేదు. భగవద్గీతను సరళముగా, మిగతా ప్రస్థానములను, ధర్మశాస్త్రములను ఉటంకిస్తూ, అన్ని సందేహాలు తీరుస్తూ, పాఠకులకు హాయిగొలిపే రచనాపటిమ ఎంతయో శ్లాఘనీయము.

శ్రీమతి రాజ్యశ్రీ, శ్రీ రాఘవరావు గార్లు ఆర్షవిద్యా తరంగిణి ద్వారా చేస్తున్న కార్యక్రమాలు– పుస్తకరచన, వేదాంత భాషణములతో ఎందరో ముముక్షువులకు ఉపకారం చేస్తున్నారు, దారి చూపిస్తున్నారు. వారిని భగవంతుడు సదా కాపాడాలని, ఇటువంటి మంచి కార్యక్రమాలు ఎన్నో చేయాలని హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను.

శ్రీ పరమార్థానందస్వామిగారి
ఏకలవ్య శిష్యుడు
**డా॥ బుఱ్ఱా రామచంద్రశాస్త్రి**

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । గణేశాయనమః ।
సరస్వత్యైనమః । శ్రీ గురుభ్యో నమః ।
హరిః ఓమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# ధ్యానశ్లోకాలు

శ్లో. 1 ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ ।
అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీమ్
అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥

శ్లో. 2 నమోఽస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిందాయతపత్రనేత్ర ।
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥

శ్లో. 3 ప్రపన్నపారిజాతాయ తోత్రవేత్రైకపాణయే ।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః ॥

శ్లో. 4 సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥

శ్లో. 5 వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

శ్లో. 6 భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా! ।
అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః ॥

శ్లో. 7 పారాశర్యవచః సరోజమమలం గీతార్థగంధోత్కటం
నానాఖ్యానకకేసరం హరికథా సంబోధనాబోధితమ్ ।
లోకే సజ్జనషట్పదైరహరహః పేపీయమానం ముదా
భూయాద్భారతపంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే ॥

శ్లో. 8 మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।
యత్కృపా తమహం వందే పరమానందమాధవమ్ ॥

శ్లో. 9 యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుతః స్తున్వంతి దివ్యైః స్తవైః
వేదైః సాంగపదక్రమోపనిషదైః గాయంతి యం సామగాః ।
ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాంతం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః ॥

# అర్జునవిషాదయోగము

## అధ్యాయము 1

**శ్రీ గురుభ్యో నమః**

**అగ్రే కృత్వా కమపి చరణం జానునైకేన తిష్ఠన్।**
**పశ్చాత్పార్థం ప్రణయజుషా చక్షుషా వీక్షమాణః।**
**సవ్యే తోత్రం కరసరసిజే దక్షిణే జ్ఞానముద్రాం।**
**ఆబిభ్రాణో రథమధివసన్ పాతు నస్సూతవేషః॥**

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్॥**

**సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖమ్।**
**ఏతత్ విద్యాత్ సమాసేన లక్షణం సుఖదుఃఖయోః॥** – మనుస్మృతి

'స్వేచ్ఛ (అన్ని రకాలుగా) ఆనందం, బంధం (అన్ని విషయాల్లో) దుఃఖం. ఇవి సుఖదుఃఖాల సాధారణ నిర్వచనాలుగా తెలుసుకోండి.'

ఈ శ్లోకం సుఖదుఃఖాల గురించి రెండు ప్రాథమిక సత్యాలను వెల్లడి చేస్తున్నది.

**సర్వం పరవశం దుఃఖమ్** – పరులమీద ఆధారపడితే, ప్రతిదీ దుఃఖహేతువు అవుతుంది.

**సర్వమ్ ఆత్మవశం సుఖమ్** – మీమీదే మీరు ఆధారపడితే అది ఆనందం అవుతుంది.

**ఏతత్ విద్యాత్ సమాసేన లక్షణం సుఖదుఃఖయోః** – టూకీగా చెప్పాలంటే, ఆధారపడటం దుఃఖం, స్వేచ్ఛగా ఉండటం ఆనందం. ఈ గొప్ప సత్యాన్ని శాస్త్రం బోధించటమే కాదు, మన అనుభవం కూడా నిరూపిస్తుంది.

స్వామీజీ బోధ వినటానికి, మీరు ఒకచోటుకి వెళ్ళాలంటేనే, బస్సులోనో, ఆటోలోనో, కారులోనో ప్రయాణం చేసి వెళ్ళాలి. బస్సులో వెళ్ళటంవల్ల కలిగే ఇబ్బందులు ఏమి ఉన్నాయో మీకే తెలుసు. అనుకున్న సమయానికి రాదు, వచ్చినా ఆమడ దూరంలో ఆగుతుంది. లేదా ప్రయాణీకులతో ఆ బస్సు కిక్కిరిసివుండి, మీకు కూర్చునేందుకు సీటు దొరకకపోవచ్చు. అంత జనాల్లో జేబుదొంగలు కూడా ఉండవచ్చు, మీ పర్సు కొట్టేయవచ్చు. బస్సుమీద ఆధారపడితే ఎదురయ్యే సమస్యల్లో ఇవి కొన్ని.

పోనీ అని, ఈ సమస్యలను తప్పించుకుందామనుకుని, ఆటో ఎక్కుదామనుకున్నారనుకోండి, అక్కడా సమస్యలు తప్పవు. ఆటోడ్రైవరు ఎక్కడికి వెళ్ళాలి, మళ్ళీ మిమ్మల్ని వెనక్కి తీసుకు రావాలా అంటాడు. 200 రూపాయలో, 300 రూపాయలో ఇమ్మని నిర్బంధిస్తాడు. మీకు రక్తం ఉడుకెత్తిపోతుంది. ఇదంతా **పరవశం దుఃఖమ్.**

ఈ బాధలు పడలేక, ఇకమీదట బస్సుల్లోనూ, ఆటోల్లోనూ వెళ్ళను; నా స్వంతకారులో వెళతాను అనుకుంటారు. దీన్ని **కౌపీన సంరక్షణార్థమ్ అయం పటాటోపః** అంటారు. ఈ సమస్యలను తప్పించుకోవటానికి మీరు కారు కొంటే, కారుతో పాటు కొత్త సమస్యలు కొనితెచ్చుకున్నవారు అవుతారు. రోజు విడిచి రోజు కారు రిపేరుకొస్తుంది, మెకానిక్ మీకు కావాల్సిన సమయానికి తిరిగి ఇవ్వడు.

ఈ సమస్యలన్నింటినీ విశ్లేషిస్తే, అన్నింటిలోనూ సమానంగా ఉన్న సత్యం ఒకటే – ఎక్కడ ఆధారపడటం వస్తుందో, అక్కడ దుఃఖం వెన్నంటే ఉంటుంది. ఎందుకంటే ఆధారపడితే, ఆశించటం ఉంటుంది. ఎదుటివారినుంచి, బాహ్యవస్తువులనుంచి మీరు చాలా ఆశిస్తారు. కాని మనుష్యులు, వస్తువులు మీ అదుపులో ఉండవు కాబట్టి మీరు ఆశించినట్టు జరగవచ్చు, జరగకపోవచ్చు. నిజానికి జరగకపోయే అవకాశాలే ఎక్కువ. అలా జరగకపోతే ఆందోళన, దుఃఖం, ఒత్తిడి, నిరాశానిస్పృహలు చోటుచేసుకుంటాయి.

ఎప్పుడు మీకు దుఃఖం కలిగినా, దుఃఖహేతువు ఏమిటో విశ్లేషించుకోవాలి. అప్పుడు మీకే కారణం తెలుస్తుంది. మీరు ఎదుటివారినుంచి, వస్తువులనుంచి, పరిస్థితులనుంచి ఏదో ఒకటి ఆశిస్తున్నారు. ఆధారపడటం అంటూ ఉంటే, ఆశించటం తప్పదు. ఆశించటం అంటూ ఉంటే, ఆశాభంగమూ తప్పదు. ఆశాభంగం ఉంటే దుఃఖమూ తప్పదు.

ఈ సమస్యను ఇంకొంచెం లోతుగా విశ్లేషిస్తే, మీరు ఇతరులమీద మూడు కారణాలకోసం ఆధారపడుతున్నారని తెలుసుకుంటారు.

1. **భద్రత** – మీరు మీ భద్రతకోసం డబ్బుమీద ఆధారపడతారు. మీరు భద్రతకోసం ఇంటిమీద ఆధారపడతారు. షేర్లు కొనేది, కంపెనీలు పెట్టేది, ఉద్యోగాలు చేసేది, హోదా, పదవి కోరేది – అన్నీ భద్రతకోసం. భద్రతకోసం ఆధారపడుతున్నారు. భద్రతకోసం మనుష్యులమీద, వస్తువులమీద, పరిస్థితులమీద ఆధారపడుతున్నారు. శాస్త్రం దీన్ని 'అర్థ' అంటుంది. **అర్థ** పురుషార్థం పొందటంకోసం మీరు వీటిమీద ఆధారపడుతున్నారు.

2. **సుఖం** – మీరు ఆనందంకోసం, జీవితాన్ని అనుభవించటంకోసం బాహ్యవస్తువులమీద ఆధారపడతారు. బీచ్‌కి వెళతారు, సినిమాకు వెళతారు, సంగీతసభలకో, నాట్యప్రదర్శనలకో వెళతారు. ఇవేవీ కాదంటే ఇంట్లోనే పెద్ద టీవీనో, రేడియోనో పెట్టుకుంటారు. అంటే

మీ ఆనందంకోసం, మీరు విశ్రాంతిగా అనుభవించటంకోసం దేనిమీదో ఆధారపడటం. ఇలా ఆనందం, సుఖం కోరుకోవటాన్ని **కామ** పురుషార్థం అంటుంది శాస్త్రం.

టూకీగా చెప్పాలంటే, అర్థ పురుషార్థాన్ని కోరుకునేది భద్రతకోసం అయితే, కామ పురుషార్థాన్ని కోరుకునేది సుఖంకోసం.

3. **పుణ్యం** – మన సాంప్రదాయంలో మనం మరణించాక, మన శరీరాన్ని వదిలి జీవాత్మ వేరే లోకానికి ప్రయాణించి వెళుతుందని నేర్చుకుంటాము. ఈ ప్రయాణం గురించి ఎలా తెలుస్తుంది? శాస్త్రమే చెబుతుంది. మరణించాక నీవెంట ఎవరూ రారు, భార్య రాదు, పిల్లలు రారు. సినిమా పాటలో 'ఎవ్వడికోసం ఎవడున్నాడు? పొండిరా పొండి,' అని వస్తుంది. దీనికి జవాబు మనుస్మృతిలో చూస్తాము.

**మృతం శరీరం ఉత్సృజ్య కాష్ఠలోష్టసమం క్షితౌ।**

**విముఖాః బాంధవాః యాంతి ధర్మస్తమ్ అనుగచ్ఛతి॥** – మనుస్మృతి

'కట్టెలాగా ఉన్న అతని శవాన్ని, లేదా కాలి బూడిదయిన శరీరాన్ని వదిలేసి, అతని స్నేహితులు, బంధువులు వెనుతిరిగి వెళ్ళిపోతారు. అతని వెంట (మరణమనే చీకటిలో) వచ్చేది పుణ్యం మాత్రమే.'

ఎప్పుడైతే ఒకవ్యక్తిలో ప్రాణం పోతుందో, అతని శరీరం కట్టెతో సమానం. దాన్ని వెంటనే నేలమీద పెట్టేస్తారు. కొంతమందైతే, శవాన్ని ముట్టుకోవటానికి కూడా సందేహిస్తారు. ఒకవేళ స్మశానానికి వెళ్ళినా, దహనసంస్కారం అయ్యాక, తలలు వంచుకుని, వెనక్కి వెళ్ళిపోతారు. మరణం తరువాత అతను చేసే ప్రయాణంలో వెంట ఎవరు వెళతారు? శాస్త్రం ధర్మః తమ్ అనుగచ్ఛతి అంటుంది. ధర్మం మాత్రమే, అంటే అతను చేసిన పుణ్యకర్మఫలములు మాత్రమే అతని వెంట వస్తాయి. అందువల్ల మనుష్యులు ఆధారపడే ఇంకొక అంశం **ధర్మం**. ధర్మంకోసం పిల్లలమీద ఆధారపడతారు.

పుత్రుడు ఉంటే పరలోకగతి దొరుకుతుందని, ప్రత్యేకించి పుత్రసంతానాన్ని కోరుకుంటారు చాలామంది. పుత్రుడు పుట్టినా, తనకు శ్రాద్ధకర్మలు చేస్తాడో లేదో, తర్పణాలు వదులుతాడో లేదో అనే భయం పీడిస్తుంది. అంతేకాదు, పిల్లవాడు ప్రయోజకుడు అవుతాడో లేదో, అయితే పెళ్ళి చేసుకుంటాడో లేదో, వచ్చే కోడలు మంచిదో కాదో బెంగలు కూడా పీడిస్తూ ఉంటాయి. అందువల్ల ఈ మూడో కోరికకోసం (పరలోకగతికోసం) మీ పిల్లలమీద ఆధారపడతారు.

ఏదేమైనా, ఇహలోక సుఖాలకోసమైనా, పరలోకగతికోసమైనా, ఎదుటివారిమీద ఆధారపడటం అంటూ జరిగితే జీవితం దుఃఖభూయిష్టంగానే ఉంటుంది. ఎందుకు? **సర్వం పరవశం – పుత్రవశమపి దుఃఖమేవ.**

మరయితే, దీనికి పరిష్కారమేమిటి? **సర్వమ్ ఆత్మవశం సుఖమ్.** దీనికి పరిష్కారం మీమీదే మీరు ఆధారపడటం. భద్రతకోసం, ఆనందంకోసం, పరలోకప్రాప్తికోసం మీమీదే మీరు ఆధారపడితే సుఖం. మీమీదే మీరు ఆధారపడితే మీరు జీవన్ముక్తులు అవుతారు అంటే ఇక్కడే, ఇప్పుడే, జీవించి ఉండగానే, మోక్షం పొందుతారు. అర్థ, కామ, ధర్మాలకోసం ఎవరిమీదా ఆధారపడరు అప్పుడు. మీలోనే భద్రత పొందుతారు; మీరు బాహ్యంగా ఆనందం వెతుక్కోరు; మీరు మరణించాక పిల్లలు మీకు చేసే కర్మకోసం ఆశించరు. వారు పెట్టే శ్రాద్ధకర్మలు, వదిలే తర్పణాలకోసం ఎదురుచూడరు. మీ ధర్మం మిమ్మల్ని వెన్నంటి వస్తుందని నేర్చుకుంటారు. అలా చేస్తే మిమ్మల్ని జీవన్ముక్తుడు అంటారు. ఈ జీవన్ముక్తుడి గురించి శాస్త్రంలో వివరంగా వస్తుంది.

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥** – 3.18

జ్ఞానికి కర్మలు చేసినా, చేయకపోయినా ఏ ప్రయోజనమూ ఉండదు. అతను దేనికీ ఎవరిమీదా ఆధారపడడు.

ఈ జ్ఞాని తన భద్రతకోసం బ్యాంకు బ్యాలన్సుమీద, షేర్లమీద, ఎఫ్.డి.లమీద, కుటుంబసభ్యులమీద కూడా ఆధారపడడు. అతను తనమీదే ఆధారపడతాడు. సుఖంకోసం టీవీ, సినిమాలమీద ఆధారపడతాడా? గీత ఇలా అంటుంది,

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – గీత 2.55

కృష్ణపరమాత్మ ఇలా అన్నాడు, 'ఓ పార్థా! మనస్సులోని కోరికలన్నీ పూర్తిగా తొలగిపోయి, ఆత్మద్వారా ఆత్మలోనే సంతుష్టమైన వానిని (బాహ్యవస్తువులమీద ఆధారపడని వానిని), స్థితప్రజ్ఞుడు అంటారు.'

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** – అర్థపురుషార్థంకోసం, కామపురుషార్థంకోసం ఎవరిమీదా ఆధారపడడు. తనలోనే తను రమిస్తాడు. మరయితే ధర్మం మాటేమిటి? పరలోకగతికోసం ఎవరిమీదనైనా ఆధారపడతాడా? దానికి కూడా కృష్ణపరమాత్మ జవాబు చెబుతున్నాడు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥** – గీత 18.66

'అన్ని ధర్మాలమీద ఆధారపడటం మానేసి (నైతిక, ఆధ్యాత్మిక ఎదుగుదలకు మానవ ప్రయత్నం వదిలేసి) నన్నే శరణు వేడు. నువ్వు శోకించకు. నేను నిన్ను అన్ని పాపాలనుంచి విముక్తుణ్ణి చేస్తాను.'

స్థితప్రజ్ఞుడు ధర్మంకోసం కూడా ఎవరిమీదా ఆధారపడడు. అటువంటి వ్యక్తినే జీవన్ముక్తుడు అంటారు. ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతాడు.

మన శాస్త్రాలన్నీ బోధించేది ఈ స్వేచ్ఛను, ఈ ముక్తిని. అదొక్కటే ఆత్యంతిక సుఖాన్నిస్తుంది. ఈ మోక్షాన్ని బోధించే ప్రాథమిక శాస్త్రాన్ని **వేదం** అంటారు. దాన్నే శ్రుతి అని కూడా అంటారు. వేదం పరమపురుషార్థమైన మోక్షం లేదా ముక్తిని బోధిస్తుంది. ఈ వేదాలలోని అంశాలను మళ్ళీ వివరంగా కొందరు ఋషులు రచించారు. వాటిని స్మృతి గ్రంథాలు అంటారు. ఆ విధంగా మనకు రెండుస్థాయిల్లో శాస్త్రం ఉంది. అవి మూలగ్రంథం, స్మృతిగ్రంథం.

**మూలగ్రంథం** – మూలగ్రంథాలను శ్రుతిగ్రంథాలు అంటారు. వేదాలను అపౌరుషేయాలు అంటారు. అంటే అవి పురుషబుద్ధిలోంచి వచ్చినవి కావు. సాక్షాత్తూ భగవానుడు వెలిబుచ్చినది. ఋషులు వారి సత్త్వగుణంతో అందుకున్నారు.

**స్మృతిగ్రంథం** – ఋషులు వేదాలనుంచి కొన్ని అంశాలను తీసుకుని రచించారు. వారి స్మృతినుంచి అంటే వారి జ్ఞాపకశక్తినుంచి వచ్చాయి కాబట్టి వీటిని స్మృతిగ్రంథాలు అంటారు. ఉదాహరణకు పరాశరస్మృతి, మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి.

**పురాణం** – తర్వాత ఈ స్మృతులనుంచి పురాణాలు వచ్చాయి. అలా 18 పురాణాలు, 18 ఉపపురాణాలు ఉన్నాయి. వాటిని వ్యాసాచార్యులవారు రచించారు. ఇవి కూడా వేదాల ఆధారంగా వచ్చినవే. ఇవి కూడా ఆంతరస్వేచ్ఛను ఎలా పొందాలో బోధిస్తాయి.

**ఇతిహాసం** – తర్వాత ఇతిహాసాలు వచ్చాయి. ఉదా. మహాభారతం. దీనిలో కూడా వేదాల్లోని ప్రాథమిక బోధే ఉంటుంది. కాకపోతే ఇవి కథలరూపంలో ఉంటాయి.

వీటిల్లో ఏ స్థాయి గ్రంథాన్ని తీసుకున్నా, అన్నింటిసారం ఒక్కటే. **ధర్మ, అర్థ, కామాలను** పాటిస్తూ మోక్షం పొందటం ఎలా? ధర్మాన్ని మనలోనే ఎలా పొందాలి? అర్థాన్ని మనలోనే ఎలా పొందాలి? కామాన్ని మనలోనే ఎలా పొందాలి? ఈ మూడింటినీ బాహ్యవస్తువులలో కాకుండా మనలోనే పొందటమే **మోక్షం**.

ఇంతవరకూ ఆధారపడటం దుఃఖం అనీ, స్వేచ్ఛగా ఉండటం సుఖం అనీ చూశాము. కాని వచ్చిన చిక్కేమిటంటే, ఎవరూ వెంటనే స్వేచ్ఛ పొందరు. నిజానికి స్వేచ్ఛను సరాసరి పొందలేము. స్వేచ్ఛ పొందేముందు ఎవరిమీదో ఆధారపడకతప్పదు. అంటే ఆధారపడటంనుంచే స్వేచ్ఛ పొందగలము. దీనికి ఉదాహరణ చిన్నపిల్లవాడు నడక నేర్చుకోవటం. అతను ముందే తనంతట తాను నడిచేయలేడు. అందువల్ల మొదటిదశ దేన్నో పట్టుకుని నడవటం. తల్లిచెయ్యి పట్టుకునో, వాకర్ పట్టుకునో, గోడ పట్టుకునో, కుర్చీ పట్టుకునో నడుస్తాడు. ఆ విధంగా పిల్లవాడు వీటిల్లో ఏదో ఒకదాన్ని పట్టుకుని నడవటం

మొదలెట్టిన కొన్నాళ్ళకు తన కాళ్ళలో బలం పుంజుకున్నాక తనే స్వయంగా నడవటం మొదలుపెడతాడు. అప్పుడు కూడా నిల్చోగానే కిందపడతాడు. అయినా పట్టువదలక, అనేకసార్లు కిందపడ్డాక స్వయంగా నడవటం నేర్చుకుంటాడు. అప్పుడు ఎవరి సహాయమూ అవసరంలేదు.

ఈ పిల్లవాడు తల్లిగర్భంలో ఉండగా, తల్లిమీద ఆధారపడ్డాడు – ఎదగటానికీ, ఆహారానికీ. కాని తల్లిగర్భంలో పూర్తిగా రూపుదిద్దుకున్నా, ఇంక అక్కడే శాశ్వతంగా ఉండిపోలేడు. అందులోంచి బయటకు రావాలి, తల్లిగర్భంనుంచి స్వేచ్ఛ పొందాలి. ఒక పండు, అది పండేదాకా, పక్వం చెందటానికి చెట్టుమీద ఆధారపడాలి. కాని ఒకసారి పండాక, చెట్టునుంచి రాలి కింద పడుతుంది. అంటే చెట్టునుంచి స్వేచ్ఛ పొందుతుంది.

అదేవిధంగా స్కూల్లో చేరిన పిల్లవాడు టీచరునుంచి విద్య పొందుతాడు. తొలి దశల్లో ఆధారపడతాడు. కాని విద్య పొందగానే, స్కూలునుంచి బయటకు వస్తాడు. అంటే స్వేచ్ఛ పొందుతాడు. పాఠాలు నేర్చుకోవాలి, ఎదగాలి, స్వేచ్ఛ పొందాలి.

ఇటువంటి జీవనాన్ని శాస్త్రమే రెండు దశలుగా విభజించింది.

1. **ఆధారపడే స్థాయి** – మొదటిదశలో జగత్తుమీద ఆధారపడేలాగా చేసింది. కుటుంబంమీద, సమాజంమీద, వస్తువులమీద ఆధారపడేలాగా చేసింది. ధర్మార్థకామాలు పొందటానికి ఈ ఆధారపడటం తప్పదు. ఇలా జగత్తుమీద ఆధారపడే మొదటిస్థాయిని ధర్మపరమైన జీవనం అంటుంది శాస్త్రం. వేదంయొక్క మొదటిభాగం ఈ బోధ చేస్తుంది. దాన్ని **వేదపూర్వభాగం** అంటారు. ఈ వేదపూర్వభాగం ఆధారపడుతూ, ఎదిగే పద్ధతిని నేర్పిస్తుంది.

శారీరకంగా, భావపరంగా, బుద్ధిపరంగా, భక్తిపరంగా ఎదగాలి ప్రతి ఒక్కరు. అలా ఎదగటానికి సమాజంమీద, ధర్మంమీద, మొత్తం మానవాళిమీద, అంతెందుకు మొత్తం ప్రపంచంమీద ఆధారపడాలి. ఈ ఆధారపడే స్థాయిని వేదపూర్వభాగం బోధిస్తుంది.

2. **విముక్తి పొందే స్థాయి** – దీని తరువాత స్థాయిలో ఆధ్యాత్మికంగా ఎదుగుతారు. ఇందులో మనిషి క్రమేపీ జగత్తునుంచి విడివడతాడు. ఇది ఎలా చేయాలో **వేదాంతభాగం** అంటే వేదంలోని రెండవభాగం బోధిస్తుంది.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః।**
**పరేణ నాకం నిహితం గుహాయాం విభ్రాజతే యద్యతయో విశంతి।**
**వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః సన్న్యాసయోగాత్ యతయః శుద్ధసత్త్వాః।**
**తే బ్రహ్మలోకేషు పరాంతకాలే పరామృతాః పరిముచ్యంతి సర్వే।।**

– మహానారాయణోపనిషత్ 12.14.5

'అమృతత్వాన్ని కర్మవల్ల, పిల్లలవల్ల, ఐశ్వర్యంవల్ల పొందలేరు. కొంతమంది అమృతత్వాన్ని త్యాగం చేయటంవల్ల పొందారు. వారు పొందిన అమృతత్వం స్వర్గానికన్నా శ్రేష్ఠమైనది. అది స్వచ్ఛమైన మనస్సులో బాగా ప్రకాశవంతంగా వెలుగుతుంది.'

ఆత్మసంయమనంకోసం పాటుపడి, కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది, వేదాంతబోధలో నేర్పించిన జ్ఞానం పొంది, బ్రహ్మజ్ఞానంలో నిలబడిన జ్ఞాననిష్ఠులు, వారి దేహపతనానంతరం విదేహముక్తి పొందుతారు.

ఈ రెండవదశలో ఆధారపడటం దశనుంచి ఎదిగిన వ్యక్తి ఎలా పూర్ణత్వం, ఆనందం, భద్రత తనలోనే వెతుక్కుంటాడో కూడా వేదాంతభాగం చెబుతుంది.

**అదృశ్యే అనాత్మ్యే అనిరుక్తే అనిలయనే అభయం ప్రతిష్ఠాం విందతే।**
**అథ సోఽభయం గతో భవతి।** – తైత్తిరీయమ్

ఎప్పుడైతే మనిషి బ్రహ్మస్వరూపంలో నెలకొని ఉంటాడో, అప్పుడే అతను అభయం పొందుతాడు.

కాని ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మీరు ఆధారపడటానికి ప్రయత్నిస్తుంటే, చివరికి ఈ ఆధారపడటం స్వతంత్రానికి దారితీయాలి. అప్పుడే ఈ పరతంత్రం ఆరోగ్యకరమైన పరతంత్రం అవుతుంది. దానికి భిన్నంగా శాశ్వతంగా ఆధారపడితే, వారికి బంకలాగా అతుక్కుపోయి, జీవితాంతం పరతంత్రంగా బతికితే, అది వ్యసనం అవుతుంది. అటువంటి పరతంత్రం అనారోగ్యకరం.

ఆ విధంగా రెండురకాల పరతంత్రం ఉంది. ఆరోగ్యకరమైనది, అనారోగ్యకరమైనది. ఎంతసేపూ కుటుంబంమీద, భార్యమీద, పిల్లలమీద, ధనంమీద ఆధారపడుతూ జీవిస్తే అది ఆరోగ్యకరమైన జీవనం కాదు. శాశ్వతంగా ఆధారపడటం మంచిది కాదని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి.

**ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్।** – రుద్రం

దోసకాయ పండాక, దానినుంచి తీగే విడివడుతుంది. అలా మీరు కూడా జీవితానుభావంలో పండాక, ఆధారపడటంనుంచి విడివడాలి. ఒక పిల్లవాడు, 'మొదటి తరగతిలో నా టీచరు నాకు చాలా నచ్చింది. ఆవిడ ప్రేమగా ఉంటుంది, నేనంటే చాలా ఇష్టం,' అంటే టీచరును మెచ్చుకుంటున్నాడు, బాగుంది. కాని 'నేను ఇక్కడే ఉండిపోతాను,' అంటే మాత్రం, అది టీచరుకీ మంచిది కాదు, పిల్లవానికీ మంచిది కాదు. టీచర్ అంటే విద్యార్థిని స్వతంత్రంగా ఉండేలా తీర్చిదిద్దాలి. దానికి భిన్నంగా, టీచర్ తనమీదే విద్యార్థి ఆధారపడేలాగా చేస్తే, ఆ టీచర్ మంచి గురువు కాదు.

అదే సూత్రం, తండ్రికి కూడా వర్తిస్తుంది. తన పిల్లలను వారి కాళ్ళమీద వారు నిలబడేలాగా పెంచాలి. దానికి బదులుగా ఎప్పటికీ తన మాటకే వారు కట్టుబడి ఉండాలని కోరుకుంటే మాత్రం, తండ్రి పెంపకంలో లోటు ఉన్నట్టే అర్థం. తండ్రిలో ఇంకా మమకారం, సంగత్వం, రాగం పోలేదన్నమాట. అందువల్ల అన్నిరకాల సమస్యలు కలుగుతున్నాయి. దీన్ని పారద్రోలటానికే, మన ధర్మం ఆరోగ్యకరమైన పరతంత్రాన్ని నిర్దేశిస్తుంది.

మన సాంప్రదాయంలో ఒక వ్యక్తి నాలుగు దశల ఆశ్రమధర్మాన్ని పాటించాలి. మొదటి రెండూ బ్రహ్మచర్యాశ్రమం, గృహస్థాశ్రమం. వాటిలో పరతంత్రం ఎక్కువగా ఉంటుంది. వాటిల్లో కర్మలు ఉంటాయి, సంగత్వం ఉంటుంది. గృహస్థుకు కుటుంబంతో, సమాజంతో సంగత్వం ఉంటుంది.

ఈ రెండు ఆశ్రమధర్మాలనూ పాటించి, కుటుంబంమీదా, సమాజంమీదా ఆధారపడ్డాక, వారినుంచి క్రమేపీ దూరం జరగటం నేర్చుకుని, తర్వాత వానప్రస్థాశ్రమం, చివరగా సన్న్యాసాశ్రమమూ స్వీకరించాలి. ఇవి బాహ్యంగా స్వీకరించకపోయినా ఆంతరికంగా స్వీకరించాలి. సన్న్యాసం స్వీకరించటానికి భయపడుతున్నారంటే, అనారోగ్యకరమైన పరతంత్రంలో చిక్కుకుపోయినట్టు అర్థం. ఎందుకంటే మన ధర్మం ముందు ఆరోగ్యకరమైన పరతంత్రాన్ని నిర్దేశించి, నెమ్మదిగా స్వతంత్ర జీవనానికి తీసుకువెళుతుంది. మొదటిదాన్ని వేదపూర్వభాగం అనీ, రెండవదాన్ని వేదాంతభాగం అనీ అంటారు. ఆ విధంగా మొత్తం వేదం – వేదపూర్వభాగం, వేదాంతభాగం – ఒక వ్యక్తియొక్క స్వతంత్రజీవనానికి దారితీస్తుంది.

**అసతో మా సద్గమయ, తమసో మా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతం గమయ।**

– బృహదారణ్యకమ్ 1.3.28

'నన్ను చెడునుంచి మంచికి నడిపించు; చీకటినుంచి వెలుగు వైపు నడిపించు; మరణం నుంచి అమృతత్వానికి నడిపించు.'

వేదాల్లోని బోధలోని కర్మభాగమూ (వేదపూర్వభాగమూ), జ్ఞానభాగమూ (వేద అంతభాగమూ) భగవద్గీతలో సంగ్రహంగా బోధించబడింది. శంకరాచార్యులవారు తన గీతాభాష్యం ఉపోద్ఘాతంలో అంటారు,

**తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థసార సంగ్రహభూతమ్।**

శాస్త్రం అనంతంగా ఉంది; నేర్చుకోవాల్సింది చాలావుంది, సమయం చాలా తక్కువ ఉంది, ఆటంకాలు ఎన్నో వస్తుంటాయి. చాలామందికి శాస్త్రం నేర్చుకునే అధికారిత్వం లేదు. అందువల్ల శాస్త్రసారాన్ని మనకు కృష్ణపరమాత్మ భగవద్గీత రూపంలో అందించాడు.

భగవద్గీత, మహాభారతంలోని ఒక భాగం అని మీకూ తెలుసు. మహాభారతాన్ని సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారమైన వ్యాసాచార్యులవారు రచించారు.

**వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే**

భగవద్గీత సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారమైన కృష్ణపరమాత్మకూ, అర్జునునికీ మధ్య సంభాషణరూపంలో సాగింది. అందువల్ల భగవద్గీతను కృష్ణార్జునసంవాదం అంటారు. ఇందులో 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు ఉన్నాయి. అంత తక్కువ భాగంలో, మొత్తం వేదాలసారం మనకు కృష్ణార్జునసంవాదరూపంలో ఇవ్వబడింది.

మొదటి అధ్యాయంలో 47 శ్లోకాలు ఉన్నాయి. ఈ అధ్యాయాన్ని ప్రధానంగా రెండు భాగాలుగా విభజించవచ్చు.

1. సంగతి కథనం : శ్లోకాలు 1–27
2. సంసార వర్ణనం : శ్లోకాలు 28–47

**1. సంగతి కథనం: శ్లోకాలు 1–27**

సంగతి కథనం అంటే సందర్భం వివరణ. ఇక్కడ సందర్భం మహాభారతకథ. దుర్యోధనాదులతో కూడిన కౌరవులు; ధర్మపుత్రుడు, సోదరులతో కూడిన పాండవుల మధ్య జరిగిన కథ. మహాభారతకథ ద్వారా కౌరవులు అధార్మికులనీ, ఎన్నో అధార్మికమైన పనులు చేశారని వింటాము. నిజానికి, భగవద్గీతలోనే, దుర్యోధనాదులు ఆతతాయిలు అని పిలువబడ్డారు. ఆతతాయిలు అంటే ఘోరమైన పాపాలు చేసేవారు. ధర్మశాస్త్రం వారిని ఇలా నిర్వచించింది.

**అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణి ధనాపహః।**
**క్షేత్రదారాపహర్తా చ షడేతే హ్యాతతాయినః॥**

ఈ ఆరు నేరాల్లో ఏది చేసినా వారిని ఆతతాయిలు అంటుంది. అవి –

**అగ్నిదః** – ఇంకొకరి ఇంటికి నిప్పంటించటం;

**గరదః** – ఒక వ్యక్తికి విషాన్ని ఇవ్వటం;

**శస్త్రపాణిః** – చేతిలో శస్త్రం ఉందని ఇష్టం వచ్చినట్టు వాడటం;

**ధనాపహః** – ఇంకొకరి సొమ్మును దొంగలించటం;

**క్షేత్రాపహర్తా** – ఇంకొక వ్యక్తి స్థలాన్ని అపహరించటం;

**దారాపహర్తా** – ఇంకొక వ్యక్తి భార్యను అపహరించటం.

ఈ ఆరు నేరాల్లో ఒక్కటి చేసినా వారిని ఆతతాయిలు అంటారు. అలాంటిది, దుర్యోధనుని **గొప్పదనం** ఏమిటంటే అతను ఈ ఆరు పాపాలూ చేశాడు. అతను మామూలు ఆతతాయి కాదు; మహా ఆతతాయి. అతను చేసిన ఈ ఆతతాయి పనులవల్ల పాండవులు వనవాసం,

అజ్ఞాతవాసం చేయాల్సి వచ్చింది. అదయ్యాక కూడా వారికి హక్కు ఉన్న రాజ్యాన్ని వారు తిరిగి పొందలేకపోయారు. దుర్యోధనుడు వారికి సూదిమొన మోపేంత రాజ్యం కూడా ఇవ్వనని ఖరాఖండిగా చెప్పేశాడు.

దుర్యోధనుడు మహా ఆతతాయి అయితే, పాండవులు ధర్మాత్ములు. పాండవ ప్రథముడు అయిన ధర్మపుత్రుడు, ధర్మదేవత అంశం. వారు **అహింసా పరమో ధర్మః** సూత్రాన్ని అక్షరాలా పాటిస్తారు. అందువల్ల వెంటనే కౌరవులమీద కయ్యానికి కాలు దువ్వలేదు. న్యాయంకోసం సామ, దాన, భేదమార్గాలను ప్రయోగించి చూశారు. ఇవన్నీ యుద్ధాన్ని నివారించటానికి చేశారు. చివరికి కృష్ణపరమాత్మనే రాయబారానికి పంపించారు. కాని దుర్యోధనుడు కొంచెం కూడా మారలేదు. ఒక వ్యక్తి సామదానభేద మార్గాలకు లొంగకపోతే, అతనిమీద చివరి ఉపాయమైన దండోపయాన్ని ప్రయోగించవచ్చు అని శాస్త్రమే బోధిస్తుంది. దండం అంటే హింస లేదా శిక్షించటం. అందువల్ల అహింస ఆత్యంతిక విలువ కాదు. కొన్ని సందర్భాలలో అహింసను పాటించలేము.

దండనను పాటించవచ్చు కాని దానికి రెండు నియమాలు ఉన్నాయి. ఒకటి సామదానభేద ఉపాయాలు వాడి, వాటివల్ల ప్రయోజనం లేకపోతేనే ఉపయోగించాలి. రెండవ నియమం, దండోపాయాన్ని క్షత్రియుడు లేదా రాజు మాత్రమే ఉపయోగించాలి అంటుంది శాస్త్రం. అంటే బ్రాహ్మణుడు, వైశ్యుడు లేదా శూద్రుడు ఎవరినీ హింసించకూడదు. క్షత్రియునికి మాత్రమే ఎవరినైనా హింసించే హక్కు ఉంది, అది కూడా పై మార్గాలు విఫలమైతేనే.

పాపం పాండవులు చాలానే ఓపిక వహించారు. అన్ని మార్గాలూ విఫలమయ్యాక, ఇంక తప్పనిసరి పరిస్థితుల్లో యుద్ధమొక్కటే పరిష్కారం అని నిర్ణయించుకున్నారు. ఆ యుద్ధం కూడా **పాపం** కాదనీ, అది **ధర్మయుద్ధమనీ** వారందరికీ తెలుసు. అందువల్ల యుద్ధానికి ఒక రోజుని నిర్ణయించుకున్నారు. వారు నిర్ణయించుకున్న శుభముహూర్తం రానే వచ్చింది. ఇరుపక్షాల సైన్యాలు వారి రాజులతో కురుక్షేత్ర రణరంగంలో బారులు తీర్చి నిలబడ్డారు. ఈ సందర్భంలో, భగవద్గీత మొదలవుతుంది.

దుర్యోధనుడు ఇరువైపుల సైన్యబలగాన్నంతా సమీక్షించి, తన గురువైన ద్రోణాచార్యునికి ఇరుపక్షాల యోధుల గురించి చెబుతున్నాడు. నిజానికి వారి బలాబలాలు బేరీజు వేస్తే, ఎటువైపూ మొగ్గు చూపకుండా, బాహ్యంగా నిల్చుని చూస్తే, కౌరవుల సైన్యమే అత్యంత శక్తివంతమైనదని తేలికగా చెప్పవచ్చు. కౌరవుల సైన్యం 11 అక్షౌహిణులు ఉంటే, పాండవుల సైన్యం 7 అక్షౌహిణులు మాత్రమే ఉంది. బలపరీక్షలో కూడా కౌరవులదే అగ్రస్థానం ఉంటుంది. కాని ఆశ్చర్యకరంగా దుర్యోధనుడు మానసిక స్థైర్యం కోల్పోయినట్టుగా చూస్తాము.

**అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**
**పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥** – 1.10

'భీష్మపితామహుడే మన సైన్యాన్ని రక్షిస్తున్నా కూడా మన శక్తి చాలదు. అటు సేన కేవలం భీమునిచేత రక్షింపబడతున్నా కూడా, అది శక్తివంతమైనది.'

ఈ వాక్యం ద్వారా వ్యాసాచార్యులవారు ఒక ముఖ్యమైన సూత్రాన్ని అందజేస్తున్నారు. ఒక మనిషికి ఎంతైనా ఐశ్వర్యం ఉండనీగాక, ఎంతైనా హోదా ఉండనీగాక, అతని వైపు ధర్మం లేకపోతే అతనికి భద్రత లభించదు. అందువల్లనే **ధర్మో రక్షతి రక్షితః** అంటారు. ధర్మం అతని వైపు లేకపోతే ఆస్తి, అంతస్తు ఏమీ అతన్ని కాపాడలేవు. అందువల్లనే దుర్యోధనునిలో ఆత్మస్థైర్యం కొరవడింది.

దానికి భిన్నంగా పాండవులకు ధర్మం వారివైపు ఉంది. దానికి నిదర్శనం కృష్ణపరమాత్మ వారివైపు ఉండటమే. భగవద్గీతలోనే కృష్ణపరమాత్మను ధర్మానికీ, ధర్మం ఇచ్చే రక్షణకూ ప్రతీకగా చూస్తాము.

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః** – 18.78

అందువల్ల పాండవులు ఎన్నడూ అభద్రతాభావనకు లోనుకాలేదు. వారు చాలా ఉత్సాహంగా ఉన్నారు.

భీష్మాచార్యులు దుర్యోధనుడు ఉన్న నిస్సహాయస్థితిని చూసి, అతనిలో ఉత్సాహాన్ని ప్రేరేపించాలని నిర్ణయించుకున్నాడు. అందువల్ల అత్యంత శక్తివంతమైన తన శంఖాన్ని పూరించాడు. శబ్దం భయాన్ని పారద్రోలుతుంది. అందువల్లనే భద్రతాభావన లేనివారు ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటారు. ఎవరూ దొరకకపోతే, ఫోనులోనైనా మాట్లాడతారు. ఒంటరిగా ఉండలేరు. తమను తాము ఎదుర్కోలేరు. అందువల్ల మాట్లాడాలి. శబ్దం ఈ భయంకరమైన భయాన్ని పారద్రోలే గొప్ప పద్ధతి. భీష్మాచార్యునికి ఆ విషయం తెలుసు. దుర్యోధనుణ్ణి ఉత్సాహపరచటానికే కాదు, యుద్ధాన్ని ప్రారంభించటానికి సూచనగా తన శంఖాన్ని పూరించాడు.

కురువృద్ధుడు, పితామహుడు అయిన భీష్మాచార్యుడు తన శంఖాన్ని పూరించగానే, తక్కిన కౌరవయోధులు కూడా వారి శంఖాలను పూరించారు. వారితో పాటు పాండవులు కూడా, కృష్ణపరమాత్మతో మొదలుకుని వారివారి శంఖాలను పూరించారు. ఆ విధంగా ఇరుసైన్యాలూ యుద్ధానికి సంసిద్ధులుగా ఉన్నారు. సమయం అనువుగా ఉంది. బాణాలు దూసుకు రావాలి. కాని చివరి నిముషంలో అర్జునుని మనస్సులో మెరుపులా ఒక ఆలోచన మెరిసింది. ఈ మెరుపు లాంటి ఆలోచనే గొప్ప గ్రంథానికి దారితీసింది. అర్జునుడు అలా కోరకపోయి ఉంటే, భగవద్గీతను మనం నేర్చుకునే అవకాశం వచ్చివుండేది కాదు. అర్జునునికి

శత్రుసైన్యంలో బారులు తీరి ముందు నిలుచున్నవారిని చూడాలనిపించింది. యుద్ధంలో తను సంహరించబోయే వారెవరో చూడాలనుకున్నాడు. ఇది కుటుంబ కలహం, అందువల్ల బంధువులు ఉంటారని తెలుసు. అయినా కృష్ణపరమాత్మను ఆదేశించాడు –

**సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥**
**యావదేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్ ।**
**కైర్మయా సహ యోద్ధవ్యమ్ అస్మిన్ రణసముద్యమే ॥** – 1.21, 22

'ఓ అచ్యుతా! నా రథాన్ని రెండు సైన్యాల మధ్య నిలబెట్టు. నేను యుద్ధాభిలాషులై నిలిచివున్న ప్రతిపక్ష యోధులందరినీ చూడాలి. వారిలో నేను ఎవరితో యుద్ధం చేయాలో చూడాలి.'

కృష్ణపరమాత్మ అర్జునుడు కోరినట్టుగా రథాన్ని ఇరుసేనల మధ్య నిలిపాడు. రథసారథిగా అర్జునుని కోరికను నెరవేర్చాడు. అలా నెరవేర్చినట్టు చేసినా, కృష్ణపరమాత్మ తన లీలను ప్రదర్శించాడు. తీసుకువెళ్ళి భీష్మద్రోణుల ముందు నిలబెట్టాడు. ఆ రథాన్ని తీసుకువెళ్ళి కర్ణుడు లేదా దుర్యోధనుల ముందు నిలబెట్టివుంటే, వెంటనే మహాభారతయుద్ధం జరిగి ఉండేది. కాని అర్జునుడు భీష్మ, ద్రోణుల ముఖాలను చూశాడు.

అర్జునుని సమస్య **సర్వం పరవశం దుఃఖమ్**. అర్జునునికి భీష్మ, ద్రోణులమీద అంతులేని మమకారం ఉంది. వారితోనే తన ఆనందాన్ని వెతుక్కుంటాడు. ఇది ఈ అధ్యాయంలోని రెండవ భాగానికి దారితీస్తుంది. ఇక్కడనుంచీ అర్జునుని మనస్సు ఘర్షణకు లోనవుతుంది. అంతవరకూ అర్జునుని బుద్ధి బాగానే పనిచేస్తున్నది. అతనికి పరిస్థితి స్పష్టంగా తెలుసు. బంధుత్వంకన్నా, ధర్మానికి ప్రాముఖ్యతనివ్వాలనీ, దుర్యోధనాదులు అధర్మానికి పాలుపడ్డారనీ తెలుసు. అందువల్ల ఇది ధర్మానికీ, అధర్మానికీ మధ్య పోరాటం. బంధువుల మధ్య యుద్ధం కాదు. ఇవన్నీ తెలుసు, సంగత్వం లేకుండా, మమకారం లేకుండా ఉన్నాడు ఇప్పటిదాకా. కాని ఎప్పుడైతే భీష్మ, ద్రోణులను చూశాడో, అప్పుడే పరిస్థితి మారిపోయింది. ఇది మనను రెండవ అంశంలోకి తీసుకువెళుతుంది.

2. **సంసార వర్ణనం: శ్లోకాలు 27–47**

**కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్** 1.28

అర్జునుడు బంధంలో కూరుకుపోయి, శోకంతో ఇలా అన్నాడు. అర్జునునిలో పూర్తి మార్పు చూస్తాము. కోపంతో ఎగసిపడే అర్జునుడు, శోకంతో కృంగిపోతాడు. బుద్ధి ప్రధానంగా ఉన్న అర్జునుడు మనస్సు చేసే గారడీకి లొంగిపోతున్నాడు.

పరతంత్రంవల్ల ఏర్పడిన ఈ సంసారాన్ని వ్యాసాచార్యులవారు మూడు సాంకేతిక పదజాలాలతో నిర్వచిస్తున్నారు. అవి – **రాగం,శోకం,మోహం.**

1. **కృపయావిష్టః** – ఇక్కడ కృప అంటే **రాగం**, ఆధారపడటం. తన సుఖంకోసం, భద్రతకోసం, ఆనందంకోసం ఇంకొక వ్యక్తిమీద ఆధారపడటం. భీష్మ, ద్రోణులమీద అర్జునుని రాగం మామూలు రాగం కాదు, పరయా కృపయా ఆవిష్టః. అది తీవ్రమైన మమకారం.

తీవ్రమైన రాగం శోకానికి దారితీస్తుంది. రాగం ఎంత తీవ్రంగా ఉంటే, శోకం కూడా అంత తీవ్రంగా ఉంటుంది. అందువల్లనే చూడండి, ఒక కుటుంబంలో ఒక వ్యక్తి మరణిస్తే, అందరి స్పందన, ఒక్కలాగే ఉండదు. ఒక్కొక్కరూ ఒక్కొక్కలాగా ప్రవర్తిస్తారు. వార్తాపత్రికలో ఎవరిదైనా మరణవార్త చూస్తే, అసలు స్పందించరు కొంతమంది.

మరణం దుఃఖహేతువు అనగలమా? మరణమే దుఃఖహేతువు అయితే, అందరికీ శోకం సమానంగా ఉండాలిగా! ఎంత మహానుభావులు పోయినా, కొందరిలో శోకం ఉండదు. అందువల్ల శోకం వస్తువులో లేదు. మరణం శోకకారణం కాదు. ఆ వస్తువు లేదా వ్యక్తిమీద మీకున్న రాగాన్నిబట్టి, వారిమీద మీరు భావపరంగా ఆధారపడినదాన్నిబట్టి, మీకు శోకం కలుగుతుంది అంటారు వ్యాసాచార్యులవారు.

ఆ మాటకొస్తే మనకు భీష్మద్రోణులమీద ఏ విధమైన రాగమూ ఉండకపోవచ్చు కాని అర్జునునికి ఉంది. భీష్మపితామహుడు అర్జునుని ఆలనా, పాలనా చూసివుండవచ్చు. తన ఒళ్లో కూర్చోపెట్టుకుని, కథలు వినిపించి ఉండవచ్చు. అతని రాగం తీవ్రంగా ఉంది కాబట్టి, శోకం కూడా తీవ్రంగానే ఉంటుంది. తమాషా ఏమిటంటే, భీష్మపితామహుడు ఇంకా మరణించలేదు. జీవించే ఉన్నాడు, తన కళ్ళ ఎదురుగానే ఉన్నాడు. భీష్ముడు చనిపోతాడనే ఆలోచననే (ఊహనే) భరించలేకపోతే, నిజంగా భీష్ముడు మరణిస్తే, అతని శోకం ఇంకెంత ఎక్కువగా ఉంటుందో ఒక్కసారి ఆలోచించి చూడండి. దీనికంతటికీ కారణం తీవ్రమైన రాగం.

అందువల్ల ఇక్కడ కృప అంటే జాలిగా తీసుకోకూడదు. ఇక్కడ కృప అంటే రాగం. రాగం వేరు ప్రేమ వేరు. రాగం ఉండకూడదు అంటే ఎవరినీ ప్రేమించకూడదని కాదు అర్థం. ప్రేమ సానుకూల విలువ. నిజానికి భగవద్గీతలో కృష్ణపరమాత్మ జ్ఞానిని మూర్తీభవించిన ప్రేమస్వరూపంగా వర్ణిస్తాడు. రాగం–ప్రేమల మధ్య వ్యత్యాసాలు –

ఎ) **స్వార్థం–నిస్వార్థం** – రాగం బంధకత్వంతో కూడినది. అంటే అతనివల్ల నాకేమిటి లాభం అని చూస్తాను. కాని ప్రేమ విషయంలో ఒక వ్యక్తిని నేను ప్రేమిస్తే అతని ఆనందానికి ప్రాముఖ్యతనిస్తాను.

బి) **తీసుకోవటం–పుచ్చుకోవటం** – రాగంలో నేను ఏం పొందుతాను అని ఆలోచిస్తే, ప్రేమలో ఏం ఇవ్వగలను అని చూస్తాను.

సి) **షరతులతో కూడినది–బేషరతుగా ఉంటుంది** – నాకు ఆనందం కలుగుతున్నంతసేపే ఆ అనుబంధాన్ని కొనసాగిస్తాను రాగంలో. ప్రేమలో ఎదుటి వ్యక్తి నాకు తగ్గట్టుగా లేకపోయినా ప్రేమిస్తాను.

డి) **బలహీన మనస్సు–బలమైన మనస్సు** – రాగం బలహీనమైన మనస్సులో పుడుతుంది. ప్రేమ బలమైన మనస్సునుంచి పుడుతుంది.

ఇ) **అధార్మికం–ధార్మికం** – రాగంలో బుద్ధి కప్పబడిపోతుంది. ప్రేమలో బుద్ధి బాగానే పనిచేస్తుంది.

ఈ విధంగా రాగం సంసారంయొక్క ప్రాథమిక రోగం. దీన్ని కృప అన్నారు వ్యాసాచార్యులవారు. ఆవిష్ట – అర్జునుడు ఈ రాగానికి బానిస అయ్యాడు.

2. **విషీదన్నిదమబ్రవీత్** – కృపయొక్క తక్షణ పరిణామం – విషీదన్నిదమబ్రవీత్. విషాదం అంటే **శోకం**. అందువల్లనే ఈ అధ్యాయానికి **అర్జున విషాదయోగం** అని పేరు వచ్చింది.

దీన్నిబట్టి వ్యాసాచార్యులవారు, విషాదం రాగంవల్లనే ఏర్పడుతుందని అన్నారని అర్థమవుతున్నది. ఏ వస్తువుమీద రాగం ఉంటుందనేది మనిషి మనిషికీ మారుతుంది కాని, రాగసమస్య అందరికీ సమానమే. అర్జునుని శోకం ఎంత తీవ్రంగా ఉంది? అది ఎంత తీవ్రంగా ఉందంటే, అది మనస్సునుంచి శరీరానికి కూడా పాకింది అంటున్నారు వ్యాసాచార్యులవారు. శోకం తీవ్రరూపం దాల్చకపోతే, మనస్సుకే పరిమితమవుతుంది; శరీరానికి తెలియదు. కాని తీవ్రరూపం దాలిస్తేనే శరీరానికి కూడా పాకుతుంది.

**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥** – 1.29

'నా చేతులు, కాళ్ళు వణుకుతున్నాయి; నోరు ఎండిపోతోంది; శరీరం వణికిపోతోంది; రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి.'

మనస్సు శోకంతో నిండినప్పుడు శారీరక అనారోగ్యం కూడా కలుగుతుంది. ఎక్కడ **రాగం** ఉంటే అక్కడ విషాదం ఉంటుంది.

ఈ విధంగా శోకం సంసారంయొక్క రెండవ రోగం.

3. **పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః** – ఎప్పుడైతే శోకం చోటు చేసుకుంటుందో, అప్పుడే అది మోహానికి దారితీస్తుంది. **మోహం** అంటే ధర్మ–అధర్మ అవివేకం. దీనివల్ల తప్పుడు నిర్ణయం తీసుకుంటారు. బుద్ధిని భావోద్రేకం కప్పివేస్తే, బుద్ధి సరిగ్గా పనిచేయదు. అందువల్లనే మనం కోపంలో ఉండగా, ఏం చేస్తున్నామో మనకే తెలియదు. కోపంతో ఎంతమాట పడితే అంతమాట అనేస్తాము. ఎందుకంటే బుద్ధిని మోహం కప్పివేస్తుంది.

అప్పుడు ధర్మం అధర్మంగా, అధర్మం ధర్మంగా కనిపిస్తుంది. అర్జునుణ్ణి మోహం ఎలా కప్పిందో అర్థం చేసుకోవటానికి ఈ వాక్యం గొప్ప ఉదాహరణ.

**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః** – 1.36

'వారు ఆతతాయులు అవుతే అవుగాక, వారిని చంపితే మనం పాపం మూట గట్టుకుంటాము,' అంటున్నాడు అర్జునుడు.

ఆతతాయులంటే ముందు చెప్పిన ఆరు పాపాలలో ఏదైనా ఒక్కటన్నా చేసినవారు. దుర్యోధనుడు మహా ఆతతాయి. ధర్మశాస్త్రం ప్రకారం ఇటువంటి ఆతతాయిలకు ఉరిశిక్ష దండన. అటువంటివారిని విచారణ కూడా చేయకుండా దండించాలి. అటువంటి వారిని చంపటం క్షత్రియధర్మం. అందువల్ల ఆతతాయులను తను చంపితే, అతనికి ఏదైనా ఫలం రావాలంటే, పుణ్యం వస్తుంది కాని పాపం రాదు. ఒకపక్క వారు ఆతతాయులని అర్జునుడే అంటున్నాడు. వారు ఆతతాయిలని తెలుసు, వారిని చంపాలని తెలుసు. అయినా ఈ మాట అంటున్నాడూ అంటే అతని బుద్ధిని మోహం ఎలా కప్పేసిందో చూడండి. ఇది మోహం మొదలయింది అని చెప్పటానికి సూచన. ఈ మూడూ – రాగం, శోకం, మోహం– కలిసి సంసారం అంటారు.

ఒక విషయం గుర్తుపెట్టుకోండి, ఈ సమస్య కేవలం అర్జునునిది మాత్రమే కాదు; ఒక్క అర్జునునిదే అయితే, ఇవాళ మనం నేర్చుకోవటంలో అర్థంలేదు. అర్జునుని సమస్యతో మనకేం పని, మనమెందుకు భగవద్గీత నేర్చుకోవాలి అంటాము. కాని గుర్తుంచుకోండి – గీత ఇంత ప్రఖ్యాతి ఎందుకు చెందింది అంటే, అర్జునుడు మొత్తం మానవజాతికి ప్రతీకగా నిలిచాడు. ఇది సర్వజనీన సమస్య. మనిషిని ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా రాగ, శోక, మోహాలు చుట్టుముట్టుతూనే ఉంటాయి.

ఒకసారి మీ జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే, మీరు ఒక బంధంనుంచి ఇంకొక బంధంలోకి ప్రయాణిస్తూనే ఉండివుంటారు. ఎవరిమీదో రాగం పెంచుకుంటారు. ఆ వ్యక్తి మిమ్మల్ని వదిలి వెళ్ళిపోవటమో లేదా మరణించటమో సంభవించింది. ఆ వ్యక్తి లేని లోటును తీర్చుకోవటానికి, ఇంకెవరిమీదో రాగం పెంచుకుంటారు. ఇదెలాగుంటుంది అంటే, పొగాకు నమిలే అలవాటు ఉన్న వ్యక్తి, పొగాకును మానటానికి జూదంలోకి దిగుతాడు; జూదం మానటానికి గుర్రప్పందాలలోకి దిగుతాడు.

ఇదంతా ఎందుకు జరుగుతున్నది? మీ సమస్యకు కారణమేమిటో గ్రహించకపోవటంవల్ల. మీ సమస్య పరతంత్రం. అది తెలియక ఒకదానిమీద ఆధారపడటంనుంచి ఇంకొక దానిమీద ఆధారపడటం చేస్తున్నారు. దానివల్ల జీవితం ఏమీ మెరుగవదు. చిన్నప్పుడు ఏ బెలూనో, ఏ గోళీనో పోతే ఏడ్చివుంటారు. ఇప్పుడు, దానికోసం ఏడవరు కాని, ఏ టీవీనో పనిచేయకపోతే

బాధపడతారు. అంటే శోకానికి కారణం మారింది, బాధకు కారణం మారింది కాని, శోకం, బాధ మాయమవలేదు. దీన్నే అయోమయపుటాలోచన అంటారు. ఈ బంధంలో చివరి శ్వాస వదిలేవరకూ కూరుకుపోతారు.

మీ ఎదుగుదల బంధంనుంచి బంధవిముక్తికి కాదు, ఒకరకం బంధకత్వంనుంచి ఇంకొకరకం బంధకత్వం వైపుకు. పెనంమీంచి పొయ్యిలో పడ్డట్టు ఉంది అని సామెత. అది నిజం అయి కూర్చుంటుంది. అర్జునుడు ఈ సంసారాన్ని తీవ్రంగా అనుభవిస్తున్నాడు. అందువల్లనే యుద్ధం చేయకూడదని నిర్ణయించుకున్నాడు.

**ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।**
**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥** – 1.47

'ఈ విధంగా పలికి, శోకంతో కలత చెందిన మనస్సుగల అర్జునుడు తన ధనుర్బాణాలను పక్కన పడేసి, రథంలో చతికిలబడ్డాడు.'

ఈ విధంగా రాగం, శోకం, మోహాలలో పడిపోయిన అర్జునుడు, తను యుద్ధం చేయబోవటం లేదని తీర్మానించుకుని, అస్త్రశస్త్రాలను వదిలివేసి, రథంలో చతికిలబడ్డాడు అని సంజయుడు చెప్పటంతో ఈ అధ్యాయం ముగుస్తుంది.

ఇవీ ఈ అధ్యాయంయొక్క సందర్భం, ఇందులో ఉన్న సమస్య. ఈ రెండూ అర్థం చేసుకున్నాక, ఇంక మనం కథ లోతుల్లోకి వెళ్ళకూడదు. ఎందుకంటే, మొదటి అధ్యాయం చదవగానే, సాధారణంగా అందరికీ వచ్చే సందేహం ఒకటే. 'కృష్ణార్జునసంవాదం పద్దెనిమిది అధ్యాయాలకు సాగితే, అది కనీసం పారాయణం చేయటానికే మూడుగంటలు పడుతుంది– అన్ని గంటలు శత్రుసైనికులు మాటా పలుకూ లేకుండా ఎలా కూర్చున్నారు? అసలు అలా యుద్ధభూమిలో ఆధ్యాత్మికబోధ జరగటానికి ఎలా కుదురుతుంది? కొంతమందైతే అర్జునుడు చరిత్రలో నిజంగా ఉన్నాడా, ఇది కాల్పనిక పాత్రా అని అడుగుతారు. ఇప్పుడు కురుక్షేత్రం అని పేరున్న ఊర్లోనే జరిగిందా, లేకపోతే దానికి పదిహేను మైళ్ళ దూరంలో ఎక్కడన్నా జరిగిందా? అసలు బోధను వదిలేసి ఈ సందేహాలలో మునిగి తేలుతుంటారు చాలామంది.

నిజానికి శంకరాచార్యులవారు మొదటి అధ్యాయానికి భాష్యం రాయనేలేదు. శంకరాచార్యులవారు ఈ కథాభాగాన్ని పట్టించుకోలేదు. మహాభారతం నిజంగా జరిగిందా, లేదా అనవసరం శంకరులవారి దృష్టిలో. అది నమ్మితే నమ్మండి, లేకపోతే వదిలేయండి. కృష్ణపరమాత్మ నిజంగా ఉన్నాడా, మహాభారతయుద్ధం 3102 బి.సి.లో జరిగిందా, 5000 బి.సి.లో జరిగిందా, ఇవి అనవసరం. కథలోని సారాంశం తీసుకోండి చాలు. కథలోని సారాంశం ఏమిటి?

అర్జునుడు సంసారసమస్యలో చిక్కుకున్నాడు. తను సంసారంలో పడ్డాడని తనే గ్రహించుకున్నాడు. తన సమస్యను తనే గ్రహించుకుని, దానికి పరిష్కారమార్గంకోసం చూశాడు.

అదే విధంగా, మీరు కూడా మీ సమస్యను గుర్తించాలి. మీ సంసారకారణం మీరు ఇతరులమీద ఆధారపడటం అని అర్థం చేసుకోవాలి. సమస్య మీ భార్యతోనో, మీ ఇరుగు పొరుగుతోనో, మీ చుట్టూ ఉన్న సమాజంతోనో, ప్రభుత్వంతోనో లేదు. మీకు ఎప్పుడైనా శోకం ఏర్పడితే, దానికి కారణం వారి ప్రవర్తనమీద మీ ఆనందం ఉందని మీరు భావించటమే అని గ్రహించాలి. వారు చేసే పనులవల్ల మీకు ఆనందం వస్తుందనుకోవటం పొరపాటు. మీవల్లనే మీకు సమస్య వస్తోందని గ్రహిస్తే, మీ సమస్యకు కారణం ప్రపంచం కాదని అర్థం చేసుకుంటారు. స్వామీ దయానంద అద్భుతంగా చెబుతారు, 'సమస్య నువ్వే, పరిష్కారమూ నువ్వే.'

అందువల్ల మొదటి అధ్యాయం ఉద్దేశ్యం సంసారవర్ణనం. సంసారం అంటే రాగం, శోకం, మోహం అని చూశాము. తను సంసారంలో పడ్డాడు అని అర్జునుడు గ్రహించుకున్నా, కృష్ణపరమాత్మ ఇంకా నోరు విప్పలేదు. అర్జునుని సమస్యకు జవాబు తెలిసినా ముందుకు రాలేదు. నిశ్శబ్దంగా ఉండిపోయాడు. కృష్ణపరమాత్మ సాక్షాత్తూ భగవంతుడు, మనిషిలాగా బందీ కాడు. తానే బందీ అయినవాడు, ఇంకొకరిని బంధవిముక్తుణ్ణి చేయలేడు. ఇద్దరూ అవస్థ పడతారు, దాన్నుంచి బయటపడలేరు. తలుచుకుంటే, కృష్ణపరమాత్మ అతన్ని బంధవిముక్తుణ్ణి చేయగలడు కాని ఇంకా ముందుకు రాలేదు. ఎందుకంటే శాస్త్రంలో ఒక సూత్రం ఉంది. ఎదుటివ్యక్తి సలహా అడగందే, అతనికి సలహా ఇవ్వకూడదు. ఎదుటి వ్యక్తి కోరకుండానే మీరు సలహా ఇస్తూపోతే, మీ గౌరవాన్ని, మీ విలువను పోగొట్టుకున్నవారు అవుతారు. అది చెవిటివాని ముందు శంఖం ఊదినట్టు అవుతుంది.

**నాపృష్టః కస్యచిత్ బ్రూయాత్ న చాన్యాయేన పృచ్ఛతః।**
**జానన్నపి హి మేధావీ జడవత్ లోక ఆచరేత్॥** – మనుస్మృతి 2.110

'ఎదుటివ్యక్తి సలహా కోరందే, అది కూడా మనస్ఫూర్తిగా కోరందే తెలివైన వ్యక్తి సలహా ఇవ్వకూడదు. మీరు తెలివైనవారైనా కూడా మూగవానిగా ప్రవర్తించాలి.'

ఎదుటివారు మిమ్మల్ని అడగందే, మీరు సలహా ఇచ్చి మీ గౌరవాన్ని పోగొట్టుకోకండి అంటున్నది మనుస్మృతి. కాని ప్రతి నియమానికి కొన్ని ఉల్లంఘనలు ఉంటాయి. మీ పిల్లల విషయంలో వారు స్వయంగా నిర్ణయం తీసుకునే స్థాయికి ఎదిగేదాకా, వారికి మీరు సలహాలు ఇవ్వవచ్చు. అదికూడా కొన్నాళ్ళవరకే, ఏ పదహారేళ్ళవరకో అనుకోండి.

**రాజవత్ పంచవర్షాణి దశవర్షాణి దాసవత్‌**
**ప్రాప్తే తు షోడశే వర్షే పుత్రం మిత్రవదాచరేత్‌॥**

పిల్లవానికి పదహారేళ్ళు వచ్చేవరకూ అతనికి సలహా ఇవ్వవచ్చు. దాని తర్వాత అతన్ని మిత్రునిలాగా చూడాలి. మహా అయితే, మిత్రునికి ఇచ్చినట్టు సలహా ఇవ్వాలి.

ఒక తండ్రి, తన కొడుకుతో మర్యాదగా ఇలా అన్నాడు, 'నీతో కొంత చర్చించాలి. రాత్రి నా గదిలోకి రా.' తండ్రి ఉద్దేశ్యంలో చర్చించటం అంటే సలహా ఇవ్వటం. కాని దాన్ని కొడుకు, తండ్రి సలహా ఇచ్చే బదులు ఎదురు తననే అడగటానికి పిలిచాడనుకున్నాడు. రాత్రి తండ్రి గదిలోకి వెళ్ళి, 'చెప్పండి నాన్నా, ఏ విషయంలో మీకు సందేహం ఉంది?' అన్నాడు. కొడుకు ఉద్దేశ్యంలో తండ్రికి చాలా తెలియదు, తనకే బాగా తెలుసు. ఇప్పటి పిల్లలు అలా ఉన్నారు. వారే తండ్రికి సలహా ఇచ్చే పరిస్థితిలో ఉన్నారు. కొంతమంది పిల్లలైతే, స్వామీజీ దగ్గరికే వెళ్ళి, 'స్వామీజీ, మా నాన్న నేను చెబితే వినటంలేదు, మీరు చెబితే వింటారు; మీరు సలహా ఇవ్వండి,' అంటారు. అందువల్ల ఎదుటివారు సలహా తీసుకోవటానికి సిద్ధంగా లేకపోతే, మీరు ఇవ్వకూడదు. ఈ చిన్ని సూత్రాన్ని కృష్ణపరమాత్మనుంచి నేర్చుకోవాలి అందరూ.

మొదటి అధ్యాయంలో అర్జునుడు తన సమస్యను కనుగొన్నాడు కాని తన సమస్యను తనే పరిష్కరించుకోగలను అనుకున్నాడు. అందువల్ల కృష్ణపరమాత్మను ఇంకా సలహా అడగలేదు. బోధ చేయమనలేదు. కృష్ణపరమాత్మ కూడా, అర్జునుని సమస్యకు తన దగ్గర పరిష్కారం ఉన్నా, అనువైన సమయంకోసం వేచివున్నాడు. అందువల్లనే కృష్ణపరమాత్మ బోధ మొదటి అధ్యాయంలోనే మొదలవలేదు. మొదటి అధ్యాయం సమస్యను కనుగొనటంతో ముగిసింది.

రెండవ అధ్యాయంలో, మొదటి పది శ్లోకాల్లో అర్జునుని ఆలోచనాశైలిలో మార్పు రావటం గమనిస్తాము. అర్జునునికి బోధ మొదలయ్యేముందు, అతను ఇంకో రెండు దశలు దాటాలి. సంసారదుఃఖాన్ని అనుభవించాడు మొదటి అధ్యాయంలో. దాని తరువాత రెండవ దశలో తన నిస్సహాయతను గుర్తిస్తాడు. మూడవదశలో కృష్ణపరమాత్మను శరణు వేడతాడు. నిస్సహాయతను కార్పణ్య–దైన్య–భావన అంటారు. దీననాథా, దీనబంధో అని భగవంతుణ్ణి పిలుస్తాము. ఇలా నిస్సహాయస్థితిని గుర్తిస్తేనే, భగవంతుణ్ణి శరణు వేడుతాము.

తను బంధంలో కూరుకుపోతున్నానని గ్రహిస్తే, గురువు పాదాలను పట్టుకోవాలి. ఆ గురువు బంధవిముక్తుడై ఉండాలి. కాని అటువంటి గురువెలా తెలుస్తాడు? ప్రకటనలివ్వాలా ఆయనకోసం అంటే శాస్త్రం అవసరం లేదు అంటుంది. మీరు బోధ స్వీకరించే స్థితిలో ఉంటే, అంటే మీ సమస్యను మీరు కనుగొని, మనస్ఫూర్తిగా

శరణు వేడితే, గురువే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాడు. అది భగవానుని న్యాయం. ఎవరో గురువు, ఎలాగో వస్తాడు. అర్జునునికి కూడా గురువు వచ్చాడు. ఆ గురువు తన కళ్ళ ఎదురుగానే ఉన్నాడు. అది గ్రహించిన అర్జునుడు, కృష్ణపరమాత్మను శరణు వేడాడు. ఆ సమయం గీతాశాస్త్ర ఆవిష్కరణకు నాందీ పలికింది.

మొదటి అధ్యాయాన్ని టూకీగా చెప్పాలంటే రెండు అంశాలు ఉన్నాయి ఇందులో. అవి **సంగతి కథనం; సంసారవర్ణనం**.

# సాంఖ్యయోగము

## అధ్యాయము 2

భగవద్గీతలోని రెండవ అధ్యాయం, పద్దెనిమిదవ అధ్యాయాలను చాలా ముఖ్యమైన అధ్యాయాలుగా చెప్పవచ్చు. ఎందుకంటే, ఈ రెండింటిలోనూ గీతాసారం మొత్తం వస్తుంది. సారాన్ని సంగ్రహం అని కూడా అనవచ్చు. మీమాంసా శాస్త్రం ప్రకారం, ఒక గురువు తను చేయబోయే బోధయొక్క సారాన్ని ముందే చెప్పాలి. దీన్ని **ఉపక్రమ సంగ్రహం** లేదా **సంక్షేపం** అంటారు. అదేవిధంగా తన బోధ ముగించేముందు, తను అంతవరకూ బోధించిన దాని సారాన్ని మళ్ళీ చెప్పాలి. అప్పుడు దాన్ని **ఉపసంహార సంక్షేపం** అంటారు.

భగవద్గీతలోని రెండవ అధ్యాయం **ఉపక్రమ సంక్షేపం** అయితే, పద్దెనిమిదవ అధ్యాయం **ఉపసంహార సంక్షేపం** అవుతుంది. రెండవ అధ్యాయంలో 72 శ్లోకాలు ఉంటే, పద్దెనిమిదవ అధ్యాయంలో 78 శ్లోకాలు ఉన్నాయి. మధ్యలో వచ్చిన పదిహేను అధ్యాయాల సారమే ఈ రెండు అధ్యాయాలూ.

రెండవ అధ్యాయాన్ని ప్రధానంగా నాలుగు అంశాలుగా విభజించవచ్చు.

1. అర్జున శరణాగతి : శ్లోకాలు 1–10
2. జ్ఞానయోగం : శ్లోకాలు 11–38
3. కర్మయోగం : శ్లోకాలు 39–53
4. మోక్షం : శ్లోకాలు 54–72

(సాధకుని ప్రయాణ దశలు అర్థంకావటంకోసం, కర్మయోగం గురించి ముందు చెప్పటం జరిగింది.)

**1. అర్జున శరణాగతి : శ్లోకాలు 1–10–** గీతాబోధనుంచి పూర్తి ప్రయోజనం పొందాలంటే మీరు మూడు దశలు దాటివుండాలి. అప్పుడే దాని ప్రభావం మీమీద పడుతుంది. ఏమిటా మూడు దశలు? సంసారదర్శనం, కార్పణ్యభావన, శరణాగతి.

ఎ) **సంసారదర్శనం** – నాకు సంసారమనే భవరోగం ఉందని అర్థం చేసుకోవాలి ముందు. చాలామంది 'నేను చాలా హాయిగా ఉన్నాను,' అనుకుంటారు. మీకు ఏదైనా అనారోగ్యం ఉందనుకుంటేనే కదా వైద్యుని దగ్గరకు వెళతారు. అలాగే సంసారం సమస్య ఉందనుకుంటేనే పరిష్కారం గురించి ఆలోచిస్తారు. అందువల్ల మొదటి దశ – అహం సంసారి అని కనుగొనటం.

బి) **కార్పణ్య భావన** – సంసారం అనే సమస్య ఉందని తెలుసుకుంటే చాలదు, నిస్సహాయ స్థితిని గ్రహించాలి. నాకు సంసారం అనే సమస్య ఉందని తెలుసు; నాకు సంసారంనుంచి

బయటపడాలని ఉంది; కాని ఎలా బయటపడాలో తెలియటంలేదు. **అహం దీనః, అహం కృపణః** – ఈ నిస్సహాయతను కనుగొనగలగటాన్నే కార్పణ్యభావన అంటారు.

సి) **శరణాగతి** – సంసారమనే సమస్యనుంచి మిమ్మల్ని పైకి లేపగలిగిన గురువును శరణు వేడటం మూడవ దశ. ఇది చాలా ముఖ్యమైన దశ. ఈ మూడు దశలూ దాటకుండా, **భగవద్గీత** నేర్చుకుంటే అది కేవలం ఇంకొక డిగ్రీనో, పి.హెచ్.డీనో పొందటానికి చదివినట్టు ఉంటుందే తప్ప, దానివల్ల ఫలం పొందలేరు. గీతాశాస్త్రం ఆరంభానికి ముందు అర్జునుడు ఈ మూడు దశలనూ దాటాడని వ్యాసాచార్యులవారు చూపించదలుచుకున్నారు. ఇప్పుడు ఇవే దశలను అర్జునునిపరంగా చూద్దాము.

ఎ) **సంసారదర్శనం** – అర్జునుడు తను సంసారంలో పడ్డానని తెలుసుకున్నాడని మొదటి అధ్యాయంలో చూశాము. సంసారంలో మూడు భాగాలుగా సమస్య ఉందని కూడా చూశాము. అవి రాగం, శోకం, మోహం. ఈ మూడూ కలిపి సంసారం అంటారు. అర్జునుడు ఈ మూడు దశల సంసారదర్శనాన్ని చేశాడు. కాని ఇంకా రెండు, మూడు దశలకు రాలేదు. అందువల్ల కృష్ణపరమాత్మ బోధ అప్పుడే చేయదలుచుకోలేదు. రెండవ అధ్యాయంలోని పది శ్లోకాలలో రెండు, మూడు దశలను చూస్తాము.

బి) **కార్పణ్యభావన** – అర్జునుడే స్వయంగా చెప్పుకుంటాడు,

**న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః ।**
**యానేవ హత్వా న జిజీవిషామః తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥** – 2.6

'నేను పెద్ద అయోమయంలో ఉన్నాను. నా ముందు నిలిచింది నాకు ఆత్మీయులైన ధృతరాష్ట్ర పుత్రులే. వారిని చంపితే, నేను జీవించటానికి కూడా ఇష్టపడను. ఇది ధర్మయుద్ధమే అయినా, యుద్ధంలో మనం వారిని జయిస్తామో, లేక వారు మనను జయిస్తారో తెలియదు.'

అర్జునుడు, ముందు తన సమస్యను తనే పరిష్కరించుకోగలను అనుకున్నాడు. ఆ మార్గంలో తన శాయశక్తులా ప్రయత్నించాడు. నిజానికి, కులధర్మం గురించి వరద గోదావరిలాగా మాట్లాడుకుంటూ పోయాడు. కాని ఎక్కడో అతని బుద్ధి అతన్ని వెనక్కు లాగుతున్నది. **న చైతద్విద్మః** అంటున్నాడు. అంటే 'నేను యుద్ధం చేయాలో వద్దో తేల్చుకోలేకుండా ఉన్నాను,' అన్నాడు. యుద్ధం చేస్తే స్వధర్మం పాటించినట్టు ఉంటుంది కాని అది గురువధకు దారి తీసినట్టు అవుతుంది. అలాగని యుద్ధం చేయటం మానేస్తే, తన స్వధర్మాన్ని నిర్వర్తించనివాడు అవుతాడు. క్షత్రియుడు ధర్మయుద్ధం చేయకుండా, వెన్నుచూపితే, అతనికి ప్రత్యవాయపాపం అంటుకుంటుంది. ఆ విధంగా ఎటూ తేల్చుకోలేకుండా ఉన్నాను అని తన నిస్సహాయతను వెలిబుచ్చాడు.

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్॥**
– 2.7

'నా బుద్ధి మోహంచేత కప్పబడివుంది. నేను ధర్మాధర్మవిచక్షణ చూపించలేక పోతున్నాను. నేను నిస్సహాయస్థితిలో ఉన్నాను. అందువల్ల నిన్ను నోరు తెరిచి అడుగుతున్నాను. నాకు శ్రేయస్కరమైనది ఏదో అది చెప్పు. నేను నీకు శిష్యుణ్ణి. నేను శరణాగతుడను, నాకు ఉపదేశం చేయి.'

అర్జునుడు తన నిస్సహాయతను వినయంగా, మనస్సు విప్పి చెప్పుకున్నాడు. అహంకారం ఉన్న వ్యక్తి ఎవరికీ తలవంచడు. తన తప్పిదాన్ని ఒప్పుకోడు. కాని అర్జునుడు తన కార్పణ్యదోషాన్ని స్వీకరించాడు. ఈ శ్లోకంలో అర్జునుడు కార్పణ్యభావనలో ఉన్నాడని, అతని మాటల ద్వారానే గ్రహిస్తాము.

సి) **శరణాగతి** – ఎప్పుడైతే తన కార్పణ్యదోషాన్ని గ్రహిస్తాడో, అప్పుడే శరణు వేడుతాడు కృష్ణపరమాత్మను. ఈ శ్లోకంలోనే రెండవ పాదంలో

**అహం తే శిష్యః** – నేను నీ శిష్యుణ్ణి అన్నాడు. ఇంతవరకు అర్జునుడు యజమాని, కృష్ణపరమాత్మ రథసారథి. ఆ విధంగా అర్జునుడు తను శిష్యునిగా మారి కృష్ణుణ్ణి జగద్గురువుగా, గీతాచార్యునిగా మారుస్తాడు. పార్థసారథి, జగద్గురువు కృష్ణపరమాత్మ అవుతాడు.

**శాధి మాం త్వాం ప్రపన్నమ్** – నేను శరణాగతుడను, నాకు ఉపదేశం చేయి అంటున్నాడు. దీన్నే **శరణాగతి** అంటారు. ఇక్కడ **గురుశరణాగతి**.

ఈ ఏడవ శ్లోకం ద్వారా, వ్యాసాచార్యులవారు ఆధ్యాత్మిక సాధకునికి ఆధ్యాత్మిక గురువు ఉండితీరాలనే ముఖ్యమైన నియమాన్ని సూచిస్తున్నారు. గురువు ఆవశ్యకత గురించి అనేక అపోహలు ఉన్నాయి. కొంతమంది గురువు ఉండితీరాలనే నియమం లేదంటే, మరికొంతమంది అసలు గురువే అవసరం లేదు అంటారు. కాని మన శాస్త్రాలు అన్నీ గురువు ద్వారానే శాస్త్ర ఉపదేశం జరగాలని ఘోషిస్తున్నాయి. అంతదాకా ఎందుకు? కృష్ణపరమాత్మే నాలుగవ అధ్యాయంలో గురువు ఆవశ్యకత గురించి చెబుతాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

'వేదాంత శాస్త్రాన్ని బాగా అర్థం చేసుకుని, బాగా బోధించగలిగిన గురువు దగ్గరకు వినయంగా, జిజ్ఞాసతో వెళ్ళి, ఆయనకు సేవ చేసి, ప్రశ్నలు అడిగి ఆత్మజ్ఞానాన్ని పొందాలి.

సందేహాలు తీరి, నిశ్చయజ్ఞానం పొందేవరకూ ప్రశ్నలు అడగాలి. ఆ గురువులు అర్థమయ్యేలా బోధిస్తారు.'

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥** – ముండకమ్ 1.2.12

'కర్మలు చేయటంవల్ల శాశ్వతమైన ఫలం రాదనే వివేకంవల్ల, కర్మలమీద వైరాగ్యం పెంచుకుని, శాశ్వతమైన ఫలాన్నిచ్చే ఆత్మజ్ఞానం పొందటానికి సమిధలు చేతబుచ్చుకుని శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరకు వెళ్ళాలి.'

శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు అంటే ఈ వేదాంతశాస్త్రాన్ని బాగా అర్థం చేసుకుని, దాన్ని బాగా బోధించగలిగిన గురువు. ఇలా ఉపనిషత్తులు, గీత కూడా గురువు ద్వారానే శాస్త్రాన్ని అధ్యయనం చేయాలని ఎంతగా చెప్పినా, దురదృష్టవశాత్తూ అసలు గురువే అవసరం లేదు అనుకుంటారు చాలామంది. ఒకవేళ గురువు అవసరం అనుకున్నా ఆత్మే గురువు అంటారు మరికొంతమంది. గురువుకోసం బాహ్యంగా వెతకనవసరం లేదు, గురువు నీలోనే ఉన్నాడు. అది ఆత్మ అంటారు వీరు. ఇది శాస్త్రంలో ఎక్కడా చెప్పబడలేదు. **ఆత్మా నైవ గురుః నైవ శిష్యః** – ఆత్మ గురువు కాలేదు, శిష్యుడు కూడా కాలేదు. అందువల్ల ఆత్మ గురువు అనటంలో అర్థంలేదు.

మరికొంతమంది ఈ ప్రపంచమే పెద్ద గురువు, వేరే గురువెందుకు అంటారు. పైగా వారిని సమర్థించుకోవటానికి దత్తాత్రేయుని ఉదాహరణ ఉటంకిస్తారు. దత్తాత్రేయుడు తేనెటీగనుంచి, లేడినుంచి, ఏనుగునుంచి అలా 24 వాటినుంచి నేర్చుకున్నాడు అంటారు. ఇది కూడా సరియైన వాదన కాదు. ప్రపంచం పాఠం నేర్పించవచ్చేమో కాని, మనం సరిగ్గా నేర్చుకోవాలి కదా. మనకున్న (పొరపాటు) సిద్ధాంతం ప్రకారం ప్రపంచాన్ని విశ్లేషిస్తాము.

ఒకవ్యక్తి, ఒక పచ్చి తాగుబోతును మార్చటానికి ప్రయత్నిస్తాడు. మందు విషమని, అది అతని ప్రాణాన్నే తీసుకుంటుందనీ చెప్పాలని అతని తాపత్రయం. తను చెప్పదలుచుకున్నదాన్ని నిరూపించటానికి ఒక చిన్న ప్రయోగం చేశాడు. రెండు గిన్నెలు తెచ్చి, ఒకదాంట్లో నీరుపోసి, ఇంకొకదానిలో మందు పోశాడు. తర్వాత రెండు పురుగులను తెచ్చి, చెరొక గిన్నెలో వేశాడు. మందు ఉన్న గిన్నెలో పడిన పురుగు గిలగిలా కొట్టుకుని మరణించింది. రెండోది బాగానే ఉంది. దీన్నిబట్టి నీకేం అర్థం అయింది అన్నాడు ఆ వ్యక్తి ఆ తాగుబోతుని. ఆ తాగుబోతు అతి తెలివి చూపిస్తూ, ఇలా అన్నాడు, 'దీన్నిబట్టి, నాకేమర్థమయిందంటే, ఎవరైతే మందు తాగుతారో, వారి కడుపులో ఉన్న పురుగులు ఇలాగే గిలగిలా కొట్టుకుని మరణిస్తాయి; అప్పుడు అతని కడుపులో పురుగులు లేకుండా అది శుద్ధి చెందుతుంది!' మనస్సు బలహీనతకు

లోనయితే, బుద్ధిని కూడా తనవైపుకు లాక్కుంటుంది. బుద్ధి అప్పుడు, ఇదుగో ఇలా తప్పుడు పనులను సమర్థిస్తుంది. అందువల్ల ప్రపంచంనుంచి పాఠాలు నేర్చుకుంటాము అనేది భ్రమ. ఒకవేళ అలా నిజంగా ప్రపంచంనుంచి పాఠాలు నేర్చుకోగలిగితే, ప్రపంచంలో అందరూ ఈ పాటికి మేధావులు అయిపోయి ఉండేవారు.

అందువల్ల దత్తాత్రేయుని కథను మీకు కావాల్సినట్టుగా సాగదీసి, గురువే అవసరం లేదు అనకండి. ఆ కథలో ఉన్న సారాన్ని గ్రహించండి అంతే. అందువల్ల ప్రపంచం గురువు అవలేదు, ఆత్మ గురువు అవలేదు కనుక గురువే కావాలి.

గురువు సహాయం లేకుండా ఆత్మజ్ఞానం పొందలేదా కొందరు అని అడిగి, దానికి ఉదాహరణగా కొందరు మహాత్ములను చూపిస్తారు. కొందరు గురువు లేకుండా జ్ఞానం పొంది ఉండవచ్చు కాని వారు అసాధారణ వ్యక్తులు. ప్రతి నియమానికి ఒక సడలింపు ఉంటుందని ఒక నియమం ఉంది. దీన్ని సంస్కృతంలో ప్రతి ఉత్సర్గకు ఒక అపవాదం ఉంది అంటారు. అలా ఆత్మజ్ఞానవిషయంలోనే కాదు, లౌకికవిద్యలో కూడా అసాధారణ మేధావులు ఉంటారు. రామానుజం మాథమాటిక్స్‌లో గురువు సహాయం లేకుండానే మేధావి అయ్యాడు. రామానుజం ఉన్నాడు కాబట్టి స్కూళ్ళను, కాలేజీలను మూసివేయాలంటే ఎలా ఉంటుంది? ఇదే సూత్రం ఆత్మవిద్యకు కూడా వర్తిస్తుంది.

అలాగయితే ఎటువంటి గురువు ఉండాలి? మన సాంప్రదాయంలో గురువు పదాన్ని చాలా తేలికగా వాడేస్తాము. గురువుల్లో మూడు రకాల గురువులు ఉన్నారు. మంత్రోపదేశం చేసే గురువు, ప్రేరణనిచ్చే గురువు, బోధచేసే గురువు.

**మంత్రోపదేశం చేసే గురువు** – మంత్రోపదేశం పది, పదిహేను నిముషాలలో జరిగిపోతుంది. గురువును మీ ఇంటికి పిలిచో, మీరే గురువు దగ్గరకు వెళ్ళో, ఆ గురువుకు పాదపూజ చేస్తే, ఆయన మంత్రోపదేశం చేస్తారు. అటువంటి గురువు రోజుకు వందలకొద్దీ భక్తులకు మంత్రోపదేశం చేయవచ్చు.

బ్రహ్మచర్య దీక్ష లేదా సన్న్యాసదీక్ష తీసుకోవాలనుకుంటే, దానికి కూడా గురువు ఆ దీక్షను ఇస్తాడు. దానికి ఋషీకేశ్‌లోని ఏదైనా ఆశ్రమానికి వెళ్ళి, ఒకటి రెండురోజులపాటు కొన్ని క్రతువులు చేసి, దీక్ష పొందవచ్చు. సన్న్యాసి దీక్ష తీసుకుంటే కాషాయవస్త్రం ఇచ్చి, మహావాక్య ఉపదేశం చేస్తారు.

అలా మంత్రోపదేశమో, దీక్షనో ఇచ్చే గురువులు ఒకరకం గురువులు.

**ప్రేరణనిచ్చే గురువు** – మీరు ఒక రంగంలో రాణించటానికి ప్రేరణ కావాలి. ఆ గురువు జీవించి ఉన్న గురువే కానవసరం లేదు. ప్రేరణే కావాలంటే, శంకరాచార్యులవారి ఫోటో

తీసుకుని, వారిని రోజూ పూజించవచ్చు. ఆ శంకరాచార్యులవారు కూడా ఆదిశంకరులవారు అవచ్చు లేదా ఇప్పటి పీఠాధిపతి అవచ్చు. అలా ప్రేరణనిచ్చే గురువులు ఇంకోరకం గురువులు.

**బోధ చేసే గురువు** – ముందు గురువు ఎందుకు కావాలో తెలుసుకుంటే, ఎటువంటి గురువు కావాలో అర్థమవుతుంది. ఇక్కడ ఆధ్యాత్మికజ్ఞానం పొందాలి. అది బోధించగలిగిన గురువు కావాలి. లౌకికవిద్యలోనే, ఏ ఫిజిక్సో నేర్చుకోవాలంటే దానిలో జ్ఞానం ఒకరోజులోనో, రెండు రోజుల్లోనో పొందేయలేరు. కొన్ని సంవత్సరాలపాటు గురువు వద్ద విద్యనభ్యసించాలి. ఒక లౌకికవిద్యనే ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలంటే, ఆత్మవిద్య గురించి చెప్పేది ఏముంది? విజ్ఞానశాస్త్రంకన్నా వేదాంతశాస్త్రం ఇంకా జటిలమైనది, ఇంకా సూక్ష్మమైనది.

ఆత్మవిద్య నేర్చుకోవాలంటే గురువువద్ద శ్రవణం చేయాలి. శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, ఒక సమర్థవంతమైన గురువు వద్ద వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. ఆ గురువు కూడా జీవించివున్న గురువై ఉండాలి. ఆ గురువును ఎప్పటికప్పుడు మన సందేహాలను అడిగి తీర్చుకుంటూ ఉండాలి అంటే గురువు అందుబాటులో ఉండాలి.

దురదృష్టవశాత్తూ జ్ఞానాన్ని ఒక్క క్షణంలోనో, రెండు క్షణాల్లోనో ఎదుటివ్యక్తికి అందజేయలేము. శక్తిపాతం అనీ, స్పర్శదీక్ష అనీ, దర్శనదీక్ష అనీ వింటుంటాము నిజమే. కాని ఇవేవీ జ్ఞానానికి వర్తించవు. ఒకరినుంచి ఇంకొకరికి శక్తిని ప్రసాదించే విషయంలో చూస్తేనే శక్తి రావచ్చు, గురువు స్పర్శనిస్తేనే శక్తి రావచ్చు, మంత్రదీక్ష తీసుకుంటే శక్తి రావచ్చు; కాని జ్ఞానం విషయంలో అలా రాదు. సన్న్యాసం స్వీకరించినా జ్ఞానం రాదు. జ్ఞానం రావాలంటే ఒక క్రమపద్ధతిలో కొన్ని సంవత్సరాలపాటు గురువు దగ్గర నేర్చుకోవాలి. అలా స్పర్శవల్లనే శక్తిని అందించగలిగినట్టుగా, జ్ఞానాన్ని అందించగలిగితే, కృష్ణపరమాత్మ యుద్ధభూమిలో అంతసేపు ఎందుకు బోధ చేశాడు? అలాంటి దగ్గర దారి ఉంటే కృష్ణపరమాత్మ ఉపయోగించి ఉండేవాడు కాదా?

కృష్ణపరమాత్మ ఓపిగ్గా, అర్జునునికి అర్థమయ్యేదాకా బోధించాడు. అంతేకాదు తను మాత్రం చెప్పుకుంటూ పోలేదు. భగవద్గీతను కృష్ణార్జునసంవాదం అంటారు. గురుశిష్యుల సంభాషణ రూపంలో సాగింది ఈ బోధ. ఎక్కడికక్కడ కృష్ణపరమాత్మ అర్థం అయిందా అని అడుగుతూనే వస్తాడు. అర్జునుడు కూడా తన సందేహాలను మళ్ళీమళ్ళీ అడుగుతూనే ఉన్నాడు. నిజానికి అర్జునుడు తను మూడవ అధ్యాయం మొదట్లో ఏ ప్రశ్న వేశాడో, ఐదవ అధ్యాయం మొదట్లో కూడా అదే ప్రశ్న వేశాడు. అంతేకాదు, కృష్ణపరమాత్మకే ఆశ్చర్యం కలిగేలా అదే ప్రశ్నను మళ్ళీ పద్దెనిమిదవ అధ్యాయంలో కూడా వేస్తాడు! ఆ ప్రశ్న టూకీగా కర్మయోగం, జ్ఞానయోగాల్లో ఏది పాటించాలి.

అలా చెప్పిన విషయాన్నే మళ్ళీ అడిగితే, గురువుకు ఎంత ఓపిక కావాలో ఒక్కసారి ఊహించండి! అందువల్లనే గురువు అంటే ఆత్మబోధను బోధించే ఆచార్యుడు అంటారు.

**గురుః = ఆత్మతత్త్వమ్ ఉపదిశతి ఇతి గురుః**

గురు పదం గు ధాతువునుంచి వచ్చింది. గు అంటే ఆత్మతత్త్వాన్ని బోధించేది అని అర్థం.

గురువుకు ఇంకొక నిర్వచనం కూడా ఉంది.

**గుకారస్త్వంధకారో వై రుకారస్తన్నివర్తకః।**
**అంధకారనివర్తిత్వాత్ గురురిత్యభిధీయతే॥**

గు అక్షరం చీకటిని సూచిస్తే, రు అక్షరం పారద్రోలటం సూచిస్తుంది. గురు అంటే చీకటిని పారద్రోలేవాడు. చీకటి అంటే అజ్ఞానం; ఇక్కడ ఆత్మయొక్క అజ్ఞానం. అందువల్ల ఆత్మజ్ఞానం పొందటానికి గురువు కావాలి, అదికూడా అందుబాటులో ఉండే గురువు కావాలి. ఆ గురువుని ప్రశ్నలు వేసి నేర్చుకోవాలి.

శరణాగతి అంటే అటువంటి గురువును శిష్యుడు శరణు వేడాలి. అర్జునుడు సాక్షాత్తూ జగద్గురువు అయిన కృష్ణపరమాత్మనే శరణు వేడాడు. ఇక్కడితో మొదటి మూడు దశలతో కూడిన మొదటి అంశం అయిన అర్జున శరణాగతి ముగిసింది.

**3. కర్మయోగం : శ్లోకాలు 39-53** ముందు కర్మయోగాన్ని చూద్దాము. ఇది ఆధ్యాత్మ జీవనవిధానంలో మొదటిమెట్టు. ఇది ఆరోగ్యకరమైన పరతంత్ర జీవనాన్ని సూచిస్తుంది. ఇటువంటి ఆరోగ్యకరమైన పరతంత్ర జీవనవిధానాన్ని పాటిస్తే, అది స్వతంత్ర జీవనానికి దారితీస్తుంది. ధర్మపరమైన జీవనవిధానానికి రాకపోతే, అనారోగ్యకరమైన పరతంత్ర జీవనవిధానం పాటిస్తారు. దానివల్ల జననమరణాలనే వృత్తంలో పడి తిరుగుతూనే ఉంటారు. దాన్నుంచి ఎలా బయటపడాలో తెలియదు కూడా.

**కృతి మహోదధౌ పతనకారణం ఫలమశాశ్వతం గతి నిరోధకమ్॥** – ఉపదేశసారం

కేవలకర్మ చేస్తే దానివల్ల వచ్చే ఫలం అశాశ్వతం, అందులోనే కూరుకుపోతారు. అదే ధర్మపరమైన జీవనవిధానాన్ని పాటిస్తే పరతంత్రంనుంచి స్వతంత్రజీవనానికి వస్తారు.

ఇప్పుడు కర్మయోగం పదాన్ని విశ్లేషిద్దాము. కర్మయోగంలో రెండు పదాలు ఉన్నాయి. కర్మ + యోగం.

**యోగం** – ముందు యోగం పదాన్ని తీసుకుందాము. యోగం పదానికి సందర్భాన్నిబట్టి అర్థం మారుతూ ఉంటుంది. ఈ సందర్భంలో యోగం అంటే ఒక ప్రత్యేకమైన అర్థం ఉంది. కృష్ణపరమాత్మే ఈ యోగం పదాన్ని ఈ అధ్యాయంలో నిర్వచించాడు.

**సమత్వం యోగ ఉచ్యతే** – 2.48

ధర్మపరమైన జీవనవిధానాన్ని పాటిస్తే, సమత్వం లేదా ప్రశాంతచిత్తం లేదా నిశ్చలత్వం పొందుతారు. ముందు దేనియొక్క సమత్వం అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఖచ్చితంగా శరీరంయొక్క సమత్వం అయితే కాదు. శరీరం ఎన్నడూ **సమం**గా ఉండలేదు, అది ఎప్పుడూ **విషమం**. అందువల్ల సమత్వం అంటే మనస్సుయొక్క సమత్వం. జీవితంలో ఎదురయ్యే అనేక పరిస్థితులలో చలించకుండా, ఆరోగ్యకరంగా స్పందించటం. జీవితం అనేక పరిస్థితులను కలుగజేస్తుంది. వాటికి తగ్గట్టుగా మనస్సు అనేక విధాలుగా స్పందిస్తుంది. నిరాశానిస్పృహలు, అపరాధభావన, కోపం, ఆశాభంగం – ఇన్నీ ఒక్కరోజులో కలుగుతాయి. అలా మనస్సు అనేక భావాల సుడిగుండంలో పడిపోతూ ఉంటుంది. అటువంటి మనస్సులో సమత్వం పాటించటం ఎలా?

అటువంటి మనస్సులోనే సమత్వం పాటించవచ్చు అంటుంది శాస్త్రం. ధర్మపరమైన జీవనం లేదా కర్మయోగం పాటిస్తే, అల్లకల్లోలాలనుంచి బయటపడి, ప్రశాంతచిత్తాన్ని పెంపొందించుకోవచ్చు. అయితే, ఎలా ఈ సమత్వాన్ని పెంపొందించుకోవాలి? ఇది తరువాత వచ్చే ప్రశ్న. ఎందుకంటే ఎవరికైనా ఈ సమత్వం పెంపొందించుకోవాలనే ఉంటుంది. సమత్వం పెంపొందించుకోవాలంటే, జీవితం గురించిన కొన్ని ప్రాథమిక సత్యాలను తెలుసుకోవాలి. ఈ సత్యాలను తెలుసుకోవటమే కాదు, వాటిని జీవితాంతం గుర్తుపెట్టుకొని పాటించాలి.

## జీవితంయొక్క ప్రాథమిక సూత్రాలు

1. **దుఃఖమిశ్రితత్వం** – జీవితం సుఖదుఃఖాల మేలుకలయిక. జీవితాంతం ఎవరికీ సుఖమూ ఉండదు, దుఃఖమూ ఉండదు. అందువల్ల ఈ సుఖదుఃఖాల మిశ్రమాన్ని ఎవరూ తప్పించుకోలేరు. కృష్ణపరమాత్మ ఈ జంటను ద్వంద్వం అంటున్నాడు.

**ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైః** – 15.5

**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్** – 2.45

అందువల్ల ఈ ద్వంద్వాలను లేదా సుఖదుఃఖాల జంటను ఎవరూ తప్పించుకోలేరు. జీవితం ఎప్పుడూ సాఫీగా, సుఖమొక్కటే ఉండేలా సాగదు. ఏ పురాణగ్రంథాలను విన్నా ఈ సత్యం అర్థంకాక మానదు. మహామహారాజులే ఎన్నో కష్టనష్టాలకు గురి అయిన సన్నివేశాలను చూస్తాము. చక్రవర్తులు మాత్రమే కాదు, సర్వజ్ఞుడూ, సర్వశక్తిమంతుడూ అయిన భగవంతుడు కూడా మానవునిగా అవతారం దాలిస్తే, కష్టసుఖాలు తప్పవు.

**అవశ్యం భావిభావానాం ప్రతీకారో భవేద్యది**
**తథా దుఃఖైర్నలిప్యేరన్ నలరామయుధిష్ఠిరాః** – పంచదశి 7.156

'ప్రారబ్ధకర్మగా మారే కర్మఫలాలను తప్పించగలిగే అవకాశమే ఉండివుంటే, నలమహారాజు, శ్రీరాముడు, యుధిష్ఠిరుడు వారు ఎదుర్కొన్న కష్టాలను పడకుండా ఉండగలిగేవారు.'

అలా బాధ కలిగించే అనుభవాలను పూర్తిగా తొలగించుకోగలిగే మార్గం ఉండివుంటే, నలమహారాజు అన్ని కష్టాలు పడివుండేవాడు కాదు. అలాగే శ్రీరాముడు గాని, యుదిష్ఠిరుడు కాని కష్టాలు పడివుండేవారు కాదు. కాని వారే కష్టాలను తప్పించుకోలేకపోయారు, అంటే దీనివల్ల నేర్చుకోవాల్సిన జీవితసత్యం – జీవితం సుఖదుఃఖాల మేలుకలయిక.

అందువల్ల శాస్త్రాలు బాధలను ఎలా తప్పించుకోవాలో నేర్పించవు. బాధలను ఎలా సమర్థవంతంగా తట్టుకుని, ఎలా తెలివిగా నిలబడాలో నేర్పిస్తాయి. కృష్ణపరమాత్మ కూడా, జీవన్ముక్తుణ్ణి వర్ణించేటప్పుడు, అతను కష్టసుఖాలకు అతీతుడు అనలేదు. అతను కష్టసుఖాలను ఎలా తట్టుకుని నిలబడగలడో వర్ణిస్తాడు.

**జీవిత సత్యం 1 – జీవితం దుఃఖమిశ్రితత్వం.**

2. **భవిష్యత్తు అగమ్యగోచరం** – భవిష్యత్తు అగమ్యగోచరం. రేపేమవుతుందో ఇవాళ తేల్చి చెప్పలేము. రేపు సుఖాన్ని మోసుకువస్తుందో, దుఃఖాన్ని మోసుకువస్తుందో అసలు ఊహించలేము. అది మానవమేధస్సుకు అందని విషయం. ఎందుకంటే ప్రతి ఒక్క అనుభవం కూడా అనేకానేక అంశాలమీద ఆధారపడివుంటుంది. ఒక పరిస్థితిని సరిగ్గా ఊహించాలి అంటే అనంతమైన అంశాలన్నీ తెలిసివుండాలి. మనిషి సర్వజ్ఞుడు కాదు. అందువల్ల భవిష్యత్తులో ఏమవుతుందో చెప్పలేడు.

వాతావరణ సూచన విషయమే తీసుకోండి ఉదాహరణగా. కోట్లకొద్దీ రూపాయలను ఖర్చుపెట్టి, ఉపగ్రహాలను పంపించి వాతావరణాన్ని విశ్లేషిస్తారు. దానికి సంబంధించిన సమాచారం వంద సంవత్సరాలది కూడా ఉంటుంది వారి దగ్గర. తుఫాను గురించి తెలుసుకుని, సంబంధింత ప్రాంతాలకు హెచ్చరికలు కూడా చేస్తారు. కాని అవి అన్నివేళలా సరిగ్గా ఉండవు. వానాకాలం అయిపోయింది అంటే మర్నాడే భోరున వాన కురవవచ్చు. మనం ఇక్కడ వారిని తప్పు పట్టటం లేదు. మన ఉద్దేశ్యం, వారికి వాతావరణం గురించి ఎంత పరిజ్ఞానం ఉన్నాకూడా, ఎంత సాంకేతిక పరికరాలు ఉన్నాకూడా, సైన్సు ఎంతగా ప్రగతిని సాధించినా కూడా, వారికి అందని కొన్ని అంశాలు ఉంటూనే ఉంటాయి.

జీవితంలోని ఒక్క అంశం గురించి సత్యం అయితే, ఇది అన్ని సందర్భాలలోనూ సత్యం అవుతుంది. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా, మన భవిష్యత్తు అనూహ్యమైనది. ఒకసారి రోడ్డుమీదకు వెళితే, క్షేమంగా ఇంటికి తిరిగి వెళతామో లేదో తెలియదు. మనం సర్వజ్ఞులం కాదు కాబట్టి భవిష్యత్తు మనకు తెలియదు.

**జీవిత సత్యం 2 – భవిష్యత్తు అగమ్యగోచరం.**

3. **పరిస్థితులు మార్చలేనివి** – మనం సర్వశక్తివంతులము కాదు కాబట్టి చాలా పరిస్థితులు మన చేతిలో ఉండవు. మళ్ళీ వాతావరణ సూచన ఉదాహరణనే చూద్దాము. వాతావరణ సూచన చేసేవారికి తుఫాను రాబోతున్నదని తెలుస్తుంది. అది మద్రాసు తీరం చేరబోతున్నదనే జ్ఞానం ఉంది. వారు అడుగడుక్కీ వాతావరణ సూచనలు చేస్తూ, హెచ్చరికలు జారీచేస్తూ, ఏ సముద్రతీరాన్ని తాకుతుందో, ఆ తీరం దగ్గర ఉన్నవారిని ఆ ప్రాంతాలను ఖాళీ చేయమని చెప్పగలరే కాని, తుఫాను రాకుండా అరికట్టగలరా? వారి శక్తి మేరకు జననష్టాన్ని, పశునష్టాన్ని అరికట్టగలరు కాని అసలు తుఫానునే చేయిపట్టి ఆపగలరా? లేదు.

అంటే జీవితంలో ఎన్నో పరిస్థితులు మనకు బాధాకరమైనవి, కష్టమైనవి, మనం తప్పించుకోవాలని చూసేవి ఎదురవుతూనే ఉంటాయి. కాని అవి వాటిని మార్చటానికి వీలులేని పరిస్థితులు.

**జీవిత సత్యం 3 – పరిస్థితులు మార్చలేనివి.**

ఈ మూడు అంశాలను అర్థం చేసుకుంటే, వాటిని రెండు రకాలుగా ఎదుర్కోవచ్చు. **యాక్సప్ట్ అండ్ అకామడేట్ – నవ్వుతూ స్వీకరించు, మనస్సును సంసిద్ధం చేసుకో.**

1. **నవ్వుతూ స్వీకరించు** – ఈ మూడు అంశాలను అర్థం చేసుకుంటే గతం గురించిన బాధ ఉండదు. భవిష్యత్తు గురించిన బెంగ ఉండదు. జీవితంలో మనస్సును కలత చెందించేది రేపేమవుతుందోననే భయమే. ఎప్పుడయితే భవిష్యత్తు అగమ్యగోచరం అని, ఒకవేళ రేపేమవుతుందో తెలిసినా, దాన్ని తప్పించుకోలేమని అర్థమవుతుందో, ఆ భవిష్యత్తును వర్తమానంలోకి మారినప్పుడే ఎదుర్కొంటాను అనుకుంటారు. వంతెన దగ్గరకు వచ్చినప్పుడు, దాన్ని దాటుదాము అన్నారెవరో. అలాగే రేపు అనేది ఇవాళగా మారేదాకా ఆగాలి. మంచి భవిష్యత్తు గురించి ఆశించటంలో తప్పులేదు, కాని చెడు వస్తే స్వీకరించటానికి సిద్ధంగా ఉండాలి. కాని చెడు వచ్చినా స్వీకరించు అనే మాటనే స్వీకరించలేరు చాలామంది. వారి భాషలో అది అమంగళకరం.

2. **మనస్సును సంసిద్ధం చేసుకో** – పరిస్థితులు మార్చలేనివి అయినప్పుడు, మన చేతిలో లేనప్పుడు, మనం తప్పించుకోలేనప్పుడు, వాటిని నవ్వుతూ స్వీకరించటానికి మనస్సును సంసిద్ధం చేసుకోవాలి. వాటిని పూర్తిగా తప్పించుకోలేము; ఎందుకంటే అవి తప్పించుకోలేని, మార్చలేని పరిస్థితులు. మార్చగలిగిన పరిస్థితులను మార్చవచ్చు. శాస్త్రాలు అప్పుడు కూడా మార్చవద్దు అనవు. కాని మార్చలేని పరిస్థితులు ఎదురైతే మాత్రం వాటిని నవ్వుతూ స్వీకరించే సంసిద్ధత ఉండాలి. భవిష్యత్తులో ఏం రాసిపెట్టి ఉన్నా దాన్ని, వర్తమానంలో మార్చలేని పరస్థితులను, నవ్వుతూ స్వీకరించటానికి మనస్సును సంసిద్ధం చేసుకోవటమే సమత్వం పాటించే పద్ధతులు.

**యాక్సెప్ట్ అండ్ అకామడేట్**

**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే।**
**సంప్రాప్తే సన్నిహితే కాలే న హి న హి రక్షతి డుకృఞ్కరణే॥** – భజగోవిందం

శంకరాచార్యులవారు ఈ విషయాన్ని అద్భుతంగా బోధించారు భజగోవిందంలో. 'ఓ మూర్ఖుడా! భగవంతుణ్ణి ప్రార్థించు. (మరణ)కాలం ఆసన్నమయినప్పుడు, వ్యాకరణ సూత్రాలు వల్లెవేస్తుంటే అవి నిన్ను రక్షించవు.'

ఆపత్కాలము ఆసన్నమయినప్పుడు, పరిష్కారం గురించి ఆలోచించకూడదు; అప్పుడు మనస్సును దిటవు పరచుకోవటానికి ప్రయత్నించకూడదు. మనస్సును దిటవు పరచుకోవటానికి ముందునుంచీ ప్రయత్నించాలి. వృద్ధాప్యంలో ఆర్థికంగా బాధపడకూడదని, ముందునుంచీ ధనం సమకూర్చుకుంటాము కాని, వృద్ధాప్యంలో మానసికంగా బాధపడకుండా ఉండటానికి ఎటువంటి జాగ్రత్తలూ తీసుకోము అంటున్నారు భర్తృహరి.

**యావత్ స్వస్థమిదం శరీరమరుజం యావత్ జరా దూరతః।**
**యావచ్చేంద్రియ శక్తిరప్రతిహతా యావత్ క్షయో నాయుషః।**
**ఆత్మశ్రేయసి తావదేవ విదుషా కార్యః ప్రయత్నో మహాన్।**
**సందీప్తే భవనే తు కూపఖననం ప్రత్యుద్యమః కీదృశః॥** – వైరాగ్యశతకం 5.75

'శరీరం అనారోగ్యం పాలయి క్షీణించకముందే, మనస్సు ప్రశాంతతను కోల్పోకముందే, ఇంద్రియాలశక్తి హరించుకు పోకముందే, ఆయుష్షు తీరకముందే, తెలివైనవారు వారి శ్రేయస్సుకోసం ఏర్పాట్లు చేసుకోవాలి. ఇంటికి నిప్పంటుకున్నప్పుడు బావి తవ్వి ప్రయోజనమేమిటి?'

అందువల్ల ఇంటికి నిప్పంటుకున్నప్పుడు బావి తవ్వి ప్రయోజనం లేదు. అలాగే జీవితంలో పెద్ద కష్టం ముంచుకువచ్చినప్పుడు, గుళ్ళకు వెళ్ళో, స్వామీజీల చుట్టూ తిరిగో, అక్కడిచ్చే విభూది లేదా కుంకుమవల్లో బలం పుంజుకుంటానంటే లాభం లేదు. గుళ్ళకు, స్వామీజీల దగ్గరకు వెళ్ళటం మంచిదే కాని ఈ గడ్డు కాలాన్ని ఎదుర్కోవటానికి వీలుగా, మీ మనస్సును ఏ విధంగా దృఢపరచుకుంటున్నారు?

సమత్వం పాటించటమంటే భవిష్యత్తును, అదీ అగమ్యగోచరంగా ఉన్న భవిష్యత్తును ఎదుర్కోవటానికి మనస్సును సంసిద్ధం చేసుకోవటం. తప్పించుకోలేని వర్తమానాన్ని నవ్వుతూ స్వీకరించటం. **యాక్సెప్ట్ అండ్ అకామడేట్.**

ఇవన్నీ మీకూ బాగానే తెలుసు. ఎవరూ ప్రత్యేకించి విడమరచి చెప్పనవసరం లేదు. కష్టమైన పరిస్థితులు ఎదురైతే గుండె దిటవు చేసుకోవాలని తెలుసు. ఆ మాటకొస్తే, 'నేను

స్వీకరించాలి, నేను స్వీకరించాలి,' అని మీరు మనస్సుకు పదేపదే చెప్పుకుంటారు కూడా. ఒక్కోసారి, 'నేను స్వీకరిస్తున్నాను,' అని మాటలతో చెబుతున్నా, మీకు తెలియకుండానే బుగ్గల మీంచి కన్నీటిచుక్కలు రాలిపడుతూ ఉండవచ్చు. 'నేను స్వీకరిస్తున్నాను,' అని చెప్పాలంటే మనస్సును దిటవు పరచుకోవాలి. బలహీనమైన మనస్సే భవిష్యత్తును గురించిన ఆందోళనను, వర్తమానం గురించిన బాధను చూపిస్తుంది.

మనస్సు సంసిద్ధం చేసుకోవటానికి కూడా రెండు మార్గాలు ఉన్నాయి. అవి సంకల్పం, ఈశ్వరభక్తి.

ఎ) **సంకల్పం** – మీలో అనంతమైన శక్తి ఉంది, ఖచ్చితంగా ఉంది.

**ఆత్మనా విందతే వీర్యమ్**

శరీరానికి అనంతమైన శక్తి ఉందని తెలుసుకున్న క్రీడాకారులు దాన్ని వెలికితీసి, దాన్ని పెంచి పోషించుకుంటున్నారు. అలాగే మీ మనస్సుకు కూడా అనంతమైన శక్తి ఉంది. దాన్ని వెలికితీయటం తెలియాలి అంతే. ఆ వెలికితీసే పద్ధతిని సంకల్పం అంటారు. మీకు మీరే చెప్పుకుంటూ ఉండాలి, 'నేను ఎటువంటి క్లిష్ట పరిస్థితి ఎదురైనా తట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నాను. నాకా శక్తి ఉంది, అనుకోని పరిస్థితి ఎదురైతే, నేను దాన్ని ఎదుర్కొంటాను.' మానసిక శాస్త్రవేత్తలు కూడా ఈ పద్ధతి అద్భుతంగా పనిచేస్తుంది అంటారు. దీన్నే ఆటోసజెషన్ అంటారు. ఎందుకంటే,

**శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః** – 17.3

ప్రతివ్యక్తికి ఏదో ఒక శ్రద్ధ ఉండనే ఉంటుంది. అతని శ్రద్ధ ఎలా ఉంటే, అతని జీవనవిధానం కూడా అలాగే ఉంటుంది. దీన్ని సంకల్పం అనీ, విల్‌పవర్ అనీ, ఆటోసజెషన్ అనీ అంటారు.

బి) **ఈశ్వరభక్తి** – ఈ పద్ధతి ఇంకా తేలికైనది, తిరుగులేనిది. ఇది మీలో ఉన్న శక్తిని వెలికితీసేబదులు, బాహ్యంగా ఉన్న సర్వశక్తిమంతుడైన భగవంతుణ్ణి శరణువేడటం. ఎందుకంటే, నిజానికి మీ ఉన్నతశక్తి ఈశ్వరుడే కదా!

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి** – 18.61

'ఓ అర్జునా! ఈశ్వరుడు అన్ని జీవుల హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు.' ఇంకా ఇలా అంటాడు.

**అనాదిత్వాన్నిర్గుణత్వాత్ పరమాత్మాయమవ్యయః ।**
**శరీరస్థోఽపి కౌంతేయ న కరోతి న లిప్యతే ॥** – 13.32

'ఓ అర్జునా! నాశరహితుడైన పరమాత్ముడు ప్రాణుల శరీరాల్లో ఉన్నప్పటికీ, అనాది, నిర్గుణం అవటంవల్ల, అతను ఏ కర్మలు చేయడు, ఏ కర్మఫలమూ అనుభవించడు.'

ఈ భావానికి ఆమోదముద్ర వేస్తుంది ఈ శ్లోకం

**ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః ।**
**పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః ॥** – 13.23

'ఈ దేహంలో ఉన్న ఆత్మ నిజానికి పరమాత్మే. అతను సాక్షీభూతంగా చూడటంవల్ల, 'ఉపద్రష్ట' అని, ఆమోదం తెలుపుతాడు కాబట్టి 'అనుమంత' అని, అన్నింటినీ భరించి పోషిస్తాడు కాబట్టి భర్తా అనీ, జీవరూపంలో ఉన్నాడు కాబట్టి 'భోక్తా' అనీ, బ్రహ్మాదులకు కూడా స్వామి కాబట్టి 'మహేశ్వరుడు' అనీ, సచ్చిదానంద ఆత్మ కాబట్టి 'పరమాత్మ' అనీ పిలవబడుతున్నాడు.'

అందువల్ల పరమాత్మ మీ ఉన్నతమైన స్వరూపం. అందువల్ల, లోపలనుంచి శక్తి తెచ్చుకోలేకపోతే, మీ ఉన్నత స్వరూపమైన పరమాత్మనుంచి బాహ్యంగా శక్తిని తెచ్చుకోవచ్చు. పరమాత్మను మీ ఇష్టదేవతా రూపంలో కొలవవచ్చు. అది రాముడవచ్చు, కృష్ణుడవచ్చు, దేవి అవచ్చు. ఏ రూపంలో కొలిచినా, మీ ప్రార్థన ఈ విధంగా ఉండాలి ప్రతిరోజూ. 'ఓ దేవా! నేను నా జీవితంలో ఎదురయ్యే క్లిష్టపరిస్థితులను తప్పించుకోలేను. అది నా కర్మ, నా ప్రారబ్ధకర్మ అయితే, నేను ఎదుర్కోక తప్పదు. నేను ప్రకృతి సూత్రాలను మార్చమని కోరటం లేదు. ప్రకృతిసూత్రం ప్రకారం నాకేది రాసిపెట్టి ఉంటే, దాన్ని ఎదుర్కొనే గుండె ధైర్యం నాకివ్వు.'

మీరు ప్రకృతి సూత్రాన్ని మార్చమని కోరలేరు ఎందుకంటే, ఇంకొక వ్యక్తి అదే దేవునికి, అదే సూత్రాన్ని ఇంకొకలాగా మార్చమని కోరవచ్చు. అప్పుడు భగవంతుడే అయోమయంలో పడతాడు! మనం ఎంత శక్తిమంతులమంటే, సర్వశక్తివంతుడైన పరమాత్మనే అయోమయంలో పడేయగలము! అటువంటి ప్రార్థన సబబు కాదు, తార్కికం కూడా కాదు.

ఏది రావాలని రాసిపెట్టి ఉంటే అది రానీ, కాని దాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇయ్యి అని కోరితే చాలు. ఆంజనేయుడు తన గుండెను చీల్చి సీతారాములను చూపించాడు అంటే దాని అర్థం ఆంజనేయుడు సీతారాములను తన గుండెలోనే ప్రతిష్ఠ చేసుకున్నాడు. అలా మీరు కూడా మీ ఇష్టదేవతను మీ గుండెలో ప్రతిష్ఠ చేసుకుని, ఆ దైవంనుంచి ఎటువంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనే శక్తిని పుంజుకోవచ్చు.

ఆ విధంగా సంకల్పం ద్వారానో, భక్తి ద్వారానో మీరు శక్తిని పుంజుకుంటే భవిష్యత్తును ఎదుర్కొనేటందుకు మనస్సును సంసిద్ధం చేసుకోవచ్చు, వర్తమానాన్ని నవ్వుతూ స్వీకరించవచ్చు. **యాక్సెప్ట్ అండ్ అకామడేట్** సూత్రాన్ని పాటించగలుగుతారు.

దీని అర్థం ఎటువంటి పరిస్థితి వచ్చినా, మాట్లాడకుండా స్వీకరించమని కాదు. మార్చగలిగిన పరిస్థితి ఎదురైతే, తప్పకుండా మార్చటానికి ప్రయత్నించండి. కాని మార్చలేని పరిస్థితి ఎదురైతే మాత్రం, నవ్వుతూ స్వీకరించండి.

**భారతః పంచమోవేదః సుపుత్రః సప్తమో రసః**
**దాతా పంచదశం రత్నం జామాతా దశమో గ్రహః**

మహాభారతం పంచమవేదం, సుపుత్రుడు ఏడవ రసం, దానం చేసే వ్యక్తి పదిహేనవ రత్నం, అల్లుడు దశమగ్రహం అని ఒక శ్లోకం ఉంది. నవగ్రహాలు మీ జీవితాన్ని ఆడించినట్టుగా, అల్లుడు కూడా పదవగ్రహం అంత శక్తిమంతుడిగా మీ జీవితాన్ని ఆడించవచ్చు. కాని అతన్నేమీ చేయలేరు. ఎందుకంటే అతన్నేమైనా అంటే, అతని జీవితంతో పెనవేసుకుని ఉన్న మీ అమ్మాయి జీవితం కష్టాలపాలు అవుతుంది. అందువల్ల అతని ఆగడాలను నిశ్శబ్దంగా స్వీకరించక తప్పదు (ఇది ఈ రోజులకు వర్తించదు). ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైనా, తట్టుకుని నిలబడితే, సమత్వం పాటించినట్టే అర్థం. దాన్నే యోగం అంటారు. ఆ విధంగా, ధర్మపరమైన జీవనం యోగసమత్వం పాటించటానికి తోడ్పడుతుంది.

ఇప్పుడు కర్మయోగంలోని మొదటి పదమైన కర్మకు వద్దాము.

**కర్మ** – కర్మకు అనేక అర్థాలు ఉన్నాయి. ఒక్కోసారి ఎవరైనా వారి నుదిటిమీద కొట్టుకుని **నా ఖర్మ** అంటారు. అక్కడ కర్మ అర్థం వేరు. అక్కడ అర్థం **కర్మఫలం** – అది పుణ్యఫలం అవచ్చు, పాపఫలం అవచ్చు కాని సాధారణంగా పాపఫలాన్ని సూచిస్తుంది.

కాని ఇక్కడ కర్మ అంటే అర్థం వేరు. ఇక్కడ కర్మ అంటే చేసే పని. క్రియ అనవచ్చు. ఈ కర్మను రెండు రకాలుగా విభజించవచ్చు. అవి సకామకర్మ, నిష్కామకర్మ.

1. **సకామకర్మ** – సకామకర్మ అంటే లౌకిక విజయాలకోసం చేసేది. శాస్త్రం ఈ సకామకర్మలను వీలున్నంతగా తగ్గించుకోవాలని చెబుతున్నది. కృష్ణపరమాత్మ కూడా అదే విషయం బోధిస్తాడు ఈ అధ్యాయంలో. ఎందుకంటే ఈ సకామకర్మ ఫలాల్లో మూడు దోషాలు ఉంటాయి. అవి దుఃఖమిశ్రితత్వం, అతృప్తికరత్వం, బంధకత్వం.

ఎ) **దుఃఖమిశ్రితత్వం** – ఈ కర్మఫలాలు శుద్ధ ఆనందాన్ని తీసుకుని రావు; ఆనందం వెన్నంటి దుఃఖం కూడా ఉంటుంది.

**అర్థానామ్ ఆర్జనే దుఃఖమ్ ఆర్జితానాం తు రక్షణే ।**
**నాశే దుఃఖం వ్యయే దుఃఖం కిమర్థం దుఃఖభావనా ॥**

ధనాన్ని ఆర్జించటం దుఃఖంతో కూడుకున్నది. ఎందుకంటే లౌకిక విజయాలను పొందాలంటే ఎంతో శ్రమపడాలి. ఎన్నో నిద్రలేని రాత్రులు గడపాలి, రాత్రింబవళ్ళు కష్టపడాలి, ఊర్లు తిరగాలి, వేళకి భోజనం ఉండదు, ఏది దొరికితే అది తినాలి. ఒక్కోసారి తినే తీరిక కూడా ఉండదు. చివరికి అతని శ్రమ ఫలించి బాగానే ఐశ్వర్యం పొందుతాడు కాని, ఐశ్వర్యంతో పాటే అంతకంతా అనారోగ్యాన్ని కూడా కొనితెచ్చుకుంటాడు. బి.పి., షుగర్, అల్సర్ ముందుగా వస్తాయి. బి.పి.వల్ల ఉప్పులేని ఆహారం తినాలి; షుగర్ వల్ల తీపివంటలు తినకూడదు; అల్సర్ వల్ల పులుపు జోలికి పోకూడదు. మరి మిగిలిందేమిటి? గుమ్మడిరసం మాత్రమే తాగాలి. ముప్పయి ఏళ్ళు కిందామీదా పడి, నిద్రాహారాలు మానుకుని కష్టపడింది ఇందుకా? తన కష్టఫలాన్ని మందులకు ధారపోయటానికా?

**ఆర్జితానాం తు రక్షణే** – సంపాదించటం ఒక ఎత్తైతే, సంపాదించిన ఆస్తులను నిలబెట్టుకో గలగటం ఇంకా కష్టం. పన్నులు ఎగ్గొట్టే మార్గాలను అన్వేషించాలి; నమ్మకమైన బినామీలను వెతుక్కోవాలి; రోజంతా ఆస్తి జమాఖర్చులు చూసుకోవటమే సరిపోతుంది. వయస్సుమీద పడుతున్నకొద్దీ ఆస్తికోసం పిల్లలు హెూరాహెూరీ పోట్లాడుకోవటమే కాక, అతను జీవించి ఉండగానే, అతను మరణించాక ఆస్తిని ఎలా పంచుకోవాలో, వారే నిర్ణయాలు చేసేసుకుంటారు. పొరపాటున చిన్నగా గుండెనొప్పి వచ్చిందంటే చాలు, అతనికి రోజులు లెక్క పెట్టేస్తారు.

**అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తతః సుఖలేశః సత్యమ్।**
**పుత్రాదపి ధనభాజాం భీతిః సర్వత్రైషా విహితా రీతిః॥** – భజగోవిందమ్ 29

'ఐశ్వర్యం పొంది లాభంలేదు, దాన్నుంచి కొంచెం కూడా ఆనందం పొందలేరన్నది సత్యం. ఐశ్వర్యవంతులకు పుత్రుణ్ణుంచే భయం. ఇది ప్రపంచనీతి,' అన్నారు శంకరాచార్యులవారు.

**నాశే దుఃఖమ్** – ఇంత కష్టపడి కూడబెట్టిన ధనం ఒకవేళ పోతే అది మరీ ఎక్కువ దుఃఖాన్ని కలుగజేస్తుంది. ఆ విధంగా ఆర్జన దుఃఖం; రక్షణ దుఃఖతరం, నాశనం దుఃఖతమం. లౌకిక విజయ ఫలాలలో మొదటి దోషం – **దుఃఖమిశ్రితత్వం**.

బి) **అతృప్తికరత్వం** – లౌకిక విజయంలో ఎంత పొందినా తృప్తిగా ఉండదు. అదే అతృప్తికరత్వం అంటే. మనకు ఎన్ని ఆస్తిపాస్తులు ఉన్నా, ఇంకా ఏదో కావాలనే తపన తీరదు. లక్షాధికారులు కోటీశ్వరులు అవాలనుకుంటారు. వంద రూపాయలు మాత్రమే ఉన్నతను ఇంకొక వంద కావాలనుకుంటాడు, వెయ్యి రూపాయలు ఉంటే ఇంకొక వెయ్యి రూపాయలు, లక్ష ఉంటే ఇంకొక లక్ష, కోటి ఉంటే ఇంకొక కోటి – అలా పెరిగిపోతుంది ఆశాపాశం. దానికి తృప్తి ఎక్కడ? ఇదే చూస్తాము సుభాషిత రత్నభాండాగారంలో.

**నిఃస్వో వష్టిశతం శతీ దశశతం లక్షం సహస్రాధిపః।**
**లక్షేశో క్షితిపాలతాం క్షితిపతిః చక్రేశతాం వాంఛతి।**
**చక్రేశః పునరింద్రతాం సురపతిః బ్రహ్మాస్పదం వాంఛతి।**
**బ్రహ్మా విష్ణుపదం హరిః హరపదం తృష్ణావధిం కో గతః ॥** – సుభాషిత రత్నభాండాగారం

చేతిలో డబ్బే లేనప్పుడు, వంద రూపాయలు ఉంటే చాలనుకున్నాడు. వంద వస్తే వేయి రూపాయలు కావాలనుకున్నాడు, వేయి వస్తే లక్ష, లక్ష వస్తే పృథివీపతి కావాలనుకున్నాడు. దాని తర్వాత చక్రవర్తి, దాని తర్వాత ఇంద్రపదవి. అక్కడితో కూడా తృప్తి చెందదు. ఇంద్రపదవి వస్తే బ్రహ్మ అవాలి, బ్రహ్మ విష్ణువు అవాలి, విష్ణువు శివుడు అవాలి. ఇక్కడ ఈ పేర్లు ఏ వరుసలో కావాలంటే ఆ వరుసలో మార్చుకోవచ్చు. కోరికలకు అంతెక్కడ. లౌకిక విజయ ఫలాలలో రెండవ దోషం – **అతృప్తికరత్వం**.

సి) **బంధకత్వం** – లౌకిక విజయంలో ఏది పొందినా దానికి బందీ అయిపోతాము. లౌకిక సుఖాలను పొందితే, వాటికి ఎంతగా అలవాటయిపోతామంటే, అవి లేకపోతే ఉండలేని స్థితికి వస్తాము. దానికి బానిస అయిపోతాము. ముందు ఏదైతే ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండేదో, అది తరువాత అవసరమై కూర్చుంది. అతిథిగా మన ఇంటికి వచ్చిన చుట్టం, మనకే యజమాని అయినట్టుగా, కాస్త తలదాచుకుంటే చాలని దూరిన ఒంటె, యజమానినే బయటకు తోసినట్టుగా, మన అవసరానికి ఉపయోగపడటానికి మనింటికి వచ్చిన వస్తువు, మననే దానికి బానిస చేసుకుంది. లౌకిక విజయఫలాలలో మూడవ దోషం – **బంధకత్వం**.

ఆ విధంగా లౌకిక విజయఫలాలు దోషాలతో కూడివుంటాయి. అవి సకామ కర్మలు చేస్తే వస్తాయి. ఆధ్యాత్మిక ఎదుగుదల కోరే సాధకుడు, ఈ సకామకర్మలను తగ్గించుకుని, నిష్కామ కర్మలకు రావాలి. పూర్తిగా సకామ కర్మలను మానమనటం లేదు; ఎందుకంటే లౌకిక విజయాలు పొందటానికి అవి కావాలి. కాని వాటి వెంట వచ్చే దోషాలను గుర్తు పెట్టుకుని వాటికే అంకితమవకూడదు. అవి పూర్ణత్వాన్ని ఇవ్వలేవు కాబట్టి వాటినుంచి ఎదగాలని తెలుసుకోవాలి.

2. **నిష్కామ కర్మ** – నిష్కామకర్మ చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. ఈ చిత్తశుద్ధి పొందటానికి శాస్త్రం కొన్ని కర్మలను నిర్దేశించింది. వాటిని విహితకర్మలు అంటారు. అంటే ఇవి చేసితీరాల్సిన కర్మలు. పంచమహాయజ్ఞాలు ఈ విహితకర్మల కిందికి వస్తాయి. వీటిలో అన్నీ చేయాలి, ఏదో ఒకటి కాదు. అవి – దేవయజ్ఞం, పితృయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. వీటిని వేదాలే నిర్దేశించాయి. భగవద్గీతలో కూడా అన్యాపదేశంగా చెప్పబడ్డాయి. అంతేకాదు, **తిరుక్కురల్**లో కూడా తిరువళ్ళువర్ ఈ పంచమహాయజ్ఞాలను నిర్దేశించారు.

1. **దేవయజ్ఞం** – భగవంతునికి పూజ చేయటం తప్పనిసరిగా చేసే కర్మ. మళ్ళీ ఇవి లౌకిక విజయాలకోసం చేయకూడదు. ఈ సకామకర్మలు చేస్తే కలిగే ఫలాలలోని దోషాలను ఇప్పుడే చూశాము. ఈ పూజ చిత్తశుద్ధికోసం చేయాలి. అందువల్ల, **'మమోపాత్త సమస్త దురితక్షయద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థమ్,' లేదా 'శ్రీ నారాయణ ప్రీత్యర్థమ్,'** ఈ సంకల్పం చెప్పటానికి అలవాటు పడితే, **'ధాన్యం ధనం బహుపుత్రలాభం శతసంవత్సరం దీర్ఘమాయుః,'** అనము. దాని బదులుగా **'అహం ప్రాతః సంధ్యామ్ ఉపాశిష్యే మాధ్యాహ్నికం కరిష్యే సాయం సంధ్యామ్ ఉపాశిష్యే,'** అంటాము. ఎందుకంటే భగవంతుని కృప కోరాలి, ఆధ్యాత్మిక ఆటంకాలు తొలగాలి. దురితక్షయార్థం.

ఈ దేవయజ్ఞం ఎలాగైనా చేయవచ్చు. హోమకుండంలో అగ్నిహోత్రం చేయవచ్చు, ఒక దేవతామూర్తిని ప్రార్థించవచ్చు లేదా గుడికి వెళ్ళవచ్చు. ఎలా చేసినా ఫర్వాలేదు కాని పూజ మాత్రం చేసితీరాలి. కొంతమంది ఇప్పటికీ పంచాయతన పూజ చేస్తారు. ఏమీ చేయకపోతే, సంధ్యావందనం చేసినా కూడా అది దేవయజ్ఞంలోకే వస్తుంది.

2. **పితృయజ్ఞం** – పితృదేవతల కృప కోరటం. మీకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కృపవల్లనే ఈ రోజు మీరింత వారయ్యారు. మీకొక అందమైన రూపం ఉంది అంటే అది మీ తల్లిదండ్రులు మీకిచ్చిన వరం.

**మాతాపితృభ్యాం వపుషో జనాకాభ్యాం ముదాన్వహం నమస్కరోమి**

తల్లిదండ్రులు జీవించివుంటే, వారికి ప్రతిరోజూ పాదాభివందనాలు చేయాలి; వారు ఈ లోకం విడిచి వెళ్ళిపోతే వారికి శ్రాద్ధకర్మలు చేయాలి, పితృతర్పణాలు వదలాలి. మన భారతీయ సంస్కృతిలో అన్ని భాషల వారికి ఈ పితృయజ్ఞం ఉంది. చేసే విధానం మారవచ్చేమో కాని, దాని వెనకనున్న భావన ఒకటే. అది వారి కృప కోరటం.

3. **బ్రహ్మయజ్ఞం** – దీన్ని ఋషియజ్ఞం అనికూడా అంటారు. ఇది ఋషులకు ఋణం తీర్చుకోవటం. వారివల్లనే ఈ రోజు ఇంత సనాతన ధర్మమైన మన సాంప్రదాయాన్ని అందుకున్నాము. దాన్ని ముందు తరాలవారికి కూడా అందజేయాలి. అందువల్ల ఋషియజ్ఞం చేయాలి. బ్రహ్మయజ్ఞం పేరుతో అది ఒక యజ్ఞంలా చేస్తారు కూడా.

ఋగ్వేదం తర్పయామి, యజుర్వేదం తర్పయామి, సామవేదం తర్పయామి, అథర్వవేదం తర్పయామి, ఇతిహాస పురాణం తర్పయామి, కల్పం తర్పయామి, సర్వాన్ ఋషీన్ తర్పయామి...

ఈ యజ్ఞంలో ఇలా ప్రార్థన చేశాక, సాంప్రదాయం నిలబెట్టటానికి, శాస్త్రంలోంచి కొన్ని మంత్రాలు పఠించాలి. అది మీరు చేయటమే కాదు, మీ ముందు తరాలవారికి కూడా అందజేయాలి.

**అధ్యయనమ్ అధ్యాపనం చ బ్రహ్మయజ్ఞః।**

ఇక్కడ బ్రహ్మ అంటే వేదం; బ్రహ్మయజ్ఞం అంటే వేదాలను నిలబెట్టటం లేదా వేదాలను ప్రచారణ చేయటం లేదా వేదాలను అందజేయటం. తైత్తిరీయంలో ఈ విషయం పదేపదే వస్తుంది.

**ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ।**

**తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ।** – తైత్తిరీయమ్

చివరికి **స్వాధ్యాయప్రవచనాలే** ముఖ్యం అంది తైత్తిరీయం.

4. **మనుష్యయజ్ఞం** – తోటి మానవులకు సేవ చేయటం. ఈ రోజు మీరు హాయిగా జీవిస్తున్నారు అంటే, దాని వెనక ఎందరిదో కృషి ఉంది. మీరు వేసుకున్న దుస్తుల వెనక ఎందరి పనితనమో ఉంది; మీరు కాఫీ తాగుతున్నారంటే, దాని వెనక ఎందరి శ్రమో ఉంది. మీరు వేసుకునే దుస్తులకు దారం దగ్గర్నుంచీ మీరే ఏర్పాటు చేసుకోవాలంటే అది జరిగే పనేనా? అలాగే మీరు తాగే కాఫీకి, కాఫీగింజలనుంచి మీరే సమకూర్చుకోవాలంటే అది సాధ్యమయ్యే పనేనా?

మీ జీవితంలో మీరు అనుభవిస్తున్న ప్రతి ఒక్కక్షణం కూడా ఎందరో కృషి ఫలితం. అందువల్ల మీరు కృతజ్ఞతాపూర్వకంగా సమాజానికి ఏదైనా తిరిగి ఇవ్వాలి. మీరు చేయగలిగిన తేలికైన పని నలుగురు అన్నార్తులకు భోజనం పెట్టటం. అందువల్ల మనుష్యయజ్ఞం అంటే అతిథిపూజనమ్. రోజూ భోజనం పెట్టలేకపోతే, రోజూ కొంత ధనం, కొంత బియ్యం పక్కకు పెట్టి, అవసరమైనప్పుడు వాటిని నలుగురికి ఉపయోగించటం. ఒక్కమాటలో చెప్పాలంటే, సమాజసేవను మనుష్యయజ్ఞం అంటారు.

చాలామంది స్వామీజీని ఈ ప్రశ్న అడుగుతూ ఉంటారు, 'స్వామీజీ, శ్రాద్ధకర్మలు చేసే బదులు బీదవారికి అన్నదానం చేయవచ్చా?' బీదవారికి అన్నదానం చేయమని శాస్త్రం కూడా చెబుతుంది నిజమే కాని అది పితృయజ్ఞం బదులుగా చేయలేరు. శ్రాద్ధకర్మలు పితృయజ్ఞంలోకి వస్తే అన్నదానం మనుష్యయజ్ఞంలోకి వస్తాయి. ఒక యజ్ఞం బదులు ఇంకొక యజ్ఞం చేయలేరు. శాస్త్రం ఐదు యజ్ఞాలూ చేసి తీరాలంటుంది. శ్రాద్ధకర్మలతో **పాటు** అన్నదానం చేయవచ్చు కాని, శ్రాద్ధకర్మలకు **బదులుగా** అన్నదానం చేయకూడదు. శ్రాద్ధకర్మలు చేసి, ఇంకా కావాలంటే అన్నదానం చేయవచ్చు. అనాథశరణాలయాలకు సహాయం చేయటం, బీద విద్యార్థులకు విద్యాదానం చేయటం – ఇవన్నీ కూడా మనుష్య యజ్ఞంలోకి వస్తాయి.

5. **భూతయజ్ఞం** – జంతువులను పూజించటం. జంతువులను మనకన్నా తక్కువస్థాయి జీవులుగా చూడకూడదు. ఎందుకంటే ఒక్కోసారి మనుష్యులు పశువులకన్నా హీనంగా ప్రవర్తిస్తారు. మనిషికి నిలువెల్లా విషమే అంటారు. పావురాలకు గింజలు వేయటం, జంతువులకు త్రాగేనీరు అందుబాటులో ఉంచటం భూతయజ్ఞంలోకి వస్తాయి. అంతేకాదు, చెట్లను పూజించటం కూడా భూతయజ్ఞంలోకే వస్తుంది.

ఇప్పుడు సైన్సు కూడా పర్యావరణ రక్షణకోసం వృక్షాలను రక్షించాలంటున్నది. మనకు పర్యావరణ రక్షణ అంటే ఏమిటో తెలియకముందే, వేల సంవత్సరాల క్రిందటే, మన సాంప్రదాయంలో వృక్షాలను పూజించటం ఉంది. కాళిదాసు రచించిన శాకుంతలమ్ చదివితే, శకుంతల చెట్లు, చేమలను ఎంత ఆప్యాయంగా చూసేదో అర్థమవుతుంది.

**పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం యుష్మాస్వపీతేషు యా,**
**నాదత్తే ప్రియమణ్డనాపి భవతాం స్నేహేన యా పల్లవమ్।**
**ఆద్యే వః కుసుమప్రసూతి సమయే యస్యా భవత్యుత్సవః,**
**సేయం యాతి శకున్తలా పతిగృహం సర్వైరనుజ్ఞాయతామ్ ॥** – శాకుంతలమ్ 4.8

చెట్లను సంబోధిస్తూ కణ్వమహర్షి ఇలా అంటాడు, "ఓ వృక్షాల్లారా, మీరు నీరు త్రాగందే (మీకు నీరు పోయందే) శకుంతల నీరు తాగేది కాదు. శకుంతలకు అలంకరణ అంటే ఇష్టమే అయినా, మీమీద అభిమానం కొద్దీ, మీ ఆకులను కాని, పూలను కానీ కోసేది కాదు. మీ ఆకులు చిగురించినా, మీ పూలు మొగ్గ తొడిగినా పండుగ వచ్చినంతగా మురిసిపోయేది. ఈరోజు మీ ప్రియసఖి తన భర్త దగ్గరకు వెళుతోంది, ఆమెను మీరు ఆప్యాయంగా సాగనంపండి."

పూర్వం అలా చెట్లను కూడా కుటుంబసభ్యులుగా చూసేవారు. శకుంతల ఆశ్రమం విడిచి వెళ్ళబోతుంటే, ఒక లేడిపిల్ల వచ్చి, వెళ్ళవద్దన్నట్టుగా ఆమె కొంగుపట్టి లాగుతుంది. ఈ సన్నివేశాల వర్ణనలు చూస్తుంటే మన పూర్వీకులకు చెట్లన్నా, జంతువులన్నా, అసలు ప్రకృతి అన్నా ఎంత ఆరాధ్యభావన ఉండేదో అర్థమవుతుంది.

ఈ పంచమహాయజ్ఞాలు నిష్కామకర్మ కిందకు వస్తాయి. ఎందుకంటే, ఈ కర్మలవల్ల లౌకిక విజయాలు కలగవు. వీటివల్ల ఆధ్యాత్మిక ఎదుగుదల కలుగుతుంది; మనస్సు సున్నితంగా అవుతుంది; చిత్తఏకాగ్రత కలుగుతుంది. ఈ పంచమహాయజ్ఞాల గురించి ఈ క్రింది శ్లోకంలో చూస్తాము.

**అధ్యాపనం బ్రహ్మయజ్ఞః పితృయజ్ఞస్తు తర్పణమ్।**
**హోమో దైవో బలిర్భౌతో నృయజ్ఞో ఽ తిథిపూజనమ్॥**

**అధ్యాపనం బ్రహ్మయజ్ఞః** – బ్రహ్మయజ్ఞం అంటే శాస్త్రాన్ని ప్రచారం చేయటం.

**పితృయజ్ఞస్తు తర్పణమ్** – పితృయజ్ఞం అంటే తర్పణాలు వదలటం.

**హెూమో దైవః** – దైవయజ్ఞం అంటే హెూమాలు, పూజలు చేయటం.

**బలిర్భౌతః** – భూతయజ్ఞం లక్ష్యార్థం తోటి జీవరాసులను హింసించకుండా ఉండటం. వాటికి రక్షణ కల్పించటం.

**నృయజ్ఞో ऽ తిథిపూజనమ్** – మనుష్యయజ్ఞం అంటే అతిథి, అభ్యాగతులను ఆదరించటం.

అందువల్ల మీరు సకామకర్మలను తగ్గించుకుని, శ్రద్ధగా నిష్కామకర్మలను చేయాలి. నిష్కామకర్మలనే విహితకర్మలనీ, నియతకర్మలనీ, నైమిత్తిక కర్మలనీ అంటారు. ఎవరైతే ఈ కర్మలు చేస్తారో, వారు చిత్తశుద్ధి, ఆధ్యాత్మిక ఎదుగుదల పొందుతారు.

**బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే ।**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥** – 2.50

కర్మయోగి, జ్ఞానయోగానికి వచ్చి తన స్వస్వరూపాన్ని తెలుసుకుంటే, కర్మఫలాలకు అతీతంగా ఎదుగుతాడు. కాని ఆ జ్ఞానానికి రావాలంటే ఇప్పుడు నువ్వు కర్మయోగం పాటించాలి అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కర్మయోగం అంటే **కర్మ చేయటంలో చూపే ప్రజ్ఞ**. చేసే కర్మలను ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం వాడటం ప్రజ్ఞ. ఈ ప్రజ్ఞను 'ఆరోగ్యకరమైన పరతంత్రం' అంటారు. లౌకిక విజయాలకోసం కర్మను ఉపయోగిస్తే, అది ప్రజ్ఞ చూపకుండా కర్మ చేసినట్టు అవుతుంది. ఎందుకంటే ఆ కర్మ మిమ్మల్ని బందీలుగా చేస్తుంది. అలా కర్మలో కూరుకుపోయిన వ్యక్తిని వర్క్‌హాలిక్ అంటారు. అతనికి ఎంత సంపాదించినా తృప్తి ఉండదు. ఇంకా ఇంకా పనులు చేసి, ఇంకా ఇంకా సంపాదించాలనే తపన ఉంటుంది.

ఈ తపన లేకపోతే, రెండవదశలో కర్మలనుంచి విశ్రాంతి పొందవచ్చు. ఆధ్యాత్మిక జీవనాన్ని గడపవచ్చు; దానివల్ల లాభం పొందవచ్చు. కాని అలా చేయాలంటే కర్మను సమర్థవంతంగా చేసివుండి ఉండాలి. అది తెలియకపోతే, కర్మల్లోకి అడుగు పెడతారు కాని, వాటినుంచి ఎలా బయటపడాలో తెలియదు. అలా ఉంటే కర్మ కూడా ఒక వ్యసనం అయి కూర్చుంటుంది.

చాలామందికి సెలవలు వస్తున్నాయంటే భయం. ఎందుకంటే సెలవలు ఎలా గడపాలో తెలియదు. వారు కర్మ చేయకుండా ఉండే జీవితాన్ని ఊహించుకోలేరు. దాని బదులుగా వారు ధర్మపరమైన జీవనం గడిపితే, ముందు కర్మలు చేస్తారు, నిజమే కాని, కొన్నాళ్ళ

తరువాత వాటినుంచి ఎలా బయటపడాలో, రెండవదశ అయిన జ్ఞానయజ్ఞంలో ఎలా అడుగుపెట్టాలో తెలుసుకుంటారు. ఇదంతా కర్మ గురించి.

**యోగం** – ఇప్పుడు మళ్ళీ యోగం పదం చూద్దాము. కర్మయోగంలోని రెండవ పదం యోగం. యోగం అంటే సమత్వం పాటించటం. సమత్వం పాటించటమంటే సుఖదుఃఖాలకు చలించకపోవటం. సమత్వం దెబ్బ తినటానికి కారణం, సాధారణంగా మీరు భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతుంటారు. దానికి ఒక్కటే మార్గం ఉంది. రానున్నది రాకమానదు. ఏదొచ్చినా నవ్వుతూ స్వీకరించాలి, మనస్సును సిద్ధం చేసుకోవాలి – **యాక్సెప్ట్ అండ్ అకామడేట్** అని అంతకుముందు కూడా చూశాము. అలా చేయాలంటే దైవంమీద భారం వేయాలి. దైవంమీద భారం వేయాలంటే, దైవభక్తి మెండుగా ఉండాలి.

భవిష్యత్తే కాదు, వర్తమానంలో కూడా కొన్ని పరిస్థితులను మనం మార్చలేము. దానివల్ల కూడా మనస్సు కలత చెందుతుంది. మార్చలేని పరిస్థితులను నవ్వుతూ స్వీకరించటం నేర్చుకోవాలి. దీనికి కూడా భక్తే తోడ్పడుతుంది.

భవిష్యత్తులో ఏం రాసిపెట్టి ఉన్నా దాన్ని నవ్వుతూ స్వీకరించటానికి, వర్తమానంలో మార్చలేని పరిస్థితులను నవ్వుతూ స్వీకరించటానికి మనస్సును సంసిద్ధం చేసుకోవటమే సమత్వం పాటించే పద్ధతులు.

భవిష్యత్తు, వర్తమానం గురించి మాట్లాడితే, గతం గురించిన మాటేమిటి అని సందేహం రావచ్చు ఎవరికైనా! కొంతమందిని ఘోరమైన గతం వెంటాడుతూనే ఉంటుంది. అప్పుడూ వారు సమత్వం పాటించలేరు. గతాన్ని ఎలా మర్చిపోవాలి? దీనికి కూడా జవాబు ఒకటే. జరిగిపోయిందేదో జరిగిపోయింది. దాన్ని ఏమాత్రం మార్చలేరు. అందువల్ల గతం కూడా మార్చలేని పరిస్థితుల కిందకు వస్తుంది. గతాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించగలగాలి. అలా స్వీకరించే శక్తి లేకపోతే, భగవంతుణ్ణుంచే ఆ శక్తిని కూడా కోరాలి. గతంనుంచి నేర్చుకోవాలి తప్పితే, గతం గురించి బాధపడినా, పశ్చాత్తాపపడినా, బెంగపడినా, అది వర్తమానాన్ని దెబ్బతీస్తుంది. అందువల్ల భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో ఏం జరిగినా నవ్వుతూ స్వీకరించటం, మనస్సును సంసిద్ధం చేసుకోవటం నేర్చుకోవాలి.

**సమాధియోగం** – శంకరాచార్యులవారు కర్మయోగంమీద ఈ శ్లోకం గురించి భాష్యం రాస్తూ దానికి ఇంకొక సాధనను కూడా సూచిస్తున్నారు.

**ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।**
**బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ॥** – 2.39

ఇంతవరకూ నీకు ఉపనిషత్తుల్లో విశదీకరించిన ఆత్మజ్ఞానం గురించి చెప్పాను. ఇకనుంచి కర్మయోగం గురించి చెప్పబోతున్నాను. ఈ కర్మయోగాన్ని నేర్చుకుంటే కర్మబంధాలనుంచి విముక్తడవుతావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

సమాధియోగం అంటే పతంజలి ఋషి నిర్దేశించిన అష్టాంగయోగం. అష్టాంగయోగం వివరాలలోకి వెళ్ళటం లేదు మనం. కాని అష్టాంగయోగంయొక్క లక్ష్యమేమిటో చూద్దాము. అష్టాంగయోగంయొక్క లక్ష్యం – బాహ్యాముఖంగా పరుగులు తీసే మనస్సును అంతర్ముఖం చేయటం. కర్మయోగి అనేక కర్మలను చేస్తాడు. కర్మలు చేయాలంటే మనస్సు బాహ్యాముఖంగా పరుగులు తీయాలి. అలాంటప్పుడు, మీరు కర్మల్లోనే కూరుకుపోతే, బాహ్యాముఖంగా ఎంతగా పరుగులు తీస్తూ ఉంటారంటే, ఆ పరుగులు ఆపి, అంతర్ముఖులవటం కష్టమవుతుంది. అంతర్ముఖులు అవలేకపోతే జ్ఞానయోగానికి తరువాత రాలేరు.

ఎప్పటికైనా జ్ఞానయోగానికి రాకతప్పదు; మీ స్వస్వరూపం గురించి తెలుసుకోక తప్పదు. కాని బహిర్ముఖంగా ఉన్న మనస్సు, ఆత్మవిచారణ చేయలేదు. మనస్సును అంతర్ముఖం చేయటానికి, కర్మయోగంలోనే కొన్ని సాధనలు ఇవ్వబడ్డాయి. అష్టాంగయోగం అలా అంతర్ముఖం చేయటానికి తోడ్పడుతుంది. అంతేకాదు, శాస్త్రమే అనేక ఉపాసనలను, ధ్యానాలను నిర్దేశించింది దీనికోసం.

మనస్సు బాహ్యంగా పరుగులు తీయటమే కాదు, అంతర్ముఖం అవటంకోసం నేర్చుకోవాలి; మనస్సు మనుష్యులతో కలిసి ఉండటమెలాగో నేర్చుకోవటమే కాదు, మనుష్యులు లేకపోయినా శూన్యభావన కలగకుండా ఉండటమెలాగో కూడా నేర్చుకోవాలి; మనస్సు కర్మలు చేయటమెలాగో నేర్చుకోవటమే కాదు, కర్మలు చేయకుండా ఉండగలగటమెలాగో కూడా నేర్చుకోవాలి. అలా మనస్సును నియంత్రించుకుంటే కాని,ఆత్మజ్ఞానం పొందలేరు.

ఆ విధంగా కర్మయోగాన్ని సమాధియోగం లేదా ఉపాసనయోగం సమతుల్యం చేస్తుంది. దీన్ని కర్మ ఉపాసన సముచ్చయం అంటారు. మీరు రోజూ చేసే సంధ్యావందనం దీనికి కావాల్సిన సాధనను అందిస్తుంది. పొద్దున్న సంధ్యావందనంలో మీరు ఒంటరిగా ప్రార్థన చేస్తారు; రోజంతా నలుగురితో కలిసి వ్యవహారాలు నడుపుతారు, మళ్ళీ సాయంసంధ్యలో అంతర్ముఖులవుతారు. ఆ విధంగా కర్మను, ఉపాసనను జత చేయాలి.

**కర్మయోగఫలం** – కర్మయోగఫలం ఏమిటి? చాలామంది అడుగుతూ ఉంటారు, 'ఎన్నాళ్ళు కర్మయోగం చేయాలి? జ్ఞానయోగం పొందటానికి ఎప్పుడు అర్హత వస్తుంది? కర్మయోగ ఫలం పొందానని ఎలా తెలుస్తుంది?' దీనికి జవాబు ఒక్కటే.

కర్మయోగఫలం జ్ఞానయోగయోగ్యతాప్రాప్తి. జ్ఞానయోగం పొందటానికి కావాల్సిన అర్హతను ఇస్తుంది. ఏమిటా అర్హత? ఇది తరువాత ఉదయించే ప్రశ్న. ఏ రంగానికి కావాల్సిన అర్హత

ఆ రంగానికి తగినదై ఉంటుంది. సైన్యంలో చేరాలంటే శారీరక దారుఢ్యం ఉండాలి. పొడుగు, బరువు వారు కోరినంత ఉండాలి. ఐ.ఐ.టీలో చేరాలంటే ఒక అర్హత ఉండాలి. సంస్కృత కళాశాలలో చేరాలంటే ఇంకొక అర్హత ఉండాలి. అలాగే జ్ఞానయోగం పొందాలంటే, కర్మయోగం ద్వారా పొందాల్సిన అర్హత ఏమిటి? ఈ అర్హతను **అధికారిత్వం** అని కూడా అంటారు. శాస్త్రం ఈ అర్హతను **సాధన చతుష్టయ సంపత్తి**గా అభివర్ణిస్తుంది. దీన్ని కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో సూచనప్రాయంగా పేర్కొన్నాడు.

**యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥** – 2.52

**శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
**సమాధావచలా బుద్ధిస్తదా యోగమవాప్స్యసి ॥** – 2.53

మోహమనే ఊబినుంచి పూర్తిగా బయటపడినప్పుడే నువ్వు విన్న, వినబోతున్న ఇహపరలోక సంబంధమైన సమస్త భోగాలనుంచి వైరాగ్యాన్ని పొందగలవు.

అనేక విధాలైన మాటలను వినటంవల్ల అయోమయంలో పడ్డ నీ బుద్ధి, పరమాత్మయందు నిశ్చలంగా, స్థిరంగా ఉన్నప్పుడే నువ్వు ఈ యోగాన్ని, అంటే పరమాత్మతో శాశ్వతసంయోగాన్ని పొందగలవు.

జ్ఞానయోగం పొందటానికి కావాల్సిన అర్హత – సాధన చతుష్టయ సంపత్తి. అవి నాలుగు– వివేకం, వైరాగ్యం, శమాది షట్కసంపత్తి, ముముక్షుత్వం. వీటినే ఇంగ్లీషులో వరుసగా – discrimination, dispassion, discipline, desire అంటారు. వీటిని స్వామీజీ 'Four Ds' అంటారు. వీటిని వివరంగా చూద్దాము.

1. **వివేకం** – వివేకం అంటే బంధానికీ, స్వేచ్ఛకూ మధ్య ఉన్న భేదాన్ని గుర్తించటం; పరతంత్రానికీ, స్వతంత్రానికీ మధ్య ఉన్న భేదాన్ని గుర్తించటం. ఈ విచక్షణాశక్తి లేకపోతే, జీవితంలో మీరు పొందాల్సిన లక్ష్యాలేమిటో తెలియదు. అది తెలియక, ఒకదానిమీద ఆధారపడే పరిస్థితినుంచి ఇంకొకదానిమీద ఆధారపడే పరిస్థితికి చేరుకుంటారు లేదా మీరు ఆధారపడే వస్తువుల సంఖ్యను పెంచుకుంటూ పోతారు.

ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. అన్ని రంగాల్లోనూ ఉన్నతి సాధించారు కాని, అభివృద్ధి పేరిట, అంతకంతకూ పరాధీనత ఎక్కువై పోతున్నది. పూర్వం, కొన్ని వస్తువులు లేకపోతే బాధపడేవారు; ఇప్పుడు, కొన్ని సంవత్సరాలలోనే, చాలా వస్తువులు పొందాలనే తపన, అవి లేకపోతే బాధ ఎక్కువై పోతున్నది. లౌకికంగా చూస్తే ఎంత ఎక్కువ వస్తువులను మీరు పొందితే, అంత ఎక్కువగా విజయం సాధించినట్టు అర్థం. కాని వేదాంతపరంగా

చూస్తే, మీరు ఆనందంగా ఉండటానికి, చాలా ఎక్కువ వస్తువులు కావాలంటే మీరు విజయం పొందలేదు అంటుంది.

నిజానికి మీరు ఆధారపడే వస్తువులు ఇప్పుడు పెరిగాయి అంటే, మీరు ఆనందంగా ఉండటానికి మీకు ఇంకా ఎక్కువ వస్తువులు కావాలనీ, మీరు ఇంకా బలహీనంగా తయారయ్యారనీ దాని అర్థం. పరాధీనత ఎంత ఎక్కువగా ఉంటే, బలహీనత కూడా అంత ఎక్కువగానూ ఉంటుంది. అందువల్ల, లౌకిక జీవనవిధానం ఒక వ్యక్తి ఎన్ని వస్తువులను సమకూర్చుకుంటే, అతను అన్ని విజయసోపానాలు ఎక్కినట్టుగా భావిస్తే, వైదిక జీవనవిధానం మాత్రం అతను కిందికి దిగజారాడు అంటుంది. ఎందుకంటే అతను పరాధీనుడు అవటంవల్ల బలహీనుడు అయ్యాడు. అంటే అతను పరతంత్రంనుంచి ఇంకా ఎక్కువ పరతంత్రంలో పడ్డాడు.

అందువల్ల విజయం అంటే ఏమిటో, ఓటమి అంటే ఏమిటో మనకు తెలియదు. లౌకిక విజయాలు, విజయం అని ఆధునిక జీవనం అంటే, వాటిని ఒప్పుకోదు శాస్త్రం.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః**

మీకు ఏమీ లేకపోయినా, మీరు ఆనందంగా ఉంటే, మీరు విజేతలు అంటుంది శాస్త్రం. వివేకం అంటే జీవితంలో ఏది ముఖ్యమో అది అర్థం చేసుకోవటం. ఏది ముఖ్యం? మీరు తోటి మనుష్యులమీద, పరిస్థితులమీద, వస్తువులమీద ఆధారపడేకన్నా మీమీదే మీరు ఆధారపడాలని అర్థం చేసుకోవాలి. వీటిని వాడవచ్చు తప్పు లేదు కాని వీటిమీద పూర్తిగా ఆధారపడకూడదు. దేనిమీద ఆధారపడాలో, దేనిమీద ఆధారపడకూడదో తెలుసుకోగలిగితే, దాన్ని నిత్యానిత్యవస్తువివేకం లేదా బంధముక్తివివేకం అంటారు.

2. **వైరాగ్యం** – ఎప్పుడైతే ఈ నిత్యానిత్యవస్తువివేకం ఏర్పడుతుందో, అప్పుడే దాని సహజపరిణామంగా వైరాగ్యం ఏర్పడుతుంది. వైరాగ్యం అంటే ఏమిటి? మనుష్యులమీద, పరిస్థితులమీద, వస్తువులమీద ఆధారపడక పోవటం. మీరు మనుష్యులమీద, పరిస్థితులమీద, వస్తువులమీద ఆధారపడకూడదని, వాటిమీద ఆధారపడితే, అంతకంతకూ బంధంలో కూరుకుపోతారని అర్థం చేసుకున్నకొద్దీ వైరాగ్యం పెరుగుతూ వస్తుంది. ఎందుకు వాటిమీద ఆధారపడకూడదు? మనుష్యులు, వస్తువులు ఏవీ శాశ్వతం కాదు. అవి ఎప్పుడైనా మీనుంచి విడిపోవచ్చు. అవి పోయిన మరుక్షణం మీరు కిందపడతారు. అందువల్ల బంధకత్వంనుంచి, ఆధారపడటంనుంచి, బయటపడటమే వైరాగ్యం.

3. **శమాదిషట్క సంపత్తి** – జీవితంలో మీరే విజయం పొందాలనుకున్నా కూడా, మీకు ఉన్న పరికరాలు ఒకటే – శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి. వీటన్నిటినీ కలిపి కార్యకరణసంఘాతం అంటారు. ఇంగ్లీషులో బాడీమైండ్ ఇంటలెక్ట్‌సెన్స్ కాంప్లెక్స్ (బి.యమ్.ఐ.)

అంటారు. ఈ కార్యకరణసంఘాతం ద్వారానే ఇటు లౌకిక విజయమైనా, అటు ఆధ్యాత్మిక విజయమైనా కూడా పొందగలరు. అందువల్ల ఈ పరికరాలను వినియోగకరంగా ఉంచుకోవాలి.

ఒక సంగీతకచేరీ ప్రారంభించే ముందు సంగీతవిద్వాంసుడు తన తంబూర శ్రుతిని సరిచేసుకుంటే, తోటి వాద్యగాళ్ళు వారివారి వాద్యాలను దానికి తగ్గట్టుగా శ్రుతి చేసుకుంటారు. అదే విధంగా మీరు కూడా మీ శరీరమనే పరికరాన్ని శ్రుతి చేసుకోవాలి. శరీరానికి మీరు బానిస కాకూడదు, శరీరం మీ చెప్పుచేతల్లో ఉండాలి. అలాగే ఇంద్రియాలు వాటి ఇష్టం వచ్చిన చోటికి మిమ్మల్ని లాక్కుపోకూడదు. మీరు కోరిన చోటికి అవి రావాలి. అలాగే మనస్సు పోయిన చోటికల్లా మీరు పోకూడదు. అలాగని భావోద్రేకాలు అనుభవించ కూడదనటం లేదు. భావోద్రేకాలవల్లనే మనిషిలోని మానవత్వం పెల్లుబుకుతుంది. అలాగని భావోద్రేకాలకు బానిసయితే, అవి మిమ్మల్ని ఒక ఆటాడిస్తాయి. మనస్సు మీమాట వినాలి కాని, మీరు మనస్సు మాట వినకూడదు. దీన్ని **మనోనిగ్రహం** అంటారు.

తరువాత బుద్ధిని అదుపులో పెట్టుకోవాలి. బుద్ధి, శాస్త్రం చెప్పిన బోధను అర్థం చేసుకోగలగాలి; తార్కికంగా ఆలోచించగలగాలి. మన శాస్త్రం, గ్రంథాలరూపంలో ఉంటుంది. అందువల్ల ఆ గ్రంథాల్లోని పదాలను, వాక్యాలను అర్థం చేసుకోవాలంటే సూక్ష్మబుద్ధి ఉండాలి.

అందువల్ల శమాదిషట్క సంపత్తి శరీరాన్ని, ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని ఎలా నియంత్రించుకోవాలో నేర్పిస్తుంది. వీటిని నియంత్రించుకోవటానికి శాస్త్రం అనేక మార్పులను సూచించింది. ఇప్పుడు మనం వాటి వివరాల జోలికి వెళ్ళటం లేదు. ఇప్పటికి శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధులను మనం అదుపులో పెట్టుకోవాలని అర్థం చేసుకుంటే చాలు.

4. **ముముక్షుత్వం** – ముముక్షుత్వం అంటే మోక్షం పొందాలనే తీవ్రతపన ఉండాలి. మోక్షం పొందటం అంటే స్వేచ్ఛ పొందటం. మీరు మనుష్యులకు కాని, పరిస్థితులకు కాని, వస్తువులకు కాని బానిస కాకూడదు. కొంతమంది మనుష్యులకు, వస్తువులకు ఎంతగా బానిస అయిపోతారంటే, వాటినుంచి అంత తేలికగా బయటపడలేరు.

పొగ త్రాగేవానికి చెప్పిచూడండి, 'నువ్వు అంతలా సిగరెట్లు కాలుస్తుంటే, అది నీ ఆరోగ్యానికి హానికరం, నీకు మృత్యువు తోసుకువస్తుంది.' దానికి అతను ప్రశాంతంగా జవాబు చెబుతాడు, 'నాకేం మృత్యుభయం లేదు. నిజానికి ఇదంతా నేను కూడా వార్తాపత్రికల్లో చదివాను. పొగత్రాగటంవల్ల కలిగే హాని బాగా వివరించారు. అప్పటినుంచి మానేశాను.' మీరు, 'అలాగా, చాలా సంతోషం,' అన్నారనుకోండి. అతని జవాబు ఏమిటో తెలుసా? 'నేను మానేసింది ఏమిటనుకున్నావు? వార్తాపత్రికలు చదవటం మానేశాను.'

పైగా ఈ వ్యసనపరుడు తనను సమర్థించుకోవటానికి కూడా చూస్తాడు. 'నేను సిగరెట్లు మానేస్తే, ఈ సిగరెట్లు తయారుచేసే కంపెనీలు ఏమయిపోవాలి?' అంటాడు. ఆ విధంగా చాలామంది మనుష్యులకు, పరిస్థితులకు, వస్తువులకు బానిసలుగా మారిపోతారు. ఇంకా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, వారు ఆ బానిస బ్రతుకే బాగుందనుకుంటారు. వారు ఆ దాసభావనలోనే ఆనందం వెతుక్కుంటారు. 'నాకు దాసుడిగా ఉండటమే చాలా ఇష్టం,' అంటారు పైపెచ్చు.

శాస్త్రం వారినేమీ అనదు. 'దీర్ఘాయుష్మాన్ భవ,' అని దీవిస్తుంది కూడా. కాకపోతే వారికొక హెచ్చరిక ఇస్తుంది. 'మీరు సంసారిగా కొనసాగుతుంటే, నాకేమీ అభ్యంతరం లేదు. కాని జాగ్రత్త! రేపు మీరు ఏ మనుష్యులను, పరిస్థితులను, వస్తువులను చూసుకుని మురిసిపోతున్నారో, అవన్నీ కానీ, వాటిలో ఏవైనా కానీ, మీనుంచి ఎప్పుడో ఒకప్పుడు దూరమవక తప్పదు. అప్పుడు ఏడ్చి, మొత్తుకుని లాభం లేదు. దేవునితో మొరపెట్టుకున్నా, దేవుణ్ణి నిందించినా లాభం లేదు.' ఇన్ని పూజలు చేశానే నీకు కళ్ళు లేవా, చెవులు లేవా, నాకు ఎందుకు ఇన్ని కష్టాలను ఇస్తున్నావు అని అప్పుడు అడగకూడదు అంటుంది శాస్త్రం. ఎందుకంటే, బంధకత్వం అనేది ఎప్పుడూ దుఃఖమిశ్రితత్వమే అని శాస్త్రం ముందే చెప్పింది. ఈ బంధకత్వంనుంచి బయటపడాలనే తీవ్రతపననే ముముక్షుత్వం అంటారు.

ఈ నాలుగింటినీ – వివేకం, వైరాగ్యం, శమాదిషట్క సంపత్తి, ముముక్షుత్వం – కలిపి సాధన చతుష్టయ సంపత్తి అంటారు. ఈ సాధన చతుష్టయ సంపత్తిని పొందితే, కనీసం కొంతమేరకు పొందితే, మీరు అధికారి అవుతారు. అంటే మీరు జ్ఞానయోగాన్ని పొందటానికి అర్హుడవుతారు. దీన్ని జ్ఞానయోగయోగ్యత అంటారు. ఇక్కడితో కర్మయోగం అంశం ముగిసింది.

**2. జ్ఞానయోగం : శ్లోకాలు 11–38** ఇప్పుడు జ్ఞానయోగాన్ని చూద్దాము. జ్ఞానయోగంలో పరతంత్రభావననుంచి స్వతంత్రభావనకు ఎలా రావాలో నేర్చుకుంటారు.

అర్థకామధర్మపురుషార్థాల అవసరం లేకుండా, మీలోనే మీరు భద్రతను ఎలా వెతుక్కోగలరో నేర్పిస్తుంది. మీరు అర్థం కోరుకుంటే మీలోనే వెతుక్కోవాలి అంటుంది; మీరు కామాన్ని కోరుకుంటే, మీలోనే పొందండి అంటుంది; మీరు ధర్మాన్ని కోరుకుంటే, దాన్నీ మీలోనే పొందండి అంటుంది. అదెలా సాధ్యం?

శాస్త్రం మీ స్వస్వరూపమేమిటో వివరిస్తుంది. ప్రతివ్యక్తిలోనూ ఒక చిన్న నేను, ఒక పెద్ద నేను ఉన్నాయంటుంది. చిన్న నేనుని అపరాప్రకృతి అంటే, పెద్ద నేనును పరాప్రకృతి అంటుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, చిన్న నేనును అహంకారం అంటే, పెద్ద నేనును ఆత్మ అంటుంది. అహంకారాన్ని కర్త లేదా జీవాత్మ అనికూడా అంటారు. మీరు ఎంతసేపూ అహంకారంతో

మమేకం చెందుతారు. దానివల్ల మీరు బద్ధజీవులయి, పరాధీనతో ఉండి, బాధాతప్తజీవులు అవుతారు.

అందువల్ల శాస్త్రం మీరు మీ పెద్ద నేనును తెలుసుకోండి, మీ పరాప్రకృతిని తెలుసుకోండి. దాన్ని తెలుసుకుంటే మీరు శాంతి, భద్రత, ఆనందాలు బయటనుంచి పొందాలని తాపత్రయ పడరు అంటుంది. ఎందుకంటే మీరే పూర్ణపురుషులు; మీరే భద్రతామూర్తులు; మీరే ఆనందస్వరూపులు. కాబట్టి జ్ఞానయోగాన్ని ఒక్కమాటలో నిర్వచించాలి అంటే మీ స్వస్వరూపాన్ని తెలియజేసేది జ్ఞానయోగం. ఈ స్వస్వరూపం తెలుసుకోవటమెలా?

ఈ స్వస్వరూపం తెలుసుకోవాలంటే మీరు ప్రధానంగా రెండు అంశాలను జీర్ణించుకోవాలి. అవి –

1. అనుభవించే నేను, అనుభవించబడే వస్తువుకు భిన్నంగా ఉన్నాను.

2. అనుభవంలోకి వచ్చే గుణాలు అనుభవించబడే వస్తువుకు చెందుతాయి, అనుభవించే నాకు కాదు. వీటిని వివరంగా చూద్దాము.

**1. అనుభవించే నేను, అనుభవించబడే వస్తువుకు భిన్నంగా ఉన్నాను.**

ఈ సూత్రం వేదాంతంయొక్క ప్రాథమిక సూత్రం. నిజానికి, వేదాంతం ఈ పునాదిమీదనే ఉద్భవించింది. అనుభవం వేరు, అనుభవించే వ్యక్తి వేరు; సబ్జెక్టు అయిన నేను, ఆబ్జెక్ట్ అయిన వస్తువుకు భిన్నంగా ఉన్నాను. ఈ ప్రాథమిక సూత్రాన్ని మన దైనందిన జీవితంలోని అనుభవాలనుంచి తెలుసుకోగలము.

కన్ను ఉదాహరణే తీసుకోండి. ప్రపంచంలో ఉన్న వస్తువులన్నింటినీ కన్ను చూడగలదు. మీ కళ్ళతో ఈ గదిలో ఉన్న అందరినీ చూడగలుగుతున్నారు; గదిలో ఉన్న వస్తువులన్నింటినీ చూడగలుగుతున్నారు. ఈ పుస్తకంలో ఉన్న ప్రతి ఒక్క పదాన్నీ చదవగలుగుతున్నారు. కాని ఒక్కటి మాత్రం చేయలేకపోతున్నారు. ఏమిటది? మీ కంటితో మీ కన్నును చూడలేక పోతున్నారు. అంటే అన్నింటినీ చూసే కన్ను, తనను తాను చూసుకోలేకపోతున్నది.

అలాగే మీ వేలికొనతో అన్ని వస్తువులనూ ముట్టుకోగలరు, అందరు మనుష్యులనూ ముట్టుకోగలరు. కాని ఆ వేలికొనతో అదే వేలికొనను ముట్టుకోలేరు. ఆధునిక ఉదాహరణ కావాలంటే, మీ సెల్‌ఫోన్ నుంచి మీరు తక్కిన అందరికీ ఫోను చేయగలరు కాని, మీకు మీరు ఫోను చేసుకోలేరు. మీ ఫోను ఎంత ఖరీదైనదైనా సరే, ఎంత ఆధునికమైనదైనా సరే మీకు మీరు ఫోను చేసుకోలేరు. అంటే సబ్జెక్టును ఎన్నటికీ ఆబ్జెక్టుగా చూడలేరు. అనుభవించే మీరు, అనుభవించబడే వస్తువు కాలేరు ఎన్నటికీ. సబ్జెక్ట్ ఎప్పటికీ సబ్జెక్టే, ఆబ్జెక్ట్ ఎప్పటికీ ఆబ్జెక్టే. సబ్జెక్ట్, ఆబ్జెక్టుగా చూడబడలేదు.

**దృగేవ న తు దృశ్యతే**

సబ్జెక్టు చూసే దృక్ మాత్రమే, చూడబడే దృశ్యం ఎన్నటికీ కాలేదు. ఇది మొదటి సూత్రం. రెండవ సూత్రానికి వెళ్ళేముందు ఈ మొదటి సూత్రంనుంచి కొన్ని ఉపసిద్ధాంతాలను చూద్దాము.

ఎ) **నేను జగత్తు కాదు** – మొదటి సూత్రం సారం ఏమిటి?

**నాకు అనుభవంలోకి వచ్చేది ఏదీ, నేను కాదు**

ముందు ఈ సూత్రాన్ని, జగత్తుకు అన్వయించి చూద్దాము. నేను జగత్తును అనుభవిస్తున్నాను కాబట్టి, నేను జగత్తు కాదు. అది నాకు అనుభవంలోకి వచ్చే వస్తువు మాత్రమే. అందువల్ల నేను జగత్తును కాను. ఈ విషయాన్ని ఎవరైనా తేలికగానే జీర్ణించుకోగలరు. నా ముందున్న వస్తువులను తీసుకుని, నేను అవేవీ కావని, ఒక్కొక్కటిగా కొట్టివేయవచ్చు. నేను మాట్లాడటానికి వాడే మైకుని కాను, నేను రాయటానికి వాడే పెన్నుని కాను, నేను చదువుతున్న పుస్తకాన్ని కాను, నేను అన్నింటినీ చూడటానికి వాడే కళ్ళజోడును కాను; నేను టైము చూపే గడియారాన్ని కాను.

బి) **నేను శరీరం కాదు** – ఈ సూత్రాన్ని మరి కొంచెం పొడిగిద్దాము; కాకపోతే, దీన్ని అంత తేలికగా జీర్ణించుకోలేము. జగత్తు, నాకు అనుభవంలోకి వస్తోంది కాబట్టి నేను జగత్తు కాదు, బాగుంది. జ్ఞానయోగం ఈ శరీరం కూడా ప్రపంచంలాగా నాకు అనుభవంలోకి వస్తున్నది అంటుంది. నేను ప్రపంచం ఆబ్జెక్టు అని ఎంత స్పష్టంగా తెలుసుకుంటానో, ప్రపంచాన్ని ఎంత స్పష్టంగా అనుభవిస్తానో, అదే విధంగా, అంత స్పష్టంగానూ ఈ శరీరాన్ని కూడా అనుభవిస్తాను కాబట్టి, నాకు అనుభవంలోకి వస్తున్న ఈ శరీరాన్ని కూడా నేను కాదు అంటుంది వేదాంతం.

ఒకవేళ మీరు వేదాంతానికి ఇంతవరకూ రాకపోయివుంటే, ఈ విషయాన్ని జీర్ణించుకోవటం మీకు కష్టం అవవచ్చు కాని, దాన్ని వెంటనే తిరస్కరించకండి. మీ సందేహాన్ని పక్కకు పెట్టండి, కొంతసేపు ఆగండి, దాన్ని తీర్చుకునేదాకా దాన్ని తిరస్కరించకండి; ఎందుకంటే మీరు శరీరం కాదని పెద్దగా నిరూపించనవసరం లేదు కూడా. కాని మీకు తార్కికంగా నిరూపణ కావాలంటే, తక్కిన సూత్రాలతో బేరీజు వేయవచ్చు.

సైన్సు తీసుకుంటే, సైన్సు ప్రకారం శరీరం పదార్థంతో చేయబడింది. వేదాంతశాస్త్రం ప్రకారం కూడా శరీరం పాంచభౌతికం – ఆకాశం, వాయువు, నీరు, అగ్ని, పృథివితో చేయబడింది. ఈ పాంచభౌతిక శరీరం, పంచభూతాలనుంచి వచ్చింది, వాటివల్లనే స్థితి పొందుతుంది, వాటిలోనే మళ్ళీ లయమయిపోతుంది. ఎలాగైతే సముద్రంనుంచి అల

పుడుతుందో, అలాగే ఈ శరీరమైన అల ప్రపంచమనే సముద్రంనుంచి పుట్టింది. ప్రపంచం అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాబట్టి, అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టునుంచి వచ్చిన ఈ శరీరం కూడా ఆబ్జెక్టు. శరీరం ఆబ్జెక్టు అయితే, అది ఖచ్చితంగా సబ్జెక్టు అయిన నేను కాదు. మనం ఎంతో ప్రేమగా చూసుకునే ఈ శరీరం నేను కాదు. ఇదే పెద్ద పిడుగులాంటి వార్త! 'నేను ఇన్నాళ్ళూ ఎంతో ఆప్యాయంగా ఈ శరీరాన్ని సంరక్షించుకుంటూ వచ్చాను! మీరు ఒక్క దెబ్బతో ఈ శరీరాన్ని, ప్రపంచంలో ఒక భాగంగా కూల్చివేశారు!' అనవచ్చు మీరు. అందువల్లనే ఆ శరీరం నేను కాదు అనే ఉపసిద్ధాంతాన్ని జీర్ణించుకోవటం కష్టమన్నాము. కష్టమైనా, దాన్ని త్రోసిపుచ్చకండి. మీ మనస్సులో ఒకమూల ఉంచుకోండి. ముందు ముందు మీరే అర్థం చేసుకుంటారు. అప్పుడు ఈ సందేహం పటాపంచలు అవుతుంది.

సి) **నేను మనస్సు కాదు** – నేను శరీరం కాదు అనే సత్యాన్నే మీరు జీర్ణించుకోలేకపోతే, 'నేను మనస్సు కాదు,' అనే సత్యాన్ని జీర్ణించుకోవటం ఇంకా కష్టం. కాని శరీరానికి వాడే సూత్రాన్నే ఇక్కడా వాడాలి. శరీరం ఎలా నాకు అనుభవంలోకి వస్తున్నదో, అలాగే మనస్సు కూడా నాకు అనుభవంలోకి వస్తున్నది. నా మనస్సు నాకు అనుభవంలోకి వస్తున్నది. అందువల్లనే నా మనస్సు గురించి నేను అనేక విషయాలు ఎదుటివారికి చెప్పగలుగుతున్నాను. 'నాకు ఇవాళ చిరాకుగా ఉంది,' 'నా మనస్సు ప్రశాంతంగా ఉంది,' 'నువ్వు చెప్పేదేమిటో నాకు అర్థం కావటంలేదు,' 'నువ్వు చెప్పేది బాగా అర్థమయ్యింది.'

అంటే మనస్సు భిన్నస్థాయిల్లో ఉంది. అర్థం చేసుకునే మనస్సు, అర్థం చేసుకోని మనస్సు, స్వీకరించే మనస్సు, తిరస్కరించే మనస్సు, అయోమయంలో పడ్డ మనస్సు, నిరాశానిస్పృహలకు లోనయిన మనస్సు. ఇన్ని రకాలు నాకు మాత్రమే తెలుసు, వేరే ఎవరికీ తెలియదు. అందువల్లనే, 'నన్ను ఎవరూ అర్థం చేసుకోవటం లేదు,' అని వాపోతారు. అంటే మీ మనస్సులో ఏముందో వారికి తెలియదు, మీకు మాత్రమే తెలుసు. మీకు తెలుసు అంటే ఏమిటి అర్థం. మనస్సు ఆబ్జెక్టుగా మీ అనుభవంలోకి వస్తున్నది. అది కూడా ప్రపంచంలో ఒక భాగం మాత్రమే.

ఈ సిద్ధాంతాన్ని సైన్సుపరంగా కూడా నిరూపించవచ్చు. మనస్సు కూడా పదార్థంయొక్క సూక్ష్మాంశంతో చేయబడింది. అందువల్లనే మానసిక రుగ్మత ఉన్న రోగికి షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తారు. అంటే శక్తి కాని, కొన్ని రసాయనాలు ఉన్న మందులు కాని మానసిక స్థితిని మార్చగలిగితే, మనస్సు కూడా బాహ్యపదార్థాలతో చేయబడిన పదార్థం మాత్రమే, దాని బాహ్యపదార్థాలు, ఆహారంతో సహా, ప్రభావితం చేయగలవని సూచిస్తున్నది. అందువల్ల అనుభవంలోకి వస్తున్నదేదీ నేను కాదు సూత్రం ప్రకారం, మనస్సు కూడా నేను కాదు.

**నేను చైతన్యాన్ని** – వేదాంతం నేర్చుకున్నాక మనం నేర్చుకునే మొదటిసూత్రం నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు, అవి కూడా జగత్తులోకే వస్తాయి. నేను మనశ్శరీరాలకు భిన్నంగా ఉండి, వాటిద్వారా వ్యవహారం నడుపుతాను. కళ్ళజోడుతో ప్రపంచాన్ని చూసినట్టుగా, మనశ్శరీరాలతో ప్రపంచంతో వ్యవహారం నడుపుతాను. కళ్ళజోడు సబ్జెక్టా, ఆబ్జెక్టా? కంటికి చాలా దగ్గరగా ఉంది కాబట్టి కళ్ళజోడు నాలో ఒక భాగం అనిపిస్తుంది కాని, నిజానికి కాదు. అది కూడా బాహ్యవస్తువే! నేను ప్రపంచాన్ని చూడటానికి వాడతాను.

అదే విధంగా జ్ఞానికి ఈ శరీరం కూడా తాత్కాలికంగా వాడబడే మాధ్యమం మాత్రమే. కొన్ని సంవత్సరాలు వాడుకుని, ఎప్పుడో సమయం ఆసన్నమైనప్పుడు వదులుకోవాలి. అద్దె ఇంట్లో ఉండటానికి కొన్ని సంవత్సరాలు ఒప్పందం కుదుర్చుకున్నట్టుగా, ఈ శరీరం కూడా అద్దె ఇల్లే. కాకపోతే ఈ శరీరమనే అద్దె ఇంట్లో ఎన్ని సంవత్సరాలు ఉంటామో మనకు తెలియదు. తెలియకపోతేనే మంచిది కూడా. ఒకవేళ తెలిస్తే, ఇప్పటినుంచీ బెంగ పడిపోతాము. ఇప్పటికే మనకు కావాల్సినన్ని బెంగలు ఉన్నాయి! ఈ శరీరమనే అద్దె ఇల్లు మనం చేసుకున్న పుణ్యంవల్లనో, పాపంవల్లనో దొరికింది మనకు. అదే సూత్రాన్ని మనస్సుకు కూడా వాడతాడు జ్ఞాని. అది కూడా తాత్కాలికంగా వాడుకోవటానికి ఇవ్వబడిన పరికరం అని అర్థం చేసుకుంటాడు జ్ఞాని.

ఆ మాటకొస్తే, కళ్ళజోడు తీసి పక్కన పెట్టినట్టుగా, ఈ మనశ్శరీరాలను కూడా రోజూ తీసి పక్కన పెడతాము. ఎప్పుడు? గాఢనిద్రలో. సుషుప్తిలో నేను ఉన్నాను, అప్పుడు నా మనస్సు, నా శరీరం పడుకుంటాయి; అంటే అవి పనిచేయవు. అందువల్ల నాకు బాహ్యప్రపంచం అనుభవంలోకి రాదు. కళ్ళజోడు తీసి పక్కన పెడితే, ఏమీ చదవలేను. మనశ్శరీరాలనే కళ్ళజోడు తీసి పక్కనపెడితే, ఏమీ అనుభవించలేను. పొద్దున్న లేచాక, మళ్ళీ మనశ్శరీరాలనే కళ్ళజోడు ధరించగానే, మళ్ళీ జాగ్రద్ ప్రపంచం అనుభవంలోకి వస్తుంది. బెడ్‌కాఫీతో మొదలవుతుంది నా అనుభవం.

ఆ విధంగా, మొదటిసూత్రం – అనుభవించే నేను, అనుభవి ంచబడే వస్తువుకు భిన్నంగా ఉన్నాను, కాబట్టి నేను వస్తువును కాను, నేను జగత్తు కాను, నేను శరీరాన్ని కాను, నేను మనస్సును కాను, నేను వాటికి భిన్నంగా ఉన్న చైతన్యాన్ని అని అర్థం చేసుకుంటాము.

2. **అనుభవంలోకి వచ్చే గుణాలు, అనుభవించబడే వస్తువుకు చెందుతాయి కాని, నాకు కాదు.**

ఇప్పుడు రెండవసూత్రం ప్రకారం నా స్వరూపమేమిటో చూద్దాము. నేను చైతన్యాన్ని అని ఒక అంశం తెలిసింది కాని, ఇంకా లోతుగా వెళ్ళాలి. ఈ పుస్తకాన్ని చూస్తే నీలం రంగు అనే గుణం నాకు అనుభవంలోకి వస్తున్నది. ఇప్పుడు చెప్పండి – ఆ నీలం రంగు ఎవరికి

చెందుతుంది? అనుభవంలోకి వస్తున్న నీలం రంగు, అనుభవంలోకి వస్తున్న పుస్తకానికి చెందుతుంది. నేను నీలంగా ఉన్నాను అనను. పుస్తకంయొక్క నీలిరంగును చూస్తాను అంతే. రంగు, రూపు అనే గుణాలు కూడా అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు; అంతేకాదు ఈ రంగు, రూపు అనే గుణాలు కూడా అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టుయొక్క అనుభవంలోకి వచ్చే గుణాలు. దీన్నుంచి ఒక ఉపసిద్ధాంతం చూద్దాము.

**నేను నిర్గుణం** – దీనివల్ల మీకు ఏ రంగు, రూపు తెలిసినా, అది అనుభవంలోకి వస్తున్నది. ఏ గుణం తెలిసినా, అది అనుభవంలోకి వస్తున్న గుణం. ఎందుకంటే అనుభవంలోకి రాకపోతే, దాని గురించి మీకు తెలియదు. ఆ విధంగా ఏ గుణం చూసినా అనుభవంలోకి వస్తుంది. అనుభవంలోకి వచ్చే ఆ గుణం, అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టుకు చెందుతుంది. ఆబ్జెక్టు అంటే ప్రమేయం లేదా వస్తువు. అనుభవించే మీకు ఏ గుణమూ చెందదు. **నేను నిర్గుణం** అని చెప్పాలి మీరు. ఎలా చెప్పగలరు?

మీరు ఒక గుణం గురించి చెప్పగానే, 'ఈ గుణం గురించి మీకు తెలుసా?' అని అడుగుతాము. 'తెలుసు,' అని మీరంటారు. అప్పుడు, 'ఆ గుణం గురించి మీకెలా తెలుసు?' అంటాము. 'నాకు మొన్న అనుభవంలోకి వచ్చింది కాబట్టి,' అంటారు మీరు. అనుభవంలోకి వచ్చింది అంటేనే అది అనుభవంలోకి వచ్చిన ఆబ్జెక్టుకు చెందుతుంది కాని అనుభవించే మీకు చెందదు. దీనివల్ల మనం అర్థం చేసుకునే ఉపసిద్ధాంతం – అనుభవించే నేను గుణాలకు భిన్నంగా ఉన్నాను. నేను నిర్గుణం.

కాని ఇక్కడ 'నేను నిర్గుణం' అంటే ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. నేను ఎవరో తెలుసుకోవటానికి మొదటి సూత్రానికి వెళ్ళాలి. నేను జగత్తు కాదు, నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు, నేను చైతన్యాన్ని అని మొదటి సూత్రంలో చూశాము. జగత్తు ఆబ్జెక్టు, శరీరం ఆబ్జెక్టు, మనస్సు ఆబ్జెక్టు. వాటి గుణాలు వాటికి ఉన్నాయి. అందువల్ల, నాకు ఏదైనా గుణం అనుభవంలోకి వస్తున్నదీ అంటే ఆ గుణం ఈ మూడింటిలో దేనికైనా చెందినదని అర్థం. ఆ గుణాల్లో ఏవీ నాకు చెందవు. నేను నిర్గుణచైతన్యాన్ని.

మొదటి సూత్రం నేను చైతన్యాన్ని అని నిరూపిస్తే, రెండవ సూత్రం నేను నిర్గుణచైతన్యాన్ని అని నిరూపించింది. నేను **నిర్గుణచైతన్యాన్ని** అని అర్థం చేసుకుంటే, దాన్నుంచి అనేక ఉపసిద్ధాంతాలను ఏర్పరచుకోవచ్చు. కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో చేసిన బోధ ఆధారంగా కొన్ని ఉపసిద్ధాంతాలను చూద్దాము. నేను గుణాతీతుణ్ణి.

ఎ) **నేను నిత్యం** – జగత్తులో చూసే ప్రతివస్తువుకూ కాలపరిమితి ఉంటుంది. కాలపరిమితి అంటే ఉదాహరణకు ఒక వస్తువు 1935 నుంచి 1990 వరకు ఉంది. అంటే ఆ వస్తువు 1935 ముందు లేదు, 1990 తరువాత లేదు. అలా సృష్టిలో ఏ వస్తువైనా తీసుకోండి,

దానికి కాలపరిమితి ఉంటుంది. దానికి ఒక పుట్టినతేదీ, ఒక మరణించే తేదీ, కొన్నింటికి కాలపరిమితి చాలా ఎక్కువ ఉండవచ్చు కాని, పరిమితి అంటూ ఉంటుంది.

ఇప్పుడు ఈ కాలపరిమితి గుణాన్ని చూస్తే అది వస్తువుకు చెందినది కాబట్టి నాకు చెందదు. అందువల్ల నాకు చావు–పుట్టుకలు లేవు. నేను నిత్యం. నేను అంటే ఏమిటో మర్చిపోకూడదు. నేను శరీరాన్ని కాను, నేను మనస్సు కాను. ఈ రెండూ కూడా జగత్తులాగా ఆబ్జెక్టులే. నేను అంటే వీటిని అనుభవించే చైతన్యాన్ని. నేను చైతన్యతత్త్వాన్ని, చిత్తును. నేను కాలాతీతాన్ని.

నేను కాలాతీతం అంటే నాకు మరణం లేదు. మరణం కూడా, కాలపరిమితిలోకే వస్తుంది. పుట్టుక కాలంవల్ల వస్తుంది; ఎదుగుదల కాలంవల్ల వస్తుంది; నశించటం కాలంవల్ల వస్తుంది; మరణం కూడా కాలంవల్ల వస్తుంది. శరీరం నాలుగు దశలను అనుభవిస్తుందని కృష్ణపరమాత్మ వర్ణిస్తాడు. ఆ నాలుగు దశలు – కౌమారం, యౌవనం, జరా, దేహాంతర ప్రాప్తి. కాని నేను కాలాతీతం, **నేను నిత్యం**.

బి) **కార్యకారణ విలక్షణం** – కాలపరిమితిలోకి వచ్చిన ఏ వస్తువైనా సరే, అది కార్యమో, కారణమో అవాలి. కాని నేను కాలాతీతం కాబట్టి నేను కార్యమూ కాదు, కారణమూ కాదు. నేను కార్యకారణ విలక్షణం.

సి) **సర్వవ్యాపకం** – ఇప్పుడు దేశపరిమితి అనే గుణాన్ని చూద్దాము. ఏ వస్తువు గురించైనా మనం అడిగే ప్రశ్నలు రెండే! ఎప్పుడు? ఎక్కడ? ఎప్పుడు అంటే ఏ కాలానికి చెందినది; ఎక్కడ అంటే ఏ దేశానికి చెందినది. ప్రతివస్తువుకూ దేశపరిమితి , కాలపరిమితి ఉంటాయి. నేను గుణాతీతుణ్ణి కాబట్టి, దేశపరిమితి అనే గుణం కూడా వస్తువుకు చెందినది కాబట్టి, నాకు దేశపరిమితి కూడా లేదు. దేశపరిమితి లేకపోతే, నేను ఎక్కడ ఉన్నాను అనే ప్రశ్నకు చోటే లేదు. నేను సర్వవ్యాపకం, ఏకం, అద్వితీయం. సర్వవ్యాపకం అయినవి ఎన్ని ఉంటాయి? ఒకటే ఉంటుంది.

**అహం సర్వగతః అస్మి; అహమ్ అఖండః అస్మి; అహమ్ ఏకః అస్మి; అహమ్ అచలః అస్మి;**

నేను సర్వవ్యాపకం కాబట్టి సర్వగతం; సర్వగతం కాబట్టి నాకు భాగాలు లేవు; అఖండం కాబట్టి ఉన్నది ఒకటే. సర్వగతం కాబట్టి చలనం లేదు. దేశపరిమితి ఉంటే, ఒకచోటినుంచి ఇంకొక చోటికి వెళ్ళవచ్చు; అంతటా ఉంటే ఎక్కడికి వెళతాను? అందువల్ల స్థాణుః, అచలః.

డి) **అకర్తా** – అచలం కాబట్టి, ఏ కర్మా చేయలేను. కర్మ చేయాలంటే, ఒకచోటినుంచి ఇంకొక చోటికి కదలాలి. కర్మ చేసే వ్యక్తిని కర్తా అంటారు; నేను కర్మ చేయను కాబట్టి అహం అకర్తాః.

**నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః** – 2.24

చైతన్యమైన నేను, ఆత్మనైన నేను నిత్యం, సర్వగతం, స్థాణువు, అచలం, సనాతనం.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

ఆత్మకు పుట్టుక లేదు, చావు లేదు, కాలపరిమితి లేదు. ఆత్మ నిత్యం, శాశ్వతం, పురాణం, శరీరం మరణించినా ఆత్మకు మరణం లేదు.

నాకు పుట్టుక, ఎదుగుదల, నాశనం, మరణం లేవు. శరీరం మరణించినా, ఆత్మనైన నాకు మరణం లేదు. ఎవరైతే ఈ ఆత్మజ్ఞానం పొందుతారో, అతను **అహం బ్రహ్మ అస్మి** జ్ఞానం పొందుతారు. నేను = ఆత్మ = బ్రహ్మ. ఈ జ్ఞానం పూర్ణత్వభావనను ఇస్తుంది. ఎప్పుడైతే నేను పూర్ణ ఆత్మను లేదా బ్రహ్మ ఆత్మను, ఈ మనశ్శరీరాలు నాకు వ్యవహారం నడపటానికి తాత్కాలికంగా ఇవ్వబడ్డాయి అని అర్థం చేసుకుంటానో, అప్పుడే నాకు మృత్యుభయం పోతుంది; అభద్రతాభావన పోతుంది. శరీరం కూడా తాత్కాలికమే, దానికి రాకపోకలున్నాయి; పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదని అర్థం చేసుకుంటాను.

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥** – 2.27

పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదు; మరణించిన ప్రతిదీ పుట్టకా తప్పదు. అందువల్ల తప్పించుకోలేని పరిస్థితి గురించి శోకించటంలో అర్థం లేదు.

లోతుగా ఆలోచిస్తే, మీ బాధ శరీరంయొక్క రాకపోకల గురించి కాదు; మీ బాధ మీరు శరీరంతో మమేకం చెందటంవల్ల కలుగుతున్నది. మీరు ఏదో ఒకరోజు మరణించాలనే సత్యాన్ని జీర్ణించుకోలేకుండా ఉన్నారు. మీరు ఎవరి మృత్యువునైనా తేలికగా స్వీకరించగలరు కాని మీ మృత్యువును స్వీకరించలేరు. వార్తాపత్రికలో ఎవరిదైనా మరణవార్త చదివితే, జ్ఞానిలాగా ప్రవర్తిస్తారు. పైగా, కృష్ణపరమాత్మ చెప్పిన **జాతస్య హి ధ్రువో మృత్యుః** కూడా ఉటంకిస్తారు. వారి మరణానికి కొంచెం కూడా చలించరు.

అందువల్ల, మీ సమస్య మరణం కాదు; ప్రతిరోజూ కొన్ని వందలమంది మరణిస్తారని మీకు తెలుసు. మీ సమస్య మరణం కాకపోతే, మరి ఏమిటి మీ సమస్య? నేను అనిత్యమనేదే సమస్య. నేను అనిత్యం ఎందుకు సమస్య అయింది అంటే, నేను శరీరం అని మీరు అనుకోవటంవల్ల. ఎప్పుడైతే మీరు, 'నేను శరీరం కాదు,' అనే సత్యాన్ని జీర్ణించుకుంటారో, అప్పుడే ఈ మృత్యుభయం పోతుంది. ఎప్పుడు మరణిస్తానో, ఏ మూల మృత్యువు పొంచివుందో అనే అభద్రతాభావన పోతుంది. అంతేకాదు, మరణించాక స్వర్గానికి వెళతానా, నరకానికి

వెళతానా; నాకు శ్రాద్ధకర్మలు పెడతారా, లేదా; నేను మరుజన్మలో ఏ జీవిగా పుడతాను? ఈ బెంగలేవీ మిమ్మల్ని ఇంక కుదిపివేయవు. ఎందుకంటే ఈ మృత్యుభయం శరీరానిది, ప్రయాణం మనస్సుది. మీరు మనశ్శరీరాలు కాదు. మనశ్శరీరాలను కలిపి **కార్యకరణసంఘాతం** అంటారు. మీరు కార్యకరణసంఘాతం కాదు, మీరు ఆత్మ. ఆత్మ స్వరూపం సత్–చిత్–ఆనందస్వరూపం. ఆత్మ పరబ్రహ్మస్వరూపం.

ఇదీ జ్ఞానయోగ సారాంశం. ఈ జ్ఞానం మూడు దశల సాధనల ద్వారా పొందగలరు. అవి **శ్రవణం, మననం, నిదిధ్యాసనం.**

**శ్రవణం** – శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, ఒక సమర్థవంతమైన గురువు ద్వారా శాస్త్ర అధ్యయనం చేయటం. గురువు ద్వారా గీత, ఉపనిషత్తులను నేర్చుకుంటే ఈ రెండు సూత్రాలను విశ్లేషించటం ఎలాగో అర్థమవుతుంది.

1. అనుభవించే నేను, అనుభవించబడే వస్తువుకు భిన్నంగా ఉన్నాను.

2. అనుభవంలోకి వచ్చే గుణాలు, అనుభవించబడే వస్తువుకు చెందుతాయి కాని నాకు కాదు.

నేను నిర్గుణచైతన్యాన్ని; నేను సచ్చిదానంద ఆత్మను; నేను పరబ్రహ్మను; నేను పూర్ణ ఆత్మను; నేను నిత్యం, కార్య–కారణ విలక్షణం, సర్వవ్యాపకం, అకర్తా ఆత్మను అని గురుశాస్త్ర ఉపదేశం ద్వారా నేర్చుకుంటాను. దీన్ని శ్రవణం అంటారు.

ఈ ఆత్మజ్ఞానం వేదాంతభాగంలో వస్తుంది. వేదాంతాన్ని ఉపనిషత్తు అనీ, జ్ఞానకాండ అనీ అంటారు. ఈ బోధను ఆత్మవిద్య అనీ, ఆత్మజ్ఞానం అనీ అంటారు. కృష్ణపరమాత్మ బోధించిన భగవద్గీత, ఉపనిషత్తుల సారం కాబట్టి, ఇందులో కూడా కృష్ణపరమాత్మ ఆత్మవిద్యను బోధిస్తాడు. రెండవ అధ్యాయంలో ఆత్మవిద్యయొక్క విహంగవీక్షణం చేస్తాడు. తరువాత వివరంగా నాలుగవ అధ్యాయంలో, ఐదవ అధ్యాయంలో, ఇంకా కొన్ని అధ్యాయాలలో బోధ చేస్తాడు. ఎందుకంటే, రెండవ అధ్యాయం ఒక విహంగవీక్షణం మాత్రమే కాబట్టి.

శ్రవణం అంటే ఈ జ్ఞానాన్ని గీత లేదా ఉపనిషత్తులను అధ్యయనం చేయటం ద్వారా, అది కూడా సమర్థవంతమైన గురువువద్ద అధ్యయనం చేయటం ద్వారా పొందటం. గురుశాస్త్ర ఉపదేశం ద్వారా అహం బ్రహ్మాస్మి ఇతి నిశ్చయః. ఆ విధంగా శ్రవణం అంటే **అజ్ఞాన నివృత్తి.**

**మననం** – జ్ఞానయోగంలోని రెండవభాగం మననం. అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందితే, మనస్సులో కలిగే సందేహాలను పారద్రోలే దశ. అహం బ్రహ్మాస్మి జ్ఞానాన్ని అంత తేలికగా

స్వీకరించలేరు. నువ్వు సర్వవ్యాపకం అని గురువు చెబితే, గురువుకేమయింది అనుకునే ప్రమాదం ఉంది. ఎందుకంటే, మీరు, 'నేను కూర్చున్న కుర్చీలోనే సగమే ఉన్నాను, అలాంటి నేను సర్వవ్యాపకం ఎలా అవుతాను?' అనుకుంటారు. తార్కికంగా ఆలోచించే మీ బుద్ధి దాన్ని వెంటనే స్వీకరించలేదు. అనేక ప్రశ్నలను, అనేక సందేహాలను కలుగజేస్తుంది. గుర్తుంచుకోండి, వేదాంతం కేవలం శ్రద్ధ పెట్టుకోండి అనదు, అర్థం చేసుకోండి అంటుంది.

కర్మకాండకూ, జ్ఞానకాండకూ మధ్య భేదం ఉంది. కర్మకాండలో అనేక యజ్ఞాలు చేయమంటుంది. ఆ కర్మలు చేయాలంటే, శాస్త్రంమీద శ్రద్ధ ఉండాలి. ఎందుకంటే, ఈ కర్మ చేస్తే పుణ్యం వస్తుంది, స్వర్గలోకానికి వెళతారు అంటుంది. పుణ్యం, స్వర్గలోకం కంటికి కనబడవు. శాస్త్రం చెప్పింది కాబట్టి నమ్మాలి. కర్మకాండ – ఈ కర్మ చేయండి, ఈ హోమం చేయండి, ఈ ఆహుతులు వేయండి అంటుంది. కర్మకాండలో ప్రశ్నలు వేయకూడదు. చెప్పింది చెప్పినట్టుగా చేయాలి. ఎందుకలా చెప్పిందో దాన్ని తార్కికంగా నిరూపించలేము.

అందువల్లనే ఇప్పటి యువత శ్రాద్ధకర్మలను నమ్మరు. 'మా పితృదేవతలు ఇంకా ఉన్నారని ఏమిటి నిదర్శనం? వారు స్వర్గానికి వెళ్ళారో, లేదో మాకేం తెలుసు? ఒకవేళ వారు మళ్ళీ పుట్టివుంటే, ఈ శ్రాద్ధకర్మ వారికెలా వెళుతుంది? అలాంటప్పుడు నేను చేసి కూడా ప్రయోజనం ఏమిటి?' ఇలా ప్రశ్నల వర్షం కురిపిస్తారు. ఎందుకంటే, వారికి అవి చేయాలని లేదు. అందువల్ల తార్కికంగా నిరూపించమంటారు. శ్రాద్ధకర్మ అంటేనే శ్రద్ధగా చేసేదని అర్థం. అందువల్ల కర్మకాండలో అంతా శ్రద్ధ, వేదపూర్వభాగంమీద నమ్మకంమీద ఆధారపడి ఉంటుంది.

వేదాంతం శ్రద్ధమీద కాదు, అర్థం చేసుకోవటంమీద ఆధారపడి ఉంటుంది. లేశమాత్రం సందేహం ఉన్నాకూడా అది జ్ఞానం కిందకు రాదు. సంశయాత్మక జ్ఞానం ఏమీ ఫలాన్ని కూడా ఇవ్వదు. మీరు దోమతెర వేసుకున్నాక, అందులో ఒక దోమ దూరినా చాలు; అది మీ నిద్రను చెడగొడుతుంది. అదే విధంగా, ఒక్క సందేహం కలిగినా చాలు, అది మీ జ్ఞానాన్ని చెడగొడుతుంది.

మననం, ఈ సందేహాలను పారద్రోలి, నిస్సంశయజ్ఞానంలో నిలబెడుతుంది. మననంలో అనేక సందేహాలను ప్రవేశపెట్టి, వాటికి జవాబులను ఇస్తుంది. తక్కిన దార్శనికులు చేసిన దర్శనాలను తీసుకుని, వాటిని కూలంకషంగా చర్చించి, వాటితో వాదోపవాదాల ద్వారా అద్వైతజ్ఞానంలో నిలబెడుతుంది. సైన్సును కూడా వదిలిపెట్టదు. అద్వైతసిద్ధాంతం తర్కానికి బెదరదు, సైన్సుకు భయపడదు. ఆ విధంగా మననం అంటే **సంశయనివృత్తి**.

**నిదిధ్యాసనం** – చివరిదశ నిదిధ్యాసనం. ఈ దశ శ్రవణ, మననాలలో పొందిన నిశ్చయ జ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి, జీవితంలో ఒక భాగంగా చేసుకోవటానికి తోడ్పడుతుంది.

ఈ జ్ఞానం, మీకు వృద్ధాప్యంలో తోడ్పడుతుంది. మరణభయాన్ని పారద్రోలుతుంది. మాటవరసకు, 'నాకు చావంటే భయంలేదు,' అనవచ్చు మీరు, కాని లోపల్లోపల మృత్యుభయం తొలిచేయవచ్చు. అందువల్ల ఈ జ్ఞానం మృత్యుభయాన్ని పారద్రోలటానికి తోడ్పడాలి.

**కిమహగ్ం సాధు నాకరవమ్ కిమహం పాపమకరవమితి** – తైత్తిరీయమ్ 2. 9. 1

'నేను చేయాల్సినవి ఎందుకు చేయలేదు? చేయకూడనిది ఎందుకు చేశాను?'

ఈ ఆలోచన చాలామందిని పట్టి పీడిస్తుంది. వీటిని ఒమిషన్స్ అండ్ కమిషన్స్ అంటారు ఇంగ్లీషులో. ఆత్మజ్ఞానం పొందిన జ్ఞానికి ఈ రెండు బాధలు ఉండవు.

వృద్ధాప్యం చాలా భారంగా గడుస్తుంది. ఆ వయస్సులో భావపరంగా ఒంటరితనం పట్టి పీడిస్తుంది. యౌవనంలో కూడా ఏవో బాధలు ఉంటాయి కాని పని వత్తిడిలో పడటంవల్ల, అవి మరుగున పడిపోతాయి. వృద్ధాప్యంలో పని లేకుండా తీరికగా ఉండటంవల్ల, మేమున్నామంటూ పైకి దూసుకువస్తాయి. ఈజీ ఛెయిర్‌లో కూర్చుని, ఈజీగా బెంగ పడతారు. **వృద్ధస్తావత్ చింతాసక్తః.** మీ బాధను మర్చిపోవటానికి ఎవరితోనైనా మాట్లాడాలని మీకుంటుంది, కాని మీరు వృద్ధులయితే ఎవరూ మీ దరిదాపులకు రారు. ఎందుకంటే మీరు మాట్లాడటం మొదలుపెడితే, దానికి కామాలూ, ఫుల్‌స్టాప్‌లూ ఉండవని వారికి తెలుసు.

ఈ మృత్యుభయం పట్టి పీడించకూడదు అనుకుంటే, ఆత్మజ్ఞానంవల్ల కలిగే పూర్ణత్వాన్ని పొందాలి. **అహం పూర్ణః అస్మి** అని నేర్పిస్తుంది ఈ జ్ఞానం. ఈ అహం పూర్ణః అస్మి జ్ఞానాన్ని అణువణువునా జీర్ణించుకోవటానికి తోడ్పడుతుంది నిదిధ్యాసనం. ఈ జ్ఞానాన్ని జీర్ణించుకోనివ్వకుండా అడ్డుపడుతున్న విపరీతభావనలను పారద్రోలుతుంది. విపరీత భావనలను విపర్యయభావనలు అనికూడా అంటారు. ఆ విధంగా నిదిధ్యాసనం అంటే **విపర్యయ నివృత్తి.**

శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా ఆత్మజ్ఞానం పొందితే, ఆ జ్ఞానం పొందిన జ్ఞాని జీవన్ముక్తి పొందుతాడు. అదే మన శాస్త్రంయొక్క గొప్పతనం. ఉపనిషత్తులు, గీత ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతారు అంటాయి. తక్కిన మతాలు, తక్కిన దర్శనాలు మీరు మోక్షం పొందుతారు నిజమే కాని, అది మరణించాక పొందుతారు అంటాయి. మరణించాక ఏమవుతామో తెలియనప్పుడు, మోక్షం పొందుతామో లేదో ఎలా తెలుస్తుంది? అందువల్ల, వారు చెప్పినదానిమీద శ్రద్ధ పెట్టుకోవాలి అంతే. కాని అద్వైతవేదాంతంలో అలా కాదు. కృష్ణపరమాత్మే చెబుతున్నాడు,

**ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।**
**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః ॥** – 5.19

జ్ఞానికి ఇప్పుడే, ఇక్కడే మోక్షం సాధ్యం. అతను ఎప్పుడూ బ్రహ్మలో నెలకొనివుంటాడు.

**అత్ర బ్రహ్మ సమశ్నుతే** – బృహదారణ్యకమ్ 4.4.7

అందువల్ల వేదాంతంయొక్క గొప్ప ఫలం ఏమిటంటే అది చెప్పే జ్ఞానాన్ని మీరు ఇక్కడే, ఇప్పుడే పరీక్షించి చూసుకోవచ్చు. అది చూపించిన ఫలం పొందకపోతే, వేదాంతాన్ని కాదనుకోవచ్చు. శాస్త్రం మీకు సవాలు విసురుతుంది. వేదాంతసారమైన గీతలో కూడా కృష్ణపరమాత్మ అలా నీక్కూడా జీవన్ముక్తి కలుగుతుంది అని అర్జునునికి బోధిస్తే, అటువంటి జీవన్ముక్తి లక్షణాలేమిటో తెలుసుకోవాలనే కుతూహలం సహజంగానే కలుగుతుంది అర్జునునికి. ఇది మన నాలుగవ అంశం అయిన మోక్షానికి దారితీస్తుంది.

### 4. మోక్షం : శ్లోకాలు 54–72

**స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।**
**స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥** – 2.54

స్థితప్రజ్ఞుడు అయిన జ్ఞాని లక్షణాలు ఎలా ఉంటాయి? ఎదుటివారితో ఎలా మాట్లాడతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా నడుస్తాడు అని అడుగుతున్నాడు అర్జునుడు.

జీవన్ముక్తి పొందిన వ్యక్తి చూడటానికి ఎలా ఉంటాడు, ఎలా నడుస్తాడు, ఎలా మాట్లాడతాడు? జ్ఞానిలో ఏమైనా శారీరకంగా మార్పులు వస్తాయా అనే ఈ సందేహం మనకు కూడా కలుగుతుంది. పుస్తకాల్లో చదువుతాము, సినిమాల్లో చూస్తాము – జ్ఞాని తలచుట్టూ ఒక మెరుపు ఉన్నట్టుగా చూస్తాము. మీరు కూడా జ్ఞానం పొందితే, అలా మీ తలచుట్టూ ఒక మెరుపు ఉంటుందని పొరపాటు పడకండి! దయచేసి, అలాంటి మెరుపులేమీ కనబడవని అర్థం చేసుకోండి. ఒకవేళ అలా ఏమైనా కనబడితే, కంటి వైద్యుని దగ్గరకు వెళ్ళండి. సినిమాల్లో అది అతను జ్ఞానం పొందాడని చెప్పటానికి చూపే ఒక పద్ధతి మాత్రమే.

జ్ఞానిలో శారీరకంగా ఏమీ మార్పులు రావు. శరీరం అలాగే ఉంటుంది, ఆకలి వేస్తుంది, దాహం వేస్తుంది, కన్ను రూపాలనే చూస్తుంది, చెవి శబ్దాలనే వింటుంది. జ్ఞాని తన ఎదురుగా బ్రహ్మను చూస్తాడు అని పొరపాటు పడకండి. అందరూ బ్రహ్మగా కనబడితే, ఎవరిని పిలుస్తాడు? అందువల్ల, గుర్తుంచుకోండి, జ్ఞాని శరీరంలో ఏ మార్పులూ రావు, జగత్తు కూడా ఏమీ మారదు. పరిస్థితులు అలాగే ఉంటాయి, మనుష్యులు అలాగే ఉంటారు, అనుభవాలు అలాగే ఉంటాయి కాని వాటికి జ్ఞాని స్పందించే తీరు మారుతుంది.

జ్ఞానిని కూడా వదలరు మనుష్యులు. కొందరు జ్ఞానిని మెచ్చుకుంటే, మరి కొందరు విమర్శిస్తారు. మానం, అవమానం జ్ఞానికి కూడా తప్పదు. అనుభవాలు మారవు కాని

అతని స్పందన మారుతుంది. దీన్నే జీవన్ముక్తి అంటారు. జీవన్ముక్తి పొందిన జ్ఞాని లక్షణాలను కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయం చివర్లో వివరిస్తాడు. ఇది చాలా ప్రసిద్ధి పొందిన భాగం. స్థితప్రజ్ఞుని లక్షణాలను చూస్తాము ఇందులో. వాటిలో కొన్ని అంశాలను చూద్దాము ఇప్పుడు. **ఆత్మన్యేవాత్మనా తుష్టః** – జ్ఞాని పొందే మొట్టమొదటి ఫలం, అది కూడా సానుకూలంగా చెప్పాలంటే, జ్ఞాని తనలోనే ఆనందాన్ని పొందుతాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః, ఆత్మరతిరేవ స్యాత్, ఆత్మతృప్తశ్చ మానవః, ఆత్మన్యేవ చ సంతుష్టః**

ఇలా ఆత్మలోనే రమిస్తాడు అని కృష్ణపరమాత్మ అనేకచోట్ల చెబుతాడు.

**ఆత్మక్రీడ ఆత్మరతిః క్రియావాన్ ఏష బ్రహ్మవిదాం వరిష్ఠః** – ముండకమ్ 3.1.4

జ్ఞాని ఆత్మలోనే రమిస్తాడు. పూర్ణత్వం పొందాలంటే, బాహ్యవస్తువులమీద ఆధారపడే అవసరం లేదు, తనే ఆనందస్వరూపుడని అర్థం చేసుకుంటాడు జ్ఞాని. అంతమాత్రాన అతను బాహ్యవస్తువులను ద్వేషించడు. వస్తువులు ఉన్నా ఆనందంగా ఉంటాడు, లేకపోయినా ఆనందంగా ఉంటాడు; మనుష్యులు తన చుట్టూ ఉన్నా ఆనందంగా ఉంటాడు, లేకపోయినా ఆనందంగా ఉంటాడు; పరిస్థితులు తనకు అనుకూలంగా ఉన్నా ఆనందంగా ఉంటాడు, లేకపోయినా ఆనందంగా ఉంటాడు. దానికి కారణం తను ఆత్మననీ, తన స్వరూపం పూర్ణత్వమనీ అర్థం చేసుకోవటమే.

కృష్ణపరమాత్మ, భగవద్గీతలో **వీతరాగభయక్రోధః** అనే పదాన్ని పదేపదే వాడతాడు. అదొక అద్భుతమైన పదప్రయోగం.

**వీత** – వీత అంటే జీవితంలోని మూడు ప్రాథమిక సమస్యలనుంచి విడివడ్డాడు.

**రాగ** – రాగం అంటే బంధం. బంధం అంటే కొంతమంది మనుష్యులు, కొన్ని వస్తువులు, కొన్ని పరిస్థితులు లేకపోతే జీవితం లేదు అనుకోవటం. మనం ఎంత బలహీన మనుస్కులం అవుతామంటే, వారిమీద పూర్తిగా ఆధారపడతాము. ఈ బలహీనత, దానివల్ల వారిమీద ఆధారపడటాన్నే రాగం అంటారు. అర్జునుడు ఎదుర్కొన్న మొదటి సమస్య ఈ రాగమే.

**భయ** – భయ అంటే భయం. ఎక్కడ రాగం ఉంటుందో, అక్కడ ఆ రాగాన్ని వెన్నంటే భయం ఉంటుంది. అంతేకాదు, రాగం ఎంత ఎక్కువ ఉంటే, భయం కూడా అంత ఎక్కువ ఉంటుంది. ఎవరిమీద రాగం ఉంటే వారిని పోగొట్టుకుంటామేమోననే భయం ఎక్కువ ఉంటుంది.

అందువల్లనే పూర్వం టెలిగ్రామ్ రాగానే ఏదో దుర్వార్తని వినాల్సొస్తుందేమోనని భయం వేసేది. అందులో ఏ శుభవార్తో రావచ్చు కాని ముందు భయం వేసేది. అలాగే ఆఫీసునుంచి భర్తో, పిల్లవాడో ఆలస్యంగా వస్తే మనస్సు పరిపరివిధాల పోతుంది. అసలు కారణం

ఏదన్నా కానీ, ఏ ఏక్సిడెంటో అయిందేమోననే భయం తోసుకువస్తుంది. భయం, భయం, బ్రతుకుభయం. మనం ఆశించినట్టుగా పనులు జరగకపోతే భయం; ఆశించినట్టుగా జరుగుతున్నా కూడా భయమే!

ఒక కుటుంబం ఉంది. వారికి జీవితంలో ఏ లోటూ లేదు. భర్త రెండు చేతులా సంపాదిస్తున్నాడు; పిల్లలు బుద్ధిమంతులు, ఆరోగ్యకరంగా ఉన్నారు; భార్య అనుకూలవతి. వారికి స్వంతయిల్లు ఉంది, కారు ఉంది – అన్నీ ఉన్నాయి, కాని ఏదో తెలియని భయం. ఎవరైనా వచ్చి, 'మీరు చాలా అదృష్టవంతులు,' అనో 'మీ ఇల్లు బాగుంది,' అనో 'మీ పిల్లలు ముత్యాల్లా ఉన్నారు,' అనో అంటే చాలు భయం. ఎక్కడ దిష్టి తగులుతుందో, ఏ కష్టం వెన్నంటి వస్తుందో అనే భయం. ఎవరైనా వచ్చి వెళ్ళగానే పిల్లల బుగ్గలకు నల్లచుక్క పెట్టటమో, దిష్టి తీయటమో చేస్తారు. అంటే జీవితంలో ఏ లోటూ లేకపోయినా అంతర్లీనంగా ఈ భయం ఉంటూనే ఉంటుంది! రాగం ఎంత ఉంటే, భయం అంత ఉంటుంది!

**క్రోధః** – చివరికి, మనకిష్టం ఉన్నా లేకపోయినా మనకెంతో ఇష్టమైన వస్తువు మననుంచి దూరమవక తప్పదు. అది మననుంచి వెళ్ళిపోవటమో, మనం పోగొట్టుకోవటమో జరుగుతుంది. ప్రతిసంయోగాన్ని వెన్నంటే వియోగం ఉంటుంది. వియోగం కలిగినప్పుడల్లా రెండురకాల భావోద్రేకాలు కలగవచ్చు – క్రోధం, బాధ. ఎవరివల్ల ఈ ఎడబాటు జరిగితే వారిమీద కోపం వస్తుంది. ఒక్కోసారి భగవంతుడు కూడా మన కోపాన్ని తప్పించుకోలేడు.

చాలామంది వారి జీవితంలో పెద్ద దుర్ఘటన జరగగానే, నాస్తికులుగా మారిపోతారు. 'నేను ఇన్ని అభిషేకాలు చేశాను, ఇన్ని పూజలు చేశాను, నాకింత కష్టం ఎందుకిచ్చాడు దేవుడు? ఇటువంటి దేవుడికి నేనెందుకింకా పూజలు చేయాలి?' అంటారు. భగవంతునిమీద కోపం, ప్రపంచంమీద కోపం, తోటివారిమీద కోపం. అన్నింటికీ కారణం ఒకటే! మనం ఎంతో ఇష్టపడ్డవారిని పోగొట్టుకోవటం. అందువల్ల రాగం, క్రోధానికి దారితీస్తుంది.

**కామ ఏషః క్రోధ ఏషః** – 3.37

కృష్ణపరమాత్మ ఈ అంశాన్ని మూడవ అధ్యాయంలో చర్చిస్తాడు. నిజానికి రాగం, క్రోధం ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలు. రాగం లేకపోతే, ఆ వ్యక్తికి ఏమవుతుందోననే భయం ఉండదు. భయం లేకపోతే, ఎవరిమీద కోపం చూపిస్తాము?

అంతేకాదు, బాధ కూడా వేయదు. ఆనందంకోసం ఆ వస్తువుమీద ఆధారపడితే, ఆ వస్తువు పోతే బాధ వేస్తుంది. కాని జ్ఞాని ఆ వస్తువు ఉన్నా లేకపోయినా ఆనందంగా ఉంటాడు. అందువల్ల జ్ఞానిని ఎవరూ బెదిరించలేరు; ఒక్కోచోట, భర్త, భార్యను బెదిరిస్తాడు,

'నేను సంసారం వదిలి, ఋషీకేశ్‌కి వెళ్ళిపోతాను.' ఎప్పుడో భార్య విసిగిపోయి, 'సరే వెళ్ళండి,' అన్నా అనగలదు. కాని జ్ఞానిని ఇలా ఎవరూ బెదిరించలేరు. అతను ఎవరిమీదా రాగం పెంచుకోడు కాబట్టి, అది పోతుందేమోననే భయమూ లేదు. పోతే వచ్చే క్రోధమూ లేదు. అందువల్ల జ్ఞానిని **వీతరాగభయక్రోధః** అన్నాడు కృష్ణపరమాత్మ.

జ్ఞానిని, అజ్ఞానిని వివరించటానికి కృష్ణపరమాత్మ రెండు ఉదాహరణలను కూడా ఇస్తున్నాడు.

ఎ) **పగలు–రాత్రి**

**యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః॥** – 2.69

జ్ఞాని అద్వైతానికి మేలుకుని ఉంటాడు, ద్వైతానికి పడుకుంటాడు. అజ్ఞాని అద్వైతానికి నిద్రపోతాడు, ద్వైతానికి మేలుకుని ఉంటాడు అంటే అజ్ఞాని ద్వైతజగత్తును చూస్తే, జ్ఞాని అద్వైతబ్రహ్మను తెలుసుకుంటాడు.

జ్ఞాని, అజ్ఞాని చూడటానికి ఇద్దరూ ఒక్కలాగే ఉంటారు, ఒక్కలాగే మాట్లాడతారు, ఒక్కలాగే తింటారు, ఒక్కలాగే నడుస్తారు. కాని వారి దృక్పథంలో ఇద్దరూ రెండు భిన్నధృవాలుగా ఉంటారు. అజ్ఞాని ప్రపంచానికి తను బానిస అయితే, జ్ఞాని ప్రపంచానికి స్వామి అవుతాడు. అందువల్లనే జ్ఞాని పేరు వెనుక, ముఖ్యంగా అతను సన్న్యాసం స్వీకరిస్తే అతని పేరు వెనుక ఆనందపదం ఉంటుంది. మన గురువుల పేర్లు చూస్తే దయానంద స్వామీజీ, పరమార్థానంద స్వామీజీ. ప్రపంచానికి స్వామి అయిన వ్యక్తే ఆనందంగా ఉండగలడు. స్వామికి వ్యతిరేకపదం 'అస్వామి.' అస్వామి లక్షణం దుఃఖం. దుఃఖం పదం ప్రత్యేకించి వాడనవసరం లేదు. అది తెలిసిన విషయమే!

అస్వామి మొహం ఆముదం తాగిన మొహంలా ఉంటే, స్వామి మొహం చిరునవ్వులు చిందిస్తూ ఉంటుంది. అందువల్లనే స్వామి పేరులో ఆనందపదం చోటు చేసుకుంటుంది. కృష్ణపరమాత్మ, అర్జునుల విషయమే తీసుకోండి. కృష్ణపరమాత్మ చిరునవ్వు మొహంతో బోధ చేశాడు. అది పరమాత్మే స్వామి అని సూచిస్తుంది. జ్ఞాని ఆనందంగా ఉన్నాడనడానికి కృష్ణపరమాత్మ వాడిన పదం **ప్రహసన్నివ**. అర్జునుడు కన్నీరు చిందిస్తూ విన్నాడు.

**తం తథా కృపయావిష్టమ్ అశ్రుపూర్ణాకులేక్షణమ్** – 2.1

రాగంలో మునిగిపోయిన అర్జునుడు కన్నీరు పర్యంతం అయ్యాడు. కన్నీరు సంసారం అయితే, ఆనందం మోక్షం.

బి) **సముద్రం-కొలను**

**ఆపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**
**తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే స శాంతిమాప్నోతి న కామకామీ ॥** – 2.70

సముద్రం ఎప్పటికీ పరిపూర్ణం, స్వతంత్రం. నదులు వచ్చిపోయినా చలించదు. జ్ఞానియొక్క సముద్రంలాంటి మనస్సులో అనేక అనుభవాలు ప్రవేశిస్తాయి కాని అతని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అజ్ఞానికి అలా కాదు.

జ్ఞానిని సముద్రంతోనూ, అజ్ఞానిని చిన్న కొలనుతోనూ పోలుస్తున్నాడు. సముద్రం ఎప్పుడూ నిండుగా, పూర్ణంగా ఉంటుంది. అది దాని పూర్ణత్వంకోసం నదులమీద కాని, వానమీద కానీ ఆధారపడదు. నదులు వచ్చి కలిసినా, కలవకపోయినా సముద్రం నిండుగా ఉంటుంది; వాన కురిసినా, కురవకపోయినా సముద్రం నిండుగా ఉంటుంది. వీటి రాకపోకలతో సముద్రానికి సంబంధం లేదు. అదే ఒక చిన్న కొలను విషయం తీసుకుంటే, అది కాస్త ఎక్కువగా వాన కురిస్తే గట్లు తెంచుకుని ప్రవహిస్తుంది. అదే అస్సలు వాన కురవకపోతే పూర్తిగా ఎండిపోతుంది. దానికి పరిమితి ఉంది కాబట్టి హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటుంది.

జ్ఞానిని సముద్రంతో పోల్చవచ్చు. అతను ఏ అనుభవం కలిగినా చలించదు. ఎవరో మెచ్చుకుంటారు, మరెవరో విమర్శిస్తారు; ఒకరు దండలు వేస్తారు, ఇంకొకరు రాళ్ళు రువ్వుతారు. కాని జ్ఞాని దేనికీ చలించదు. **ఆపూర్యమాణమ్ అచలప్రతిష్ఠమ్.** దానికి భిన్నంగా అజ్ఞాని ఒకసారి ఆనందంతో ఆకాశం అంచులు తాకితే, ఇంకొకసారి పాతాళంలోకి కృంగిపోతాడు.

**శోకస్థానసహస్రాణి హర్షస్థాన శతాని చ**
**దివసే దివసే మూఢమ్ ఆవిశంతి న పండితమ్** – మహాభారతమ్, శాంతిపర్వం 12.75

అజ్ఞాని వందసార్లు ఆనందం పొందితే, వేయిసార్లు దుఃఖంలో మునిగిపోతాడు. అతను సంసారంలో కూరుకుపోతాడు, ముక్తి లేదు. పరిస్థితులు ఆనందంనుంచి దుఃఖానికీ, దుఃఖంనుంచి ఆనందానికీ ఊగిసలాడేలా చేస్తాయి. అతను నిస్సహాయంగా వాటికి తగ్గట్టుగా గాలికి అల్లాడుతాడు.

ఈ రెండు పోలికలతో కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలోని బోధను ముగిస్తున్నాడు.

**ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ** – 2.72

జీవన్ముక్తిని బ్రాహ్మీస్థితి అని నిర్వచిస్తున్నాడు. బ్రాహ్మీస్థితి అంటే బ్రహ్మనిష్ఠలో ఉండటం. బ్రహ్మనిష్ఠలో నిలబడాలంటే రెండు సాధనలు చేయాలి.

ఈ అధ్యాయం సారాంశం కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగం పాటించి జ్ఞానం పొందితే, జీవన్ముక్తి పొందుతాడు. ఈ అధ్యాయాన్ని నాలుగు అంశాలుగా చూశాము.

అవి –

1. అర్జున శరణాగతి – అర్జునుడు కృష్ణపరమాత్మను శరణు వేడటం
2. కర్మయోగం – ఆధ్యాత్మిక జీవనవిధానంలో మొదటి మెట్టు
3. జ్ఞానయోగం – ఆధ్యాత్మిక జీవనవిధానంలో చివరి మెట్టు
4. మోక్షం – సంసారంనుంచి విముక్తి.

(సాధకుని ప్రయాణ దశలు అర్థంకావటంకోసం, కర్మయోగం గురించి ముందు చెప్పటం జరిగింది.)

ఈ విధంగా గీత సారాంశం అంతా రెండవ అధ్యాయంలో ఇవ్వబడింది. జ్ఞానయోగం, ఈ అధ్యాయంయొక్క ముఖ్యాంశం కాబట్టి, ఈ అధ్యాయానికి సాంఖ్యయోగము అని పేరు వచ్చింది. సాంఖ్యయోగము జ్ఞానయోగానికి ఇంకొక పేరు.

# కర్మయోగము

## అధ్యాయము 3

భగవద్గీత వేదాల సారమనీ, కురుక్షేత్ర రణరంగంలో ఈ భగవద్గీత కృష్ణార్జునుల సంవాదరూపంలో వెలువడిందనీ మీకు తెలుసు.

మొదటి అధ్యాయంలో ఈ బోధ వెలువడటానికి మూలకారణాన్ని చూశాము. దాని పేరు **అర్జున విషాదయోగము**. అర్జునుడు పెద్ద సందిగ్ధంలో పడ్డాడనీ, యుద్ధం చేయాలా, అస్త్రసన్న్యాసం చేయాలా తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నాడనీ చూశాము. ఈ సందిగ్ధం అనేది ప్రతి ఒక్కరూ ఏదో సమయంలో ఎదుర్కొనే సమస్యే. అర్జునుని సమస్య కేవలం అతనికి మాత్రమే చెందినదయితేనో, చరిత్రలో, ఆ కాలానికి మాత్రమే చెందినదయితేనో, మనం గీత అధ్యయనం చేసినా ఫలితం పొందలేము. కాని, అది అర్జునుని సమస్య మాత్రమే కాదు; ఆ కాలానికి చెందినది మాత్రమే కాదు. ఇది అందరికీ, అన్ని కాలాలకీ చెందిన సమస్య. అందువల్లనే ఈ రోజుకి కూడా గీతాధ్యయనం మనకెంతో లాభదాయకంగా ఉంటుంది.

అర్జునుడు ఎదుర్కొన్న సమస్య ఏమిటి? సంసార సమస్య. ఇక్కడ సంసారసమస్యను మూడు పదాలలో చూశాము. అవి **రాగం, శోకం, మోహం**. శంకరాచార్యులవారు భగవద్గీతమీద తను రాసిన భాష్యంలో మొదటి అధ్యాయాన్ని టూకీగా వివరించారు. అర్జునుని సమస్యను నాలుగు పదాలతో వివరించారు. అవి –

**అహమ్ ఏషామ్, మమ ఏతే**

నేను వీరికి చెందుతాను, వీరు నావారు. అహమ్ ఏషాం పదాలు అహంకారాన్ని సూచిస్తే, మమ ఏతే పదాలు మమకారాన్ని సూచిస్తాయి. అహంకార, మమకారాలను కలిపి రాగం అనవచ్చు. రాగం అంటే బంధం. బాహ్యప్రపంచంమీద భావపరంగా ఆధారపడటం. ఎప్పుడైతే ఈ ఆధారపడటం వస్తుందో, అప్పుడే అది అనేక సమస్యలకు దారితీస్తుంది. ఎందుకంటే, మనం దేనిమీద ఆధారపడతామో, అది శాశ్వతంగా మన దగ్గర ఉండదు. ఎప్పుడైతే ఆ వస్తువు మననుంచి దూరమవుతుందో, అప్పుడే అది శోకానికి దారితీస్తుంది.

నిజానికి, ఆ వస్తువు నిజంగా దూరమవనవసరం లేదు. దూరమవుతుందేమోననే భయమే చాలు! యుద్ధభూమిలో అర్జునుడు భీష్మాచార్యులను, ద్రోణాచార్యులను, తక్కిన బంధువులను పోగొట్టుకోలేదు, వారిని తాను ఇంకా చంపలేదు. కాని వారిని చంపుతాను, వారిని పోగొట్టుకుంటాను అనే భావననే అర్జునుడు భరించలేకపోతున్నాడు. వారిమీద

ఎంత రాగం ఉందంటే, వారు లేని జీవితాన్ని ఊహించుకోలేకపోతున్నాడు. ఆ ఆలోచనే అతన్ని శోకసముద్రంలో ముంచెత్తివేస్తున్నది.

**కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్** – 1.27

తీవ్రమైన రాగంవల్ల అత్యంత శోకంలో మునిగిపోయాడు అర్జునుడు అన్నాడు సంజయుడు.

అలా అతని తీవ్రమైన రాగం తీవ్రమైన శోకానికి దారితీసింది. శోకం మోహానికి దారితీసింది. మోహం విచక్షణాశక్తిని కప్పివేస్తుంది. అది సందిగ్ధంలో పడవేస్తుంది. ఏది మంచో, ఏది చెడో ఆలోచించనివ్వదు. మోహం ధర్మాన్ని అధర్మంగానూ, అధర్మాన్ని ధర్మంగానూ చూసేలా చేస్తుంది. అందువల్లనే ధర్మయుద్ధాన్ని అధర్మంగా భావించాడు అర్జునుడు.

అలా, మనమంతా ఎదుర్కొనే సమస్య ఈ మూడే – రాగం, శోకం, మోహం. ఒక్కోసారి ఈ రాగం తీవ్రరూపం దాల్చదు; అందువల్ల ఈ సమస్య ఉన్నట్టే తెలియదు. ఇంకో సందర్భంలో తీవ్రంగా బయటపడుతుంది. అందువల్ల ఈ సమస్యలో స్థాయీభేదాలు ఉంటాయి కాని, సమస్య మాత్రం అందరికీ ఉంటుంది. అర్జునునికి రాగం సమస్య యుద్ధభూమిలో పెల్లుబికింది. అది శోకానికి, తద్వారా మోహానికీ దారితీసింది. అది ఎంత తీవ్రరూపం దాల్చిందంటే, దానికొక శాశ్వతమైన పరిష్కారం కావాలనుకున్నాడు అర్జునుడు. అది మంచి పద్ధతి.

సాధారణంగా మనం ఏంచేస్తామంటే, మనం ఆనందంగా ఉన్నప్పుడు, దుఃఖం గురించి కాని, దానికి తగ్గ పరిష్కారం గురించి కాని ఆలోచించము. అదే మనం దుఃఖంలో మునిగినప్పుడు, పరిష్కారం గురించి ఆలోచించే పరిస్థితిలో ఉండము. ఎందుకంటే అప్పుడు బుద్ధి పనిచేయదు. అందువల్ల మనం ఆనందంగా ఉంటే, పరిష్కారం గురించి **ఆలోచించము**. దుఃఖంగా ఉంటే, పరిష్కారం గురించి **ఆలోచించలేము**. అందువల్ల జీవితాంతం, మన సమస్యకు శాశ్వతపరిష్కారాన్ని పొందలేము.

దీన్ని క్యాన్సర్ వ్యాధితో పోల్చవచ్చు. క్యాన్సర్ వ్యాధి వచ్చిన వెంటనే మనకు దాని గురించి తెలియదు. అందువల్ల దాన్ని నయం చేయాలని ఆలోచించము. అది ముదిరిపోయాక, చివరిదశలో తెలిస్తే, దాన్ని నయం చేయలేము. అందువల్ల, క్యాన్సర్ గురించి తెలియకముందు ఏమీ చేయము, తెలిశాక ఏమీ చేయలేము. అలా దానికి శాశ్వత పరిష్కారం లేదు. అలా చాలా సమస్యలకు శాశ్వతపరిష్కారం గురించి ఆలోచించము. సమస్య ఎదురైనప్పుడు, ఏదో తాత్కాలిక ఉపశమనం పొందటానికి ప్రయత్నిస్తాము. అది తగ్గినట్టే తగ్గి, మళ్ళీ ముందుకు వస్తుంది.

అర్జునుడు, తన సమస్యయొక్క తీవ్రరూపాన్ని గమనించటంవల్ల, తన సమస్యకు శాశ్వతమైన పరిష్కారం కావాలనుకున్నాడు. అర్జునుడు శ్రీకృష్ణపరమాత్మను శరణు వేడాడు. కృష్ణపరమాత్మను గురువుగా స్వీకరించాడు. పార్థసారథి జగద్గురువు అయ్యాడు; యజమాని అర్జునుడు శిష్యుడు అయ్యాడు. అది శ్రీకృష్ణార్జునుల సంవాదానికి దారితీసింది.

ఒకసారి అర్జునుని వ్యక్తిత్వాన్ని బేరీజు వేస్తే, అర్జునుడు ఎన్నో అర్హతలు ఉన్న వ్యక్తి; కాని ఆ అర్హతలేవీ అతని ప్రాథమిక సమస్యను పరిష్కరించలేకపోయాయని అర్థమవుతుంది. అర్జునుడు ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. పేరు ప్రతిష్ఠలు పొందాడు, సంగీత విద్వాంసుడు, నాట్యాచార్యుడు, అందగాడు, ఆకర్షణీయుడు. ఒక్కముక్కలో చెప్పాలంటే అతనికి జీవితంలో తను కోరుకున్నవన్నీ పొందాడు. మంచి కుటుంబం ఉంది, ఎన్నో విజయాలు పొందాడు. కాని అతని విజయాలు కాని, అతని అర్హతలు కాని, అతన్ని సంసారమనే మోహంనుంచి బయటపడేయలేకపోయాయి.

మొదటి అధ్యాయంనుంచి మనం నేర్చుకోవల్సిన పాఠం ఒకటే. లౌకిక విజయాలైన పేరు ప్రతిష్ఠలు, ధనధాన్యాలు, హోదా, బంధుబలగం, మంచి ఉద్యోగం – ఇవేవీ మనిషి సమస్య అయిన సంసారంనుంచి బయటపడేయలేవు. అందువల్ల మనం కూడా మన సమస్యకి శాశ్వతమైన పరిష్కారం కోరితే, మనం కూడా అర్జుననిలాగా ఒక ఆచార్యుణ్ణి సమీపించి, ఈ జ్ఞానాన్ని పొందాలి. ఆ విధంగా మొదటి అధ్యాయం సంసారసమస్యను ప్రవేశపెట్టింది; దానికి గురు ఉపసదనం మాత్రమే పరిష్కారం అనీ సూచించింది. ఇదీ గీత నేపథ్యం.

రెండవ అధ్యాయంలో గీతా బోధంతా ఒక విహంగ వీక్షణంగా వచ్చింది. మూడవ అధ్యాయంనుంచి పదిహేడవ అధ్యాయం వరకూ వచ్చిన బోధ అంతా, రెండవ అధ్యాయంలో క్లుప్తంగా వచ్చింది. రెండవ అధ్యాయంలో ఈ సంసారసమస్యకు ఒక్కటే పరిష్కారముందనీ, అది ఆత్మజ్ఞానం పొందటమే అనీ సూచించాడు.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** – 2.11

శోకింపదగని వారికోసం శోకిస్తున్నావు. జ్ఞానిలాగా మాట్లాడుతున్నావు కాని నిజమైన జ్ఞానులు ఎన్నడూ మరణించిన వారి గురించి కాని, జీవించి ఉన్నవారి గురించి కాని శోకించరు అన్నాడు కృష్ణపరమాత్మ.

జ్ఞానులు శోకించరు. దుఃఖహేతువు ఆత్మ అజ్ఞానం. ఆత్మ అజ్ఞానం దుఃఖానికి కారణం కాబట్టి, ఆత్మజ్ఞానం ఒక్కటే దానికి పరిష్కారం. గుర్తుంచుకోండి, ఆత్మజ్ఞానం అనేక

పరిష్కారాలలో ఒక మార్గం కాదు; అదొక్కటే మార్గం. ఈ ఆత్మజ్ఞానం ఒక్కటే దుఃఖాన్ని పారద్రోలి, బంధవిముక్తులను చేస్తుంది. దాన్నే **మోక్షం** అంటారు. మోక్షం అంటే వేరే లోకానికి వెళ్ళటం కాదు. మోక్షం అంటే స్వేచ్ఛ, శోకంనుంచి స్వేచ్ఛ – శోకమోక్షః. అందువల్ల జ్ఞానప్రాప్తిని మోక్ష ఉపాయంగా అభివర్ణించాడు కృష్ణపరమాత్మ.

కాని ఇక్కడ ఒక సమస్య ఉంది. జ్ఞానప్రాప్తికి అందరూ అర్హులు కారు. ఏ జ్ఞానం పొందాలన్నా కూడా దానికొక అర్హత కావాలి. దాన్ని జ్ఞానయోగ్యత అంటారు. మెడిసిన్‌లోనైనా, ఐ.ఐ.టీలోనైనా, ఏదైనా విశ్వవిద్యాలయంలోనైనా సీటు పొందాలంటే వాటికి సంబంధించిన అర్హతలను పెంపొందించుకోవాలి. విదేశాలలో పై చదువులకు వెళ్ళాలంటే టోఫెల్, జీమాట్, జీ.ఆర్.ఇ. పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి. అంతదాకా ఎందుకు క్రీడారంగంలో, ఆటల్లో – ఒలింపిక్స్, వింబుల్డన్, యు.యస్. ఓపెన్, వరల్డ్ ఛెస్ ఛాంపియన్‌లలో పాల్గొనాలంటే ఎన్నో దశలు దాటుకుంటూ రావాలి. లౌకిక విద్యల్లోనే ఇన్ని అర్హతలు పెంపొందించు కోవాలంటే, ఆత్మజ్ఞానం పొందటానికి ఇంకెన్ని అర్హతలు ఉండాలి? అందువల్ల జ్ఞానప్రాప్తి అంతిమలక్ష్యం అయితే, జ్ఞానయోగ్యతాప్రాప్తి తక్షణలక్ష్యం అవుతుంది.

అందువల్ల శాస్త్రం మన జీవనవిధానాన్ని రెండు దశలుగా విభజించింది. జ్ఞానయోగ్యతా ప్రాప్తి, జ్ఞానప్రాప్తి. ఈ రెండు లక్ష్యాలను పొందటానికి రెండు సాధనలను బోధిస్తుంది. జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందటానికి కర్మయోగం పాటించాలి. కర్మయోగం జ్ఞానాన్ని ఇవ్వదు, జ్ఞానయోగ్యతను మాత్రమే ఇస్తుంది. రెండవ సాధన జ్ఞానయోగం. దీని ద్వారా జ్ఞానం పొందుతారు.

**కర్మయోగేన జ్ఞానయోగ్యతాప్రాప్తిః, జ్ఞానయోగేన జ్ఞానప్రాప్తిః**

ఇదీ మన జీవనవిధానం.

మొదటి దశ ధర్మపరంగా ఉంటే, రెండవ దశ ఆధ్యాత్మికంగా ఉంటుంది. మరయితే, భక్తియోగం మాటేమిటి? భక్తియోగాన్ని వేరే ప్రత్యేక సాధనగా చెప్పడు కృష్ణపరమాత్మ. భక్తియోగం అటు కర్మయోగానికీ, ఇటు జ్ఞానయోగానికీ కూడా కావాలి. అందువల్లనే, ప్రతి గురువు కూడా జ్ఞానయోగాన్ని ప్రార్థనతో మొదలుపెడతాడు. శంకరాచార్యులవారు కూడా తన భాష్యాన్ని ధ్యానశ్లోకంతో మొదలు పెడతారు.

**శ్లో॥ నారాయణం పద్మభువం వసిష్ఠం, శక్తిం చ తత్పుత్ర పరాశరం చ।**
**వ్యాసం శుకం గౌడపదం మహాన్తం, గోవిన్దయోగీంద్రమథాస్య శిష్యమ్॥**
**శ్రీ శఙ్కరాచార్యమథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యమ్ ।**
**తం తోటకం వార్తికకారమన్యానస్మద్గురూన్ సన్తత మానతోఽస్మి॥**

అంశం జ్ఞానయోగం అయినా, దాన్ని ప్రార్థనతో మొదలు పెడుతున్నారు. అందువల్ల కర్మయోగానికి భక్తి కావాలి, జ్ఞానయోగానికి కూడా భక్తి కావాలి. అందువల్ల భక్తియోగం నిర్వచనం ఏమిటని ఎవరైనా అడిగితే, మనం ఇచ్చే నిర్వచనం ఇది.

**కర్మయోగభక్తి + జ్ఞానయోగభక్తి = భక్తియోగం (కర్మలో ఉపాసన కూడా తీసుకోవాలి)**

ఇంకా వివరం కావాలంటే భక్తియోగంయొక్క మొదటిదశను కర్మయోగం అంటారనీ, రెండవ దశను జ్ఞానయోగం అంటారనీ చెబుతాము. రెండవ అధ్యాయంలోనే కృష్ణపరమాత్మ కర్మయోగాన్నీ, జ్ఞానయోగాన్నీ ప్రవేశపెట్టాడు. కాకపోతే, అక్కడ జ్ఞానయోగాన్ని సాంఖ్యయోగం అన్నాడు. ఎవరైతే ఈ రెండు యోగాలనూ పాటిస్తారో, వారు శోకంనుంచి విడివడతారు. అటువంటి వ్యక్తిని జీవన్ముక్తుడని అంటారు. కృష్ణపరమాత్మ అతన్ని ఈ విధంగా వివరించాడు.

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – 2.55

తన మనస్సులోని కోరికలను త్యజించి, ఆత్మలోనే రమించే వ్యక్తిని స్థితప్రజ్ఞుడు అంటారు అన్నాడు కృష్ణపరమాత్మ.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** – అర్జునా, నువ్వు ఈ ఆత్మజ్ఞానం పొందితే, నీ ఆనందం భీష్మాచార్యుల నుంచి రాదు, ద్రోణాచార్యులనుంచి రాదని గ్రహిస్తావు. ఆనందం బాహ్యవస్తువులలో దొరకదు. ఆనందం నీనుంచే వస్తుంది. ఈ విషయం తెలుసుకుంటే పొందే ఫలమేమిటి?

బాహ్యవస్తువులు ఉన్నా, లేకపోయినా జ్ఞాని ఆనందాన్ని చెడగొట్టవు. జ్ఞానికి యు.పి.యస్. ఉంటుంది. అది అన్ఇంటరప్టెడ్ ప్లెజర్ సప్లై. బాహ్యప్రపంచం ఆనందం ఇస్తుందా లేదా అనేది అతనికి అనవసరం. ఆ విధంగా రెండవ అధ్యాయం సారాంశం –

**కర్మయోగం + జ్ఞానయోగం = మోక్షం**

ఇప్పుడు, తను బోధించిన ఒక్కొక్క అంశాన్నీ, మూడవ అధ్యాయంనుంచి వివరించుకు వస్తున్నాడు.

మూడవ అధ్యాయాన్ని ప్రధానంగా మూడు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. కర్మయోగం : శ్లోకాలు 1–20
2. శ్రేష్ఠాచార్యుడు : శ్లోకాలు 21–34
3. కామక్రోధ జయం : శ్లోకాలు 35–43

## 1. కర్మయోగం : శ్లోకాలు 1-20

ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం కర్మయోగం. కర్మయోగం గురించి రెండవ అధ్యాయంలోనే చూశాము. ఇక్కడ దీని గురించి ఇంకా వివరంగా చూస్తాము.

**కర్మయోగం = కర్మ + యోగం**
**కర్మ = సరియైన కర్మ**
**యోగం = సరియైన దృక్పథం**

**కర్మ** – సరియైన కర్మ అంటే ఏమిటి? శాస్త్రం మూడురకాల కర్మలను పేర్కొంటుంది. అవి నిష్కామకర్మ, సకామకర్మ, నిషిద్ధకర్మ.

ఎ) **నిష్కామకర్మ** – ఈ నిష్కామకర్మలను మీరు చేసితీరాలి, మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా కూడా. ఈ కర్మలు మీ ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉండవు. మీకు ఆ కర్మ ఇష్టమయిందా– మరీ మంచిది – దాన్ని చేయండి. ఇష్టం లేదా, ఇష్టపడటం నేర్చుకోండి. ఎందుకంటే, దాన్ని తప్పించుకునే మార్గం లేదు.

బి) **సకామకర్మ** – కోరికలు తీర్చుకోవటంకోసం చేసే కర్మలు. కోరికలు అంటే లౌకిక కోరికలు – పేరు, హోదా, ధనం, పదవి, ఆస్తులు ఏదైనా కావచ్చు.

సి) **నిషిద్ధకర్మ** – శాస్త్రం నిషేధించిన కర్మలు. ఇవి చేయకూడదు. ఉదాహరణకు సురాపానం చేయకూడదు.

ఎ) **నిష్కామకర్మ** – ఈ మూడింటిలో ముఖ్యమైనవి నిష్కామకర్మలు. కర్మయోగి వీటిని పాటించాలి. ఏమిటా కర్మలు? వర్ణధర్మాన్నిబట్టి, ఆశ్రమధర్మాన్నిబట్టి శాస్త్రం అనేక కర్మలను నిర్దేశించింది. అవికాక అన్ని వర్ణాశ్రమధర్మాలకు సరిపోయేటట్టుగా, మరికొన్ని ప్రత్యేక కర్మలను నిర్దేశించింది. వాటిని పంచమహాయజ్ఞాలు అంటారు. వీటిని ప్రతి ఒక్కరూ చేసితీరాలి. అవి,

1. **దేవయజ్ఞం** – ప్రతిరోజూ భగవంతుణ్ణి పూజించాలి. అది ఏ దేవునికైనా చేయవచ్చు, ఏ రూపంలోనైనా చేయవచ్చు. ఒక చిన్న ప్రార్థననుంచి, ఒక మహాయజ్ఞం దాకా ఏదైనా చేయవచ్చు. వైదికయజ్ఞాలు, అగ్నిహోత్రం, ఉపాసనలు కూడా ఇందులోకే వస్తాయి.

2. **పితృయజ్ఞం** – తల్లిదండ్రులు జీవించి ఉంటే వారిని గౌరవించటం, మరణిస్తే శ్రాద్ధకర్మలు చేయటం పితృయజ్ఞంలోకి వస్తుంది.

**మాతృదేవో భవ। పితృదేవో భవ**

తల్లిదండ్రులెలాంటి వారైనా సరే, వారిని పూజ్యనీయులుగా చూడాలని శాస్త్రం ఘోషిస్తున్నది.

3. **ఋషియజ్ఞం** – ఋషులను పూజించాలి అంటే, ఋషులు మనకు అందజేసిన శాస్త్రాన్ని పూజించాలి. శాస్త్రాన్ని పూజించాలి అంటే శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి, అధ్యాపనం చేయాలి. అందువల్ల కేవలం పుస్తకాలను పూజ గదిలో ఉంచితేనో, సరస్వతీపూజ రోజు వాటికి దీపారాధన చేస్తేనో చాలదు. ఆ ఒక్కరోజు తర్వాత వాటిని మర్చిపోకూడదు. శాస్త్రాన్ని మీరు రోజూ నేర్చుకోవాలి. మీ ముందు తరాల వారికి అందజేయాలి.

4. **మనుష్యయజ్ఞం** – మానవసేవయే మాధవసేవ అంటారు. తోటి మానవులకు చేసే అన్ని రకాల సేవలు అందులోకి వస్తాయి. సమాజసేవ కూడా మనుష్యయజ్ఞమే.

5. **భూతయజ్ఞం** – జంతువులను పూజించటం. జంతువులను మనకన్నా తక్కువ స్థాయి జీవులుగా చూడకూడదు. ఎందుకంటే, ఒక్కోసారి మనుష్యులు పశువులకన్నా హీనంగా ప్రవర్తిస్తారు. చెట్లను, ఆవులను పూజించటం భూతయజ్ఞం కిందికి వస్తాయి. అవి మనకెంత తోడ్పడుతున్నాయో ఒక్కసారి గుర్తు తెచ్చుకుంటే, మనమే వాటిని గౌరవిస్తాము.

ఈ పంచమహాయజ్ఞాలు నిష్కామకర్మలు. ఈ ఐదు యజ్ఞాలలో అన్నీ, అందరూ తప్పనిసరిగా చేసితీరాలి. వైదిక జీవనవిధానంలో ఇవి చేసితీరాలి.

బి) **సకామ కర్మ** – సకామ కర్మల విషయానికి వస్తే, శాస్త్రం ఈ కర్మలను పూర్తిగా నిషేధించదు, చేసినా ఫర్వాలేదు అంటుంది కాని, వాటిని చేసేటప్పుడు కొన్ని నియమాలను పాటించమంటుంది.

1. **ధర్మబద్ధంగా ఉండాలి** – మీరు చేసే కర్మలు ధర్మబద్ధంగా ఉండాలి. సాధన, సాధ్యం– రెండూ నైతికంగా ఉండాలి. లౌకిక విజయాలైన ధనం, ఇల్లు, కారు, ఫోను పొందాలనుకోవటంలో తప్పేంలేదు. శాస్త్రం వాటిని ఖండించదు. ఎందుకంటే శాస్త్రం నిర్దేశించిన నాలుగు పురుషార్థాలలో కామం ఒక పురుషార్థం. అందువల్ల కోరిక పెంచుకోండి, తప్పులేదు. కాని ధార్మికంగా కోరండి అంటుంది.

2. **పరిమితంగా ఉండాలి** – కోరికలు ఉండవచ్చు తప్పులేదు కాని, అవి మరీ మితిమీరి ఉండకూడదు. కోరికలు మరీ ఎక్కువ ఉంటే, మీ జీవితమంతా ఈ కామ్యకర్మలను తీర్చుకోవటంతోనే సరిపోతుంది. కామ్యకర్మలనే తీర్చుకుంటూ కూర్చుంటే, మీరు ఉన్నతమైన లక్ష్యాలకోసం ఎప్పుడు సాధన చేస్తారు? అందువల్ల కోరికలను తగ్గించుకోండి.

**మూఢ జహీహి ధనాగమతృష్ణాం కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్ ।**
**యల్లభసే నిజకర్మోపాత్తం విత్తం తేన వినోదయ చిత్తమ్ ॥** భజగోవిందం 2

ఓ మూఢుడా! ధనాగమతృష్ణ వదిలివేయి. మనస్సును సద్బుద్ధితో నింపు. ధర్మపరంగా కర్మలు చేసి వాటితో వచ్చే ధనంతో ఆనందంగా, తృప్తిగా ఉండు.

కాని వాటికోసం ప్రయత్నించండి తప్పులేదు. తక్కినవారితో పోల్చుకోకుండా మీకున్న దానితో తృప్తి చెందటం నేర్చుకోండి.

3. **బంధించకుండా ఉండాలి** – కోరికలను తగ్గించుకుంటే చాలదు, అవి మిమ్మల్ని బంధించకుండా ఉండాలి. మీ కోరికలు తీరితే, తప్పకుండా అది ఈశ్వరానుగ్రహం కిందికే వస్తుంది. కాని ఎన్నో కోరికలు తీరకుండా మిగిలిపోవచ్చు. అప్పుడూ ఓటమిని చిరునవ్వుతో స్వీకరించగలగాలి. దాన్ని ఈశ్వరేచ్ఛగా స్వీకరించాలి. ఆ విధంగా కోరిక తీరితే అది ఈశ్వరానుగ్రహం; కోరిక తీరకపోతే ఈశ్వరేచ్ఛ. అందువల్ల సకామకర్మలు చేసినా కూడా అవి ధర్మబద్ధంగా, పరిమితంగా ఉండి, బంధించకుండా ఉండాలి. కాని కర్మయోగానికి రావాలంటే మాత్రం నిష్కామకర్మ ఇంకా పంచమహాయజ్ఞాలు చేసితీరాలి.

సి) **నిషిద్ధ కర్మ** – నిషిద్ధకర్మలను వెంటనే మానివేయమంటున్నాడు కృష్ణపరమాత్మ. వాటిని మానటానికి మంచిరోజుకోసం ఆగకూడదు. వచ్చే నెల, మొదటి తారీఖునుంచి మానతాను అనుకోవటంలో అర్థం లేదు. రాహుకాలం, కేతుకాలంకోసం చూడకండి. నిషిద్ధకర్మ ఏమైనా చేస్తున్నట్టయితే, వాటిని ఇక్కడే, ఇప్పుడే మానేయండి. వాటికి ఫుల్‌స్టాప్ పెట్టేయండి.

సరియైన కర్మ అంటే నిషిద్ధకర్మలు మాని, సకామ కర్మలను తగ్గించుకుని, నిష్కామ కర్మలకు రావాలి.

**యోగం** – యోగం అంటే సరియైన దృక్పథం.

1. **ఈశ్వరార్పణబుద్ధి** – చేసే కర్మలన్నీ ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి.

**యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్** – శివమానసపూజా స్తోత్రమ్

ఏం చేస్తున్నా ఓ శివా అదంతా నీకే అర్పిస్తున్నాను అనగలగాలి. మీరు విష్ణుభక్తులయితే, ఓ విష్ణూ అదంతా నీకే అర్పిస్తున్నాను అనగలగాలి. అలా చేసే పనిని ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి. ఇలా భక్తిగా చేయటంవల్ల, మీరు చేసే పని అంటే మీకు విసుగు పుట్టదు.

అంతేకాదు, మీరు చేసే పనిని నిర్లక్ష్యంగా చేయరు; అరకొరగా చేయరు. ఎందుకంటే భగవంతునికి అర్పించేది అత్యుత్తమంగా ఉండాలి. మీ దగ్గర కొన్ని పండ్లు ఉంటే, వాటిలోంచి పనికిరానివి భగవంతునికి నైవేద్యంగా పెట్టరు, పెట్టకూడదు కూడా. కొంతమంది ఎవరికైనా ఏదైనా దానం ఇవ్వాలంటే తక్కువ రకానివి కొంటారు. ఏ బ్రాహ్మణునికైనా ఒక పంచెలచాపు పెట్టాలంటే, తాము కట్టుకునేరకం పంచె కాకుండా, తక్కువరకంది కొంటారు. అలా చేయకూడదు.

భగవంతునికి ఏదైనా అర్పిస్తున్నారు అంటే, అత్యుత్తమమైనది అర్పించాలి. అంటే చేసే పనిని మనస్ఫూర్తిగా చేయాలి. అప్పుడు మీరు చేసే పని మీకు విసుగు పుట్టదు. మీకు

ఇష్టమున్నా, లేకపోయినా మీ స్వధర్మాన్ని శ్రద్ధగా పాటించాలి. అది బ్రాహ్మణధర్మమవనీ, క్షత్రియధర్మమవనీ, వైశ్యధర్మమవనీ, శూద్రధర్మమవనీ – మీరు చేపట్టిన ఏ ధర్మమైనా సరే, మీరు శ్రద్ధగా చేయాలి.

ఏ ధర్మాన్ని తీసుకున్నా దాన్ని రోజూ పాటించక తప్పదు. మీరు ఒక టీచర్ అయితే, అదే పాఠం అనేకసార్లు చెప్పాలి. అదే ఎల్.కే.జీ టీచర్ అయితే, ఏ బీ సీ డీ ప్రతిరోజూ వల్లెవేయాలి. గీతాచార్యులు అయితే ధర్మక్షేత్రే, కురుక్షేత్రే అనేకసార్లు చెప్పాలి. ఇవేవీ కాకుండా ఇంటి ఇల్లాలు అయితే, ఇంట్లోవారికి ప్రతిరోజూ సాంబారో, రసమో చేసిపెట్టాలి. అకౌంటెంట్ అయితే రోజూ అంకెలతో కుస్తీ పట్టాలి. ఆ విధంగా, ఏ కర్మ చేసినా, దాన్ని పదేపదే చేయకతప్పదు. పదేపదే చేయాల్సి వస్తే అది విసుగు పుట్టవచ్చు. దానికి ఒక్కటే మార్గం ఉంది. అది మీ దృక్పథాన్ని మార్చుకోవటం. చేసే కర్మలన్నింటినీ ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి. ఇది కర్తగా మీ దృక్పథం.

**2. ఈశ్వరప్రసాద బుద్ధి** – కర్తగా మీరు చేసిన పనులకు, మీరు భోక్తగా కర్మఫలాలను అనుభవించక తప్పదు. వచ్చిన కర్మఫలాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించగలగటం నేర్చుకోవాలి. మీరు ఇటు కర్తా, అటు భోక్తా కూడా. కాని భోక్తగా కర్మఫలం వచ్చినప్పుడు మాత్రం దాన్ని నవ్వుతూ స్వీకరించలేరు. నాకే ఎందుకు ఈ కష్టం వచ్చింది అనుకుంటారు. నేను రామ నామజపం చేస్తున్నాను, నేను పూజలు చేస్తున్నాను, నాకే ఎందుకు అనుకుంటారు.

ఇక్కడ దృక్పథం చాలా ముఖ్యం అవుతుంది. మీకు ఏ కర్మఫలం వచ్చినా కూడా అది మీకు తగ్గ ఫలం అనిపించకపోయినా, అప్పుడు ఆ దశలో మీరు అనుభవించి తీరాల్సిన ఫలం. దీన్ని ఈశ్వరేచ్ఛకు, ఈశ్వర నిర్ణయానికి మారుమాట్లాడకుండా కట్టుబడి ఉండటం అంటారు. భగవంతుడెన్నడూ పక్షపాతం చూపడు; భగవంతుడు కర్మఫలదాత నిజమే కాని ఆయన ఇచ్చే కర్మఫలం మీ కర్మఫలమే. అంటే మీరు చేసుకున్న కర్మకు తగ్గ ఫలం అది. మీ కర్మకు మీరే బాధ్యులు, వేరెవరూ కారు.

మీ కర్మకు మీరే బాధ్యులు అని తెలుసుకుంటే, మీ కర్మఫలానికి ఎవరినీ నిందించరు. మీరు పడే అవస్థలకు మీ కుటుంబసభ్యులో, మీ ఇరుగు పొరుగో, మీ నక్షత్రమో, మీ అరచేతిలోని రేఖో దానికి కారణం కాదని అర్థం చేసుకుంటారు. కొన్ని సమస్యలకు కొందరు మీ పేరులో అక్షరాల సంఖ్యను మార్చండి లేదా మీ స్పెల్లింగ్ మార్చండి అని సలహాలు ఇస్తుంటారు. అవి పట్టించుకోరు మీరు. ఎందుకంటే ఇప్పటి మీ అవస్థకు మీరే బాధ్యులు అని అర్థం చేసుకుంటారు. ఎదురు ప్రశ్నించకుండా, పూర్తిగా వచ్చిన ఫలాన్ని స్వీకరించటమే సరియైన దృక్పథం. అలా స్వీకరించటంవల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఎదురు తిరిగితే దుఃఖం, ఎదురు తిరిగితే నిరాశానిస్పృహలు, ఎదురు తిరిగితే బాధ.

**ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ॥** – 2.65

సమత్వం అన్ని దుఃఖాలను నశింపచేస్తుంది. బుద్ధి ప్రసన్నంగా ఉంటే, ఆత్మజ్ఞానం బలంగా నెలకొని ఉంటుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కర్మయోగం గురించి టూకీగా చూస్తే –

| | | |
|---|---|---|
| **కర్మయోగం** | **= సరియైన కర్మ** | **+ సరియైన దృక్పథం** |
| **సరియైన కర్మ** | **= నిష్కామకర్మ** | **+ పంచమహాయజ్ఞాలు** |
| **సరియైన దృక్పథం** | **= ఈశ్వరార్పణబుద్ధి** | **+ ఈశ్వరప్రసాదబుద్ధి** |

ఈ కర్మయోగాన్ని ఎలా చేయాలి? మూడవ అధ్యాయంలో, కృష్ణపరమాత్మ నాలుగు భిన్నకోణాల్లో సూచిస్తున్నాడు. మీ మనస్తత్వాన్నిబట్టి, మీకున్న పరిపక్వతనుబట్టి, వాటిల్లో ఏ విధంగానైనా చేయవచ్చు. అవేమిటో చూద్దాము.

1. **ఈశ్వరాజ్ఞగా చేయాలి** – చేసి తీరాల్సిన ఈ కర్మలను ఈశ్వరాజ్ఞగా లేదా విధిగా చేయమంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఈశ్వర నియతమ్** – 3.8

**నియతం కురు కర్మ త్వమ్** – నీకు నియమించిన కర్మలను నువ్వు చేయి. నియమించిన కర్మలను నియతం కర్మ లేదా విధి లేదా విహితం అంటారు. విధి అంటే ఆజ్ఞ. భగవంతుడు మన యజమాని, మనమంతా ఆయనచేత సృష్టించబడ్డాము. భగవంతుడు ఈ ప్రపంచాన్ని మనం వాడుకోవటానికి సృష్టించాడు. వాడుకునేందుకు కొన్ని నియమాలు, కర్తవ్యాలు, నిబంధనలు విధించాడు.

ఈ దేశపౌరునిగా మనం పన్ను చెల్లించాలి. కొన్ని నిబంధనలు పాటించాలి. కాని చాలామంది నిబంధనలను పాటించరు. పాటించాలనే పరిపక్వత లేదు. ఎంతో పెద్ద చదువులు చదివినవారు కూడా, చిన్న ట్రాఫిక్ నిబంధనలనే పాటించరు. పోలీసు ఉండి తీరాలి. పోలీసు చుట్టుపక్కల లేకపోయినా, సమతుల్యత పాటించటం కష్టం. తమంతట తాము నిబంధనలను పాటించాలని ఎవరూ అనుకోరు. పోలీసు అక్కడ ఉంటే బుద్ధిగా పాటిస్తారు. పోలీసు కాస్త కనుమరుగైతే చాలు, సిగ్నలును జంప్ చేసేస్తారు. అందువల్లనే, కొన్ని నియమ, నిబంధనలను బలవంతంగా రుద్దాల్సి వస్తుంది.

ఈ సూత్రం విశ్వంలోని నియమ, నిబంధనలకు కూడా వర్తిస్తుంది. అందువల్ల భగవంతుడు మొదట్లో యజమానిగా భయపెట్టాల్సి ఉంటుంది.

**భయాదస్య అగ్నిస్తపతి భయాత్ తపతి సూర్యః।**

**భయాత్ ఇంద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః॥** – కఠ 6.3

భగవంతునిమీద భయంవల్లనే అగ్ని మండుతున్నది; భగవంతునిమీద భయంవల్లనే సూర్యుడు ప్రకాశిస్తున్నాడు; భగవంతునిమీద భయంవల్లనే ఇంద్రుడు, వాయువు, పంచమ దేవత అయిన మృత్యుదేవత వారివారి పనులను చేస్తున్నారు. ఈ మాటలను స్వయంగా, మృత్యుదేవత అయిన యమధర్మరాజే చెబుతున్నాడు.

**భీషాఽస్మాద్వాతః పవతే। భీషోదేతి సూర్యః। భీషాఽస్మాదగ్నిశ్చేంద్రశ్చ।**

**మృత్యుర్ధావతి పంచమ ఇతి।** – తైత్తిరీయమ్

ఇదే భావనను తైత్తిరీయోపనిషత్‌లో కూడా చూస్తాము. భగవంతునిమీద భయంవల్లనే గాలి వీస్తున్నది; భగవంతునిమీద భయంవల్లనే సూర్యుడు ఉదయిస్తున్నాడు; భగవంతునిమీద భయంవల్లనే అగ్ని, ఇంద్రుడు, పంచమదేవత అయిన మృత్యువు పరుగులు తీస్తున్నారు. భగవంతునిమీద భయం ఎందుకు?

**మహద్భయం వజ్రముద్యతమ్** – కఠ 6.2

ఎందుకంటే భగవంతుడు ఎత్తిపట్టిన వజ్రాయుధంతో తిరుగుతున్నాడుట. ఎవరైనా తప్పు చేస్తే వెంటనే దండించటానికి వీలుగా వజ్రాయుధాన్ని ఎత్తిపట్టుకుని తిరుగుతున్నాడుట. ఇలా ఎందుకు వర్ణిస్తున్నాడు అంటే, అలా భయపెట్టకపోతే, చాలామంది పనులు చేయరు; చట్టాన్ని పాటించరు.

ఇంగ్లీషులో **'హి ఈస్ ఎ గాడ్ ఫియరింగ్ పర్సన్,'** అంటారు, **'గాడ్ లవింగ్ పర్సన్,'** అనరు. నిజానికి చాలామందికి ఉండేది అదే. భగవంతునిమీద భక్తికన్నా, భయం ఎక్కువ ఉంటుంది. చేయాల్సిన కర్మలు చేయకపోతే ప్రత్యవాయపాపం కలుగుతుందని శాస్త్రం బెదిరిస్తుంది.

**యస్యాగ్నిహోత్రమ్ అదర్శమ్ అపౌర్ణమాసం**

**అచాతుర్మాస్యమ్ అనాగ్రయణమ్ అతిథివర్జితం చ।**

**అహుతమ్ అవైశ్వదేవమ్ అవిధినా హుతం**

**ఆసప్తమాంస్తస్య లోకాన్ హినస్తి॥** – ముండకమ్ 1.2.3

ఎవరైతే దర్శమ్, పూర్ణమాసమ్, చాతుర్మాస్యమ్ ఆగ్రయణమ్, అతిథిపూజ్యమ్, వైశ్వదేవ కర్మలు చేయరో, ఎవరు అగ్నిహోత్రం సరియైన సమయంలో, సరియైన పద్ధతిలో చేయరో, అతనికి ఏడు లోకాలనూ లేకుండా చేస్తుంది అగ్నిహోత్రం. యజ్ఞఫలం దక్కదు.

చేయాల్సిన కర్మలు చేయకపోతే ప్రత్యవాయపాపం కలుగుతుందనీ, ఆ పాపంవల్ల నరకానికి పోతారనీ బెదిరిస్తే, అప్పుడన్నా పాపభీతితో అన్నా ఆ కర్మలు చేస్తారు. దీన్ని **స్వామి–భృత్యున్యాయం** అంటారు శంకరాచార్యులవారు.

**ఈశ్వరాజ్ఞగా భావించి కర్మలు చేయాలి – ఇది మొదటి పద్ధతి**

2. **ఈశ్వరయజ్ఞంలా చేయాలి** – ముందు పద్ధతి పరిపక్వత చెందని మనస్సు ఉన్నవారికి. పరిపక్వత చెందాక, అదే కర్మను ఇంకొక కోణంలోంచి చూడవచ్చు. ఈ దశలో బెదిరింపులు, ఆజ్ఞలు అవసరం లేదు. అదే కర్మయోగం, **యజ్ఞంగా** మారుతుంది.

యజ్ఞం అంటే భగవంతునికి కృతజ్ఞత చూపటం. భగవంతుడు మనకెన్నో వస్తువులను ఇచ్చాడు. పంచభూతాలను ఉచితంగా ఇచ్చాడు. నీరిచ్చాడు, వాయువు ఇచ్చాడు, భూమి ఇచ్చాడు – అన్నీ అక్షరాలా ఉచితంగా. ఇన్ని ఉచితంగా ఇచ్చినందుకు ఆయన మననుంచి కోరేది ఒక్కటే. 'నీ కర్మను నువ్వు చేయి.' మనకు భగవంతుడు అన్ని ఇచ్చినందుకు మనం ఎందుకు కృతజ్ఞత చూపకూడదు?

**దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః** – 3.11

మీరు దేవతలను యజ్ఞాల ద్వారా పూజిస్తే, ఆ దేవతలు తిరిగి మిమ్మల్ని దీవిస్తారు. సకాలంలో వర్షాలు కురిపిస్తారు, మీరు కోరిన వస్తువులు ఇస్తారు.

దేవతలు అన్ని మనకు ఇస్తుంటే, వారికి తిరిగి మనం కృతజ్ఞతలు చూపలేమా? యజ్ఞం అంటే కృతజ్ఞత చూపటం. అందువల్ల కర్మయోగాన్ని భయంతో కాకుండా, కృతజ్ఞతా పూర్వకంగా చేయాలి. దానికి పరిపక్వత కావాలి. కృతజ్ఞత చూపకపోతే అది మహాపాపం. దానికి ప్రాయశ్చిత కర్మ లేదు.

**కృతఘ్నే నాస్తి నిష్కృతిః** – రామాయణమ్ – కిష్కింధకాండ

లౌకిక జీవనంలో, ఒక చిన్న కార్యక్రమం చేపడితేనే దానికి వందన సమర్పణ చేస్తాము. అందులో ఆ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయటానికి తోడ్పడిన వారందరికీ, పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పుకుంటాము. తివాచీ అద్దెకిచ్చిన వారికి, ఎలక్ట్రీషియన్‌కు, హాలు ఇచ్చిన యాజమాన్యానికి, కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకూ, ఏర్పాట్లు చూసినవారికీ – ఇలా అనంతంగా పోతుంది కృతజ్ఞతాభివందనాలు. అందరినీ గుర్తు పెట్టుకుంటాము కాని ఒక్కరిని, అదికూడా అత్యంత ముఖ్యమైనవారిని మర్చిపోతాము. భగవంతుని కృప లేకపోతే ఇవేవీ సాధ్యమయ్యేది కాదు.

**తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః** – 3.12

ఎవ్వరైతే వారికిచ్చిన కానుకలకు కృతజ్ఞతలు చెప్పకుండా అనుభవిస్తారో వారు దొంగలతో సమానం.

ఎవ్వరైతే భగవంతుని పేరు తలుచుకోకుండా తింటారో, వారు దొంగలతో సమానం అంటున్నాడు కృష్ణపరమాత్మ. దొంగ నిర్వచనం ఏమిటి? ఎదుటివ్యక్తికి తెలియకుండా,

అతని సొమ్మును గ్రహించేవాడు దొంగ. ఈ ప్రపంచమంతా భగవంతుని ఆస్తి. మనం ప్రపంచంలోంచి తీసుకునేదానికి డబ్బు ఇవ్వనవసరం లేదు నిజమే, కాని కనీసం భగవంతునికి తెలియజేయాలి కదా, 'నీ సొమ్ముని తీసుకుంటున్నాను,' అని. దీన్నే **నివేదన** లేదా **నైవేద్యం** అంటారు. నివేదన లేదా నైవేద్యం అంటే కృతజ్ఞతలు తెలియజెప్పటం. మనం ఇచ్చినది భగవంతుడు తీసుకుని తినేయడు. నిజానికి, అలా భగవంతుడు తింటే, మనం ఇవ్వము కూడా.

కృతజ్ఞత చూపటమంటే పెద్దగా ఏమీ చేయనవసరం లేదు. అన్నీ భగవంతుని ముందు పెట్టి, 'ఇదంతా నీ కృపవల్ల నాకు వచ్చింది!' అని మనసారా అంటే చాలు. దీన్నే యజ్ఞం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**యజ్ఞార్థాత్ కర్మణోఽ న్యత్ర లోకోఽ యం కర్మబంధనః ।**
**తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర ॥** – 3.9

కర్మయోగాన్ని ఈశ్వరయజ్ఞంలా చేయాలి. అలా కాకుండా కేవలకర్మగా చేస్తే, అది మీకు బంధం అవుతుంది. అందువల్ల కర్మను ఏమీ ఆశించకుండా చేయాలి.

**కర్మను యజ్ఞంగా చేయాలి– ఇది రెండవ పద్ధతి**

3. **ధర్మంగా చేయాలి** – ధర్మం అంటే సృష్టిలో సమతుల్యతను నిలబెట్టేది. సృష్టిలో ప్రతిదీ ఒకదానిమీద ఇంకొకటి ఆధారపడివుంది. ప్రతిదీ ఒక వృత్తం ఆకారంలో ఉంటుంది. పదార్థం శక్తిగా, శక్తి పదార్థంగా మారుతుంది. ఈ వృత్తాన్ని కొనసాగించాలంటే, మనం ప్రకృతినుంచి తీసుకోవటమే కాదు, ఇవ్వాలి కూడా.

**అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః ।**
**యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥** – 3.14

అన్ని జీవరాశులూ భూమినుంచి పుట్టాయి. వానవల్ల అన్నం వస్తుంది. పుణ్యంవల్ల వాన కురుస్తుంది. పుణ్యం కర్మనుంచి పుట్టింది.

ఇదొక వృత్తాకారం. ఈ వృత్తంలో మనిషి ఒక ముఖ్యమైన భాగం. తక్కిన అన్ని జీవరాశులూ అవి ఇవ్వాల్సినవేమిటో, అప్రయత్నంగానే ఇస్తాయి. అలా ఇచ్చేలా భగవంతుడే వాటిని తీర్చిదిద్దాడు. వాటికి ఫ్రీవిల్ లేదు కాబట్టి, భగవంతుడే ఏర్పాటు చేశాడు. అందువల్లనే ఆవు గడ్డి తిని, పాలు ఇస్తుంది.

**ఛాయామన్యస్య కుర్వంతి తిష్ఠంతి స్వయమాతపే।**
**ఫలాన్యపి పరార్థాయ వృక్షాః సత్పురుషా ఇవ॥**– సుభాషితరత్న భాండాగారం 5

చెట్టు తక్కువ తీసుకుని, ఎక్కువ తిరిగి ఇస్తుంది. అందువల్లనే వృక్షో రక్షతి రక్షితః అంటారు. చెట్లను పాతండి, సంతానం తగ్గించండి అంటున్నారు. దీని అర్థమేమిటి? మనుష్యులకన్నా, వృక్షాలే నయం. ఈ మాట వృక్షాలు అంటే వృక్షాలు పక్షపాతం చూపిస్తున్నాయి అనవచ్చు; ఈ మాట మనుష్యులే అంటున్నారు. జనాభా సంఖ్య పెరిగినకొద్దీ పర్యావరణానికి హాని కలుగుతుంది; జగత్తుకు హాని కలుగుతుంది. ఎందుకు? మనిషి తీసుకునేది ఎక్కువా, తిరిగి ఇచ్చేది తక్కువా కాబట్టి. దీని అర్థం, ఈ వృత్తాన్ని చెడగొట్టేది మనిషే. అందువల్ల, కృష్ణపరమాత్మ తిడుతున్నాడు.

**ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।**
**అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥** – 3.16

ఈ విధంగా, ఇలా ఇచ్చిపుచ్చుకోవటాల ద్వారా విశ్వంలోని చక్రం నడుస్తున్నది. ఒకవేళ ఎవరైనా అలా నడుచుకోకపోతే, అతను ఒక పాపి, ఇంద్రియలోలుడు, అతని జీవితం వ్యర్థం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అటువంటి మనుష్యులు రాక్షసులు అంటున్నాడు కృష్ణపరమాత్మ. వారు పాపం చేస్తున్నారు. ఎందుకంటే ఈ వృత్తాన్ని చెడగొట్టటంవల్ల వారు మాత్రమే నాశనమవరు, మొత్తం సృష్టినే నాశనం చేస్తారు వారు.

కర్మయోగం పాటిస్తే, సృష్టిలో సమతుల్యతను తిరిగి నెలకొల్పవచ్చు. కర్మయోగం ఇవ్వటం నేర్పిస్తుంది. మనిషికి తీసుకోవటమే కాని, ఇవ్వటం తెలియదు. నీరు చూడండి, ప్రవహించకుండా, ఒకచోట నిలిచివుంటే, అది మురికిగా అవుతుంది. అందులో ఎవరూ స్నానం చేయటానికి కాని, ఆ నీరు తాగటానికి కాని సాహసించరు.

ఏదైనా సరే, నిలవ ఉంటే అది అనారోగ్యకరం. ఏదైతే ప్రవహిస్తుందో, అది ఆరోగ్యకరం. ఈ చిన్న సూత్రాన్ని మీరు గుర్తు పెట్టుకుంటే, ప్రపంచంనుంచి మీరు పొందినదేదీ, మీతోనే ఉంచుకోవాలనుకోరు. వాననీరుగానీ, డబ్బుగానీ, జ్ఞానం అవనీ, ఒకచోటే నిలిచి పోకూడదు. మీరు పొందిన ధనాన్నీ, మీరు పొందిన జ్ఞానాన్నీ మీతోనే దాచుకోకుండా, నలుగురికీ పంచాలి. అలా పంచకపోతే అది నిలవ ఉండిపోయి, మీకు అనారోగ్యాన్ని కలుగజేస్తుంది.

అందువల్లనే, పూర్వకాలంలో ఎవరికైనా అధికంగా ధనం వస్తే, ఏదో ఒక యాగం చేసేవారు. ఎందుకంటే యాగంలో అనేక దానాలు చేస్తారు – క్షేత్రదానం, స్వర్ణదానం, ధనదానం, గోదానం. కాని ఈ రోజుల్లో ఎంత వచ్చినా అది అధికంగా వచ్చిందనే ఆలోచనకే ఆస్కారం లేదు. మనం కోరుకునేది చాలా ఎక్కువ అయిపోతున్నది. పేపర్లలో తరచు చూస్తాము. 20,000 రూపాయలు పెడితే మీరు ఊటీలో మంచి రిసార్ట్‌లో ఉండవచ్చు. ఇంకొక 20,000 పెడితే, ఇంకొక మంచిచోట సెలవలు ఆనందంగా గడవవచ్చు.

అలా ఆనందంకోసం డబ్బు ఖర్చు పెట్టటానికి ఎక్కువ మార్గాలు ఉన్నాయి ఇప్పుడు. అందువల్ల మనం కృపణాః ఫలహేతవః అవుతున్నాము. మనం తీసుకునేది ఎక్కువా, ఇచ్చేది తక్కువా అయిపోతున్నది.

**కర్మయోగాన్ని ధర్మంగా చేయాలి – ఇది మూడవ పద్ధతి**

4. **సంస్కారకర్మగా చేయాలి** – భగవంతుడు నిర్దేశించిన ప్రతి ఒక్క కర్మ కూడా సంస్కార కర్మ. ఉపనయనం సంస్కారకర్మ, సంధ్యావందనం సంస్కారకర్మ, శ్రాద్ధకర్మ సంస్కారకర్మ. సంస్కారకర్మ అంటే శుద్ధి చేసేది.

**సంస్కరోతి ఇతి సంస్కారః**

ఇది మనస్సును శుద్ధి చేస్తుంది. సంస్కారం రెండు రకాలు – గుణ ఆధానం, దోష అపనయనం. గుణ ఆధానం అంటే కొత్త గుణాలను కలుపుకోవటం. ఆరోగ్యకరమైన ఆలోచనలు చేయటం. దోష అపనయనం అంటే దోషాలను పారద్రోలటం. అనారోగ్యకరమైన ఆలోచనలను పారద్రోలటం. కృష్ణపరమాత్మ వీటిని పదహారవ అధ్యాయంలో దైవీసంపత్తి అనీ, ఆసురీసంపత్తి అనీ అంటాడు. సంస్కార కర్మగా కర్మయోగం చేయటం అంటే దైవీసంపత్తిని పెంపొందించుకోవటం, ఆసురీసంపత్తిని పారద్రోలటం.

అందువల్ల ఒక సాధకుడు కర్మయోగాన్ని ఈశ్వరాజ్ఞగా చేయకపోయినా, ఈశ్వరయజ్ఞంగా చేయకపోయినా, ధర్మంగా చేయకపోయినా, జ్ఞానం పొంది మోక్షం పొందాలనే కోరిక ఉంటే మాత్రం అతను కర్మయోగాన్ని సంస్కారకర్మగా నైనా చేయాలి.

**జ్ఞానయోగ్యతా ప్రాప్త్యర్థం కర్మయోగః అవశ్యమ్ అనుష్ఠేయః ఏవ**

ఈ విధంగా కర్మయోగం పాటించటానికి నాలుగు మార్గాలను సూచించాడు కృష్ణపరమాత్మ. అవి – ఈశ్వరాజ్ఞగా చేయాలి, ఈశ్వరయజ్ఞంలా చేయాలి, ధర్మంగా చేయాలి, సంస్కారకర్మగా చేయాలి.

## 2. శ్రేష్ఠాచార్యుడు: శ్లోకాలు 21–35

ముందు అంశంలో, చివరి మార్గంగా కర్మయోగాన్ని సంస్కారకర్మగా చేయాలి అన్నాడు కృష్ణపరమాత్మ. అలా చేస్తే అతని మనస్సు శుద్ధి పొంది, జ్ఞానం పొందుతాడని కూడా అన్నాడు. ఇది వింటే అర్జునునికి ఒక సందేహం రావచ్చు. అర్జునునికి ఈ సందేహం రావచ్చని కృష్ణపరమాత్మే ఊహించి, దానికి కూడా జవాబు చెప్పబోతున్నాడు ఈ భాగంలో.

ఒక వ్యక్తికి చిత్తశుద్ధి కలిగి జ్ఞానం పొందితే, అతను ఇంక కర్మయోగం పాటించాలా, వద్దా? స్వధర్మం పాటించాలా, వద్దా? సంధ్యావందనం, జపం, పూజ చేయాలా, వద్దా? సాంకేతికంగా చెప్పాలంటే, అవసరం లేదు. ఎందుకంటే కర్మయోగం చిత్తశుద్ధి పొందటానికి చేయాలి. ఈ సాధకుడు చిత్తశుద్ధి పొంది, జ్ఞానం కూడా పొందేశాడు. అతను చిత్తశుద్ధి

పొందాడు కాబట్టి సాంకేతికంగా చూసినా, తార్కికంగా చూసినా, అతను తన స్వధర్మాన్ని పాటించనవసరం లేదు.

ఒక పంచెను ఎంతవరకూ సబ్బుతో రుద్దుతారు? దాని మురికి పోయేదాకా! మురికి పోయాక కూడా, సబ్బుతోనో, బ్రష్షుతోనో రుద్దుతూ పోతే, అది చిరుగుతుంది. ఒక వాహనంలో ఎంతసేపు ప్రయాణం చేస్తారు? మీరు కోరుకున్న గమ్యం చేరేదాకా. అదే విధంగా, ఏ సాధన అయినా దానికి సంబంధించిన సాధ్యం పొందేదాకానే చేస్తారు. సాధ్యాన్ని పొందాక, సాధనతో పనిలేదు. అందువల్ల, చిత్తశుద్ధి పొందాక, జ్ఞానం పొందాక, కర్మయోగం చేయాలా, వద్దా అంటే నిజానికి అవసరం లేదు.

కాని, కృష్ణపరమాత్మ **చేయాలి** అంటున్నాడు. చిత్తశుద్ధి పొందాక, జ్ఞానం పొందాక కూడా కర్మ చేస్తూనే ఉండాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే అతను సమాజంలో ఉన్నాడు. అతను ఏ అడవిలోనో, ఒంటరిగానో ఉంటే, సమస్య లేదు. కాని సమాజంలో ఉన్నంతవరకూ తన స్వధర్మాన్ని కొనసాగించక తప్పదు. అంతగా అయితే, కర్మలను వీలున్నంత తక్కువ చేయవచ్చు కాని, పూర్తిగా మానలేదు. దానికి కారణం కూడా కృష్ణపరమాత్మే చెబుతున్నాడు.

**యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥** – 3.21

శ్రేష్ఠులైన వ్యక్తులు ఏంచేస్తే, దాన్ని మామూలు మనుష్యులు అనుకరిస్తారు. వారే ప్రమాణం చూపిస్తే, దాన్నే తక్కినవారు పాటిస్తారు.

జీవితాన్ని యజ్ఞంలా జీవించటం కొనసాగించాలి జ్ఞాని. అది అతనికి అవసరం లేకపోవచ్చు కాని, ముందు తరాలకు అతను మార్గదర్శకత్వం వహించాలి.

ధర్మం అనేది చాలా సూక్ష్మమైనది. ధర్మం అంటే జీవితాన్ని నైతిక పద్ధతిలో, సరియైన పద్ధతిలో జీవించటం. కాని ఈ ధర్మాన్ని మాటలతో వివరించలేము; ముఖ్యంగా చిన్నపిల్లలకు. చిన్నపిల్లలు మాటలవల్ల నేర్చుకునేది చాలా తక్కువా, చూసి నేర్చుకునేది చాలా ఎక్కువా ఉంటుంది. అందువల్ల విలువలకు విలువనిచ్చే జీవితాన్ని చిన్న వయస్సులో పిల్లలు, వారి తల్లిదండ్రులను చూసి నేర్చుకుంటారు. అందువల్ల పెద్దలమీద ఒక గురుతరమైన బాధ్యత ఉంది. వారికి అవసరమున్నా, లేకపోయినా కూడా వారు ధార్మిక జీవన విధానాన్ని గడపాలి, ముందు తరాలకు ఆదర్శంగా నిలవటంకోసం గడపాలి.

పిల్లలు పెరిగి పెద్దయ్యాక, వారి వ్యక్తిత్వం పూర్తిగా విచ్చుకున్నాక కాని మారరు. కాని అంతవరకూ జాగ్రత్త పడాలి. ఒక విత్తనం మొలకెత్తాక, అది చిన్న మొక్కగా ఉండగా, మీరు దాని దిశను మార్చగలరు. చిన్న చెట్టుగా ఉండగా, అది బాగా వంగిపోతే, దాన్ని నిటారుగా,

ఏ కర్రసాయంతోనో నిలబెట్టగలరు. అలా ఎన్నాళ్ళు చేయగలరు? అది ఒక పెద్ద వృక్షం అయ్యేదాకా. అది పెద్ద వృక్షం అయ్యాక, మీకు కావాల్సినట్టుగా అది వంగదు. మీరే దానికి వంగాలి, లేదా దాన్ని పెకళించి వేయాలి.

అదే విధంగా, పిల్లలు చిన్నగా ఉండగానే, వారికి విలువలను రంగరించి పోయాలి. నిజానికి తల్లిగర్భంలో ఉన్నప్పటినుంచే నేర్పించాలి. గర్భవాసంలో ఉండగానే, పిల్లలకు శిక్షణనివ్వాలని శాస్త్రం ఘోషిస్తుంది. పిల్లలు లేతవయస్సులో ఏదైనా చెబితే అర్థం చేసుకోలేరు, వారు అర్థం చేసుకునేలాగా, పెద్దలూ చెప్పలేరు. మరెలా చెప్పాలి? పెద్దలే చేసి చూపాలి. ఇంటికి పెద్దలు వస్తే వారికి నమస్కారాలు చేయాలని పిల్లలకు చెప్పినా అర్థం కాదు. మీరు పెడితే, మిమ్మల్ని చూసి, వారు కూడా నమస్కారం పెడతారు. ఎందుకంటే వారికి ఒకటే భాష తెలుసు. అది పెద్దవారిని అనుకరించటం.

తండ్రి డాక్టరయితే, పిల్లవాడు తన చేతిలో ఏమి ఉన్నా, దాన్ని స్టెతస్కోప్‌గా వాడతాడు. తండ్రికి సిగరెట్టు తాగే అలవాటుంటే, పిల్లవాడు చేతిలో ఉన్న పెన్నో, పెన్సిలో సిగరెట్టుగా భావించి, తను కూడా తాగుతున్నట్టు చేస్తాడు. తండ్రి పొద్దున్న లేస్తూనే పూజ చేస్తే, పిల్లవాడు కూడా చక్కగా పూజ చేస్తాడు.

ఎవరో అద్భుతంగా వర్ణించారు, 'చాలామంది పిల్లలు వారి పెద్దవారి మాట వినరు కాని, వారు చేసే పనిని అనుకరిస్తారు.' నిజమే, మాట వినకపోవచ్చు కాని, అనుకరించటం చేసి తీరుతారు. అందువల్ల ఈ బలహీనతను మీకు అనువుగా మార్చుకోండి. అందువల్లనే, జ్ఞాని తన స్వధర్మాన్ని పాటించి తీరాలి. అప్పుడే ముందు తరం వారు బాగుపడతారు. పెద్దలు ధార్మిక జీవన విధానాన్ని గడిపితే, అది పిల్లలకు ఆడియో విజువల్ బోధ అవుతుంది. అసలు సూత్రం కూడా, విని నేర్చుకున్న దానికన్నా, చూసి నేర్చుకుంటే ఎక్కువ ప్రభావం ఉంటుంది. అందువల్లనే టెలివిజన్‌లో ప్రకటనలకు ఖర్చు ఎక్కువ, రేడియో ప్రకటనల ఖర్చు తక్కువ. చెవితో విన్నదానికన్నా, కంటితో చూసినదాని విలువ ఎక్కువ. అందువల్ల ధర్మం గురించి బోధించేకన్నా, మీ చర్యల్లో ధర్మాన్ని చూపించాలి. అందువల్ల శ్రేష్ఠుడు, జ్ఞాని, తను ఆచరించే జీవనవిధానం, చిన్నపిల్లలు చూసి నేర్చుకునేటట్టుగా ఉండాలి.

మనుష్యులకెప్పుడూ ఒక హీరోనో, ఒక రోల్‌మోడలో కావాలి. ఎందుకంటే మనుష్యులు అనుకరణం బాగా చేస్తారు. ఈ హీరో వర్షిప్ లేతవయస్సులో చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ హీరోవర్షిప్ చాలా సహజంగా అబ్బే గుణం. ఒక మీటింగ్‌కు వెళితే, అక్కడ మొదటి వ్యక్తి ఎక్కడ చెప్పులు విప్పితే, పోలోమంటూ తక్కిన వ్యక్తులందరూ అక్కడికే వెళ్ళి, అక్కడే చెప్పులు విప్పుతారు. అతను అక్కడ ఎందుకు విప్పాడు అని ఆలోచించను కూడా ఆలోచించరు.

ఇలా అనుకరించే బుద్ధి ఉన్న పిల్లలకు, తల్లిదండ్రులు సరియైన గురువులుగా లేకపోతే, పిల్లలు వేరే ఎవరినో వెతుక్కుంటారు. సినిమా హీరో, హీరోయిన్లనో ఎవరినో ఒకరిని ఎన్నుకుంటారు. హీరో, హీరోయిన్లు వారి రంగంలో నిష్ణాతులయ్యారు నిజమే కాని, తల్లిదండ్రులు వారి పిల్లల దృష్టిలో హీరో, హీరోయిన్లుగా ఉండాలి. పిల్లలు ముందుగా అనుకరించేది వీరిని – మాతా, పితా, గురు, రాజా, తరువాత ఆదర్శపురుషులను. అందులోకి జ్ఞానులు, శ్రేష్ఠులు వస్తారు. అందువల్ల జ్ఞాని జీవితం ఆదర్శప్రాయంగా ఉండాలి. అందువల్ల ఒక జ్ఞాని తక్కినవారికి ఆదర్శప్రాయంగా జీవించాలి. అందువల్లనే శంకరాచార్యుల పరంపరలో అందరూ పూజలు చేస్తారు. అలా పూజలు చేస్తే, వారిని చూసి తక్కినవారు కూడా చేస్తారు అని అంటారు.

విలువలు సాపేక్షికం, ధర్మం సాపేక్షికం. విలువలు, ధర్మం పరిస్థితులనుబట్టి మారుతాయి. రాముడు పితృవాక్యపరిపాలన చేశాడు. రాముణ్ణి దైవంగా కొలుస్తాము; ప్రహ్లాదుడు తండ్రి ఆజ్ఞను ధిక్కరించాడు, ప్రహ్లాదుణ్ణి కూడా కీర్తిస్తాము. వీరిలో ఒకరు తండ్రి మాటను పాటిస్తే, ఇంకొకరు పాటించలేదు. ఇప్పుడు మనం, తండ్రిమాటను గౌరవించాలా, లేదా? అది సంపూర్ణమైన సూత్రం కాదు. అది పరిస్థితులనుబట్టి మారుతుంది. ప్రహ్లాదుణ్ణి మొట్టమొదటి భక్తుల్లో ఒకరుగా రోజూ కొలుస్తాము. ధ్యానశ్లోకాల్లోనే మొట్టమొదటి పేరు ప్రహ్లాదుడు. అతనేమో తండ్రిమాటను జవదాటాడు. దీన్నిబట్టి ఏ విలువ కూడా అంతిమ విలువ కాదని అర్థం అవుతున్నది. అది మనిషినిబట్టి మారుతుంది, వర్ణాన్నిబట్టి మారుతుంది, ఆశ్రమాన్నిబట్టి మారుతుంది, పరిస్థితినిబట్టి కూడా మారుతుంది.

అహింస విషయమే తీసుకోండి. కృష్ణపరమాత్మ గీతాబోధ అంతటా అహింసను గొప్ప విలువగా కీర్తించి, చివర్లో – 'అందువల్ల, అర్జునా! యుద్ధం చేయి,' అన్నాడు. ఆశ్చర్యంగా లేదూ? మూడు, నాలుగు చోట్ల అహింసను పాటించాలి అంటాడు.

**అహింసా అమానిత్వమ్ అదంభిత్వమ్**
**అహింసా శాంతిరార్జవం**
**అహింసా సత్యమ్**
**అహింసా శౌచమ్**

ఇన్నిసార్లు చెప్పి, యుద్ధం చేయి అన్నాడంటే, చివర చెప్పిందే ముఖ్యం. యుద్ధం చేయి అనేదే ముఖ్యం. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే, అహింస సామాన్యసూత్రం కాని దానికి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయి. ధర్మాన్ని అప్పటి కాలమాన పరిస్థితులనుబట్టి నిర్ణయించాలని శాస్త్రమే చెబుతుంది. మనకు ధర్మాన్ని ఎలా నిర్వచించాలో తెలియదు. మన రాగద్వేషాలకు

తగ్గట్టుగా నిర్వచిస్తాము. ఎప్పుడైనా ఇలాంటి ధర్మసంకటం ఏర్పడితే, ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలిగి, అప్పటి కాలమాన పరిస్థితులకు తగ్గట్టుగా జీవించే పెద్దవారిని సలహా అడగాలి.

శంకరాచార్య పరంపరలో వచ్చే శంకరాచార్యులవారి జీవనవిధానం తరతరానికీ మారుతూ వస్తున్నది. అది ఎప్పటికీ ఒక్కలాగానే ఉండదు, ఉండలేదు కూడా. వారి పాత్రలు మారతాయి, వారి భాష మారుతుంది. ఒకప్పుడు, వారు సంస్కృతంలోనే సంభాషించి ఉండివుంటారు, కాని ఇప్పుడలా మాట్లాడితే ఎవరికీ అర్థంకాదు. అందువల్ల వారి భాష మారింది, వారు ప్రయాణించే పంథా మారింది, ఆశ్రమనిర్వహణ తీరుతెన్నులు మారాయి, ప్రతిదీ మారుతూ వస్తున్నది.

**యే తత్ర బ్రాహ్మణాస్సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః। అలూక్షా**
**ధర్మకామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః** – తైత్తిరీయం 1.11.4

ఏదైనా సందిగ్ధమైన పరిస్థితి ఏర్పడినప్పుడు, ధార్మికమైన వైదిక జీవనవిధానాన్ని ఆచరించిన వ్యక్తులు, క్రూరబుద్ధి లేనివారు, ధర్మాన్ని పాటించేవారు, వేదవేత్తలు అయిన బ్రాహ్మణుని దగ్గరకు వెళ్ళండి; వారి జీవనవిధానాన్ని పాటించండి.

ఎవరైతే ధర్మానికి ప్రతీకగా నిలుస్తారో, వారిని మనం అనుకరించాలి. ఆ ధర్మమూర్తులు కాలమానపరిస్థితులనుబట్టి ధర్మాన్ని పాటిస్తారు. ముందు తరాల వారికి పెద్దలు మార్గదర్శకులు. ధర్మం నేర్చుకోవాల్సింది మూడు మార్గాల ద్వారా. శ్రుతి, స్మృతి, శిష్టాచార్యులు. వేదంనుంచి, భగవద్గీతనుంచి, శిష్టాచార్యులనుంచి నేర్చుకోవాలి. అందువల్ల శిష్టాచార్యులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. శిష్టాచార్యులు నడిచిన బాటలో అందరూ నడుస్తారని చెప్పాడు కృష్ణపరమాత్మ.

కర్మయోగం కావాలనుకున్నా, వద్దనుకున్నా, పంచమహాయజ్ఞాలు పాటించాలి పెద్దలు. వారు చేస్తేనే కదా, పిల్లలు వారిని అనుకరించేది. తండ్రి పొద్దునే లేచి పూజచేస్తే, పిల్లవాడు కూడా పూజ చేస్తాడు. దానికి బదులుగా తండ్రి లేచి బెడ్‌కాఫీ తీసుకుంటూ న్యూస్‌పేపర్ చదివితే, పిల్లవాడు కూడా అదే చేస్తాడు. తల్లి వేకువఝామునే లేచి, దీపం వెలిగిస్తే, కూతురు కూడా అలాగే చేస్తుంది.

అందువల్ల శ్రేష్ఠాచార్యుల ప్రవర్తన ఆదర్శప్రాయంగా ఉండాలి. వారు జ్ఞానం పొందినా, చిత్తశుద్ధి పొందినా, వారికి కర్మయోగం అవసరం లేకపోయినా కర్మ చేయాలి. అందువల్ల అర్జునుడు కూడా యుద్ధం చేయాలి. అతను అజ్ఞాని అయినా, జ్ఞాని అయినా కూడా యుద్ధం చేయాలి. అజ్ఞాని అయితే తనకోసం యుద్ధం చేయాలి; జ్ఞాని అయితే ప్రపంచానికి ఆదర్శంగా నిలవటంకోసం యుద్ధం చేయాలి. ముందు తరానికి బాట వేయటంకోసం యుద్ధం చేయాలి.

3. **కామక్రోధ జయం: శ్లోకాలు 36 – 43**

మనం అనేక రంగాల్లో జయించటమెలాగో నేర్చుకుంటాము – మనుష్యులతో ఎలా ప్రవర్తించాలి, పనివాళ్ళను ఎలా నియంత్రించుకోవాలి, వంటిల్లు ఎలా సరిదిద్దుకోవాలి, ఆఫీసుగది ఎలా అమర్చుకోవాలి, సమయాన్ని ఎలా సద్వినియోగం చేయాలి? కాని కృష్ణపరమాత్మ ఇవన్నీ తరువాత నేర్చుకోవచ్చు, ముందు మిమ్ముల్ని మీరు ఎలా నియంత్రించుకోవాలో నేర్చుకోండి అంటున్నాడు. మిమ్ముల్ని మీరు అదుపులో పెట్టుకోలేకపోతే, తోటివారిని ఎలా అదుపులో పెడతారు? అది హాస్యాస్పదంగా ఉంటుంది. అందువల్ల ముందు మిమ్ముల్ని మీరు అదుపులో పెట్టుకోండి అంటున్నాడు. అది చెప్పటమే కాదు, ఎలా చేయాలో కూడా అడుగడుక్కీ చెప్పుకొస్తున్నాడు.

ఇక్కడ కామక్రోధాలను ఎలా జయించాలో బోధిస్తాడు. కామక్రోధాల గురించి చెబుతానంటూ, కృష్ణపరమాత్మ కామాన్ని ఎలా జయించాలో మాత్రమే బోధిస్తాడు. క్రోధాన్ని ఎలా జయించాలో ప్రత్యక్షంగా చర్చించడు. అంటే క్రోధం గురించి మర్చిపోయాడా? కృష్ణపరమాత్మ జగద్గురువు, మర్చిపోయే ప్రసక్తే లేదు. క్రోధాన్ని గురించి ప్రత్యక్షంగా ఎందుకు చర్చించడు అంటే క్రోధం కామానికి ఇంకో రూపు మాత్రమే. నిజానికి కామానికి ఇంకొక వైపు క్రోధం ఉంటుంది. అందువల్ల కామాన్ని జయించటం నేర్చుకుంటే, క్రోధాన్ని కూడా జయించినట్టే అవుతుంది. కామాన్ని జయించటానికి కృష్ణపరమాత్మ మూడు పద్ధతులను ఇస్తున్నాడు. అవి – ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం, వివేకం.

ఎ) **ఇంద్రియనిగ్రహం** – ఇంద్రియనిగ్రహం అంటే ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవటం. కొన్ని పరిస్థితులు మనస్సులో కొన్ని కోరికలను పుట్టించవచ్చు, అదికూడా అధార్మిక కోరికలను పుట్టించవచ్చు. ధార్మిక కోరికలు ఉండవచ్చు, కాని అధార్మిక కోరికలను పుట్టించే ప్రదేశాలకు వెళ్ళకూడదు, పరిస్థితులను కొనితెచ్చుకోకూడదు. వీలున్నంతగా వాటిని తప్పించుకోవాలి. అధార్మిక కోరికలను పుట్టించే పుస్తకం చదవకండి, టీవీ సీరియల్ చూడకండి, సినిమాకు వెళ్ళకండి. వాటితో ఎటువంటి ప్రమేయమూ పెట్టుకోకండి. ఆవిధంగా మనస్సును కలత చెందించే పరిస్థితులకు, విషయాలకు దూరంగా ఉండగలగటమే ఇంద్రియనిగ్రహం అంటే. ఇది మనోనిగ్రహంకన్నా తేలిక. ఎందుకంటే ఇంద్రియాలు చూడకూడని వాటినుంచి దూరం తొలిగితే చాలు, అది మీ చేతిలో పని.

బి) **మనోనిగ్రహం** – మనస్సుకు కొన్ని వాసనలను పెంపొందించే సామర్థ్యం ఉంది. మీరు ఎక్కువగా ఏది చేస్తే మనస్సు కొన్ని రోజులయ్యేసరికి, దానికి బానిస అయిపోతుంది. మీకు వార్తాపత్రిక చదివే అలవాటుంటే, ఒక్కరోజు చదవకపోయినా, మనస్సు ఉండలేదు. అలాగే టీవీలో వార్తలు వినే అలవాటుంటే, విని తీరాలంటుంది. కాఫీ తాగే అలవాటుంటే,

కాఫీ లేకపోతే జీవితం లేదంటుంది. ఆ విధంగా మనస్సుకి వాసనలను ఏర్పరచే అలవాటు ఉంది. అందువల్ల మనస్సు అశుభవాసనలను పెంపొందించకుండా, శుభవాసనలను మాత్రమే పెంపొందించేటట్టుగా చూసుకోవాలి.

**శుభాశుభాభ్యాం మార్గాభ్యాం వహంతీ వాసనాసరిత్ ।**
**పౌరుషేణ ప్రయత్నేన యోజనీయా శుభే పథి ॥** – ముక్తికోపనిషత్ 2.5

వస్తువుల గురించిన వాసనలు శుభ, అశుభమార్గాలలో పయనిస్తాయి. వాటిని పురుష ప్రయత్నం ద్వారా శుభమార్గంలోకి మళ్ళించాలి.

మీరే అలవాట్లను పెంపొందించుకుంటే, అవి వాసనలుగా నిక్షిప్తమవుతాయి కాబట్టి, ముందు మీరు అశుభవాసనలు ఏర్పడకుండా జాగ్రత్త పడండి. ఒకవేళ అశుభవాసనలు ఏర్పడుతుంటే, వాటిని మొగ్గలోనే త్రుంచివేయండి. ఆలోచనలు పెరిగి పెద్దవి అవాలంటే, వాటికి మీ సహాయసహకారాలు కావాలి. ఒక సైకిలు కదలాలంటే, దాన్ని మీరు తొక్కాలి. తొక్కటం మానేస్తే, అది కాసేపు తిరిగి, కొంతసేపయ్యాక ఆగిపోతుంది.

అలాగే అశుభవాసనలు ఏర్పడితే, వాటిని పెంచి పోషించటం ఆపేయండి. వాటి స్థానంలో శుభవాసనలు పెంపొందించుకోండి. గీతను అధ్యయనం చేయకుండా ఉండలేకపోతే, అది శుభవాసన. ఇదే కాదు, మరికొన్ని మంచిపనులు చేయకుండా ఉండలేకపోవచ్చు మీరు. అవి కూడా వ్యసనమే అయినా, అవి మంచి వ్యసనాలు. ముందు ఈ మంచి వ్యసనాలను పెంచి పోషించండి; తరువాత అశుభవాసనలను పారద్రోలటం గురించి ఆలోచించవచ్చు.

సి) **వివేకం** – ఈ మూడింటిలోనూ చాలా ముఖ్యమైనది వివేకం. వివేకం అంటే నిత్యానిత్య వస్తువివేకం. ఏది నిత్యవస్తువో, ఏది అనిత్యవస్తువో తెలుసుకోవాలి. ప్రపంచంలోని వస్తువులు అనిత్యం అని తెలిస్తే, మీరు వాటిమీద బంధం పెంచుకోరు. దానికే భద్రత లేని వస్తువుమీద మీరు ఆధారపడితే, అది మిమ్మల్ని ఇంకా అభద్రతాభావనకు లోనుచేస్తుంది. మీరు దేనికీ ఆనుకోకుండా నిలబడితే, మీరు కింద పడవచ్చు; అలాగని దానికే నిలకడలేని వస్తువును ఆనుకుని నిలబడితే, రెట్టింపుగా పడతారు.

నిత్యానిత్యవస్తువివేకం చేస్తే, మీరు అశాశ్వతమైన విషయాలమీద కామం (కోరిక) పెంచుకోరు. లేదు, దేనిమీదైనా ఆధారపడి తీరాలంటే, భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకోండి. అప్పుడు అవస్థ ఉండదు.

**ఇంద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే ।**
**ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥** – 3.40

ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఈ కోరికకు నివాసస్థానాలు. ఈ కామం వీటి ద్వారా జ్ఞానాన్ని కప్పివేసి, మనుష్యులను మోహితులను చేస్తున్నది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ మూడు – ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి – కామానికి స్థావరాలు.

**తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ।**
**పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥** – 3.41

ఈ కామం జ్ఞానవిజ్ఞానాలను నాశనం చేస్తుంది. అందువల్ల దమము, శమము, వివేకము పాటించి కామాన్ని నాశనం చేయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అందువల్ల కామాన్ని జయించాలంటే ఈ మూడింటినీ జయించాలి. కామాన్ని జయిస్తే క్రోధం దానంతటదే లొంగి పోతుంది.

కామక్రోధాలను జయిస్తే, కర్మయోగాన్ని పాటించవచ్చు; కర్మయోగము పాటిస్తే సకామ కర్మలు తగ్గి, నిష్కామకర్మలు ఎక్కువవుతాయి; నిష్కామకర్మలు పాటిస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి కలిగితే, జ్ఞానయోగము పాటించవచ్చు. జ్ఞానయోగము పాటిస్తే మోక్షం పొందవచ్చు. మోక్షం పొందిన వ్యక్తిని శిష్టాచార్యుడు అంటారు. అతను ఆదర్శప్రాయంగా జీవిస్తాడు. ఆ విధంగా మూడవ అధ్యాయంలో ముచ్చటగా మూడు అంశాలు చూశాము.

1. కర్మయోగం – జ్ఞానయోగ్యతా ప్రాప్తికి,
2. శ్రేష్ఠాచార్యుడు – ఆదర్శప్రాయంగా నిలిచి, సాంప్రదాయాన్ని ముందు తరానికి అందజేయటానికి,
3. కామక్రోధ జయం – ఆధ్యాత్మిక జీవనాన్ని ఎటువంటి అడ్డంకులూ లేకుండా పాటించటానికి.

ఇదీ ఈ అధ్యాయం సారాంశం.

# జ్ఞాన, కర్మసన్న్యాసయోగము

## అధ్యాయము 4

నాలుగవ అధ్యాయాన్ని ప్రధానంగా మూడు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. అవతార రహస్యం : శ్లోకాలు 1–12
2. జ్ఞాన, కర్మసన్న్యాసయోగం : శ్లోకాలు 13–24
3. జ్ఞానసాధనలు, ఫలం : శ్లోకాలు 25–45

1. **అవతార రహస్యం: శ్లోకాలు 1–12**

ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే, మనకు శాస్త్రం గురించి కొంత అవగాహన ఉండాలి.

మన ప్రాథమిక గ్రంథాలను వేదాలు అంటారు. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం. తక్కిన గ్రంథాలన్నీ రెండవస్థాయికి చెందుతాయి. అవి ప్రాథమిక గ్రంథాలయిన వేదాలనుంచి వచ్చాయి. వేదాలు పురుషబుద్ధినుంచి వచ్చినవి కావు. వాటిని అపౌరుషేయం అంటారు; సాక్షాత్తూ భగవాన్నుంచే వచ్చాయి.

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై।**
**తం హ దేవమాత్మబుద్ధిప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే॥**

– శ్వేతాశ్వతర ఉపనిషత్ 6.18

ఈ మంత్రం భగవంతుడు ముందు బ్రహ్మదేవుణ్ణి సృష్టించాడనీ, బ్రహ్మదేవుణ్ణి సృష్టించాక, వైదిక జ్ఞానాన్ని బ్రహ్మకు బోధించాడని చెబుతున్నది. అందువల్ల బ్రహ్మదేవుడు భగవంతునికి మొట్టమొదటి శిష్యుడు. చతుర్ముఖ బ్రహ్మయొక్క నాలుగు ముఖాలు, నాలుగు వేదాలకు సంకేతం. దాని తర్వాత బ్రహ్మదేవుడు ఈ వైదిక జ్ఞానాన్ని తన శిష్యులకు అందించాడు. ఆ విధంగా ఈ జ్ఞానం గురుశిష్యపరంపరగా వస్తున్నది. ఈ విద్యను విని నేర్చుకుంటారు కాబట్టి వేదాలను 'శ్రుతి' అని కూడా అంటారు. అలా గురుశిష్యపరంపరంగా వింటూ వస్తున్నారు తప్పితే, అవి పురుషబుద్ధినుంచి వచ్చినవి కావు. అందువల్ల వేదాలను అపౌరుషేయ ప్రమాణం అంటారు.

వేదాలు అపౌరుషేయం అయితే, వేదమంత్రాలను ఋషులకు ఎలా ఆపాదిస్తారు? విశ్వామిత్రుడు గాయత్రీ మంత్రాన్ని అందించాడు అంటారు. అలా చూస్తే ఋషులే వేదమంత్రాలను ఇచ్చినట్టు కాదా? ఋషులు వేదమంత్రాలను మనకు అందించిన మాట నిజమే కాని, అవి వారి స్వంతం కాదు. ఋషులు మంత్రకర్తలు కాదు, ఋషులు మంత్ర

ద్రష్టలు. అంటే భగవంతుడు ఇచ్చిన మంత్రాలు ముందే ఉన్నాయి; వాటిని ఋషులు వారి సత్త్వగుణంచేత అందుకున్నారు. టీవీ ట్రాన్స్మిటింగ్ స్టేషన్ నుంచి అందుకున్న వాటిని ప్రసారం చేస్తుంది కాని, టీవీ కొత్తగా ప్రసారం చేయదు. ముందే అందుబాటులో ఉన్నదాన్ని ప్రసారం చేస్తుంది. అవి ఎలక్ట్రోమాగ్నటిక్ వేవ్స్ రూపంలో ఉంటాయి.

అదే విధంగా, ఋషులు కూడా టీవీలా అందుకున్నారు. వేదమంత్రాలు ఆకాశంలో ఉన్నాయి, వాటిని వారి సత్త్వగుణంవల్ల అందుకున్నారు. అంటే ఉన్నదాన్ని కనుగొన్నారు, దానికి ఉన్న ఆవరణను తొలగించి, అందుబాటులో ఉన్నవాటిని మానవాళికి అందించారు. ఈ ఋషులు అందించిన వేదాలలో, భగవంతుడు మానవాళికి వైదిక జీవనవిధానాన్ని నిర్దేశించాడు. మనకొక అద్భుతమైన శరీరాన్ని ఇచ్చాడు. అంతకన్నా అద్భుతమైన ప్రపంచాన్ని ఇచ్చాడు. మన జీవితాన్ని, మన ఋషులు అందుకున్న విధానంలో జీవిస్తే, మనం అన్ని పురుషార్థాలనూ పొందగలము. ముందుగా ధర్మార్థకామాలను పొంది, తరువాత మోక్షాన్ని కూడా పొందగలము.

అందువల్ల ఈ వేదాలు భగవంతుడు మనకిచ్చిన ఒక మాన్యువల్. లౌకిక జీవనంలో ఒక చిన్నవస్తువు కొన్నా, దానితోపాటు ఒక మాన్యువల్ ఇస్తారు. ఆ వస్తువు ఏదైనా అవనీ– చిన్న గడియారం, టేప్‌రికార్డర్, కంటి మందు – దాని వెంటే చిన్నకాగితం అయినా ఇస్తారు. దాన్ని సరిగ్గా వాడితేనే, వినియోగదారుడు దానివల్ల పూర్తి లాభం పొందగలడని, అది తయారుచేసిన వ్యక్తికి తెలుసు.

అదే విధంగా ఈ అద్భుత ప్రపంచాన్ని సృష్టించి ఇచ్చాడు భగవంతుడు. దానితో వ్యవహారం నడపటానికి మనకు అద్భుతమైన మనశ్శరీరాలను ఇచ్చాడు. వీటిని కార్యకరణ సంఘాతం అంటారు. వీటిని సరిగా వినియోగిస్తేనే, పూర్తి లాభం పొందగలము. వీటిని ఎలా వాడాలో తెలియకపోవటంవల్ల వీటిని తప్పుగా వాడతాము. అందువల్ల వీటిని ఎలా వాడాలో తెలుసుకోవటానికి భగవంతుడు ఒక మాన్యువల్ కూడా ఇచ్చాడు. దీన్ని వైదికధర్మం లేదా సనాతనధర్మం అంటారు. ఈ సనాతనధర్మాన్ని ఇచ్చాక, భగవంతుడే దీన్ని నిలబెట్టటానికి కొంతమందికి కొన్ని ధర్మాలను నిర్దేశించాడు.

వైదిక ధర్మాలను నిలబెట్టటానికి రెండు తెగల మనుష్యులను ఎన్నుకున్నాడు భగవానుడు. వారు బ్రాహ్మణులు, క్షత్రియులు. బ్రాహ్మణులు వైదిక ధర్మాన్ని అధ్యయనం చేయటం ద్వారా, ఆ పద్ధతిలో జీవించటం ద్వారా, దాన్ని నలుగురికీ బోధించటం ద్వారా నిలబెట్టాలి.

**శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ ।**
**జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మస్వభావజమ్ ॥** – 18.42

శమము, దమము, తపస్సు, శౌచము, క్షాంతి, ఆర్జవము, జ్ఞానము, విజ్ఞానము, శాస్త్రంమీద శ్రద్ధ ఇవన్నీ బ్రాహ్మణుల స్వాభావిక కర్మలు.

రెండవ తెగవారు క్షత్రియులు. వారి ధర్మం, ఈ ధర్మాన్ని ఉల్లంఘించినవారిని శిక్షించటం.

**క్షతాత్ త్రాయతే ఇతి క్షత్రియః**

క్షత్రియుడు అన్న పేరులోనే ఉంది అధర్మాన్ని నాశనం చేసేవాడని అర్థం. క్షత అంటే నాశనం చేయటం. అలాగే బ్రాహ్మణుడు అంటేనే బ్రహ్మను నేర్చుకునేవాడని అర్థం.

**బ్రహ్మం జానాతి బ్రహ్మ వేదం జానాతి ఇతి బ్రాహ్మణః**

అతను అధ్యయనం చేయాలి, అధ్యాపనం చేయాలి. ఆ విధంగా భగవంతుడు వేదాలను ఇచ్చాడు, వాటిని బోధించి, రక్షించేవారిని కూడా ఇచ్చాడు.

కాని, భగవంతుడు ఇంత జాగ్రత్తపడ్డా కూడా, మనం వైదిక ధర్మాన్ని పోగొట్టుకునే సామర్థ్యం ఉన్నవారము. శంకరాచార్యులవారు ఈ విషయాన్నే భగవద్గీత భాష్యంయొక్క ఉపోద్ఘాతంలో ప్రస్తావిస్తారు. మనుష్యులు అంతకంతకూ బాహ్యాముఖంగా పరుగులు తీస్తూ, అంతకంతకూ లౌకిక విజయాలలో కూరుకుపోతున్నారు అంటున్నారు. ఇప్పుడు ఇంకా ఎక్కువైంది. టెలివిజన్ ఎంతగా ప్రభావితం చేస్తోందో చూడండి! 24 గంటలూ సినిమాలు వస్తాయి, క్రీడలు వస్తాయి, నూరుపైన ఛానెల్స్ ఉన్నాయి. అందువల్ల బాహ్యాముఖంగా ఉన్నాము.

**పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః**
**తస్మాత్ పరాఙ్ పశ్యతి నాంతరాత్మన్॥** – కఠ 2.1.2

ఇంద్రియాలను భగవంతుడు బహిర్ముఖం చేయటంవల్ల అందరూ బాహ్యాప్రపంచాన్ని చూస్తున్నారు. ఎవరూ ఆత్మవైపు తిరగటం లేదు.

ఇవి చాలవన్నట్టు, బాహ్యంగా ఉన్న విషయవస్తువులు ఎన్ని ఉన్నాయంటే, మనుష్యులు వాటిలో పడి కొట్టుకుపోతున్నారు. దాని ఫలితంగా అధర్మం పెచ్చు పెరిగిపోతున్నది. ధర్మం తగ్గిపోతున్నది. క్షత్రియులు అధర్మాన్ని శిక్షించటమూ లేదు, ధర్మాన్ని రక్షించటమూ లేదు. నిజానికి వారే అధార్మిక కార్యక్రమాల్లో కూరుకుపోతున్నారు. బ్రాహ్మణుల పరిస్థితీ అలాగే ఉంది. వారు వేదాలను నేర్చుకోవాలి కాని వారికి నాలుగు వేదాల పేర్లే తెలియని పరిస్థితి. బ్రాహ్మణులు వేదాలను నేర్చుకుని, నలుగురుకీ నేర్పటం లేదు; క్షత్రియులు వేదాలను నేర్చుకుని, నలుగురిని రక్షించటం లేదు. అలా మనుష్యులు ధర్మాన్ని నిలబెట్టకపోతే భగవంతుడే దిగిరావాలి. 'నేనే ధర్మరక్షణకు వస్తాను,' అని చెబుతాడు కృష్ణపరమాత్మ.

అందువల్ల విష్ణుమూర్తి అవతారాల గాథలు నేర్చుకుంటాము. ధర్మరక్షణకోసం అవతారం ఎత్తాడు. ధర్మరక్షణ రెండు విధాలుగా చేశాడు – రామావతారంలో ధర్మబద్ధమైన జీవితం గడిపితే, కృష్ణావతారంలో ధర్మాన్ని బోధించాడు. రాముడు బోధ చేయలేదు కాని ధర్మానికి ప్రతీకగా నిలిచాడు. రామాయణం అంటే రామ+అయనం – రాముడు నడిచిన విధానం. కృష్ణావతారంలో బోధ చేశాడు – భగవద్గీత ద్వారా, తరువాత అనుగీత ద్వారా. ఆ విధంగా జీవనవిధానం ద్వారా లేదా బోధ ద్వారా, కనుమరుగవుతున్న వైదికధర్మాన్ని, భగవంతుడు తిరిగి తీసుకువచ్చినట్లైనది.

భగవంతుడు వేదాలను బోధించాడు; భగవంతుడే భగవద్గీతను కూడా బోధించాడు. ముందు భగవంతుణ్ణి విష్ణుమూర్తి అంటే, ఇప్పుడు భగవంతుణ్ణి కృష్ణపరమాత్మ అంటున్నాము.

**నామభేదః న తు స్వరూపభేదః**

అదే విధంగా ఋషులు అందుకున్న విద్యను వేదాలు అంటే, కృష్ణపరమాత్మ చేసిన బోధను భగవద్గీత అంటున్నాము. వేదాల్లో కర్మకాండ, జ్ఞానకాండ ఉంటే, భగవద్గీతలో కర్మయోగం, జ్ఞానయోగం ఉన్నాయి. అందువల్లనే ఈ అధ్యాయం మొదట్లో కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి హెచ్చరిస్తున్నాడు, 'ఓ అర్జునా, ఈ భగవద్గీతను తక్కువగా చూడకు. వేదాలను ఎంతగా గౌరవిస్తావో, భగవద్గీతను కూడా అంతగా గౌరవించాలి.'

ఈ విషయాన్ని మనం కూడా ముఖ్యగమనికగా తీసుకోవాలి. ఎందుకంటే భగవద్గీతలో బోధ కొన్నిచోట్ల స్పష్టంగా ఉండదు, మరికొన్నిచోట్ల భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చినట్టుగా కూడా కనిపిస్తుంది.

నిజానికి, ఒకచోట – **స్వధర్మే నిధనం శ్రేయః** (3.35) అన్నాడు. ప్రాణం పోయినా సరే స్వధర్మాన్ని పాటించాలి అన్నాడు. అదే కృష్ణపరమాత్మ పద్దెనిమిదవ అధ్యాయం చివర్లో– **సర్వధర్మాన్ పరిత్యజ్య** అన్నాడు. అన్ని ధర్మాలూ పరిత్యజించు అన్నాడు. ఇప్పుడు సందేహం వస్తుంది. స్వధర్మాన్ని పాటించాలా, ధర్మపరిత్యాగం చేయాలా? ఇది ఒక ఉదాహరణ మాత్రమే! ఇలా ఎన్నో సందర్భాలు, భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చుతున్నట్టుగా ఉంటాయి. అందువల్ల గీతాసారం ఏమిటో తేల్చి చెప్పలేకపోతున్నారు.

కొంతమంది గీతాసారం లేదా తాత్పర్యం కర్మ అంటే మరికొందరు భక్తి అంటారు. కొందరు జ్ఞానం అంటే మరికొందరు శరణాగతి అంటారు. మరికొందరు ధ్యానం అంటారు. ఎవరికి వారు, వారి వాదనను సమర్థించుకోవటానికి తదనుగుణమైన శ్లోకాలను ఉటంకిస్తారు కూడా! ఇవన్నీ మనం కూడా చదివితే, మనలో అయోమయం ఇంకా ఎక్కువగా పెరిగిపోతుంది.

ఇలా గీతయొక్క తాత్పర్యం తెలుసుకోలేకపోతే దానికి ఒక్కటే మార్గం ఉంది. వేదాలకు వెళ్ళి వేదాల తాత్పర్యాన్ని విశ్లేషిస్తే, వేదాల తాత్పర్యంగా ఏదైతే వస్తుందో అదే గీతాతాత్పర్యం కూడా. అందువల్లనే భగవద్గీతలో ఇలా భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చేటట్టుగా ఉన్న ప్రతిచోట, శంకరాచార్యులవారు వేదవాక్యానికో, ఉపనిషత్ వాక్యాలకో వెళ్ళి, 'ఇదుగో ఇదీ దీని అర్థం,' అని వివరిస్తారు.

**భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః ।**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ ॥** – 18.55

నిదిధ్యాసనం చేయటం ద్వారా ఈశ్వర జ్ఞాననిష్ఠ పొందిన వ్యక్తి, ఆ నిర్గుణ ఈశ్వర జ్ఞానఫలంగా నాలో ప్రవేశిస్తాడు.

ఈ శ్లోకంలో ఉన్న పదం భక్త్యా. కాని శంకరాచార్యులవారు, ధైర్యంగా భక్త్యా అంటే జ్ఞానేన అంటారు.

**జ్ఞాననిష్ఠాలక్షణయా భక్త్యా**

శంకరాచార్యులవారు ఈ అర్థం ఎలా చెప్పగలిగారు? ఎందుకంటే, ఆయన భాష్యం రాస్తున్నంతసేపూ వేదాలను దృష్టిలో పెట్టుకుని రాస్తారు. అందువల్లనే వేదాలు, భగవద్గీత ఒక్కటే అని గుర్తుంచుకోవాలి. వేదాలను ఇచ్చినది ఒకరే! అది సాక్షాత్తూ భగవంతుడు. ముందు విష్ణుమూర్తి అయితే, ఇప్పుడు విష్ణుమూర్తి అవతారం అయిన కృష్ణపరమాత్మ.

విష్ణుమూర్తి అవతారం అంటే భగవంతుని అవతారానికీ, మనుష్యజన్మకూ మధ్య ఉన్న భేదం ఏమిటనే సందేహం కలుగవచ్చు మనకు. భగవంతుడు అవతారం ఎత్తినప్పుడు, ఒక శరీరాన్ని తీసుకుంటాడు. దాన్ని శరీరగ్రహణం అంటారు. అలాగే జీవుడు జన్మనెత్తినప్పుడు కూడా, ఒక శరీరాన్ని తీసుకుంటాడు. దాన్నీ శరీరగ్రహణం అనే అంటారు. రెండూ శరీరగ్రహణమే అయితే భగవంతుని అవతారానికీ, మనుష్యజన్మకూ మధ్య భేదమేమిటి? ఇక్కడ నాలుగు భేదాలను చూస్తాము.

ఎ) **కారణభేదం** – అవతారానికీ, జన్మకూ మధ్య కారణభేదం ఉంది. జీవుడు జన్మ పొందేది తను చేసుకున్న పుణ్యపాపకర్మలవల్ల.

**కర్మవశంగతః పుణ్యాపాపవశంగతః అజ్ఞానవశంగతః**

తను చేసిన కర్మలవల్ల, పుణ్యాపాపకర్మలవల్ల, అజ్ఞానంవల్ల పుడతాడు. గీతలో పదేపదే అవశః పదం వస్తుంది.

**రాత్ర్యాగమే అవశః పార్థ** – 8.19
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః** – 3.5

**పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశో౽పి సః** – 6.44
**భూతగ్రామమిమం కృత్స్నమ్ అవశం ప్రకృతేర్వశాత్** – 9.8
**కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశో౽పి తత్** – 18.60

అంటే – మనం నిస్సహాయంగా పుట్టాము. వచ్చే జన్మమీద కూడా మనకు అధికారం లేదు. మనం మన కర్మ క్షయంకోసం పునర్జన్మ ఎత్తుతూనే ఉండాలి. అందువల్ల జీవ–జన్మకు కారణం బానిసత్వం.

అదే భగవంతుని అవతారం విషయం తీసుకుంటే, భగవంతుడు అజ్ఞానానికీ బానిస కాదు; కర్మకూ బానిస కాదు, సృష్టికీ బానిస కాదు. భగవంతుడు యజమాని, మానవాళిమీద జాలికొద్దీ, ఒక అవతారాన్ని ఎన్నుకుంటాడు. మనకు అలా మనకు కావల్సిన శరీరాన్ని ఎన్నుకునే అవకాశం లేదు. మన శరీరం మన పుణ్యపాపాలవల్ల ఏర్పడుతుంది. మనం ఎక్కువ పుణ్యం చేసుకుంటే దేవశరీరం వస్తుంది, పుణ్యపాపాలు సమంగా ఉంటే మనుష్య జన్మ వస్తుంది. ఎలా చూసినా కర్మ మన శరీరానికి కారణం.

కాని భగవంతుని విషయంలో కర్మ నిర్ణయించదు. భగవంతుడు అకర్తా. అందువల్ల భగవంతుడు ఏ కార్యంకోసం అవతారం ఎత్తుతాడో, ఆ కార్యానికి తగ్గ శరీరాన్ని దాలుస్తాడు. రావణాసురుణ్ణి చంపాలంటే, రావణవధకు సరిపోయే శరీరాన్ని దాల్చాలి. రావణాసురుణ్ణి **మనుష్య శరీరంతోనే** సంహరించగలడు కాబట్టి, రామునిగా మానవాకృతిని దాల్చి వచ్చాడు. అదే హిరణ్యకశిపుణ్ణి సంహరించటానికి, అతని హిరణ్యాక్షవరాలకు భిన్నంగా ఉన్న ఆకారాన్ని దాల్చాలి. మనిషి చంపకూడదు, జంతువు చంపకూడదు అన్నాడు. అందువల్ల నరసింహావతారాన్ని దాల్చాడు.

అందువల్ల, రాక్షసుడు పొందిన వరాలకు భిన్నంగా ఉన్న ఆకారాన్ని, ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి తగ్గ ఆకారాన్ని తీసుకుని, నెరవేర్చాల్సిన కర్తవ్యాన్ని నెరవేర్చి, ఆ ఆకారానికి స్వస్తి చెబుతాడు.

ఆ విధంగా మనుష్యజన్మ బానిసత్వంనుంచి వస్తే ఈశ్వరజన్మ ఈశత్వంనుంచి వచ్చింది.

**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా** – 4.6

ప్రకృతిని నా అధీనంలో పెట్టుకుని, మాయాతత్త్వం సహాయంతో మాయిక శరీరాన్ని పొందుతాను.

**ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః** – 9.8

ప్రకృతి సహాయం తీసుకుని, మొత్తం జీవరాశులన్నిటినీ సృష్టిస్తున్నాను.

కృష్ణపరమాత్మ, ప్రకృతి స్థావమ్ అవష్టభ్య పదాలను పదేపదే వాడతాడు. అన్నీ నా అధీనంలో ఉంచుకుంటాను. అందువల్ల భగవంతుడు కిందికి దిగివస్తే, జీవుడు కిందికి పడతాడు. భగవంతునిది అవతారం అయితే మనిషిది పతనం.

బి) **స్వరూపభేదం** – పుట్టినప్పటినుంచీ అవతారానికీ, జన్మకూ మధ్య స్వరూపంలో భేదం ఉంది. జీవుడు పుట్టినప్పటినుంచీ మరణించేదాకా బద్ధస్వరూపుడు. కర్మకు బందీ, అజ్ఞానానికి బందీ, మోహానికి బందీ, పరిస్థితులకు బందీ, కాలానికి బందీ, దేశానికి బందీ. అందువల్ల అతన్ని బద్ధజీవి అంటారు. ఈశ్వరుని విషయానికి వస్తే, ఈశ్వరుడు ముక్త స్వరూపుడు. ఈశ్వరుడు వీటిలో దేనికీ బందీ కాడు. ఈశ్వరుడు సర్వజ్ఞుడు, ముక్తస్వరూపుడు. తను భూమిమీదకు దిగివచ్చిన అవసరం తీరగానే, తన లోకానికి తిరిగి వెళ్ళిపోతాడు. భగవంతుని విషయలో మరణించాడు అనకూడదు, నిర్యాణం చెందాడు అంటాము. అందువల్ల వారి స్వరూపాల్లో భేదం ఉంది. జీవి బద్ధస్వరూపుడయితే, భగవంతుడు ముక్త స్వరూపుడు.

సి) **శరీరభేదం** – శరీరం ఏర్పడిన పద్ధతిలో కూడా భేదం ఉంది. జీవి శరీరం పంచభూతాల నుంచి ఏర్పడుతుంది. జీవి శరీరం తల్లిగర్భంలో రూపుదిద్దుకోవాలి. తల్లి తీసుకున్న ఆహారం నుంచి పెరగాలి, పంచభూతాలనుంచి శరీరం వస్తుంది. మనుష్యశరీరాన్ని **భౌతిక శరీరం** అంటారు.

అదే భగవంతుని శరీరం విషయానికి వస్తే, భగవంతుని శరీరం పంచభూతాలనుంచి రాదు. దాన్ని మాయామానుష వేషం అంటారు. మాయ సహాయంతో శరీరాన్ని దాలుస్తాడు. నరసింహావతారాన్ని చూస్తే, గర్భావాసం చేయలేదు. సరాసరి వచ్చేశాడు. స్తంభంలోంచి వచ్చాడు. వచ్చే పద్ధతి మారుతుంది, శరీరమూ మారుతుంది. మనుష్య శరీరం భౌతిక శరీరం అయితే, ఈశ్వర శరీరం అభౌతిక శరీరం లేదా మాయిక శరీరం.

డి) **కార్యభేదం** – వీరు చేసే కర్మల్లో కూడా భేదం ఉంటుంది. జీవుడు తన పుణ్యపాపాలను క్షయం చేసుకోవటానికి పుడతాడు. పుణ్యపాపాలను సుఖదుఃఖాల అనుభవాల ద్వారా క్షయం చేసుకుంటాడు. తలనెప్పితో ఇవాళ బాధపడుతున్నామంటే, ఇవాళ కొంత పాపం క్షయమవుతున్నదన్నమాట! రుచికరమైన ఆహారం తినగలిగామంటే, కొంత పుణ్యం క్షయమవుతున్నదన్నమాట. ఆ విధంగా ప్రతిక్షణమూ కూడా మన పుణ్యపాపాలు సుఖదుఃఖ మిశ్రమ అనుభవాలను ఇస్తూనే ఉంటాయి. ఆ విధంగా ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ ఈ శరీరం ఉంటుంది. ప్రారబ్ధకర్మ ముగియగానే, ఈ శరీరం పడిపోతుంది. సంచితకర్మల్లోంచి, మళ్ళీ కొన్ని కర్మలు ప్రారబ్ధకర్మలుగా మారి వచ్చే జన్మను దానికి తగ్గట్టుగా ఇస్తుంది. ఆ విధంగా జీవుడు పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడి తిరుగుతూనే ఉంటాడు.

అదే భగవంతుని విషయానికి వస్తే, భగవంతుడు కర్మఫలాన్ని క్షయం చేసుకోనవసరం లేదు. ఎందుకంటే భగవంతుడు అకర్తా. మరి భగవంతుడు ఏ కర్మ చేస్తాడు?

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥** – 4.8

ధార్మిక పురుషులను రక్షించటంకోసం, దుష్టులను నాశనం చేయటంకోసం, ధర్మాన్ని నిలబెట్టటంకోసం, నేను ప్రతియుగంలోను అవతారం ఎత్తుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

భగవంతుడు ధార్మిక పురుషులను రక్షించటానికి, అధార్మిక పురుషులను శిక్షించటానికి, ధర్మరక్షణకు అవతారమెత్తుతాడు. ఆ విధంగా జీవజన్మపుణ్యపాపక్షయానికి అయితే, భగవంతుని అవతారం ధర్మరక్షణకు అవుతుంది.

అలా భగవంతుని అవతారానికీ, మనుష్యజన్మకూ మధ్య ప్రధానంగా నాలుగు భేదాలు ఉన్నాయి. అవి – **కారణభేదం, స్వరూపభేదం, శరీరభేదం, కార్యభేదం.**

**ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।**
**వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్ ॥** – 4.1

ఇదే బోధను నేను ఇంతకు ముందు సూర్యభగవానునికి చేశాను. వివస్వానుడు తన పుత్రుడైన మనువుకు చెప్పాడు. మనువు, ఇక్ష్వాకునకు బోధించాడు.

**జన్మ కర్మ చ మే దివ్యమ్ ఏవం యో వేత్తి తత్త్వతః ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥** – 4.9

ఈశ్వరజన్మను దివ్యజన్మ అనీ, ఆయన కర్మలను దివ్యకర్మలనీ అంటారు. జీవునిది లౌకికజన్మ అనీ, అతను చేసే కర్మలను లౌకికకర్మలనీ అంటారు. ఇవి అవతారానికి – జీవునికిగల భేదం.

**2. జ్ఞాన, కర్మసన్న్యాసయోగం – శ్లోకాలు 13–24 –** కృష్ణపరమాత్మ ఇప్పుడు నాలుగవ అధ్యాయంలోని ప్రధాన అంశాన్ని అంటే ఆత్మజ్ఞానాన్ని బోధిస్తున్నాడు. కర్మయోగం మోక్షాన్నివ్వలేదని చూశాము. కర్మయోగం జ్ఞానయోగ్యతను మాత్రమే ఇవ్వగలదు. అంతకుముందు అయోగ్యుడుగా ఉన్న వ్యక్తి కర్మయోగం పాటించాక యోగ్యడవుతాడు; సాంకేతికపరంగా చెప్పాలంటే సాధన చతుష్టయ సంపత్తి పొంది అధికారి అవుతాడు. యోగ్యతను పొందాక, జ్ఞానయోగానికి రావాలి. ఎందుకంటే జ్ఞానయోగం ఒక్కటే మోక్షాన్నివ్వగలదు. జ్ఞానయోగ్యత అతన్ని పండితుణ్ణి చేస్తుంది. **గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః** లో పండితా అంటే,

**పండా ఆత్మ విషయా బుద్ధిః ఏషం తే పండితాః**

అని శంకరులవారు వివరించారు. పండా అంటే ఆత్మజ్ఞానం; పండితాః అంటే ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి.

**పండా అస్య సంజాతః ఇతి పండితాః**

ప్రతి ఒక్కరూ కర్మయోగం పాటించి జ్ఞానయోగానికి వచ్చితీరాలి.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**
**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

రెండూ చేసితీరాలన్నాడు కదా అని ముందు జ్ఞానయోగానికి వచ్చి, తరువాత కర్మయోగం పాటిస్తాను అనకూడదు. కర్మయోగం అంటే భోజనం చేసేముందు చేతులు కడుక్కోవటం; జ్ఞానయోగం అంటే భోజనం చేయటం. భోజనం చేశాక, చేతులు కడుక్కుంటాను అనకూడదు. శుద్ధి చేయటం ముందు జరగాలి. భోజనానికి బాహ్యశుద్ధి అవసరమైతే, జ్ఞానానికి ఆంతరశుద్ధి అవసరం. అందువల్ల ముందు కర్మయోగం గురించి మూడవ అధ్యాయంలో బోధించాక, జ్ఞానయోగం గురించి నాలుగు, ఐదు అధ్యాయాల్లో బోధిస్తాడు కృష్ణపరమాత్మ.

ఈ నాలుగవ అధ్యాయంలో కొన్ని అద్భుతమైన శ్లోకాలు, ముఖ్యమైన శ్లోకాలు ఉన్నాయి. అవి శ్లోకాలు 18–24. వీటిల్లో జ్ఞానయోగ సారాంశం, ఉపనిషత్తుల సారాంశం చూస్తాము.

**కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్॥** – 4.18

బుద్ధిశాలి కర్మలో అకర్మను చూస్తాడు; అకర్మలో కర్మను చూస్తాడు అంటే ఆత్మ అకర్త అని అర్థంచేసుకుంటాడు. అనాత్మ ఎప్పటికీ కర్త అని తెలుసుకుంటాడు. అతనే అసలైన యోగి. అతనే పరిపూర్ణుడు. దీన్ని ఇరవైనాలుగవ శ్లోకంలో ముగించాడు.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥** – 4.24

స్రుక్కు, స్రువం బ్రహ్మ; వాటిలో వాడే ద్రవ్యం బ్రహ్మ; అగ్ని బ్రహ్మ; యజ్ఞం చేయించే వ్యక్తి బ్రహ్మ; యజ్ఞఫలమైన స్వర్గలోకం బ్రహ్మ అని బ్రహ్మనిష్ఠలో ఉన్న జ్ఞాని అర్థంచేసుకుంటాడు. దీన్ని సర్వత్ర బ్రహ్మదర్శనం అంటారు.

ఇందులో ప్రతి ఒక్క శ్లోకమూ ఒక ఆణిముత్యం. కృష్ణపరమాత్మ జ్ఞానయోగాన్ని రెండవ అధ్యాయంలో టూకీగా బోధించాడు. రెండవ అధ్యాయం మొత్తం భగవద్గీతయొక్క తాత్పర్యం అని చూశాము. రెండవ అధ్యాయంలో జ్ఞానయోగం గురించి శ్లోకాలు 12–25 వరకూ

వివరించాడు. అదే భావాన్ని ఇప్పుడు మళ్ళీ ఇంకా స్పష్టంగా బోధిస్తున్నాడు. ఆ బోధ సారాంశాన్ని చూద్దాము ఇప్పుడు.

జ్ఞానయోగం అంటే ఆత్మజ్ఞానం అని చూశాము. 'నేనెవరు?' ఈ ప్రశ్నకు సమాధానాన్ని ఇచ్చేదే జ్ఞానయోగం. శాస్త్రం నేనెవరో ఎందుకు బోధించాలి? ఎందుకంటే 'నేనెవరు?' ప్రశ్నకు మనకు సమాధానం సరిగ్గా తెలియదు అంటుంది శాస్త్రం. ఒకవేళ మనకు ముందే తెలిస్తే, శాస్త్రం ఈ విషయాన్ని ప్రత్యేకించి బోధించనవసరం లేదు. మనకు శాస్త్రం బోధిస్తున్నదీ అంటే దాని అర్థం మనకు మన గురించి తెలియదనీ, ఒకవేళ మనం తెలుసు అనుకుంటున్నా అది సరియైన జ్ఞానం కాదనీను. మనకు తెలుసు అనుకుంటున్నది తప్పుడు జ్ఞానం లేదా పొరపాటు.

శాస్త్రానికున్న మొదటి బాధ్యత మనకున్న తప్పుడు జ్ఞానాన్ని ముందు పారద్రోలటం. మనం మన గురించి ఏమనుకుంటున్నాము? మనం రెండు విషయాలు అనుకుంటున్నాము. 'నేను శరీరం.' ఇది మన ప్రాథమిక భావన. ఎందుకంటే ఎవరైనా, 'నువ్వెవరు?' అని అడిగితే, మనం ఇచ్చే వర్ణన అంతా శరీరానికి సంబంధించినది. 'నేను ఫలానా వారి అబ్బాయిని,' అంటే నా శరీరం ఫలానా వ్యక్తినుంచి పుట్టింది అంటాము. ఇంకా చెప్పే వివరాలు – 'నేను ఫలానా ఉద్యోగం చేస్తున్నాను, నేను భారతీయుణ్ణి.' ఇవన్నీ క్రోడీకరిస్తే, ఈ వర్ణన అంతా స్థూలశరీరానికి సరిపోతుంది. అలా మనం మమేకం చెందేది ముందుగా శరీరంతో.

రెండవ అభిమానం మనస్సుతో పెంచుకుంటాము. నేను ఎమ్.ఎ. చదివాను, నాకు ఈ విషయంలో అజ్ఞానం ఉంది, నాకు కోపంగా ఉంది, నాకు ఆనందంగా ఉంది. ఇవన్నీ మనస్సుపరంగా చెప్పేవి. అందువల్ల నేనెవరు అంటే నేను మనశ్శరీరాలను అనుకుంటాము. దీన్నే సాంకేతికంగా చెప్పాలంటే కార్యకరణసంఘాతం అంటారు.

వేదాంత గ్రంథాలన్నింటి లక్ష్యం ఒక్కటే. ముందుగా ఈ పొరపాటుని పారద్రోలాలి. నిర్వాణషట్కంయొక్క మొదటి రెండు శ్లోకాలు ఈ పొరపాటును స్పష్టంగా పారద్రోలుతాయి.

**మనో బుద్ధ్యహంకారచిత్తాని నాహం న చ శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణనేత్రే।**
**న చ వ్యోమభూమిర్న తేజో న వాయుః చిదానందరూపః శివోఽహం శివోఽహమ్॥**

నేను మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం కాను, నేను జ్ఞానేంద్రియాలను కాను, నేను పంచభూతాలను కాను, నేను చిదానందరూపం.

జ్ఞానయోగంలో నేర్చుకునే మొట్టమొదటి పాఠం, నేను శరీరాన్ని కాను, నేను మనస్సును కాను. మరయితే ఈ రెండూ ఏమిటి? అవి నాకు తాత్కాలికంగా ఇవ్వబడిన పరికరాలు.

వాటి ద్వారా నేను ప్రపంచంతో వ్యవహారం నడుపుతాను. ఎలాగైతే కళ్ళజోడుతో నేను బాహ్యప్రపంచాన్ని చూస్తానో, అలాగే మనశ్శరీరాలతో నేను బాహ్యప్రపంచంతో వ్యవహారం నడుపుతాను. అందువల్ల మనశ్శరీరాలు కూడా బాహ్యప్రపంచంలో ఒక భాగమే. కళ్ళజోడు కూడా బాహ్యప్రపంచంలోనిదే కాని, అది పెట్టుకుని బాహ్యప్రపంచాన్ని చూడటం మొదలుపెట్టాక, కళ్ళజోడు నా కంటిలో ఒక భాగంగా భావిస్తాను. అందువల్లనే నీ కంటిముందు ఏం ఉంది అంటే, నా ఎదురుగా ఉన్న బల్లను, పుస్తకాన్ని, మనుష్యులను అన్నింటినీ పేర్కొంటాను కాని ఒక్కటి మాత్రం చెప్పను. అదే కళ్ళజోడు. దాన్ని ఎంతగా వాడతాను అంటే, అది నా కంటిలో ఒక భాగంగా అయిపోతుంది నాకు. దాన్ని చూడబడే వస్తువుగా – ఆబ్జెక్టుగా – చూడను, చూసే నేనుగా – సబ్జెక్టుగా – భావిస్తాను.

ఇంత చిన్న వస్తువైన కళ్ళజోడుతోనే పొరపాటు పడేటట్టయితే, కళ్ళజోడుకన్నా నాకు అత్యంత సన్నిహితమైన మనశ్శరీరాల గురించి ఇంక చెప్పేదేమున్నది? అందువల్ల, శాస్త్రం చెబుతున్నది, శరీరం ప్రపంచంలో ఒక భాగం అని. అది ఎలా నిరూపించగలదు? జగత్తు పంచభూతాలతో సృష్టించబడింది. ఆకాశం, వాయువు, జలం, అగ్ని, పృథివి. శరీరం కూడా ఈ పంచభూతాలతో చేయబడింది. శరీరం కొంత ప్రదేశాన్ని ఆక్రమిస్తుంది, ఇది ఆకాశతత్త్వం; శరీరంలో ఉన్న నీరువల్ల శరీరానికి ఈ రూపం వచ్చింది; శరీరంలో అగ్నితత్త్వం ఉంది, అందువల్లనే శరీరంలో ఉష్ణోగ్రత ఎప్పుడూ 98.4° ఫారిన్‌హీట్ ఉంటుంది. ఆ ఉష్ణోగ్రత పోతే, శరీరం శవం అవుతుంది. వాయుతత్త్వం ప్రాణశక్తిగా ఉంది; పృథివీతత్త్వంవల్లనే దీన్ని భౌతిక శరీరం అంటాము. ఈ శరీరానికి పోషణ ఆహారంవల్ల జరుగుతుంది. ఆ ఆహారం కూడా పృథివీతత్త్వమే. ఆ విధంగా శరీరం పాంచభౌతికం అయింది.

శరీరసృష్టి పంచభూతాలనుంచి జరిగింది, పంచభూతాలవల్లనే స్థితి పొందుతున్నది, మళ్ళీ పంచభూతాలతో చేయబడిన జగత్తులోనే లయమవుతుంది. అందువల్ల ఈ శరీరం నాకు ఇవ్వబడిన ఒక మాధ్యమం, అది నేను కాదు! మరయితే నేనెవరు? శరీరానికి భిన్నంగా ఉన్నదేదో నేను.

అయితే నేను మనస్సునా? నేను మనస్సు కూడా కాను. మనస్సు కూడా పంచభూతాలనుంచి సృష్టించబడినదే. కాకపోతే స్థూలశరీరం, స్థూలపంచభూతాలనుంచి సృష్టించబడితే, సూక్ష్మమైన మనస్సు సూక్ష్మమైన పంచభూతాలనుంచి సృష్టించబడింది. అంతేకాదు, మనం తినే ఆహారం ఈ మనస్సును ప్రభావితం చేస్తుంది; రసాయనాలు ప్రభావితం చేస్తాయి; మందులు ప్రభావితం చేస్తాయి. తినే ఆహారంలో ఉప్పు ఎక్కువయితే, సమస్య వస్తుంది. దీన్నిబట్టి పదార్థం మనస్సును ప్రభావితం చేస్తుందని అర్థమవుతుంది. పదార్థం మనస్సును ప్రభావితం చేస్తుంది అంటే

మనస్సు కూడా పదార్థమే. అందువల్ల మనస్సు, శరీరం కూడా నేను వాడే తాత్కాలిక పరికరాలు మాత్రమే అనే నిర్ణయానికి వస్తాము.

మనస్సు, శరీరాలను నేను తాత్కాలికంగా వాడతాను అని ఎలా చెప్పగలను? శాస్త్రం ఆ విషయం మీరే తేలికగా తెలుసుకోవచ్చు అంటుంది. మీ దైనందిన జీవితంలో మీరు అనుభవించే అవస్థాత్రయాన్ని జాగ్రత్తగా పరిశీలించండి చాలు, అంటుంది. అవస్థాత్రయం అంటే జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ.

జాగ్రదావస్థలోనే నేను జాగ్రద్ ప్రపంచంతో ఈ స్థూలశరీరంతో వ్యవహారం నడుపుతాను. ఎప్పుడైతే నేను స్వప్నంలోకి జారుకుంటానో, అప్పుడే ఈ స్థూలశరీరం అందుబాటులో ఉండదు. ఎప్పుడైతే స్థూలశరీరం అనే మాధ్యమం ఉండదో, అప్పుడే జాగ్రద్ ప్రపంచంతో వ్యవహారం నడపలేను. కొంతమంది రెండు జతల కళ్ళద్దాలను వాడతారు. ఒకటి దూరం వస్తువులను చూడటానికి, ఇంకొకటి చదవటానికి (కొంతమందికి ఈ రెండూ వెతుక్కోవటానికి మూడవది కావాలని జోక్). అలా నాకు రెండు కళ్ళజోడ్లలాగా రెండు అవస్థలు ఉన్నాయి. రెండు భిన్నమాధ్యమాల ద్వారా వ్యవహారాలు నడుపుతాను. జాగ్రదావస్థలో స్థూలశరీరం ద్వారా వ్యవహారం నడిపితే, స్వప్నావస్థలో మనస్సు ద్వారా వ్యవహారం నడుపుతాను.

మనస్సులో అనేక ఆలోచనలు, అనేక భావోద్రేకాలు ఉంటాయి. జాగ్రదావస్థ వి.సి.ఆర్. అయితే, స్వప్నావస్థ వి.సి.పి. జాగ్రదావస్థలో నేను చూసినవి, విన్నవి, అనుభవించినవి వి.సి.ఆర్.లో లాగా రికార్డ్ అవుతాయి. స్వప్నావస్థ వి.సి.పి.లా పనిచేస్తుంది. వాసనామయ ప్రపంచాన్ని సృష్టిస్తుంది మనస్సు. స్వప్నావస్థలో స్వప్నప్రపంచాన్ని సృష్టించటమే కాదు, దాన్ని అనుభవించటానికి ఒక స్వప్నశరీరాన్ని సృష్టిస్తుంది. రెండూ మనస్సునుంచి వచ్చినవే. జాగ్రద్ ప్రపంచం, జాగ్రద్ శరీరం రెండూ ఉండవు.

స్వప్నావస్థనుంచి సుషుప్తిలోకి జారుకుంటే, ఈ స్వప్నశరీరమూ, స్వప్నప్రపంచం కూడా ఉండదు. స్వప్నావస్థలో శరీరం పడుకుంటే, సుషుప్తిలో మనస్సు కూడా పడుకుంటుంది. భావోద్రేకాలు లేవు, ఆలోచనలు లేవు, అహంకారం లేదు, జ్ఞాపకాలు లేవు. కదలిక అసలే లేదు. సుషుప్తిలో శరీరమూ, మనస్సు కూడా పడుకుంటాయి కాబట్టి జాగ్రద్ ప్రపంచమూ అనుభవంలోకి రాదు, స్వప్నప్రపంచమూ అనుభవంలోకి రాదు. మరయితే, అప్పుడు నేను ఉన్నానా, లేనా? సుషుప్తిలో నేను మనశ్శరీరాల ద్వారా వ్యవహారం నడపకపోయినా నేను ఉంటాను. ఒకవేళ నేను అలా ఉండకపోయేటట్టయితే, నేను అసలు నిద్రే పోను. నిద్రపోతే మరణిస్తాను అంటే ఎలాగోలా మేలుకునే ఉంటాను. నిద్ర అంటే భయపడకపోగా, ఏ మాత్రం అవకాశం దొరికినా, ఏదైనా బోధ వింటున్నా కూడా నిద్ర పోతాను.

సుషుప్తి అంటే గాఢనిద్ర. గాఢనిద్రలో నేను ఏ పరికరాలనూ వాడను. నేను నా స్వభావంలో లయమవుతాను. నేను భౌతికశరీరం ద్వారా వ్యవహారం నడపను కాబట్టి భౌతికస్వరూపం కాను; మనస్సుతో వ్యవహారం నడపను కాబట్టి మానసిక స్వరూపం కాను; నేను కేవలం చైతన్యాన్ని, నేను ఉనికిని. సుషుప్తిలో నేను ఉన్నాను తరువాత ఇంకేమీ పదం వాడలేను. నేను అంటే శుద్ధసత్, ఉన్నాను అంటే శుద్ధచిత్. సత్, చిత్‌గా తప్ప ఇంకేమీ కాను.

శాస్త్రం అద్భుతమైన తర్కం ఉపయోగించి చెబుతున్నది. దేనికైతే రాకపోకలు ఉన్నాయో, అది నా స్వస్వరూపం కాదు; దేనికైతే రాకపోకలు లేవో, ఏదైతే శాశ్వతమో అది నా స్వస్వరూపం. ఉదాహరణకు నీరు వేడిగా ఉంటే, దానికి రాకపోకలు ఉన్నాయి. నీరు కాసేపే వేడిగా ఉంటుంది. ఆ తరువాత చల్లారిపోతుంది. అంటే వేడితత్త్వం నీరుకి లేదు. వేడి నీటికి వచ్చి చేరింది. దాన్ని ఆగంతుకం అంటారు. అది దాని స్వరూపం కాదు. అదే అగ్ని విషయం తీసుకుంటే వేడితత్త్వం అగ్ని స్వరూపం. అగ్ని ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా వేడిగానే ఉంటుంది.

**యత్ ఆగంతుకం తత్ న స్వరూపం యత్ నిత్యం తదేవ స్వరూపమ్**

నా శారీరక స్వరూపం జాగ్రదావస్థలోనే ఉంది; నా మానసిక స్వరూపం స్వప్నావస్థలోనే ఉంది, కాని నా చైతన్య స్వరూపం జాగ్రద్, స్వప్న, సుషుప్తి – మూడు అవస్థల్లోనూ ఉంది. అందువల్ల నా స్వరూపం – సత్–చిత్ ఆనందస్వరూపం అని శాస్త్రం ఘోషిస్తున్నది.

ఎలాగైతే నేను నా కళ్ళజోడు ఉపయోగించి ప్రపంచాన్ని చూసి, రాత్రి పడుకునేటప్పుడు నా కళ్ళజోడుని తీసి పక్కనపెట్టి పడుకుంటానో, అదే విధంగా నేను నా శరీరం ద్వారా బాహ్యప్రపంచంతో వ్యవహారం నడిపి, రాత్రి పడుకునేటప్పుడు ఈ జాగ్రద్ శరీరాన్ని తీసి పక్కన పెడతాను (అక్షరాలా కాదు). అందువల్ల దాని ద్వారా వ్యవహారం నడిపే జాగ్రద్ ప్రపంచం కనబడదు. అదే విధంగా మనస్సు ద్వారా స్వప్నావస్థలో వాసనామయ ప్రపంచాన్ని సృష్టించినా, గాఢనిద్ర పోయేటప్పుడు మనస్సును కూడా తీసి పక్కన పెడతాను (అక్షరాలా కాదు). అందువల్ల మనస్సు ద్వారా చూసే స్వప్నప్రపంచం కూడా కనబడదు. నిజానికి ఇది గాఢనిద్రలో ప్రతి ఒక్కరికీ జరిగే విషయమే. శారీరక స్వరూపం కాని, మానసిక స్వరూపం కాని ఎవరికీ ఉండదు గాఢనిద్రలో. అందువల్ల ఆత్మ సత్–చిత్ స్వరూపం.

నా స్వరూపం సత్–చిత్ ఆత్మ అయితే, ఆత్మ ఆకారం ఎంత? రెండవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ చెప్పాడు, మనం ఆకారం గురించి చెప్పినదంతా శరీరానికి సంబంధించినది. నేను ఐదు అడుగులు ఉన్నాను, నేను సన్నగా ఉన్నాను, నేను తెల్లగా ఉన్నాను – ఇవన్నీ శరీరానికి చెందినవి. నేను శరీరం కాదు, మనస్సు కాదు కాబట్టి ఈ శరీరానికి, మనస్సుకు

చెందిన పరిమితులేవీ నాకు వర్తించవు. అందువల్లనే సుషుప్తిలో నేను మనశ్శరీరాల ద్వారా వ్యవహారం నడపనప్పుడు, నాకు ఏ విధమైన పరిమితులూ అనుభవంలోకి రావు. గాఢనిద్రలో నేను, నేనే కాదు ఎవరైనా. అనంతం, పూర్ణం, నిత్యం.

**నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః** – 2.24
**అవ్యక్తోఽయమచింత్యోఽయమ్ అవికార్యోఽయముచ్యతే** – 2.25
**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

ఆత్మ నిత్యం, సర్వగతం, నిర్వికారం, అచలం, సనాతనం. ఆత్మ ఇంద్రియ అగోచరం. మనస్సుకు అందదు, వికారాలు లేవు.

ఆత్మకు పుట్టుక లేదు, చావు లేదు. ఒక సమయంలో పుట్టలేదు, ఒక సమయంలో మరణించదు. ఆత్మ అజం, నిత్యం, శాశ్వతం, పురాణం, శరీరం మరణించినా మరణించదు.

ఈ సుషుప్తిలో ఉన్న నేను, మనశ్శరీరాలతో వ్యవహారం నడపను; అవి అవ్యక్తంలో ఉంటాయి. కాని అసలు నేను, ఈ మూడు అవస్థలకూ అతీతంగా ఉంటాను. ఈ మూడు అవస్థలూ నేను వేసుకున్న వేషాలు. నేను మనస్సనే బనియనును, శరీరమనే షర్టును వేసుకుని వ్యవహారం నడుపుతాను. నిద్రపోయేటప్పుడు వాటిని తీసివేస్తాను (మనశ్శరీరాలు కూడా పడుకుంటాయి). సురేశ్వరాచార్యులవారు దీన్ని అహంకార కంచుకమ్ అంటారు. కంచుకమ్ అంటే యూనిఫారమ్ లేదా దుస్తులు.

ఆత్మ అయిన నేను పూర్ణుడను. నాకు పరిమితులు లేవు. నేను అనంతం. కృష్ణపరమాత్మ ఆత్మ పూర్ణం, అనంతం అని వివరించాక, ఆత్మ అనంతం కాబట్టి, ఆత్మకు దేశకాల వస్తుపరిమితులు లేవు కాబట్టి, ఆత్మ **అకర్తా** అని వివరిస్తాడు. ఆత్మ మంచి కర్మ చేయదు, చెడు కర్మ చేయదు. నేను కర్మలనుంచి విముక్తి పొందాను. 'నేను' అంటే ఎవరో మర్చిపోకూడదు. 'నేను' అంటే శరీరం కాను, శరీరం నేను వాడే పరికరం మాత్రమే; నేను మనస్సు కాను, మనస్సు కూడా నేను వాడే పరికరమే. నేను అంటే ఆత్మను. నేను అకర్తా. అందువల్ల ఆత్మనైన నా లక్షణాలు – పూర్ణత్వం, అకర్తృత్వం.

ఈ జ్ఞానం పొందటంవల్ల నాకు కలిగే ఫలం ఏమిటి? జీవితంలో మీరు అనుభవించే ఈ సంసారం ఈ జ్ఞానం లేకపోవటంవల్లనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. నేను ఆత్మను అనే జ్ఞానం లేదు. అజ్ఞానంలో ఉన్నాను. అజ్ఞానంనుంచి పొరపాటు పుడుతుంది. నేను ఆత్మను అని తెలియక నేను శరీరం, నేను మనస్సు అని పొరపాటు పడతాను. ఆత్మగా నేను పూర్ణుడను అని తెలియక, శరీరంతో మమేకం చెంది, శరీరపరంగా పూర్ణత్వం పొందాలని తాపత్రయ పడతాను. ఆ విధంగా అజ్ఞానంవల్ల అపూర్ణత్వం ఏర్పడుతుంది.

అపూర్ణత్వం అంటే పరిమితి ఉన్న భావన. నేను అపూర్ణుడుని అనుకున్నన్నాళ్ళూ, పూర్ణత్వం పొందటంకోసం ప్రయత్నం చేస్తూనే ఉంటాను. ఈ అపూర్ణత్వ భావన చిన్నతనంనుంచే మొదలవుతుంది. తల్లి, తన పిల్లవాడికి గంపెడు బొమ్మలు కొనిపెడుతుంది. పిల్లవాడు కాసేపు ఒక బొమ్మతో ఆడుకుని, దాన్ని పారేసి, ఇంకొకటి తీసుకుంటాడు. అలా ఒకదాని తర్వాత ఇంకొకదానితో ఆడుకుంటాడు. ఎందుకు అన్ని బొమ్మలు వాడతాడు? ఏ బొమ్మవల్ల తనకు పూర్ణత్వం వస్తుందో వెతుకుతూనే ఉన్నాడు. చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు కూడా ఏ బొమ్మతోనూ పూర్ణత్వం పొందలేదు. ఇంకా, ఇంకా ఏదో బొమ్మ కావాలనే తపన వెంటాడింది.

ఈ తపన వయస్సు పెరుగుతున్నకొద్దీ తనతో పాటే పెరుగుతుంది; వస్తువు మారుతుంది కాని తపన మారదు. అప్పుడు బొమ్మల్లో పూర్ణత్వాన్ని వెతుక్కుంటే, ఇప్పుడు వేరే వస్తువుల్లో వెతుక్కుంటాడు. చిన్నప్పుడు బొమ్మకారుకోసం ఏడిస్తే, ఇప్పుడు నిజం కారుకోసం గొడవ చేస్తాడు. అప్పుడు బొమ్మఫోనుతో ఆడుకుంటే, ఇప్పుడు నిజం ఫోను కావాలి. ఏ వయస్సులో ఆ వయస్సుకు తగ్గవాటి వెంట పరుగులు తీస్తారని అద్భుతంగా వస్తుంది భజగోవిందంలో.

**బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్ తరుణీసక్తః** – భజగోవిందమ్

పిల్లవాడిగా ఉన్నప్పుడు ఆటల్లో మునిగితేలుతాడు, యౌవనంలో స్త్రీలవైపు ఆకర్షింపబడతాడు.

యౌవనంలో పెళ్ళి చేసుకుని, భార్యతో పూర్ణత్వం అనుభవిస్తాననుకుంటాడు. పెళ్ళయినా పూర్ణత్వం పొందడు; పిల్లలు కలిగితే పూర్ణత్వం వస్తుందనుకుంటాడు. దానికోసం తిప్పలు పడి పిల్లలను కంటాడు. పిల్లలు పుట్టుకొచ్చినా అతను ఆశించిన ఆనందాన్ని పొందడు. వారికి సరియైన విద్యాబుద్ధులు నేర్పించాలనే తపన మొదలవుతుంది. ఒక పిల్లవాడు పుట్టాడు అంటే అతని జీవితం ముప్ఫయి ఏళ్ళ వరకు ఇరుక్కుపోయిందని చెప్పవచ్చు. పిల్లలకు సరియైన చదువు చెప్పించటంతో అతని బాధ్యత తీరిపోదు, వారికి మంచి ఉద్యోగం రావాలి. ఉద్యోగం రాగానే సరిపోయిందా? వారు జీవితంలో స్థిరపడాలి అంటే వారి పెళ్ళి అవ్వాలి. సరే వారి పెళ్ళి అయితే, అతని బాధ్యత తీరిందా? లేదు. వారికి పిల్లలు పుట్టాలి.

ఇవన్నీ తీరినా ఏదో కొరత వెంటాడుతూనే ఉంటుంది. స్వంతయిల్లు ఉండాలి, పడవంత కారు ఉండాలి, మంచి హెూదా ఉండాలి, బంధువులు ఉండాలి – ఎన్ని కోరికలు తీరుతూ వస్తున్నా కూడా ఇంకా చీకట్లో తడుముకుంటూనే ఉంటాడు. పూర్ణత్వం కావాలి, పూర్ణత్వం కావాలి, పూర్ణత్వం కావాలి. ఈ తపన తంబూరాశ్రుతిలాగా ఉంటూనే ఉంటుంది. కాకపోతే

పూర్ణత్వం నిర్వచనం మనిషి, మనిషికీ మారుతుంది. ఒకవ్యక్తి పెళ్ళయి, భార్యాపిల్లలు ఉంటే పూర్ణత్వం పొందుతాను అనుకుంటాడు; ఇంకొకవ్యక్తి పదవి, హోదా ఉంటే పూర్ణత్వం పొందుతాను అనుకుంటాడు; మరొకవ్యక్తి ఆనందంలో మునిగితేలితే పూర్ణత్వం పొందుతాను అనుకుంటాడు.

వీరి కోరికలు భిన్నంగా ఉన్నట్టుగా ఉన్నాయి. కాని వీరందరికీ సమానంగా ఉన్న లక్ష్యం ఒకటే – పూర్ణత్వం. ఈ అపూర్ణత్వం అజ్ఞానంవల్ల ఏర్పడింది. అజ్ఞానం అపూర్ణత్వానికి దారితీస్తే, అపూర్ణత్వం కామానికి దారితీస్తుంది. కామం అంటే కోరిక. కోరికలు అనంతం. కొంతమందికి జీవితంలో అన్నీ సమృద్ధిగా ఉంటాయి కాని ఏదో కొరత వారిని పట్టి పీడిస్తుంది.

ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ ఒక భారతీయుడు ఒకసారి స్వామీజీ దగ్గరకు వచ్చి స్వామీజీతో ఇలా అన్నాడు: 'స్వామీజీ, నాకు నామాట వినే మంచి భార్య ఉంది. మంచి ఉద్యోగంలో ఉన్నాను. రెండుచేతులా సంపాదిస్తున్నాను. కారు ఉంది, ఇల్లు ఉంది. నిజానికి ఒక మనిషి జీవితంలో ఏమేమి కావాలని కోరుకుంటాడో అవన్నీ నాకు సమృద్ధిగా ఉన్నాయి. కాని ఏదో కొరత నన్ను పట్టి పీడిస్తున్నది. అదేమిటో నేను చెప్పలేకుండా ఉన్నాను.' ఆయన సమస్యకు పరిష్కారం భారతీయసంస్కృతి, ఆధ్యాత్మికత జవాబు అనుకున్నారు స్వామీజీ. కాని అది నేర్చుకునే తీరిక లేదు. రెండు వారాల్లో వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నాడు.

ఆయన మనస్సు కలత చెందుతున్నది. కారణం అంతుపట్టటం లేదు ఆయనకు. కారణం ఒకటే. ఆత్మ అజ్ఞానం ఉన్నంతవరకు, సమస్యలు ఉంటూనే ఉంటాయి. శాంతి ఎన్నటికీ రాదు. అందులో ఏమాత్రం సందేహం లేదు. అజ్ఞానం అపూర్ణత్వానికి దారి తీస్తుంది; అపూర్ణత్వం కామానికి దారితీస్తుంది. కామం కర్మకు దారితీస్తుంది; కర్మ తపనకు దారితీస్తుంది. 'ఈ కర్మన్నా నన్ను పూర్ణుణ్ణి చేస్తుంది,' 'ఈ కర్మన్నా నన్ను పూర్ణుణ్ణి చేస్తుంది,' అనే తపనతో చేయిస్తుంది. కర్మ పుణ్యపాపాలకు దారితీస్తుంది; పుణ్యపాపాలు సుఖదుఃఖాలకు దారితీస్తాయి; సుఖదుఃఖాలు వచ్చే జన్మకు దారితీస్తాయి. మళ్ళీ వచ్చే జన్మలో కూడా ఇదే వృత్తం కొనసాగుతుంది. దీన్నే సంసారం అంటారు.

**అజ్ఞానం → అపూర్ణత్వం → కామం → కర్మ → పుణ్యపాపాలు →**

**సుఖదుఃఖాలు → పునరపి జననం, పునరపి మరణం = సంసారం**

ఆ విధంగా అజ్ఞానం = సంసారం. ఈ అజ్ఞానం తొలగిపోనంతవరకూ సంసారంలో పడి కొట్టుమిట్టాడక తప్పదు. అజ్ఞానం పోవాలంటే, జ్ఞానయోగం ఒక్కటే మార్గం. జ్ఞానయోగం పాటిస్తే కలిగే ఆత్యంతిక ఫలం – సంపూర్ణజ్ఞానం.

**యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।**
**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥** – 4.19

జ్ఞానికి అసంతృప్తి ఉండదు. అతనికి కోరికలు, ప్రణాళికలు ఉండవు. జ్ఞానికి అన్ని కర్మలు జ్ఞానాగ్నిలో దగ్ధమవుతాయి. అటువంటి వ్యక్తిని పండితుడు అంటారు.

ఒక జ్ఞాని మనస్సు ఎప్పటికీ పూర్ణత్వంతో నిండివుంటుంది. జీవితంలో దేనికీ కొరత ఉండదు. నిజానికి అతనికి ఈ పూర్ణత్వభావన ఎంతగా ఉంటుందంటే, జీవితాన్ని ఒక ఆటగా భావిస్తాడు. అజ్ఞాని ఈ జీవితంలో అవస్థపడటమే కాదు, జన్మజన్మలకూ అవస్థలు పడుతూనే ఉంటాడు; కాని జ్ఞాని ఈ జీవితంలోనే ఆనందంగా గడుపుతాడు. జ్ఞానికి జీవితం లీల. అజ్ఞాని పూర్ణత్వం**కోసం** కర్మలు చేస్తే, జ్ఞాని పూర్ణత్వం**తో** కర్మలు చేస్తాడు. జ్ఞాని తను చేసిన కర్మలకు తగిన ఫలం వచ్చినా, రాకపోయినా చలించడు.

**త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః** – 4.20

జ్ఞాని కర్మఫలంమీద ఆసక్తిని త్యజిస్తాడు కాబట్టి అతను ఎప్పుడూ తృప్తిగా ఉంటాడు, ఎవరిమీదా భావపరంగా ఆధారపడడు.

జ్ఞాని తృప్తిని నిత్యతృప్తః అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే మన తృప్తిని మనం భవిష్యత్తులో పొందుతామనుకుంటాము. 2012లో 2015కి మన బాధ్యతలన్నీ తీరి నిశ్చింతగా ఉంటాము అనుకుంటాము. 2015 వచ్చింది, అయినా తీరలేదు. పోనీలే 2017కి తీరి, నిశ్చింతగా ఉంటాము అనుకుంటాము. 2017 కూడా వచ్చింది కాని కొత్త బాధ్యతలు పుట్టుకొస్తూనే ఉన్నాయి; 2024 కూడా వచ్చింది, వాటికి మాత్రం అంతు కనబడటం లేదు. హొరైజాన్‌లాగా తృప్తి అనేది అంతకంతకూ వెనక్కి వెనక్కి వెళ్ళిపోతున్నది.

కాని జ్ఞాని నిత్యతృప్తిని అనుభవిస్తాడు. అందువల్ల అతను నిరాశ్రయుడు కూడా. అతను తన ఆనందంకోసం ఏ బాహ్యవస్తువుమీదా ఆధారపడడు. ధనం ఉందా, 'నేను తృప్తిగా ఉన్నాను,' అంటాడు; ధనం లేదా, అప్పుడు కూడా 'నేను తృప్తిగా ఉన్నాను,' అంటాడు. మనుష్యులు తన చుట్టూ ఉన్నా ఆనందంగా ఉంటాడు; తనను ఒంటరివాడిని చేసి, వదిలి వెళ్ళిపోయినా ఆనందంగానే ఉంటాడు. ఎందుకంటే అతనికి తెలుసు, పూర్ణత్వం బాహ్యవస్తువులలో లేదు. తనలోనే ఉందని. అందువల్ల అతను నిరాశ్రయుడు. నిరాశ్రయుడు అంటే ఒంటరిగా ఉంటాడని కాదు అర్థం.

**కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః** – 4.20

కర్మలు చేస్తూనే ఉన్నా, నేను కొంచెం కూడా చేయటం లేదు అని అర్థం చేసుకుంటాడు జ్ఞాని.

అతను ఎప్పుడూ కర్మలు చేస్తూనే ఉంటాడు. కాని జ్ఞాని తన కర్మలను పూర్ణత్వం**కోసం** చేయడు, పూర్ణత్వం**తో** చేస్తాడు అని చూశాము. దాన్ని ఐదు టెస్ట్‌మ్యాచ్‌లతో పోల్చవచ్చు. మన భారతీయులు, ఐదు మ్యాచ్‌లలో మూడు గెలిచేశారనుకోండి, మూడు గెలిచినా, తక్కిన రెండూ కూడా ఆడాలి. కాని ఆ రెండూ ఆనందంగా ఆడతారు. వాటికి ఆదుర్దా, ఆందోళన, భయం ఉండదు. ఆ ఆటను ఆనందిస్తారు.

**నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।**

**శారీరం కేవలం కర్మ కుర్వన్ నాప్నోతి కిల్బిషమ్ ॥** – 4.21

ఈ జ్ఞాని మనస్సునూ, శరీరాన్నీ జయించాడు. అతను శారీరకంగా చేయాల్సిన కర్మలను చేస్తాడు. అందువల్ల అతను కర్మలను చేస్తున్నా కూడా కర్మఫలాలు అతనికి అంటవు.

కొంతమంది జ్ఞానులు గృహస్థాశ్రమంలోనే ఉండిపోవటానికి నిశ్చయించుకుంటే, మరికొంతమంది సన్న్యాసాన్ని స్వీకరిస్తారు. గృహస్థజ్ఞాని అయినా, సన్న్యాసజ్ఞాని అయినా కూడా పూర్ణత్వాన్ని అనుభవిస్తారు. పూర్ణత్వభావనను భజగోవిందం బాగా వర్ణిస్తుంది.

**సురమందిరతరుమూలనివాసః శయ్యా భూతలమజినం వాసః**

**సర్వపరిగ్రహభోగత్యాగః కస్య సుఖం న కరోతి విరాగః** – భజగోవిందం 18

సన్న్యాసజ్ఞాని దేవాలయంలో కాని, చెట్టుకింద కాని పడుకుంటాడు. అతని పక్క భూమి, చర్మం అతని దుస్తులు. అన్ని భోగాలను త్యాగం చేశాడు. అటువంటి విరాగికి ఆనందం ఎందుకు ఉండదు?

జ్ఞాని చెట్టుకిందనే ఉంటాడు; బ్యాంక్ బ్యాలన్స్ లేదు; వృద్ధాప్యంలో తనను చూసుకుంటారో లేదో తెలియదు; ఏదైనా అనారోగ్యం వస్తే, వైద్యం చేయించే నాథుడు లేదు; ఎల్.ఐ.సీ. పాలసీ లేదు, మెడిక్లెమ్ లేదు; బంధం, బలగం లేదు. అటువంటి వ్యక్తి ఎంత భయపడాలి? కాని అతను పూర్ణత్వంతో నిండివుంటాడు.

**మూలం తరోః కేవలమాశ్రయంతః**

**పాణిద్వయం భోక్తుమమంత్రయంతః**

**శ్రియం చ కంథామివ కుత్సయన్తః**

**కౌపీనవంతః ఖలు భాగ్యవంతః** – యతి పంచకమ్ 2

జ్ఞానికి ఒంటి నిండా సరైన బట్ట కూడా లేదు. అయినా అతను **ఆత్మన్యేవాత్మనా తుష్టః.** మీరు కూడా ఆత్మలో రమిస్తారా, లేకపోతే జీవితమంతా ఆనందంకోసం పరుగులు తీస్తూనే ఉంటారా? నాకు ఆనందంకోసం పరుగులు తీయటంలోనే ఆనందం ఉందంటే మీయిష్టం. కాని, నా జీవితాన్ని మెరుగుపరుచుకుంటాను అంటే మాత్రం, ఈ ఆత్మజ్ఞానాన్ని పొందటానికి రండి. ఆత్మజ్ఞానం పొందితే మాత్రం –

**సర్వమోహనివృత్తిః, సర్వకామనివృత్తిః, సర్వపాపనివృత్తిః, అపూర్ణత్వనివృత్తిః**

అన్ని సమస్యలూ మటుమాయమవుతాయి.

**అజ్ఞానం → అపూర్ణత్వం → కామం → కర్మ → పుణ్యపాపాలు →**
**సుఖదుఃఖాలు → పునరపి జననం, పునరపి మరణం = సంసారం**

ఎప్పుడైతే అజ్ఞానం పోతుందో, అజ్ఞానజనిత అపూర్ణత్వం, తక్కిన దశలూ అన్నీ పోతాయి. అజ్ఞానంవల్లనే సంసారం ఏర్పడిందని చూశాము. అంటే సంసారానికి మూలకారణం అజ్ఞానం. ఈ మూలకారణాన్ని కూకటివేళ్ళతో పెకళించివేస్తే సంసారం నాశనం అవుతుంది. ఒక మహావృక్షాన్ని పైన కొమ్మలు మాత్రం నరికేస్తే, అది మళ్ళీ మళ్ళీ పుడుతూనే ఉంటుంది. దాన్ని సమూలంగా నాశనం చేయాలంటే, కూకటివేళ్ళను నరకాలి. అదే విధంగా సంసార వృక్షాన్ని సమూలంగా నాశనం చేయాలంటే, కూకటివేళ్ళయిన అజ్ఞానాన్ని నాశనం చేయాలి. దాని బదులు కోరికలను తీర్చుకుంటూపోతే, ఒకరకమైన కోరికలు పోతే, ఇంకొక రకమైన కోరికలు పుట్టుకువస్తాయి.

### 3. జ్ఞానసాధనలు, ఫలం – శ్లోకాలు 25–45

ఈ ఆత్మజ్ఞానం పొందటానికి కావాల్సిన సాధనలు ఏమిటి? కృష్ణపరమాత్మ నాలుగు సాధనలను పేర్కొంటున్నాడు. ఎన్నో సాధనలు ఉన్నాయి కాని, ఇక్కడ నాలుగు ప్రత్యేకించి చెప్పాడు. అవేమిటో చూద్దాము.

ఎ) **గురు ఉపసదనం** – గురువు లేకుండా ఏమీ నేర్చుకోలేము. నిజానికి ఏ రంగం తీసుకున్నా, దానికి గురువు ఉండితీరాలి. చిన్న టెన్నిస్ ఆటను తీసుకుంటే, ఆ ఆటను చూస్తే ఏముంది? ఆ బంతి మనవైపు వచ్చినప్పుడు రాకెట్‌తో కొట్టటమే కదా అనిపిస్తుంది. కాని కనబడినంత తేలిక కాదు అలా కొట్టటం. దానికి కూడా ఒక ప్రత్యేకమైన ప్రజ్ఞ కావాలి. గురువు ఈ ప్రజ్ఞాపాటవాలను నేర్పిస్తాడు. అలా ఏ రంగంలో ఆరితేరాలన్నా, ఒక సమర్థవంతమైన గురువు కావాలి. దానికొక శిక్షణ కావాలి. లౌకికవిద్యను నేర్చుకోవాలంటేనే ఒక గురువు, ఒక శిక్షణ కావాలంటే, అత్యంత ఉన్నతమైనదీ, అత్యంత సూక్ష్మమైనదీ అయిన ఆత్మజ్ఞానం పొందాలంటే, ఇంకెంత సమర్థవంతుడైన గురువు ఉండాలి? గురువు లేకుండా నేర్చుకోవచ్చు అనుకోవటం అర్థంలేని పని. అందువల్ల గురువు ఉండితీరాలి అంటాడు కృష్ణపరమాత్మ.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

ఈ వేదాంతబోధను బాగా చేయగలిగిన శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు వద్దకు జిజ్ఞాసతో, వినయంగా వెళ్ళి, సేవలు చేసి, ప్రశ్నలు అడిగి జ్ఞానం పొందాలి.

గురువు శాస్త్రాన్ని బోధిస్తాడు. కొంతమంది **ఆత్మే** గురువు అంటారు. అద్వైతంలో అది ఒప్పుకోము. ఎందుకంటే ఆత్మ బోధించలేదు. ఆత్మ అకర్తా, అభోక్తా అయితే ఆత్మ గురువెలా అవుతుంది? కొంతమంది **ప్రపంచం** గురువు అంటారు. ప్రపంచంనుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటాము అంటారు వారు. దానికి వారు దత్తాత్రేయుడు 24 జీవులనుంచి నేర్చుకున్న ఉదంతం చెబుతారు. కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రపంచం నేర్పించినా, ప్రపంచం నుంచి మనమేం నేర్చుకుంటామనేది మన మనస్సులో ఏముందో దానిమీద ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే ప్రపంచాన్ని మన జ్ఞానాన్ని బట్టో, మన అజ్ఞానాన్ని బట్టో అర్థం చేసుకుంటాము.

ఒకసారి స్వామీజీ ఒక శాస్త్రిగారు ఏదో గ్రంథాన్ని బోధించటం చూశారు. ఆయన మంచి గురువు. ఆయన బోధ మధ్యలో, ఆయన చేతిని ఒక ప్రత్యేక ఆకారంలో పెడితే, ఆయన దక్షిణామూర్తి వేసే చిన్ముద్రను సూచిస్తున్నారు అనుకున్నారుట స్వామీజీ. కాని కొంతసేపయ్యేసరికి ఆ చేతిని ముక్కు దగ్గరకి తీసుకువెళ్ళి నస్యం పీల్చారు! అందువల్ల మనం చూసేది మనం ఎలా అర్థం చేసుకుంటామన్నది మన జ్ఞానాన్ని బట్టి ఉంటుంది.

శాస్త్రం ముందే తెలిస్తే, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలము. శాస్త్రం తెలియకపోతే చిన్ముద్ర అర్థం కాదు. అలాగే భరతనాట్యంలో అనేక ముద్రలు వస్తాయి. భరతనాట్యం గురించి ఏమీ తెలియకపోతే, ఆ ముద్రలను ఆస్వాదించలేము. అందువల్ల ప్రపంచం గురువు కాలేదు. ఆత్మ గురువు కాలేదు. అంతేకాదు, గతంలోని వ్యక్తి కాని, భవిష్యత్తులోని వ్యక్తి కాని గురువు కాలేరు. ఎందుకంటే ఉపదేశం ముఖాముఖీగా జరగాలి. అందువల్ల గురువు సమకాలికుడు, జీవించి ఉన్నవ్యక్తి, జ్ఞాని, సంప్రదాయ పద్ధతిలో బోధ చేయగలిగిన ఆచార్యుడు అయివుండాలి. గురువు శాస్త్రాన్ని అధ్యయనం చేసివుంటే చాలదు, బోధ చేసే విధానం తెలియాలి. దానికొక సాంప్రదాయ తాళం ఉంటుంది. అంటే దానికొక పద్ధతి ఉంటుంది.

కర్ణాటక సంగీతం నేర్చుకోవాలంటే ఒక పద్ధతి ఉంటుంది. కీర్తనలకు వచ్చే ముందు సరళీస్వరాలు, జంటస్వరాలు, వర్ణాలు, గీతాలు నేర్చుకోవాలి. భరతనాట్యం నేర్చుకోవాలంటే దానికొక పద్ధతి ఉంటుంది. లౌకిక విద్యలకే ఒక పద్ధతి ఉంటే, అత్యంత సూక్ష్మమైన విషయాన్ని బోధించే ఆత్మవిద్యకు ఇంకెంత గొప్ప పద్ధతి ఉండాలి! దాన్నే సాంప్రదాయ పద్ధతి అంటారు. మన గురువు మనకు సాంప్రదాయ పద్ధతిలో బోధించాలి అంటే, ఆయన ఒక గురువు దగ్గర అధ్యయనం చేసివుండాలి. అందువల్ల గురుశిష్య పరంపర ద్వారా

నేర్చుకున్న వ్యక్తే తను మళ్ళీ గురువు అవగలడు. అతను మహాజ్ఞాని అయినా కూడా గురుశిష్య పరంపరలోకి రాకపోతే, శంకరాచార్యులు అతన్ని ఖండిస్తున్నారు.

**అసంప్రదాయవిత్ మూర్ఖవత్ ఉపేక్షనీయః**

అతన్ని మూర్ఖునిగా భావించి అతన్ని పట్టించుకోకూడదుట. అంతగా అయితే అతని జ్ఞానానికి ఒక నమస్కారం పెట్టవచ్చు, అతని దీవెనలు పొందవచ్చు కాని, అతని దగ్గర విద్య నేర్చుకోలేము. దీవెనలు పొందటం వేరు, విద్య నేర్చుకోవటం వేరు.

కృష్ణపరమాత్మ గురువును, **జ్ఞానినస్తత్త్వదర్శినః** అని వర్ణించాడు. ముండకోపనిషత్తులో గురువు శ్రోత్రియబ్రహ్మనిష్ఠ అయివుండాలని వస్తుంది.

**శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం స గురుమేవాభిగచ్ఛేత్** – ముండకం 1.2.12

అంటే ఆ గురువుకు శాస్త్రం తెలిసివుండాలి, బోధించే విధానం కూడా తెలిసివుండాలి. మొదటి సాధన గురువును సమీపించాలి – **విధివత్ గురు ఉపసదనమ్**.

బి) **శ్రద్ధ** – రెండవ సాధన (అది కూడా ముఖ్యమైనదే), గురువుమీద శ్రద్ధ ఉండాలి. గురువు తప్పు చెప్పరు అనే నమ్మకం ఉండాలి. ఒకవేళ ఎక్కడైనా గురువు తప్పు బోధించినట్టు అనిపిస్తేనో, లేదా గురువు బోధ తార్కికంగా అనిపించకపోతేనో ఏంచేయాలి? అప్పుడు కూడా గురువు బోధ తార్కికంగా లేదు అనకూడదు. మీకే సరిగ్గా అర్థం కాలేదు అని అర్థం చేసుకోవాలి. గురువును కాని, శాస్త్రం చేసే బోధను కాని తప్పు పట్టకుండా, ఆ బోధ మీ మేధస్సుకు అందలేదని గ్రహించాలి. అలా గ్రహించి, గురువు దగ్గరకు వినయంగా వెళ్ళి, అణకువగా అడగాలి, 'ఈ భాగం నేను సరిగ్గా అర్థం చేసుకోలేక పోతున్నాను. అందువల్ల అది తార్కికంగా ఉన్నట్టుగా అనిపించటం లేదు,' అని అడగాలి.

**వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే** – 3.2

చూడటానికి పరస్పర విరుద్ధంగా ఉన్న వాక్యాలవల్ల నా బుద్ధిని తికమక పెడుతున్నట్టుగా ఉన్నావు అన్నాడు అర్జునుడు.

'కృష్ణా! నువ్వు నన్ను కలగాపులగమైన మాటలతో అయోమయంలో పడేస్తున్నావు అన్నాడు అర్జునుడు. మన గొప్పతనం ఏమిటంటే, ప్రత్యక్షంగా అర్థమయ్యేటట్టు ఉన్న బోధను కూడా సరిగ్గా అర్థం చేసుకోలేము. అంటే అయోమయంలో పడే అవకాశం లేనిచోట కూడా అయోమయంలో పడగలము. అందువల్ల ఏ భాగమైనా అర్థం కాకపోతే, ఆ తప్పును మీమీదే వేసుకుని, గురువు దగ్గరకు వెళ్ళి అడగాలి. గురువు మళ్ళీ బోధించినా అర్థం కాకపోతే మళ్ళీ అడగాలి. అప్పుడు కూడా గురువును తప్పు పట్టకూడదు. గురువుకు ఎంత జాలిగుండె ఉంటుందంటే, శిష్యుడు లెక్కలేనన్నిసార్లు అడిగినా విసుక్కోకుండా బోధిస్తాడు. అది కూడా మొదటిసారి ఎంత శ్రద్ధగా బోధిస్తాడో, అంతే శ్రద్ధగా వందలసార్లు నేర్పిస్తాడు.

ఎక్కడిదాకానో ఎందుకు? నిజానికి అర్జునుడే తన ప్రశ్నను పదేపదే వేస్తూ వస్తున్నాడు. మూడవ అధ్యాయంలో అడిగిన ప్రశ్ననే ఐదవ అధ్యాయంలో కూడా అడుగుతాడు. కృష్ణపరమాత్మ, 'ఈ ప్రశ్నను నువ్వు ముందే అడిగావు,' అనడు. అర్జునుని మనస్సు నొప్పించడు. అందువల్ల అర్జునుడు, ఆ ప్రశ్నను అప్పుడే కొత్తగా వేసినట్టుగా, ఓపికగా జవాబు చెబుతాడు. అంతా అయ్యాక, పద్దెనిమిదవ అధ్యాయంలో మళ్ళీ అదే ప్రశ్న అడుగుతాడు. అప్పుడు కూడా కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి ఆటపట్టించడు, విసుక్కోడు, అవమానించడు. ప్రతిసారీ ఇంకా ప్రోత్సహిస్తాడు. 'చాలా తెలివైన ప్రశ్న వేశావు, నీకు జవాబు చెబుతాను,' అంటాడు.

అందువల్ల గురువు దగ్గరకు వినయంగా వెళ్ళాలి. గురువు తప్పు చెప్పడనే నమ్మకం ఉండాలి. రెండవ సాధన **శ్రద్ధ**.

సి) **తత్పరత** – మూడవ సాధన సంసిద్ధత ఉండాలి

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః ।**
**జ్ఞానం లబ్ధ్వా పరామ్ శాంతిమచిరేణాధిగచ్ఛతి ॥** – 4.39

సంసిద్ధత, శ్రద్ధ, తపన, ఇంద్రియనిగ్రహం ఉన్న వ్యక్తి ఆత్మజ్ఞానం పొంది, త్వరలోనే పరమశాంతిని పొందుతాడు.

తత్పరత అంటే అంకితభావం. అంకితభావం లేకుండా ఏ పనిచేసినా, ఏ రంగంలో కూడా రాణించలేరు. ఏ రంగంలో నిష్ణాతులైనవారినైనా గమనించండి. వారు గంటలకొద్దీ ఆ రంగంలో సాధన చేసివుంటారు. ఒక సంగీతవిద్వాంసుడు ఒక పాటను సునాయాసంగా పాడుతున్నాడంటే దాని వెనుక గంటల తరబడి అతని అవిరామకృషి ఉంటుంది. వీణలో ఆరితేరిన వ్యక్తి కచేరీలో వీణ వాయిస్తూ వచ్చినవారిని చూస్తుంటే, అతను ఎంత సునాయాసంగా వాయిస్తున్నాడు, భగవంతుడు ఎంత పక్షపాతం చూపిస్తున్నాడు, నేను వాయించటానికి ప్రయత్నిస్తే, తీగె తెగిపోతుంది అనుకుంటారు. కాని అతన్ని ఇంటర్వ్యూ చేసి చూడండి! అతని ప్రజ్ఞ వెనక గంటల తరబడి అతను చేసిన సాధన ఉంటుంది. అది కూడా ఒక్కరోజు కాదు, సంవత్సరాల తరబడీ చేసిన సాధన. క్రీడాకారుణ్ణి ప్రశ్నించండి – అతను రోజుకు ఆరు గంటలు పరుగులు తీస్తాడు. క్రికెట్ ఆడేవారిని అడగండి – వారు ఎండలో నిర్విరామంగా కృషి చేయాలి. చదరంగంలో గెలవాలంటే కొన్నివేల ఆటలను కంఠతా పట్టి ఉండాలి. లౌకిక విజయాలలో ఇంత నిరంతర కృషి, అంకితభావన ఉండాలంటే, ఆధ్యాత్మిక విజయంలో ఇంకెంత అంకితభావన ఉండితీరాలి! అది ఆషామాషీగా నేర్చుకునేది కాదు. మూడవ సాధన **తత్పరత**.

డి) **సంయతేంద్రియం** – నాలుగవ సాధన, ముఖ్యమైన సాధన, సంయతేంద్రియం. సంయతేంద్రియం అంటే ఆర్జవం. ఆధ్యాత్మిక సాధన ఈ శరీరం, ఇంద్రియాలు, మనస్సుతోనే

చేయాలి. ఇవే ఇంద్రియాలతో బోధ వినాలి. ఇదే శరీరంతో బోధ జరుగుతున్నంతసేపూ కుదురుగా కూర్చోవాలి. ఇదే మనస్సుతో బోధను అర్థం చేసుకుని, జీర్ణించుకోవాలి. అందువల్ల మీ పరికరాలు మీ చెప్పుచేతల్లో లేకపోతే మీరు మీ లక్ష్యాన్ని చేరుకోలేరు.

మీ కారులో మీరు ఏ బదరీనాథ్‌కో వెళ్ళాలనుకుంటే, అంత దూరప్రయాణం చేసే ముందు కారు సరిగ్గా ఉందో లేదో చూసుకోవాలి; బ్రేకులు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాలి, లేకపోతే ఎక్కడో బ్రేకులు పనిచేయకపోవచ్చు; స్టీరింగ్ వీల్ సరిగ్గా లేకపోతే కుడివైపు వెళ్ళాలంటే, కారుని ఎడమవైపుకు తిప్పేయవచ్చు. బదరీనాథ్ వెళ్ళకుండా ఇంకెక్కడికో తీసుకుపోవచ్చు. అందువల్ల కారు రోడ్డుమీద వెళ్ళేటందుకు అన్ని హంగులతో సిద్ధంగా ఉండాలి; విమానం ఆకాశంలో ఎగరటానికి అన్ని హంగులతో సిద్ధంగా ఉండాలి; మీరు ఆధ్యాత్మికంగా ఎదగటానికి అన్ని పరికరాలు సిద్ధంగా ఉండాలి.

దానికి చాలా సాధన కావాలి. ఆ సాధన పతంజలి అష్టాంగయోగం ఇస్తుంది. అందువల్ల దేనికే సాధన కావాలో చూసుకుని ఆ సాధన చేయండి. ఒక సంగీత కచేరీకి వెళితే, కచేరీ మొదలయ్యేముందు సంగీత విద్వాంసుడు పాడే శ్రుతిలో పక్క వాయిద్యాలను కూడా అదే శ్రుతిలో సరిచేసుకుంటారు. అన్ని వాయిద్యాలూ ఒక్క శ్రుతిలో లేకపోతే, ఆ కచేరీ రక్తి కట్టదు. ఇదే సూత్రం మీ కార్యకరణసంఘాతానికి కూడా వర్తిస్తుంది. మనస్సు ఆలోచించేది ఒకటి, నోరు చెప్పేది ఇంకొకటి, శరీరం చేసేది మరొకటీ అయితే, జీవితంలో విజయం సాధించలేరు. మనోవాక్కాయ కర్మలను ఒక్క త్రాటిమీద నడపాలి. దాన్ని ఆర్జవం అంటారు. నాలుగవ సాధన **సంయతేంద్రియం**.

ఇంద్రియనిగ్రహం పెంపొందించుకుని, శ్రద్ధ పెంచుకుని, అంకితభావన పెంపొందించుకుని, గురువు వద్దకు వెళ్ళి, జ్ఞానం పొంది, మోక్షం పొందండి.

జ్ఞాన, కర్మసన్న్యాసయోగము అంటే జ్ఞానాయ కర్మసన్న్యాసమ్ – జ్ఞానంకోసం కర్మను సన్న్యసించటము.అందువల్ల ఈ అధ్యాయానికి జ్ఞాన,కర్మసన్న్యాసయోగము అని పేరు వచ్చింది.

# కర్మసన్న్యాసయోగము

## అధ్యాయము 5

భగవద్గీతలోని నాలుగు, ఐదవ అధ్యాయాల్లో ఇంచుమించుగా ఒకే అంశాలు ఉన్నాయి. ఎందుకంటే రెండూ జ్ఞానయోగాన్ని నొక్కి వక్కాణిస్తాయి. అందువల్లనే నాలుగవ అధ్యాయం పేరు జ్ఞాన, కర్మసన్న్యాసయోగము అయితే, ఐదవ అధ్యాయం పేరు కర్మ సన్న్యాసయోగము అయింది. రెండింటి సారాంశం ఒకటే అయినా, రెండింటిలోనూ సూక్ష్మభేదాలు ఉన్నాయి. ఐదవ అధ్యాయంలో ఉన్న ప్రత్యేక అంశాలేమిటో చూద్దాము.

ఐదవ అధ్యాయాన్ని కూడా ప్రధానంగా మూడు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. నిష్ఠాద్వయం : శ్లోకాలు 1–6
2. యోగద్వయం : శ్లోకాలు 7–21
3. సాధనలు : శ్లోకాలు 22–29

### 1. నిష్ఠాద్వయం: శ్లోకాలు 1–6

నిష్ఠాద్వయం అంటే రెండు జీవనవిధానాలు. మనం ఇంతకు ముందు కూడా చూశాము. ప్రతిసాధకుడు కూడా మోక్షం పొందటానికి రెండు సాధనలను పాటించితీరాలి. అవి కర్మయోగం, జ్ఞానయోగం. వీటిలో ఎన్నుకునే అవకాశం లేదు. కర్మయోగం ఎందుకు చేసి తీరాలంటే, అది చిత్తశుద్ధిని ఇస్తుంది. జ్ఞానయోగం ఎందుకు చేసి తీరాలంటే అది ఆత్మజ్ఞానాన్ని ఇస్తుంది. చిత్తశుద్ధి పొందనిదే, ఆత్మజ్ఞానం అసంపూర్ణం. అందువల్ల చిత్తశుద్ధి, ఆత్మజ్ఞానం రెండూ ముఖ్యమే.

అందువల్ల ప్రతి ఒక్కరూ కూడా కర్మయోగాన్ని పాటించి చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగానికి వచ్చి జ్ఞానం పొందాలి. అప్పుడే మోక్షం కలుగుతుంది. ఈ సాధనల్లో వికల్పం లేదు. అంటే ఎన్నుకునే అవకాశం లేదు. కాకపోతే దీనిలో కొన్ని మినహాయింపులు లేకపోలేదు. చాలా అరుదుగా, కొందరు కర్మయోగం పాటించకుండానే జ్ఞానయోగానికి సరాసరి వచ్చి ఉండవచ్చు. అటువంటి వ్యక్తుల విషయంలో కూడా, మనం అతను కర్మయోగాన్ని దాటి రాలేదు, అతను కర్మయోగాన్ని ముందు జన్మలోనే చేసేసి ఉంటాడు అంటాము. ఉదాహరణకు ఒక సబ్జెక్టులో రెండు పేపర్లు ఉంటే, రెండూ ఒకసారి రాయలేనివారు, మొదటి పేపరు ముందు రాసి, కొన్ని నెలల తర్వాత రెండో పేపరు రాస్తారు. రెండూ కలిపి రాసినా, విడిగా రాసినా, రెండూ పాసయితేనే కాని, వారు డిగ్రీ పొందలేరు.

అదే విధంగా ఇక్కడ కూడా కర్మయోగం, జ్ఞానయోగం రెండూ పాసవ్వాలి. కొంతమంది పూర్వజన్మలోనే కర్మయోగం పాసయిపోయి, ఈ జన్మలో చిత్తశుద్ధి పొంది పుడతారు. అటువంటి

వారిని ఆధ్యాత్మిక మేధావులు అంటారు. వారు ఏమీ దగ్గర దారిలో రాలేదు; వారు పూర్వజన్మలో పాటించారు. అది తెలియదు కాబట్టి, వారు కర్మయోగాన్ని వదిలి, జ్ఞానయోగానికి వచ్చేశారు అని పొరపాటు పడతాము.

మరికొన్ని అరుదైన సందర్భాలలో ఒక వ్యక్తి జ్ఞానయోగం కూడా కొంతమేరకు పూర్వజన్మలోనే పాటించి ఉండివుండవచ్చు. వీరి గురించి కృష్ణపరమాత్మ ఆరవ అధ్యాయంలో మాట్లాడతాడు. వారిని యోగభ్రష్టులు (యోగము పూర్తి కానివాడు) అంటాడు. వారు కిందటి జన్మలో జ్ఞానయోగం పాటించి ఉంటారు, గురువు వద్దకు వెళ్ళి ఉంటారు; జ్ఞానం కూడా పొందివుంటారు కాని అది పూర్తి అయి ఉండదు. అప్పుడు వారు మళ్ళీ వచ్చే జన్మలో ఆధ్యాత్మిక మేధావులుగా పుడతారు.

వారు కర్మయోగం పాటించారు కాని గురువువద్దకు వెళ్ళరు; శాస్త్రం అధ్యయనం చేయరు. కానీ ఇవేవీ చేయకుండానే వారికి జ్ఞానం వస్తుంది. అంటే వారిమీద భగవంతుడు పక్షపాతం చూపించాడు అనకూడదు. వారు ఈ జన్మలో చేయాల్సిన దానిలో 95% ముందు జన్మలో చేసేసారు. అందువల్ల మళ్ళీ ఈ జన్మనెత్తినా కూడా అతి తక్కువ కాలంలోనే మోక్షం పొందుతారు.

నిజానికి ఇటువంటి అసాధారణ వ్యక్తి గురించి ఐతరేయోపనిషత్తులో చూస్తాము.

**గర్భ ఏవైతచ్ఛయానో వామదేవః ఏవమువాచ** – ఐతరేయమ్ 2.4.5

తల్లిగర్భంలో ఉండగానే వామదేవ ఋషి జ్ఞానాన్ని పొందాడు. అందువల్ల అసాధారణ మేధావులు అక్కడక్కడా లేకపోలేదు. కాని, గుర్తుంచుకోండి, అసాధారణాలు సూత్రాలు కాలేవు. ప్రతిసూత్రానికి ఒక ఉల్లంఘన ఉంటుంది. మనం సూత్రం గురించి మాట్లాడేటప్పుడు ఉల్లంఘనలను పట్టించుకోకూడదు.

లౌకిక విద్యలో కూడా అసాధారణ మేధావులు ఉన్నారు. రామానుజం స్కూలు, కాలేజీలకు వెళ్ళకుండా, ఏ గురువు వద్ద నేర్చుకోకుండానే మాథమాటికల్ విజార్డ్ అయ్యాడు. రామానుజం స్కూలు, కాలేజీలకు వెళ్ళలేదు కాబట్టి స్కూళ్ళు, కాలేజీలు అనవసరం, వాటిని మూసివేద్దాము అనగలమా? స్కూళ్ళు, కాలేజీలు కట్టినప్పుడు రామానుజనాన్ని దృష్టిలో పెట్టుకోము. అలాగే మాండోలిన్ శ్రీనివాస్ చిన్నవయస్సులోనే గొప్ప విద్వాంసుడు అయితే అందరూ అలా అవగలరా?

అందువల్ల గురుశాస్త్రం ఉపదేశం లేకుండా, కొందరు జ్ఞానం పొందితే పొందవచ్చు గాక, అసలు సూత్రమయితే ఇది – కర్మయోగం, శాస్త్రం, గురువు తప్పనిసరిగా కావాలి. ఈ నియమం 99.99 శాతం మనుష్యులకు వర్తిస్తుంది.బహుశ ఇప్పుడు కూడా

ఆ అసాధారణ మేధావులు ఉండవచ్చు కాని మనం వారిని దృష్టిలో పెట్టుకోవటం లేదు. అందువల్ల వేదం నియమం ప్రకారం ప్రతి ఒక్కరూ కర్మయోగం పాటించి తీరాలి; ప్రతి ఒక్కరూ జ్ఞానయోగానికి వచ్చి తీరాలి, అది కూడా గురువు ద్వారానే శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి.

ఇప్పుడు ఈ రెండు సాధనలూ పాటించాలంటే, దానికి అనువైన నిష్ఠ ఏది?

**నిశ్చయేన తిష్ఠతి అస్యాం ఇతి నిష్ఠా**

వేదాల్లో చెప్పినట్టుగా కృష్ణపరమాత్మ కూడా రెండు రకాల జీవనవిధానాల గురించి బోధిస్తున్నాడు. అవి ప్రవృత్తిమార్గం, నివృత్తిమార్గం. ప్రవృత్తిమార్గం అంటే కర్మ చేయటం. దీన్ని కృష్ణపరమాత్మ యోగః అంటున్నాడు. యోగః = ప్రవృత్తిమార్గం. నివృత్తిమార్గం అంటే కర్మను త్యజించటం. కృష్ణపరమాత్మ దీన్ని సాంఖ్యనిష్ఠ అంటున్నాడు.

సాంఖ్య = నివృత్తిమార్గం. ఈ రెండు మార్గాలను ఆధారంగా చేసుకుని, ఒక వ్యక్తి తన జీవితాన్ని మూడు భిన్నపద్ధతుల్లో ఎన్నుకోవచ్చు. ఏ మార్గానికి ఆ మార్గంలోనే లాభాలూ ఉంటాయి, నష్టాలూ ఉంటాయి. ఎందుకంటే ఈ సాపేక్షిక ప్రపంచంలో ప్రతిదానికీ వెలుగూ ఉంటుంది, చీకటికోణమూ ఉంటుంది. ఎలాగైతే ఒక నాణేనికి రెండు పక్కలు ఉంటాయో, అలాగే మనం చేసే ప్రతికర్మకు కూడా లాభమూ ఉంటుంది, నష్టమూ ఉంటుంది. ఆ అవకాశాలేమిటో చూద్దాము.

ఈ అవకాశాలలో ఏదో ఒకటి ఎన్నుకునే ముందు మొదట అందరూ తప్పనిసరిగా శాస్త్ర అధ్యయనం చేసితీరాలంటుంది శాస్త్రం. ఇలా మూడు జీవనవిధానాలు ఉన్నాయని తెలుసుకోవటానికైనా శాస్త్రాన్ని నేర్చుకుని తీరాలి. కారు డ్రైవింగ్ నేర్చుకునేముందు నియమాలు నేర్చుకునేటట్టుగా, లక్ష్యాలేమిటో ముందు తెలిస్తే, మార్గాల గురించి ఆలోచించవచ్చు. ముందు సాధ్యాలు తెలియాలి. జీవితంలో ఏవి ముఖ్యమో తెలియాలి. సాధ్యాలు ఏమిటో తెలిస్తే, వాటిని పొందే సాధనలు ఏమిటో కూడా తెలియాలి. అందువల్ల ముందు ఒక వ్యక్తి సాధనలు –సాధ్యాల గురించి, లక్ష్యాలు–మార్గాల గురించి తెలుసుకోవాలి. ఆ దశను బ్రహ్మచర్య ఆశ్రమం అంటారు. ఈ దశలో వికల్పం లేదు. అందరూ తప్పనిసరిగా నేర్చుకుని తీరాలి. ఏదో ఒక గురుకులంలో చేరో, ఒక ఆచార్యుని వద్ద చేరో, విద్యను అభ్యసించాలి.

అతను విద్య ముగించాక ఏ రంగంలోనైనా చేరనీ; జీవితం గురించీ, పురుషార్థాల గురించీ, వాటి సాధనల గురించీ నేర్చుకోవాలి. ఆ రోజుల్లో క్షత్రియుడు యుద్ధనైపుణ్యం పొందాలి; వైశ్యుడు వ్యాపారంలో మెళకువలు నేర్చుకోవాలి. కాని వాటితోపాటు అందరూ నేర్చుకుని తీరాల్సినది వైదిక జీవనవిధానం గురించీ, జీవితంలోని అంతిమలక్ష్యం గురించీ.

అందువల్ల బ్రహ్మచర్య ఆశ్రమం అంటే మొదటి దశ అందరికీ సమానం. ఇదయ్యాక, బ్రహ్మచారి మూడు మార్గాల్లో ఏదైనా ఒకటి ఎన్నుకోవచ్చు.

1. **గృహస్థాశ్రమం** – ఒక మార్గం గృహస్థాశ్రమాన్ని స్వీకరించటం. గృహస్థాశ్రమంలో సమాజంలో ఉంటూ అనేక కర్మలు చేస్తారు. దీన్ని ప్రవృత్తిమార్గం అంటారని చూశాము. ఈ గృహస్థాశ్రమంలోనే జీవితాంతం ఉండిపోవటం ఒక మార్గం. అంటే ఇంక సన్న్యాసాశ్రమంలోకి అడుగుపెట్టడు. సన్న్యాసాన్ని స్వీకరించడు, స్వీకరించి తీరాల్సిన నియమం లేదు కూడా. ఒకవేళ సన్న్యాసాశ్రమం స్వీకరించి తీరాల్సివుంటే, వేదం అంత్యేష్టి కర్మను నిర్దేశించి ఉండేది కాదు. ఎందుకంటే అందరూ సన్న్యాసం స్వీకరిస్తే, అంత్యేష్టి కర్మతో అవసరం లేదు. సన్న్యాసికి అది చేయరు.

వేదం అంత్యేష్టికర్మను నిర్దేశించిందంటేనే సన్న్యాసాశ్రమాన్ని, స్వీకరించి తీరాల్సిన ఆశ్రమ వ్యవస్థగా భావించటం లేదని అర్థమవుతుంది. దీనివల్ల ఒక విషయం స్పష్టంగా తెలుస్తున్నది. బ్రహ్మచర్యంనుంచి గ్రహస్థాశ్రమానికి వచ్చి, సన్న్యాసం స్వీకరించకుండా గృహస్థుగానే మిగిలిపోవచ్చు. అతన్ని కేవల గృహస్థ అంటారు. కేవల అంటే మనకు తెలిసిన కేవలం కాదు; కేవల గృహస్థ అంటే, సన్న్యాసానికి రాకుండా గృహస్థుగానే మిగిలిపోయాడని అర్థం – **సన్న్యాస అమిశ్రిత గృహస్థ.**

2. **సన్న్యాసాశ్రమం** – ఇంకొక మార్గం – బ్రహ్మచర్యంనుంచి సరాసరి సన్న్యాసాశ్రమంలోకి అడుగుపెట్టటం.

**బ్రహ్మచర్య ఆశ్రమాదేవ సన్న్యాసీ భవతి**

అంటే అతను ఇంక జీవితాంతం సన్న్యాసిగానే గడుపుతాడు, గృహస్థాశ్రమంలోకి అడుగుపెట్టడు. ముందు మార్గంలో అతను కేవల గృహస్థ అయితే, ఇందులో అతను కేవల సన్న్యాసి అవుతాడు. మొదటి మార్గంలో అతను సన్న్యాసం స్వీకరించకపోతే, ఈ మార్గంలో అతను గృహస్థధర్మం స్వీకరించడు.

3. **గృహస్థాశ్రమం + సన్న్యాసాశ్రమం** – మూడవ మార్గంలో బ్రహ్మచర్యంనుంచి ఒక వ్యక్తి గృహస్థాశ్రమం స్వీకరించి, గృహస్థుగా తన జీవితాన్ని కొన్నాళ్ళు సాగించి, దాని తరువాత సన్న్యాసాశ్రమం స్వీకరిస్తాడు. అతను కేవలగృహస్థు కాదు, కేవలసన్న్యాసి కాదు; అతని జీవితం గృహస్థాశ్రమం + సన్న్యాసాశ్రమంతో కూడుకున్నది.

నాలుగవ మార్గం ఏమిటి అనకూడదు. ఎందుకంటే గృహస్థాశ్రమం, సన్న్యాసాశ్రమాల మధ్య వన్‌వే ట్రాఫిక్కే ఉంది. గృహస్థాశ్రమంనుంచి సన్న్యాసాశ్రమం చేపట్టవచ్చు కాని, సన్న్యాసాశ్రమంనుంచి గృహస్థాశ్రమానికి రాలేదు.

ఈ మూడు మార్గాలనూ టూకీగా ఒకసారి చూద్దాము.

బ్రహ్మచర్యాశ్రమం → గృహస్థాశ్రమం జీవితాంతం

బ్రహ్మచర్యాశ్రమం → సన్న్యాసాశ్రమం జీవితాంతం

బ్రహ్మచర్యాశ్రమం → గృహస్థాశ్రమం → సన్న్యాసాశ్రమం జీవితాంతం.

నిజానికి, శాస్త్రం నాలుగు ఆశ్రమ ధర్మాలను నిర్దేశించింది. అవి బ్రహ్మచర్య ఆశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం. ఇక్కడ వానప్రస్థాశ్రమం ప్రసక్తి తీసుకురాలేదు. ఎందుకంటే, వానప్రస్థాశ్రమం సన్న్యాసాశ్రమానికి ఒక రిహార్సలు మాత్రమే. అది ఇంచుమించుగా సన్న్యాసాశ్రమం లాగానే ఉంటుంది. ఈ మూడు జీవనవిధానాల్లో ప్రయోజనాలూ ఉన్నాయి, నష్టాలూ ఉన్నాయి. అవేమిటో చూద్దాము.

1. **గృహస్థాశ్రమం** – ఈ జీవనవిధానంలో ఒక వ్యక్తి గృహస్థాశ్రమాన్ని స్వీకరించి, జీవితాంతం గృహస్థుగానే ఉండిపోవటానికి నిశ్చయించుకున్నాడని చూశాము. అతనికి సన్న్యాసి అయ్యే ఉద్దేశ్యం లేదు. తన ఇంట్లోనే ఉండిపోయి కృష్ణా రామా అంటూ జీవితం వెళ్ళబుచ్చటానికి నిర్ణయించుకుంటాడు. అది తప్పో, ఒప్పో మనం చర్చించబోవటం లేదు. ఇది ఒక మార్గం అని చూశాము. ఇప్పుడు ఈ మార్గాల లాభనష్టాలను, పక్షపాతం చూపకుండా బేరీజు వేద్దాము.

ముందు ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఈ మూడు మార్గాల్లో ఏ మార్గం ఎన్నుకున్నా, అన్నింటిలోనూ రెండు సాధనలు చేసితీరాలి. అందులో వికల్పం లేదు. కర్మయోగమూ, జ్ఞానయోగమూ పాటించితీరాలి. సాధనలో వికల్పం లేదు, నిష్ఠలోనే (జీవనవిధానంలోనే) వికల్పం ఉంది.

ఎవరైనా ముందుగా కర్మయోగం పాటించాలి. గృహస్థు దాన్ని సునాయాసంగా చేయగలడు. ఎందుకంటే గృహస్థాశ్రమం కర్మయోగం పాటించటానికి చాలా అనువైన వాతావరణం. కర్మయోగం పాటించటానికి కొంత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండాలి. అది గృహస్థాశ్రమంలో మెండుగా ఉంటుంది. కర్మయోగం పాటించటానికి తోటి మనుష్యుల అండదండలు కావాలి; ధనం సమృద్ధిగా ఉండాలి. పంచమహాయజ్ఞాలు అంటే దేవయజ్ఞం, పితృయజ్ఞం, ఋషియజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం అని చూశాము. వీటిల్లో ఏ యజ్ఞం చేయాలన్నాకూడా దానికి అంగబలం, అర్థబలం – రెండూ ఉండాలి. అందువల్ల గృహస్థాశ్రమం కర్మయోగానికి అనువుగా ఉంటుంది. ఇది లాభం.

అతను కర్మయోగం పాటించినకొద్దీ, చిత్తశుద్ధి పొందుతాడు. దానివల్ల జ్ఞానయోగ్యత పొంది, జ్ఞానయోగంలోకి అడుగుపెట్టటానికి అధికారి అవుతాడు. గృహస్థుగానే ఉంటూ జ్ఞానం పొందాలంటే, ఈ గృహస్థజీవనం అనువుగా లేదని గ్రహిస్తాడు. జ్ఞానయోగానికి

జీవనవిధానం కొంచెం ప్రశాంతంగా ఉండాలి. జ్ఞానంలో విద్యను అభ్యసించటం, దానిమీద ధ్యానం చేయటం ఉంటుంది. చుట్టూ రణగొణ ధ్వని ఉంటే, అది కష్టమవుతుంది. ఇది దీనివల్ల నష్టం.

ఉదాహరణకు మద్రాసు సెంట్రల్ స్టేషన్లో ఉన్నారు మీరు, అప్పుడే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ వచ్చింది. అంతా కోలాహలంగా ఉంది. అప్పుడు, అక్కడ మీరేదైనా చదువుదామని అనుకున్నారనుకోండి, ఎలా ఉంటుంది? అక్కడ చదవటం అసాధ్యం అనము కాని, చదవటానికి అనువైన వాతావరణం కాదు అంటాము. ఆ విధంగా గృహస్థాశ్రమం కర్మయోగానికి అనువైనదే కాని జ్ఞానయోగానికి కాదు.

గృహస్థు జ్ఞానయోగానికి వస్తే, అతని జీవితం కత్తిమీద సాము లాగా ఉంటుంది. స్క్రూడ్రైవర్‌తో పండు కోసినట్టు ఉంటుంది. అది తేలిక కాదు కాని, అసాధ్యం కూడా కాదు. కొంతమంది గృహస్థుగా ఉంటూ, జ్ఞానం పొందుతారు. అలా కూడా జ్ఞానం పొందవచ్చు కాని, ఏ విధమైన ఆటంకాలు లేకుండా విద్య నేర్చుకోగలిగితే, అది ఆదర్శప్రాయంగా ఉంటుంది. అందువల్ల గృహస్థాశ్రమం కర్మయోగానికి ఆదర్శంగా ఉంటుంది కాని జ్ఞానయోగానికి ఆదర్శంగా ఉండకపోవచ్చు.

2. **సన్న్యాసాశ్రమం** – ఈ జీవనవిధానంలో బ్రహ్మచర్యంనుంచి సరాసరి సన్న్యాసాశ్రమానికి వచ్చి, జీవితాంతం సన్న్యాసిగా జీవించటానికి నిశ్చయించుకున్నాడని చూశాము. అతను కూడా కర్మయోగం, జ్ఞానయోగం రెండూ పాటించాలని చూశాము. ఎందుకంటే అందరికీ చిత్తశుద్ధి, జ్ఞానం – రెండూ కావాలి.

ఇక్కడ నష్టం చూస్తే, సన్న్యాసాశ్రమం చిత్తశుద్ధి పొందటానికి అనువుగా ఉండదు. ఎందుకంటే, ఆశ్రమంలో సేవ చేసే ఆస్కారం ఉండదు. అతను పంచమహాయజ్ఞాలు ఏదీ చేయలేడు. ముందుగా సన్న్యాసికి పంచమహాయజ్ఞాలు చేసే హక్కు లేదు. సన్న్యాసికి యజ్ఞయాగాదులను నిషేధించింది ధర్మశాస్త్రం. సమాజంనుంచి నేర్చుకునే అవకాశమూ లేదు. ఎందుకంటే అతను ఒంటరి జీవనం గడుపుతాడు. సమాజానికి సేవ చేయటానికి అతనికి వనరులు కూడా ఉండవు. అతనే భిక్షాటన చేసి జీవించాలంటే, అన్నదానం ఎలా చేస్తాడు? వస్త్రదానం కాని, ఏ విధమైన దానం కాని చేయలేడు. ఎందుకంటే అతనికి ధనం ఉండదు. అందువల్ల సన్న్యాసాశ్రమం కర్మయోగం పాటించటానికి ఆదర్శంగా ఉండదు.

ఇక్కడ సన్న్యాసిని హెచ్చరిస్తున్నాడు కూడా కృష్ణపరమాత్మ. అతను ఎక్కువ కర్మ చేయడు కాబట్టి ఖాళీ సమయం ఎక్కువ ఉంటుంది. దాన్ని సద్వినియోగం చేయకపోతే చాలా ప్రమాదం. **ఏన్ ఐడిల్ మ్యాన్స్ బ్రెయిన్ ఈజ్ ఎ డెవిల్స్ వర్క్‌షాప్** అంటారు. ఖాళీగా ఉన్న మనస్సు పరిపరి విధాల పోతుంది.

**కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥ – 3.6**

ఎవరైతే బలవంతంగా, శారీరకంగా అర్థకామాలనుంచి విడివడి మనస్సును, ఇంద్రియాలను జయించడో అటువంటి వ్యక్తిని మిథ్యాచారుడు అంటారు. అతను మోహంలో ఉన్నాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ సన్న్యాసికి కర్మలు ఎక్కువ ఉండవు అని చూశాము. అతను సంధ్యావందనం కాని, అగ్నిహోత్రం కాని చేయనవసరం లేదు. అతనికి కుటుంబం లేదు కాబట్టి కుటుంబంకోసం కష్టపడి పని చేయాల్సిన బాధ్యత లేదు. అంత రికామీగా ఉండేటప్పుడు, చిత్తశుద్ధి పొందకపోతే, మనస్సు దారుణంగా ప్రవర్తించవచ్చు. అతనికి పూర్వజన్మసుకృతం ఉంటే, అది వేరే విషయం. కాని ఇక్కడ మనం అసాధారణ వ్యక్తుల గురించి మాట్లాడటం లేదు. మనం మాట్లాడేది మామూలు మనుష్యుల గురించి. మామూలు మనుష్యులకు చిత్తశుద్ధి కలగాలంటే, దానికి సన్న్యాసాశ్రమం ఆదర్శంగా ఉండదు అంటున్నాము అంతే.

కాని సన్న్యాసాశ్రమంవల్ల లాభం ఏమిటి? సన్న్యాసాశ్రమం జ్ఞానయోగానికి ఆదర్శవంతమైన జీవన విధానం. అతనికి బాదరబందీలు లేవు, రణగొణ ధ్వనులు లేవు. గృహస్థుకు జ్ఞానయోగం కష్టమైనా, అసాధ్యం కాదు అనీ, ఎలాగోలా నేర్చుకోవచ్చు అనీ చూశాము. అలాగే సన్న్యాసికి కర్మయోగం కష్టమైనా, అసాధ్యం కాదు. అతను యజ్ఞాలు చేయలేడు, జపాలు చేయలేడు, సంధ్యావందనం చేయలేడు. తద్వారా చిత్తశుద్ధి పొందలేడు నిజమే. కాని అతను గురు–శుశ్రూష చేయవచ్చు, లేదా ఆశ్రమంలో ఏదైనా సేవ చేయవచ్చు.

రెండు మార్గాలనూ మళ్ళీ బేరీజు వేస్తే, గృహస్థు సునాయాసంగా కర్మయోగాన్ని పాటించగలడు కాని జ్ఞానయోగానికి కష్టపడాలి; సన్న్యాసి కర్మయోగానికి కష్టపడాలి కాని జ్ఞానయోగాన్ని తేలికగా పాటించగలడు. ఆ విధంగా, ఈ రెండు మార్గాల్లోనూ వాటికుండే కష్టనష్టాలు వాటికున్నాయి.

3. **గృహస్థాశ్రమం + సన్న్యాసాశ్రమం** – ఈ జీవన విధానంలో ఒక వ్యక్తి ముందు గృహస్థాశ్రమం స్వీకరించి, కొన్నాళ్ళ తరువాత సన్న్యాసాశ్రమాన్ని స్వీకరిస్తాడని చూశాము. అతను కూడా కర్మయోగం, జ్ఞానయోగం పాటించితీరాలి. ఇతను కొన్నాళ్ళు గృహస్థుగా ఉంటాడు కాబట్టి, కర్మయోగం పాటించటం తేలిక. వనరులు కూడా ఉంటాయి. కాని గృహస్థాశ్రమంలో జ్ఞానం పొందటం కష్టం. రోజంతా కష్టపడి పని చేశాక, ఎవరికైనా చదవాలనిపిస్తుందా? ఒకవేళ చదవాలనిపించినా ఏ స్టార్‌డస్టో, ఏదైనా వారపత్రికో చదువుతాడు. అంతేకాని మెదడు వేడెక్కే ఆధ్యాత్మికతకు పోడు. అదీ కాదంటే టీవీ ప్రోగ్రామ్ కాసేపు చూసి నిద్రపోతాడు. వారాంతంలో అసలే శాస్త్రాన్ని నేర్చుకోలేడు. వారాంతం

పదంలోనే ఉంది అది మీ శక్తిని అంతం చేస్తుంది. ఆ విధంగా కర్మయోగికి చదివే తీరికా ఉండదు, చదవాలనే తపనా ఉండదు. రెండూ ఉంటే ఏకాగ్రత చూపలేడు.

గృహస్థాశ్రమంనుంచి అతను సన్యాసాశ్రమం స్వీకరిస్తాడు కాబట్టి అతనికి ఏ సమస్యా ఉండదు. కుటుంబం లేదు, బంధాలు లేవు, ధనం లేదు, పాలసీలు లేవు, బెంగలు లేవు. ఉన్న సమయాన్నంతా వేదాంతబోధకే వినియోగించవచ్చు. ఈ విధంగా చూస్తే ఈ మూడవ మార్గం బాగుంది. ఇతను రెండు ఆశ్రమాలనూ స్వీకరిస్తాడు కాబట్టి రెండింటిలో ఉన్న లాభాలనూ ఒడిసి పుచ్చుకుంటాడు. కర్మయోగం అద్భుతంగా పాటించి, జ్ఞానయోగానికి వచ్చి అది కూడా అద్భుతంగా నేర్చుకుంటాడు.

**బ్రహ్మచర్యాత్ గృహీభవతి, గృహీభూత్వా వనీ భవతి, వనీ భూత్వా ప్రవృజతి**

ఇది ఈ మూడు విధానలలోకి శ్రేష్ఠమైనది. మరయితే ఇందులో ఏమిటి సమస్య?

గృహస్థాశ్రమంలోకి అడుగుపెట్టటం తేలికే కాని, దాన్నుంచి బయటపడటమే కష్టం. అది అభిమన్యుడు పద్మవ్యూహంలో ఇరుక్కుపోయినట్టుగా అవుతుంది. గృహస్థాశ్రమంనుంచి బయటపడటానికి చాలా గట్టి సంకల్పం కావాలి.

**కృతిమహోదధౌ పతనకారణం ఫలమశాశ్వతం గతినిరోధకమ్** – ఉపదేశసారం

కర్మకాండ ఒక ఊబి. అందులోకి దిగితే, దాన్నుంచి బయటకు రావటం చాలా కష్టం. ఈ విషయంలో ఒక వ్యక్తి అనుభవాన్ని మనతో పంచుకుంటున్నారు స్వామీజీ.

అతనేదో వ్యాపారం చేస్తున్నాడు. అతనికి ముగ్గురు ఎదిగిన కొడుకులు ఉన్నారు. ముగ్గురూ వ్యాపారంలో మెళకువలు నేర్చుకుని, తండ్రికి చేదోడు వాదోడుగా తండ్రి వ్యాపారంలోకే అడుగుపెట్టారు. తండ్రికి 65 సంవత్సరాలు వచ్చాయి. పిల్లలు వ్యాపారాన్ని బాగా అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. అందువల్ల వారు తండ్రిని ఇంక వ్యాపారంనుంచి విరమించుకుని నిశ్చింతగా విశ్రాంతజీవనం గడపమని కోరారు. చీకూచింత లేకుండా, కృష్ణా రామా అనుకోండి లేదా స్వామీజీ క్లాసులకు వెళ్ళండి అన్నారు ముకుమ్మడిగా. అయినా ఆయన వినేవాడు కాదు.

వ్యాపారంలో అడుగడుగునా ఆయన కల్పించుకుంటూ ఉండేవాడు. పిల్లలు ఏం చేస్తున్నారో చూస్తూ, అడుగడుక్కీ వారి నిర్ణయాలను ఖండించటమో, వారికి మధ్యలో దూరి అయాచితంగా సలహాలివ్వటమో చేసేవాడు. ఎదిగిన పిల్లలు, వ్యాపారంలో దిట్టలు, ఇది భరించలేకపోయేవారు. వారు ఒకసారి స్వామీజీ దగ్గరకి వచ్చి, 'స్వామీజీ, మానాన్నను వ్యాపారంనుంచి తప్పుకోమనీ, మా విషయంలో తల దూర్చవద్దనీ చెప్పండి,' అని విన్నవించుకున్నారు. స్వామీజీతో తండ్రి కూడా ఒప్పుకున్నాడు, 'నిజమే స్వామీ, నాకూ

వదిలేయాలనే ఉంది.' చివరికి ఎలాగైతేనే ఒక దీక్ష తీసుకున్నాడు. దానికి ప్రతీకగా గడ్డం కూడా పెంచసాగాడు.

జనవరినుంచి ఇంక వ్యాపారం మానేస్తాను అన్నాడు. 'నేను వ్యాపారవిషయంలో కలగజేసుకోను. నా పిల్లలకు సలహాలు ఇవ్వను. ఇంక ఏవీ పట్టించుకోను, నా ఇంట్లోనే నేను అతిథిగా ఉంటాను.' అన్నాడు. జనవరి రానే వచ్చింది. అతనూ మానేసాడు. ఏం మానేశాడో తెలుసా? క్లాసులకు రావటం మానేశాడు. క్లాసులకు రావటం మానేయటం వల్ల అతనికేమయిందో తెలియదు. వేరే ఇల్లు మారాడో, వేరే ఊరు వెళ్ళాడో తెలియదు. కొన్నాళ్ళయ్యాక అతను మరణించాడని తెలిసింది.

ఇదంతా స్వామీజీ ఎందుకు చెప్పారు అంటే మనస్సు అంత తేలికగా ప్రవృత్తిమార్గం నుంచి నివృత్తిమార్గంలోకి రాలేదు. ఆ వ్యక్తికి సమర్థవంతమైన పిల్లలు ఉన్నారు, వ్యాపారం బాగానే నడుస్తున్నది, ఏ విధమైన బెంగా లేదు – అయినా అతను ఎంతగా ప్రవృత్తి మార్గంలో కూరుకుపోయాడంటే దానినుంచి అంత తేలికగా బయటపడలేకపోయాడు. పిల్లలు వద్దన్నారు. అతనూ ఆపుదామనే అనుకున్నాడు కాని అతనివల్ల కాలేదు. ఇలాంటి వారిని వర్క్‌హాలిక్స్ అంటారు. మందుకు బానిసలయిన వారిని ఆల్కహాలిక్స్ అంటే, కర్మకు బానిసలయినవారిని వర్క్‌హాలిక్స్ అంటారు. అందువల్ల ఈ మూడవ మార్గంలోని సమస్య, గృహస్థాశ్రమంనుంచి సన్న్యాసాశ్రమానికి రాలేకపోవటం.

కాని ఎవరికైనా గృహస్థాశ్రమంలోకి ఎలా అడుగుపెట్టాలో, ఎలా మళ్ళీ దానినుంచి తెలివిగా సన్న్యాసాశ్రమంలోకి మారాలో తెలిస్తే, ఈ మూడవ మార్గాన్ని మించిన మంచి మార్గం ఇంకొకటి లేదు. మూడవ మార్గం కుదరకపోతే, మొదటి మార్గం ఎన్నుకోమంటున్నాడు కృష్ణపరమాత్మ. గృహస్థాశ్రమం ఎన్నుకోండి, కర్మయోగం పాటించండి, చిత్తశుద్ధి పొందండి, గృహస్థాశ్రమంలోనే కొనసాగుతూ ఆంతర సన్న్యాసం పొందండి, జ్ఞానయోగం పాటించండి. బాహ్యంగా సన్న్యాసం స్వీకరించలేకపోతే ఆంతర సన్న్యాసం స్వీకరించగలగాలి.

ఆ విధంగా మూడు జీవనవిధానాలు ఉన్నాయి. ఈ మూడింటిలో ఏది శ్రేష్ఠం అని అడిగితే, ఇదే శ్రేష్ఠమని అందరికీ సమానంగా చెప్పలేము. ఎందుకంటే అందరి మనస్తత్వం ఒక్కలాగా ఉండదు. కొంతమంది పిల్లలకు ఫలానా స్కూల్లో చేరాలని ఉంటే, అందర్నీ వెళ్ళి అదే స్కూల్లో చేరండి, అందరూ మూడవ క్లాసులో చేరండని చెప్పలేము. ఒక పిల్లవానికి నాలుగవ తరగతిలో చేరే అర్హత ఉంటే, ఇంకొక పిల్లవాడికి రెండవ తరగతిలో చేరేందుకు అర్హత ఉండవచ్చు. అందువల్ల అందరికీ ఒకటే సలహా కుదరదు. మనిషి మనిషికీ సలహా మారుతుంది. దీన్నే అధికారిభేదం అంటారు.

ఈ అధికారిభేదం అర్థంకాకపోతే, హిందూమతం చాలా అయోమయంగా ఉన్నట్టు అనిపిస్తుంది. ముందే చూసినట్టుగా గీతలోనే అలా అయోమయంలో పడవేసేటట్టుగా ఉన్న శ్లోకాలు ఉన్నాయి. నీ ప్రాణం పోయినా సరే నీ ధర్మాన్ని త్యజించవద్దు అని ఒకచోట చెబితే, నీ ధర్మాలన్నీ పరిత్యజించు అని ఇంకొకచోట బోధించాడు కృష్ణపరమాత్మ. పైపైన వినేవారికి, అర్జునుడు అయోమయంలో పడలేదు. కృష్ణపరమాత్మే అయోమయంలో పడ్డాడు అనిపిస్తుంది. అలాగే ఉపనిషత్తు వాక్యాల్లో కూడా భిన్నభావాలు వస్తాయి.

**ప్రజా చ స్వాధ్యాయ ప్రవచనే చ। ప్రజనశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ।**

**ప్రజాతిశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ** – తైత్తిరీయమ్ 1.9.1

పెళ్ళి చేసుకోండి, పిల్లలను కనండి, వారి పెళ్ళి చేసి మనవళ్ళను పొందండి అంటుంది తైత్తిరీయమ్.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః** – మహానారాయణమ్

అంటే వేదం ఏం చెప్పదలుచుకుంది? పెళ్ళి చేసుకుని పిల్లలను కనాలా? లేక సర్వం పరిత్యజించాలా? వైదికబోధ అందరికీ ఒక్కలాగే ఉండదు అనే ప్రాథమిక సూత్రం తెలియకపోతే వేదం అయోమయంలో పడేసినంతగా వేరే ఏ గ్రంథమూ పడేయదు. కొంతమంది అంటారు, 'మనకు కూడా క్రైస్తవమతంలోలాగా టెన్ కమాండ్‌మెంట్స్ ఇచ్చి వదిలేసి ఉండవచ్చు కదా! ఎందుకు ఇంత అయోమయంలో పడవేస్తున్నది శాస్త్రం?'

మన మతంలో అలా టెన్ కమాండ్‌మెంట్స్ లేవు. ఎందుకంటే మనుష్యులు భిన్నంగా ఉంటారు. అందరికీ ఒకటే సూత్రం చెల్లదు. కృష్ణపరమాత్మ అర్జునునికి భగవద్గీతలో మొదటి జీవనవిధానాన్ని సూచిస్తున్నాడు. ఏమిటది? గృహస్థుగా ఉండి, కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, గృహస్థాశ్రమంలోనే కొనసాగి, ఆంతర వైరాగ్యం పెంచుకుని, జ్ఞానయోగం పాటించి, మోక్షం పొందాలి. మోక్షం పొందాక కూడా, గృహస్థాశ్రమంలోనే కొనసాగి, చేయాల్సిన కర్తవ్యకర్మలు చేయాలి. ఈ సలహా కృష్ణపరమాత్మ అందరికీ ఇచ్చాడు అనకూడదు. ఇది అర్జునునికీ, అర్జునుని మనస్తత్వం ఉన్నవారికీ చెందుతుంది.

'లేదు, నేను సన్న్యాసం స్వీకరించగలను,' అని ఎవరైనా భావిస్తే అతను గృహస్థాశ్రమంలో ఉండి, కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొంది, సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించి, జ్ఞానయోగం పాటించి, మోక్షం పొందవచ్చు. ఇంకా ఒక స్థాయి ఎక్కువ ఉన్నవ్యక్తి గృహస్థాశ్రమంలోకి కూడా అడుగుపెట్టకుండా, సరాసరి సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించి సన్న్యాసాశ్రమంలోనే గురుశుశ్రూష చేసి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగం పాటించి, మోక్షం పొందవచ్చు.

కాని కృష్ణపరమాత్మ బోధిస్తున్నది అర్జునునికి కాబట్టి అతనికి మొదటి జీవనవిధానాన్నే సూచించాడు కృష్ణపరమాత్మ.

2. **యోగద్వయం: శ్లోకాలు 7-21**

ఇంతవరకూ నిష్ఠాద్వయం చూశాము. నిష్ఠ అంటే జీవనవిధానం. మనం మూడు విధానాలు చూశాము ఇంతవరకూ. కృష్ణపరమాత్మ రెండింటి గురించి ఎక్కువగా చెబుతాడు అది గృహస్థాశ్రమంలోనే ఉంటూ కర్మయోగం, జ్ఞానయోగం పాటించటం; గృహస్థాశ్రమంలో ఉండి కర్మయోగం, సన్న్యాసాశ్రమానికి వచ్చి జ్ఞానయోగం పాటించటం.

యోగం అంటే సాధన. నిష్ఠ విషయంలో ఎన్నుకునే అవకాశం ఉంది కాని, యోగం విషయంలో లేదు. ఈ యోగద్వయంలో కృష్ణపరమాత్మ చేసిన బోధ సారాంశం – ఈ జీవనవిధానాల్లో ఏదైనా ఎన్నుకోండి; కాని ఏ విధానాన్ని ఎన్నుకున్నా, దానిలో కర్మయోగం మొదట పాటించితీరాలి. తర్వాతనే జ్ఞానయోగానికి రావాలి.

**సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।**
**ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విందతే ఫలమ్ ॥** – 5.4

**యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే ।**
**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥** – 5.5

సన్న్యాసాశ్రమం, గృహస్థాశ్రమం వేర్వేరు ఫలాలనిస్తాయని పరిపక్వత చెందనివారు అంటారు కాని పండితులు అనరు. అందువల్ల ఏదో ఒకటి ఎన్నుకో; ఎందులో ఉన్నా రెండింటికీ సమాన ఫలమైన జ్ఞానాన్ని పొందుతావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

సన్న్యాసులు పొందే మోక్షం, గృహస్థులు పొందే మోక్షం రెండూ ఒకటే. ఆ విషయం ఎవరైతే అర్థం చేసుకుంటారో, అతనే యథార్థాన్ని గ్రహిస్తాడు.

మూర్ఖులే సాంఖ్యనిష్ఠాఫలం వేరు, యోగనిష్ఠాఫలం వేరు అనుకుంటారు. ఎందుకంటే వారు వాడే మార్గాలు భిన్నంగా ఉంటాయి కాబట్టి. మార్గాలు వేరైనా, వారి అంతిమలక్ష్యం ఒకటే. సాంఖ్యులు పొందే అంతిమఫలాన్ని, యోగులు కూడా పొందుతారు. ఎవరైతే సాంఖ్యులు, యోగులు ఒకటే ఫలాన్ని పొందుతారని అర్థం చేసుకుంటారో, వారే సరిగ్గా అర్థంచేసుకున్నట్టు అర్థం.

సాంఖ్యనిష్ఠ (నివృత్తిమార్గము) అంటే సన్న్యాసజీవనవిధానం, యోగనిష్ఠ (ప్రవృత్తిమార్గం) గృహస్థజీవనవిధానం. ఈ రెండింటిలో ఏ మార్గం ఎన్నుకున్నా కూడా చిత్తశుద్ధి పొంది, మోక్షం పొందాలి. అంటే జీవనవిధానాలు వేరు కాని, ఇద్దరికీ సాధన ఒకటే. జ్ఞానయోగం పొందటానికి కావాల్సిన దశలు ఏమిటి?

**యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।**
**సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥** – 5.7

కర్మయోగి అయి, శుద్ధమైన మనస్సు కలిగి, శరీరాన్ని జయించిన వ్యక్తి జ్ఞానయోగిగా మారతాడు. ఈ ఆత్మ అన్ని శరీరాల్లోనూ ఉందని గ్రహిస్తాడు. కాబట్టి అతను కర్మ చేస్తున్నా, దానివల్ల చలించడు.

ఒక గృహస్థు, తన గృహస్థాశ్రమ ధర్మాలను నెరవేర్చటం ద్వారా తన మనస్సును శుద్ధి పరచుకుంటే, ఒక సన్న్యాసి సన్న్యాసాశ్రమ ధర్మాలను నెరవేర్చటం ద్వారా మనస్సును శుద్ధి పరుచుకుంటాడు. సన్న్యాసికి నిత్యకర్మలు – ఓంకారజపం, మహావాక్యజపం; అతనికి యజ్ఞాలు– భాష్యపారాయణం, ఉపనిషత్తుల పారాయణం, గురుశుశ్రూష. అందువల్ల ఏ జీవనవిధానాన్ని ఎన్నుకున్నా కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొందాలి. చిత్తశుద్ధి పొందాక చిత్తఏకాగ్రత పొందాలి. ఆర్జవం పాటించాలి. మనోవాక్కాయ కర్మలు ఒక్కత్రాటి మీద నడవాలి. అది గృహస్థు అయినా సరే, సన్న్యాసి అయినా సరే. దానికి పతంజలి అష్టాంగయోగం తోడ్పడుతుంది.

**సర్వభూతాత్మభూతాత్మా** – దాని తర్వాత గృహస్థు కానీ, సన్న్యాసి కానీ ఒక శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువును సమీపించి, ఆత్మజ్ఞానం పొందాలి. జ్ఞానం పొందితే కాని జ్ఞాని అవరు. గృహస్థు, గృహస్థజ్ఞాని అయితే; సన్న్యాసి, సన్న్యాసజ్ఞాని అవుతాడు. అందువల్ల వారికి మోక్షానిచ్చేది వారి ఆశ్రమధర్మం కాదు, వారి జ్ఞానం.

ఒక జ్ఞానం పొందిన గృహస్థునూ, గురువు దగ్గరకు వెళ్ళి జ్ఞానం పొందని సన్న్యాసినీ తీసుకోండి. సన్న్యాసి సంసారిగానే ఉంటాడు, గృహస్థు ముక్తపురుషుడవుతాడు. అందువల్ల ఏ ఆశ్రమంలో ఉన్నారనేది కాదు ముఖ్యం, జ్ఞానం పొందారా లేదా అనేది ముఖ్యం. ఈ రెండు రకాల జీవనవిధానం గురించి కృష్ణపరమాత్మ మూడవ అధ్యాయంలోనే బోధించాడు.

**లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥** – 3.3

నేను పూర్వం రెండు రకాల జీవనవిధానాల గురించి చెప్పాను. అవి సన్న్యాసమార్గం, కర్మమార్గం.

ఈ విధంగా రెండు జీవనవిధానాలు ఉన్నాయి. మీ మానసిక పరిపక్వతకు తగ్గట్టుగా ఏ జీవనవిధానాన్ని అయినా ఎన్నుకోండి కాని జ్ఞానం పొంది, మోక్షం పొందండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లోకాలు 8–21 వరకూ కృష్ణపరమాత్మ సాధన కింది రెండు యోగాల గురించి వివరిస్తున్నాడు. అవి కర్మయోగం, జ్ఞానయోగం. కర్మయోగం గురించి మూడవ అధ్యాయంలోనూ, జ్ఞానయోగం గురించి నాలుగవ అధ్యాయంలోనూ వివరించాడు. ఇక్కడ

మళ్ళీ వాటి గురించి చెబుతున్నాడు. అందువల్ల ఐదవ అధ్యాయం మూడు, నాలుగు అధ్యాయాల సారాంశం.

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥** – 5.10

**కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥** – 5.11

తన ఉన్నతస్థితిని కనుగొనేవరకు ఈశ్వరార్పణబుద్ధితో కర్మలు చేస్తే ఏ పాపమూ అతన్ని అంటదు. అతను తామరాకుమీద నీటిబొట్టులా ఉంటాడు.

ఇంద్రియాల ద్వారా కర్మయోగులు కాయిక, వాచిక, మానసకర్మలు ఈశ్వరార్పణబుద్ధితో చేస్తారు. ఫలితం గురించిన ఆందోళన ఉండదు. వారు చిత్తశుద్ధికోసం కర్మలు చేస్తారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి కర్మయోగాన్ని పాటించమంటున్నాడు. కర్మలు చేస్తే, ఆ కర్మలు బంధించవా అంటే కర్మలు వాటంతట అవి బంధించవు. వాటిని చేసే మీ దృక్పథంమీద ఆధారపడివుంటాయి అవి. మీరు చేసే కర్మను ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే, ఆ కర్మ యోగంగా మారుతుంది. అంటే ఆ కర్మ బంధించదు. కర్మను ఒకవేళ ఈశ్వరార్పణబుద్ధితో చేయకపోతే, అదే కర్మ బంధంలో పడవేస్తుంది.

**యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥** – 5.12

కర్మఫలం గురించిన చింతను వదులుకోవటం ద్వారా కర్మయోగి శాంతి పొందుతాడు. దానికి భిన్నంగా కేవలకర్మకుడు ఫలంమీద ఆశ కొద్దీ సంసారంలో కూరుకుపోతాడు.

అందువల్ల బంధించేది కర్మ కాదు, కర్మ చేసే దృక్పథం. అందువల్ల దృక్పథాన్ని మార్చుకుని, కర్మను కర్మయోగంగా మలచుకోవాలి. ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి. కాని కర్మయోగంతో ఆగిపోకూడదు. తరువాత దశకు ఎదగాలి.

**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥** – 5.8

**ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్ నిమిషన్నపి ।**
**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥** – 5.9

జ్ఞాని చూస్తున్నా, వింటున్నా, స్పర్శిస్తున్నా, వాసన చూస్తున్నా, రుచి చూస్తున్నా, నడుస్తున్నా, నిద్రిస్తున్నా, శ్వాస పీలుస్తున్నా, మాట్లాడుతున్నా, విసర్జనక్రియ చేస్తున్నా, తీసుకుంటున్నా,

కళ్ళార్పుతున్నా, ఇంద్రియాలు వాటి విషయవస్తువులతో వర్తిస్తున్నాయని, ఆత్మస్వరూపమైన తానేమీ చేయటం లేదని జ్ఞాని అర్థం చేసుకుంటాడు.

ఈ శ్లోకంలో జ్ఞానయోగం పాటించిన జ్ఞాని ఎలా ప్రవర్తిస్తాడో వస్తుంది. అతను చూస్తున్నా, వింటున్నా, మాట్లాడుతున్నా, వాసన చూస్తున్నా, ఊపిరి పీలుస్తున్నా – ఏం చేస్తున్నా నేను ఏమీ చేయటం లేదు అంటాడు. అంతకుముందే చూశాము, ఆత్మ అంటే శరీరం కాదు, ఆత్మ అంటే శరీరీ – అంటే శరీరంలో ఉన్నది.

**సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్ ॥** – 5.13

**న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।**
**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥** – 5.14

**నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।**
**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥** – 5.15

**జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।**
**తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥** – 5.16

తొమ్మిది ద్వారాలున్న పురంలో పురస్వామిగా ఉన్నాడు జ్ఞాని. ఆత్మ ఏ పనీ చేయదు, ఎవరిచేతా చేయించదు.

ఆత్మ కర్మ చేయదు, కర్తృత్వాన్ని సృష్టించదు. కర్మను సృష్టించదు, కర్మఫలాన్ని కూడా సృష్టించదు. మనశ్శరీరాలు పనిచేస్తాయి. అది వాటి స్వభావం.

ఆత్మకు పాపం అంటదు, పుణ్యం కూడా అంటదు. మీ ఉన్నత స్వరూపం గురించిన జ్ఞానం లేకపోవటంవల్ల జంతువులలాగా మళ్ళీ మళ్ళీ పుడుతున్నారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

జ్ఞానం మాత్రమే ఆ అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. ఆత్మజ్ఞానం పొందితే, జ్ఞానం మీ ఉన్నతస్థితిని ప్రకాశింపజేస్తుంది.

అజ్ఞాని 'నేను శరీరాన్ని,' అనుకుంటాడు. అందువల్ల అతను నిరంతరం బాధల్లో కూరుకుపోతాడు. దానికి కారణం చూశాము. అజ్ఞానికి సమస్య అజ్ఞానం. అజ్ఞానంవల్ల అపూర్ణత్వం అనుభవిస్తాడు. అపూర్ణత్వం కామానికీ, కామం కర్మకూ, కర్మ పుణ్యపాపాలకూ, పుణ్యపాపాలు సుఖదుఃఖాలకూ, సుఖదుఃఖాలు పునరపి జననం, పునరపి మరణానికీ దారితీస్తాయి. దీన్నే సంసారం అంటారు.

**అజ్ఞానం → అపూర్ణత్వం → కామం → కర్మ → పుణ్యపాపాలు → సుఖదుఃఖాలు → పునరపి జననం, పునరపి మరణం = సంసారం.**

జ్ఞానికి తను చైతన్యం అని తెలుసు. తను శరీరం కాదు, శరీరంలో ఉన్న చైతన్యం అని తెలుసు. చైతన్యంగా తను అకర్తా, అభోక్తా అనీ, తను పూర్ణుడనీ తెలుసు. అందువల్ల అతను కొత్తగా కోరాల్సింది ఏమీలేదు.

**జ్ఞానం → అపూర్ణత్వ నాస్తి → కామ నాస్తి → కర్మ నాస్తి → పుణ్యపాప నాస్తి → సుఖదుఃఖ నాస్తి → పునరపి జననం, పునరపి మరణం అపి నాస్తి = మోక్షం**

అందువల్ల జ్ఞాని సంసారంనుంచి విడివడి మోక్షం పొందుతాడు. జ్ఞాని మోక్షాన్ని పొందుతాడు అంటే అతను గృహస్థజ్ఞాని అవవచ్చు, సన్న్యాసజ్ఞాని కూడా అవవచ్చు. అతను గృహస్థుగా ఉండి, అనేక కర్మలు చేస్తూ ఉండవచ్చు కాని, ఆ కర్మలు మనశ్శరీరాలకు చెందుతాయని ఆత్మయైన తనకు కాదని అర్థం చేసుకుంటాడు.

**నైవకించిత్ కరోమి** – నేను కొంచెం కూడా చేయటం లేదని తెలుసు. సన్న్యాసి కూడా ఇవే మాటలు పలుకుతాడు. **అహం ఆత్మా నైవ కించిత్ కరోమి.** గృహస్థ ఆత్మకూ, సన్న్యాస ఆత్మకూ మధ్య భేదం లేదు. ఒకవేళ భేదం ఉంటే మళ్ళీ దాన్ని మార్చాలి!

**జాతినీతికులగోత్రదూరగం నామరూపగుణదోషవర్జితమ్ ।**
**దేశకాలవిషయాతివర్తి యద్బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని ॥** – వివేక చూడామణి 255

ఆత్మకు జాతివర్ణాశ్రమాలు లేవు.

**న వర్ణా న వర్ణాశ్రమాచారధర్మా న మే ధారణాధ్యానయోగాదయోఽపి।**
**అనాత్మాశ్రయోహంమమాధ్యాసహానాత్ తదేకోఽవశిష్టః శివః కేవలోఽహమ్॥** దశశ్లోకీ 2

అందువల్ల గృహస్థ, సన్న్యాసి – ఇద్దరూ కూడా పూర్ణత్వాన్ని సమానంగా అనుభవిస్తారు.

అందువల్ల కృష్ణపరమాత్మ అంటున్నాడు, 'అర్జునా! నువ్వు గృహస్థాశ్రమాన్ని వదలనవసరం లేదు. గృహస్థుగా ఉండి, యుద్ధం చేయి. కాని జ్ఞానం పొంది, మోక్షాన్ని పొందు.'

(కృష్ణపరమాత్మ ఇలా ఎందుకు చెప్పాడు? కృష్ణపరమాత్మ బోధ చేస్తున్న సందర్భాన్ని మర్చిపోకూడదు. ఈ బోధ యుద్ధభూమిలో జరుగుతున్నది. అర్జునుడు అవకాశం దొరికితే యుద్ధభూమినుంచి పారిపోయి, సన్న్యాసం స్వీకరించాలనే భావనలో ఉన్నాడు.)

ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలాన్ని కూడా వివరిస్తున్నాడు.

**విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥** – 5.18

జ్ఞాని బ్రాహ్మణుడు, ఆవు, ఏనుగు, కుక్క, కుక్కమాంసం తినేవ్యక్తి – అందరిలోనూ ఆత్మను దర్శిస్తాడు.

తరువాత కృష్ణపరమాత్మ ఇలా చెబుతాడు.

**న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ ।**
**స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః ॥** – 5.20

జ్ఞాని మంచి జరిగినా పొంగిపోడు, అప్రియం జరిగినా కృంగిపోడు; నిస్సంశయజ్ఞానంలో నెలకొని ఉంటాడు. అటువంటి జ్ఞాని జీవన్ముక్తుడు.

ఐదవ అధ్యాయంలో కొన్ని అద్భుతమైన శ్లోకాలను చూస్తాము. ఇది అవటానికి చాలా చిన్న అధ్యాయమే అయినా, కేవలం 29 శ్లోకాలే ఉన్నా, ఇది ఒక సంపూర్ణ అధ్యాయం. **సర్వత్ర సమదర్శినః** – ఈ ఆత్మజ్ఞానం పొందటంవల్ల కలిగే ఫలం సర్వత్ర సమదర్శనం అంటున్నాడు కృష్ణపరమాత్మ. సర్వత్ర సమదర్శనం అంటే అందరినీ సమానంగా చూడటం. అందరినీ సమానంగా చూడటం అంటే రాగద్వేషాలు లేకపోవటం.

రాగద్వేషాలు ఎందుకు ఏర్పడతాయి? ఎందుకంటే ప్రపంచం ఆనందహేతువు అనే ప్రాథమిక పొరపాటువల్ల. ఒక వస్తువు నాకు ఆనందాన్నిస్తుంది అనే భావనవల్ల రాగం ఏర్పడుతుంది. ద్వేషం కూడా పొరపాటువల్లే కలుగుతుంది. ఇంకొక వస్తువు దుఃఖాన్నిస్తుంది అనే భావనవల్ల ద్వేషం కలుగుతుంది.

**సుఖహేతుం ప్రతి రాగః దుఃఖహేతుం ప్రతి ద్వేషః**

ఈ రెండూ కూడా ప్రపంచం సుఖాన్ని లేదా దుఃఖాన్ని కలుగజేస్తుంది అనే పొరపాటువల్ల కలిగేవే.

వేదాంతం అది పెద్ద పొరపాటు అంటుంది. ప్రపంచం దానంతట అది సుఖాన్నీ ఇవ్వదు, దుఃఖాన్నీ ఇవ్వదు అంటుంది. అవి రెండూ మనం దానికి ఇచ్చిన బిరుదులు మాత్రమే. మన అజ్ఞానంవల్ల మనం పడుతున్న పొరపాటు. నిజానికి ప్రపంచంలో ఏదీ దుఃఖహేతువూ కాదు, సుఖహేతువూ కాదు.

ఒక ఇంట్లో పిల్లలు పాశ్చాత్యసంగీతం వింటూ కేరింతలు కొడితే, అదే ఇంట్లో పెద్దలు కర్ణాటక సంగీతాన్ని వీనులవిందుగా ఉందని ఆస్వాదిస్తారు. పిల్లలకు మైకేల్ జాక్సన్ అంటే ఇష్టం, పెద్దలకు త్యాగరాజు అంటే ఇష్టం. ఇప్పుడు చెప్పండి – సంగీతం ఆనంద హేతువా, దుఃఖహేతువా? కుటుంబం ఒక్కటే, సంగీతం ఒక్కటే కాని ఒకే సంగీతం ఒకరిని కేరింతలు కొట్టిస్తే, ఇంకొకరికి చిరాకు పుట్టిస్తుంది.

ఎవరో స్వామీజీతో అన్నారుట, 'స్వామీజీ నేను మీ క్లాసులు అర్థం అయినా కాకపోయినా ఎందుకు వస్తానంటే, నాకు మా ఇంటినుంచి పారిపోవాలని ఉంటుంది. ఆ ఇంట్లో నేను ఒక్కక్షణం కూడా ఉండలేను. ఇంక శని, ఆదివారాలు వస్తే ఇల్లొక నరకమే. ఒకరు గట్టిగా సినిమా పెడితే, ఇంకొకరు పాటలతో హోరెత్తిస్తారు.' ఇప్పుడు చెప్పండి, సంగీతం సుఖహేతువా, దుఃఖహేతువా? సంగీతం, దానంతట అది సుఖాన్నీ ఇవ్వదు, దుఃఖాన్నీ ఇవ్వదు. అది మీ దృక్పథాన్నిబట్టి ఉంటుంది. జ్ఞాని విషయంలో ఈ సమస్య ఎదురవదు. ఎందుకంటే అతను, తన స్వరూపమే ఆనందస్వరూపం అని అర్థం చేసుకుంటాడు.

అతనే మూర్తీభవించిన ఆనందం కాబట్టి, ప్రపంచం అతని ఆనందాన్ని ఎక్కువా చేయలేదు, తక్కువా చేయలేదు. అతనికి రాగద్వేషాలు ఉండవు. అందువల్ల –

**న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్** – 5.20

అతను ప్రియాన్ని పొందినా పొంగిపోడు, అప్రియాన్ని పొందినా కృంగిపోడు. ఈ సమత్వం, ఈ శాంతి, ఈ సమదర్శనం జ్ఞాని పొందే ఫలం. ఇదే జీవన్ముక్తి.

### 3. సాధనలు: శ్లోకాలు 22–29

ఈ భాగంలో కృష్ణపరమాత్మ నాలుగు ముఖ్యమైన సాధనల గురించి చెబుతున్నాడు. నిజానికి ఇంకా కొన్ని సహకారీ సాధనలను సూచిస్తాడు కాని, ఈ ముఖ్యమైన సాధనలను చూద్దాము. అవి **కామక్రోధ జయం, శ్రవణం, మననం, నిదిధ్యాసనం.**

**1. కామక్రోధ జయం** – వీటిలో ఒకదాన్ని మూడవ అధ్యాయంలో చూసేశాము. అది కామక్రోధజయం.

**శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥** – 5.23

ఈ శరీరాన్ని విడవకముందే, అంటే జీవించి ఉండగానే ఎవరైతే కామక్రోధాల ప్రభావం నుంచి బయటపడతారో, అతనే నిజమైన యోగి. అతనే నిజమైన సుఖి.

కామక్రోధాలను జయించటం చాలా ముఖ్యం. ఎందుకంటే అవి జ్ఞానమార్గంలో వెళ్ళటానికి పెద్ద ఆటంకాలు.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥** – 3.37

రజోగుణంనుంచి పుట్టినదే కామం. అది క్రోధానికి దారితీస్తుంది. కోరికలకు అంతూపొంతూ ఉండవు. అవి పాపానికి దారితీస్తాయి. అందువల్ల ఈ కామక్రోధాలు నీ శత్రువులని తెలుసుకో అన్నాడు కృష్ణపరమాత్మ.

ఇక్కడ మళ్ళీ అటువంటి శత్రువును జయించాలని చెబుతున్నాడు. కామక్రోధాల గురించి చెప్పినా, కృష్ణపరమాత్మ కామాన్ని జయించటమెలాగో చెబుతాడు కాని క్రోధం గురించి ఎక్కడా చెప్పడు. ఎందుకంటే కోరిక తీరకపోతే క్రోధం వస్తుంది. అందువల్ల కామాన్ని జయిస్తే చాలు. కామాన్ని ఎలా జయించాలి? మూడవ అధ్యాయంలో మూడు మార్గాలు చెప్పాడు. అవి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం, వివేకం.

**ఇంద్రియనిగ్రహం** – మిమ్మల్ని ప్రలోభ పెట్టేటట్టుగా ఉన్నచోటికి వెళ్ళకండి. అక్కడికి వెళితే కదా మీకు ప్రలోభం కలుగుతుంది?

**మనోనిగ్రహం** – మీ మనస్సు అశుభవాసనలు పొందకుండా ఉండేలా చూడండి. వాటిని మొగ్గలోనే తుంచివేయండి.

**ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే** – 2.62

ఒక విషయం గురించి పదేపదే ఆలోచిస్తే, దానివైపు ఆకర్షింపబడతారు.

**ధ్యానమేవ మాస్తు – యది ధ్యానమపేక్షితం తర్హి ఈశ్వరధ్యానమస్సు ।**
**కిమర్థ విషయధ్యానం?** – మహాభారతం, శాంతిపర్వం

సంకల్పం ఉంటే కామం ఏర్పడుతుంది. అందువల్ల దాన్ని సంకల్పం దశలోనే త్రుంచి వేయండి. దీన్ని మనోనిగ్రహం అంటారు. మనోనిగ్రహం అంటే అశుభవాసనలను పారద్రోలి, శుభవాసనలను పెంపొందించుకోవటం. ఏదైనా వ్యసనంగా మారేటట్టుంటే, మంచి వ్యసనాన్ని పెంపొందించుకోండి. ఒకరోజు పూజ చేయకపోతే, ఏదో వెలితిగా ఉంటుంది. భగవద్గీత ఒక అధ్యాయమన్నా ఒకరోజు చదవకపోతే ఏదో పోగొట్టుకున్నట్టు ఉంటుంది. అవి మంచి వ్యసనాలే! వాటిని పెంపొందించుకోండి, తప్పులేదు.

**వివేకం** – వివేకం అంటే నిత్యానిత్యవస్తువివేకం. దీన్ని మూడవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ లోతుగా విశ్లేషించలేదు. అక్కడ చెప్పి వదిలేశాడు.

**ఇంద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే ।**
**ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥** – 3.40

ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి కామానికి నివాసస్థానాలు. వీటి ద్వారా జ్ఞానాన్ని కప్పివేసి, మోహంలో పడవేస్తున్నది.

ఈ ఐదవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ, వివేకం గురించి చర్చిస్తున్నాడు. వివేకబుద్ధి ఉన్న అతనికి విషయవస్తువు ఆనందహేతువు కాకపోగా, దుఃఖహేతువు అని తెలుస్తుంది. ఎందుకంటే ఆ వస్తువుకు మూడు దోషాలు ఉన్నాయి –

1. **దుఃఖమిశ్రితత్వం** – ఒక వస్తువు పొందటంలో దుఃఖం ఉంది, దాన్ని నిలబెట్టుకోవటంలో ఎక్కువ దుఃఖం ఉంది, అది పోతే ఇంకా ఎక్కువ దుఃఖం కలుగుతుంది.

**అర్జనే దుఃఖం ఆర్జితానాం చ రక్షణే దుఃఖం, అంతతః నాశే దుఃఖమ్ ।**

ఆ వస్తువుమీద నాకెంత మమకారం ఉంటే, దానికి తగ్గట్టే దుఃఖం ఉంటుంది.

**యే హి సంస్పర్శజా భోగా దుఃఖాయోనయ ఏవ తే**
**ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః** – 5.22

ఇంద్రియ విషయవస్తువులవల్ల కలిగిన భోగాలన్నీ సుఖాలుగా కనిపించినా, నిస్సందేహంగా అవి దుఃఖహేతువులే. వాటికి ఆది, అంతాలు ఉన్నాయి. అందువల్ల వాటిమీద ఆసక్తి చూపకు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

2. **అతృప్తికరత్వం** – ఎంత సంపాదించినా తృప్తిలేదు, అందువల్లనే కోట్లకు పడగలెత్తాలని చూస్తారు చాలామంది. దానికోసం మోసం చేయటానికి కూడా వెనుకాడరు. కాని అంత డబ్బుని పెట్టుకుని ఏం చేస్తారు? భోజనం చేయగానే, మళ్ళీ చేయగలరా? వారి కడుపు దాన్ని స్వీకరించలేదు. అసలు తినకపోయినా కడుపు భరించలేదు; అలాగని అతిగా తిన్నా కడుపు స్వీకరించలేదు. మహా అయితే నాలుగైదు చపాతీలో, దోశలో తినగలరు ఒకసారికి. అంతకన్నా తినాలనుకున్నా తినగలరా?

రాజసౌధం వంటి ఇల్లు ఉన్నాకూడా అన్ని గదుల్లో ఒకేసారి కూర్చోగలరా? ఒక సమయంలో ఒక గదిలోనే ఉండగలరు. పోనీ ఆ గదిలో కూడా ఆ గదిలో ఉన్న అన్ని సోఫాల్లో ఒకేసారి కూర్చోగలరా? లేదు! ఒకసారి ఒక సోఫాలోనే కూర్చోగలరు. అలాంటప్పుడు కోట్లరూపాయలను ఏం చేసుకుంటారు? కోట్లలో ఎన్ని సున్నాలు వస్తాయో అయినా తెలుసా? అంత సంపాదించినా, తృప్తి ఉంటుందా?

మహాభారతంలో యయాతి కథ చూస్తాము. అతను యౌవనంలో ఎన్నో సుఖాలలో మునిగితేలాడు. అయినా అతనికి తృప్తి తీరలేదు. అతనికి ఒక ప్రత్యేక వరం ఉంది. తన ముసలితనాన్ని ఎవరైనా యువకునితో మార్చుకోవచ్చు. వినటానికి ఎంత బాగుందో కదా! ఆ వరాన్ని వినియోగించుకుని, అలాగే యౌవనాన్ని తిరిగి పొందాడు. కాని చివరికి విసిగి వేసారి, 'ఎంత అనుభవించినా నాకు తృప్తిగా లేదు,' అని వాపోయాడు. అప్పుడొచ్చింది అతనికి వైరాగ్యం.

3. **బంధకత్వం** – ఆనందాల్లో మునిగి తేలినకొద్దీ, వాటికి బానిసలవుతారు. నిజానికి మీరు బంధకత్వంనుంచి స్వేచ్ఛవైపుకు అడుగులు వేయాలి. అంతకుముందు మీరు ఆనందంగా ఉండటానికి రెండు వస్తువులు కావాలంటే, ఇప్పుడదే ఆనందం పొందటానికి ఇరవై వస్తువులు

కావాలి. అంటే విజయం పొందుతున్నట్టా, వెనుకకి అడుగులు వేస్తున్నట్టా? మీరు విజయం పొందుతున్నారు అనుకుంటున్నారు కాని, వేదాంతం అది పెద్ద ఓటమి అంటున్నది. అంతకుముందు నిల్చోవటానికి ఒక కర్ర సరిపోయేది, ఇప్పుడు అనేక కర్రలు కావాలి అంటే కాళ్ళు శక్తి పుంజుకున్నట్టా, బలహీనమైనట్టా? బలహీనమైనట్టే!

**శ్వోభా వా మర్త్యస్య యదంతకైతత్ సర్వేంద్రియాణాం జరయంతి తేజః** – కఠ 1.26

తొమ్మిదేళ్ళ కుమారుడు ఈ మాట అన్నాడు కఠోపనిషత్తులో, సాక్షాత్తూ యమధర్మరాజుతో. మనకు తొంభయి ఏళ్ళకు వచ్చే జ్ఞానం, నచికేతునికి తొమ్మిదేళ్ళకే వచ్చింది. ఇంద్రియాల పట్టు తప్పుతుంది అన్నాడు.

ఈ మూడు దోషాలను అర్థం చేసుకున్నకొద్దీ, విషయవస్తువులమీద మీకు వైరాగ్యం పెరుగుతూ వస్తుంది. మీకేదైనా కావాలనివుంటే, ఒక్క సుఖమే కోరుకోవాలి.

**బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।**
**స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥** – 5.21

ఈ జ్ఞాని బాహ్యసుఖాలమీద ఆసక్తి చూపడు. అతను ఆత్మలోనే రమిస్తాడు. అందువల్ల అతను పూర్ణత్వం పొందుతాడు.

ద్రౌపది దగ్గర అక్షయపాత్ర ఉన్నట్టుగా జ్ఞానికి అక్షయపాత్ర ఉంటుంది. అది అతనికి అక్షయసుఖాన్ని ఇస్తుంది. అది ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తూనే ఉంటుంది. ఈ విధంగా కామాన్ని జయిస్తాడు.

**క్రోధజయం** – మరి క్రోధాన్ని జయించటమెలా? భగవద్గీత క్రోధజయాన్ని చర్చించదు. అంటే కృష్ణపరమాత్మకే తెలియదా క్రోధాన్ని ఎలా జయించాలో? కృష్ణం వందే జగద్గురుమ్! ఆయనకి తెలియనిదంటూ లేదు, మనమే ఆయన బోధను సరిగ్గా అర్థం చేసుకోవాలి. క్రోధం కామంవల్లనే పుడుతుంది. అందువల్లనే కృష్ణపరమాత్మ కామం, క్రోధం గురించి చెప్పినప్పుడు ఏకవచనం వాడాడు. వాటిని రెండుగా భావిస్తే ద్వివచనం వాడి ఉండేవాడు. (సంస్కృతంలో ద్వివచనం కూడా ఉంది.) కాని కామఏష, క్రోధఏష అన్నాడు. అంటే ఈ రెండూ ఒకటే అని అర్థం. కామం తీరకపోతే అది క్రోధంగా మారుతుంది. శంకరులవారు తన భాష్యంలో ఇలా రాస్తారు.

**స ఏష కామః ప్రతిహతః కేనచిత్ క్రోధత్వేన పరిణమతే। అతః క్రోధోఽపి ఏష ఏవ ।**

అందువల్ల కామాన్ని ఎలా జయించాలో నేర్చుకుంటే, క్రోధాన్ని కూడా జయించినట్టే. కాని దీనిలో ఒక సమస్య ఉంది. అదేమిటంటే, ఈ సమస్యను పరిష్కరించటానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల ముందు తాత్కాలిక పరిష్కారం చూడాలి.

రోడ్డుమీద ఏక్సిడెంట్ అయినప్పుడు, ముందు ఆ వ్యక్తికి ఫస్ట్‌ఎయిడ్ చేసి, తరువాత అతన్ని ఆసుపత్రికి తరలించాలి. ఫస్ట్‌ఎయిడ్ చేయకపోతే అతను మరణించే ప్రమాదం ఉంది. కామక్రోధాల విషయం తీసుకుంటే, తుది పరిష్కారం కామాన్ని నాశనం చేయటమే. దీని విషయంలో ఫస్ట్‌ఎయిడ్ ఏమిటో కృష్ణపరమాత్మ చెప్పడు కాని, మనం దాన్ని లోతుగా విశ్లేషించి తెలుసుకోవాలి.

కోపం రెండు రకాలు. ఒకటి తీవ్రమైన కోపం, అది బాహ్యంగా ప్రదర్శించబడుతుంది. కొంతమంది వారి కోపాన్ని అసలు అణుచుకోలేరు. వెంటనే ఎదుటివారిని కొట్టటమో, మాటల తూటాలు విసరటమో చేస్తారు. రెండవరకం కోపంలో కోపాన్ని బాహ్యంగా ప్రదర్శించరు. కాని వారు లోపల్లోపల లావాలా ఉడికిపోతుంటారు. అది ఎప్పుడు పేలుతుందో తెలియదు. మనం ఈ రెండురకాల కోపాన్నీ అదుపులో పెట్టటం ఎలాగో నేర్చుకోవాలి. శంకరాచార్యులవారు వీటి గురించి పదహారవ అధ్యాయంలో అక్రోధం, క్షమ గురించి మాట్లాడేటప్పుడు వివరించారు.

శంకరాచార్యులవారు రెండు దశలను సూచిస్తారు. ముందు మీలో రేగే క్రోధాన్ని అదుపులో పెట్టుకోవటాన్ని నేర్చుకోవాలి. అది అక్రోధం. రెండవదశ అసలు కోపమే రాకుండా ఉండేలా చూసుకోవాలి. అది క్షమ. మొదటిదశలో, మొదట్లో ఎవరిమీదైతే కోపం వస్తుందో, వారి దగ్గరనుంచి వెంటనే వెళ్ళిపోవాలి. మీరు వారి ఎదురుగా ఉంటే, కోపంతో వారిమీద మండిపడే ప్రమాదం ఉంది. అందువల్ల కోపంతో విరుచుకుపడేలోపే అక్కడ్నుంచి శారీరకంగా వెళ్ళిపోవాలి. అయినా కోపం తగ్గకపోతే, ఆ కోపాన్ని ప్రదర్శించండి. పాశ్చాత్య శాస్త్రవేత్తలు, మీ కోపాన్ని దిండుమీద చూపండి అంటారు. దిండును కోపంగా మీ ఇష్టం వచ్చినట్టు బాదండి. దానివల్ల ఎవరూ బాధపడరు, మీ కోపమూ తగ్గిపోతుంది.

ఇంకో మార్గం ఇల్లు సర్దండి. కోపం వచ్చినప్పుడు చాలా శక్తి వస్తుంది. అందువల్ల పెరిగిన శక్తితో ఇల్లు సర్దితే, అటు ఇల్లూ శుభ్రమవుతుంది, ఇటు మీ కోపమూ తగ్గుతుంది. లేదా, సముద్రపుటొడ్డుకు వెళ్ళి మీకు ఎవరిమీదైతే కోపం వచ్చిందో, వారిని తనివితీరా తిట్టండి. వారిని తిట్టినట్టూ ఉంటుంది, వారికి ఆ విషయమూ తెలియదు. లేదా నీళ్ళు త్రాగండి లేదా చూయింగ్‌గమ్ నమలండి. నోటినిండా ఏదైనా ఉంటే మాట్లాడలేరు కదా! లేదా చక్కగా రామనామ జపం చేయండి. అలా, ఏదో విధంగా మీ కోపాన్ని అసలు వ్యక్తి మీద కాకుండా, బయటకు ప్రదర్శించండి. ఆ ఆవిరి పోవాలి – ఇది తీవ్రమైన కోపం గురించి.

ఇప్పుడు బయటకు పెల్లుబుకురాని కోపం గురించి చూద్దాము. తీవ్రమైన కోపం పరిసరాలను కాల్చివేస్తే, వెలిబుచ్చని కోపం మీ లోపలి భాగాలను కాల్చివేస్తుంది.

అది శారీరక రుగ్మతలకు దారితీయవచ్చు. పొగలు, సెగలు కక్కుతున్న కాఫీ తాగారనుకోండి. నోరు కాలిపోతుంది. నోరే వేడిని తట్టుకోలేకపోతే, లోపలి భాగాలు, ఇంకా సున్నితంగా ఉండే భాగాలు, మీ కోపంయొక్క వేడిని ఎలా తట్టుకోగలవో చెప్పండి! అందువల్ల లోపల్లోపలే అణచివేస్తున్న కోపం కూడా ప్రమాదమే. దాన్నెలా అదుపులో పెట్టాలి?

మీరు కాసేపు తీరికగా కూర్చుని ఆ కోపకారణాన్ని విశ్లేషించుకోవాలి. ఎవరిమీద కోపం, దేనిమీద కోపం? నిజానికి ప్రదర్శించే కోపం కూడా, చాలాసార్లు ఎవరిమీద ప్రదర్శిస్తారో అది వారిమీద కోపం కాదు. దీన్ని విశ్లేషిస్తూ 'యూ ఆర్ నాట్ ది టార్గెట్,' అనే పుస్తకం ఒకటి వచ్చింది. ఉదాహరణకు మీకు ఆఫీసులో ఏదో సమస్య వచ్చింది. బాస్ ఏదో అన్నాడు. మీరు బాస్‌మీద విరుచుకు పడలేరు; విరుచుకుపడితే ఉద్యోగం ఉండదు. అందువల్ల ఇంటికి వచ్చి భార్యా, పిల్లలమీద విరుచుకుపడతారు. అందువల్ల ముందుగా ఈ విషయాన్ని గ్రహించాలి. కోపం ఒకరిమీద వస్తే, దాన్ని ఇంకొకరిమీద చూపిస్తున్నారు.

ఇప్పుడు అణగద్రొక్కిన కోపాన్ని కూడా పరిష్కరించాలి. లేకపోతే అది కూడా ఎప్పుడో లావాలా బయటకు పొంగుతుంది. అప్పుడు దాని తీవ్రతను భరించటం చాలా కష్టం. అందువల్లనే చూడండి, కుటుంబకలహాల్లో, ఎప్పుడైనా ఇలా ఉన్నట్టుండి విరుచుకుపడితే, ఆ రోజు జరిగిన సంఘటన గురించి అరవరు. ఎప్పుడో 1985లో అయిన సంఘటనతో మొదలుపెడతారు. ఇంకా మాట్లాడితే, పెళ్ళయిన కొత్తల్లో ఇలా అన్నావు, ఇలా చేశావు అంటూ అక్కడ్నుంచీ చెప్పుకొస్తారు. అంటే అప్పుడేర్పడిన కోపం, అప్పట్నుంచీ లోపల్లోపల అలా రాజుకుంటోందన్నమాట. పాత విషయాలెన్నో తవ్వుతారు, 'నువ్వు నన్ను అలా అన్నావు, ఆరోజు నన్ను బయటకు వెళ్ళనివ్వలేదు. నాకు కాఫీలో చక్కెర వేయకుండా ఇచ్చావు.' ఇలా కొనసాగుతుంది. దీని అర్థం, ఆ కోపం ఇవాళ వచ్చినది కాదు. సంవత్సరాల తరబడి లోపల్లోపలే వారిని దహిస్తూ వస్తున్నది.

ఈ అణగద్రొక్కబడిన కోపాన్ని అనేక పద్ధతుల ద్వారా పరిష్కరించవచ్చు. కాని అవన్నీ తాత్కాలికమే. శాశ్వతపరిష్కారం మాత్రం **కామజయమే**. కామజయం అంటే బాహ్యప్రపంచంనుంచి ఏమీ ఆశించకపోవటం. స్వామీ చిన్మయానంద అద్భుతంగా అంటారు– భవిష్యత్తులో ఏదైనా ఆశిస్తే అది నిరాశకు దారితీస్తుంది. ఏది ఆశించినా అది కామం, కామం తీరకపోతే క్రోధానికి దారితీస్తుంది. అందువల్ల కోపాన్ని పరిష్కరించటానికి తాత్కాలిక మార్గాలు ముందు వెతుక్కున్నా, తరువాత శాశ్వతపరిష్కారం ఏమిటో చూడండి. అది **కామజయం**. అందువల్ల కామక్రోధజయం ఒక ముఖ్యమైన సాధన. కామక్రోధాలను జయించకుండా, ఆత్మజ్ఞానం పొందితే, అహం బ్రహ్మాస్మి కూడా కోపంగా అంటారు. అది బాగుంటుందా? అహం సంతుష్టః అస్మి అనగలగాలి, సంతోషంగా.

**అంతరంగ సాధనలు** – తక్కిన మూడు సాధనలూ, వాటి స్థాయినిబట్టి చెప్పబడ్డాయి. అవి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. మూడూ చాలా ముఖ్యం.

**శ్రవణం** – శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు, ఒక శ్రోత్రియబ్రహ్మనిష్ఠ అయిన గురువువద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేయటం.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।**

శాస్త్రం ఏడు అంశాల గురించి కూలంకషంగా చర్చిస్తుంది. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, బంధం, బంధహేతువు, మోక్షం, మోక్షహేతువు. ఆత్మజ్ఞానం పొందాలంటే ఈ ఏడు అంశాలనూ స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అందువల్ల వాటి గురించి టూకీగా చూద్దాము.

1. **జీవుడు** – జీవుడెవరు? ఇది స్పష్టంగా అర్థం చేసుకోవాలి. జీవుడు అంటే నేను. నా గురించి నాకు అనేక సందేహాలు ఉన్నాయి. నేనెందుకు పుట్టాను? ఎందుకు ఈ భూమ్మీదకు వచ్చాను? ఎందుకు ఈ బాధలన్నీ పడుతున్నాను? నేను మరణించాక ఏమవుతాను? నేను చీమకు కూడా అపకారం తలపెట్టకపోయినా, నేను ఎందుకు ఇంత బాధపడుతున్నాను? నేను ఒక్క పాపం కూడా చేయలేదు (ఇదొక అబద్ధం. అయినా సరే, నేను నిజంగా ఏమీ పాపం చేయలేదనే అనుకుందాం). అలాంటప్పుడు నేను కష్టాల వెంట కష్టాల్లో ఎందుకు కూరుకుపోతున్నాను? ఇదంతా ఎందుకు జరుగుతున్నది?

ఇలా నా గురించి నాకు అనేక సందేహాలున్నాయి. అవన్నీ తీరాలంటే శాస్త్రాన్ని దశలవారీగా అర్థం చేసుకోవాలి.

2. **జగత్తు** – జగత్తు గురించి కూడా మనకు అనేక సందేహాలు ఉన్నాయి. ఈ జగత్తుయొక్క సృష్టి ఎందుకు జరిగింది? ఎప్పుడు జరిగింది? ఈ జగత్తుయొక్క కారణం ఎవరు? జగత్తు ఇలా ఎన్నాళ్ళు కొనసాగుతుంది? దీనియొక్క సృష్టిస్థితి లయకారకుడెవరు? శాస్త్రమే దీనికి జవాబు.

3. **ఈశ్వరుడు** – దేవుడనేవాడు ఉన్నాడా? నాస్తికులు వేస్తారు ఈ ప్రశ్న. దేవుడు ఉంటే దేవుడు ఎవరు? స్త్రీనా, పురుషుడా, ఇద్దరూ కలిసిన అర్ధనారీశ్వరుడా? భగవంతుడు ఏకరూప ఈశ్వరుడా, అరూప ఈశ్వరుడా? సగుణాకారంలో ఉంటాడా, నిర్గుణమా? భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయితే, దేశంలో ఇంతమంది ఇన్ని కష్టాలు పడటం ఎందుకు? అందరూ ఆనందంగా ఉండాలి, దేశం సుభిక్షంగా ఉండాలి. అందరూ మంచిపనులే చేయాలి, అందరూ ప్రేమగా ఉండాలి. సర్వశక్తిమంతుడైన భగవంతుడు తలుచుకుంటే, ప్రపంచాన్ని సుభిక్షంగా చేయలేడా?

ద్రౌపదికి కోరగానే వస్త్రాలు ఇచ్చినట్టుగా, ఎక్కడైనా కరువు కాటకాలు ఏర్పడితే, భగవంతుడు ఆ ప్రాంతంలో సమృద్ధిగా ఆహారం పైనుంచి పడేయలేడా? భగవంతుడు దయాళువు అయితే, మనుష్యులు ఇంత కష్టపడుతూ ఉంటే, జాలిరావటం లేదా? శాస్త్రమే దీనికి కూడా జవాబు.

4. **బంధం** – బంధం అంటే ఏమిటి?
5. **బంధహేతువు** – ఎందుకు మనం సంసారానికి బందీలం అవుతున్నాము?
6. **మోక్షం** – మోక్షం అంటే ఏమిటి?
7. **మోక్షహేతువు** – మోక్షం పొందటమెలా?

ఇవన్నీ సరిగ్గా అర్థం కావాలంటే, శాస్త్రాన్ని ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేయాలి. ఇప్పుడు జీవుని గురించి నేర్చుకుని, ఏడేళ్ళ తరువాత కొంచెం ఈశ్వరుని గురించి నేర్చుకుంటాను అంటే, అది జరిగేపని కాదు. ఒకదానికి ఇంకొకదానితో ఉన్న సంబంధం అర్థం కాదు సరికదా, అది పరస్పరవిరుద్ధంగా ఉన్నట్టు కన్పించవచ్చు.

**2. శ్రవణం** – అందువల్ల ఈ ఏడు అంశాల గురించి అధ్యయనం చేయటమే కాదు, ఒకదానితో ఇంకొకదానికి ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవాలి. అలా చేయాలంటే శాస్త్రాన్ని ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలి. దీన్నే శ్రవణం అంటారు. శ్రవణం దశలో ప్రశ్నలు వేయకూడదు. శ్రద్ధగా, సందేహాలు పెట్టుకోకుండా వినాలి. ఎక్కడైనా సందేహం కలిగినా, శ్రవణం దశలో అడగకూడదు. రాసి పక్కన పెట్టుకోవాలి. ఎందుకంటే అలా వింటూపోతే, మీకున్న సందేహాల్లో కొన్ని వాటంతట అవే తీరిపోవచ్చు. శ్రవణం అంటే **అజ్ఞాననివృత్తి**.

**3. మననం** – మననంలో మీకు కలిగిన సంశయాలను తీర్చుకోవాలి.

**సంశయ రహితజ్ఞానమేవ జ్ఞానం భవతి – సంశయసహిత జ్ఞానమ్ అజ్ఞాన సమానమేవ**

సంశయంతో కూడిన జ్ఞానం అజ్ఞానంతో సమానం. అక్కడొక వైరు వేలాడుతున్నది అనుకోండి. దాన్ని మీరు ముట్టుకునే ముందు, ఎవరినో పిలిచి అడుగుతారు, 'ఇది లైవ్ వైరా, కాదా?' అతను 'లైవ్ వైరు కాదు,' అంటాడు. మీరు, దాన్ని ముట్టుకో బోతుండగా, '99% లైవ్ వైరు కాదనుకుంటాను,' అని కలుపుతాడు. ఒక శాతమే సందేహం ఉన్నా, మీరు ధైర్యం చేసి దాన్ని ముట్టుకుంటారా? అందువల్ల సంశయంతో కూడిన జ్ఞానం, అజ్ఞానం కిందకే వస్తుంది. సంశయాలను తోటి విద్యార్థులను అడిగో, మీ నోట్సునే మళ్ళీ చూసుకునో, గురువును ప్రశ్నలు అడిగో, మళ్ళీమళ్ళీ శ్రవణం చేసో సందేహాలు తీర్చుకోవాలి. మననం అంటే **సంశయనివృత్తి**.

**4. నిదిధ్యాసనం** – నిశ్చయజ్ఞానం కలిగితే చాలదు. ఆ జ్ఞాననిష్ఠలో నిలబడగలగాలి. దాన్ని నిదిధ్యాసనం అంటారు. అహం బ్రహ్మాస్మి, అహం పూర్ణః అస్మి అని పెదవులతో యాంత్రికంగా

పలికితే చాలదు. లోపల ఉన్న పరిమితి భావన పోవాలి. అది పోకపోతే, నేను పూర్ణుడను అంటారు కాని, మనస్సులో కొరత ఉంటూనే ఉంటుంది.

విక్రమాదిత్యుడు ఒక అందమైన రాకుమార్తెను పెళ్ళి చేసుకుందామనుకున్నాడు. ఆమెను పెళ్ళి చేసుకోవటానికి విక్రమాదిత్యుడు ఒక పరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది. రాకుమార్తె ఏడుగురు అందమైన అమ్మాయిలతో కలిసి వస్తుంది. వారంతా రాకుమార్తెలు కారు; ఆమె చెలికత్తెలు మాత్రమే. కాని ఒక్కలాగానే ముస్తాబయి ఉన్న వారిలోంచి, అతను రాకుమార్తె ఎవరో కనిపెట్టగలగాలి.

వారందరూ హరికేన్ లాంతర్లు పుచ్చుకుని విక్రమాదిత్యుని ముందు నిలబడ్డారు. చూడటానికి అందరూ రాకుమార్తెల లాగానే ఉన్నారు. కాని విక్రమాదిత్యుడు తెలివైన రాజు. వారిని, వారి నూనె లాంతర్లను ఒకసారి కదపమన్నాడు. అవి కదిలినప్పుడు , వాటిలోంచి నూనె చుక్కలు నేలమీద రాలిపడ్డాయి. నూనె కింద పడగానే వారిలో ఆరుగురు చటుక్కున వంగి, ఆ నూనెను వేళ్ళతో తీసి, తమ తలకు రాసుకున్నారు. వారు రాకుమార్తెలుగా ముస్తాబు అయినా, వారిలో ఉన్న దరిద్రబుద్ధి పోలేదు. అవకాశం రాగానే దాన్ని చూపించారు.

రాకుమార్తె ఎప్పటికీ రాకుమార్తే! ఆమె ఠీవికి లోటు లేదు. నూనె కిందపడితే, తను ఒంగి తీయనవసరం లేదు, చిటికె వేస్తే నలుగురు చెలికత్తెలు పరుగులు తీస్తూ వస్తారు. అదీకాక, నేలమీద ఒలికిన నూనెను తలకు రాసుకోవాల్సిన అవసరం అంతకన్నా లేదు! అందువల్ల ఆమె చెక్కు చెదరకుండా, అలాగే ఠీవిగా పైకి చూస్తూ నిలబడి ఉంది. ‘అదిగో, ఆమెనే రాకుమారి,’ అన్నాడు విక్రమాదిత్యుడు.

దీని సారం ఏమిటి? పైకి రాకుమార్తెలుగా ముస్తాబయినా, వారిలో ఉన్న దరిద్రబుద్ధి వారికి పోలేదు. అలాగే వేదాంతం నేర్చుకున్నా, మీలో ఉన్న కొరత, బాధ, దుఃఖం పోదు. ఒక పక్క ఏడుస్తూ, అహం బ్రహ్మాస్మి అంటారు. నాకు ఈ కొరత తీరలేదు, అహం బ్రహ్మాస్మి అంటారు, నాకు చాలా బాధగా ఉంది అంటూ అహం బ్రహ్మాస్మి అంటారు. అలా అంటే అది జ్ఞాననిష్ఠ అవదు.

**అహమన్నమహమన్నమహమన్నమ్। అహమన్నాదో 3౽ హమన్నాదో 3౽ హమన్నాదః**
– తైత్తిరీయమ్

నేను అన్నం, నేను అన్నం, నేను అన్నం! నేను భోక్తను, నేను భోక్తను, నేను భోక్తను!

**మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ**– 7.7

ఇదే భావం గీతలో కూడా ప్రతిధ్వనిస్తున్నది. నాకు భిన్నంగా కొంచెం కూడా ఏమీ లేదు. ఈ పూర్ణత్వభావన అణువణువునా జీర్ణించుకోవాలి. దరిద్రభావన కొంచెం కూడా

ఉండకూడదు. దానిని జ్ఞాననిష్ఠ అంటారు. మీలో ఉన్న విపరీతభావనలు పోతే, జ్ఞాననిష్ఠలో నిలబడతారు. విపరీతభావనలను విపర్యయం అంటారు. అందువల్ల నిదిధ్యాసనం అంటే **విపర్యయనివృత్తి.**

కృష్ణపరమాత్మ మననాన్ని ఈ శ్లోకంలో సూచిస్తున్నాడు.

**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః** – 5.25

ఛిన్నద్వైధా అంటే నిశ్చయజ్ఞానం. నిదిధ్యాసనాన్ని చివరి శ్లోకాల్లో సూచిస్తున్నాడు.

**స్పర్శాన్‌కృత్వా బహిర్బాహ్యాన్ చక్షుశ్చైవాంతరే భ్రువోః ।**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥** – 5.27

ఇంద్రియాలను బాహ్యప్రపంచంనుంచి వెనుకకు లాగి, దృష్టిని భ్రుకుటిమీద నిలిపి, ఉచ్ఛ్వాసనిశ్శ్వాసలను సమానంగా చేయాలి.

ఆ విధంగా నిదిధ్యాసనం, జ్ఞాననిష్ఠలో నిలబడటానికి తోడ్పడుతుంది. ఐదవ అధ్యాయంలో నిదిధ్యాసనం ఎలా చేయాలో సూచనప్రాయంగా చెప్పి, ఆరవ అధ్యాయంలో దాన్ని వివరంగా చెప్పుకొస్తాడు. పొందిన జ్ఞానాన్ని, జ్ఞాననిష్ఠగా మలచుకోకపోతే మీరు నేర్చుకున్నదానికీ, మీరు ప్రవర్తిస్తున్న తీరుకీ లంగరు కుదరదు.

ఆ విధంగా నాలుగు సాధనలను వివరించాడు కృష్ణపరమాత్మ ఇందులో. అవి **కామక్రోధ జయం, శ్రవణం, మననం, నిదిధ్యాసనం**. ఈ అధ్యాయాన్ని కర్మసన్న్యాసయోగము అంటారు. అంటే జ్ఞానం ద్వారా కర్మను సన్న్యసించాలి.

# ధ్యానయోగము

## అధ్యాయము 6

భగవద్గీతను నాలుగు వేదాల సారాంశంగా భావిస్తాము. శంకరాచార్యులవారు తన గీతాభాష్యంలో అవతారికలో ఇలా అంటారు –

**తదిదం గీతాశాస్త్రం సమస్తవేదార్థసారసంగ్రహభూతమ్**

ఈ గీతాశాస్త్రం మొత్తం వేదాలయొక్క సారం. అందువల్ల గీతాబోధను క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే, మొత్తం వేదాలనే అర్థం చేసుకున్నంత ఫలం వస్తుంది.

**యత్ వేదానాం తాత్పర్యం భవతి తదేవ గీతాశాస్త్రస్యాపి తాత్పర్యం భవతి**

వేదాల తాత్పర్యం ఏదైతే ఉందో, అదే గీతాశాస్త్రంయొక్క తాత్పర్యం కూడా! వేదాల తాత్పర్యం ఏమిటి?

**సర్వే వేదాః యత్పదమామనన్తి తపాగ్ంసి సర్వాణి చ యద్వదన్తి**
**యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదగ్ం సంగ్రహేణ బ్రవీమి**
**ఓమ్ ఇతి ఏతత్** – కఠ 1.2.15

అన్ని వేదాలు ఏ లక్ష్యాన్ని ఉపదేశిస్తున్నాయో, దేనికోసం అన్ని తపస్సులు చేయబడుతున్నాయో, ఏది కోరి బ్రహ్మచర్యవ్రతాన్ని పాటిస్తున్నారో ఆ లక్ష్యాన్నే పొందాల్సిన మంత్రాన్ని నీకు క్లుప్తంగా చెబుతున్నాను. అది ఓం.

వేదాల సారం మోక్షం పొందటమే. పరమపురుషార్థమైన మోక్షమే వేదాల తాత్పర్యం. వేదాలు తక్కిన పురుషార్థాల గురించి కూడా మాట్లాడకపోలేదు. తక్కిన మూడూ అర్థపురుషార్థం, కామపురుషార్థం, ధర్మపురుషార్థం. వాటిని కోరిన వారికి వరుసగా ధనం, సుఖాలు, పుణ్యం వస్తాయి. కాని అవి ముఖ్యపురుషార్థాలు కావనీ, ప్రాథమిక లక్ష్యం మోక్షపురుషార్థమేనని ఘోషిస్తున్నాయి.

ఆ విధంగా వేదాలు మోక్షశాస్త్రమయితే, వేదాల సారం అయిన భగవద్గీత కూడా మోక్ష శాస్త్రమే. మోక్షం పొందటానికి ప్రాథమిక సాధనగా దేన్ని సూచిస్తాయి వేదాలు? వేదాలన్నీ ఏకగ్రీవంగా మోక్షం పొందటానికి ఒక్కటే మార్గం ఉందనీ, అది జ్ఞానమార్గమనీ ఘోషిస్తున్నాయి.

**త్వమేవ విద్వాన్ అమృత ఇహ భవతి। నాన్యః పంథా అయనాయ విద్యతే॥**

– పురుషసూక్తం 17

జ్ఞానమార్గం తప్ప వేరొక మార్గం లేదు.

**సంపశ్యన్ బ్రహ్మపరమం యాతి న అన్యేన హేతునా**
**తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరాః** – కైవల్యమ్ 10
**తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్।** – కఠ 2.2.12

జ్ఞానం పొందిన వ్యక్తికే శాశ్వతమైన ఆనందం కలుగుతుంది. ఇతరులకు కలగదు.

ఆ విధంగా, వేదాల్లో జ్ఞానమొక్కటే మోక్షప్రాప్తికి మార్గమని అనేకచోట్ల చూస్తాము. అదే నిజమైతే, భగవద్గీత వేదాల సారం కాబట్టి, గీతాసారం కూడా **జ్ఞానంద్వారా మోక్షప్రాప్తి** అవాలి.

గీతాబోధ ఎక్కడ మొదలయిందో ఆ సందర్భాన్ని గుర్తుతెచ్చుకోవాలి. మహాభారతయుద్ధంలో అర్జునునికి సంసారసమస్య ఎదురవుతుంది. ఇక్కడ సంసారాన్ని రాగం, శోకం, మోహంగా అభివర్ణించారు.

**రాగం** – మీ ఆనందంకోసం బాహ్యవస్తువులమీద ఆధారపడటం రాగం.

**శోకం** – ఆ బాహ్యవస్తువులు పోతే, అది శోకానికి దారి తీస్తుంది. రాగం ఎంత తీవ్రంగా ఉంటే, శోకం కూడా అంత ఎక్కువగా ఉంటుంది.

**మోహం** – రాగ, శోకాలు మనస్సుని కప్పివేస్తే, బుద్ధి విచక్షణాశక్తిని కోల్పోతుంది. అప్పుడు బుద్ధి ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా చూస్తుంది. బుద్ధిలో తీవ్రమైన ఘర్షణ చెలరేగుతుంది. ఈ విచక్షణాశక్తి క్షీణించటాన్ని మోహం అంటారు.

ఆ విధంగా రాగం, శోకం, మోహం కలిసి అర్జునుణ్ణి సంసారంలో పడవేశాయి. అర్జునుడు లౌకికంగా ఎన్నో విజయాలు పొందాడు. అతనికి పేరు ప్రతిష్ఠలు ఉన్నాయి, ఐశ్వర్యం ఉంది. యుద్ధరంగంలో తిరుగులేదు. అతనికి సవ్యసాచి, ధనుంజయుడు అనే బిరుదులు ఉన్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే, లౌకికజీవనంలో ఒక వ్యక్తి ఏవైతే కోరుకుంటాడో, అవన్నీ అర్జునునికి ఉన్నాయి. ఇన్ని విజయాలున్నా సంసారదుఃఖాన్ని పారద్రోలలేకపోయాయి. ఆ శోకం ఎంత తీవ్రరూపం దాల్చిందంటే, అతనికి జీవితం మీదే విరక్తి కలిగింది.

**జీవితేన వా కిం ప్రయోజనమ్**

నేను జీవించివుండి లాభమేమిటి అన్నాడు. జీవితమే భారంగా మారితే, జీవితలక్ష్యాలను పొందే ప్రశ్న ఎక్కడుంది? అందువల్ల, మొదటి అధ్యాయం లౌకిక విజయాలు పొందినా సంసారదుఃఖాన్ని పారద్రోలలేవని సూచిస్తుంది. అర్జునుడు ఎప్పుడైతే తనంతటతాను, తన సమస్యను పరిష్కరించుకోలేనని గ్రహించాడో, అతను వెంటనే తెలివైన పనిచేశాడు. కృష్ణపరమాత్మను శరణు వేడాడు.

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥**
– 2.7

నా బుద్ధి మోహంతో కప్పబడింది. నేను అయోమయంలో పడ్డాను, ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలుసుకోలేకుండా ఉన్నాను. నాకు శ్రేయస్కరమైనది ఏదో నువ్వే తేల్చిచెప్పు. నేను నీకు శిష్యుణ్ణి అని వేడుకున్నాడు అర్జునుడు.

ఇక్కడ, నేను శిష్యుణ్ణి, నువ్వు నాకు శ్రేయస్కరమైనది ఏదో చెప్పు అని అర్జునుడు చెప్పటం ద్వారా భగవద్గీతనుంచి మనం నేర్చుకోవాల్సిన ఒక ఉపసిద్ధాంతం ఉంది. జ్ఞానాన్ని గురుశిష్యుల సంవాదరూపంలోనే పొందగలము; మోక్షాన్ని జ్ఞానం ద్వారానే పొందగలము; అర్జునుడు ఈ విషయాన్ని గ్రహించాడు కాబట్టే, కృష్ణపరమాత్మను శరణు వేడాడు. ఈ విషయం కృష్ణపరమాత్మే స్వయంగా తరువాత చెబుతాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

సమర్థవంతమైన గురువు దగ్గరకు వెళ్ళి తపనతో, శ్రద్ధతో, గురువుకు సేవలు చేసి, సరియైన ప్రశ్నలు వేసి, ఆత్మజ్ఞానాన్ని పొందాలి.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్।**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥** – ముండకమ్ 1.2.12

మీరెంత తెలివైనవారైనా సరే, శాస్త్రాన్ని మీ అంతట మీరు అధ్యయనం చేయకూడదు. అలా చేస్తే శాస్త్రం సరిగ్గా అర్థం కాదు. అర్థం కాకపోయినా నష్టంలేదు, కాని పొరపాటుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. అందువల్ల రెండవ అధ్యాయంనుంచి గురుశిష్య సంవాదరూపంలో జ్ఞానం మొదలవుతుంది. ఈ జ్ఞానబోధను కృష్ణపరమాత్మ రెండు, మూడు, నాలుగు, ఐదు అధ్యాయాలలో చేశాడు. ఈ బోధ సారాంశాన్ని ఒక్కముక్కలో చెప్పాలంటే, 'నేను నిత్య, ముక్త, శుద్ధ, బుద్ధ పురుషుణ్ణి.' బంధం అనేది నిజంగా లేదు; ఉందని మనను మనమే హిప్నటైజ్ చేసుకుంటున్నాము. అది ఒక పొరపాటు మాత్రమే. అందువల్ల, మోక్షం అంటే ఎప్పుడో భవిష్యత్తులో జరగబోయే సంఘటన కాదు; మోక్షం అంటే ప్రయత్నపూర్వకంగా, ఒక పద్ధతి ద్వారా, సాధించాల్సిన అంశం కాదు; మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు.

**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః।** – 5.15

అజ్ఞానంచేత జ్ఞానం కప్పబడి ఉండటంవల్ల మనుష్యులు మోహంలో పడిపోతున్నారు.

సమస్యలన్నీ అజ్ఞానంవల్ల, అజ్ఞానజనిత పొరపాటువల్ల ఏర్పడుతున్నాయి కాబట్టి వాటికి పరిష్కారం జ్ఞానం పొందటమే!

**జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।**
**తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥** – 5.16

వారి అజ్ఞానం ఆత్మజ్ఞానం పొందితే తొలగిపోతుంది. అప్పుడు ఆ జ్ఞానం, సూర్యుడు వస్తువులను ప్రకాశింపజేసినట్టుగా, వారికి సచ్చిదానంద ఆత్మతత్త్వాన్ని ప్రకాశింపజేస్తుంది.

ఎప్పుడైతే జ్ఞానం కలుగుతుందో, అప్పుడే అజ్ఞానం తొలగిపోతుంది. ఎప్పుడైతే అజ్ఞానం తొలగి పోతుందో, అప్పుడే అజ్ఞానజనిత పొరపాటు కూడా తొలగిపోతుంది. అజ్ఞానజనిత పొరపాటు సంసారం. అందువల్ల మీరు జ్ఞానం పొందితే, 'నేను సంసారబంధంనుంచి ముక్తి పొందాను. నిజానికి, నేను అంతకుముందు, ఇప్పుడు ఇకముందు కూడా స్వేచ్ఛాజీవినే,' అని నిశ్చయంగా చెప్పగలుగుతారు. ఈ జ్ఞానాన్ని ఎలా పొందుతారో, ఈ జ్ఞానఫలమైన మోక్షాన్ని ఎలా అనుభవిస్తారో ఇంతవరకూ చూస్తూ వచ్చాము; ఇకముందు అధ్యాయాల్లో కూడా చూస్తాము. కాని ఇప్పుడు ఆరవ అధ్యాయంలో ఒక ముఖ్యమైన జ్ఞానసాధనను చూడబోతున్నాము.

ఆరవ అధ్యాయం చాలా ముఖ్యమైన అధ్యాయం. అది ఆత్మజ్ఞానసాధనల్లో ముఖ్యమైన సాధనను బోధిస్తుంది. దీన్ని ధ్యానం అంటారు. ఈ ధ్యానాన్ని మనం విడిగా తీసుకుని సాధన చేయకూడదు. అప్పుడు దాని ఫలం ఉండదు. చాలామందికి జ్ఞానంమీద శ్రద్ధ ఉండదు. ముందే ధ్యానం నేర్చేసుకోవాలనుకుంటారు. వారు మొదటి ఐదు అధ్యాయాలు నేర్చుకోకుండా, ఆరవ అధ్యాయం మాత్రం నేర్చుకుని, ధ్యానం చేసి, మోక్షం పొందాలనుకుంటారు. అలా ఆరవ అధ్యాయం ఒక్కటే చాలనుకుంటే, కృష్ణపరమాత్మ అదొక్కటే ఇచ్చి ఉండేవాడు కదా! ఎందుకు శ్రమపడి, ముందు ఐదు అధ్యాయాల్లో బోధ చేశాడు! ఐదు అధ్యాయాలను నేర్చుకున్నాక, ధ్యానం చేయాలని ఆయన ఉద్దేశ్యం. ఈ ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. మేము జ్ఞానం పొందము, మాకు కేవలం ధ్యానం నేర్పించండి అనే వారికి ఇష్టదేవతా నామజపం నేర్పించాలి. దాన్ని మనస్సులో జపించమని చెప్పాలి. దాన్ని ఉపాసన అంటారు. కాని జ్ఞానం పొందాలంటే మాత్రం తక్కిన సాధనలతో పాటు ఈ సాధన చేయాలి.

తక్కిన సాధనలు అంటే శ్రవణ, మననాలు. జ్ఞానం పొందటానికి సాక్షాత్ సాధనలు శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. శ్రవణ, మననాలు, గురు–శిష్య సంవాదరూపంలో సాగుతాయి. శ్రవణ మననాల్లో నిశ్చయజ్ఞానం పొందాక, ఆ జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవటానికి

నిదిధ్యాసనం చేయాలి. నిదిధ్యాసనం ఎలా చేయాలో చాలా విపులంగా చర్చిస్తాడు కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో. నిజానికి, ఉపనిషత్తుల్లో కూడా ఇంత వివరంగా నిదిధ్యాసనం గురించి రాదు. మాండూక్యోపనిషత్తులో వచ్చినా, ఇన్ని లోతైన అంశాలు లేవు. అందువల్ల నిదిధ్యాసనం గురించిన ఒక సంపూర్ణ అధ్యాయం ఇది.

ఆరవ అధ్యాయాన్ని ప్రధానంగా ఆరు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. బహిరంగ సాధనలు : శ్లోకాలు 1–9, 16–17
2. అంతరంగ సాధనలు : శ్లోకాలు 10–15
3. ధ్యానస్వరూపం : శ్లోకాలు 18–23
4. ధ్యానవస్తువు : శ్లోకాలు 24–28
5. ధ్యానఫలం : శ్లోకాలు 29–32
6. ధ్యానప్రతిబంధకాలు, పరిష్కారాలు : శ్లోకాలు 33–36 ఇవికాక
7. యోగభ్రష్టుడు : శ్లోకాలు 37–47

కాకపోతే, ఈ ఆరు అంశాలు, ఇంత స్పష్టంగా ఒకదాని తర్వాత ఒకటి రావు. అవి అధ్యాయం అంతటా చెల్లాచెదురుగా ఉన్నాయి. మనం వాటిని ఈ విధంగా ఏర్చి కూర్చుకున్నాము. ఇప్పుడు ఒక్కొక్క అంశాన్నీ వివరంగా చూద్దాము.

1. **బహిరంగ సాధనలు – శ్లోకాలు 1 –9, 16–17** బహిరంగ సాధనలు ఎన్నో ఉన్నా కూడా, కృష్ణపరమాత్మ మూడు సాధనలను నొక్కివక్కాణిస్తున్నాడు. అవి సమత్వం, వైరాగ్యం, ఆత్మకృప.

ఎ) **సమత్వం** – సమత్వం అంటే వ్యవహారాలు నడిపేటప్పుడు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవటం. దైనందిన జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లకు అతిగా పొంగిపోయే అలవాటున్నా, అతిగా కృంగిపోయే అలవాటున్నా కూడా సమస్యే. ఎందుకంటే, ఇలా ధ్యానాన్ని కూర్చుంటారో లేదో, అలా మనస్సు తీవ్రంగా స్పందిస్తుంది; ధ్యానవస్తువును మర్చిపోయేలా చేస్తుంది. అయితే మిమ్మల్ని ఉత్సాహంతో నింపుతుంది, లేదా నిరుత్సాహంలోకి లాగుతుంది.

ఉదాహరణకు ఏ టెన్నిస్ మ్యాచో, క్రికెట్ మ్యాచో తీసుకోండి. అది కూడా ఆఖరి ఆట. ఆఖరి ఆటలో గెలుపు ఏ ఒక్కరినో వరిస్తుంది. రెండోవారు ఓటమిని స్వీకరించక తప్పదు. కాని రెండువైపుల వారూ తీవ్రమైన స్పందనకు లోనవుతారు. గెలిచినవారి మనస్సు ఆకాశం అంచులు తాకితే, ఓడినవారి మనస్సు పాతాళంలోకి కృంగిపోతుంది. ఆ రాత్రి రెండు వైపులవారూ కంటినిండా కునుకు తీయలేరు. ఆ పరిస్థితిలో వారిని ధ్యానం

చేయమన్నారనుకోండి, ఎవరూ సరిగ్గా చేయలేరు. గెలిచినవారు ఆనందడోలికలలో ఊగిసలాడుతుంటే, ఓడినవారు నిరాశతో కృంగిపోతారు. అందువల్ల ధ్యానం చేయటానికి కావాల్సిన మొదటి బహిరంగ సాధన సమత్వం. ద్వంద్వాలకు చలించని మనస్సు. అప్పుడే మీరు ధ్యానవస్తువుమీద దృష్టి పెట్టగలుగుతారు.

సమత్వాన్ని ఎలా పెంపొందించుకోవాలి? దానికి మార్గం కృష్ణపరమాత్మ ఇక్కడ చర్చించడు, మనం గడిచిన అధ్యాయాల్లో సమత్వం పెంపొందించుకోవటమెలాగో చూశాము కాని అది చాలా ముఖ్యం కాబట్టి ఇక్కడ మళ్ళీ చూద్దాము. రాగద్వేషాలను తగ్గించుకోవటం ద్వారానే సమత్వాన్ని పెంపొందించుకోగలరు. రాగద్వేషాలు అంటే ఇష్టాయిష్టాలు. కొన్ని వస్తువులమీద బలమైన రాగం ఉంటే, మరికొన్ని వస్తువులమీద తీవ్రమైన ద్వేషం ఉంటుంది. ఈ రెండూ మనస్సును ప్రశాంతంగా ఉండనివ్వవు. అందువల్ల మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే రాగద్వేషాలను తగ్గించుకోవటమొక్కటే మార్గం.

రాగద్వేషాలను తగ్గించుకోవటమెలా? దీనికి అనేక మార్గాలు ఉన్నాయి కాని, ఒక్క తేలిక మార్గాన్ని చూద్దాము. మీకు ఎదురైన అన్ని పరిస్థితులను, రాకపోకలను భగవంతుని ఇచ్ఛగా స్వీకరించటం నేర్చుకోవాలి. 'హిజ్ విల్ బి డన్,' అంటారు. భగవంతుడు అనుకున్నట్టుగా అవుతుంది. ఒక ప్రతికూలఫలం వచ్చినా, ఒక ఆనందకర సంఘటన జరిగినా అది భగవంతుని ఇచ్ఛగా భావించాలి. భగవంతుడలా ఎందుకు కోరుకున్నాడు అని ప్రశ్నించకూడదు. అలా జరగటం మీ ఎదుగుదలకోసమే అని గ్రహించాలి.

డాక్టరు, రకరకాల మందులను రకరకాల రోగాలకు ఇస్తాడు. ఒక్కోసారి ఆ మందు దగ్గుమందులాగా తియ్యగా బాగుండవచ్చు; ఒక్కోసారి చేదుగా, కషాయంలా ఉండవచ్చు. వైద్యుడు అలా ఎందుకు ఇస్తున్నాడు? మనకు ఆనందమో, కష్టమో కలగజేయటానికి కాదు; మన ఆరోగ్యానికి ఏది సరిపోతుందో అది ఇస్తాడు. అదే విధంగా ఆ వైద్యనాథ్ (భగవంతుడు) మనకు ప్రియం చేకూర్చాలని చూడకుండా మన ఎదుగుదలకోసం చేస్తాడు. అందువల్ల భగవంతునిమీద పూర్తి నమ్మకం ఉండాలి. ఆయన ఇచ్ఛమీద శ్రద్ధ ఉండాలి.

**ఆగతే స్వాగతం కుర్యాత్ గచ్ఛంతం న నివారయేత్।।**

ఏదైనా వస్తే స్వాగతం చెప్పాలి, అది వెళ్ళిపోతుంటే దానిని ఆపకూడదు. భగవంతుని మీద అనన్యభక్తి ఉంటే ఈ భావాన్ని పెంపొందించుకుంటారు. అప్పుడు రాగద్వేషాలు వాటంతట అవే మటుమాయమవుతాయి. రాగద్వేషాలను అలా పారద్రోలగలిగితే, సమత్వం ఏర్పడుతుంది. సమత్వం ఏర్పడితే, ధ్యానం సమర్థవంతంగా చేయగలుగుతారు.

బి) **వైరాగ్యం** – రెండవ బహిరంగ సాధన వైరాగ్యం.

**యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।**
**సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే ॥** – 6.4

మనస్సు పరిపక్వత చెందిన వ్యక్తి ఇంద్రియభోగాల తపననుంచి విడివడతాడు. అతను వాటితో మమేకం చెందడు. భవిష్యత్తు గురించిన ఆందోళనను త్యజిస్తాడు. అటువంటి వైరాగ్యం ఉన్న వ్యక్తిని సర్వసంకల్ప సన్న్యాసి అంటారు.

వైరాగ్యం అంటే ఏమిటి? జీవితంలో దేన్నైతే మీరు అత్యంత ముఖ్యమైనదాన్నిగా భావిస్తారో, అది దానంతట అదే మీ మనస్సును ఆక్రమిస్తుందనే సూత్రంమీద ఆధారపడి ఉంది వైరాగ్యం. చాలా మంచి మనస్తత్వవిశ్లేషణ. నిజానికి మీకు అంత ముఖ్యమైనదాని గురించి ప్రత్యేకించి కూర్చుని ఆలోచించనవసరం లేదు. మీరేం చేస్తున్నా కూడా, మనస్సు దాని చుట్టూనే తిరుగుతుంది. ఒక చదరంగపు క్రీడాకారుడు ప్రపంచంలోనే ప్రథమస్థానాన్ని పొందాలనుకుంటే అతను ఏం చేస్తున్నా ఎప్పుడూ చదరంగం గురించే ఆలోచిస్తుంటాడు. దానికోసం అతను ప్రత్యేకించి ధ్యానంలో కూర్చుని చదరంగం గురించి ఆలోచించనవసరం లేదు. అతని మనస్సులో చదరంగం తిష్ఠవేసుకుని కూర్చుని ఉంటుంది.

అలాగే ఒక శాస్త్రజ్ఞుని మనస్సు నిండా, అతను చేసే పరిశోధన నిండివుంటుంది. ఇల్లు కట్టుకుంటున్న వ్యక్తి ఆలోచనలన్నీ ఇంటి చుట్టూనే భ్రమిస్తూ ఉంటాయి. ఇదే సూత్రం ప్రకారం మీ జీవితంలో మీకు మోక్షం లేదా భగవంతుడు లేదా బ్రహ్మ మీకు అత్యంత ముఖ్యమైతే, అంటే ఈశ్వరప్రాప్తి పొందాలనేది మీ మొట్టమొదటి లక్ష్యం అయితే, దాని గురించి ఆలోచించటానికి మీరేమీ శ్రమ పడనవసరం లేదు. మీ మనస్సు దానంతట అదే భగవంతుని గురించి ఆలోచిస్తుంది.

భాగవతంలోని, గోపికాగీతంలో అదే అంశం చూస్తాము. వారే పని చేస్తున్నా, వారి మనస్సులో కృష్ణపరమాత్మే నెలకొనివున్నాడు. కృష్ణపరమాత్మ అంటే ఈశ్వరుడు లేదా బ్రహ్మ లేదా మోక్షం. మోక్షం మీకంత మొట్టమొదటి లక్ష్యం అయితే, తక్కిన విషయాల మాటేమిటి? తక్కిన అంశాలను మీరు పనిగట్టుకుని వదులుకోనవసరం లేదు; వాటంతట అవే వెనక్కి వెళతాయి. అవి మోక్షానికి దారి తీయవు. మోక్షమే మీ అంతిమలక్ష్యంగా తపన పడితే, దాన్ని ముముక్షుత్వం అంటారు. తక్కిన విషయాలు కింది స్థాయికి వెళ్ళి, వాటి ప్రాముఖ్యత తగ్గితే, దాన్ని వైరాగ్యం అంటారు.

అందువల్ల వైరాగ్యాన్ని నిర్వచించాలంటే – జీవితంలో ముఖ్యమైనది ఏమిటో స్పష్టమైన అవగాహన ఉన్నట్టు చెప్పవచ్చు. వైరాగ్యం అంటే మానసిక పరిపక్వత తప్ప మరేమీ కాదు. వైరాగ్యం అంటే జీవితంలో పొందాల్సిన లక్ష్యాల గురించిన స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం. డబ్బు కావాలి నిజమే, ఆనందాలు పొందాలి నిజమే, మరెన్నో కావాలి

నిజమే – కాని అంతిమలక్ష్యం మాత్రం **మోక్షం**. ఆ లక్ష్యంమీద నిలబడితే, అది మనస్సులో ఎప్పుడూ చోటుచేసుకుని ఉంటుంది. అప్పుడు దానికోసం ప్రత్యేకించి ధ్యానంలో కూర్చుని, మనస్సును ఆ లక్ష్యం వైపు తిప్పనవసరం లేదు. మనస్సే అటువైపు, దానంతట అదే తిరుగుతుంది. అందువల్ల, రెండవ అర్హత, జీవితంలో ముఖ్యమైన లక్ష్యం గురించిన స్పష్టత ఉండటం.

**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే।**

జీవితంలో అన్నీ కావాలి, కాని అన్నింటికన్నా ఎక్కువగా గోవిందుడు కావాలి. ఈ భావన తక్కినవాటిమీద వైరాగ్యాన్ని పెంచుతుంది.

సి) **ఆత్మకృప** – కృష్ణపరమాత్మ నొక్కివక్కాణించిన మూడవ సాధన ఆత్మకృప.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్।** – 6.5

నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి. నిన్ను నువ్వు ఎప్పుడూ తక్కువ చేసుకోకూడదు.

ఈ ఆత్మన్యూనతా భావన మిమ్మల్ని జీవితంలో పైకి రాకుండా చేస్తుంది. ఇప్పటికే బాహ్యంగా రెండు ఆటంకాలు ఉన్నాయి. అవి – అధిభౌతిక ప్రతిబంధకం, అధిదైవిక ప్రతిబంధకం. ఇవి చాలవన్నట్టు మీరు మూడవ ప్రతిబంధకాన్ని కూడా కలుగజేస్తే, భగవంతుడు కూడా నిస్సహాయుడవుతాడు. నేను జీవితంలో ఏమీ సాధించలేను అని మీరు మీ గురించి తక్కువగా భావిస్తే అది అధ్యాత్మిక ప్రతిబంధకం అవుతుంది. సాక్షాత్తూ, ఆ భగవంతుడే దిగివచ్చి, 'రా నాయనా, నీకు సహాయం చేస్తాను,' అంటే మీరు, 'ఓ దేవా! మీకు నా గురించి తెలియదు. నేను ఏదీ సాధించలేను,' అంటారు. అందువల్ల ఆత్మవిశ్వాసం ఉండాలి మీకు.

ఆత్మవిశ్వాసాన్ని ఆత్మస్థైర్యం అనికూడా అంటారు. ఆత్మస్థైర్యం వేరు, అహంకారం వేరు. అహంకారంలో మీ కృషివల్లనే మీరు విజయం సాధించారని గొప్పలు చెప్పుకుంటారు. ఆత్మస్థైర్యంలో అలా కాదు. దైవకృపవల్ల నేను విజయాన్ని పొందగలిగానని చెబుతారు. ఆ విధంగా ఆత్మకృప, ధైర్యం మీ అహంకారంవల్ల కలగదు, మీకు భగవంతునిమీద ఉన్న భక్తివల్ల కలుగుతుంది. అందువల్ల ఈశ్వరానుగ్రహంవల్ల నేను నా లక్ష్యాన్ని పొందగలను అంటారు మీరు.

**మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి** – 18.58

నామీదే మనస్సు నిలిపితే, నా అనుగ్రహంవల్ల అన్ని ఆటంకాలనుంచి తప్పించుకోగలవు.

ఆధ్యాత్మిక ఎదుగుదల అనేది కొండ ఎక్కటం అంత కష్టమనేది నిజమే. కాని నువ్వు ముందుండి కొండెక్కటానికి నన్ను పైకిలాగు. కిందనుంచి పైకి రావటానికి నేను కృషి

చేస్తాను. కొండ మీదికి వెళ్ళే రైలుకు ముందొక ఇంజను, వెనుకొక ఇంజను ఉన్నట్టుగా, ఆధ్యాత్మిక జీవనమనే కొండ ఎక్కటానికి ఈశ్వరానుగ్రహం ముందు ఇంజనైతే, ఆత్మవిశ్వాసం వెనుక ఇంజను.

ఆ విధంగా ధ్యానానికి బహిరంగ సాధనలు – సమత్వం, వైరాగ్యం, ఆత్మకృప లేదా ఆత్మవిశ్వాసం.

2. **అంతరంగ సాధనలు – శ్లోకాలు 10 – 15** ఈ అంతరంగ సాధనలను మళ్ళీ రెండు భాగాలుగా విభజించవచ్చు– శారీరక సాధన, మానసిక సాధన. ఈ సాధనలను వివరంగా చెప్పుకొస్తాడు కృష్ణపరమాత్మ.

**శారీరక సాధనలు–**

**ప్రదేశం** – ఏకాంతప్రదేశంలో, ఒంటరిగా చేయాలి. ఆ ప్రదేశం వీలున్నంత ప్రశాంతంగా ఉండాలి. బాహ్యంగా శుద్ధంగా ఉండాలి. అదికాక, ఆ ప్రదేశాన్ని చూడగానే ధ్యానం చేయాలనే భావన కలగాలి. శుభ్రంగా ఉందికదా అని భోజనాల గదిలో ధ్యానం మొదలుపెడితే అది శివధ్యానం బదులు వడ ధ్యానమో, ఇడ్లీ ధ్యానమోగా మారే ప్రమాదముంది. ధ్యానం చేసే చోట దేవుని పటమో, మహాత్ముల పటమో పెట్టుకుని, దీపం వెలిగించి ధ్యానం చేస్తే మంచిది.

**ఆసనం** –

**శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః ।**
**నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరమ్ ॥** – 6.11

ఆసనానికి మూడు వరుసలు ఉండాలి. దర్భాసనం వేసి, దానిమీద జింకచర్మం పరచి, దానిపైన ఒక వస్త్రాన్ని వేయాలి. ఆసనం మరీ గట్టిగా ఉండకూడదు, మరీ మెత్తగా ఉండకూడదు. అది మరీ మెత్తగా ఉంటే నడుము ఒంగుతుంది; నిటారుగా నిలవదు. మరీ గట్టిగా ఉంటే నొప్పి చేస్తుంది.

**శరీరస్థితి** – కదలకుండా, నిశ్చలంగా కూర్చోవాలి. కిందభాగం ఎక్కువ ఉంటే, అంటే కాళ్ళు వీలున్నంత వెడల్పుగా పెడితే నిశ్చలంగా కూర్చోవటానికి వీలుంటుంది.

**సమం కాయశిరోగ్రీవం** – 6.13

శరీరాన్ని, మెడను, శిరస్సును నిటారుగా ఉంచాలి. అలాగని బిగుసుకుపోకూడదు. విశ్రాంతిగా ఉండాలి.

**ప్రాణసామ్యం** – శ్వాస కూడా సమానంగా, మెత్తగా, విశ్రాంతిగా రావాలి. ఎందుకంటే మీ ఆలోచనలకూ, శ్వాసకూ మధ్య అనుబంధం ఉంటుంది –

**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ** – 5.27

ప్రాణాపాన వాయువులను సమస్థితిలో నడపాలి. శ్వాస సరిగ్గా లేకపోతే, ఆలోచనలు సరిగ్గా ఉండవు. శ్వాస సమంగా, మృదువుగా, నిదానంగా ఉంటే మనస్సు కూడా ప్రశాంతంగా ఉంటుంది. ఆ విధంగా చిత్తం, ప్రాణం ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి.

మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే శ్వాస సమంగా ఉండాలి. శ్వాస సమంగా ఉండాలంటే శరీరం, మెడ, శిరస్సు ఒక లంబరేఖలో నిటారుగా ఉండాలి. అవి నిటారుగా ఉండాలంటే ఆసనం మరీ మెత్తగా ఉండకూడదు, మరీ గట్టిగా ఉండకూడదు. శ్వాస నిదానంగా ఉండాలంటే దానికోసం ప్రత్యేకించి ప్రాణాయామం చేయనవసరం లేదు. మరీ ప్రాణాయామానికి ప్రాముఖ్యతనిస్తే, ధ్యానం పక్కకి వెళ్ళిపోతుంది. ఇక్కడ కూర్చున్నది ధ్యానం చేయటానికి. అందువల్ల ప్రాణవీక్షణం చేస్తే చాలు – అంటే శ్వాస సమంగా, మృదువుగా, నిదానంగా వస్తున్నదో లేదో గమనిస్తే చాలు.

**ఇంద్రియ నిగ్రహం** – ఇంద్రియ నిగ్రహం సాధన చేయాలి. కృష్ణపరమాత్మ ప్రత్యేకించి కన్ను గురించి చెబుతున్నాడు. ఎందుకంటే, కన్ను చాలా శక్తివంతమైన ఇంద్రియం.

**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్** – 6.13

ధ్యానంలో నాసికాగ్రాన్ని చూడాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ స తం పరం పురుషముపైతి దివ్యమ్** – 8.10

మరణసమయంలో యోగబలంతో భ్రుకుటి మధ్య ప్రాణాలను స్థిరంగా నిలుపు అంటాడు కృష్ణపరమాత్మ ఎనిమిదవ అధ్యాయంలో. సహజంగానే ఇది సందేహానికి దారితీస్తుంది. మీరు ధ్యానం చేసేటప్పుడు నాసికాగ్రాన్ని చూడాలా, భ్రుకుటి మధ్య చూడాలా? ఏది సరియైనది? ముక్కు చివరగా చూడకూడదు, భ్రుకుటి మధ్యా చూడకూడదు. ఎందుకంటే, ఈ రెండింటిలో ఎలా చూసినా, ధ్యానం చేయటం మాట దేవుడెరుగు, మీకు తలనొప్పి వస్తుంది. కళ్ళు ఉన్నవి ముక్కు చివర చూడటానికి కాదు. ఎవరో తుంటరిప్రశ్న వేశారు, 'చైనావారికి చప్పిడి ముక్కు ఉంటుంది. మరి వారి మాటేమిటి?' దానికి జవాబు ఒక్కటే! ఈ వివరాలన్నీ సూచనలు మాత్రమే, నిబంధనలు కావు. వాటిని అక్షరాలా తీసుకోకుండా, వాటి అర్థాన్ని గ్రహించాలి.

ముక్కు చివర చూడమంటే, దాన్నే పట్టుకు కూర్చోకూడదు, అప్పుడు అది ముక్కుధ్యానం అవుతుంది. ముక్కుధ్యానంవల్ల చిత్తశుద్ధి కలగదు. ముక్కు చివర చూడమంటే, దానర్థం ధ్యానసమయంలో అరమోడ్పు కన్నులు ఉండాలి అని. కన్నులు బాహ్యవస్తువుల వెంట పరుగులు తీయకూడదు. కన్నులు సగం మూస్తే, అది ఇంద్రియనిగ్రహానికి సూచన.

ఇప్పటిదాకా శారీరక సాధన చూశాము. ఇప్పుడు మానసిక సాధన.

**మానసిక సాధన –**

**సంకల్పప్రభవాన్ కామాన్ త్యక్త్వా సర్వానశేషతః ।**
**మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥** – 6.24
**శనైః శనైరుపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా** – 6.25

భవిష్యత్తును గురించిన ఆలోచనలను, ప్రణాళికలను త్యజించి, ఇంద్రియ సముదాయాన్ని మనస్సు ద్వారా నిగ్రహించి, చివరిదాకా ప్రయాణం కొనసాగించే ధైర్యం ఉన్న బుద్ధితో క్రమక్రమంగా, మెల్లమెల్లగా ఆత్మలో నిలబెట్టాలి.

ఇంద్రియాలను బాహ్యప్రపంచంనుంచి విడదీసినా కూడా, మనస్సు స్వంతంగా ఒక ప్రపంచాన్ని సృష్టించగలదు. అది సృష్టించిన భార్యాపిల్లల గురించి, ఇల్లు గురించి, వ్యాపారం గురించి ఆందోళన పడేలాగా చేయగలదు. అందువల్ల కృష్ణపరమాత్మ **త్యక్త్వా సర్వానశేషతః** అంటున్నాడు. అంటే పూర్తిగా అన్ని ప్రణాళికలనూ త్యజించమంటున్నాడు. ఇది సాధించటానికి అద్భుతమైన పద్ధతుల్లో ఒకటి – తాత్కాలికంగా మన కోరికలన్నింటినీ భగవంతుని పాదాల చెంత ఉంచటమే.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

ఎవరైతే అనన్యభక్తితో నిరంతరమూ నన్నే పూజిస్తారో, అలా నిష్కామభక్తితో సేవించేవారి యోగక్షేమాలు నేనే చూసుకుంటాను అని హామీ ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ.

యోగం అంటే పొందని వస్తువుకోసం తపన. క్షేమం అంటే ప్రాప్తించిన వస్తువుయొక్క రక్షణకోసం తపన. మీ జీవితమంతా ఈ యోగక్షేమాల గురించిన చింతనతోనే సరిపోతుంది. 'భవిష్యత్తులో మమ్మల్ని ఎవరు చూసుకుంటారు? మాకేదైనా జరగరానిది జరిగితే, మా పిల్లల గతి ఏమిటి?' ఇవి నిరంతరం వేధిస్తాయి. కాస్త ఖాళీగా ఉంటే చాలు, ఈ బెంగలు దూసుకువచ్చేస్తాయి. వయస్సు పైనబడ్డకొద్దీ ఈ బెంగలు కూడా మీతోపాటు పెరుగుతాయి – **వృద్ధస్తావత్ చింతాసక్తః**. కాకపోతే ఈ చింతలను సమర్థవంతంగా చేస్తారు.

**వార్ధక్యే చేన్ద్రియాణాం విగతగతిమతిశ్చాధిదైవాతాపైః**
**పాపై రోగైర్వియోగైస్త్వనవసితవపుః ప్రౌఢిహీనం చ దీనమ్ ।**
**మిథ్యామోహాభిలాషైర్భ్రమతి మమ మనో ధూర్జటేర్ధ్యానశూన్యం**
**క్షన్తవ్యో మేఽ పరాధః శివ శివ శివ భోః శ్రీమహాదేవ శమ్భో॥**

– శివాపరాధ క్షమాపణ స్తోత్రం 4

వార్థక్యంలో ఇంద్రియాలు, మనస్సు వాటి శక్తిని కోల్పోయాయి; నా శరీరం రోగాల పాలయి, బలహీనమైంది. అయినా ఇప్పటికీ నా మనస్సు శివధ్యానం చేయలేకుండా ఉంది. నన్ను క్షమించు.

ఆధ్యాత్మిక చింతనను అంతకంతకీ వెనక్కి తోస్తుంటారు – బాల్యంలో యౌవనానికి, యౌవనంలో వృద్ధాప్యానికీ తోసేస్తారు. వృద్ధాప్యంలో పిల్లల బాధ్యత తీరుతుంది, ఉద్యోగ విరమణ చేస్తాము, అప్పుడు నిశ్చింతగా కాలుమీద కాలు వేసుకుని కృష్ణా రామా అంటూ సమయం గడపవచ్చు అనుకుంటారు. కాని కృష్ణా రామా అనే బదులు గతంలో చేసిన పొరపాట్ల గురించో, భవిష్యత్తు గురించిన ఆందోళనతోనో గడిపేస్తారు.

**కిమహం సాధు నాకరవం కిమహం పాపమకరవమితి** – తైత్తిరీయమ్

ఇలా ఎందుకు చేశాను? అలా ఎందుకు అన్నాను? ఈవిడను ఎందుకు పెళ్ళి చేసుకున్నాను? (మనవళ్ళు కూడా పుట్టేశారు. ఇప్పుడు సరియైన భార్యను ఎన్నుకోలేదని పశ్చాత్తాపపడుతున్నాడు.) ఆ విధంగా భూతకాలంలో చేసిన పాపాల గురించిన అపరాధ భావన, భవిష్యత్తు గురించిన బెంగ. ఈ జంట రాక్షసులు మనస్సును తొలిచేస్తుంటారు. వాటిని పారద్రోలటానికి ఒకటే మార్గం ఉంది. భగవంతుణ్ణి శరణు వేడటమే! 'ఓ దేవా! నన్ను క్షమించు – **క్షంతవ్యో మేఽ పరాధః.**

నేను ఎన్నో పాపాలు చేశాను, నన్ను క్షమించు. భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు. ఎటువంటి పరిస్థితి ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ఇవ్వు. నేను గతం గురించిన చింత, భవిష్యత్తు గురించిన ఆందోళన పడకుండా ఉండేలా చేయి. నన్ను వర్తమానంలో జీవించేటట్టు చేయి – దీన్ని మనస్సును వెనక్కు లాగటం అంటారు. మనస్సును వెనక్కి లాగటానికి ఒక అద్భుతమైన పద్ధతి **శరణాగతి**. ఇది మానసిక సంసిద్ధతను చూపుతుంది. శారీరక సంసిద్ధత, మానసిక సంసిద్ధత కలిసి అంతరంగ సాధనలు అవుతాయి.

3. **ధ్యాన స్వరూపం : శ్లోకాలు 18 –23** ధ్యానం అంటే ఏమిటి?

**సజాతీయ ప్రత్యయ ప్రవాహః**

ధ్యానం అంటే ఒక విషయానికి చెందిన ఆలోచనల నిరంతర ప్రవాహం. ఏ వస్తువుమీద ధ్యానం చేస్తున్నారో, ఆ వస్తువుమీద ఆలోచనల ప్రవాహం. ఒకటే ఆలోచన ఉండి తీరాల్సిన పనిలేదు. ఆ ఆలోచనలు మారవచ్చు, కాని అవన్నీ ఒకటే వస్తువుమీద ఉండాలి. ఈ ఆలోచనలు ప్రవాహంలా ఉండాలి. అది కూడా ఎలా?

**విజాతీయ ప్రత్యయ అనంతరిత**

విభిన్న ఆలోచనల ప్రవాహంయొక్క ఆటంకం లేకుండా ఉండాలి. మొత్తం కలిపి ధ్యానం అంటే విభిన్న ఆలోచనల ప్రవాహంయొక్క ఆటంకం లేని ఒకే విషయానికి చెందిన ఆలోచనల ప్రవాహం.

దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ధ్యానం అంటే మనస్సును ఆలోచనలు లేకుండా శూన్యం చేయటమో, ఖాళీ చేయటమో కాదు. ధ్యానంలో మనస్సును శూన్యం చేయగలరు నిజమే కాని, ఇక్కడ మనం అటువంటి ధ్యానం గురించి చెప్పటం లేదు. ధ్యానం నిర్వచనమే సజాతీయ ప్రత్యయ ప్రవాహం అని చూశాము. ఇది మానస వ్యాపారం, మనస్సు చేసే పని.

ఇక్కడ కృష్ణపరమాత్మ ధ్యానస్వరూపాన్ని వివరించేటప్పుడు మూడు దశలను పేర్కొన్నాడు. అవి పతంజలి అష్టాంగయోగంలో చెప్పబడిన వాటికి దగ్గరగా ఉన్నాయి. ఏమిటా మూడు దశలు? పతంజలి యోగశాస్త్రం ప్రకారం చెప్పాలంటే అవి ధారణ, ధ్యానం, సమాధి. మూడూ ధ్యానంలోని అంతర్గత భాగాలు.

**ధారణ** – ధారణ అంటే ఏకాగ్రత చూపటం. ఏకాగ్రత అని ఎందుకంటున్నామంటే మనస్సు బాహ్యవస్తువుల వెంట పరుగులు తీస్తుంది. బాహ్యవస్తువులనుంచి దృష్టిని మరల్చి, ఒక వస్తువుమీద నిలపాలి. ఒక ఫోటో తీస్తున్నప్పుడు ఎవరి ఫోటో తీస్తున్నారో, ఆ వ్యక్తి మొహం సరిగ్గా కెమెరా మధ్యలోకి వచ్చేలాగా అమర్చాలి.

**ధ్యానం** – ధ్యానం అంటే ధ్యానవస్తువుమీద మనస్సును నిలపటం. ధారణకూ, ధ్యానానికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. ధారణ అంటే ఒక వస్తువుమీద దృష్టి పెట్టటం; ధ్యానం అంటే ఆ దృష్టిని దానిమీదే నిలపటం. ఉదాహరణకు ఒక ఫోటో తీయాలంటే, ముందు ఒక వ్యక్తి మీదో, ఒక వస్తువుమీదో దృష్టి పెట్టటం; తరువాత ఏకాగ్రత చెదరకుండా ఫోటో తీసేవరకూ దానిమీదే దృష్టిని నిలపటం. జారిపోతున్న మనస్సును వెనక్కి లాగటమే ధ్యానం.

**సమాధి** – చంచలంగా పరుగులు తీస్తున్న మనస్సును ధ్యానవస్తువుమీద నిలబెట్టటం ధ్యానం అని చూశాము. సమాధిలో ధ్యానవస్తువులో సహజంగా స్థిరపడటం జరుగుతుంది. ఇంక ఈ స్థితిలో పరధ్యానం ఉండదు. ధ్యానంలో మనస్సుతో చిన్న యుద్ధం చేయాలి. సమాధిలో యుద్ధం ముగిసి, మనస్సు నిలకడ చెందుతుంది.

**విజాతీయ ప్రత్యయ అనంతరిత సజాతీయ ప్రత్యయ ప్రవాహః**

అంటే భిన్న ఆలోచనల ఆటంకం లేకుండా సజాతీయ ఆలోచనల ప్రవాహం. సమాధి అంటే ఒకే మాదిరి ఆలోచనల ప్రవాహం. ఒక దేవుణ్ణి ఊహించుకుంటే, ఆ దేవుని మొహం, కళ్ళు, చేతులు గురించి ధ్యానం చేయవచ్చు. ఆ విధంగా ఆలోచన మారవచ్చు కాని ఏ దేవునిమీద ధ్యానం చేస్తున్నారో ఆ దేవుడు మారకూడదు.

మీకు ధ్యానం ఏమీ కొత్త కాదు. మీ ప్రమేయం లేకుండానే కూతురు ధ్యానం, కొడుకు ధ్యానం, ధనం ధ్యానం చేస్తూనే ఉంటారు. నిజానికి ఈ ధ్యానం చిన్న వయస్సులో ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఒక చిన్న బాబు, ఈగ వెళుతుంటే దానిమీద ఎంత ఏకాగ్రత చూపుతాడంటే, పక్కనుంచి తల్లి అరుస్తున్నా వినబడదు. అదే విధంగా ఒక పుస్తకం చదువుతుంటేనో, గాలి కబుర్లు వింటుంటేనో ఎంత ఏకాగ్రత చూపుతారు?

సమాధి పదం మీకు కొత్తకాదు. అదేదో సిద్ధి కాదు. సమాధి అంటే దేనిమీదైనా చెక్కుచెదరని ఏకాగ్రత చూపటం. ధారణలో ఫలానా వస్తువుమీద ధ్యానం చేయాలని ప్రయత్నపూర్వకంగా నిశ్చయించుకుంటారు. అంతే తేడా! **ధ్యేయ విషయః సమాధిః.** దానికి ముందు ప్రయత్నపూర్వకంగా ప్రయత్నిస్తే, నెమ్మదిగా అదే అలవాటవుతుంది.

**ధారణ + ధ్యానం + సమాధి = సంయమం**

ఈ సంయమం గురించే కృష్ణపరమాత్మ ధ్యానసాధనగా చెబుతున్నాడు. దానికి ఒక ఉదాహరణను చెబుతున్నాడు.

**యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।**
**యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః ॥** – 6.19

గాలికి రెపరెపలాడుతున్న దీపం పైన చిమ్నీ పెడితే, అది ఎలా స్థిరంగా వెలుగుతుందో, అదే విధంగా సమాధిలో నిలిచిన మనస్సు స్థిరంగా ఉంటుంది.

ఒక దీపాన్ని వెలిగించి, దాన్ని గాలిలో పెడితే ఏమవుతుంది? అది చిరుగాలికి రెపరెపలాడుతుంది. అప్పుడు గాలికి రెపరెపలాడుతున్న దీపం పైన చిమ్నీ పెడితే, అది రెపరెపలాడటం మానేసి, స్థిరంగా వెలుగుతుంది. దీపం స్థిరంగా ఉన్నట్టు సమాధిలో ఉన్న వ్యక్తియొక్క ఆత్మాకారవృత్తి, అనాత్మాకారవృత్తివల్ల చెదరకుండా ఉంటుంది.

4. **ధ్యానవస్తువు : శ్లోకాలు 24–28** ధ్యానవిషయం లేదా ధ్యానవస్తువు ఏదైనా కావచ్చు. ధ్యానవస్తువు సగుణ ఈశ్వరుడు అవవచ్చు లేదా నిర్గుణ ఈశ్వరుడు అవవచ్చు. నిర్గుణ ఈశ్వరుణ్ణే బ్రహ్మ అంటారు. సగుణ ఈశ్వరధ్యానం చేస్తే దాన్ని ఉపాసన అంటారు; నిర్గుణ ఈశ్వరధ్యానం చేస్తే దాన్ని నిదిధ్యాసనం అంటారు. రెండూ ధ్యానంలోకే వస్తాయి; రెండింటికీ బహిరంగ, ఆంతరంగ సాధనలు ఒకటే. భేదం ఎక్కడ ఉంది? ధ్యానవస్తువులో ఉంది.

అంతేకాదు, నిర్గుణ ఈశ్వరధ్యానం చేస్తే ఒక ప్రత్యేకత గోచరిస్తుంది. ధ్యానవస్తువు కాస్తా ధ్యాత అవుతుంది. అంటే ఉపాస్యవస్తువు, ఉపాసకుడు అవుతుంది. ఆబ్జెక్ట్ మరేదో కాదు, సబ్జెక్ట్. అందువల్ల నిర్గుణ ఈశ్వరధ్యానం చేసేటట్టయితే, అది ఆత్మధ్యానమే అవుతుంది. ఎందుకంటే నిర్గుణ ఈశ్వరుడు ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు. ఈ విషయాన్ని కేనోపనిషత్తు అద్భుతంగా వర్ణిస్తుంది.

**యన్మనసా న మనుతే యేనాహుర్మనో మతమ్**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన 1.5
**యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూగ్ంషి పశ్యతి**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన 1.6
**యచ్ఛ్రోత్రేణ న శృణోతి యేన శ్రోత్రమిదగ్ం శ్రుతమ్**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన 1.7

బ్రహ్మ నీ మనస్సు లేదా ఆలోచన చూసే ఆబ్జెక్టు కాదు, మనస్సువల్ల ఎన్నటికీ తెలుసుకోలేనిది, కాని బ్రహ్మవల్లనే మనస్సు తెలియబడుతుంది. నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు. ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవు అని తెలుసుకో.

బ్రహ్మను కంటితో చూడలేవు కాని బ్రహ్మవల్లనే కన్ను పనిచేస్తున్నది. నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు, ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవు అని తెలుసుకో.

బ్రహ్మను చెవులతో వినలేవు కాని బ్రహ్మవల్లనే చెవులు పనిచేస్తున్నాయి. నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు, ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవు అని తెలుసుకో.

ఆ విధంగా ఉపాసన వేరు, నిదిధ్యాసనం వేరు. ఉపాసన సగుణ ఈశ్వరునిమీద చేస్తారు. అది జ్ఞానం పొందకముందు చేస్తారు. అది చిత్తఏకాగ్రతను ఇస్తుంది, తద్వారా జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఇస్తుంది. ఆత్మజ్ఞానం శ్రవణ, మననాల ద్వారా పొందాక, బ్రహ్మజ్ఞానంలో నిలబడటానికి చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. ఎందుకంటే అది ఆత్మధ్యానం అవుతుంది; అద్వైతధ్యానం అవుతుంది. సగుణధ్యానం అనాత్మధ్యానం అవుతుంది; ద్వైతధ్యానం అవుతుంది. అలా ధ్యానం అంటే ఉపాసన అవవచ్చు; నిదిధ్యాసనం అవవచ్చు. ఇక్కడ ఈ ఆరవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ బోధిస్తున్న ధ్యానం నిదిధ్యాసనం.

నిదిధ్యాసనం = నిర్గుణ ఈశ్వరధ్యానం = అద్వైతధ్యానం = ఆత్మధ్యానం.

**శనైః శనైరుపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా ।**
**ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥** – 6.25
**యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్ ।**
**తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశం నయేత్ ॥** – 6.26

చివరివరకూ ప్రయాణం కొనసాగించే ధైర్యం ఉన్న బుద్ధితో, క్రమక్రమంగా, మెల్లగా మనస్సును ఆత్మలో నిలబెట్టాలి. ఇంక వేరే దేనిగురించీ కొంచెం కూడా ఆలోచించకూడదు. క్రమంగా అనాత్మ ఆలోచనలను పరిత్యజించాలి.

సహజంగా నిలకడలేని చంచలమైన మనస్సు ప్రాపంచిక విషయాల వెంట పరుగులు తీస్తుంది. కాని మనస్సును ఆ వస్తువునుంచి వెనక్కు తీసుకువచ్చి, ఆత్మలోనే నిలబెట్టాలి.

మనస్సును ఆత్మలో నిలబెట్టాలి అంటే ఇది నిదిధ్యాసనధ్యానం. నిదిధ్యాసనధ్యానం చేయాలనుకుంటే, అంతకుముందు శ్రవణ, మననాలు చేసివుండాలి. నిర్గుణబ్రహ్మమీద ధ్యానం చేయాలంటే, నిర్గుణబ్రహ్మ అంటే ఏమిటో తెలియాలి. తెలియని విషయంమీద ధ్యానం చేయలేరు. ఉదాహరణకు మిమ్మల్ని 'పంతంగ్' అనే పదంమీద ధ్యానం చేయమన్నామనుకోండి. ఆ పదం మీరు ఎన్నడూ వినివుండరు. అందువల్ల ఏమిటి అంటారు. మళ్ళీ చెప్పాక, నిఘంటువులో దాని అర్థంకోసం చూస్తే, అసలు ఆ పదమే ఉండదు. అసలు లేనేలేని పదం గురించి ఆలోచించనే లేనప్పుడు, దానిమీద ధ్యానం ఎలా చేస్తారు?

అందువల్ల ఆత్మధ్యానం లేదా బ్రహ్మధ్యానం చేయాలంటే, అది ఆత్మవిచారణ చేశాకే సాధ్యం. ఆత్మవిచారణ చేయాలంటే అది గురుశిష్యసంవాదం ద్వారానే సాధ్యం. కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో ఆత్మధ్యానం గురించి బోధిస్తున్నాడు. ఎందుకంటే 2-5 అధ్యాయాల్లో ఆత్మస్వరూపం గురించి బోధించాడు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**

**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

రెండవ అధ్యాయంలో శ్లోకాలు 12-25 ఆత్మలక్షణాలు ఆరింటిని పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ. అవి ఆత్మ నిత్యం, ఆత్మ సత్యం, ఆత్మ సర్వవ్యాపకం, ఆత్మ అప్రమేయం, ఆత్మ అకర్తా – అభోక్తా, ఆత్మ నిర్వికారం.

**ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః ।**

**మనసస్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః ॥** – 3.42

విషయవస్తువులకన్నా ఇంద్రియాలు శ్రేష్ఠం. ఇంద్రియాలకన్నా మనస్సు శ్రేష్ఠం. మనస్సుకన్నా శ్రేష్ఠమైనది బుద్ధి, బుద్ధికన్నా శ్రేష్ఠమైనది ఆత్మ.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**

**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥** – 4.24

బ్రహ్మనిష్ఠలో ఉన్న జ్ఞానికి యజ్ఞంలో వాడే స్రుక్కు, సువం బ్రహ్మ; ఆ స్రుక్కు, స్రువాలలో వాడే ద్రవ్యం బ్రహ్మ; అగ్ని కూడా బ్రహ్మే; యజ్ఞం చేయించే వ్యక్తి కూడా బ్రహ్మ; యజ్ఞఫలంగా వెళ్ళే స్వర్గలోకం కూడా బ్రహ్మే.

**కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః** – 4.18

తెలివైన వ్యక్తి ఆత్మ అకర్తా అని తెలుసుకుంటాడు. ఆత్మ పనిచేసినట్లు కనిపించినా నిజంగా ఆత్మ కర్త కాదు; అనాత్మ ఎప్పుడైనా పనిచేయనట్లు కనిపించినా అనాత్మ ఎప్పటికీ కర్తే.

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్** – 5.8

చూస్తున్నా, వింటున్నా, స్పర్శిస్తున్నా, వాసన చూస్తున్నా, నడుస్తున్నా, నిద్రిస్తున్నా, శ్వాసక్రియలు నడుపుతున్నా, మాట్లాడుతున్నా, విసర్జనక్రియలు చేస్తున్నా, గ్రహిస్తున్నా, కనురెప్పలు మూసితెరిచినా జ్ఞాని, 'నేను కొంచెం కూడా ఏమీ చేయటంలేదు, నేను ఆత్మను, నేను అకర్తను,' అనే జ్ఞానంలో ఉంటాడు.

**సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్** – 5.13

ఈ విధంగా జ్ఞాని తను ఆత్మ, తను అకర్త అని తెలుసుకున్నాక అన్ని కర్మలనూ పరిత్యజిస్తాడు. అతను కర్మలను పరిత్యజిస్తాడు అంటే నిజంగా కర్మలను పరిత్యజించడు, నేను కర్మలు చేస్తున్నాను అనే భావనను పరిత్యజిస్తాడు. నేను దేహాన్ని కాదు, తొమ్మిది ద్వారాలున్న పురంలో పురస్వామిగా ఉన్నాను అంటాడు. తను ఆత్మగా కర్తా కాదు, కారయితా కూడా కాదు. అంటే ఆత్మ ఏ పనీ చేయదు, ఎవరిచేతా కూడా పని చేయించదు.

ఇలా క్రమంగా ఆత్మజ్ఞానం పొంది, ఆత్మస్వరూపాన్ని అర్థం చేసుకున్న వ్యక్తే ఆత్మధ్యానం చేయగలడు. అందువల్లనే కృష్ణపరమాత్మ మొదటే ఆత్మధ్యానాన్ని ప్రవేశపెట్టలేదు. 2,3,4,5 అధ్యాయాల్లో ఆత్మజ్ఞానం కూలంకషంగా బోధించాక, ఆత్మధ్యానాన్ని 6వ అధ్యాయంలో ప్రవేశపెట్టాడు.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోత్రవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – బృహదారణ్యకమ్ 2.5

ఆత్మజ్ఞానాన్ని పొందాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనాలు చేసితీరాలి అంటుంది బృహదారణ్యకోపనిషత్తు.

**ప్రథమం నిదిధ్యాసనం కరోమి తదనంతరం శ్రవణమననం కరోమి ఇతి వక్తుం న శక్యతే**

శ్రవణ, మనన, నిదిధ్యాసనాలు చేయమన్నారు కదా అని, ముందు నిదిధ్యాసనం చేస్తాను, తరువాత శ్రవణ, మననాలు చేస్తాను అనకూడదు. అందువల్ల ఆత్మధ్యానం చేయాలంటే గురువు దగ్గర వేదాంతశాస్త్రవిచారణ చేసి ఉండాలి.

ఒకవేళ ఎవరైనా, 'నేను ఆత్మవిచారణ చేయలేదు, నాకు ఆత్మ గురించి తెలియదు కాబట్టి నేనెలా నిదిధ్యాసనం చేయను?' అని అడిగితే, మీకు ఆత్మస్వరూపం తెలియదు కాబట్టి మీరు అనాత్మధ్యానం లేదా సగుణ ఈశ్వరధ్యానం చేయవచ్చు! అని చెప్పాలి. 'నిజానికి చేయవచ్చు సరియైన సమాధానం కాదు. మీరు సగుణ ఈశ్వరధ్యానమే చేయాలి,'

అని చెప్పాలి. ఎందుకంటే సగుణ ఈశ్వరధ్యానం చేయందే, తద్వారా జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొందందే, ఎవరూ నిర్గుణధ్యానానికి రాలేరు.

**నిర్విశేషం పరం బ్రహ్మ సాక్షాత్ కర్తుమ్ అనీశ్వరః।**
**యే మందాస్తేఽనుకంప్యంతే సవిశేషనిరూపణైః॥**

నిర్గుణ ఈశ్వరధ్యానానికి సిద్ధంగా లేనివారికి శాస్త్రం సవిశేష బ్రహ్మను అంటే సగుణ ఈశ్వరుణ్ణి సూచిస్తుంది. సగుణ ఈశ్వరధ్యానం చేయటానికి సుదీర్ఘమైన వేదాంతవిచారణ చేయనవసరం లేదు. నిజానికి, ఏ పురాణం చూసినా రామస్వరూపాన్నో, కృష్ణస్వరూపాన్నో వర్ణిస్తాయి.

**ఛాయాయాం పారిజాతస్య హేమసింహాసనోపరి ।**
**ఆసీనమంబుదశ్యామమ్ ఆయతాక్షమలంకృతమ్ ॥**
**చంద్రాననం చతుర్బాహుం శ్రీవత్సాంకితవక్షసమ్ ।**
**రుక్మిణీ సత్యభామాభ్యాం సహితం కృష్ణమాశ్రయే ॥**

కృష్ణ స్వరూపాన్ని చూస్తాము ఇందులో.

**అధరం మధురం వదనం మధురం నయనం మధురం**

ఇది కూడా కృష్ణపరమాత్మ వర్ణన. నిజానికి చాలామంది ఇలా భగవంతుణ్ణి వర్ణించే శ్లోకాలను ఇష్టపడతారు. వారికి ఈ రసాస్వాదన నిర్గుణబ్రహ్మ వర్ణనలో కనబడదు. నిర్గుణ బ్రహ్మవర్ణన ఇలా సాగుతుంది –

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽరసం నిత్యమగన్ధవచ్చయత్।** – కఠ 1–3–15

ఈ సగుణబ్రహ్మ ఉపాసన ఒక సాధకునికి ప్రాథమిక దశల్లో కావాలి. ఇక్కడ అదృష్టం ఏమిటంటే సగుణఈశ్వర ధ్యానం చేయటానికి భగవంతునికి ఎన్నో రూపాలు ఉన్నాయి. ఒక్క కృష్ణపరమాత్మను తీసుకుంటేనే ఆయనకు అనేక నామరూపాలు – గురువాయూరప్ప, చిన్నికృష్ణుడు, రాధాకృష్ణుడు, పార్థసారథి కృష్ణుడు, విశ్వరూపకృష్ణుడు. అలా మీ ఇష్టదేవతను ఎవరిని తీసుకున్నా – రాముడు, దేవి, లక్ష్మి, వెంకటాచలపతి, సుబ్రహ్మణ్యస్వామి – వారికి అనేక నామరూపాలు మళ్ళీ. అందువల్ల వేదాంత శ్రవణ, మననాలు చేయనివారు సగుణఈశ్వర ధ్యానమే చేయగలరు. దాన్ని ఉపాసన అంటారు, నిదిధ్యాసనం కాదు.

ఇక్కడ ఆరవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ బోధిస్తున్నది సగుణఈశ్వర ధ్యానం కాదు, నిర్గుణబ్రహ్మధ్యానం. సగుణఈశ్వరధ్యానం గురించి కూడా చూస్తాము కాని ఇక్కడ కాదు, అధ్యాయం ఎనిమిదిలో. ఉపాసన లేదా ఈశ్వరధ్యానాన్ని అభ్యాసయోగం అంటాడు కృష్ణపరమాత్మ. అక్కడ ఇంకా వివరంగా చూద్దాము.

6. **ధ్యానప్రతిబంధకాలు, పరిష్కారాలు : శ్లోకాలు 33-36** ధ్యానఫలం గురించి తరువాత చూద్దాము. ధ్యానం చేసేటప్పుడు వచ్చే ఆటంకాలను శాస్త్రం వివరంగా చర్చిస్తుంది. ముఖ్యంగా గౌడపాదాచార్యులవారు, తన మాండూక్య కారికల్లో నాలుగు ప్రతిబంధకాలను వివరించారు. అవి లయ, విక్షేపం, కషాయం, రసాస్వాదం. కృష్ణపరమాత్మ, ఈ నాలుగింటి గురించీ చర్చించడు. ఒక్క విక్షేపాన్నే విశ్లేషిస్తాడు. మనం విక్షేపంతో పాటు ఇంకొక ప్రతిబంధకం గురించి కూడా చూద్దాము. అది లయ.

**లయ** – ధ్యానానికి కూర్చుంటే వచ్చే మొట్టమొదటి ప్రతిబంధకం నిద్ర.

**త్రీణి స్థానాని నిద్రాయాః స్వదారా, పుస్తకం, జపః**

మూడు అంశాలు నిద్ర ముంచుకొచ్చేలాగా చేస్తాయి – స్వదారా అంటే భార్య. భార్యను చూడగానే నిద్ర ముంచుకొస్తుంది. అప్పుడు ఆవిడ కోరే కోరికలో, ఆవిడ చేసే ఫిర్యాదులో విననవసరం లేదు. పుస్తకం – పుస్తకం చదువుతుంటే నిద్ర ముంచుకొస్తుంది కొందరికి. నిజానికి, కొంతమందికి పుస్తకం ఒక నిద్రమాత్ర! అది చదివితే గాని నిద్రపట్టదు. జపం– ధ్యానం చేస్తుంటే నిద్ర ముంచుకొస్తుంది. నిద్ర ముంచుకువస్తే, దాన్ని లయ అంటారు. లయ అంటే మనస్సు పడుకోవటం.

**లయ పరిష్కారం** – లయను రెండు రకాలుగా పరిష్కరించవచ్చు. ఒక పద్ధతి, నిద్ర ఎందువల్ల వస్తోందో తెలుసుకుని ఆ కారణాన్ని పారద్రోలాలి – **నిద్రాకారణవర్జనమ్.** నిద్ర ఎందువల్ల వస్తున్నది? దానికి అనేక కారణాలు చెప్పవచ్చు. ఇవన్నీ శాస్త్రమే వివరిస్తుంది– నిద్రాశేషః బహు అశన, శ్రమ.

**నిద్రాశేషః** – మీ శరీరానికి అవసరమైనంత మేరకు మీరు విశ్రాంతిని ఇవ్వలేదన్నమాట. మీరు రాత్రి 11 గంటలకు పడుకుని, ధ్యానం చేయాలనే అత్యంత ఉత్సాహంతో తెల్లవారుఝామున 3 గంటలకే లేచి కూర్చుంటారు. దాని అర్థం మీరు మీ శరీరానికి నాలుగు గంటల నిద్రే ఇచ్చారు. ఆరోగ్యకరమైన శరీరానికి నాలుగు గంటల నిద్ర సరిపోదు. వృద్ధులకు, అనారోగ్యంతో బాధపడేవారికి, నిద్రలేమితో బాధపడేవారికి సరిపోతుందేమో కాని, మీరు ఆరోగ్యకరంగా ఉంటే మాత్రం ఇంకా ఎక్కువ నిద్ర కావాలి. అందువల్ల మీరు ఉత్సాహంగా లేచి, స్నానం చేసి, ఇలా ధ్యానానికి కూర్చుంటారో లేదో, మీ శరీరం మిగిలిపోయిన నిద్రను అప్పుడు పొందుదామని చూస్తుంది. దీన్ని నిద్రశేష సమస్య అంటారు. అంటే నిద్ర మిగిలిపోయింది. ఈ సమస్య పోవాలంటే, శరీరానికి అవసరమైనంతమేరకు నిద్రను ఇవ్వండి. నిద్ర పోవటం తప్పేమీ కాదు, నిజానికి అవసరమైనంత నిద్ర పోవాలని కృష్ణపరమాత్మే అంటాడు.

**యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥** – 6.17

మితమైన ఆహారం, మితమైన వినోదం, మితమైన కర్మలు, మితంగా నిద్రపోవటం, మితంగా మేలుకుని ఉండటం నియమాలను పాటించిన వ్యక్తికి యోగం సిద్ధించి, దుఃఖం పోతుంది.

**నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాంతమనశ్నతః ।**
**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున ॥** – 6.16

అతిగా తినే వ్యక్తి, అసలు తినకుండా ఉన్న వ్యక్తి, అతిగా నిద్రించే వ్యక్తి, అసలు నిద్రపోని వ్యక్తి కూడా ధ్యానంలో విజయం సాధించలేరు.

ఇక్కడ మనకి కావాల్సిన అంశం, అసలు నిద్రపోని వ్యక్తి ధ్యానం చేయలేడు. అందువల్ల శరీరానికి అవసరమైన నిద్రను ఇవ్వాలి.

**బహు అశన** – ఆహారం అతిగా తీసుకున్నా సమస్యే. అది కూడా ఈ శ్లోకాల్లో చూశాము. అత్యంత సాత్త్వికగుణం ఉన్న వ్యక్తిని కూడా, మధ్యాహ్నం కడుపునిండా భోజనం చేశాక, అప్పుడు ధ్యానానికి కూర్చోబెడితే, హాయిగా నిద్రపోతాడు. అందువల్ల తినగానే ధ్యానం, అతిగా తిని ధ్యానం చేస్తే ధ్యానం సరిగ్గా చేయలేరు. అప్పుడు చేయకండి. అలాగే కటిక ఉపవాసం చేసిన రోజు కూడా ధ్యానం చేయలేరు. ఉపవాసం ఉన్నరోజు ఎక్కువగా నిశ్శబ్దంగా కూర్చోలేరు. ఆరోజు ఏదైనా శ్రవణమో, పారాయణమో చేస్తే మంచిది. అంటే కొంచమన్నా పని ఉండాలి, లేకపోతే నిశ్శబ్దంగా కూర్చోగానే నిద్రలోకి జారుకునే ప్రమాదం ఉంది.

**శ్రమ** – శరీరం చాలా శ్రమపడ్డాక, అంటే ఆఫీసులోనో, మరెక్కడో ఎనిమిది గంటలు కష్టపడి పనిచేశాక, చాలా అలసిపోతారు. శరీరం బాగా అలసిపోయినా కూడా నిద్ర వస్తుంది. ఎందుకంటే అది ప్రకృతిసూత్రం. అలసిన శరీరానికి విశ్రాంతినిమ్మంటుంది ప్రకృతి. అందువల్ల శారీరక **శ్రమ** తర్వాత ధ్యానానికి కూర్చోకండి. అందువల్ల తెల్లవారుఝామున అత్యంత అనువైన సమయం. రాత్రి కంటినిండా నిద్రపోయి ఉంటారు, ఇంకా శారీరకశ్రమ మొదలుపెట్టరు, అతిగా తినే అవకాశమూ లేదు.

ఆ విధంగా ఈ కారణాలలో మీకు నిద్రను ఏ కారణం కలుగజేస్తుంటే, ఆ కారణాన్ని పారద్రోలండి. **నిద్రాకారణవర్జనం.**

**అభ్యాసం** – ఏదైనా పదేపదే చేస్తుంటే, అది అలవాటవుతుంది. దాన్ని అభ్యాసం అంటారు. ధ్యానం ముందో, ధ్యానంలోనో శరీరానికి విశ్రాంతినిస్తారు. కార్యక్రమాలన్నీ ఆపేసి, శరీరానికి

వి(శాంతినిచ్చి, కళ్ళు మూసుకుంటారు. ఇవన్నీ సాధారణంగా ఎప్పుడు చేస్తారు? నిద్రపోయే ముందు చేస్తారు. నిద్రపోయే ముందు పనులు ఆపేసి, శరీరానికి విశ్రాంతినిచ్చి, కళ్ళు మూసుకుంటారు. అందువల్ల విశ్రాంతికి, నిద్రకు మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది.

ఈ అవినాభావ సంబంధంవల్ల, ఇలా పనులు మానుకుని కూర్చుని, కళ్ళు మూసుకుంటే, 'ఓహో, ఇప్పుడు నిద్రపోవాలి కాబోలు,' అనుకుంటుంది మనస్సు. అంతేకాదు, 'ఇప్పుడు కూర్చునే నిద్రపోతాడు కాబోలు,' అనికూడా అనుకుంటుంది. అందువల్ల, అలా నిద్రవచ్చినా, మీరు కూర్చుని ధ్యానం కొనసాగిస్తే, నెమ్మదిగా ధ్యానం అలవాటు అవుతుంది. ఆ అలవాటు స్థిరపడటానికి కొంత సాధన – అభ్యాసం అవసరం.

మొదట్లో నిద్ర వచ్చినా, దాని గురించి మీరు సిగ్గుపడనవసరం లేదు. అందువల్లనే శాస్త్రం ఏకాంత ప్రదేశంలోకి వెళ్ళి ధ్యానం చేయమంటుంది. అప్పుడు మీరు ధ్యానం చేస్తున్నారో, నిద్ర పోతున్నారో, ఎవరికీ తెలియదు! నలుగురూ ఉన్నప్పుడు మీకు నిద్రవస్తే మీకు మొహమాటంగా ఉంటుంది. ఒకవేళ సామూహికంగా ధ్యానం చేసేటట్టయితే, దీపాలు ఆర్పేయండి; ఎవరు నిద్రపోతున్నారో ఎవరికీ తెలియదు! నిద్ర వచ్చినా సాధన చేస్తూనే ఉండండి. అది అభ్యాసం.

**సంకల్పం** – మీ మనస్సుకు మీరే సూచనలు ఇచ్చుకోవాలి. దాన్ని సంకల్పం అంటారు. 'నేను ఇప్పుడు నిద్ర పోవటానికి కూర్చోలేదు, నేను ధ్యానం చేయటానికి కూర్చున్నాను. దానివల్ల నాకు ప్రయోజనం కలుగుతుంది. అందువల్ల నువ్వు నిద్రపోకు,' అని మనస్సును బుజ్జగించుకోవాలి.

ఆ విధంగా లయకు పరిష్కారాన్ని మూడు మార్గాల్లో చూపవచ్చు. అవి – **నిద్రాశేషం, అభ్యాసం, సంకల్పం.**

**విక్షేపం** – ధ్యానానికి కూర్చుంటే కలిగే రెండవ ప్రతిబంధకం – విక్షేపం – చంచలంగా ఉండే మనస్సు. నిజానికి మనస్సు రెండు విపరీత ధోరణులను చూపిస్తుంది. మనస్సు అయితే అతి ఉత్సాహంగా ఉంటుంది, లేదా మందకొడిగా ఉంటుంది. మామూలుగా ఉండటమెలాగో మనస్సుకు తెలియదు. పెండ్యులం లాగా అటు చివరికీ, ఇటు చివరికీ ఊగుతుంది. అటు చివరికి అంటే నిద్రలో జారుకుంటుంది. దానికి తమోగుణం కారణం. ఇటు చివరికి అంటే మరీ చంచలంగా ఉంటుంది. దానికి రజోగుణం కారణం. ఈ రెండు గుణాలూ కాకుండా, సత్త్వగుణానికి రావాలంటే, దానికి పరిహారం ఏమిటి?

**విక్షేపపరిహారం** – ఈ విక్షేపపరిహారాన్ని కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో సూచిస్తాడు. ముందుగా చంచలంగా ఉన్న మనస్సు గురించి అపరాధభావనకు లోనవద్దని చెబుతాడు

కృష్ణపరమాత్మ. ఆధ్యాత్మికత మీలో అపరాధభావన పెంచకూడదు. ఇప్పటికే అనేక కారణాలు మిమ్మల్ని అపరాధభావనకు లోనుచేస్తాయి, వాటికి ధర్మం, ఆధ్యాత్మికత కూడా తోడయితే, ఆధ్యాత్మికతకు వచ్చి మాత్రం లాభమేమిటి?

**చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్ ।**

**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥** – 6.34

ఓ కృష్ణా, నా మనస్సు చంచలంగా ఉంది, ఇంద్రియాలను మధిస్తున్నది, బలంగానూ, దృఢంగానూ ఉంది. అందువల్ల మనస్సును నిగ్రహించటం, గాలిని ఆపటంలాగా చాలా కష్టమని భావిస్తాను అంటున్నాడు అర్జునుడు.

ముందు కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి ఓదారుస్తున్నాడు. సమస్య మనకొక్కరిదే కాదు అంటేనే సగం భారం తీరిపోతుంది. అందువల్ల ముందు భారం దించుకోవాలి; తరువాత సమస్య ఉందని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే పిల్లల్ని అతిగారాబం చేసి చెడగొట్టినట్టుగా, ఇన్నాళ్ళూ మనమే మనస్సును దాని ఇష్టారాజ్యంగా అంతా తిరిగి రావటానికి కావాల్సినంత స్వేచ్ఛ ఇచ్చాము. ఇప్పుడు హఠాత్తుగా రాత్రికి రాత్రి అది మన చెప్పుచేతల్లో ఉండాలంటే, అది సాధ్యమయ్యే పనేనా? పదిహేను నిముషాలసేపే అయినా అది అంత తేలిక కాదు. అలాగని అసాధ్యమూ కాదు. అందువల్ల కృష్ణపరమాత్మ, నిజమే మనస్సు చంచలం, అందులో ఏమాత్రం సందేహం లేదని ఒప్పుకుంటూనే, దాన్ని అదుపులో పెట్టుకోవటానికి రెండు మార్గాలను సూచించాడు.

**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥** – 6.35

మనస్సును అభ్యాసం ద్వారా, వైరాగ్యం ద్వారా అదుపులో పెట్టుకోవచ్చు అంటున్నాడు.

**అభ్యాసం** – మీ మనస్సుకు మీరు నచ్చచెప్పుకోవాలి. అది అద్భుతమైన పద్ధతి. మొదట్లో 15, 20, 25 నిముషాలు ధ్యానం చేస్తే చాలు. నిజానికి 3, 4 గంటలు ధ్యానం చేయనవసరం లేదు. ఎంతసేపు చేశారన్నది కాదు ముఖ్యం, ఎంత బాగా చేశారన్నది ముఖ్యం. 15–30 నిముషాలే చేసినా, శ్రద్ధగా చేయాలి. మనస్సుకు ముందే ఇలా చెప్పుకోవాలి. 'ఈ 30 నిముషాలు నాకు వేరే దేనిమీదా దృష్టి పెట్టాలని లేదు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।** – 9–22

ఈ 30 నిముషాలు భగవంతుడు నా యోగక్షేమాలు చూసుకోనీ! ధ్యానంనుంచి లేచాక, మళ్ళీ నా బెంగలు నేను అందుకుంటాను,' ఈ విధంగా చెప్పుకోవాలి. దీన్ని ఆటో సజెషన్ అంటారు.

**వైరాగ్యం** – మీ మనస్సు, మీకు దేనిమీద రాగం ఉంటే దానివైపు పరుగులు తీస్తుంది. అది మనస్సుయొక్క సహజగుణం. అందువల్ల మీ రాగాన్నే మార్చుకోండి. మీ దృష్టిని జగత్తునుంచి ఈశ్వరునికి మరల్చండి. అప్పుడు సహజంగానే మనస్సు ఈశ్వరుని వైపుకు పరుగులు తీస్తుంది. ఎందుకంటే మనస్సుకు ఈశ్వరునిమీద రాగం ఏర్పడుతుంది.

**మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః** – 11.55

కర్తవ్య కర్మలను నాకే అర్పించి, మత్పరాయణుడయి, నామీద భక్తిశ్రద్ధలు కలిగి, ప్రాపంచిక విషయాలమీద ఆసక్తి లేనివాడు.

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు** – 9.34

నామీదే నీ మనస్సును లగ్నం చేయి, నా భక్తుడవు అవు. నన్నే పూజించు, నాకు నమస్కరించు.

అందువల్ల ఈశ్వరునియొక్క విలువను, గొప్పతనాన్ని తెలుసుకుని, మీ జీవితంలో ఈశ్వరుణ్ణే అంతిమలక్ష్యంగా పెట్టుకోవాలి. తక్కినదంతా అల్పమే. తక్కినవన్నీ నాశనమయ్యేవే.

**మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్ ।**
**నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః ॥** – 8.15
**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥** – 8.16

సంసారం దుఃఖాలయం. అది శాశ్వతమైన ఫలాలను ఇవ్వదు. నన్ను పొందిన జ్ఞానులు అత్యంత ఉన్నతమైన పూర్ణత్వాన్ని పొందుతారు. అంటే మోక్షాన్ని పొందుతారు.

బ్రహ్మదేవుడు, బ్రహ్మలోకం కూడా శాశ్వతం కాదు. కాని, అర్జునా, దేశకాల అతీతుడనైన నన్ను పూజిస్తే, పునర్జన్మ ఉండదు. అశాశ్వతఫలాలను పొందరు.

బ్రహ్మలోకం కూడా శాశ్వతం కాదు అంటే, జగత్తును పట్టుకుని ప్రాకులాడితే భద్రత, పూర్ణత్వం ఎలా కలుగుతాయి? అందువల్ల పూర్ణత్వం ఉన్న బ్రహ్మను పట్టుకోవాలి. అంటే మీ దృష్టిని అనాత్మనుంచి ఆత్మవైపుకు, ద్వైతంనుంచి అద్వైతానికి, జగత్తునుంచి భగవంతునికి మరల్చగలిగితే, దాన్ని వైరాగ్యం అంటారు. ఎప్పుడైతే వైరాగ్యం ఏర్పడుతుందో, అప్పుడే మనస్సు సహజంగానే జగత్తునుంచి విడివడి, ఈశ్వరునిలో నెలకొని ఉంటుంది. అది సగుణ ఈశ్వరుడు అవవచ్చు, నిర్గుణ ఈశ్వరుడు అవవచ్చు. అది మీ స్థాయినిబట్టి ఉంటుంది. ఈ విధంగా మీ మనస్సుయొక్క విక్షేపశక్తియొక్క పరిష్కారం ఈ రెండు పద్ధతుల ద్వారా చేయవచ్చు. అవి అభ్యాసం, వైరాగ్యం.

5. **ధ్యానఫలం : శ్లోకాలు 29-32** ఇప్పుడు ధ్యానఫలం చూద్దాము. మీరే ధ్యానం చేసినా, అంటే సగుణ ఈశ్వరధ్యానం చేసినా, నిర్గుణ ఈశ్వరధ్యానం చేసినా దానివల్ల కలిగే ప్రాథమిక ఫలం, మనస్సు ధ్యానవస్తువుమీదే నిలబడుతుంది. సగుణ ఈశ్వరధ్యానాన్ని ఉపాసన అంటారనీ, నిర్గుణ ఈశ్వరధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారనీ చూశాము.

**ఆత్మా త్వం గిరిజా మతిః సహచరాః ప్రాణాః శరీరం గృహమ్।**

**పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః ।**

**సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో।**

**యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్ ॥**– శివమానసపూజ 4

నేను నువ్వు, నా బుద్ధి గిరిజా (పార్వతీ)దేవి, నా ప్రాణం నీ సహచరులు; నా శరీరం నీ గృహం; నేను అనుభవించే విషయవస్తువులు నీకు చేసే పూజ; నా నిద్ర నీకు చేసే ధ్యానం; నేను ఎక్కడికి వెళ్ళినా అది నీకు నేను చేసే ప్రదక్షిణం, నామాటలు నీకు చేసే స్తోత్రాలు. ఓ శంభో, నేనే కర్మ చేసినా కూడా అదంతా నీకు చేసే ఆరాధనే! అలా అసలైన భక్తుడు పూర్తిగా తనను తానే భగవంతునికి అర్పించుకుంటాడు.

సగుణ ఈశ్వరధ్యానం మీ శరీరాన్ని ఒక ఆలయంగా మారుస్తుంది. ఆ ధ్యానం ఎప్పుడూ చేస్తారు కాబట్టి, భగవంతుడు ఎప్పుడూ మీ హృదయంలో కొలువై ఉంటాడు.

ఈశ్వరుడు అలా ఎప్పుడూ మీ హృదయంలో కొలువైవుంటే, అన్నింటికన్నా గొప్ప ఫలం ఏమిటంటే మీకెంత ధైర్యంగా ఉంటుందంటే, దేని గురించీ జీవితంలో ఆందోళన చెందరు. భయం, ఆందోళన, అభద్రతాభావన అన్నీ పోతాయి.

**కరలగ్నమృగః కరీంద్రభంగో ఘనశార్దూలవిఖండనోఽస్తజంతుః।**

**గిరిశో విశదాకృతిశ్చ చేతఃకుహరే పంచముఖోఽస్తి మే కుతో భీః॥** – శివానందలహరి 44

నా హృదయగుహలో భగవంతుడు ఐదు ముఖాలతో సింహంలా నెలకొని ఉన్నాడు. సింహంలా లేడిని చేతిలో పట్టుకున్నాడు. ఏనుగులాంటి రాక్షసుణ్ణి చంపాడు, అతిభీకరమైన పులిని నాశనం చేశాడు, తన పక్కన తను చంపిన జంతువులు ఉన్నాయి. నా హృదయగుహలో సింహంలా శివుడు ఉంటే, బయట ఉన్న క్రూరమృగాలను చూసి నేను ఎందుకు భయపడాలి?

ఆ విధంగా సగుణ ఈశ్వరధ్యానం చేస్తే మీ హృదయం గర్భగుడి అవుతుంది. కాని ఈ అధ్యాయంయొక్క ముఖ్యాంశం సగుణ ఈశ్వరధ్యానం కాదు, నిర్గుణ ఈశ్వరధ్యానం అని చూశాము. అందువల్ల నిర్గుణ ఈశ్వరధ్యానం చేస్తే వచ్చే ఫలం ఏమిటో రెండవ అధ్యాయంలోనే చెప్పాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే** – 2.55

జ్ఞాని తనలోనే తాను తృప్తిపడతాడు. అతని ఆనందానికి బాహ్యాంశాలు అవసరం లేదు.

**సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబంధుషు ।**

**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే ॥** – 6.9

తేలికగా చెప్పాలంటే ఫలం పూర్ణత్వం. నేను పూర్ణపురుషుణ్ణి. అందువల్ల జగత్తులోని బాహ్యవస్తువు ఏదీ నా పూర్ణత్వాన్ని పెంచలేదు. అందువల్ల నాకు ఏది ఉన్నా, లేకపోయినా బాధపడను. నేను ఎవరిమీదా ఆధారపడను, మానసికంగా ఎవరిమీదా ఆధారపడనవసరం లేదు. అందువల్ల నేను స్వేచ్ఛను అనుభవిస్తాను. దాన్నే జ్ఞాననిష్ఠ అంటారు, ఆత్మనిష్ఠ అంటారు, బ్రహ్మనిష్ఠ అంటారు. రెండవ అధ్యాయంలో పేర్కొన్న బ్రహ్మీస్థితి అంటే ఇదే.

ఒక్కముక్కలో చెప్పాలంటే ధ్యానం చేస్తే కలిగే ఫలం **జీవన్ముక్తి.**

దీనితో ధ్యానం గురించిన ఆరు అంశాలు అయిపోయాయి. కాని కృష్ణపరమాత్మ అధ్యాయం చివర్లో ఇంకొక అంశాన్ని చర్చించాడు, దానికి ధ్యానానికి పూర్తి సంబంధం లేకపోయినా, ఈ అంశం, అర్జునుడు అడిగిన ప్రశ్నకు జవాబుగా వచ్చింది.

**7. యోగభ్రష్టుడు : శ్లోకాలు 37– 47** నిజానికి ఈ సందేహం చాలా మందికే వస్తుంది. ముఖ్యంగా ఆధ్యాత్మిక వైపుకు దృష్టి మరల్చినవారికి వస్తుంది. 'ఒకవేళ మోక్షం పొందటంలో విజయం సాధించలేకపోతే, నా పరిస్థితి ఏమిటి? నాకేమవుతుంది?' నిజానికి, ఆరవ అధ్యాయం మొదట్లోనే కృష్ణపరమాత్మ అందరూ ఆశాజీవులుగా ఉండాలనీ, నిరాశాజీవులుగా ఉండకూడదనీ చెప్పాడు. సాక్షాత్తూ భగవంతుడే తనకు బోధ చేస్తున్నాడు, అయినా అర్జునుడు ఈ అధ్యాయం చివర్లో ఈ ప్రశ్న వేశాడు. 'ఒకవేళ నేను మోక్షం పొందకపోతే నా పరిస్థితి ఏమిటి?'

**పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।**

**న హి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి ॥** – 6.40

జ్ఞానమార్గానికి వచ్చిన సాధకునికి వినాశము అసలు సంభవించదు. ఈ లోకంలో కాని పరలోకంలో కాని అధోగతిపాలు కాదు. దానికి కారణం అతను మంగళకర్త అవుతాడు.

కృష్ణపరమాత్మ హామీ పత్రాన్ని ఇస్తున్నాడు. ఒకసారి వేదాంతానికి వస్తే, ఆధ్యాత్మికంగా వెనక్కి వెళ్ళే ప్రసక్తే లేదు. అది వన్‌వే ట్రాఫిక్! ఎదుగుదల లేకుండా ఆగిపోవచ్చు లేదా ఎదుగుదల నిదానంగా రావచ్చు కాని వెనక్కి వెళ్ళే ప్రసక్తి మాత్రం లేదు. అందువల్ల ఈ జన్మలో మోక్షం రాకపోతే, వచ్చే జన్మలో ఆధ్యాత్మిక మేధావిగా పుడతావు. ఈ జన్మలో

చేసిన కర్మఫలాలను సంచితకర్మలుగా తీసుకు వెళతావు. అందువల్ల ధనవంతులైన కర్మయోగి ఇంట్లోనో, పేదవారైన జ్ఞానయోగి ఇంట్లోనో పుట్టి, చిన్నవయస్సులోనే ఆధ్యాత్మికతలోకి అడుగుపెట్టి, జ్ఞానం పొంది, మోక్షం పొందుతావని ధైర్యం చెప్పాడు కృష్ణపరమాత్మ.

అందువల్ల మోక్షం పొందుతానా లేదా? ఈ జన్మలో పొందకపోతే వచ్చే జన్మలోనైనా పొందుతానా? ఈ శంకలేమీ పెట్టుకోకండి. దాని గురించి ఆలోచించకండి. చక్కగా ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ఆస్వాదించండి. ఆశాజీవిగా ఆధ్యాత్మిక జీవనంలో ముందుకు సాగండి.

ఇక్కడితో ముఖ్యమైన ఆరవ అధ్యాయం అయిపోయింది. దాన్ని ధ్యానయోగము లేదా ఆత్మసంయమయోగము అంటారు.

# జ్ఞాన, విజ్ఞానయోగము

## అధ్యాయము 7

భగవద్గీతలో 18 అధ్యాయాలు ఉన్నాయి. వాటిని మూడు షట్కాల క్రింద విభజించవచ్చు. షట్కం అంటే ఆరు. ఆ విధంగా భగవద్గీతలో షట్కత్రయం ఉంది – ప్రథమషట్కం, మధ్యమషట్కం, చరమషట్కం. మూడు షట్కాలలోనూ మూడేసి ముఖ్య అంశాలు చర్చించబడ్డాయి. ప్రథమషట్కంలో అంటే మొదటి షట్కంలో చర్చించబడిన ముఖ్యాంశాలు– జీవస్వరూపం, కర్మయోగం, పురుషప్రయత్నం.

1. **జీవస్వరూపం** – జీవుడెవరు? జీవుడు శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు. జీవుడు నిజానికి వీటన్నిటినీ సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యం.

2. **కర్మయోగం** – ఇది చాలా ముఖ్యమైన సాధన. కర్మయోగం అంటే ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేయటం, ఈశ్వరప్రసాదబుద్ధితో ఫలాన్ని స్వీకరించటం.

3. **పురుష ప్రయత్నం** – పురుష ప్రయత్నంయొక్క ప్రాముఖ్యత చర్చించబడింది. ప్రయత్నం చేయనిదే పురుషార్థాలలో దేన్నీ, మోక్షంతో సహా, పొందలేము.

ఇప్పుడు మనం రెండవ షట్కంలోకి అడుగుపెట్టబోతున్నాము. అది 7–12 అధ్యాయాలలో కూడినది. ఇందులో కూడా మూడు అంశాలు ఉన్నాయి. అవి ఈశ్వర స్వరూపం, ఈశ్వరధ్యానం, ఈశ్వరకృప.

1. **ఈశ్వర స్వరూపం** – ఈశ్వరస్వరూపం అంటే భగవంతుని నిర్వచనం.

2. **ఈశ్వరధ్యానం** – ఈశ్వరధ్యానం అంటే ఉపాసన. అంటే సగుణ ఈశ్వరధ్యానం.

3. **ఈశ్వరకృప** – ఈశ్వరుని కృపతో నేను సాధిస్తున్నాను అని తెలుసుకోవాలి. ప్రథమ షట్కంలో పురుష ప్రయత్నం గురించి నొక్కివక్కాణిస్తే, మధ్యమ షట్కంలో ఈశ్వరకృప గురించి చెబుతాడు కృష్ణపరమాత్మ. ఒక విధంగా హెచ్చరిస్తున్నాడు కూడా. అంతా నా చేతిలోనే ఉంది అనీ అనుకోకూడదు; నా చేతిలో ఏమీ లేదు, నేను విధి చేతిలో కీలుబొమ్మని అనీ అనుకోకూడదు. రెండూ సమానంగా ఉండాలి. వీటిలో ఏ ఒక్కటి వదిలేసినా కూడా, మీ సాధన అసంపూర్ణం అవుతుంది.

ఆ విధంగా ఈ మధ్యమ షట్కంలో ఈశ్వరస్వరూపం, ఈశ్వరధ్యానం, ఈశ్వరకృప వివరించబడ్డాయి. ఈ నేపథ్యంతో ఏడవ అధ్యాయంలో అడుగుపెడదాము. ఈ అధ్యాయం పేరు జ్ఞాన, విజ్ఞానయోగము. ఇందులో రెండు అంశాలు కూలంకషంగా చర్చించబడ్డాయి. అవి ఈశ్వరస్వరూపం, భక్తి. ఇవి ఈ అధ్యాయంలో ప్రధాన అంశాలు.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా నాలుగు భాగాలుగా చూడవచ్చు. అవి –

1. ఉపోద్ఘాతం : శ్లోకాలు 1–3
2. ఈశ్వరస్వరూపం : శ్లోకాలు 4–12
3. సంసారకారణం, పరిహారం : శ్లోకాలు 13–19
4. భక్తిలో మూడు రకాలు : శ్లోకాలు 20–30

**1. ఉపోద్ఘాతం – శ్లోకాలు 1–3** ఉపోద్ఘాతశ్లోకంలోనే, కృష్ణపరమాత్మ నొక్కివక్కాణించే అంశం, ముందు అధ్యాయాలకన్నా భిన్నంగా ఉంటుంది.

**శ్రీ భగవాన్ ఉవాచ**

**మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్ మదాశ్రయః ।**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥** – 7.1

ఓ అర్జునా! నామీద భారం వేసి, నా బోధను జాగ్రత్తగా వింటే, అంటే దానికి అవసరమైన సాధన చేస్తే నా గురించి సమగ్రంగా తెలుసుకుంటావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఆరవ అధ్యాయంలో చెప్పిన మాటకీ, ఈ శ్లోకానికీ మధ్య భేదాన్ని చూడవచ్చు.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్** – 6.5

నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి. తక్కువస్థాయి నేనునుంచి ఉన్నతస్థాయికి నేనుకు ఎదగాలి.

నీ భవిష్యత్తుకు నువ్వే కారణం. దాన్ని బాగు చేసుకున్నా, చెడగొట్టుకున్నా నువ్వే బాధ్యుడివి అంటే ఇక్కడ భగవంతుని ప్రమేయం లేదన్నట్టుగా వస్తుంది. ఆరవ అధ్యాయంలో అంతా సాధకుని చేతిలో ఉందని చెబితే, ఏడవ అధ్యాయంలో ఓం ప్రథమంగానే, మదాశ్రయః యోగం యుంజన్ (జ్ఞానం ప్రాప్యసి) – ఈశ్వర అనుగ్రహంతో, మోక్షంకోసం సాధన చేయి అంటున్నాడు. నీ విజయానికి నువ్వే కారణం అని పొంగిపోకు అంటున్నాడు. ముందేమో పురుష ప్రయత్నాని నొక్కివక్కాణిస్తే, ఇక్కడేమో ఈశ్వర అనుగ్రహాన్ని నొక్కివక్కాణిస్తున్నాడు. దీన్నిబట్టి రెండూ సమానంగా ముఖ్యమే అని అర్థమవుతుంది.

**యథా హ్యేకేన చక్రేన రథస్య న గతిర్భవేత్ ।**
**ఏవం పురుషకారేణ వినా దైవం న సిద్ధ్యతి** – యాజ్ఞవల్క్య స్మృతి 1.3.51

రథం ఒక్కచక్రంతో ఎలాగైతే ముందుకు వెళ్ళలేదో, అదే విధంగా మానవ ప్రయత్నం లేకుండా దైవం సిద్ధించదు.

ఎలాగైతే ఒక రథం కదలాలంటే దానికున్న రెండు చక్రాలూ కదలాలో, అదే విధంగా ఆధ్యాత్మ సాధకుడు పైకి ఎదగాలంటే అతనికి కావాల్సిన రెండు చక్రాలు – దైవం, ప్రయత్నం. సాధకుడు ఏమీ ప్రయత్నం చేయకుండా ఈశ్వరకృపను పొందలేడు.

అందువల్ల, మొదటి మూడు శ్లోకాల్లో, మోక్షం పొందాలంటే ఈశ్వర అనుగ్రహం ఎలా అవసరమో వివరిస్తున్నాడు.

**2. ఈశ్వరస్వరూపం – శ్లోకాలు 4–12** ఈ శ్లోకాలు ఈ ఏడవ అధ్యాయంలోనే కాదు, మొత్తం భగవద్గీతలోనే ముఖ్యమైన శ్లోకాలు.

ఈశ్వర స్వరూపం ఏమిటి? అన్ని ఉపనిషత్తులూ భగవంతుని గురించి ఒక ముఖ్యమైన నిర్వచనాన్ని ఇస్తాయి. అది జగత్ కారణం బ్రహ్మ. భగవంతుడు సృష్టికారణం.

**యతో వా ఇమాని భూతాని జాయంతే। యేన జాతాని జీవంతి। యత్ప్రయంత్యభి సంవిశంతి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి** – తైత్తిరీయమ్

దేన్నుంచి ఈ జీవులన్నీ పుట్టాయో, ఏదైతే జీవులకు స్థితి కారణమో, దేనిలోనైతే అన్నీ లయమవుతున్నాయో, దాని గురించి తెలుసుకో! అది బ్రహ్మ.

**జన్మాద్యస్య యతోఽన్వయాత్ ఇతరతాశ్చార్థేషు అభిజ్ఞః స్వరాట్** – భాగవతం 1

సృష్టి, స్థితి, లయకారకుడైన ఆ భగవంతునిమీద ధ్యానం చేద్దాము.

**జన్మాదస్య యతః** – బ్రహ్మసూత్రాలు 1.1.2

బ్రహ్మ జగత్ కారణం.

ఈ విధంగా మన శాస్త్రాలన్నీ ఏకగ్రీవంగా ఈశ్వరుణ్ణి జగత్ కారణం బ్రహ్మగా అభివర్ణిస్తున్నాయి. ఇప్పుడు బ్రహ్మ జగత్ కారణం అంటే, ఏ కారణమో తెలుసుకోవాలి.

**కీదృశం కారణం భవతి ఈశ్వరః?**

సృష్టిలో ఏ కార్యాన్ని చూసినా దానికి కారణం రెండు రకాలుగా ఉంటుందని చూస్తాము. వాటిని ఉపాదానకారణం, నిమిత్తకారణం అంటారు.

**ఉపాదానకారణం** – ఉపాదానకారణం అంటే ఆ వస్తువును తయారుచేయటానికి కావాల్సిన ముడిసరుకు. ముడిసరుకు లేనిదే ఏ వస్తువు కూడా తయారవలేదు. అన్నం వండాలంటే ముడిసరుకు అయిన బియ్యం ఉండాలి. కుండ తయారుచేయాలంటే ముడిసరుకు అయిన మట్టి ఉండాలి.

**నిమిత్తకారణం** – కాని ముడిసరుకు ఉన్నంతమాత్రాన వస్తువు తయారయిపోదు. అక్కడ ఇటుకలు రాసులుగా పోసివుంటే, కొన్ని నెలల తర్వాత, వాటంతట అవి ఒక ఆకారంలో పేరుకుని, ఇల్లుగా మారిపోతాయా? లేదే! ఇటుకలు ఒక ఇల్లుగా అవటానికి వాటంతట అవి పేరుకోలేవు. అలాగే దారాలన్నీ కలిసి వస్త్రంగా అయిపోవు. బంగారం దానంతట అది ఆభరణంగా మారదు. వస్త్రం దుస్తులుగా మారదు. దాన్ని దుస్తులుగా మార్చటానికి టైలరు దగ్గరకి వెళ్ళాలి.

దీన్నిబట్టి ముడిసరుకు దానంతట అది ఒక వస్తువుగా (కార్యంగా) మారదు. దాన్ని అలా మార్చగలిగే మేధావి ఉండాలి. అలా మార్చగలిగే నిపుణత ఉండాలి. ఆ వస్తువు ఎందుకు తయారుచేయాలో తెలియాలి. దాన్ని జ్ఞానం అంటారు. ఎలా చేయాలో తెలియాలి, దాన్ని శక్తి అంటారు. అందువల్ల వస్తువును తయారుచేయగలిగన వ్యక్తి జ్ఞానశక్తి యుక్తుడై ఉండాలి. అంటే జ్ఞానవాన్, శక్తిమాన్ అయివుండాలి.

కేవలం జ్ఞానం ఉంటే చాలదు, దాన్ని ఆచరణలో పెట్టగలిగే శక్తి ఉండాలి. వడ్రంగికి చెక్కను కుర్చీగా మార్చగలిగే జ్ఞానం ఉంటే చాలదు, దాన్ని మార్చగలిగే శక్తికూడా ఉండాలి. ఈ జ్ఞానశక్తి యుక్తాన్ని నిమిత్తకారణం అంటారు. ఆ విధంగా ఒక వస్తువును సృష్టించటానికి రెండు కారణాలు కావాలి. అవి – ఉపాదానకారణం, నిమిత్తకారణం. ఈ రెండింటిలో ఏ ఒక్కటి లేకపోయినా సృష్టి లేదు. రెండూ ఉంటేనే సృష్టి సాధ్యం.

ఈ సూత్రం అర్థమయితే, ఇంకొక సందేహం కలుగుతుంది. ఈశ్వరుడు జగత్ కారణమయితే, ఈశ్వరుడు ఏ కారణం? నిమిత్తకారణమా, ఉపాదానకారణమా? నిమిత్త కారణమయితే, ముడిసరుకు ఏది? ఉపాదానకారణమయితే తయారుచేసిన ప్రజ్ఞాశాలి ఎవరు? శాస్త్రాలన్నీ ఏకగ్రీవంగా సృష్టికి ముందు ఈశ్వరుడు మాత్రమే ఉన్నాడని అంటున్నాయి. అంటే ఈశ్వరుడు **ఏకం**. ఈశ్వరుడు ఏకం అయితే, ఈశ్వరుడు ఉపాదానకారణమా, నిమిత్త కారణమా? నిమిత్తకారణం అంటే ఉపాదానకారణం ఏది? ఉపాదానకారణం అంటే నిమిత్తకారణం ఎవరు? భగవంతుడు ఒక్కడే ఉన్నాడు కాబట్టి ఆయనే అటు నిమిత్తకారణం, ఇటు ఉపాదానకారణం కూడా అంటాయి శాస్త్రాలు.

**నిమిత్తకారణంగా జగత్తును సృష్టించాడు, ఉపాదానకారణంగా తానే జగత్తు అయ్యాడు.** కాని మన అనుభవం ఒప్పుకోదు. మనం చూసే ప్రతివస్తువు సృష్టి వెనుకా నిమిత్తకారణం వేరు, ఉపాదానకారణం వేరు. ఈ గది తీసుకుంటే ఇది ఏర్పడటానికి ముడిసరుకు వేరు, దాన్ని కట్టినది వేరు. కాని ప్రతి నియమానికి ఒక ఉల్లంఘన ఉంటుంది.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ** – ముండకమ్ 1.1.7

సాలెపురుగు ఈ నియమానికి ఉల్లంఘన. సాలెపురుగు సాలెగూడును సృష్టిస్తుంది. సాలెగూడు కార్యం. దాని సృష్టికర్త ఎవరు? సాలెపురుగే! అది చాలా తెలివైనది, సాలెగూడులోని డిజైన్ అర్థం చేసుకోవటం ఇప్పటికీ కష్టమే. సాలెపురుగుకు తన గూడును ఎలా తయారుచేసుకోవాలో తెలియటమే కాదు, ఎక్కడ తయారుచేయాలో కూడా తెలుసు. ఎక్కడ పురుగులు ఎక్కువగా ఉంటాయో, అక్కడ తయారుచేస్తుంది. అది ఏదో అందం కోసం గూడును అల్లటం లేదు. తెలివిగా తనకు ఆహారమైన పురుగులను ఆకర్షించి పట్టుకోవటానికి అల్లుతుంది. దానికెంత ప్రజ్ఞాపాటవాలు కావాలి? అందువల్ల సాలెపురుగు **నిమిత్తకారణం**.

సరే, దానికి ముడిసరుకు ఎక్కడ్నుంచి వస్తుంది? మీరు జాగ్రత్తగా గమనిస్తే, ముడిసరుకు కోసం సాలెపురుగు ఎక్కడికో వెళ్ళదు. తనలోంచే తీసుకుంటుంది. తనలోంచే దారాలని తీసుకుని తయారుచేస్తుంది. ఆ సాలెగూడునుంచి అది కిందకి వచ్చినా పడదు. ఒక దారాన్ని ఆధారం చేసుకుని వస్తుంది; దాన్ని పట్టుకోవటానికి ప్రయత్నించగానే ఆ దారంతో చకచకా పైకి వెళ్ళిపోతుంది. ఊర్ణనాభి అంటే సాలెపురుగు. సాలెపురుగు ఆ విధంగా తనే నిమిత్త కారణం, ఉపాదానకారణం కూడా. దీన్ని శాస్త్రం అభిన్న నిమిత్త ఉపాదానకారణం అంటుంది. అభిన్నం అంటే నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ భిన్నంగా లేవు. అలా భగవంతుడే నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ కూడా.

అలా అభిన్న నిమిత్త ఉపాదానకారణ ఈశ్వరుని స్వరూపమేమిటి? ఆ ఈశ్వరునికి రెండు అంశాలు ఉన్నాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో. అవి అంశద్వయం – పరాప్రకృతి, అపరాప్రకృతి.

**అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥** – 7.5

ఓ అర్జునా! ఇది నా తక్కువస్థాయి, ఇప్పుడు నా ఉన్నతస్థాయి గురించి తెలుసుకో. తక్కువ స్థాయి అపరాప్రకృతి, నా ఉన్నతస్థాయి పరాప్రకృతి. పరాప్రకృతి ఈ అపరాప్రకృతికి భిన్నంగా ఉందని తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈశ్వరునియొక్క రెండు అంశాలు పరాప్రకృతి, అపరాప్రకృతి. ఈశ్వరునికి ఈ రెండు అంశాలు ఉంటే, ఈ రెండింటి మధ్యా ఉన్న భేదమేమిటి? నిజానికి చాలా భేదాలు ఉన్నాయి కాని ఇక్కడ మనం నాలుగు ముఖ్యమైన భేదాలను చూద్దాము. వాటినాధారంగా చేసుకుని ముందుకు సాగవచ్చు.

| | **పరాప్రకృతి** | **అపరాప్రకృతి** |
|---|---|---|
| ఎ) | చేతనతత్త్వం | అచేతనతత్త్వం (జడత్వం) |
| బి) | నిర్గుణతత్త్వం | సగుణతత్త్వం |
| సి) | నిర్వికారతత్త్వం | సవికారతత్త్వం |
| డి) | సత్యం | మిథ్య |

అపరాప్రకృతి జడం కాబట్టి అది ప్రతిదానికీ చేతనతత్త్వంమీద ఆధారపడాలి. అందువల్ల అది అస్వతంత్రం అయింది. స్వయంగా ఉనికి లేనిదాన్ని మిథ్య అంటారు.

భగవంతుడు ఎవరు? చేతన–అచేతన; నిర్గుణ–సగుణ; నిర్వికార–సవికార; సత్య–మిథ్య; పరాప్రకృతి–అపరాప్రకృతుల మేలుకలయిక ఈశ్వరుడు. సృష్టికి ముందు పరాప్రకృతి లక్షణాలు, అపరాప్రకృతి లక్షణాలు ఒకే దేవునిలో (ఈశ్వరునిలో) అవ్యక్తంగా ఉన్నాయి.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యమ్ 6.2.1

ఓ సోమ్య! సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది. అది ఏకం, అద్వితీయం.

ఆ విధంగా సృష్టికి ముందు పరాప్రకృతి, అపరాప్రకృతి ఒకటిగా ఉన్నాయి. తరువాత సృష్టి జరిగింది. ఎలా సృష్టి జరిగిందో ఇక్కడ, ఏడవ అధ్యాయంలో వివరాలు ఇవ్వడు కృష్ణపరమాత్మ. పదమూడవ అధ్యాయంలో వివరంగా చెబుతాడు.

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ ॥** – 13.20
**కార్యకరణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే ।**
**పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే ॥** – 13.21

ప్రకృతి, పురుషుడు కూడా అనాదిగా వస్తున్నారు. ప్రకృతినుంచే ఈ విశ్వం వచ్చింది. ప్రకృతినుంచే రాగద్వేషాలు, గుణాలు వచ్చాయి.

ప్రకృతినుంచే స్థూల, సూక్ష్మశరీరాలు వచ్చాయి. ఇంకో విధంగా చెప్పాలంటే శరీరం, మనస్సు వచ్చాయి. మనశ్శరీరాలకు కలిగే సుఖదుఃఖాలను సాక్షిగా చూస్తాడు పురుషుడు.

అపరాప్రకృతి, అచేతనతత్త్వమే అవ్యక్తంనుంచి మారి, జగత్తుగా వ్యక్తమవుతుందని తైత్తిరీయంలో వస్తుంది.

**ఆత్మన ఆకాశస్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ**
**పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽన్నమ్ అన్నాత్పురుషః॥** – తైత్తిరీయం

ఆత్మనుంచి ఆకాశం పుట్టింది; ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి జలం, జలంనుంచి పృథివి, పృథివినుంచి ఓషధులు, ఓషధులనుంచి అన్నం, అన్నంనుంచి మనిషి పుట్టారని వస్తుంది.

పంచభూతాలు, పాంచభౌతిక వస్తువులు, కార్యకరణసంఘాతం (మనశ్శరీరాలు) అయిన వ్యష్టి కూడా అపరాప్రకృతినుంచే వచ్చాయి.

**భూతభౌతికః సర్వః ప్రపంచః అపరాప్రకృతేః ఉత్పన్నః**

అపరాప్రకృతి మారి అన్నీ అయింది. మన శరీరం, మన మనస్సు, మైకు అన్నీ అపరాప్రకృతే! మనస్సు మారుతుందా లేదా? మనస్సు అన్నింటికన్నా వేగంగా మారుతుంది. స్వామీజీ బోధ అవుతున్నంతసేపు మారాలి. (మారుతున్న ఆలోచనల రూపంలో బోధ అర్థమవుతుంది.) అందువల్ల మనస్సు మారాలి. మనస్సు మారుతుంది, శరీరం మారుతుంది, జగత్తు మారుతుంది. మారేదేదైనా సవికారం కిందకు వస్తుంది. సవికార ప్రపంచం సవికార అపరాప్రకృతియొక్క కార్యం. మారుతున్న జగత్తు భగవంతుని మారే అపరాప్రకృతి అంశంనుంచి వచ్చింది.

మరయితే, పరాప్రకృతి ఏమవుతుంది? ఈ ప్రశ్నే తప్పు. ఎందుకంటే పరాప్రకృతి **నిర్వికారతత్త్వం** అని చూశాము. దానికి మార్పులు లేవు. అందువల్ల పరాప్రకృతి ఎప్పుడూ ఒక్కలాగానే ఉంటుంది – అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా. అపరాప్రకృతి ఎక్కడ ఉంటే, అక్కడ దాన్నించి విడదీయరాని పరాప్రకృతి కూడా ఉంటుంది. అందువల్ల ప్రతి ఒక్కరి కార్యకరణసంఘాతంలోనూ, పరాప్రకృతి కూడా ఉంటుంది.

ప్రతి ఒక్క శరీరంలోనూ శరీరీ ఉంటుంది. శరీరీ చేతనతత్త్వం. శరీరంలో ఉన్న శరీరీని జీవాత్మ అంటారు. పరాప్రకృతిని పరమాత్మ అని కూడా అంటారు. ఈ పరమాత్మనే శరీరంలో ఉంటే జీవాత్మ అంటారు. శరీరమనే తొడుగుని తీసేస్తే, అదే చైతన్యాన్ని పరమాత్మ అంటారు.

దానికొక ఉదాహరణ చూద్దాము. ఇక్కడ మట్టిముద్ద ఉందనుకుందాము. ఈ మట్టిముద్ద ఆకాశంలో (ప్రదేశంలో) ఉంది. ఆకాశం అంటే ఏమిటి? సర్వవ్యాపకంగా ఉన్నది. ఇప్పుడు, ఒక కుమ్మరి వచ్చి ఈ మట్టిముద్దలోంచి కొంతభాగం తీసి కుండగా మార్చాడనుకుందాము. అతను మట్టిని కుండగా మార్చినప్పుడు ఆకాశం ఏమయింది? ఏమీ అవలేదు! సర్వవ్యాపకమైన ఆకాశం అంతటా ఉంటుంది. అది మట్టిముద్దగా ఉన్నప్పుడూ ఆకాశం ఉంది, చిన్న కుండగా ఉన్నప్పుడూ ఆకాశం ఉంది. కాకపోతే, ఇప్పుడు సర్వవ్యాపకంగా ఉన్న ఆకాశం ఈ చిన్నికుండలో కూడా ఉంది. ఇప్పుడు, కుండలో ఉన్న ఆకాశం గురించి మాట్లాడేటప్పుడు మన భాష మారుతుంది!

ముందేమన్నాం? ఆకాశంలో మట్టి ఉంది అన్నాము. ఇప్పుడు అదే మట్టి కుండగా మారేసరికి, కుండ ఆకాశంలో ఉంది అనటం లేదు; కుండలో ఆకాశం ఉంది అంటున్నాము! సర్వవ్యాపకమైన ఆకాశం కుండలోనూ ఉంది. కాని కుండలోని ఆకాశాన్ని **ఘటాకాశం** అంటాము. అంతటా ఉన్న ఆకాశాన్ని **మహదాకాశం** అంటాము. ఇప్పుడు చెప్పండి. ఘటాకాశం కొత్తగా పుట్టిందా? అది కొత్తగా పుట్టలేదు. ఆకాశం అంతకముందూ ఉంది, ఇప్పుడూ ఉంది, ఇకముందూ ఉంటుంది. ఆకాశం ఏమీ మార్పు చెందలేదు. కాని కుండలో ఉన్న ఆకాశానికి మనం కొత్త పేరును ఇస్తున్నాము అంతే.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని చైతన్యానికి అన్వయించి చూద్దాము. పరాప్రకృతిని ఆకాశంతోనూ, అపరాప్రకృతిని మట్టిముద్దతోనూ పోల్చవచ్చు. అక్కడ మట్టిముద్ద కుండలుగా మారినట్టుగా అపరాప్రకృతి అనేక శరీరాలుగా (కార్యకరణసంఘాతంగా) అయింది – పరాప్రకృతి ఏమవుతుంది? ఆకాశం ఏమీ అవనట్టుగా, పరాప్రకృతి కూడా ఏమీ అవదు. కాకపోతే, ఇప్పుడు అపరాప్రకృతి ఆకారాలు ఉన్నాయి కాబట్టి, సర్వవ్యాపకమైన పరాప్రకృతి, అపరాప్రకృతి ఆకారంలో కూడా ఉంటుంది. అపరాప్రకృతి ఆకారాల లోపల ఉన్న పరాప్రకృతికి కొత్తపేరు ఇవ్వబడుతుంది.

సర్వవ్యాపకమైన పరాప్రకృతిని పరమాత్మ అంటే, ఆకారాల లోపల ఉన్న పరాప్రకృతిని జీవాత్మ అంటారు. ఆకారాలను తీసేస్తే పరమాత్మ, ఆకారాలు వస్తే – జీవాత్మ. అందువల్ల జీవాత్మకు, పరమాత్మకు మధ్య స్వరూపభేదం లేదు. రెండూ పరాప్రకృతే.

**అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥** – 7.5

నా ఉన్నతస్వరూపం గురించి తెలుసుకో. జీవుడే పరాప్రకృతి అని తెలుసుకో. ఆ చైతన్యతత్త్వమే ఈ సంపూర్ణ జగత్తును ధరిస్తున్నది.

నువ్వు వెతుకుతున్న చైతన్యం లేదా పరమాత్మ నువ్వే. తత్ త్వం అసి. ఇదొక మహావాక్యం. జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని సూచిస్తుంది. ఇక్కడ కృష్ణపరమాత్మ ఈ ఐక్యాన్ని ఇక్కడ ప్రస్తావించి వదిలేశాడు. తరువాత పదమూడవ అధ్యాయంలో నొక్కివక్కాణిస్తాడు.

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత** – 13.3

నేను అన్ని క్షేత్రాలలో (శరీరాలలో) క్షేత్రజ్ఞునిగా (చైతన్యంగా) ఉన్నానని తెలుసుకో అర్జునా.

**పరాప్రకృతి + అపరాప్రకృతి = ఈశ్వరుడు.**

ఈశ్వరుడే జగత్ కారణం.

ఇప్పుడు ఇంకొక ముఖ్యమైన అంశాన్ని చూద్దాము. ఇది అర్థం చేసుకోవటానికి, ఒక ముఖ్యమైన సూత్రాన్ని గుర్తుపెట్టుకోవాలి. **అది – కార్యం దాని కారణానికి భిన్నంగా ఉండదు.** దీన్ని బ్రహ్మసూత్రాల్లో లోతుగా విశ్లేషిస్తారు.

**తదనన్యత్వమారంభణశబ్దాదిభ్యః** – ఆరంభణ్యాధికరణమ్

ఈ విషయం మన దైనందిన జీవితంలో మనకు తెలుస్తూనే ఉంటుంది. కుండని చూస్తే దానికి కారణం మట్టి అని చెప్పగలుగుతాము. మట్టి కారణమనీ, కుండ కార్యమనీ మనకు తేలికగా తెలుస్తుంది. అంతేకాదు, మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదని కూడా మనకు తెలుసు. నిజానికి, మట్టి కాకుండా, కుండ అనే వస్తువు విడిగా లేదు. మరి కుండ ఏమిటి? కుండ, ఒక ప్రత్యేక ఆకారానికి ఇచ్చిన పేరు మాత్రమే.

కుండకు విడిగా ఉనికి లేదు. దాన్ని వాచారంభణం అంటారు. అంటే కుండ ఆకారం రూపుదిద్దుకోగానే దానికి కుండ అనే పేరును మన వాక్కు ఇస్తుంది. మరి వస్తువు ఏమిటి? అది మట్టే! అలాగే సముద్రం అనే వస్తువు లేదు. అది నీరు మాత్రమే! అంతకుముందు నీరే ఉంది, ఇప్పుడూ నీరే ఉంది, తరువాత కూడా నీరే ఉంటుంది. ఆకాశంలో ఉంటే నీటిని మేఘం అంటాము; కిందికి కురుస్తుంటే వర్షం అంటాము; కొండలనుంచి జాలువారుతుంటే

నది అంటాము. ఒకచోట నిలిస్తే కొలను అంటాము, అలలు ఎగసి పడుతుంటే సముద్రం అంటాము. పేర్లు అనేకం, వస్తువు ఏకం.

ఈ ఉదాహరణలన్నింటి సారం – కార్యం అంటే వస్తువు కాదు, కార్యాలన్నీ నామరూపాలు మాత్రమే.

**యత్ యత్ కార్యం తత్ తత్ నామరూపాత్మకమ్**

కార్యం నామరూపాలు మాత్రమే. అసలు వస్తువు కారణం. ఆ సూత్రాన్ని ఇక్కడ అన్వయిస్తున్నాడు కృష్ణపరమాత్మ. పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయిక అయిన పరమాత్మ జగత్ కారణం, జగత్తు కార్యం.

**ఆకాశాత్ ఆరభ్య అన్నమయకోశపర్యంతం శరీరపర్యంతం సర్వమపి కార్యరూపమ్**

జగత్తంతా కార్యం. మన శాస్త్రం ఎదురుగా కనిపిస్తున్న జగత్తు సత్యం కాదు అంటుంది. ఎంత ఆశ్చర్యం! దానికి కేవలం నామరూపాలు మాత్రమే ఉన్నాయి, కుండలాగా అంటుంది. మరయితే ఈ జగత్తంతా నామరూపాలు మాత్రమే అయితే, నా కంటికి ఎదురుగా నిశ్చయంగా కనిపిస్తున్న ఈ జగత్తు మాటేమిటి? నేను ముట్టుకుంటున్నాను, నేను వ్యవహారం నడుపుతున్నాను, నాకు తెలుస్తున్నది. కనిపిస్తున్నది జగత్తు కాదు అంటే, అది ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానంగా ఇంతకుముందు చూసిన సూత్రాన్ని అన్వయిద్దాము. కంటికి కనిపిస్తున్న సముద్రం, సముద్రం కాదు; అది దాని కారణం అయిన నీరు అయితే; కంటికి కనిపిస్తున్న ఆభరణం, ఆభరణం కాదు, అది దాని కారణం అయిన బంగారం అయితే; కంటికి కనిపిస్తున్న కుండ, కుండ కాదు, దానికి కారణం అయిన మట్టి అయితే; కంటికి కనిపిస్తున్న జగత్తు ఏమిటి? దీనికి పి. హెచ్.డీ అవసరంలేదు, కొంచెం తార్కికంగా ఆలోచించగలిగితే చాలు. కంటికి కనిపించే జగత్తు, దానికి కారణం అయిన ఈశ్వరుడు అవుతుంది.

**జగత్తును సరిగా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

మనం జగత్తు అనుకుంటున్నది బ్రహ్మ (ఈశ్వరుడు)యొక్క నామరూపాలు మాత్రమే.

**మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ।**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ॥** –7.7

నాకంటే పరమకారణమైనది ఏదీ లేదు. ఒక ముత్యాలహారానికి దారం ఎలా ఆధారమో, అలా ఈ జగత్తనే మణిమాలకు నేనే సూత్రాన్ని.

నిజానికి, పరమాత్మే ఈ జగత్తుగా భాసిల్లుతున్నాడు. జగత్తుగా పరమాత్మ మనకు రోజూ దర్శనం ఇస్తున్నాడు. అందువల్ల ఈశ్వరదర్శనంకోసం ఒంటికాలిమీద నిల్చుని తపస్సు

చేయనవసరం లేదు. ఈశ్వరుని వినా సృష్టిలో మరొక వస్తువు లేదు. అల నీటి దర్శనంకోసం తపస్సు చేస్తే ఎలా ఉంటుంది? ఆభరణం బంగారంకోసం తపస్సు చేస్తే ఎలా ఉంటుంది? మనం ఈశ్వరునికోసం తపస్సు చేస్తే అలాగే ఉంటుంది. నిజానికి, మనం ఏంచూస్తున్నా అది ఈశ్వరుడే. ఈశ్వరుడే జగత్తంతా నిండివున్నాడు అంటే అది విశ్వరూపదర్శనం లేదా విరాట్ ఈశ్వరదర్శనం అవుతుంది.

**విశ్వమేవ స్వరూపం శరీరం యస్య సః విశ్వరూపః॥**

భగవంతుని శరీరం ఈ విశ్వం. విరాట్ అంటే **వివిధం రాజతే ప్రకాశతే ఇతి విరాట్.** ఆకాశంగా, వాయువుగా, అగ్నిగా, అన్ని రూపాలుగా కనిపించేది విరాట్.

అందువల్ల మీకు కొత్తగా ఈశ్వరదర్శనం అవసరం లేదు. మీకు కావాల్సిందల్లా కొత్త దృక్పథం. బ్రహ్మయొక్క వ్యక్తరూపమే ఈ జగత్తు. అందువల్ల మీకు కావాల్సింది మీ దృక్పథంలో మార్పు.

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥** – 7.8

ఓ అర్జునా! జలంలో రసాన్ని నేను; సూర్యచంద్రులలో కాంతిని నేను; వేదాల్లో నేను ఓంకారాన్ని; ఆకాశంలో శబ్దాన్ని నేను; పురుషులలో పౌరుషాన్ని నేను.

ఇంకా కొన్ని చెబుతాడు కృష్ణపరమాత్మ. పృథివిలో సువాసనను నేను; అగ్నిలో వేడి నేను; ప్రాణులలో జీవశక్తిని నేను; తాపసులలో తపస్సును నేను; ప్రజ్ఞావంతులలో ప్రజ్ఞను నేను; తేజోవంతులలో తేజస్సును నేను; బలవంతులలో బలాన్ని నేను; ధార్మిక పురుషులలో ధార్మిక కామాన్ని నేను అని చెప్పి, అన్ని జీవరాశులకు నేనే బీజం అని తెలుసుకో అంటున్నాడు. దేనిలో ఏ శక్తి ప్రధానంగా ఉంటే, ఆ శక్తి పరమాత్మే. అందువల్ల ఏది అనుభవంలోకి వచ్చినా అది పరమాత్మ అనుభవమే. అలా జగత్తంతటినీ, ఈశ్వరస్వరూపంగా అర్థం చేసుకోవాలి. అచేతన వస్తువును చూస్తే, అది ఈశ్వరునియొక్క అపరాప్రకృతి; చేతనవస్తువును చూస్తే అది ఈశ్వరునియొక్క పరాప్రకృతి.

మీ శరీరంలో ఏది ఉంది? ఈ రెండూ కాక, వేరే ఏమీ లేదు. ఈ ఈశ్వరదృష్టి గనుక మీరు ఏర్పరచుకుంటే, సంసారం ఇంక మిమ్మల్ని బాధించదు. ఆ విధంగా ఈశ్వరుడు జగత్ కారణం.

### 3. సంసారకారణం, పరిహారం – శ్లోకాలు 13-19

ఈ జగత్తు నిజానికి పరాప్రకృతి-అపరాప్రకృతుల మేలుకలయికే అయినా, మనుష్యులు పొరపాటు పడుతూనే ఉంటారు.

**త్రిభిర్గుణమయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ॥** – 7.13

బాహ్యాప్రపంచం అపరాప్రకృతియొక్క మూడు గుణాలతో నిండివుండటంవల్ల, ఈ ప్రపంచం మొత్తం మోహంలో పడిపోతున్నది. అందువల్ల ఉన్నతమైన, నిర్గుణమైన, అవ్యయమైన పరాప్రకృతి గురించి తెలుసుకోలేకపోతున్నారు.

పరాప్రకృతికి గుణాలు లేవు. అపరాప్రకృతికి మూడు గుణాలు ఉన్నాయి. అవి సత్త్వరజస్తమో గుణాలు. మీకు జీవితంలో అనుభవంలోకి వస్తున్న మార్పులన్నీ అపరాప్రకృతికి చెందినవే. సూర్యోదయం, సూర్యాస్తమయం అపరాప్రకృతి. అలా నిరంతరం మారుతున్న, నానాత్వం ఉన్న, ఈ జగత్తులోని భిన్నత్వాన్ని చూసి ఎంతగా మురిసిపోతారంటే, దాని మోహంలో పడిపోతారు. అపరాప్రకృతిని ప్రేమించండి, ఆరాధించండి తప్పులేదు. కాని దాని మోహంలో పడిపోయి పరాప్రకృతిని తెలుసుకోలేక పోతున్నారు. అది పెద్ద అవస్థలోకి దారితీస్తుంది.

దీన్ని సినిమాతో పోల్చవచ్చు. మొదట్లో సినిమా చూసేముందు, అక్కడ ఒక తెర ఉందనీ, ఆ తెరమీద సినిమా ఆడుతున్నదనీ తెలుసు. కాని సినిమా మధ్యలోకి వచ్చేసరికి, ఆ సినిమాతో ఎంతగా మమేకం చెందుతారంటే, ఆ సన్నివేశాలలో మీరు మీకు తెలియకుండానే స్పందిస్తారు. ఏదైనా భయంకర సన్నివేశం వస్తే, అది నిజం కాకపోయినా, ఆ విషయాన్ని మర్చిపోయి కెవ్వన కేక వేస్తారు. లేదా హీరో మరణిస్తుంటే, మీ ఆత్మీయులెవరో మరణించినంతగా బాధపడిపోతారు. అతను నిజంగా మరణించడు, కాని మరణించినట్టు బాధపడతారు.

అదే విధంగా, అపరాప్రకృతితో మమేకం చెందితే, అభద్రతాభావనకు లోనవుతారు. తమాషా చూడండి! మీరు మార్పును కోరుకుంటారు. దాన్ని ఆనందిస్తారు. కాని మీరు ఆధారపడటానికి ఒక మారని వస్తువు కావాలంటారు. అప్పుడే మార్పును స్వీకరించ గలుగుతారు. మీకు భద్రత కావాలి. భద్రత శాశ్వతమైన వస్తువునుంచే దొరుకుతుంది. అది పరాప్రకృతి మాత్రమే. కాని మారని పరాప్రకృతిని పదిలేసి, మారే అపరాప్రకృతి వెంట పరుగులు తీయటంవల్ల, సంసారంలో పడిపోతున్నారు. అది ఎలాగుంటుందంటే, మీరు నడవటానికి కర్రలమీద ఆధారపడ్డట్టుంటుంది. ఆ కర్రలు పడిపోతే, మీరూ పడిపోతారు. మీరు కోరుకునే కర్రలు – ధనం, హోదా, అంతస్తు, మనుష్యులు. కాని ఇవన్నీ మారే అపరాప్రకృతికి చెందుతాయి. వాటిని పట్టుకుంటే, సంసారం తప్పదు.

అలా అయితే అపరాప్రకృతిని పట్టించుకోకూడదా? అపరాప్రకృతిని వదిలివేయనవసరం లేదు. అపరాప్రకృతి ఆనందాన్ని ఇస్తుంది. పరాప్రకృతిని పట్టుకోండి, అపరాప్రకృతితో వ్యవహారం

నడపండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అప్పుడు జీవితం ఆటలాగా ఉంటుంది. అందరితో కలవండి, అందరినీ ప్రేమించండి, అన్ని వ్యవహారాలూ నడపండి కాని శాంతి, భద్రత, ఆనందాలకోసం ఎవరిమీదా ఆధారపడకండి. మీకు శాంతి, భద్రత, ఆనందాలనిచ్చే భగవంతునియొక్క ఉన్నతస్వరూపం అయిన ఈశ్వరుడు మాత్రమే. అది తెలియకపోతే మోహంలో పడిపోతారు.

'స్విమ్మింగ్‌పూల్ ఆనందకరంగా ఉంటుందా, భయపెడుతుందా?' ఎవరో అడిగారు. మీరు దానికి జవాబు చెప్పకుండా, తిరిగి ఎదురు ప్రశ్నించాలి. 'ఎవరికి?' ఎందుకంటే, ఈత కొట్టటం వచ్చిన వ్యక్తికి స్విమ్మింగ్‌పూల్ ఒక ఆటలాగా ఉంటుంది. అందులో సరదాగా, గంటలకొద్దీ ఈత కొడతాడు. కాని ఈతరాని వ్యక్తికి, అదే స్విమ్మింగ్‌పూల్ స్మశానంలాగా ఉంటుంది. అపరాప్రకృతి కూడా స్విమ్మింగ్‌పూలే! పరాప్రకృతిని ఆధారంగా చేసుకుని, అపరాప్రకృతిలో దిగితే, అది ఆనందదాయకంగా ఉంటుంది; కాని పరాప్రకృతిని పట్టుకోకపోతే, అపరాప్రకృతిలో వ్యవహారం నడపటం కష్టమవుతుంది.

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ॥** – 7.14

ఈ త్రిగుణాత్మకమైన మాయ, ఈ అపరాప్రకృతి మోహంలో పడవేస్తుంది. ఎవరైతే నన్ను శరణు వేడుతారో, అంటే ఎవరు నామీద భక్తి చూపిస్తారో, వారు ఈ మాయను అధిగమించగలరు.

పరాప్రకృతిని తెలుసుకోవటమెలా? దానికి భక్తిని మార్గంగా చూపిస్తున్నాడు కృష్ణపరమాత్మ. భక్తి అంటే ఏమిటి?

**సా తు అస్మిన్ పరమప్రేమరూపా** – నారద భక్తిసూత్రాలు 2

పరమప్రేమే భక్తి. ఏ రూపంమీద భక్తి చూపాలి? రామభక్తి శ్రేష్ఠమా, కృష్ణభక్తి శ్రేష్ఠమా, శివభక్తి శ్రేష్ఠమా? దానికి జవాబు కృష్ణపరమాత్మే చెబుతున్నాడు. మీరు ఏ రూపంలోనున్న దేవుణ్ణి కొలిచినా కూడా, ఆ భక్తి ఈశ్వరుని భక్తి కిందకే వస్తుంది. ఎందుకంటే ఈశ్వరుడే అనేక నామరూపాలతో భాసిస్తున్నాడు. అందువల్ల ఈ రూపం ఎక్కువ, ఆ రూపం తక్కువ అనలేరు. మీకు నచ్చిన ఏ రూపాన్నైనా కొలవచ్చు. అన్ని రూపాలూ ఈశ్వర రూపాలే! మీకు నచ్చిన ఏ రూపాన్నైనా ఎన్నుకోవచ్చు.

**యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥** – 7.21

ఎవరే దేవతను పూజించినా, నేను ఆ భక్తునికి ఆయా దేవతలమీద భక్తిశ్రద్ధలు స్థిరంగా ఏర్పడేటట్టు చేస్తాను.

అందువల్ల మనం ఈశ్వరుణ్ణి శివరూపంలోనో, విష్ణురూపంలోనో కొలవవచ్చు. ఆకారంలేని బ్రహ్మను ఊహించుకోలేము కాబట్టి, ఒక ఆకారాన్ని తీసుకుని ప్రార్థిస్తాము. మన దేశానికి పూజ చేయాలంటే, పువ్వులు వేయాలంటే కాశ్మీరునుంచి కన్యాకుమారి దాకా పువ్వులు వేయగలమా? అందువల్ల దేశానికి ప్రతీకగా నిలిచిన జెండావందనం చేస్తాము. జెండా ఎలాగైతే దేశానికి ప్రతీకో, అలాగే భగవంతునికి ప్రతీకగా ఒకదాన్ని తీసుకోవచ్చు. మన సంస్కృతి ప్రత్యేకత అన్నింటిలోనూ భగవంతుణ్ణి చూస్తాము. సూర్యుడు, చంద్రుడు, నదులు, కొండలు, చెట్లను పూజిస్తాము. ఉదాహరణకు గంగానదిని, కావేరి నదిని, అశ్వత్థ వృక్షాన్ని పూజిస్తాము.

**మూలతో బ్రహ్మరూపాయ మధ్యతో విష్ణురూపిణే।**
**అగ్రతః శివరూపాయ వృక్షరాజాయ తే నమః॥**

ఓ వృక్షరాజా! నీ మూలంలో బ్రహ్మ, మధ్యభాగంలో విష్ణుమూర్తి, అగ్రభాగంలో శివుడు నివసించే నీకు నమస్కారాలు.

ఇంకొక మెట్టు పైకెక్కితే, జంతువులను ప్రార్థిస్తాము. ఆవును పూజిస్తాము. దాని తర్వాత మానవులను పూజిస్తాము. తల్లిదండ్రులను పూజిస్తాము. మాతృదేవోభవ, పితృదేవోభవ అంటాము. ఇంతమందిని పూజించేసరికి మన మతం మనను అయోమయంలో పడవేస్తుందని అనుకుంటారు చాలామంది. కాని అది పొరపాటు మాత్రమే. ఒకే భగవంతుణ్ణి అనేక రూపాలతో కొలుస్తాము అంతే. అనేక రూపాలు ఒకే భగవంతునికి అనేక ఆలంబనాలు. దయానందస్వామీజీ ఈ విషయాన్ని అద్భుతంగా చెబుతారు – మాకు అనేక దేవుళ్ళు లేరు, మాకు దేవుడు మాత్రమే ఉన్నాడు.

**మద్భక్తః శంకరద్వేషీ మద్వేషీ శంకరప్రియః।**
**ఉభౌ తౌ నరకం యాతః యావచ్చంద్రదివాకరౌ॥**

ఇక్కడ విష్ణుమూర్తి ప్రకటిస్తున్నాడు, శివద్వేషిని తను తన భక్తునిగా స్వీకరించదు; నన్ను ప్రేమించే వ్యక్తీ శివభక్తుడు కాలేడు. ఇద్దరూ నరకానికి వెళతారు.

ఒక దైవాన్ని కొలవటం అంటే ఇంకొక దైవాన్ని దూషించటం కాదు. అందువల్ల మన మతంలో దేవుళ్ళందరనూ స్వీకరిస్తాము. అందువల్లనే మనం ముక్కోటి దేవతలను పూజిస్తాము. ఏ రూపంతో అన్నా కొలవవచ్చు. మనకు కూడా తెలుసు పరమాత్మను ఒక చిన్న రూపంమీద ఆవాహన చేసినా కూడా, పరమాత్మునికి పరిమితి లేదు. శివలింగం 2.5 అంగుళాలు మాత్రమే ఉన్నంతమాత్రాన, శివుడు అంత చిన్నరూపంలో ఉండడని మనకు తెలుసు. అలాగే విష్ణుమూర్తిని ఒక చిన్న సాలిగ్రామంమీద ఆవాహన చేసినంత మాత్రాన విష్ణుమూర్తిది అంత చిన్న ఆకారం కాదు. విష్ణుమూర్తి నిర్వచనమే – విషతి వ్యాప్నోతి సర్వమితి విష్ణుః.

అందువల్ల భక్తి అంటే ఈశ్వరభక్తి, పరిపూర్ణ ఈశ్వరభక్తి. పరాప్రకృతి, అపరాప్రకృతులమీద భక్తి. ఆ పరిపూర్ణమైన ఈశ్వరుణ్ణి ఏ రూపంలోనైనా కొలవవచ్చు.

**4. భక్తిలో మూడు రకాలు – శ్లోకాలు 20–30** కృష్ణపరమాత్మ భక్తులను నాలుగు రకాలుగా అభివర్ణించాడు. ప్రతి ఒక్కరూ ఈ నాలుగు దశలనూ దాటక తప్పదు. దాన్ని మనం మూడు దశల భక్తిగా చూద్దాము. అవి –

1. **సకామభక్తి** – అనేక కోరికలు తీర్చమని ఈశ్వరుణ్ణి కోరుతూ ప్రార్థన చేస్తారు ఇందులో. వాటిని శుభప్రాప్తి, దుఃఖనివృత్తిగా విభజించవచ్చు. ఏదైనా పొందటానికి చేస్తే అది శుభప్రాప్తి; దేన్నైనా వదిలించుకోవటానికి చేస్తే అది దుఃఖనివృత్తి. పైగా దానికోసం భగవంతునితో ఒప్పందం కుదుర్చుకుంటారు. బిజినెస్ డీల్ అన్నమాట. 'నేననుకున్నది తీరితే నీకు కొబ్బరికాయ కొడతాను,' 'నేను గుండు కొట్టించుకుంటాను,' 'నేను అంగప్రదక్షిణం చేస్తాను,' 'నీకు తులాభారం వేస్తాను.' ఫక్తు వ్యాపారధోరణిలో ఉంటుంది ఇది.

ఈ దశలో భగవంతుడు లక్ష్యం కాదు, ఒక మార్గం మాత్రమే. భగవంతుని ద్వారా, లౌకిక లక్ష్యాలు పొందటానికి ప్రయత్నిస్తారు. అంటే భగవంతుడు సాధ్యం, లౌకిక విజయాలు సాధ్యం; భగవంతుడు మార్గం, లౌకిక విజయాలు లక్ష్యం. మార్గం, లక్ష్యాలలో దేన్ని ఎక్కువగా ప్రేమిస్తారు? నిస్సందేహంగా లక్ష్యాన్నే. ఒక మార్గాన్ని వాడుతున్నారు అంటే, ఆ మార్గం మీద ప్రేమకొద్దీ కాదు; ఆ మార్గం ద్వారా మీరు కోరుకున్న లక్ష్యం పొందటానికి. మీరొక బస్సు ఎక్కారు అంటే, అది ఆ బస్సుమీద ప్రేమకొద్దీ కాదు, ఆ బస్సు మీరు కోరుకున్న గమ్యం చేరుస్తుంది కాబట్టి. అందువల్ల మీరు లక్ష్యాన్ని ముందు ప్రేమిస్తారు, మార్గాన్ని తరువాత ప్రేమిస్తారు.

సకామభక్తిలో భగవంతుడు మార్గం కాబట్టి, భగవంతునిమీద ప్రేమ తక్కువస్థాయి ప్రేమ. అందువల్ల ఇటువంటి భక్తిని మందభక్తి అంటారు. అయినా ఫర్వాలేదు అంటాడు కృష్ణపరమాత్మ. ప్రతి ఒక్కరూ ఈ మందభక్తితోనే మొదలుపెట్టాలి కూడా. ఎందుకంటే మొదట్లో ఎవరికీ దేవుని విలువ తెలియదు. మీరు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు, మీ తల్లిదండ్రులు భగవంతుణ్ణి ఎలా పరిచయం చేశారో గుర్తు తెచ్చుకోండి! 'భగవంతునికి నమస్కారం పెట్టుకుని పరీక్షకు వెళితే, మంచి మార్కులతో పాసవుతావు,' 'భగవంతుణ్ణి కోరితే, నీ సమస్య తీరుతుంది.'

అందువల్ల సకామభక్తిని నిక్షేపంలా పాటించవచ్చు. అదేమీ పాపం కాదు! నిషిద్ధకర్మ అసలే కాదు. నిజానికి పనికిరానివాళ్ళ కాళ్ళ మీదపడి, వారి కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడే బదులు, భగవంతుని కాళ్ళమీద పడి వేడుకోవటం అనేకరెట్లు మంచిది. ప్రతి ఒక్కరూ ఈ దశతోనే మొదలుపెడతారు.

**స తయా శ్రద్ధయా యుక్తః సత్యారాధనమీహతే ।**
**లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ ॥** – 7.22

అటువంటి సకామభక్తుడు శ్రద్ధతో పూజ చేస్తాడు. అతని కోరిక తీరటంవల్ల అతని భక్తిని ఇంకా ఎక్కువ చేస్తాడు. అతను ఏ దేవునికి పూజచేసినా ఆ కోరికలన్నీ నేనే తీరుస్తున్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కృష్ణపరమాత్మ నేను అంటే ఇక్కడ పరిపూర్ణ ఈశ్వరుడు అంటే పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయిక అయిన ఈశ్వరుడు. ఆ పరిపూర్ణ ఈశ్వరుడు ఎలా కోరికలు తీరుస్తాడు? తనను ఏ దేవుని రూపంలో కొలిస్తే, ఆ దేవుని ద్వారా తీరుస్తాడు. వినాయకుణ్ణి కొలిచే భక్తుణ్ణి వినాయకుని రూపంలో, కృష్ణపరమాత్మను కొలిచే భక్తుణ్ణి కృష్ణరూపంలో, శివుణ్ణి కొలిచే భక్తుణ్ణి శివరూపంలోనూ, గురువును కొలిచే భక్తుణ్ణి దక్షిణామూర్తిరూపంలోనూ దీవిస్తాడు. అందువల్ల ఏ దేవునికి పూజ చేసినా ఫర్వాలేదు. దీన్ని సకామభక్తి అంటారు. కృష్ణపరమాత్మ ఈ సకామభక్తినే రెండురకాల భక్తిగా విభజించాడు. అవి ఆర్తభక్తి, అర్థార్థీభక్తి.

ఆర్తభక్తి దుఃఖనివృత్తికోసం చూపే భక్తి. అర్థార్థీభక్తి సుఖప్రాప్తికోసం చూపే భక్తి. రెండూ సకామభక్తులే అని చూశాము. ఆర్తభక్తి ప్రవృత్తిమార్గం అయితే, అర్థార్థీభక్తి నివృత్తిమార్గం.

2. **నిష్కామభక్తి** – నెమ్మదిగా, ఈ సకామభక్తివల్లనే, మీ భక్తి పరిపక్వత చెందుతూ వస్తుంది. లౌకిక విజయాలనే కోరుకున్నా, అవి తీరటంకోసం తిరుపతికి వెళతారు. తిరుపతికి వెళ్ళి, దైవదర్శనం చేసుకోవటంవల్ల దైవకృప లభిస్తుంది. దైవకృపవల్ల కూడా మీ మనస్సు పరిపక్వత చెందుతూ వస్తుంది. పరిపక్వత చెందుతున్నదని ఎలా తెలుస్తుంది?

**అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్ ।** – 7.23

ఈ సకామభక్తులు వివేకం లేనివారు. వారు అనంతత్వాన్ని కోరకుండా అపూర్ణత్వాన్ని కోరుతున్నారు. అపూర్ణదేవతలను పూజించేవారికి అపూర్ణఫలాలే దక్కుతాయి. కాని నా భక్తులు నన్నే పొందుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

క్రమేపీ ఈ సకామభక్తులు, లౌకిక విజయాలు పొందటంవల్ల వారి జీవితం ఏమీ మెరుగవదని గ్రహిస్తారు. అంతవత్తు ఫలమ్ – వారు పొందే ఫలం శాశ్వతం కాదు; డబ్బు శాశ్వతం కాదు; మనుష్యులు శాశ్వతం కాదు. తనకే భద్రతలేని ఒకవ్యక్తి, భద్రతలేని ఇంకొక వ్యక్తిని పట్టుకుంటే, అతను మరింత అభద్రతాభావనకు లోనవుతాడే తప్ప, భద్రతను పొందలేడు. అంతకుముందు మీ ఒక్కరి బాధ్యత గురించి బెంగపడితే, ఇప్పుడు మీరు మీ భార్య గురించి, మీ పిల్లల గురించి బెంగ పడుతున్నారు. అంటే అభద్రతాభావన రెట్టింపు లేదా మూడురెట్లు అవుతున్నది. అభద్రత + అభద్రత = భద్రత అవదు.

ఈ సూత్రం అర్థమవటానికి కొన్ని నెలలు పట్టవచ్చు, కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు, కొన్ని జన్మలు కూడా పట్టవచ్చు. కాని అదృష్టవశాత్తూ మనకు అనేక జన్మలు ఉన్నాయంటుంది శాస్త్రం. తక్కిన మతాలు పునర్జన్మను నమ్మవు. అందువల్ల వారికి అన్నీ ఈ చిన్ని జీవితంలోనే అయిపోవాలి. కాని మనం దశలువారీగా పొందవచ్చు. కొన్ని పరీక్షల్లో ఒక్కొక్క సబ్జెక్టు పాసయినట్టుగా, ఒక్కొక్క మెట్టూ నెమ్మదిగా ఎక్కుతూ రావచ్చు.

అలా లౌకిక విజయాలు శాశ్వతమైన ఫలాన్ని ఇవ్వవని తెలిస్తే, మీ లక్ష్యం మారుతుంది. ఏ విజయం పొందినా అది శాశ్వతం కానప్పుడు, మీ లక్ష్యాన్నే మారుస్తారు. ఇప్పుడు భగవంతుడు లక్ష్యం అవుతాడు, లౌకిక విజయాలు మార్గం అవుతాయి. అందువల్లనే మన సాంప్రదాయం జీవితంలో ప్రతి ఒకదశను ఆశ్రమం అంటుంది. ఉదాహరణకు గృహస్థాశ్రమం ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడుతుంది. గృహస్థాశ్రమమే అంతిమదశ కాదు. ఈశ్వరుణ్ణి పొందటానికి అది ఒక మార్గం మాత్రమే అని అర్థం చేసుకుంటారు.

సకామభక్తిలో భగవంతుడు మార్గం, జగత్తు లక్ష్యం అయితే, రెండవ దశలో భగవంతుడు లక్ష్యం, జగత్తు మార్గం అవుతాయి. ఈ రెండవదశను ఆపేక్షిత నిష్కామభక్తి అంటారు. ఆపేక్షిత అని ఎందుకన్నామంటే, అప్పుడు మీరు కొంతమేరకు కోరికలనుంచి విడివడతారు. ఎందుకంటే, లౌకిక విజయాలు అనిత్యం అని తెలుసుకుంటారు. అందువల్ల లౌకిక విజయాల పరంగా నిష్కాములు అవుతారు కాని, కోరికలు పూర్తిగా పోవు. ఈశ్వరుణ్ణి పొందాలని తపన బయలుదేరుతుంది. ఈశ్వరుణ్ణి పొందాలనే కోరిక ఉంటుంది కాబట్టి, ఆపేక్షిక నిష్కామభక్తి అవుతుంది. కృష్ణపరమాత్మ ఈ భక్తుణ్ణి జిజ్ఞాసువు అంటున్నాడు.

3. **ఆత్యంతిక నిష్కామభక్తి** – ఈ భక్తిలో భగవంతుడు మార్గమూ కాదు, లక్ష్యమూ కాదు; సాధనా కాదు, సాధ్యమూ కాదు. ఎందుకంటే భగవంతుడు సిద్ధవస్తువు అని నేర్చుకుంటాడు. ఆత్మజ్ఞానం పొందటంవల్ల భగవంతునికి తను భిన్నంగా లేడనీ, భగవంతుడే పరాప్రకృతిగా–జీవాత్మగానూ, అపరాప్రకృతిగా–శరీరంగానూ ఉన్నాడని అర్థం చేసుకుంటాడు. ఎలాగైతే మహదాకాశం, ఘటాకాశానికి భిన్నంగా లేదో అలా జీవాత్మ, పరమాత్మకు భిన్నంగా లేదని తెలుసుకుంటాడు. భగవంతుడు తనకు భిన్నంగా ఉంటే లక్ష్యంగా భావించాలి కాని, భగవంతునికీ తనకూ మధ్య భేదం లేనప్పుడు ఉన్నదొకటే (అద్వైతం) అని అర్థమయినప్పుడు, ఈశ్వరుణ్ణి కోరరు ఈ దశలో. ఈ దశలో లౌకిక లక్ష్యమూ లేదు, ఈశ్వరునిమీద కోరికా లేదు. అందువల్ల ఈ భక్తిని ఆత్యంతిక నిష్కామభక్తి అంటారు. దీన్నే జ్ఞానీభక్తి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ జ్ఞానికి కోరికలేం ఉండవు. తనలోనే పూర్ణత్వాన్ని పొందుతాడు.

**దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మామపి** – 7.23

అపూర్ణదేవతలను పూజించేవారికి అపూర్ణఫలాలే దక్కుతాయి. కాని నా భక్తులు నన్నే పొందుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఆ విధంగా భక్తిలోని మూడు దశలు దాటితే మోక్షం కలుగుతుంది. సకామభక్తితో మొదలుపెట్టి, ఆపేక్షిక నిష్కామభక్తి స్థాయికి ఎదిగి, ఆత్యంతిక నిష్కామభక్తికి రావాలి. ఆత్యంతిక నిష్కామభక్తిని జ్ఞానం అంటారు.

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః** – 7.17

నాలుగు రకాల భక్తులలో జ్ఞానీభక్తుడు అందరికన్నా శ్రేష్ఠుడు. అతనికి అద్వైతభక్తి ఉంటుంది. అతనికి నేను చాలా ప్రియమైన వ్యక్తిని, నాకు కూడా అతను ప్రియమైనవాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ శ్లోకంవల్ల అనేక అపోహలు తొలుగుతాయి. జ్ఞానమార్గానికి వచ్చాక భక్తి ఉండదు, జ్ఞానికి ప్రేమ ఉండదు, అతనికి దయాగుణం ఉండదు అని పొరపాటు పడతారు. భక్తిలోనే ఆర్ద్రత ఉంటుందనుకుంటారు. కాని ఇదంతా వేదాంతం అంటే ఏమిటో తెలియనివారు పలికే పలుకులు. అన్నిరకాల భక్తుల్లోకీ జ్ఞాని శ్రేష్ఠుడు అంటున్నాడు. జ్ఞాని అంటే వేదాంతజ్ఞాని, అద్వైతజ్ఞాని. అందువల్ల ఈ మూడుదశల భక్తిని దాటుకువచ్చి సంసారంనుంచి విముక్తి పొందు అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

దీనితో ఏడవ అధ్యాయాన్ని ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. దీన్ని జ్ఞానవిజ్ఞానయోగము అంటారు. సగుణ ఈశ్వరజ్ఞానాన్ని జ్ఞానమనీ, నిర్గుణ ఈశ్వరజ్ఞానాన్ని విజ్ఞానమనీ అంటారు.

**జ్ఞానం తేఽహం సవిజ్ఞానమ్ ఇదం వక్ష్యామ్యశేషతః।** – 7.2

నేను నీకు సగుణ ఈశ్వరజ్ఞానాన్నీ, నిర్గుణ ఈశ్వరజ్ఞానాన్నీ బోధిస్తాను అని కృష్ణపరమాత్మ అనటంవల్ల దీనికి జ్ఞానవిజ్ఞానయోగము అని పేరు వచ్చింది. సగుణ ఈశ్వరజ్ఞానం స్థాయిలో భగవంతునికీ, భక్తునికీ మధ్య భేదం ఉంటుంది. నిర్గుణ ఈశ్వరజ్ఞానాన్ని పొందితే దాన్ని అపరోక్షజ్ఞానం అంటారు. భగవంతునికీ మనకూ మధ్య భేదం లేదని నేర్చుకుంటాము. ఈ జ్ఞానం పొందితే ఇంక తెలుసుకోవాల్సింది ఏమీ ఉండదు.

# అక్షరబ్రహ్మయోగము

## అధ్యాయము 8

ఎనిమిదవ అధ్యాయము పేరు అక్షరబ్రహ్మయోగము. ఈ అధ్యాయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే, వేదాల్లో చెప్పబడిన అంశాల గురించి కొంత జ్ఞానం ఉండాలి. అది తెలియకపోతే, ఆ బోధను ఆధారంగా చేసుకుని కృష్ణపరమాత్మ చేసిన ఈ బోధ అర్థమవటం కష్టమవుతుంది.

మొత్తం వేదాలను మూడు భాగాలుగా విభజించవచ్చు. ఒక్కొక్క భాగాన్ని కాండ అంటారు. మూడు కాండాల పేర్లు వరుసగా కర్మకాండ, ఉపాసనకాండ, జ్ఞానకాండ. వాటి గురించి వివరంగా చూద్దాము.

1. **కర్మకాండ** – కర్మకాండ పేరుకు తగ్గట్టుగానే కర్మ గురించి బోధిస్తుంది. కర్మ అంటే యజ్ఞయాగాదులు. కర్మకాండలో వివరించబడ్డ కర్మలను రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి సకామకర్మలు, నిష్కామకర్మలు.

**సకామకర్మలు** – సకామకర్మలు పేరులోనే దాని అర్థం ఉంది. సకామకర్మలు అంటే లౌకిక విజయాలు పొందటానికి చేసే కర్మలు. ఈ కర్మలు అందరూ చేసితీరాల్సిన పనిలేదు. ఎవరికి, ఏ కోరిక ఉంటే, ఆ కోరిక తీరటానికి అవసరమైన కర్మ చేస్తారు. ఉదాహరణకు పుత్రకామేష్టియాగం విషయమే తీసుకుందాం. ఆ కర్మను కుచేలుడు చేయడు. పెళ్ళి అయి, పిల్లలు కావాలనుకునేవారు, అదికూడా మామూలుగా, సహజంగా పిల్లలు పుట్టనివారు చేయాలి. మానవప్రయత్నం సరిపోని చోట, ఈశ్వర అనుగ్రహం కోరుతూ చేసే యజ్ఞం ఇది. **పుత్రకామః చిన్వీత.**

ఆ విధంగా లౌకిక విజయాలు పొందటానికి చేసే కర్మలను సకామకర్మలు అంటారు. **పశుకామః చిన్వీత** – పశువులు కావాలనుకునేవారు చేసే యాగం ఇది. **వృష్టికామః చిన్వీత** – వర్షాలు కురవాలనుకునేవారు చేసే యాగం ఇది. అలా అర్థకామాలు తీరటం కోసం చేస్తారు ఈ సకామకర్మలు. వీటిని **కామ్యకర్మలు** అనికూడా అంటారు.

**నిష్కామకర్మలు** – ఈ కర్మలకు కోరికలకు సంబంధం లేదు. ఇవి అందరూ చేసి తీరాల్సిన కర్మలు. ఈ నిష్కామకర్మలను విహితకర్మలు లేదా నిహితకర్మలు అనికూడా అంటారు. నిష్కామకర్మవల్ల లౌకికవిజయాలు రావు; ఆధ్యాత్మిక ఎదుగుదల వస్తుంది. నిష్కామ కర్మఫలం చిత్తశుద్ధి కలిగి, జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది.

**జ్ఞానయోగ్యతా సిద్ధ్యర్థ్యం మమోపాత్త సమస్తదురితక్షయద్వారా ...**
**జ్ఞానప్రతిబంధాః ఏవ దురితశబ్దేన నిర్దిశ్యంతే ।**

దురితం అంటే జ్ఞానానికి అడ్డుపడేది ఏదైనా వస్తుంది. అందువల్ల ఆత్మజ్ఞానం పొందాలంటే, దానికి అర్హత పొందటానికి ఈ నిత్యకర్మలు లేదా నిష్కామకర్మలు బోధించబడ్డాయి.

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥** – 18.5

యజ్ఞదాన తపస్సులనే కర్మలను త్యజించకూడదు. ఎందుకంటే ఈ కర్మలు మూడూ బుద్ధిమంతులను పవిత్రులుగా చేస్తాయి.

కృష్ణపరమాత్మ యజ్ఞం, దానం, తపస్సు కర్మలు చేసితీరాలని అంటున్నాడు. ఎందుకంటే అవి పావనకర్మలు. ఆ కర్మలు చిత్తశుద్ధిని కలుగజేస్తాయి.

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిశంతి యజ్ఞేన**
**దానేన తపసా అనాశకేన** – బృహదారణ్యకమ్ 4.4.22

బ్రాహ్మణులు వేదాలను అధ్యయనం చేయటం ద్వారా, యజ్ఞం, దానం, తపస్సుల ద్వారా ఆత్మను తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు.

జ్ఞానయోగ్యతను పొందటానికి ఎన్నో యజ్ఞయాగాదులు విధించబడ్డాయి.

**యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః** – 3.13

యజ్ఞం చేశాక, ఎవరైతే యజ్ఞశిష్టాన్ని భుజిస్తారో, వారు సర్వపాపాలనుంచి విముక్తి పొందుతారు.

ఇలా విహితకర్మలను ఎవరైతే చేస్తారో, వారు అన్ని పాపాలనుంచి విడివడతారు. ఈ కర్మలలోకి నిత్యం చేసే ప్రార్థన, సంధ్యావందనం లేదా పంచమహాయజ్ఞాలు వస్తాయి. పంచమహాయజ్ఞాలు అంటే – దేవయజ్ఞం–దైవపూజ చేయటం; పితృయజ్ఞం–పితృదేవతలకు తర్పణాలు వదలటం; మనుష్యయజ్ఞం–మానవసేవ చేయటం; ఋషియజ్ఞం –వేదపారాయణం చేయటం లేదా ఆధ్యాత్మిక గ్రంథాన్ని పఠించటం; భూతయజ్ఞం–పశుపక్ష్యాదులను, వృక్షాలను కాపాడటం.

**అహరహః సంధ్యామ్ ఉపాసీత, యావజ్జీవం అగ్నిహోత్రం జుహోతి** అంటుంది శాస్త్రం. అంటే ప్రతిరోజూ సంధ్యావందనం చేయాలి; జీవించి ఉన్నంతకాలం అగ్నిహోత్రం చేయాలి. ఈ కర్మలు చిత్తశుద్ధిని కలుగజేసి, జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తాయి.

కాని ఎవరైనా ప్రాథమిక దశలో, ఎక్కువగా సకామకర్మలనే చేస్తారు. అతనికి జీవితంలో అన్ని పనులు చేయటానికి సమయం ఉంటుంది కానీ, సంధ్యావందనం చేయటానికి తీరిక ఉండదు! కామ్యకర్మలు చేసే వ్యక్తిని కామి అంటారు. అందులో తప్పేంలేదు. వేదాలే అనేక కామ్యకర్మలను సూచిస్తాయి కూడా. కాని అక్కడే ఆగిపోవద్దంటాయి వేదాలు. ఎప్పుడో

అప్పుడు, వాటిని దాటి పైకి రావాలని ఆశిస్తాయి కూడ. పరిపక్వత చెందిన మనస్సుతో, వాటికన్నా ఉన్నతమైన వాటిని కోరాలంటాయి వేదాలు.

చిన్నపిల్లలు చిన్నవయస్సులో బెలూన్లను కోరటంలో తప్పేంలేదు. వారే కాలక్రమేణా ఆ కోరికలకు అతీతంగా ఎదుగుతారు. కాని ఒకవేళ అలా అతీతంగా ఎదగకుండా, పాతికేళ్ళ వయస్సు వచ్చాక కూడా, పుట్టినరోజు కానుకగా బెలూన్లనే కోరితే, ఎబ్బెట్టుగా ఉంటుంది.

**యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః ।**
**వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః ॥** – 2.42

**కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।**
**క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥** – 2.43

**భోగైశ్వర్యప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్ ।**
**వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥** – 2.44

ఓ అర్జునా, వివేకహీనులు ప్రాపంచిక భోగాలలోనే మునిగిపోతారు. వారు వేదవాక్యాల బాహ్యార్థాలనే తీసుకుంటారు. స్వర్గఫలాలని మించినది లేదని, అదే పరమమని భావిస్తారు. క్షణికమైన ప్రాపంచిక సుఖాలనే కోరతారు. అందువల్ల వారికి ఏకాగ్రత దైవధ్యానంమీద కలగదు.

పరిణతి చెందని వ్యక్తులు అంతకంతకూ సకామకర్మల్లో కూరుకుపోతే, పరిణతి చెందిన వ్యక్తులు సకామకర్మలనుంచి ఎదిగి, నిష్కామకర్మలకు వస్తారు. శాస్త్రం నిర్దేశించిన విహితకర్మలను చేస్తారు. తద్వారా చిత్తశుద్ధిని పొందుతారు. ఆ విధంగా, కర్మకాండ రెండు రకాల ఫలాలను ఇస్తుంది. పరిణతి చెందనివారికి ఇహలోక, పరలోకఫలాలను ఇస్తే, అదే కర్మకాండ నిష్కామకర్మలు చేసినవారికి ఆధ్యాత్మిక ఫలమైన చిత్తశుద్ధిని కలుగజేస్తుంది.

చిత్తశుద్ధి అంటే రాగద్వేషాలను తగ్గిస్తుంది. ఈ రాగద్వేషాలు మనిషికున్న పెద్ద శత్రువులు. అవి ఆధ్యాత్మిక ఎదుగుదల పొందకుండా అడ్డుపడతాయి. అందువల్ల ఈ రాగద్వేషాలను తగ్గించుకుంటే వైరాగ్యం అలవడుతుంది. దానివల్ల చిత్తశుద్ధి కలుగుతుంది.

వేదాలు నిష్కామకర్మవల్ల చిత్తశుద్ధి మాత్రమే కలుగుతుందనీ, జ్ఞానం కలగదనీ చాలా స్పష్టంగా చెబుతాయి. ఇంకోవిధంగా చెప్పాలంటే కర్మకాండ జ్ఞానయోగ్యతను కలుగజేస్తుంది కాని జ్ఞానాన్ని ఇవ్వదు. ఎందుకంటే కర్మకాండ ప్రమాణం కాదు.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః** – కైవల్యమ్

కర్మవల్ల కాని, పిల్లలవల్ల కాని, ధనంవల్ల కాని మోక్షం రాదు. త్యజించటంవల్లనే మోక్షం పొందుతారు.

కర్మవల్ల జ్ఞానం పొందలేరు అంటే కర్మవల్ల జ్ఞానఫలం అయిన మోక్షాన్ని కూడ పొందలేరు. కర్మవల్ల జ్ఞానం రాదు కాబట్టి అది సాక్షాత్ సాధన కాదు కాని, సహకారీ సాధనలోకి వస్తుంది. ఎందుకంటే దానివల్ల జ్ఞానయోగ్యత వచ్చి, జ్ఞానం పొందటానికి తోడ్పడుతుంది.

**జ్ఞానముత్పద్యతే పుంసాం క్షయాత్ పాపస్య కర్మణః।**
**యథా దర్శతలః ప్రఖ్యే ప్రశ్యంత్యాత్మానమ్ ఆత్మని॥**

– మహాభారతం శాంతిపర్వం 204.08

ఎలాగైతే అద్దం దుమ్ము లేకుండా ఉంటే, వారి ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తుందో, అదే విధంగా, ఎవరికైతే వారి పాపాలన్నీ క్షయమవుతాయో, వారిలో జ్ఞానం ఉదయిస్తుంది.

టూకీగా చెప్పాలంటే, వేదాల్లోని మొదటిభాగమైన కర్మకాండ చిత్తశుద్ధి కలుగజేసి, జ్ఞానయోగ్యతను కలుగజేయటంవల్ల మోక్షం పొందటానికి సహకారీసాధనగా తోడ్పడుతుంది.

2. **ఉపాసనకాండ** – వేదాల్లోని రెండవభాగాన్ని ఉపాసనకాండ అంటారు. ఉపాసన అంటే మానసవ్యాపారం అని అర్థం. దాన్ని సజాతీయ ప్రత్యయ ప్రవాహం అంటారు. ఉపాసన ప్రాథమికంగా మనస్సుతో చేసే పూజ. ఇందులో శరీరంతో చేయరు. నిజానికి చాలామంది దైవపూజ ఉపాసనలోకి వస్తుందని పొరపాటు పడతారు. కాని దైవపూజ మానసపూజలోకి రాదు. దైవపూజను కాయికపూజ అంటారు. ఉపాసన మనస్సుతో చేసేది కాబట్టి, దాన్ని మానసవ్యాపారం అంటారు. సగుణబ్రహ్మమీద ధ్యానం కాబట్టి, ఉపాసనను **సగుణబ్రహ్మ విషయ మానసవ్యాపారః** అంటారు. అందువల్ల ఉపాసనను సగుణ ఈశ్వర ధ్యానం అనికూడా అంటారు. ధ్యానం అంటే ఏమిటి?

**విజాతీయ ప్రత్యయ అనంతరిత సజాతీయ ప్రత్యయప్రవాహః।**

భిన్న ఆలోచనల ఆటంకం లేని ఏకవిషయ ఆలోచనల ప్రవాహాన్ని ఉపాసన అంటారు.

ఉపాసనకాండలో వేదం అనేక ఉపాసనలను బోధించింది. ఈ ఉపాసనలను రెండు రకాలుగా విభజించవచ్చు. అవి సకామ ఉపాసన, నిష్కామ ఉపాసన.

**సకామ ఉపాసన** – సకామ ఉపాసన అంటే కోరికతో చేసే ఉపాసన. అవి లౌకిక విజయాలకోసం, సిద్ధులతో సహా, చేసే ఉపాసన. ఉపాసన చేసే వ్యక్తులకు కొన్ని సిద్ధులు కలుగుతాయి. ఉపాస్యదేవతను దర్శించగలుగుతారు ఆ ఉపాసకులు. ఆ ఉపాస్యదేవత ద్వారా కొన్ని శక్తులు కూడ వస్తాయి. దేవీఉపాసకులు, ఆంజనేయ ఉపాసకులు మన

భవిష్యత్తును సూచించగలరు అని చూస్తుంటాము. కాని ఈ భవిష్యవాణి శక్తి కూడా లౌకిక శక్తులలోకే వస్తుంది కానీ ఆధ్యాత్మికతలోకి రాదు.

**నిష్కామ ఉపాసన –** నిష్కామ ఉపాసకులకు జ్ఞానయోగ్యతాసిద్ధి వస్తుంది. మనస్సు ఏకాగ్రత పెంపొందించుకునేందుకు తోడ్పడుతుంది ఈ ఉపాసన. అందువల్ల చిత్త ఏకాగ్రతాప్రాప్తి కలుగుతుంది; మనస్సు బాహ్యముఖంగా పరుగులు తీసి, అంతర్ముఖం అవుతుంది కాబట్టి చిత్తనైశ్చల్యప్రాప్తి కలుగుతుంది. కర్మకాండలో కూరుకుపోయిన వ్యక్తికి మనస్సు బహిర్ముఖంగా ఉంటుంది. ఉపాసనలో బాహ్యంగా పరుగులు తీసే మనస్సును అంతర్ముఖం చేస్తారు.

**అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా** – లలితా సహస్రనామమ్

**పరాంచి ఖానివ్యతృణత్ స్వయంభూః తస్మాత్ పరాఙ్ పశ్యతి న అంతరాత్మన్**

– కఠ 2.1.1

స్వయంభువు భగవంతుడు ఇంద్రియాలను బాహ్యముఖంగా చూసేలాగా ఏర్పాటు చేశాడు కాబట్టి, మనిషి బాహ్యంగా చూస్తాడు కాని అంతరాత్మను చూడటం లేదు.

అందువల్ల నిష్కామ ఈశ్వర ఉపాసన జ్ఞానయోగ్యతను, చిత్తనైశ్చల్యప్రాప్తి ద్వారా కలుగజేస్తుంది. నిజానికి, మనం రోజూ చేసే సంధ్యావందనంలోనే, ఉపాసన కూడ కలగలిపి ఉంది. అందువల్లనే సంధ్యావందనాన్ని సంధ్యోపాసన ఉంటారు.

**అసావాదిత్యో బ్రహ్మ – బ్రహ్మైవాహమస్మి।**

ఇది అభేద ఉపాసన. గాయత్రీదేవతను దర్శించటంకోసం ఇచ్చిన గాయత్రీమంత్రం ఉపాసనలోకి వస్తుంది.

కర్మకాండ గురించి చూసిన అంశాలు ఇక్కడ కూడా వర్తిస్తాయి. కర్మకాండ చిత్తశుద్ధి ఇస్తుంది కాని జ్ఞానాన్ని ఇవ్వదు అన్నాము. అదే విధంగా ఉపాసనకాండ చిత్తఏకాగ్రత, చిత్తనైశ్చల్యం ఇస్తుంది కాని జ్ఞానాన్ని ఇవ్వదు. కర్మకాండ ఎలా ప్రమాణం కాదో, అలా ఉపాసనకాండ కూడా ప్రమాణం కాదు.

**న యోగేన న సాంఖ్యేన కర్మణా నో న విద్యయా।**
**బ్రహ్మాత్మైకత్వబోధేన మోక్షస్సిద్ధ్యతి నాన్యథా॥** – వివేకచూడామణి 5.48

యోగంవల్ల కానీ, సాంఖ్యవల్ల కానీ, కర్మవల్ల కానీ, కేవలపుస్తకపఠనంవల్ల కాని మోక్షం రాదు. బ్రహ్మ–ఆత్మ ఐక్యత్వజ్ఞానం పొందితేనే వస్తుంది; వేరే ఏ ఇతరమార్గంవల్లా రాదు.

ఉపాసనవల్ల జ్ఞానం రాదు కాబట్టి అది సాక్షాత్‌సాధన కాదు కానీ, సహకారీసాధనలోకి వస్తుంది. ఎందుకంటే దానివల్ల జ్ఞానయోగ్యత వచ్చి, జ్ఞానం పొందటానికి తోడ్పడుతుంది.

ఆ విధంగా కర్మకాండ, ఉపాసనకాండ కూడ మోక్షానికి పరోక్షంగా తోడ్పడతాయి కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ రెండు కాండలనూ పాటించాలి. వేదాలను ప్రత్యక్షంగా పఠించకపోయినా, ఎవరి ద్వారానైనా పరోక్షంగా వీటి గురించిన జ్ఞానం పొంది కర్మ, ఉపాసనలను పాటించాలి.

కర్మకాండ పాటించి చిత్తశుద్ధి పొంది, ఉపాసనకాండ పాటించి చిత్తఏకాగ్రత, చిత్తనైశ్చల్యం పొంది, తద్వారా జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందాక ఏం చేయాలి? అక్కడే ఆగిపోతే, సాధకుని ప్రయాణం అసంపూర్తి అవుతుంది. ఎందుకంటే, అతను జ్ఞానయోగ్యతను పొందుతాడు కాని, జ్ఞానాన్ని ఇంకా పొందలేదు. జ్ఞానకాండ వేదాంతభాగంలో వస్తుంది. జ్ఞానం పొందాలంటే, ఒక సాధకుడు, గురువు దగ్గరికి వెళ్ళి, గురువు ద్వారా జ్ఞానకాండను అధ్యయనం చేసి, జ్ఞానం పొందాలి.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**
– ముండకమ్ 1.2.12

ఆ జ్ఞానం (ఆత్మజ్ఞానం) పొందటానికి సమిధలు చేతపుచ్చుకుని, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరకు వెళ్ళాలి సాధకుడు.

**కర్మ ఉపాసనాకాండాభ్యాం జ్ఞానయోగ్యతాసిద్ధిః జ్ఞానకాండేన జ్ఞానసిద్ధిః॥**

ఇది వేదాలలో నిర్దేశించబడిన చక్కటి రాజమార్గం.

ఈ మార్గంలో పయనించటానికి అవే వేదాలు ఆశ్రమధర్మాలను కూడా నిర్దేశించాయి. బ్రహ్మచర్య ఆశ్రమంలో ఒక సాధకుడు వేదాధ్యయనం చేస్తాడు. తన జీవయాత్ర గురించి నేర్చుకుంటాడు; తరువాత గృహస్థాశ్రమంలో కర్మకాండ పాటించి, చిత్తశుద్ధి పొందుతాడు; తరువాత వానప్రస్థాశ్రమంలో ఉపాసనకాండ పాటించి చిత్తనైశ్చల్యం పొందుతాడు; చివరగా సన్న్యాసాశ్రమంలో జ్ఞానకాండకి వచ్చి, సునాయాసంగా మోక్షం పొందుతాడు.

**వార్ధక్యే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజామ్।** – రఘువంశమ్ 18

వార్ధక్యంలో సన్న్యాసజీవనం గడిపి, తనువు చాలించేవరకు తాపసిక జీవనం గడపాలి.

మోక్షం పొందటానికి మార్గం ఎంత చక్కగా తీర్చిదిద్దబడిందో చూడండి! మనమే ఈ మార్గాన్ని సరిగ్గా పాటించక మధ్యలో వదిలేస్తాము. వేదాలు మనకి బాగా దిశానిర్దేశం చేశాయి.

ఈ రాచమార్గం (సాధారణమార్గం) కాక, అదనంగా ఇంకో అసాధారణమార్గం గురించి కూడా వివరిస్తాయి వేదాలు. సాధారణమార్గాన్ని మళ్ళీ ఒకసారి చూస్తే – కర్మకాండ పాటించి చిత్తశుద్ధి పొంది, ఉపాసనకాండను పాటించి చిత్తఏకాగ్రత, చిత్తనైశ్చల్యం పొంది,

జ్ఞానకాండకు వచ్చి గురువు ద్వారా శాస్త్ర ఉపదేశాన్ని పొంది, ఆత్మజ్ఞానం పొంది, మోక్షం పొందాలి.

ఇప్పుడు అసాధారణ మార్గాన్ని చూస్తే ఒక సాధకుడు కర్మకాండ పాటించి చిత్తశుద్ధిని, ఉపాసనకాండను పాటించి చిత్తఏకాగ్రతను పొందుతాడు కాని అతను జ్ఞానకాండకు ఏ కారణంవల్లనో రాలేడు. అంటే గురువు వద్దకు వచ్చి శాస్త్రఉపదేశాన్ని పొందడు. అతనికి సరియైన గురువు దొరికి ఉండకపోవచ్చు. శాస్త్రఅధ్యయనం చేసే అవకాశం దొరికి ఉండక పోవచ్చు. అతనికి వీలు కుదరకపోయి ఉండవచ్చు. కారణం ఏదైనా కానీ, అతను జ్ఞానకాండకు రాలేకపోతాడు. అతనికి మోక్షం పొందాలనే తీవ్రతపన అయితే ఉంటుంది కాని, ఏ కారణంవల్లనో మోక్షం పొందటానికి అవసరమైన జ్ఞానం పొందే అవకాశం కలగదు. అటువంటి వ్యక్తి ఏం చేయాలి?

వేదాలు అన్నిరకాల మనుష్యులను, అన్నిరకాల సన్నివేశాలను ముందే సమీక్షించి, అన్నింటికీ మార్గాలను సూచిస్తూనే వస్తాయి. అదే వేదాల ప్రత్యేకత! నాకు మోక్షం వద్దు, నాకు ధనం, ధాన్యం, పశువు, బహుపుత్రలాభం, దీర్ఘాయువు మాత్రమే కావాలంటే, మరేం ఫర్వాలేదు, అన్నీ అనుభవించి తీరిగ్గా వేదాంతానికి రండి అంటాయి. అదే విధంగా కర్మకాండనుంచి ఉపాసనకాండకు వచ్చి, ఈశ్వర ఉపాసననే జీవితాంతం చేస్తాను, ప్రాపంచిక విషయాలమీద వైరాగ్యం పెంచుకుంటాను కాని జ్ఞానకాండకు రాలేను, నేను నిష్కామ ఉపాసకునిగానే మరణిస్తాను అన్నాకూడా శాస్త్రం ఏమీ అనదు. ఖచ్చితంగా అతనికి జీవన్ముక్తి రాదు. ఎందుకంటే అతను జ్ఞానయోగానికి రాలేదు కాబట్టి. కాని జీవితాంతం నిష్కామ ఉపాసన చేశాడు కాబట్టి అతను బ్రహ్మలోకానికి వెళతాడు.

మీకెలా తెలుసు అంటే శాస్త్రంమీద శ్రద్ధ పెట్టుకోవాలి. బ్రహ్మలోకం నాకు కంటికి కనబడటం లేదు కాబట్టి లేదు అనేయకూడదు. అంటే మీ వీపు మీకు కనబడదు కాబట్టి, మీ వీపు కూడా లేదన్నట్టా! అందువల్ల మనిషి చూపుకందని ఎన్నో విషయాలు ఉన్నాయి. వాటిల్లో బ్రహ్మలోకం ఒకటి. అందువల్ల నిష్కామ ఉపాసకుడు బ్రహ్మలోకానికి వెళతాడు అనేది అక్షరసత్యం.

అతను జ్ఞానయోగానికి ఏ కారణంవల్లనో రాలేకపోయాడు కాని, జ్ఞానం పొందాలనే తపన మాత్రం జీవితాంతం ఉంది. అటువంటి ఉన్నతమైన కోరికలు తీర్చాలంటుంది శాస్త్రం. అందువల్ల శాస్త్రం నిష్కామ ఉపాసకుడు బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ బ్రహ్మజ్ఞానం పొందుతాడు అంటుంది. పైగా అక్కడ అతను బ్రహ్మజ్ఞానం పొందటానికి పరిస్థితులు చాలా అనుకూలంగా ఉంటాయి. విద్య బోధించేది సాక్షాత్తూ బ్రహ్మదేవుడు. చతుర్ముఖ బ్రహ్మయొక్క నాలుగు ముఖాలు, నాలుగు వేదాలకు ప్రతీక అంటారు. అలా గురువు

సాక్షాత్తూ బ్రహ్మదేవుడు. శిష్యుడు కూడా తేలికగా నేర్చుకుంటాడు. అతని మనస్సు సూక్ష్మంగా ఉంటుంది, బాదరబందీలు ఉండవు. అందువల్ల గురువు చెప్పీ చెప్పగానే జ్ఞానం పొందుతాడు.

బ్రహ్మలోకంలో జ్ఞానం పొంది, అక్కడ జీవన్ముక్తి పొందుతాడు. బ్రహ్మలోకంలో తను ఉండాల్సినంత కాలం జీవన్ముక్తిని అనుభవించి, అక్కడ కాలం తీరాక విదేహముక్తిని పొందుతాడు. ఆ విధంగా నిష్కామ ఉపాసకుడు ఇక్కడ జ్ఞానం పొందకపోయినా, బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ జ్ఞానం పొంది, అక్కడ మోక్షాన్ని పొందుతాడు. ఈ విధమైన మోక్షాన్ని క్రమముక్తి అంటారు. ఈ ప్రత్యేకమైన మోక్షం గురించి శాస్త్రంలో చూస్తాము. అలా బ్రహ్మలోకంలో బ్రహ్మ ద్వారా జ్ఞానం పొంది, మోక్షం పొందితే దాన్ని క్రమముక్తి అంటారు. దాని బదులుగా ఈ నిష్కామ ఉపాసకుడు భూలోకంలోనే, ఈ జన్మలోనే, ఒక గురువు దగ్గరికి వెళ్ళి జ్ఞానం పొంది, మోక్షం పొందితే దాన్ని జీవన్ముక్తి లేదా సద్యోముక్తి అంటారు.

ఈ ఎనిమిదవ అధ్యాయం ప్రధానంగా ఈ నిష్కామ ఉపాసకుడు బ్రహ్మలోకంలో పొందే క్రమముక్తిని గురించి అభివర్ణిస్తుంది. ఈ నేపథ్యంతో ఎనిమిదవ అధ్యాయంలో అగుడుపెడదాము.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా మూడు అంశాలుగా విభజించవచ్చు. అవి – భక్తి, ఉపాసన, క్రమముక్తి. (వీటిని శ్లోకాల పరంగా చూడటం లేదు.)

1. **భక్తి** – భక్తి అంటే భగవంతునిమీద ఆరాధన అని చూశాము. అంతేకాదు, ఈ భక్తిలో కూడా రెండు దశలు ఉన్నాయని చూశాము. అవి సకామభక్తి, నిష్కామభక్తి.

**సకామభక్తి** – అన్నింటికన్నా తక్కువస్థాయి భక్తి సకామభక్తి. ఈ భక్తిలో లౌకిక విజయాలను లక్ష్యంగానూ, భగవంతునిమీద భక్తిని మార్గంగానూ చూస్తారు. ఉదాహరణకు నీటి ఎద్దడితో బాధపడుతున్న భక్తుడు, భగవంతునికి శ్రద్ధగా పూజ చేస్తాడు; కాని నీటి సమస్య తీర్చటం కోసం చేస్తాడు. అతని భక్తికి మెచ్చి భగవంతుడు, 'నీకు దర్శనమివ్వనా?' అని అడిగితే, ఈ భక్తుడు, 'ఓ దేవా, ముందు నా నీటి సమస్యను తీర్చు. నువ్వు తరువాత వద్దువుగాని. అసలే ఉన్నవారికి నీరు చాలక బాధపడుతుంటే, నువ్వు కూడా తోడయితే మాకు కష్టమవుతుంది,' అంటాడు. ఆ విధంగా సకామభక్తుడు, భగవంతుణ్ణి మార్గంగా ఎన్నుకుంటాడు కాని, లక్ష్యంగా కాదు. అతని లక్ష్యాలు ఐహికసుఖాలు. వాటిని తీర్చమని భగవంతునికి మొరపెట్టుకుంటాడు.

**నిష్కామభక్తి** – ఈ అధ్యాయంలో ఈ సకామభక్తుని ప్రస్తావన రాదు. ఇక్కడ మనం చూసేది నిష్కామభక్తి. ఈ భక్తునికి భగవంతుడు మార్గం కాదు, లక్ష్యమే. భగవత్ప్రాప్తికోసం

పూజ చేస్తాడు. అతనికి మోక్షం పొందాలనే తపన ఉంటుంది. ఈ మోక్షఇచ్ఛనే భక్తి అంటారు. ఇది తెలియక చాలామంది భాగవతంలోనే భక్తి గురించి వస్తుంది కాని, వేదాంతంలో భక్తి గురించిన ప్రసక్తి ఉండదు అని అపోహ పడతారు. కాని భగవంతునిమీద భక్తినే వేదాంతంలో మోక్షఇచ్ఛ అనీ, ముముక్షుత్వం అనీ అంటారు. వేదాంతంలో చూసే ఈ ముముక్షుత్వాన్నే పురాణాల్లో కృష్ణభక్తిగా, రామభక్తిగా చూస్తాము.

భక్తి అంటే మోక్ష ఇచ్ఛ లేదా ముముక్షుత్వం. భగవంతుడు–మోక్షం రెండూ పర్యాయ పదాలు. భగవంతునికి భిన్నంగా మోక్షం లేదు. మోక్షానికి భిన్నంగా భగవంతుడు లేదు. మోక్షానికి భిన్నంగా కనుక భగవంతుడు ఉంటే, భగవంతుడు కూడా సంసారి అవుతాడు. అందువల్ల నిష్కామభక్తి అంటే ముముక్షుత్వం తప్ప మరేదీ కాదు.

ఈ భక్తిని పెంపొందించుకోవటం ఎలా? ఈ భక్తిని పెంపొందించుకోవటానికి ఒకటే మార్గం ఉంది. దాన్ని వివేకం అంటారు. ఈశ్వరుడు ఉన్నతస్థాయికి చెందినవాడనీ, జగత్తు తక్కువస్థాయికి చెందినదనీ తెలుసుకోవటమే వివేకం. ఒక చిన్నపిల్లవాడికి పది రూపాయల నోటు, వంద రూపాయ నోటు చూపించి వీటిలో ఏది కావాలంటే, ఈ రెండింటి మధ్య భేదం తెలియని పిల్లవాడు పది రూపాయల కాగితాన్ని ఎన్నుకోవచ్చు. అంటే పిల్లవానికి ఈ విషయంలో వివేకం లేదు. కాని ఆ వివేకం ఉన్న వ్యక్తికి ఈ నోట్లు చూపించి అడిగితే, ఆలోచించకుండా వంద రూపాయల నోటునే ఎన్నుకుంటాడు. దానికి ఆలోచన అవసరం లేదు. వెంటనే, సహజంగా ఎన్నుకుంటాడు.

అదే విధంగా మనకు కూడా జీవితంలో రెండు లక్ష్యాలు ఉన్నాయి – ఈశ్వరుడు, జగత్తు. ఈశ్వరుడు నిత్యం, జగత్తు అనిత్యం. ఈ రెండింటిలో ఏది ఎన్నుకోవాలి? అలా ఎన్నుకోవాలంటే ఈ నిత్యానిత్యవస్తువివేకం ఉండాలి. అందువల్ల భక్తి కలగాలంటే ఈ వివేకం ఉండాలి. జగత్తులో ఉన్న ప్రతిదీ అనిత్యం; అనిత్యవస్తువునుంచి కలిగే ఆనందం కూడా అనిత్యమే అనే విచక్షణాశక్తి ఉంది. అనిత్య సంతోషంలో దుఃఖం దాగివుంటుంది.

**యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।**
**ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥** – 5.22

విషయవస్తువులవల్ల కలిగిన సుఖాలన్నీ సుఖాలుగా కనిపించినా, అవి నిస్సందేహంగా దుఃఖహేతువులే. ఆద్యంతములు ఉన్నాయి వాటికి. వివేకి వాటివైపు ఆకర్షింపబడడు.

**మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।**
**ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత ॥** – 2.14

విషయేంద్రియ సంయోగంవల్ల శీతోష్ణములు, సుఖదుఃఖాలు కలుగుతున్నాయి. వాటికి రాకపోకలు ఉన్నాయి. అవి అనిత్యాలు. కాబట్టి వాటిని పట్టుకోకు.

అందువల్ల సరియైన లక్ష్యాన్ని ఎన్నుకోకపోవటానికి కారణం కేవలం మన అవివేకమే. ఎప్పుడైతే, ఈ విషయంలో స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందో, అప్పుడే మన లక్ష్యం గురించి ఏ విధమైన సందేహమూ ఉండదు.

**మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్ ।**
**నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః ॥** – 8.15

**ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥** – 8.16

**సహస్రయుగపర్యంతమ్ అహర్యద్బ్రహ్మణో విదుః ।**
**రాత్రిం యుగసహస్రాంతాం తేఽహోరాత్రవిదో జనాః ॥** – 8.17

**అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥** – 8.18

**భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।**
**రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవత్యహరాగమే ॥** – 8.19

నన్ను పొందిన మహాత్ములు పునర్జన్మ పొందరు, సంసారమనే దుఃఖాలయంలో పడరు, అశాశ్వతమైన ఫలాలు పొందరు. వారు అత్యంత ఉన్నతమైన పూర్ణత్వాన్ని అంటే మోక్షాన్ని పొందుతారు.

బ్రహ్మలోక పర్యంతం, సమస్తలోకాలు శాశ్వతం కాదు కాని, ఓ అర్జునా, దేశకాల అతీతుడనైన నన్ను పొందితే పునర్జన్మ ఉండదు.

వెయ్యి చతుర్యుగాల కాలం బ్రహ్మకు పగలు, వెయ్యి చతుర్యుగాల కాలం బ్రహ్మకు రాత్రి అని ఎవరైతే తెలుసుకుంటారో, ఆ యోగులు కాలతత్త్వాన్ని నిజంగా తెలుసుకున్నవారు.

బ్రహ్మదేవునికి పగలు వచ్చినప్పుడు, చరాచర ప్రాణులన్నీ అవ్యక్తంనుంచి వ్యక్తమవుతాయి; బ్రహ్మదేవునికి రాత్రి ప్రారంభం కాగానే అన్నీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి.

అర్జునా! అలాగే ఈ భూతసముదాయం మళ్ళీమళ్ళీ పుడుతూ, మళ్ళీమళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతున్నాయి. మళ్ళీ పగలు వ్యక్తంలోకి వస్తున్నాయి.

మనం ఏ లక్ష్యం ఎన్నుకున్నా కూడా ఏదో ఒకరోజు అది ముగింపుకు రాకతప్పదు. మనం పొందిన లక్ష్యంయొక్క కాలపరిధి మారుతుంది; కొన్ని లక్ష్యాలు కొన్ని సంవత్సరాలే ఉంటే, మరికొన్ని ఎక్కువ సంవత్సరాలు ఉండవచ్చు. ఏదేమైనా ఏదీ శాశ్వతం మాత్రం కాదు. బ్రహ్మలోకంలో కూడా, బ్రహ్మలోక సుఖాలను అనుభవిస్తూ, శాశ్వతంగా అక్కడే

ఉండిపోలేరు. దానికి కూడా ఒక ముగింపు తేదీ ఉంటుంది. కృష్ణపరమాత్మ బ్రహ్మలోకంలో బ్రహ్మయొక్క జీవితకాలం గురించి చెబుతాడు.

బ్రహ్మదేవుని జీవితకాలం ఎంత? ఒకరోజు, నెల, సంవత్సరంలాగా యుగం ఒక కాలపరిమితి. మనకు నాలుగు యుగాలు ఉన్నాయి. అవి కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. ఇప్పుడు మనం ఉన్నది కలియుగంలో. శాస్త్రం ప్రకారం కలియుగం కాలపరిమితి 432000 సంవత్సరాలు.

ద్వాపరయుగం కలియుగం × 2 = 432000 × 2 = 864000 సంవత్సరాలు
త్రేతాయుగం కలియుగం × 3 = 432000 × 3 = 1296000 సంవత్సరాలు
కృతయుగం కలియుగం × 4 = 432000 × 4 = 1728000 సంవత్సరాలు
చతుర్యుగాలు = నాలుగు యుగాల మొత్తం = 4320000 సంవత్సరాలు
2000 చతుర్యుగాలు = 4320000 × 2000
అటువంటి 2000 చతుర్యుగాల కాలం = 1 రోజు బ్రహ్మదేవునికి.

అటువంటిది ఒకరోజు అయితే బ్రహ్మదేవుని ఆయుష్షు 100 సంవత్సరాలు. మనకు సంవత్సరం అంటే 365 రోజులే. కాని బ్రహ్మదేవునికి ఒక్కరోజే 2000 చతుర్యుగాల కాలం అయితే 100 సంవత్సరాలు ఎంతకాలం పడుతుందో ఊహించండి. అంతకాలం బ్రహ్మదేవుని జీవితం ఉంటుంది.

మనం చేసే పూజల్లోని సంకల్పంలో బ్రహ్మపరార్ధకాలే అంటాము. పరార్ధము అంటే 50 సంవత్సరాలు. బ్రహ్మకు అలా పరార్ధద్వయం ఉంది. అంటే రెండు యాభై సంవత్సరాలు. ఇప్పుడు ద్వితీయ పరార్ధే అని చదువుతాము. అంటే యాభై సంవత్సరాలు పూర్తయి, 51లోకి అడుగుపెట్టాడు. అంటే ఆయనకు ఇంకా ఎంతకాలం ఉందో లెక్క వేసుకోండి.

కాని అంత సుదీర్ఘకాలం కూడా శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే అదికూడా చివరికి ఒక ముగింపుకు వస్తుంది. అంత అద్భుతమైన బ్రహ్మ పదవిని అనుభవించి కూడా, ఈ పుణ్యం తీరగానే మళ్ళీ పుట్టక తప్పదు.

**ఇమం లోకం హీనతరం వా విశంతి॥** – ముండకమ్ 1.2.10

పుణ్యం తీరగానే ఈ లోకంలోనో, ఇంకా హీనతరమైన లోకంలోనో పుడతారు.

బ్రహ్మ కూడా మళ్ళీ హీనతరలోకంలో పుట్టవచ్చు అంటే, ఎంత బాధాకరమైన విషయం! కొన్నాళ్ళు భూతలస్వర్గంలా ఉన్న విదేశాల్లో జీవితాన్ని అనుభవించి, వెనక్కి వస్తే బాధపడతారు కొందరు. విదేశాల్లో అన్ని సుఖాలూ ఉన్నాయి. అన్నీ చక్కగా పనిచేస్తాయి, మనదేశంలోనే ఏదీ పనిచేయదు. ఆఖరికి ఫోను కూడా పనిచేయదు అని వాపోతారు వారు. విదేశాలకు

వెళ్ళకపోతే మనకు సమస్యలు ఉన్నట్టే తెలియదు. ఎందుకంటే దీనికన్నా మెరుగైన దేశం ఉందని తెలియదు. రోడ్లు ఎలా ఉన్నా, ఫోను ఎలా ఉన్నా, పరిస్థితులు ఎలా ఉన్నా, సర్దుకుపోతాము. ఒక్కసారి ఇవన్నీ అద్భుతంగా ఉన్న లోకాలకు వెళ్ళివస్తే, మన జీవితం ఎంత దారుణంగా ఉందో తెలుస్తుంది.

చిమ్మచీకటిలో ఉండగా, ఒక దీపం ఎలా వెలుగుతుందో, అలా అనేక కష్టాలు అనుభవించాక, ఆనందం బాగా (ప్రకాశిస్తుంది. కాని సుఖాలనుంచి కష్టాల్లో పడ్డ వ్యక్తి జీవితం మరణంతో సమానం.

కష్టాలు పడ్డాక సుఖాలు కలిగితే ఆ సుఖాలను అనుభవించ గలుగుతాము. కాని, సుఖాల్లో మునిగితేలాక, ఒక్కసారిగా కష్టాలు ఎదురయితే, ఆ కష్టాలు అసలు తట్టుకోలేము. అదే విధంగా, (బ్రహ్మలోకంలో (బ్రహ్మపదవి అనుభవించాక తిరిగి రావాలంటే ఎలా ఉంటుంది?

**ఆ(బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోஉర్జున!** – 8.16

(బ్రహ్మలోకంతో సహా అన్ని లోకాలూ పునరావృత్తములు.

ఈ విధంగా కృష్ణపరమాత్మ ఒకవైపు లౌకికసుఖాలు ఎలా ఉంటాయో వర్ణిస్తే, ఇంకొకవైపు ఈశ్వరుణ్ణి లక్ష్యంగా పెట్టుకుంటే ఎలా ఉంటుందో వర్ణిస్తున్నాడు.

పదిహేనవ శ్లోకంలో నన్ను పొందిన మహాత్ములు ఈ అశాశ్వతమైన ఫలాలను పొందరు. పరమాం సంసిద్ధిం గతాః – అత్యంత ఉన్నతమైన పూర్ణత్వాన్ని పొందుతారు అంటే మోక్షాన్ని పొందుతారు అంటున్నాడు.

మనకు జీవితంలో రెండు లక్ష్యాలు ఉన్నాయి. అవి అనిత్య జగత్తు, నిత్య ఈశ్వరుడు. వాటిలో మనకు కావాల్సింది ఎన్నుకునే హక్కు ఉంది. కఠోపనిషత్తులో (శ్రేయోమార్గం, (ప్రేయోమార్గం స్వయంవరంలా మనిషి ముందు, నన్ను ఎన్నుకో అని నిలుచుంటాయని వస్తుంది. వివేకి (శ్రేయోమార్గాన్ని ఎన్నుకుంటే, మూఢుడు (ప్రేయోమార్గాన్ని ఎన్నుకుంటాడు. (శ్రేయోమార్గం అంటే నిత్యఈశ్వరుడు; (ప్రేయోమార్గం అంటే అనిత్యజగత్తు.

భక్తి అంటే ఈశ్వరుణ్ణి లక్ష్యంగా ఎన్నుకోవటం. అది కూడా ఏదో విధంగా కాదు; వివేకంతో ఎన్నుకోవటం. ఈ వివేకజన్యభక్తిని నిష్కామభక్తి అంటారు. కృష్ణపరమాత్మ ఈ ఎనిమిదవ అధ్యాయంలో ఈ నిష్కామభక్తి గురించి వివరిస్తున్నాడు.

2. **ఉపాసన** – రెండవ అంశం ఉపాసన. ఎప్పుడైతే నిత్యఈశ్వరుణ్ణి లక్ష్యంగా ఎన్నుకుంటామో, అప్పుడే మనస్సు ఈశ్వరధ్యానంలో ఉంటుంది. అందువల్ల ఈశ్వరుని మీద ఉపాసన చేస్తాము. ఈ ఈశ్వర ఉపాసనను అనేక విధాలుగా చేయవచ్చు. సంపూర్ణ ఈశ్వరుణ్ణి మన మనస్సు ఊహించుకోలేదు. ఎందుకంటే మన ఇం(ద్రియాలు, మన మనస్సు, మన బుద్ధి చాలా చిన్నవి; అవి సంపూర్ణత్వాన్ని చూడలేవు.

భారతదేశం మొత్తాన్ని పూజించాలంటే, పూజించలేము. అందువల్ల భారతదేశానికి చిహ్నంగా ఏదైనా ఒక ఆలంబన కావాలి. అందువల్ల జాతీయపతాకం దేశానికి ప్రతీక. అదే విధంగా సర్వవ్యాపకమైన ఈశ్వరుణ్ణి ఏదైనా ఆలంబనమీద ధ్యానం చేయవచ్చు.

ధ్యానం చేసే వ్యక్తిని ఉపాసకుడు అనీ, ధ్యానాన్ని ఉపాసన అనీ, ఈశ్వరుణ్ణి ఉపాస్యదేవత అనీ, ఈశ్వరునికి ప్రతీకగా వాడే శివలింగాన్ని ఆలంబనం అనీ అంటారు.

**ఉపాసకః ఆలంబన ద్వారా ఉపాస్య దేవతాం ఉపాసతే।**

ఒక ఉపాసకుడు ఆలంబన ద్వారా ఉపాస్యదేవతమీద ఉపాసన చేస్తాడు. శివలింగం ఒక ఆలంబన; సాలిగ్రామం ఒక ఆలంబన. అలా మనకు ఎన్నో ఆలంబనలు ఉన్నాయి. నిజానికి ఆలయాల్లోని ప్రతిమలు ఆలంబనలు. రామరూపం, కృష్ణరూపం, దేవీరూపం, వినాయకరూపం – ఇవన్నీ పరిమితి ఉన్న రూపాలు. కాని ఈ పరిమితి ఉన్న రూపాలమీద పరిమితి లేని ఈశ్వరుణ్ణి దర్శిస్తారు. కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో ఓంకార ఉపాసన గురించి వివరిస్తున్నాడు. ఓంకార ఆలంబనంమీద ఈశ్వర ఉపాసన చేయటం.

**ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ ।**
**యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్ ॥** – 8.13

'ఓమ్' అనే ఏకాక్షర బ్రహ్మ ధ్యానం చేస్తే, అతను మోక్షం పొందుతాడు.

ఉపాసకుడు ఓంకారాన్ని ఆలంబనగా తీసుకుని ఉపాసన చేయవచ్చు. ఉపాసకునికి రెండు మార్గాలు ఉన్నాయని చూశాము. ఒక మార్గం – ఉపాసన చేసి, జ్ఞానయోగ్యత పొంది, ఈ జన్మలోనే జ్ఞానకాండకు వచ్చి, జ్ఞానం పొంది, ఈ జన్మలోనే మోక్షం పొందటం. దీన్ని సద్యోముక్తి లేదా జీవన్ముక్తి అంటారు. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందటం. కాని జీవన్ముక్తి గురించి కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో చెప్పబోవటం లేదు. అది ఏడు, తొమ్మిది అధ్యాయాల అంశం. ఎనిమిదవ అధ్యాయం ప్రత్యేకమైన అంశం గురించి బోధిస్తుంది. ఇందులో క్రమముక్తి గురించి మాత్రమే చూస్తాము.

ఇక్కడ ఉపాసకుడు జ్ఞానం పొందలేదు, అందువల్ల మోక్షం కూడా పొందలేడు. అతను ఏ కారణంవల్లనో జ్ఞానమార్గానికి రాలేదు; కారణం ఏదైనా కానీ, మనకనవసరం. మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయత్వం ఉండాలి. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దొరకాలంటే పూర్వజన్మ పుణ్యం చాలా ఉండాలి. లేకపోతే ఏదో ఒక ప్రతిబంధకం ఏర్పడుతుంది.

ఈ ఉపాసకుడు ఈశ్వర ఉపాసన జీవితాంతం చేస్తూ ఉంటాడు. అతని మనస్సు ఎల్లవేళలా ఈశ్వరచింతనతోనే నిండివుంటుంది. మేలుకుని ఉన్నా, నిద్రపోయి కలలు

కంటున్నా, స్పృహలో లేని స్థితిలోనైనా కూడా ఈశ్వరచింతనే ఉంటుంది. దీనికి అయ్యప్ప దీక్షితుల ఉదాహరణ చెప్పవచ్చు. అయ్యప్ప దీక్షితులు గారు తనకు ఈశ్వరభక్తి ఎంతమేరకు ఉందో తనను తాను పరీక్షించుకోవాలనుకున్నారు. ఈశ్వరుడు తన సుప్తచేతన మనస్సులో కూడా ఉన్నాడో, లేదో తెలుసుకోవాలనుకున్నారు. అంటే తనకు ప్రజ్ఞ లేనప్పుడు లేదా భ్రమలో ఉన్నప్పుడు, తన మనస్సులో ఏ భావనలు చోటుచేసుకుంటున్నాయి?

అలా తనను పరీక్షించుకోవటానికి ఒక ప్రత్యేక చెట్టుయొక్క పాలు తాగాడుట. అవి తాగితే తాత్కాలికంగా ఉన్మాది అవుతాడు. ఆ పాలు తాగక ముందు, ఆయన తన శిష్యుణ్ణి పిలిచి, ఆ ఉన్మాద అవస్థలో తను ఏం మాట్లాడతానో రాయమన్నారు. కాని ఆ సమయంలో ఆయన ఏం పలికారో తెలుసా! శివునిమీద అద్భుతమైన శ్లోకాలను పలికారు. వాటిని ఉన్మత్త పంచశతి లేదా ఆత్మార్పణస్తుతి అంటారు. సాధారణంగా ఎవరైనా అలాంటి పరిస్థితిలో మాట్లాడేది ప్రేలాపనగా ఉంటుంది. ఎవరికీ అర్థంకాదు. కాని ఈ శివభక్తున్నుంచి ఆ ఉన్మాదస్థితిలో కూడా, అద్భుతమైన శ్లోకాలు వచ్చాయి (గమనిక – కాని ఇలాంటి ప్రయోగాలు మీరు చేయకండి). ఈ ప్రయోగం ద్వారా అర్థమయ్యేది ఏమిటంటే, భక్తిలోనే రోజంతా మునిగితేలుతుంటే, సుప్తచేతనంలో కూడా భగవంతుడే నిండివుంటాడు.

**అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥** – 8.5
**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥** – 8.6

ఎవరైతే అంత్యకాలంలో కూడా నన్నే స్మరిస్తూ శరీరాన్ని వీడి వెళతారో, వారు నన్నే పొందుతారు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

ఓ అర్జునా! అంత్యకాలంలో ఎవరు ఏ భావనలను స్మరిస్తూ ఈ శరీరాన్ని వదులుతారో, వారు ఆయా స్వరూపాలనే పొందుతారు.

మరణించే సమయంలో దేన్ని తలుచుకుంటారో, ఆ చివరి ఆలోచనను అంతకాల స్మరణం అంటారు. ఆ స్మరణం మరణం తర్వాత వారి ప్రయాణాన్ని నిర్దేశిస్తుంది. ఈ అధ్యాయంలో చెప్పబడిన ఉపాసకుడు ఈశ్వరచింతనతో మరణిస్తాడు. అందువల్ల అతనికి సహజంగానే క్రమముక్తి లభిస్తుంది. కాకపోతే ఇక్కడ అంతకాల స్మరణం దేనిమీద ఉన్నది అనేది చాలా ముఖ్యం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇది వినగానే అందులోని లొసుగులు వెతకటానికి ప్రయత్నిస్తాము. అది మానవనైజం. అంత్యకాలంలో ఆలోచించినది కదా ముఖ్యం అన్నాడు. అయితే అంతవరకూ నేను ఆడిపాడేసి,

ఎన్ని అక్రమాలైనా చేసేసి, చివర్లో బుద్ధిగా దైవస్మరణ చేసేయవచ్చు అనుకోవచ్చు. పైగా జీవన్ముక్తి పొందకపోయినా క్రమముక్తి పొందవచ్చు; దానికి కేవలం అంత్యకాలంలో భగవన్నామస్మరణ చేస్తే చాలు అనుకోవచ్చు. కాని ఆ ఆటలు సాగవు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు?

1. మన అంత్యకాలమెప్పుడో తెలియదు. యమధర్మరాజు ఫలానారోజు, ఫలానా సమయానికి వస్తానని చెప్పి రాడు. ఎప్పుడు, ఏ క్షణంలో, ఏ రూపంలో మృత్యువు పొంచి ఉందో మనకు తెలియదు. జ్యోతిష్కుణ్ణి అడిగి తెలుసుకుందామనుకున్నా అది సాధ్యం కాదు. ఎందుకంటే, నలుగురు జ్యోతిష్కులను అడిగితే, నాలుగు రకాల తారీకులు చెబుతారు.

2. మన ఆలోచనలు మన ఫ్రీవిల్‌మీదా, మన వాసనలమీదా ఆధారపడివుంటాయి. వాసనలు అంటే మన అలవాట్లు లేదా మన చిత్తంలో నిలువ ఉన్న మన సంస్కారాలు. ఎప్పుడైనా సరే, మన మనస్సులో ఏర్పడే ఆలోచనను ఈ రెండింటిలో ఏదో ఒకటి నిర్ణయిస్తుంది. ఒక్కోసారి ఫ్రీవిల్ పనిచేస్తే, ఒక్కోసారి వాసనలు పనిచేస్తాయి. మనం రామనామధ్యానం చేద్దామని కూర్చుంటే, మన వాసనలు అది తప్ప అన్నీ ఆలోచించేలా చేస్తాయి. అందువల్ల ఫ్రీవిల్‌కీ, వాసనలకూ మధ్య ఘర్షణ నిరంతరం సాగుతూనే ఉంటుంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ వాసనలు ఊపు అందుకుంటాయి. అరవై లేదా డెబ్బయ్యో పడిలో పడేసరికి ఈ అలవాటు రాజ్యం ఏలుతుంది. మనం ఫ్రీవిల్ ఉపయోగించి ఆలోచించినా ఆలోచించకపోయినా, ఇన్నేళ్ళుగా మనం మన సుప్తచేతన మనస్సులో నిక్షిప్తం చేసిన ఆలోచనలు శక్తి పుంజుకుంటాయి.

ఏ ఉపాసనా చేయని వ్యక్తి పరిస్థితి ఏమిటి? దీనికొక కథ చెబుతారు. ఏ పూజ చేయని ఒక వ్యక్తి మరణశయ్యమీద ఉన్నాడు. అమ్మలగన్న అమ్మ అయిన పార్వతీదేవికి అతనిమీద జాలివేసింది. ఎలాగైనా అతనిని దీవించమని పరమేశ్వరుణ్ణి వేడుకుంది. అతనికి మనం అవసరం లేదు, వేరే వాటిమీద ఆధారపడతాడు అతను అన్నాడు పరమేశ్వరుడు. కాని పార్వతీదేవి తల్లిహృదయం ద్రవించింది. అతనిమీద జాలి చూపమంది.

పరమేశ్వరుడు దేవి మాటను కాదనలేకపోయాడు. 'సరే ఒకపని చేద్దాం. అతని మరణశయ్య దగ్గరకు ఇద్దరం వెళదాము. అతను మరణించే ముందు 'అమ్మా,' అంటే అతనిని నువ్వు కాపాడుదువు గాని; అతను 'అయ్యా,' అంటే నేను కాపాడతాను' అన్నాడు. కాని ఏం జరిగివుంటుందో మీరు ఊహించగలరు. అతను 'అమ్మా,' అనలేదు, 'అయ్యా,' అనలేదు; 'అయ్యో,' అని ప్రాణాలు విడిచాడు. 'నేను చెప్పానా,' అన్నట్టుగా శివుడు పార్వతిని చూసి చిరునవ్వు నవ్వాడు.

ఇదీ పరిస్థితి. భగవంతుడు దయాగుణం చూపించి, మనను ఆదుకోవటానికి సిద్ధంగా ఉన్నా, అందుకోవటానికి మనం సిద్ధంగా లేము. అందువల్ల రామా అనో, కృష్ణా అనో అనగలిగేటట్టు ఉండాలి. ఇక్కడ కృష్ణపరమాత్మ రాముడినో, కృష్ణుడినో తీసుకోకుండా ఓంకారాన్ని తీసుకున్నాడు.

చివరి నిముషంలో దేన్ని స్మరిస్తే అదే అవుతారు. అందువల్ల అంతకాల స్మరణను మీరు అప్పటికప్పుడు నిర్ణయించలేరు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ ।**
**మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్యసంశయమ్ ॥** – 8.7

అందువల్ల ఓ అర్జునా, యుద్ధం చేయి. కాని అన్ని కాలాల్లోనూ నన్నే తలుచుకో. ఎవరైతే తన మనోబుద్ధులను నాకే అర్పిస్తాడో, వారు నిస్సందేహంగా నన్నే పొందుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

తస్మాత్ సర్వేషు కాలేషు – అందువల్ల అన్నివేళలా ఈశ్వరస్మరణ చేయాలి. ఈశ్వర స్మరణ చేయటానికి మంచిరోజుకోసం ఆగనవసరం లేదు. నూతన సంవత్సరంలో చేస్తాను; సంక్రాంతి రోజు ఆరంభిస్తాను; శివరాత్రి రోజు మొదలుపెడతాను అంటూ మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చోనవసరం లేదు. ఇప్పుడే, ఈ క్షణమే మొదలుపెట్టాలి. ముందుముందు పరిస్థితి ఎలా ఉంటుందో మనం ఊహించలేము. అందువల్ల ఎప్పుడూ ఈశ్వరధ్యానం చేయాలి. నిరంతరం దైవచింతనలో ఉంటే, మన ఉద్యోగధర్మం ఎలా నిర్వహించగలము? కుటుంబ బాధ్యతలను ఎలా నిర్వహించగలము? అంటే భగవంతుణ్ణి తలుచుకోవటం కోసం, కర్తవ్య నిర్వహణను విస్మరించాలా అనిపించవచ్చు.

అటువంటి ప్రశ్న రాకుండా, నీ కర్తవ్యాన్ని మానకు. నీ బాధ్యతలను, నీ లౌకిక వ్యవహారాలను ఎప్పటిలాగానే కొనసాగించు అంటున్నాడు. అర్జునుని తక్షణ కర్తవ్యం యుద్ధం చేయటం కాబట్టి ప్రత్యేకించి చెబుతున్నాడు, 'ఓ అర్జునా, యుద్ధం చేయి,' అన్నాడు.

చేతన మనస్సు రెండు పనులను ఒకేసారి చేయలేదు కాని, చేతన మనస్సుతో ఏదైనా పని చేస్తున్నా కూడా, సుప్తచేతన మనస్సులో ఈశ్వరచింతన ఉండాలి. ఏ పని చేస్తున్నా కూడా, తంబూరశ్రుతిలా ఈశ్వరచింతన ఉండాలి. ఒక సంగీత విద్వాంసుడు తన కచేరీని మొదలుపెట్టేముందు తంబూరను శ్రుతి చేస్తాడు. శ్రుతి చేస్తున్నప్పుడు, దాన్ని ప్రత్యేకించి వింటాడు. తరువాత తను పాడే పాటలో పూర్తిగా లీనమైపోయినా, అతని సుప్తచేతన మనస్సులో ఆ తంబూర శ్రుతి మ్రోగుతూనే ఉంటుంది. మధ్యలో అపశ్రుతి వచ్చినా అతనికి తెలుస్తుంది. అలాగే లౌకిక వ్యవహారాలు నడుపుతున్నా, అంతిమలక్ష్యాన్ని మర్చిపోకూడదు. దీన్ని ఈశ్వరస్మరణ లేదా ఉపాసన అంటారు.

అలా నిరంతరం ఈశ్వరస్మరణలో ఉన్న వ్యక్తి, మరణకాలంలో కూడా భగవంతుణ్ణే స్మరిస్తాడు. తన ఇంద్రియాలన్నింటినీ వెనక్కు లాకుంటాడు. మహాభారతంలో భీష్మాచార్యులు తన అంత్యకాలం సమీపించిందని తెలియగానే, తన సమీపంలో ఉన్న బంధువులందర్నీ వెళ్ళమని, కృష్ణపరమాత్మను మాత్రమే తన చెంత ఉండమంటాడు. దాని ఫలితంగా, అద్భుతమైన **భీష్మస్తుతి** వచ్చింది. ఆ విధంగా ఈశ్వరధ్యానంలో మరణించారు భీష్మాచార్యులు. అందువల్లనే ఓంకారధ్యానం గురించి బోధించాడు కృష్ణపరమాత్మ.

ఈ సందర్భంలో కృష్ణపరమాత్మ యోగం గురించి కూడా చెబుతున్నాడు. ఉపాసకుడు సాధారణంగా యోగం పాటిస్తాడు. దానివల్ల అతనికి తన శరీరంమీద, మనస్సుమీద, ఇంద్రియాలమీద పట్టు ఉంటుంది. వాటిని తను వెనక్కి లాక్కోగలుగుతాడు. క్రమముక్తి కావాలంటే అతను గొప్ప ఉపాసకుడే కాదు, గొప్ప యోగి కూడా అయివుండాలి. ప్రాణాయామం ద్వారా తన ప్రాణాలను అదుపులో పెట్టుకోగలుగుతాడు.

**భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ స తం పరం పురుషముపైతి దివ్యమ్** – 8.10

**సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।**
**మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమ్ ఆస్థితో యోగధారణామ్ ॥** – 8.12

ఈ ఉపాసకుడు, ప్రాణాయామం ద్వారా తన ప్రాణాలను తన భ్రుకుటి మధ్యకు తీసుకురావాలి. అలా చేయటంవల్ల అతను భగవంతుణ్ణి పొందుతాడు.

మరణకాలంలో, తన ఇంద్రియాలనుంచి విడివడాలి. మనస్సును హృదయంలో స్థిరంగా నిలపాలి. ప్రాణాలను సహస్రారంలో నిలపాలి. అక్కడ భగవంతుణ్ణి దర్శించాలి. దానికి యోగసాధన చేయాలి.

ఆ విధంగా ఉపాసకుడు ఇంద్రియాలనుంచి విడివడాలి. మనస్సును హృదయంలో స్థిరంగా నిలపాలి. చలించని మనస్సుతో ఉండాలి. ప్రాణాలను మూర్ధన్యస్థానంలో స్థిరంగా నిలపాలి. అతని మనస్సు ఈశ్వరప్రాప్తి మీదే ఉండాలి. వేరే విషయాల జోలికి పోకూడదు. అది యోగశాస్త్రం ద్వారా సాధన చేయగలడు. ప్రాణాలను వాటి స్థానాలనుంచి వెనక్కి తీసుకుని, వాటిని తల పైభాగానికి, బ్రహ్మరంధ్రానికి సుషుమ్నానాడి ద్వారా తీసుకురావాలి.

దీనితో రెండవ అంశం అయిన ఈశ్వర ఉపాసన అయింది. ఇది రెండు అంశాలను వివరిస్తుంది. అవి – మరణకాలంలో దేవుణ్ణి తలుచుకోవటంవల్ల పరమం పురుషం దివ్యమ్ పొందుతాడు. అంటే క్రమముక్తి పొందుతాడు. రెండవ అంశం మరణకాలంలో భగవంతుణ్ణి తలుచుకోవాలంటే, నిష్కామభక్తుడు నిరంతరం భగవన్నామస్మరణ చేస్తూ ఉంటే, మరణకాలంలో కూడా తలుచుకోగలడు.

3) **క్రమముక్తి** – ఈ అధ్యాయంలో మూడవ అంశం క్రమముక్తి. ఈ భాగంలో ఒక సకామ ఉపాసకునికీ, నిష్కామ ఉపాసకునికీ మధ్య, వారి ప్రయాణ విషయంలో ఉన్న భేదాన్ని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఇద్దరూ మరణం తరువాత ప్రయాణిస్తారు. వారు ప్రయాణిస్తారు అంటే వారి స్థూలశరీరం ప్రయాణించదు. అది ఇక్కడే రాలిపోతుంది. దానికి అంత్యేష్ఠికర్మ చేస్తారు. ప్రయాణం చేసేది – అతని సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం. సూక్ష్మశరీరంతో అతని మనస్సు, అతని పుణ్యపాపకర్మలు, సంస్కారాలూ ప్రయాణం చేస్తాయి.

**మృతం శరీరమ్ ఉత్సృజ్య కాష్ఠలోష్టసమం క్షితౌ ।**
**విముఖాః బాంధవాః యాంతి ధర్మస్తమ్ అనుగచ్ఛతి ॥** – మనుస్మృతి 4.241

అతని మరణించిన శరీరాన్ని ఒక చెక్కదుంగలాగానో, అస్థికలుగానో భావించి అతని స్నేహితులు, బంధువులు వెనుతిరిగి వెళ్ళిపోతారు. అతన్ని వెన్నంటి వచ్చేది (మరణమనే చీకటిలో) అతను చేసుకున్న పుణ్యం మాత్రమే.

అతను మరణించాక, అతని కళేబరాన్ని వదిలి స్నేహితులు, బంధువులు వారి పనుల్లో మునిగిపోవటానికి వెళ్ళిపోతారు. మహా అయితే, అతనికోసం ఒకటి, రెండు రోజులు బాధపడతారేమో! తరువాత అతని ఊసే మర్చిపోతారు. ఒకవేళ అతను స్వర్గంనుంచి 'నేను తిరిగిరానా?' అని ఉత్తరం రాయగలిగితే, వారు 'దయచేసి రాకు. మేము నువ్వు లేకుండా జీవించటం నేర్చుకున్నాము. నువ్వు కూడా హాయిగా స్వర్గసుఖాలను అనుభవించు!' అంటారు. వీరే అతను మరణించినప్పుడు అతని గురించి విలపించారు. అందువల్ల అతని వెంట వెళ్ళేది ధర్మం మాత్రమే!

ఇప్పుడు సకామజీవుడు, నిష్కామ ఉపాసకుడు వెళ్ళే మార్గాలను చూద్దాము. వాటిని గతి అంటారు. కృష్ణపరమాత్మ వాటిని కృష్ణగతి అనీ, శుక్లగతి అనీ అంటున్నాడు. ఈ విషయాలను మనం శాస్త్రం ద్వారానే తెలుసుకోగలము. ఎందుకంటే ఇవి మానవమేధస్సుకు అందవు. అందువల్లనే వీటిని అపౌరుషేయ విషయం అంటారు. అపౌరుషేయం అంటే ప్రత్యక్ష ప్రమాణానికి కాని, అనుమాన ప్రమాణానికి కాని అందదు. అంతేకాదు, సైన్సుకు కూడా అందదు.

ఒక శాస్త్రజ్ఞుడు, ఒక వ్యక్తిలోని ఆత్మయొక్క బరువును తెలుసుకోవాలనుకున్నాడుట. ఆ శాస్త్రజ్ఞుడు ఒక వ్యక్తి సరిగ్గా మరణించేముందు అతని బరువును చూసి, అతను మరణించగానే అతని బరువును చూస్తే, ఆ రెండు తూకాల మధ్య సంఖ్య ఆత్మ బరువును చూపుతుంది అని భావించాడు. కాని, ఆశ్చర్యకరంగా బరువు తగ్గాల్సింది పోయి, బరువు పెరిగింది. అంటే ఆత్మకు నెగిటివ్ వెయిట్ ఉన్నట్టా? అందువల్ల ఆత్మ లౌకిక ప్రమాణాలకు అందదు. శాస్త్రప్రమాణం ఒక్కటే దానికి ప్రమాణం.

శాస్త్రం జీవి మరణించాక, అతని జీవాత్మ ప్రయాణిస్తుందని చెబితే, దాన్ని నమ్మాలి. శాస్త్రంమీద శ్రద్ధ ఉండాలి. రెండురకాల మనుష్యులకు రెండు రకాల మార్గాలు ఉన్నాయని చూశాము – అవి కృష్ణగతి, శుక్లగతి. సకామజీవుడు కృష్ణగతి ద్వారా, అతను చేసుకున్న పుణ్యకర్మలవల్ల, అతను కోరుకున్న లోకాలకు వెళతాడు. చేసుకున్న పుణ్యకర్మలకు పుణ్యఫలాలు వచ్చితీరతాయని ముండకోపనిషత్తు నొక్కి వక్కాణిస్తుంది.

**తదేదత్ సత్యం మంత్రేషు కర్మాణి కవయో యాన్యపశ్యన్స్తాని త్రేతాయాం బహుధా సంతతాని। తాన్యాచరథ నియతం సత్యకామాః॥** – ముండకమ్ 1.2.1

ఇది సత్యం.

మంత్రాలలో ఋషులు అనేక కర్మలను దర్శించారు. వాటిని మూడు వేదాలలో అనేక విధాలుగా ప్రశంసించారు. కర్మఫలంమీద కోరిక ఉన్న ఓ మనుష్యుల్లారా! మీరు ఈ మార్గాన్ని అనుసరించి, కర్మఫలం పొందండి. ఇది సత్యం.

ఉపనిషత్తు స్పష్టంగా చెబుతున్నది. మీరు చేసే పుణ్యకర్మలకు తగ్గ పుణ్యఫలాలు రావాల్సిన సమయంలో వచ్చితీరతాయి. అందువల్ల ఈ జీవి తన పుణ్యకర్మకు తగ్గ లోకాలకు వెళ్ళి, అక్కడ సుఖాలను అనుభవిస్తాడు. కాని అక్కడ ఒక సమస్య ఉంది.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి** – 9.21

స్వర్గలోకంలో అనేక రకాల సుఖాలను చాలాకాలం అనుభవించాక, వారి పుణ్యం క్షయమవగానే, మళ్ళీ మనుష్యలోకంలోకి వస్తారు.

స్వర్గలోకంలో స్వర్గసుఖాలను అనుభవించటానికి, ప్రతి ఒక్క అమృతబిందువును పొందటానికి, మీరు మీ పుణ్యమనే ధనాన్ని చెల్లించాల్సి ఉంటుంది. రంభ, ఊర్వశుల నృత్యాలలో తేలియాడటానికి భారీగా మీ పుణ్యమనే రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఆ పుణ్యం ఉన్నంతవరకూ ఆనందమే ఆనందం. పుణ్యం తీరిన మరుక్షణం భూలోకానికి నెట్టివేయబడతారు. దీన్ని అర్ధచంద్రప్రయోగం అంటారు. మీ అరచేతిని విశాలంగా పెట్టి, బొటనవేలును, చూపుడువేలును వంచితే, అర్ధచంద్రాకారంగా ఏర్పడుతుంది. అలా చేతిని ఎదుటివారి మెడ చుట్టూ పెడితే, సరిగ్గా అతని మెడకు సరిపోతుంది. అలా పెట్టి అతన్ని ఒక్క తోపు తోయవచ్చు.

కృష్ణగతిలో సకామభక్తుడు వెళ్ళే మార్గాన్ని కృష్ణపరమాత్మ ఈ విధంగా వర్ణిస్తున్నాడు.

**ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ ।**
**తత్ర చాంద్రమసం జ్యోతిః యోగీ ప్రాప్య నివర్తతే ॥** – 8.25

కేవలకర్మ చేసినవారు కృష్ణగతి ద్వారా చంద్రలోకానికి వెళతారు. వారిని ధూమదేవత, రాత్రిదేవత, కృష్ణపక్ష దేవత, దక్షిణాయన దేవతలు తీసుకువెళతారు.

కృష్ణగతిలో ఈ జీవిని కొందరు దేవతలు తీసుకువెళతారు. వారు – ధూమదేవత, రాత్రిదేవత, కృష్ణపక్ష దేవత, దక్షిణాయన దేవతలు. ఆ దేవతలు ఒక్కొక్కరు కొంతమేరకు తీసుకువెళ్ళి ఇంకొకరికి అప్పజెపుతారు.

స్వర్గలోకసుఖాలను చేరిన జీవిని మొదటి దేవత సాదరంగా ఆహ్వానిస్తుంది.

**ఏహ్యేహీతి తమాహుతయః సువర్చసః సూర్యస్య రశ్మిభిర్యజమానం వహంతి।**
**ప్రియాం వాచమభివదంత్యోఽర్చయంత్యః ఏష వః పుణ్యః సుకృతో బ్రహ్మలోకః॥**

– ముండకమ్ 1.2.6

'రండి, రండి!' అని యజమానిని తీయటి మాటలతో, అతనిని మెచ్చుకుంటూ సూర్యకిరణాల ద్వారా ఊర్ధ్వలోకాలకు తీసుకువెళతారు. మీ పుణ్యంతో మీరు బ్రహ్మలోకాన్ని పొందారు.

అలా సాదరంగా ఆహ్వానించి, స్వర్గలోకసుఖాలను అనుభవించటానికి తీసుకువెళతారు.

**నిష్కామ ఉపాసకుడు** – దానికి భిన్నంగా నిష్కామ ఉపాసకుడు శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు.

**అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ ।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥** – 8.24

నిష్కామ ఉపాసన చేసినవారు శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతారు.

బ్రహ్మవిదః అంటే ఈశ్వర ఉపాసన చేసినవారిని, శుక్లగతి ద్వారా అగ్నిదేవత, జ్యోతిర్దేవత, పగటిదేవత, శుక్లపక్ష దేవత, ఉత్తరాయణ దేవతలు బ్రహ్మలోకానికి తీసుకువెళతారు. బ్రహ్మలోకానికి వెళ్ళినవారు సంసారంలో తిరిగిపడరు. ఎందుకంటే, అక్కడ వారు సాక్షాత్తూ బ్రహ్మదేవుని దగ్గర జ్ఞానం పొంది క్రమముక్తి పొందుతారు.

**శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।**
**ఏకయా యాత్యనావృత్తిమ్ అన్యయావర్తతే పునః ॥** – 8.26

శుక్లగతి, కృష్ణగతి అనే ఈ రెండు మార్గాలూ జగత్తు సృష్టించబడినప్పుడే సృష్టించబడ్డాయి. ఒకమార్గం ద్వారా వెళ్ళినవారు క్రమముక్తిని పొంది తిరిగిరారు. ఇంకొకమార్గంలో వెళ్ళినవారు తిరిగివస్తారు.

సకామకర్మ చేసిన జీవి కృష్ణగతి ద్వారా స్వర్గలోకానికి వెళ్ళి తిరిగివస్తాడు; నిష్కామ ఉపాసన చేసిన జీవి శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళి తిరిగిరాడు. అంటే అక్కడ బ్రహ్మ దగ్గర జ్ఞానం పొంది క్రమముక్తి పొందుతాడు.

ఇక్కడ కృష్ణపరమాత్మ రెండు పదాలు వాడుతున్నాడు – దక్షిణాయనం, ఉత్తరాయణం. ఈ మాటలు కొందరిని అయోమయంలో పడవేస్తాయి. దక్షిణాయనంలో మరణిస్తే కృష్ణగతిలో వెళతాడనీ, ఉత్తరాయణంలో మరణిస్తే శుక్లగతిలో వెళతారనీ పొరపాటు పడతారు వారు. అంటే నేరస్థులు ఉత్తరాయణంలో మరణిస్తే, శుక్లగతి పొందుతారా? మహాత్ములైనా సరే, దక్షిణాయనంలో మరణిస్తే, కృష్ణగతి తప్పదా? అలా అయితే మహాత్ములకు అన్యాయం జరిగినట్టు అవుతుంది.

అందువల్ల మరణకాలం వీరి మార్గాలను నిర్ణయించదు అని బ్రహ్మసూత్రాల విశ్లేషణలో నిర్దేశింపబడింది. ఒక సాధకుని ప్రయాణాన్ని అతను మరణించిన కాలం నిర్ణయించదనీ, అతను గడిపిన జీవనవిధానం నిర్ణయిస్తుందనీ నిర్దేశింపబడింది. అలాంటప్పుడు భీష్మాచార్యులు ఉత్తరాయణ కాలంకోసం ఎందుకు ఆగారు? భీష్మాచార్యులు బ్రహ్మలోక ప్రాప్తి కోసం ఉత్తరాయణం దాకా ఆగలేదు. ఎందుకంటే ఎలాగైనా ఆయన బ్రహ్మలోకానికే వెళ్ళివుండేవారు. మరి ఎందుకు ఆగారంటే, తన యోగశక్తిని చూపటానికి ఆగారు. అంతేకాదు, ఆయన సూచించవలసిన కొన్ని మంచి కార్యాలు ఉన్నాయి. ఆయన విష్ణుసహస్రనామం బోధించారు; ఇంకా కొన్ని ధర్మసూక్షాలు చెప్పారు. ఈ పనులన్నీ నెరవేర్చాక, తీరికగా మరణించదలుచుకున్నారు. అంతేకాని, ఉత్తరాయణకాలంకోసం కాదు. మరణకాలంతో సంబంధం లేదు, మీరు గడిపిన జీవనం మీ గతిని నిర్దేశిస్తుంది.

ఇదంతా వివరించాక, కృష్ణపరమాత్మ ఈ అంశాన్ని ఈ విధంగా ముగిస్తున్నాడు. 'అందువల్ల, అర్జునా! నువ్వు స్వర్గలోకానికి వెళ్ళాలనుకుంటున్నావా, నన్ను పొందాలనుకుంటున్నావా?' అంటున్నాడు. ఎవరైనా, ఇంతసేపు బోధ విని, 'నాకు స్వర్గలోకానికి వెళ్ళాలని ఉంది,' అంటే భగవంతునికి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి! అయినా, చాలామంది 'స్వర్గలోకానికి వెళ్ళాలని ఉంది,' అంటారు. ఎందుకంటే భగవంతుడు నిత్యం; ఆయన దగ్గరకి ఎప్పుడైనా వెళ్ళవచ్చు. ముందు ఈ స్వర్గసుఖాలేవో అనుభవించేస్తే, అప్పుడు తీరికగా భగవంతుని దగ్గరకు వెళ్ళవచ్చు అనిపిస్తుంది. వారు అలా అనుకుంటే, వారి మనస్సు ఇంకా పరిపక్వత చెందలేదని అర్థం.

కృష్ణపరమాత్మ, ఈశ్వరప్రాప్తి ఒక్కటే అసలైన లక్ష్యం అనీ, దాన్ని రెండు మార్గాల ద్వారా పొందవచ్చనీ చెబుతున్నాడు. ఒకటి జీవించి ఉండగానే, ఉపాసననుంచి జ్ఞానమార్గానికి వచ్చి, జ్ఞానం పొంది ఇక్కడే, ఇప్పుడే మోక్షాన్ని పొందటం. దాన్ని సద్యోముక్తి అంటారు. రెండు, జీవితాంతం ఉపాసన కొనసాగించి, బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ జ్ఞానాన్ని పొంది, అక్కడ మోక్షం పొందటం. దాన్ని క్రమముక్తి అంటారు.

ఈ రెండు మోక్షాల్లో ఏది మెరుగైనది? మోక్షం పొందాలని నిశ్చయించుకున్నాక, ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందటం మంచిదా, ఎప్పటికో వాయిదా వేయటం మంచిదా? అందువల్ల రెండింటిలో జీవన్ముక్తి పొందటం శ్రేష్ఠం. కాని, ఏ కారణంవల్లనైనా జీవించి ఉండగా, జ్ఞానానికి రాలేకపోతే, జీవించి ఉన్నంతకాలం ఈశ్వరస్మరణ చేస్తూ ఉంటే, రెండవమార్గంలో మోక్షం పొందవచ్చు. అంటే క్రమముక్తి పొందవచ్చు. అందువల్ల ఏ విధమైన ముక్తి కోరుకున్నా కూడా, అత్యంత ముఖ్యమైన విషయం ఈశ్వరస్మరణ చేస్తూనే ఉండాలి.

ఈ అధ్యాయం ప్రత్యేకించి క్రమముక్తి గురించి బోధిస్తుంది.

**వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।**
**అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥** – 8.28

ఈ బోధను అంతా సరిగ్గా అర్థం చేసుకున్న సగుణబ్రహ్మ ఉపాసకుడు క్రమముక్తిని పొందుతాడు. వేదపారాయణం, యజ్ఞం, తపస్సు, దానధర్మాలు చేయటంవల్ల వచ్చే పుణ్యం కన్నా ఉపాసనఫలం ఇంకా శ్రేష్ఠం.

ఈ శ్లోకంలో క్రమముక్తిని స్తుతిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఇందులో కర్మఫలంకన్నా, ఉపాసనఫలం గొప్పదని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఈ విధంగా ఈశ్వరస్మరణ, ఈశ్వర ప్రాప్తిని స్తుతిస్తున్నాడు.

ఈ అధ్యాయాన్ని బ్రహ్మయోగము లేదా తారకబ్రహ్మయోగము అని కూడా అనవచ్చు. అర్జునుడు ఈ అధ్యాయం మొదట్లో వేసిన ఏడు ప్రశ్నలకు కృష్ణపరమాత్మ మొదలుపెట్టిన జవాబు అక్షరబ్రహ్మతో మొదలుపెట్టటంవల్ల దీనికి అక్షరబ్రహ్మ యోగము అనేపేరు వచ్చింది.

**అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే ।**
**భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥** – 8.3

బ్రహ్మ అంటే పరమం, అక్షరం; అధ్యాత్మం అంటే శరీరంలో ఉన్న చైతన్యం; కర్మ అంటే తరువాత వచ్చే సృష్టికి కారణభూతమైన పనులు.

ఈ ఏడు ప్రశ్నలు, వాటికి జవాబులను మనం చూడటం లేదు. ఎందుకంటే అవి చిన్న ప్రశ్నలు, వాటి జవాబులు కూడా చిన్నవి. ఇందులో ముఖ్యమైన అంశం అంతిమకాలంలో ఈశ్వరుణ్ణి స్మరించటం ఎలా అన్నది. అందువల్ల ఈ అధ్యాయానికి పేరు అంతిమకాల స్మరణయోగము అనికూడా పేరు పెట్టవచ్చు. దానికి మార్గం ఎల్లప్పుడూ దేవుణ్ణి స్మరిస్తూ ఉండటమే!

# రాజవిద్యారాజగుహ్యయోగము

## అధ్యాయము 9

భగవద్గీత వైదికశాస్త్రంలో చాలా ముఖ్యమైన గ్రంథం. భగవద్గీత పూర్తిపేరు భగవత్ గీతోపనిషత్. ఉపనిషత్తుల సారం గీతలో చొప్పించబడింది కాబట్టి దాన్ని గీతోపనిషత్ అంటారు.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః।**
**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్।।**

ఉపనిషత్తులన్నీ ఆవులు; గోపాలనందనుడు కృష్ణపరమాత్మ; అర్జునుడు దూడ; అమృతం చిలికించే గీత పాలు; శుద్ధమైన మనస్సు ఉన్నవారు ఆ పాలను గ్రోలేవారు.

ఉపనిషత్తులనే ఆవులనుంచి, గోపాలనందనుడయిన కృష్ణపరమాత్మ పాలను పితుకు తున్నాడు అంటే దాని అర్థం, ఉపనిషత్తుల సారమే భగవద్గీత సారం కూడా అవుతుంది. ఉపనిషత్తుల సారాన్ని మహావాక్యాలు సూచిస్తాయి. వాటిలో ప్రసిద్ధి చెందినది తత్ త్వమ్ అసి – అది నువ్వు అయి ఉన్నావు.

మహావాక్యాలన్నీ జీవాత్మ–పరమాత్మల ఐక్యాన్ని సూచిస్తాయి. ఉపనిషత్తుల సారం జీవాత్మ పరమాత్మల ఐక్యం అయితే, ఉపనిషత్తుల సారమయిన భగవద్గీత సారం కూడా జీవాత్మ పరమాత్మల ఐక్యమే.

భగవద్గీతలో 18 అధ్యాయాలు ఉన్నాయనీ, వాటిని మూడు షట్కాలుగా విభజించవచ్చనీ చూశాము. తత్–త్వమ్–అసి లో తత్ అంటే ఈశ్వరస్వరూపం; త్వం అంటే జీవస్వరూపం; అసి అంటే ఐక్యం. భగవద్గీతలోని ప్రథమషట్కం త్వం పదాన్ని అంటే జీవస్వరూపాన్ని వర్ణిస్తే, ద్వితీయషట్కం తత్ పదాన్ని అంటే ఈశ్వరస్వరూపాన్ని వర్ణిస్తే, తృతీయషట్కం అసి పదాన్ని అంటే జీవాత్మ–పరమాత్మల ఐక్యాన్ని వర్ణిస్తుంది. ఇదీ భగవద్గీతయొక్క విహంగవీక్షణం. అందులో వచ్చిన తక్కిన అంశాలన్నీ ఈ ఐక్యాన్ని అర్థం చేసుకునేటందుకు తోడ్పడతాయి.

తొమ్మిది, పది, పదకొండు అధ్యాయాలు పరమాత్మస్వరూపాన్ని లేదా ఈశ్వరస్వరూపాన్ని వర్ణిస్తాయి. తొమ్మిదవ అధ్యాయము ఏడవ అధ్యాయాన్ని ఇంచుమించుగా పోలివుంటుంది. అందువల్ల ఈ రెండు అధ్యాయాలనూ ఒకదానితో ఒకటి పోల్చి చూస్తూ వస్తే బాగా అర్థమవుతుంది. ఈ అధ్యాయాన్ని ప్రధానంగా ఐదు అంశాలుగా చూడవచ్చు. అవి –

| | |
|---|---|
| 1. ఉపోద్ఘాతం | : శ్లోకాలు 1 – 3 |
| 2. నిర్గుణ ఈశ్వర స్వరూపం | : శ్లోకాలు 4–10 |
| 3. సాధనరూపభక్తి | : శ్లోకాలు 11–19 |
| 4. భావనరూపభక్తి | : శ్లోకాలు 20–29 |
| 5. భక్తి స్తుతి | : శ్లోకాలు 30 – 34 |

**1. ఉపోద్ఘాతం శ్లోకాలు 1 – 3** ఈ అధ్యాయాన్ని రాజవిద్యా రాజగుహ్యాయోగము అంటారు.

**రాజవిద్యా** – రాజవిద్య అంటే ఈశ్వరజ్ఞానం. అన్ని జ్ఞానాలలోకి తలమానికం అయినది. రాజ అంటే ప్రకాశించేది అని అర్థం. రాజవిద్య అంటే శ్రేష్ఠమైన విద్య. దీన్నే ముండకోపనిషత్ పరావిద్యా అంటుంది. లౌకిక విషయాలకు చెందిన అన్ని జ్ఞానాలనూ అపరావిద్యా అంటుంది. రాజవిద్య అని ఎందుకన్నాడంటే, ఇది అత్యున్నతమైన నిర్గుణస్వరూపం గురించి చెబుతుంది; ఇది ఒక్కటే మోక్షాన్ని ఇస్తుంది.

**రాజగుహ్యమ్** – రాజగుహ్యం అంటే అది అత్యంత గొప్ప రహస్యవిద్య. ఈ బోధ అందరికీ అందుబాటులో ఉండదు. పైగా ఇది ఒక అద్భుతం. చాలామంది అనేక సంవత్సరాలు నేర్చుకున్నా కూడా అర్థం చేసుకోకుండా ఉండగలరు. ఇంకా గొప్ప ఆశ్చర్యం, విన్నాక కూడా రహస్యం రహస్యంగానే ఉండిపోతుంది. అందువల్ల ఈ విద్య విద్యల్లోకెల్లా రాజు; రహస్యాల్లోకెల్లా రహస్యం. అందువల్ల రాజవిద్యా, రాజగుహ్యం అయింది. ఈ రాజవిద్యా, రాజగుహ్యాన్ని అర్జునుడు కోరాడు కాబట్టి, కృష్ణపరమాత్మను శరణువేడాడు కాబట్టి కృష్ణపరమాత్మ అర్జునునికి బోధిస్తున్నాడు.

**2. నిర్గుణ ఈశ్వర స్వరూపం శ్లోకాలు 4–10** అధ్యాయం పేరుకు తగ్గట్టుగానే ఈ అధ్యాయాన్ని కృష్ణపరమాత్మ ఈశ్వరస్వరూపాన్ని బోధించటంతో మొదలవుతుంది. ఈశ్వరుణ్ణి జగత్ కారణంగా అభివర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈశ్వరుడు జగత్ కారణమైతే, ఆయన స్వరూపమేమిటి? ఏడవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ ఈశ్వరుణ్ణి రెండు అంశాల మేలుకలయికగా అభివర్ణించాడు.

**పరాప్రకృతి + అపరాప్రకృతి = ఈశ్వరుడు**

పరాప్రకృతి ఉన్నతస్వరూపం, అపరాప్రకృతి వ్యావహారిక స్వరూపం. ఈ పరా, అపరా ప్రకృతి ద్వయం జగత్కారణం. ఉపనిషత్తుల పరిభాషలో చెప్పాలంటే, పరాప్రకృతి బ్రహ్మ, అపరాప్రకృతి మాయ. పర, అపరా ప్రకృతులకు కొన్ని సామాన్య అంశాలు ఉన్నాయి. కొన్ని భిన్న అంశాలు ఉన్నాయి. సామాన్య అంశం రెండూ అనాది. పరా, అపరా ప్రకృతిని కలిపి ఈశ్వరుడు లేదా పరమాత్మ అంటాము. ఈశ్వరుడు కారణంలేని కారణం.

పరాప్రకృతికి, అపరాప్రకృతికి మధ్య నాలుగు భేదాలను ఏడవ అధ్యాయంలో చూశాము.

**చేతనం–అచేతనం** – పరాప్రకృతి చైతన్యం అయితే అపరాప్రకృతి పదార్థం. చేతన, అచేతన కలయిక ఈశ్వరుడు.

**నిర్గుణం–సగుణం** – పరాప్రకృతికి గుణాలు లేవు. అది అశబ్దం, అస్పర్శం, అరూపం, అరసం, అగంధం. అపరాప్రకృతి సగుణం.

**నిర్వికారం–సవికారం** – పరాప్రకృతికి మార్పులు లేవు. కాని అపరాప్రకృతి నిరంతరం మారుతూనే ఉంటుంది. అపరాప్రకృతి సగుణం కాబట్టి, అది మార్పుకు లోనవుతుంది. అవ్యక్తంలోంచి వ్యక్తమవుతుంది; వ్యక్తంనుంచి అవ్యక్తానికి వెళుతుంది. వ్యక్తమయినపుడు కూడా ఎప్పుడూ ఒకేతీరులో ఉండదు. శరీరం షడ్వికారాలకు లోనవుతుంది. ఒక గంటసేపు ఒక ప్రసంగం వింటున్నా కూడా మనకు తెలియకుండానే లోపల కొన్ని మార్పులు అవుతూ ఉంటాయి. కాసేపయ్యాక ఆకలి వేస్తుంది.

**సత్యం–మిథ్య** – పరాప్రకృతికి స్వతంత్రంగా ఉనికి ఉంది. దాని ఉనికికి అది దేనిమీదా ఆధారపడదు. అందువల్ల పరాప్రకృతి సత్యం. అదే అపరాప్రకృతి విషయానికి వచ్చేసరికి, అపరాప్రకృతికి విడిగా ఉనికి లేదు. నిజానికి పరాప్రకృతివల్లనే అపరాప్రకృతికి ఉనికి ఏర్పడుతుంది. పరాప్రకృతి స్వతంత్రం కాబట్టి అది ఉన్నతమైనది అయితే, అపరాప్రకృతి అస్వతంత్రం కాబట్టి అది తక్కువస్థాయికి చెందినది. పరాప్రకృతి ఉనికి అప్పు ఇస్తుంది కాబట్టి అది ఎక్కువస్థాయికి చెందితే, అపరాప్రకృతి ఉనికి అప్పు తీసుకుంటుంది కాబట్టి అది తక్కువస్థాయికి చెందుతుంది. ఇంకొకదానిమీద ఆధారపడింది ఏదైనా మిథ్య. అందువల్ల అపరాప్రకృతి మిథ్య, పరాప్రకృతి సత్యం. ఈ నాలుగు భేదాలను టూకీగా చూద్దాం.

| **పరాప్రకృతి** | **అపరాప్రకృతి** |
|---|---|
| చేతనం | అచేతనం |
| నిర్గుణం | సగుణం |
| నిర్వికారం | సవికారం |
| సత్యం | మిథ్య |

పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయికను ఈశ్వరుడు అంటారని చూశాము. ఇక్కడ కృష్ణపరమాత్మ ఈశ్వరునియొక్క ఉన్నతస్థాయి గురించి చెప్పబోతున్నాడు.

**నిర్గుణ ఈశ్వర నిర్వచనాలు –**

1) **సృష్టి స్థితి లయ కారణమ్** – ఈశ్వరుడు జగత్తుయొక్క సృష్టి స్థితి లయకారకుడు. పరాప్రకృతి నిర్వికారం అని చూశాము. ఒక తెరమీద సినిమా ఆడుతుంటే, తెరకేమీ కాదు.

తెర ఆ సినిమాలో వచ్చే ఏ పాత్రధారీ కాదు. తెర హీరో కాదు, హీరోయిన్ కాదు, విలన్ కాదు, కమేడియన్ కూడా కాదు; తెర ఆ పాత్రల ఉనికికి ఆధారం అవుతుంది.

అపరాప్రకృతి ఉనికికి పరాప్రకృతే ఆధారం. సృష్టి జరగకముందు, అపరాప్రకృతి పరాప్రకృతిలో అవ్యక్తంగా ఉంది. సృష్టి జరిగేటప్పుడు, విత్తనంనుంచి వృక్షం వచ్చినట్టుగా అపరాప్రకృతినుంచి ఈ జగత్తు వస్తుంది; అంటే అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వస్తుంది. అవ్యక్త అపరాప్రకృతి, వ్యక్తం అయ్యేసరికి ప్రపంచం అవుతుంది. ఈ జగత్తు ఎన్నాళ్ళు ఉండాలో నిర్ణయించటానికి అనేక కారణాలు తోడవుతాయి. మనం ప్రస్తుతం వాటిలోకి వెళ్ళబోవటం లేదు. జగత్తు ఎన్నాళ్ళు ఉండాలో, అన్నాళ్ళు ఉన్నాక, అది మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. ఈ విషయాన్ని కృష్ణపరమాత్మ ఎనిమిదవ అధ్యాయంలో చెప్పాడు.

**అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥** – 8.18

ప్రపంచం అవ్యక్తంలోంచి వ్యక్తమవుతుంది. మళ్ళీ వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది.

ఇదే భావనను మళ్ళీ తొమ్మిదవ అధ్యాయంలో కూడా చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

**మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ ।**
**హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే ॥** – 9.10

నా అధ్యక్షతలో ప్రకృతి (అపరాప్రకృతి) ఈ చరాచర ప్రపంచాన్ని సృష్టిస్తున్నది. కేవలం నా సమక్షంవల్లనే మొత్తం ప్రపంచం పరిభ్రమిస్తున్నది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నా అధ్యక్షతలో అంటే పరాప్రకృతి అధ్యక్షతలో అపరాప్రకృతి సృష్టిస్తుంది. తెర సమక్షంలోనే సినిమా ఆడుతుంది. అందువల్ల తెర ప్రత్యక్షంగా పని చేయకపోయినా, తెర ఉండితీరాలి.

2. **అసంగమ్** – పరాప్రకృతికి దేనితోనూ సంగత్వం లేదు.

**యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్ ।**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥** – 9.6

అంతటా సంచరించే వాయువు ఏ విధంగా నిరంతరం ఆకాశంలోనే స్థితమైయుంటుందో, అదే విధంగా నా సంకల్పంవల్లనే ఉత్పన్నమైన ప్రాణులన్నీ నాలోనే ఉత్పన్నమైనవని తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అసంగత్వాన్ని సూచించటానికి కృష్ణపరమాత్మ ఆకాశం ఉదాహరణ ఇస్తున్నాడు. ఈశ్వరుడులాగే ఆకాశానికి కూడా రూపులేదు; ఆకాశం కూడా సర్వవ్యాపకం. ఆకాశం కూడా అసంగం. వాయువు ఏ గంధాన్ని మోసుకువచ్చినా, ఆ గంధం ఆకాశానికి అంటదు.

ఆకాశాన్ని అగ్ని దహించలేదు, నీరు తడుపలేదు. ఆకాశాన్ని ముక్కలు చేయలేము, కాల్చలేము. అలా ఈశ్వరుడు అసంగం.

3. **అకర్తా, అభోక్తా** – ప్రకృతి ఈ చరాచర ప్రపంచాన్ని సృష్టిస్తున్నది. ప్రకృతి అంటే మాయ. కృష్ణపరమాత్మ ఈ మాయను అపరాప్రకృతి అంటున్నాడు. పంచభూతాలు, పద్నాలుగు లోకాలు, జీవులు అన్నీ వస్తాయి. జీవులు చేసే కర్మలవల్ల పుణ్యపాపాలు కలుగుతాయి. వాటిని సుఖదుఃఖాల రూపంలో అనుభవించాలి. వాటికోసం పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడి తిరుగుతుంటారు. కాని ఈశ్వరుడు ఏ పనీ చేయడు.

**మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్** – 9.10

నా అధ్యక్షతలో ప్రకృతి ఈ చరాచర ప్రపంచాన్ని సృష్టిస్తున్నది. అంటే ఈశ్వరుడు సాక్షీభూతంగా చూస్తాడు కాని కర్తృత్వ, భోక్తృత్వాలు అంటవు.

**తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్** – 4.13

నేను వాటి సృష్టికర్తనైనా నేను అకర్త, అవ్యయం అని తెలుసుకో.

భగవంతునికి ఒక సాధువును సృష్టిస్తే పుణ్యమూ రాదు; ఒక పాపిని సృష్టిస్తే పాపమూ అంటదు. ఎందుకంటే భగవంతుడు అధ్యక్షుడు మాత్రమే. అంటే సాక్షిగా చూస్తాడు. సాక్షి అంటే అకర్తా అభోక్తా. జగత్ కారణం బ్రహ్మ అసంగం. అకర్తా అభోక్తా.

4. **మిథ్యాజగదధిష్ఠానమ్** – ఇప్పుడు కృష్ణపరమాత్మ ఒక సాంకేతిక అంశాన్ని ప్రవేశ పెడుతున్నాడు.

**మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః** – 9.4

**న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్** – 9.5

నాలో అన్ని ప్రాణులు నెలకొనివున్నాయి. అంటే నేను విశ్వాధారం కాని నాకు విశ్వం ఆధారం కాదు.

సర్వప్రాణులు నాలో నెలకొనిలేవు. నేను జగత్తుకు అధిష్ఠానాన్ని.

ఒక శ్లోకంలో అన్ని ప్రాణులు నాలో నెలకొని ఉన్నాయి అన్నాడు. మరీ వెంటనే సర్వప్రాణులు నాలో నెలకొని లేవు అన్నాడు. అలా భిన్నవాక్యాలు ఎందుకు చెప్పాడు కృష్ణపరమాత్మ? కృష్ణపరమాత్మ అన్ని ప్రాణులు నాలో నెలకొనివున్నాయి అంటే వాటి ఉనికిని ఒప్పుకు తీరాలి. మళ్ళీ వెంటనే లేవు అన్నా ఆ వాక్యాన్ని కూడా సత్యంగానే తీసుకోవాలి. అంటే ఒక కోణంలోంచి చూస్తే ఉంది అని అన్నా, దాన్ని లోతుగా విశ్లేషిస్తే, దానికి ఉనికి ఉన్నట్టుగా ఉంది కాని నిజంగా లేదు అని అర్థమవుతుంది. అలా ఏదైనా

ఉనికి ఉన్నట్టుగా అనిపిస్తే అది ఈ మధ్యరకం దానిలోకి వస్తుంది. అంటే ఉండీ, లేనట్టు అనిపిస్తుంది.

అలా ఉండీ, లేనట్టు అనిపించేవి ఏమైనా ఉన్నాయా? చాలా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది – మనం రోజూ కనే కలే! స్వప్నం నిజంగా ఉందా, లేదా? రెండూనూ. స్వాప్నికునికి నిజంగా ఉంది. స్వాప్నికునికి స్వప్నంలో ఉన్నంతవరకూ స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. కాని ఆ స్వప్నంనుంచి లేచాక, అది స్వప్నం అని తెలుస్తుంది. అదే విధంగా కృష్ణపరమాత్మ ఈ జగత్తు ఉందని చెబుతూ, రెండవ వాక్యంలో అది నిజంగా లేదు, మిథ్య అంటున్నాడు. అంటే ఉన్నట్టుగా అనిపిస్తుంది. దీన్ని అధ్యారోప అపవాద పద్ధతి అంటారు.

నాలో అన్ని భూతాలు ఉన్నాయి అని చెప్పినప్పుడు అధ్యారోపం. అది వ్యావహారిక స్థాయి. నాలో అన్ని భూతాలు లేవు అని చెప్పినప్పుడు, అపవాదం. అది పారమార్థిక స్థాయి. పారమార్థిక స్థాయిలో అద్వైతబ్రహ్మ ఒకటే ఉంది; బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య. అప్పుడు **బ్రహ్మ మిథ్యా జగత్తుకు అధిష్ఠానం.**

ఈ విధంగా ఈశ్వరుని గురించి నాలుగు నిర్వచనాలు చూశాము. అవి – **సృష్టి స్థితి లయ కారణమ్, అసంగమ్, అకర్తా అభోక్తా, మిథ్యాజగదధిష్ఠానమ్.** ఈ నిర్వచనాలను అద్భుతంగా శ్లోకాలు 1–10లో చూస్తాము.

**3. సాధనరూపభక్తి శ్లోకాలు 11–19–** ఇప్పుడు మరొక అంశంలోకి ప్రవేశించబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఈ అంశంలో ప్రతివ్యక్తి కూడా పుట్టినప్పటినుంచే పెద్ద సమస్యను ఎదుర్కొంటున్నాడు అంటున్నాడు. సమస్య ఏమిటంటే – మనం అపరాప్రకృతిని తెలుసుకో గలుగుతున్నాము కాని, పరాప్రకృతి గురించి తెలుసుకోలేకపోతున్నాము. ఈ పరాప్రకృతియొక్క అజ్ఞానమే మన సంసారానికి కారణం.

**అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥** – 9.11

ఈ మూఢులు నా నిర్గుణస్వరూపాన్ని తెలుసుకోరు. నా భావాన్ని తెలుసుకోలేక, నా సగుణ రూపాన్నే కొలుస్తున్నారు.

మానుషీం తనుమ్ అంటే అపరాప్రకృతి. అది సగుణరూపం. మనిషిరూపంలో ఉన్న దైవస్వరూపం అంటే రాముడు, కృష్ణుడు, వెంకటేశ్వరుడు, దేవి. పరంభావమ్ అంటే పరాప్రకృతి. నిర్గుణబ్రహ్మను ఎవరూ అర్థం చేసుకోలేక నా అపరాప్రకృతిలోనే ఆగిపోతున్నారు అని కృష్ణపరమాత్మ అంటున్నాడు. మనం శాంతి, భద్రత, ఆనందాలకోసం వెంపర్లాడుతాము. వాటికోసం అపరాప్రకృతిలో వెతుకుతాము.

చిన్నవయస్సులో తల్లి చీరకొంగులో భద్రత వెతుక్కుంటాము. తల్లి పక్కనే అందుబాటులో లేకపోతే, తల్లి చీరను పక్కన పెట్టుకుని పడుకుంటాము. ఆ విధంగా శాంతి, భద్రత, ఆనందాలను బాహ్యవస్తువులలో వెతుక్కోవటం మనకు చిన్నప్పటినుంచే అలవాటై పోయింది. మనకు తెలిసిందల్లా అపరాప్రకృతే. అందువల్ల అందులోనే వెతుక్కుంటాము. కాని అపరాప్రకృతి ఎప్పటికీ ఒక్కలాగా ఉండదు.

**ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం యాతి క్షయం యౌవనం**
**ప్రత్యాయాంతి గతాః పునర్న దివసాః కాలో జగద్భక్షకః**
**లక్ష్మీస్తోయతరంగభంగచపలా విద్యుచ్చలం జీవితం।**
**తస్మాన్మాం శరణాగతం కరుణయా త్వం రక్ష రక్షాధునా॥**

– శివ అపరాధ క్షమాపణ స్తోత్రం

శాంతికోసం శరణు వేడాల్సింది భగవంతుణ్ణి మాత్రమే. రోజురోజుకూ ఆయుష్షు తగ్గుతూ వస్తున్నది; చూస్తూ ఉండగానే రోజులు గడిచిపోతున్నాయి; యౌవనం కరిగిపోతున్నది; గడిచిపోయిన కాలం తిరిగిరాదు. కాలం అంతటినీ భక్షిస్తున్నది. నీటి తరంగాలమీద గాలి బుడగలా క్షణంలో మాయమవుతుంది ఐశ్వర్యం; జీవితం ఒక మెరుపులా మెరిసి మాయమవుతుంది. అందువల్ల ఓ భగవంతుడా, నీ శరణు వేడుతున్న నన్ను కరుణించి రక్షించు.

మనం దేన్ని గట్టిగా పట్టుకున్నా కూడా అది ఒక తరంగంలాగా మాయమైపోతుంది. అందువల్ల మారుతున్న అపరాప్రకృతిని; తనకే భద్రతలేని అపరాప్రకృతిని; కృశించిపోయి, నశించే అపరాప్రకృతిని పట్టుకోవటంవల్ల ఎన్నటికీ భద్రతను పొందలేము. దాన్ని కోల్పోతామేమోననే చింత నిరంతరం వెంటాడుతూనే ఉంటుంది. నిజానికి భద్రత పొందటం కోసం ధనాన్ని పోగేస్తాము. కాని ఇప్పుడు ఆ ధనంయొక్క భద్రతకోసం భయపడుతున్నాము. భద్రతకోసం కష్టపడి ఇల్లు కట్టుకున్నాము కాని ఇప్పుడా ఇంటి భద్రతకోసం పాకులాడుతాము. ఇల్లు తాళం పెట్టి వెళ్ళాలంటే భయం! దొంగలు దోచుకుపోతారేమోననే బెంగ! భవిష్యత్తులో భద్రతకోసం పిల్లలను కన్నాము కాని మనకేదైనా అయితే వారి భవిష్యత్తు భద్రంగా సాగదేమోననే బెంగ!

ఆ విధంగా భద్రతకోసం దేన్నైతే పట్టుకు పాకులాడతామో, అది మననుంచి వెళ్ళిపోతే, అది మనకు దూరమయితే, ఆ దుఃఖాన్ని భరించలేము. నిజానికి అర్జునుడు గీతాశాస్త్రాన్ని కోరిన కారణం కూడా ఇదే. తను ఎవరినైతే పట్టుకున్నాడో, వారిని కోల్పోతానేమోననే భయంవల్లనే. కాని అతను పట్టుకున్నది అపరాప్రకృతిని. అందువల్ల పూర్ణత్వం లేదు, భద్రత లేదు, మిగిలింది శోకమే శోకం; నిరంతర చింత. ఈ నిరంతర శోకం, ఈ నిరంతర చింతే

సంసారం. పరాప్రకృతి గురించిన అజ్ఞానంనుంచి పుట్టింది ఈ సంసారం. అంటే ఇది అజ్ఞానజనిత పొరపాటు. **పరాప్రకృతి అజ్ఞానమ్ ఏవ సంసారస్య కారణమ్.**

పరాప్రకృతి గురించి తెలిస్తే శాంతి, భద్రతలకోసం పరాప్రకృతిమీద ఆధారపడతారు; అపరాప్రకృతిలో వ్యవహారం నడుపుతారు. అందువల్ల సంసారంనుంచి బయటపడేసే మార్గాన్ని తెలుసుకోవాలి. దీనికి ఒకటే మార్గం ఉంది – అది **భక్తి** అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి ఈ మాటను ఏడవ అధ్యాయంలోనే చెప్పేశాడు. ఈ అధ్యాయం ఏడవ అధ్యాయానికి సమాంతరరేఖలా సాగుతున్నదని కూడా చూశాము.

**త్రిభిర్గుణమయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ॥** – 7.13

త్రిగుణాత్మకమైన అపరాప్రకృతి మాయలో పడిపోతున్నారు. ఆ మాయ వారిని మోహంలో కప్పివేస్తున్నది. వారు కోరుకుంటున్న వస్తువులను దొరకనిచోట అర్థం లేకుండా వెతుకుతున్నారు. ఇదెలాగుందంటే, ఒక బ్రాహ్మణుని కథ గుర్తుకుతెస్తుంది మనకు.

ఒక బ్రాహ్మణుడు మహామహం కొలనులో స్నానం చేశాడు. అక్కడ స్నానం చేస్తుండగా అతని ఉంగరం జారి ఆ కొలనులో పడిపోయింది. దాన్ని వెతుకుదామనుకున్నాడు. కాని అక్కడేమో ఇసకేస్తే రాలనంత జనం ఉన్నారు. 'సరే, హాయిగా ఈ పక్క కొలనులో వెతుకుతాను, ఇక్కడెవరూ లేరు కదా!' అనుకున్నాడు ఆ అమాయక చక్రవర్తి. అతను వెతుకుతుంటే ఎవరో వచ్చి, 'ఏం వెతుకుతున్నావు?' అన్నాడు. 'నా ఉంగరం పోయింది, దాన్ని వెతుకుతున్నాను,' అన్నాడు. పాపం అతను సహాయం చేయటానికి వచ్చి, తనూ వెతకటం మొదలుపెట్టాడు. అలా ఒకరొకరూ వచ్చిచేరారు. దాదాపు పాతికమంది చేరారు ఈ వెతికే బృందంలో. దీన్నే అంధపరంపర అంటారు.

ఉన్నట్టుండి ఒక తెలివైన వ్యక్తి అంతవరకూ ఎవరూ వేయని ప్రశ్న వేశాడు. 'ఏం వెతుకుతున్నావు,' అన్నాడు ముందు. 'నా ఉంగరం పోయింది,' అన్నాడు అతను. 'ఎక్కడ పోయింది,' అని మళ్ళీ అడిగాడు. 'మహామహం కొలనులో పోయింది,' అన్నాడు అతను. 'మరయితే ఇక్కడ వెతుకుతున్నావేం?' ఆశ్చర్యంగా అడిగాడు ఆ తెలివైన వ్యక్తి. 'అక్కడ చాలామంది ఉన్నారు. ఇక్కడ తక్కువమంది ఉన్నారు. పైగా వెలుతురు కూడా ఉంది. అందువల్ల ఇక్కడ వెతుకుతున్నాను,' అన్నాడు ఆ అమాయక చక్రవర్తి. అతను చేస్తున్న పని వెర్రితనంగా అనిపిస్తున్నది కదూ!

కాని మనం కూడా అలాగే వెర్రితనంగానే ప్రవర్తిస్తున్నామంటుంది శాస్త్రం. అపరాప్రకృతి కూడా అతను వెతుకుతున్న రెండవ కొలను. ఆ కొలనులో ఎంత వెతికినా పూర్ణత్వమనే

ఉంగరం దొరకదు, భద్రత అనే ఉంగరం దొరకదు, ఆనందమనే ఉంగరం దొరకదు. అయినా అక్కడే పదేపదే వెతుకుతాము. ఎల్‌కేజీ నుంచి పది వరకూ స్కూల్లో చదివి, కాలేజీ చదువులు చదివి, మంచి ఉద్యోగంలో చేరి, పెళ్ళి చేసుకుని, పిల్లలను కంటాము. ఇదంతా ఎందుకు చేస్తున్నట్టు? మన పెద్దలు చేశారు కాబట్టి, మనమూ చేస్తున్నాము. ఇదంతా పరంపరగా వస్తున్నది.

అందువల్ల మీకు కావాల్సినది, మీకు దొరకనిచోట వెతుకుతున్నారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మీకు జీవితంలో వినోదం కావాలంటే – ప్రపంచంలోని అందాలను ఆస్వాదించండి; సూర్యోదయాన్ని మెచ్చుకోండి; తోటివారితో అనుబంధాన్ని పెంచుకోండి; వారి ఆప్యాయతలను అనుభవించండి కాని వీటిలో దేన్నుంచీ శాశ్వతమైన ఆనందాన్ని కానీ, పూర్ణత్వాన్ని కానీ కోరకండి.

అపరాప్రకృతిని స్విమ్మింగ్‌పూల్‌తో పోల్చవచ్చు. స్విమ్మింగ్‌పూల్ దుఃఖహేతువా, సుఖహేతువా? దానికి జవాబు ఇదీ అని ఇదమిత్థంగా తేల్చి చెప్పలేము. ఈత కొట్టటం తెలిసినవారికి సుఖహేతువు; ఈత కొట్టటం రానివారికి అదే స్విమ్మింగ్‌పూల్ స్మశానవాటికగా మారే ప్రమాదం ఉంది. అపరాప్రకృతి కూడా అంతే. పరాప్రకృతి అయిన ఈశ్వరుణ్ణి తెలుసుకుంటే, అపరాప్రకృతి అనే స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టటం వచ్చినట్టు అర్థం. అప్పుడు పరాప్రకృతిని పట్టుకుని, అపరాప్రకృతిలో ఓలలాడవచ్చు. పరాప్రకృతి తెలియకపోతే, అపరాప్రకృతిలో ఈదటం కష్టమయిపోతుంది. జీవితం భారంగా అనిపిస్తుంది. దీన్నే సంసారం అంటారు. ఈ సంసారంనుంచి బయటపడటానికి ఒక్కటే మార్గం ఉంది. అదే **భక్తిమార్గం**.

భక్తి అంటే ఏమిటి? మనని అయోమయంలో పడవేసే పదాలలో భక్తి పదం ఒకటి. భక్తికి అనేక నిర్వచనాలు ఇస్తారు. భక్తి అంటే నిజానికి ఒక్క సాధన కాదు. భక్తి అంటే కొన్ని సాధనల వరుసక్రమం. ఆ సాధనల దశలన్నింటిలోనూ భగవంతునిమీద భక్తి కలగలసి ఉంటుంది. ఆ సాధనలన్నీ దాటితే అవి పరాప్రకృతికి, అసలైన భద్రతకు తీసుకు వెళతాయి.

ప్రతి ఒక్కరూ పాటించాల్సిన ఆ సాధనలు ఏమిటి?

1. **కర్మరూపభక్తి** – కర్మయోగం రూపంలో ఉన్న భక్తి మొదటి దశ. మనం చేసే కర్మలన్నీ ఈశ్వరార్పణబుద్ధితో చేయటం. కుటుంబానికి చేసే కర్మలు, సమాజానికి చేసే సేవలు, మతపరమైన కార్యక్రమాలు, నిరంతరం చేసే కర్మలన్నీ ఈశ్వరునికే అర్పిస్తూ చేయాలి.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥** – 9.27

ఓ కౌంతేయ, నువ్వు ఏ కర్మచేసినా, ఏం తిన్నా, ఏ పూజ చేసినా, ఏ దానకర్మ చేసినా, ఏ తపస్సు చేసినా కూడా, దాన్ని నాకు అర్పించు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥** – 3.30

అంతర్యామిని, పరమాత్మను అయిన నామీదే నీ మనస్సు నిలిపి, నీ కర్మలన్నీ నాకే అర్పించి, ఆశా, మమతా సంతాపాలను వదిలి యుద్ధం చేయి.

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥** – 5.10

ఎవరైతే తన కర్మలన్నింటినీ బ్రహ్మకే అర్పించి, ఏ కోరికలూ కోరరో, వారిని తామరాకు మీద నీటిబొట్టులా పాపాలు అంటవు.

ఇది భక్తిలో మొదటిదశ. ఈ దశను ప్రతి ఒక్కరూ దాటితీరాలి. ఎలాగైతే స్కూల్లో చేరి పదవక్లాసు వరకూ చదివితీరాలో, అలా కర్మయోగం పాటించితీరాలి. వేరే మార్గం లేదు. కర్మయోగం చిత్తశుద్ధిని కలుగజేస్తుంది కాబట్టి అది చాలా ముఖ్యమైన సాధన. కాని అదే అంతిమ సాధన కాదు. దీని తరువాత రెండవదశకు వెళ్ళాలి.

2. **ఉపాసనరూపభక్తి** – ఈ స్థాయి భక్తిలో ఈశ్వరునిమీద ధ్యానం చేస్తారు. ఉపాసన అంటే ధ్యానం. ఉపాసన రెండు పద్ధతుల్లో చేయవచ్చు.

ఎ) **ఏకరూప ఉపాసన** – మొదట్లో ఉపాసనను భగవంతునియొక్క ఏదో ఒకరూపంమీద ధ్యానం చేయవచ్చు. దీన్ని ఏకరూప ఈశ్వరధ్యానం అంటారు. ఇందులో ఇష్టదేవతమీద ధ్యానం చేస్తారు.

కర్మకాండలో మనస్సు బాహ్యాముఖంగా పరుగులు తీస్తుంది. బాహ్యాముఖంగా పరుగులు తీసే మనస్సు భగవంతునియొక్క స్వరూపాన్ని తెలుసుకోలేదు.

**అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా**

దుర్లభం కూడా కాదు, సుదుర్లభం. కర్మకాండ పాటించాలంటే బహిర్ముఖంగా ఉండక తప్పదు. అందువల్లనే, చాలామంది పదవీ విరమణ చేశాక, చాలా అవస్థలు పడతారు. ఇంతవరకూ క్షణం తీరిక లేకుండా, చాలా కష్టపడ్డారు. ఇప్పుడు ఒక్కసారిగా, ఖాళీగా కూర్చోవాలంటే వారికి చాలా కష్టం. అందువల్ల ఇష్టదేవతను తీసుకుని, ఆ దేవతమీద ధ్యానం చేస్తే, అది మనస్సును శుద్ధి చేయటమే కాక, చిత్తఏకాగ్రతను కూడా పెంపొందిస్తుంది.

బి) **విశ్వరూప ఉపాసన** – ఏకరూప ఉపాసననే విశ్వరూప ఉపాసనగా మలచుకోవచ్చు. ఇష్టదేవత రూపాన్నే జగత్తంతటా చూడవచ్చు. రామభక్తుడు అంతా రామమయం, ఈ జగత్తంతా రామమయం అంటాడు. కృష్ణభక్తుడు సర్వం కృష్ణమయం అంటే, దేవీభక్తుడు జగత్తంతా దేవీమయం అంటాడు. శివభక్తుడు అంతా శివమయం అంటే, విష్ణుభక్తుడు అంతా విష్ణుమయం అంటాడు.

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలః చంద్రసూర్యౌ చ నేత్రే** – విష్ణుసహస్రనామమ్

కృష్ణపరమాత్మ తన విశ్వరూపం గురించి ఇక్కడ సూచనప్రాయంగా తెలియజేస్తాడు.

**అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।**
**మంత్రోఽహమహమేవాజ్యమ్ అహమగ్నిరహం హుతమ్ ॥** – 9.16

నేనే క్రతువును, నేనే యజ్ఞాన్ని, నేనే పితృదేవతలకు ఇచ్చే ఆహుతులను, నేనే ఓషధాన్ని, నేనే మంత్రాన్ని, నేనే ఆజ్యాన్ని, నేనే అగ్నిని, నేనే హోమక్రియను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అనేకరూపభక్తి అంటే అనేక దేవతలమీద భక్తి కాదు. తను కొలిచే ఇష్టదేవతను విశ్వమంతటా ఉన్నాడని పూజించటం.

3. **జ్ఞానరూపభక్తి** – ఈ భక్తిలో భగవంతునియొక్క పరాప్రకృతి స్వరూపజ్ఞానం పొందుతాము. ఇంతవరకూ భగవంతునియొక్క అపరాప్రకృతి స్వరూపాన్ని ప్రార్థిస్తూ వచ్చాము. ఈ దశలో అపరాప్రకృతికి అతీతంగా ఎదిగి, భగవంతునియొక్క పరాప్రకృతి స్వరూపాన్ని తెలుసుకుంటాము. దీన్ని జ్ఞానలక్షణ భక్తి అంటారు.

ఈ విధంగా, ప్రతి ఒక్కరూ భక్తిలోని ఈ మూడు దశలనూ దాటుకుంటూ రావాలి. అప్పుడే మోక్షం పొందుతారు.

ఈ మూడు దశలు ఎందుకు పాటించి తీరాలి? మూడింటిలో ఏదో ఒకటి ఎందుకు ఎన్నుకోకూడదు? నేను కర్మ, మీరు ఉపాసన, అతను జ్ఞానం ఎందుకు ఎన్నుకోకూడదు? అలా ఏదో ఒకటి ఎన్నుకునే అవకాశం లేదు. ఒకటి తప్పించుకునే మార్గమూ లేదు. ఎందుకంటే, మన ప్రాథమిక సమస్య పరాప్రకృతి గురించిన అజ్ఞానం.

**అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥** – 9.11

ఈ మూఢులు నా పరాప్రకృతి స్వరూపాన్ని తెలుసుకోరు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అదృష్టవశాత్తూ లేదా దురదృష్టవశాత్తూ అజ్ఞానాన్ని జ్ఞానం ద్వారానే పారద్రోలగలము. కర్మ, అజ్ఞానాన్ని పారద్రోలలేదు. ధ్యానం, అజ్ఞానాన్ని పారద్రోలలేదు. మీకేమైనా సందేహం ఉంటే ఈ ప్రయోగం చేసిచూడండి. మీరు ఫిజిక్స్ జ్ఞానం పొందాలనుకున్నారు. ఫిజిక్స్ బోధించే కాలేజీకి వెళ్ళి, ఆ కాలేజీని తుడిచి శుభ్రం చేస్తేనో, ఫిజిక్స్ ప్రొఫెసర్‌కు సేవలు చేస్తేనో ఫిజిక్స్ అజ్ఞానం పోతుందా? పోదు! అందువల్ల కర్మ చేస్తే పరాప్రకృతి అజ్ఞానం కూడా పోదు.

అలాగే ఫిజిక్స్ ప్రొఫెసర్ మీద ఎంతసేపు ధ్యానం చేసినా కూడా మీ అజ్ఞానం పోదు. అజ్ఞానం పోవాలంటే దానికి ఒకటే మార్గం ఉంది. అది జ్ఞానయోగం మాత్రమే. అందువల్ల కర్మతో మొదలుపెట్టి, ఉపాసనకు వచ్చి, చివరికి జ్ఞానలక్షణ భక్తికి రావాలి.

జ్ఞానం మాత్రమే అజ్ఞానాన్ని పారద్రోలేటట్టయితే, నేను కష్టపడి కర్మ, ఉపాసన చేయటం ఎందుకు? సరాసరి జ్ఞానానికి వెళ్ళవచ్చు కదా అనకూడదు. ఇదెలాగుంటుందంటే, కాలేజీకి వెళితేనే నేను గ్యాడుయేట్ అవుతానంటే, స్కూలుకి వెళ్ళి కష్టపడి చదవటం ఎందుకు అన్నట్టుంటుంది. స్కూలు చదువు అవకుండా, సరాసరి కాలేజీలో చేరలేరు. అదే విధంగా కర్మలక్షణ భక్తి, ఉపాసనలక్షణ భక్తి తొలిదశలు. ఆ మెట్లు ఎక్కే జ్ఞానలక్షణ భక్తికి రావాలి. ఈ రెండు దశలవల్లనే జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందుతారు. దాని తరువాతనే జ్ఞానయోగానికి వచ్చి జ్ఞానం పొందుతారు. ఆ జ్ఞానం పరాప్రకృతి జ్ఞానం. జ్ఞానం పొందితేనే మోక్షం పొందుతారు. అందువల్లనే కృష్ణపరమాత్మ నాలుగురకాల భక్తులను వర్ణించాడు ఏడవ అధ్యాయంలో.

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥** – 7.16

ఓ అర్జునా! నాలుగు రకాల భక్తులు నన్ను కొలుస్తారు. వారు ఆర్తభక్తులు, అర్థార్థీ భక్తులు, జిజ్ఞాసు భక్తులు, జ్ఞానీ భక్తులు.

ఈ నాలుగు రకాల భక్తుల్లో జ్ఞానీభక్తుడు శ్రేష్ఠుడు అనికూడా అన్నాడు.

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః ॥** – 7.17

జ్ఞానీభక్తుడు నాకు ప్రియం అన్నాడు.

ఆర్తభక్తితోనో, అర్థార్థీభక్తితోనో మొదలుపెట్టవచ్చు కాని, చివరికి జ్ఞానలక్షణభక్తికి వచ్చితీరాలి. అందువల్ల ఈ దశలన్నీ దాటుకుంటూ వచ్చి, పరాప్రకృతిని తెలుసుకోవాలి. పరాప్రకృతిని తెలుసుకుంటే, పరాప్రకృతిని పట్టుకుని, అపరాప్రకృతితో తేలియాడవచ్చు. అప్పుడు అపరాప్రకృతినుంచి ఏమీ ఆశించరు.

సముద్రంలోని అల పైకెగిసిపడినప్పుడు, ఎగిసిపడుతున్న అలను చూసి ఆనందించగలరు; అల కరిగిపోయినప్పుడు బాధపడరు. అయ్యో, అల కరిగిపోయిందే అని కూర్చుని ఏడవరు. ఎందుకంటే, అల జీవితం శాశ్వతం కాదని మీకు తెలుసు. మీ పూర్ణత్వం అలమీద ఆధారపడదు. అదే విధంగా అపరాప్రకృతి కూడా అలలాగా శాశ్వతం కాదని మీకు తెలుసు. సృష్టిని ఉన్నదున్నట్టుగా స్వీకరిస్తారు; సృష్టిలోని వస్తువులు వచ్చినా ఆనందమే,

వెళ్ళిపోయినా ఆనందమే; ప్రతివస్తువూ వికారాలకు లోనవుతుందని అర్థం చేసుకుంటారు. ఈ వివేకం పొందితే జీవన్ముక్తిని అనుభవిస్తారు.

ఈ విధంగా తొమ్మిదవ అధ్యాయంలో రెండవ అంశం భక్తి. సంసారంనుంచి విముక్తి కలిగించేది ఈ భక్తే. ఇది మూడు దశలతో కూడుకున్నది. అవి కర్మ, ఉపాసన, జ్ఞానం. మూడింటిలోనూ భక్తి సమానఅంశం. **సాధనరూపభక్తి = కర్మ → ఉపాసన → జ్ఞానం**

ఈ మూడవస్థాయి భక్తిని శంకరాచార్యులు వివేకచూడామణిలో చక్కగా వర్ణించారు.

**స్వస్వరూప అనుసంధానం భక్తిరిత్యభిధీయతే**

మూడవస్థాయిలో కర్మ, ఉపాసన ఉండవు. వేదాంతవిచారణ ఉంటుంది. భక్తి అంటే అరూప (నిర్గుణ) ఈశ్వరుని గురించిన జ్ఞానం.

**4. భావనరూపభక్తి శ్లోకాలు 20–29** – భక్తి, మోక్షానికి దారితీయాలంటే, భక్తి సంసారంనుంచి విముక్తి కలిగించాలంటే, ఒక ముఖ్యమైన నిబంధనకు లోబడివుండాలి. ఆ నిబంధనను పాటించనిదే మోక్షం సాధ్యం కాదు. కృష్ణపరమాత్మ ఆ భక్తి నిష్కామభక్తి అయివుండాలి కాని, అది సకామభక్తి అయివుండకూడదు అంటున్నాడు. భక్తి రెండువైపులా పదును ఉన్న కత్తి లేదా టూ–ఇన్–వన్ ప్లేయర్.

భక్తిని రెండురకాల ఫలాలకోసం ఉపయోగించవచ్చు. లౌకిక విజయాలైన అర్థ, కామాలను ఇస్తుంది లేదా మోక్షాన్ని ఇస్తుంది.

**సకామభక్తి** – సకామభక్తిని ఈ లౌకిక విజయాలు పొందటానికి వాడవచ్చు.

**ధర్మార్థీ ప్రాప్నుయాత్ ధర్మమ్ అర్థార్థీ చార్థమాప్నుయాత్ ।**
**కామానవాప్నుయాత్ కామీ ప్రజార్థీ చాప్నుయాత్ ప్రజాః ॥** – ఫలశ్రుతి

ధర్మం కోరే వ్యక్తి ధర్మాన్నీ, ధనాన్ని కోరే వ్యక్తి ధనాన్నీ, వస్తువులు కోరే వ్యక్తి వస్తువులనీ, సంతతిని కోరేవారు సంతతినీ పొందుతారు.

పురాణాలలో ఈ కథను చూస్తాము. ఒకానొప్పుడు ఒకరాజు ఉండేవాడు. అతనికి ఐశ్వర్యానికి లోటులేదు. రాజ్యపాలన ప్రజారంజకంగా చేస్తుండేవాడు. కాని అతనికి సంతానం లేదు. అప్పుడు సంతతికోసం ఒక ప్రత్యేకమైన యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞఫలంగా పుత్ర సంతానం పొందాడు. ఇది సకామభక్తిలోకి వస్తుంది. మనం ఈ భక్తిని తప్పుపట్టటం లేదు. కాని ఇది లౌకిక విజయాలనే ఇస్తుంది అంటున్నాము.

స్వర్గలోకప్రాప్తికోసం యజ్ఞం చేసినా, అది కూడా లౌకిక విజయాలలోకే వస్తుంది. సకామభక్తి ఇహాముత్రఫలాలను ఇస్తుంది, అంటే ఇహలోకఫలం, పరలోకఫలం (ఇహలోకంలో పాయసం తాగితే, పరలోకంలో అమృతం తాగుతాడు. అది కూడా బంగారు పాత్రలో).

**నిష్కామభక్తి** – ఇదే భక్తిని ఇంకొక విజయంకోసం ఉపయోగించవచ్చు. అది ఈశ్వరప్రాప్తి. అది శాశ్వతమైన ఫలాన్ని ఇస్తుంది. భక్తిఫలంగా జగత్ప్రాప్తి కోరవచ్చు లేదా ఈశ్వరప్రాప్తి కోరవచ్చు. భగవంతునిపరంగా చూస్తే, 'మీరేది కోరితే అది ఇవ్వటానికి నేను సిద్ధంగా ఉన్నాను,' అంటాడు భగవంతుడు.

సంకల్పం చెప్పేటప్పుడు మామూలుగా 'మమోపాత్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం .... ధాన్యం ధనం పశుం బహుపుత్రలాభం చ... శతసంవత్సరం... అంటూ అనేక లౌకిక విజయాలను కోరతాము. పూజ చేసేదేమో కొన్ని నిముషాలు; కోరికలేమో అనంతం! అయినా భగవంతుడు నిందించడు. 'మరేం ఫర్వాలేదు, మీరేం కావాలనుకుంటే అది కోరండి,' అంటాడు. అందువల్ల మనం పైన చెప్పినట్టుగా ధాన్యం, ధనం మొదలైనవి కోరవచ్చు లేదా జ్ఞానవైరాగ్యాలను కోరవచ్చు.

**అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణవల్లభే ।**
**జ్ఞానవైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి** – అన్నపూర్ణాష్టకమ్

ఓ పార్వతీ! ఓ అన్నపూర్ణా! నువ్వు సదా పూర్ణురాలవు; శంకరునికి ప్రాణం. మాకు జ్ఞానవైరాగ్యాలను భిక్షగా ప్రసాదించు.

జ్ఞానవైరాగ్యాలను కోరుతున్నామంటే ఈశ్వరప్రాప్తి కోరుతున్నాము. దీన్ని నిష్కామభక్తి అంటారు. భగవద్గీత పరిభాషలో చెప్పాలంటే జిజ్ఞాసుభక్తి. వేదాంతపరిభాషలో చెప్పాలంటే ముముక్షుత్వం. ఏ పదం వాడినా అర్థం ఒకటే.

**త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।**
**తే పుణ్యమాసాద్య సురేంద్రలోకమ్ అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్ ॥** – 9.20

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।**
**ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభంతే ॥** – 9.21

ఋగ్యజుస్సామ వేదాలలో చెప్పబడిన సకామ కర్మలను ఆచరించేవారు, సోమరసాన్ని సేవించేవారు, పాపరహితులు యజ్ఞాల ద్వారా నన్ను పూజించి స్వర్గలోకప్రాప్తిని కోరుతారు. ఆ పురుషులు పుణ్యఫలంగా స్వర్గలోకాన్ని పొంది, అక్కడ అనేక దేవభోగాలను అనుభవిస్తారు.

ఆ పురుషులు ఆ విశాలమైన స్వర్గలోక భోగాలను అనుభవించి, వారి పుణ్యం క్షీణించగానే మనుష్యలోకాలకి తిరిగివస్తారు. ఈ విధంగా వేదాలలో చెప్పబడిన కర్మలను చేసే ఆ భక్తులు, భోగాలను ఆశించటంవల్ల స్వర్గలోకానికీ, భూలోకానికీ మధ్య రాకపోకలు సాగిస్తారు.

ఇదంతా సకామభక్తి ఫలం. భగవంతుడు సకామభక్తి ద్వారా కోరికలను తీర్చుకోవచ్చు, తప్పేం లేదు అంటూనే, దానికింద ఒక హెచ్చరిక చేస్తున్నాడు. సాధారణంగా మనుష్యులు సానుకూల అంశాలనే చూస్తారు. చాలామంది గులాబీపువ్వునే చూస్తారు కాని దానికింది ఉన్న ముల్లును పట్టించుకోరు. అలాగే సోమయాగాది పుణ్యకర్మలు చేసిన సకామభక్తులు స్వర్గలోకానికి వెళతారు. అంతవరకూ బాగానే ఉంది. కాని అక్కడ పొందిన ప్రతి మిల్లీగ్రాము ఆనందానికీ, పుణ్యమనే స్వర్గలోక డాలర్లు ఖర్చు పెట్టాల్సివుంటుంది. పుణ్యం క్షీణించగానే భూలోకానికి తిరిగివస్తారు. అంతకుముందు దేవతలతో ఉంటే, ఇప్పుడు దోమలతో సహజీవనం చేయాల్సివుంటుంది.

అయితే ఏమిటి నష్టం అని అడగవచ్చు మీరు. ఏ వస్తువైనా సరే అది ఉంటే మీకు ఆనందం ఇస్తే, అది పోతే దుఃఖం కలిగిస్తుంది. అమెరికాలో ఆరునెలలు ఉండివచ్చాక, పరిశుద్ధమైన వాతావరణంలో ఉండివచ్చాక, ఇక్కడ కాలుష్యంలోకి అడుగుపెడితే అనారోగ్యం పాలవవచ్చు. ముందునుంచీ ఇక్కడే ఉంటే ఆ నొప్పి తెలియదు. ఒకసారి స్వర్గసుఖాలను అనుభవించాక, మళ్ళీ అవస్థలు పడాలంటే కష్టం. కష్టం వెన్నంటి వచ్చే సుఖం బాగుంటుంది కాని సుఖం వెన్నంటి వచ్చే కష్టం భరించలేము. అందువల్ల సకామకర్మవల్ల ఏ ఫలం పొందినా, అది అనిత్యఫలమే అవుతుంది కాని నిత్యఫలం అవదు. అదే నిష్కామభక్తి పాటిస్తే అది నిత్యఫలమైన మోక్షాన్ని ఇస్తుంది. తెలివైన వ్యక్తి నిష్కామభక్తినే కోరుకుంటాడు.

నిష్కామభక్తిని పెంపొందించుకోవటం ఎలా? నిష్కామభక్తిని పెంపొందించుకోవటానికి ఒకటే మార్గం ఉంది. అది **నిత్యానిత్యవస్తువివేకం** చూపటం, వేదాంతం. ఈ నిత్యానిత్య వస్తువివేకంతోనే మొదలుపెడుతుంది.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।** – ముండకమ్ 1.2.12

తెలివైన వ్యక్తి లోకంలో వచ్చిన కర్మఫలాలను గమనించి కర్మవల్ల శాశ్వతమైన ఫలం రాదని గ్రహించి, నిర్వేదం చెందుతాడు.

అనేక కర్మలను చేసి, అనేక కర్మఫలాలను పొంది, అవి శాశ్వతమైన ఫలాలు కావని ఒకరోజు గ్రహిస్తాడు. అప్పుడు అతనికి నిత్యవస్తువు ఏదో, అనిత్యవస్తువు ఏదో తెలుస్తుంది. ప్రపంచం అనిత్యం, ఈశ్వరుడు నిత్యం అని గ్రహిస్తాడు. అప్పుడు తను ఈ అనిత్య ప్రపంచం వెంట పరుగులు తీయటం ఆపి, తన జీవితాన్ని నిత్యఈశ్వరజ్ఞానం పొందటానికి వినియోగించాలి అని గ్రహిస్తాడు. ఆ విధంగా వివేకం వైరాగ్యానికి దారితీస్తుంది. వైరాగ్యం అంటే అనిత్య ప్రపంచంయొక్క తళుకుబెళుకులకు ఆకర్షింపబడక పోవటం.

**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే ।**
**సంప్రాప్తే సన్నిహితే కాలే న హి న హి రక్షతి డుకృఞ్కరణే ॥** – భజగోవిందం 1

ఓ మూఢుడా! గోవిందుని భజించు! సమయం ఆసన్నమయినప్పుడు, నువ్వు వల్లెవేస్తున్న వ్యాకరణసూత్రాలు నిన్ను రక్షించవు.

ఇదే భావనను మనుస్మృతిలో కూడా చూస్తాము.

**మృతం శరీంముత్సృజ్య కాష్ఠలోష్టసమం క్షితౌ।**
**విముఖా బాంధవా యాంతి ధర్మస్తమ్ అనుగచ్ఛతి॥**

ఒక సూదిముక్కని కూడా నీవెంట తీసుకువెళ్ళలేవు. ఇది పదేపదే వింటే నిత్యానిత్య వస్తువివేకం కలిగి, వైరాగ్యం పెరుగుతుంది. వైరాగ్యం అంటే రాగద్వేషాలు రెండింటినీ అధిగమించటం. దేన్నీ కోరకపోవటం, దేన్నీ ద్వేషించకపోవటం పరిణతి చెందిన నిష్కామ భక్తిలోకి వస్తుంది. దీన్నే ముముక్షుత్వం అంటారని చూశాము. నిష్కామభక్తిని స్తుతిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

వేరే లక్ష్యం గురించి ఆలోచించకుండా, నిష్కామభక్తితో ఎవరైతే నిరంతరం నన్ను పూజిస్తారో వారి యోగక్షేమాలను నేనే చూసుకుంటాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇక్కడొక ప్రాథమిక సందేహం కలుగవచ్చు. నేను నా భక్తిని నిష్కామభక్తిగా మలుచుకుని, అంతకంతకూ భగవంతుని చింతలోనే కాలం గడిపి, ఆధ్యాత్మికంగానే జీవితం గడుపుతూ వస్తే, నా లౌకిక విజయాలను ఎవరు చూసుకుంటారు? నాకు భద్రత ఎలా కలుగుతుంది? ఎవరైతే ఆధ్యాత్మిక చింతనతోనే కాలం గడుపుతారో వారిని నేనే రక్షిస్తాను అంటున్నాడు.

**అనన్యాశ్చింతయంతో మామ్** – అనన్యాః అంటే తక్కిన లక్ష్యాలను, ఆధ్యాత్మిక లక్ష్యాలకన్నా తక్కువస్థాయిలో చూడటం. భగవంతుని ద్వారా లౌకిక విజయాలు పొందటానికి చూడకూడదు. అది సకామభక్తి అవుతుంది. సకామభక్తిలో భగవంతుడు మార్గం, లౌకిక విజయాలు లక్ష్యం; దానికి భిన్నంగా ప్రపంచాన్ని మార్గంగా, భగవంతుణ్ణి లక్ష్యంగా చూడాలి. అది నిష్కామభక్తి అవుతుంది. అనన్యాశ్చింతయంతో అంటే ఈ రెండవమార్గం పాటించేవారు,

**యోగక్షేమం వహామ్యహమ్** – వారి యోగక్షేమాలను నేనే చూస్తాను. వారి జీవితంలో కావాల్సిన ప్రాథమిక అవసరాలను కూడా భగవంతుడే చూస్తాడు.

అయినా సందేహం తీరదు. భగవంతుడు చూస్తాడని ఏమిటి నమ్మకం? ఒకపక్క భగవంతుని మీద భారం వేసి, ఇటు సకామభక్తినీ వదిలేసి, అటు భగవంతుడూ సహాయం చేయకపోతే

మన పరిస్థితి ఏమిటి? అందువల్ల 'ముందు భగవంతుడు మన యోగక్షేమాలు చూడనీ, అప్పుడు నేను సకామభక్తిని వదిలేస్తాను,' అంటారు మీరు. 'మీరు ముందు సకామభక్తిని వదిలేయండి, నేను మీ యోగక్షేమాలు చూస్తాను,' అంటాడు భగవంతుడు. ఎక్కడ మొదలుపెట్టాలి? అంత ప్రగాఢమైన భక్తి పెంచుకోవటం చాలా కష్టం.

**యోగక్షేమం వహామ్యహమ్** ఒక అర్థం 'నామీద నమ్మకం పెట్టుకోండి, మీకు ప్రాథమికమైన వస్తువులనీ నేనే ఇస్తాను.' ఇంకొకటి నువ్వు కోరుతున్న భద్రతాభావనను కూడా నేనే ఇస్తాను. మనం చూస్తూనే ఉన్నాము, బాహ్యవస్తువులనుంచి భద్రత రాదు. మనం పొందే వస్తువులకే భద్రతలేదు. మనం ఆధారపడే మనుష్యులకే భద్రతలేదు. వాటికే భద్రతలేని వస్తువులు మనకేం భద్రతను ఇవ్వగలవు? ఏదైతే మనకు భద్రతను ఇస్తుందనుకుంటామో, అదే మన అభద్రతాభావనకు కారణం అవవచ్చు. బాగా పెద్ద హోదాలోకి వెళ్ళి, చాలా ధనం సంపాదించి, పెద్ద ఇల్లు కొనుక్కుంటే భద్రత ఉంటుంది అనుకుంటాము. కాని ఐశ్వర్యం ఎక్కువైనకొద్దీ అభద్రతా భావన కూడా పెరుగుతూ వస్తుంది.

అందువల్ల భద్రత గానీ, అభద్రత గానీ వస్తువుల్లో లేవు; మన భావనలో ఉన్నాయి అనేది అర్థం చేసుకోవాలి. భద్రతాభావన పెంచుకున్న వ్యక్తి తనకు బాహ్యంగా వస్తువులు ఉన్నా, లేకపోయినా భద్రతను పొందుతాడు. దానికి భిన్నంగా అభద్రతాభావనకు లోనయ్యే వ్యక్తి తనకు ఎన్ని హంగులు ఉన్నా, అభద్రతా భావనకే లోనవుతాడు. యోగక్షేమాలు అంటే భగవంతుడు ప్రాపంచిక వస్తువులు పంపిస్తాడని కాదు అర్థం. యోగక్షేమాలు అంటే భద్రతాభావనను కలుగజేస్తాడు. 'భగవంతుడు నన్ను ఎప్పుడూ కాపాడుతాడు,' అనే నిశ్చింత కలుగజేస్తాడు.

**ఆకర్ణపూర్ణధన్వానౌ రక్షేతాం రామలక్ష్మణౌ** – రామస్తోత్రం
**వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ ।**
**శ్రీమన్నారాయణో విష్ణుః వాసుదేవోఽభిరక్షతు** – విష్ణుసహస్రనామమ్

భగవంతుడు చూసుకుంటాడు నన్ను. ఆ నమ్మకం మనకు ఉంటే ఎప్పటికీ రక్షణ ఉంటుంది. ఆ శ్రద్ధ, భక్తి లేకపోతే బయటకు వెళ్ళి, క్షేమంగా ఇంటికి తిరిగిరావటం కూడా పెద్ద లీలే! ఎటునుంచి ఏ వాహనం దూసుకువచ్చి గుద్దేస్తుందో తెలియదు.

నిజానికి, బయటకు వెళ్ళి, క్షేమంగా ఇంటికి తిరిగివచ్చాక, భగవంతునికి నమస్కారం చేయాలి. మన భద్రతకు హాని ఎటునుంచి వస్తుందో తెలియదు. అందువల్ల భగవంతుడు మీ యోగక్షేమాలు నేనే చూస్తాను అంటే భగవంతునిమీద భారం వేసిన భక్తుడు ఉన్నదానితోనే భద్రత పొందుతాడు. భగవంతుడే ఇస్తాడు – కావాల్సిన భద్రతాభావనను. ఇది నిష్కామభక్తి యొక్క ఒక గొప్పతనం.

కుచేలుడు ఎన్నడూ నోరు తెరిచి ఏదీ అడగలేదు. భగవంతుడు తనకు అండగా ఉన్నాడు, అదే చాలు అనుకున్నాడు. త్యాగరాజు కూడా రాజు తనకు ఎంత సంపద ఇస్తానన్నా లొంగలేదు.

నిధి చాలా సుఖమా, రాముని సన్నిధి చాలా సుఖమా అన్నాడు. తక్కువేమి మనకూ రాముండొక్కడుండువరకూ అన్నాడు. అతనికి ఆ భద్రత ఎక్కడ్నుంచి వచ్చింది? రాముని నుంచి వచ్చింది. నిష్కామభక్తిలో ఈ **భద్రతాభావన** వస్తుంది.

**ఆంక్షలు లేవు** – నిష్కామభక్తిలో నియమ నిబంధనలు లేవు, ఆంక్షలు లేవు. సకామభక్తిలోనే వంద ఆంక్షలు; నిష్కామభక్తిలో ఏ ఆంక్షలూ లేవు.

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః ॥** – 9.26

పత్రం, పుష్పం, ఫలం, జలం – వీటిలో ఏదైనా నిష్కామభక్తుడు నాకు భక్తిగా అర్పిస్తే, వాటిని నేను ప్రీతితో ఆరగిస్తాను.

సకామపూజ అయితే దానికి అనేక నియమనిబంధనలు ఉంటాయి. మనం ఎన్నుకున్న పూజ ఎప్పుడు చేయాలి, ఎక్కడ చేయాలి, ఎలా చేయాలి, ఏ దేవతకు పూజచేయాలి, ఏ నైవేద్యం పెట్టాలి, ఏ రంగు దుస్తులు వేసుకోవాలి, ఎంతమంది ఋత్విక్కులు ఉండాలి, వారికి ఎంత దక్షిణ ఇవ్వాలి విషయాలలో అనేక ఆంక్షలు ఉంటాయి. సకామభక్తిలో ఒక చిన్న నియమాన్ని అతిక్రమించినా, ఆశించిన ఫలం రాదు. అన్ని నియమాలు ఉల్లంఘించకుండా పాటించటం చాలా కష్టం. కాని నిష్కామభక్తిలో ఏ నియమాలూ లేవు.

**మార్గావర్తితపాదుకా పశుపతేరంగస్య కూర్చాయతే**
**గణ్డూషామ్బునిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే ।**
**కించిద్భక్షితమాంసశేషకబలం నవ్యోపహారాయతే**
**భక్తిః కిం న కరోత్యహో వనచరో భక్తావతంసాయతే ॥** – శివానంద లహరి 63

వాడి పాడయిపోయిన చెప్పులు పశుపతి నుదుటిని తాకాయి; నోటిలో నింపి తీసుకువచ్చిన నీరు త్రిపురాసురుణ్ణి చంపిన భగవంతునికి అభిషేకం చేసింది; ఎంగిలిచేసి పెట్టిన మాంసం ముక్క నైవేద్యం అయింది. భక్తి చూపే ఆశ్చర్యాలకు అంతులేదు కదా! క్రూరడైన వేటగాడు, శ్రేష్ఠమైన భక్తుడయ్యాడు.

ఇది చాలా అద్భుతమైన శ్లోకం. భక్తకన్నప్పను కీర్తిస్తుంది ఈ శ్లోకం. కన్నప్ప తన భక్తిలో ఏ నియమాన్ని పాటించాడు? మనం నోట్లో వేలు పెట్టుకుంటేనే, ఎంగిలి అయింది అని వేలును కడుక్కుంటాము కదా! కన్నప్ప ఏం చేశాడు? తన నోటినిండా నీరు నింపుకువచ్చి,

ఆ నీరును శివలింగంమీద ఉమ్మాడు భక్తితో. అభిషేకపాత్ర వేరే లేకపోవటంతో అలా చేశాడు. తన చెప్పులను శివలింగంమీద పెట్టాడు. తను ఎంగిలి చేసిన మాంసంముక్కను పెట్టాడు. అతని ఈ చర్యలను తప్పుపట్టము. అతనిలోని భక్తిని చూస్తాము. గొప్ప భక్తునిగా కీర్తిస్తాము.

శబరిని, విదురునుని అలాగే కీర్తిస్తాము. ఈ కథల్లోని ప్రగాఢమైన భక్తిని చూడాలి కాని, అదుగో, వారు నియమనిబంధనలు పాటించలేదు, నేను కూడా పాటించను అనకూడదు. వీటి ఉద్దేశ్యం నియమాలు పాటించాలనుకున్నా కూడా అన్నీ పాటించలేము. ఎంత దీక్షగా చేసినాకూడా, వీటిల్లో ఏదో ఒక లోపం రావచ్చు. అవి మంత్రలోపం, తంత్రలోపం, క్రియాలోపం, శక్తిలోపం, కాలలోపం, నియమలోపం, నైవేద్యాది విహితలోపం (వీటితో అక్షరలోపం కూడా కలుపుకోవాలి. ఒక్కో భాషలో ఒక్కో అక్షరం సరిగ్గా పలకదు. మంత్రలోపం పదాన్ని **లోభం** అంటారు కొందరు. లోభం అంటే దురాశ; లోపం అంటే తక్కువవటం). ఏది లోపించినా ఫర్వాలేదు, భక్తి ఉంటే చాలు. భగవంతునికి మీ భక్తి తెలుసు.

అందువల్లనే పత్రం, పుష్పం, ఫలం, తోయమ్, ఏదిచ్చినా చాలు అంటున్నాడు. కాని ఇక్కడ ఒక నియమం పాటించాలి. యో మే (నిష్కామ) భక్త్యా ప్రయచ్ఛతి – నిష్కామభక్తితో నాకు సమర్పించాలి అంటున్నాడు. ఈ పూజలు చేయటానికి కావాల్సిన హంగులు లేకపోతే, అంత వివరంగా చేయకపోయినా ఫర్వాలేదు. ప్రత్యేకంగా నైవేద్యం చేసే తీరిక లేకపోతే, మీరు తినేదేదైనా భక్తిగా సమర్పించవచ్చు. అదికూడా సరిగ్గా భగవంతుని ముందు తీసుకువెళ్ళి పెట్టలేకపోతే, సరిగ్గా తినేముందు 'భూర్భువః స్వః ...' అని చెప్పండి చాలు! అదృష్టం బాగుండి, భగవంతుడు మీలోనే ఉన్నాడు.

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః** – 15.14

నేను వైశ్వానర అగ్నిరూపంలో నీలోనే ఉన్నాను అంటున్నాడు. అందువల్ల మీలో ఉన్న భగవంతునికి నైవేద్యం పెట్టండి. అలా నైవేద్యం పెట్టి తింటే, అది కేవలం తినటంలోకి రాదు. చిన్న భావన మార్పుతో ఒక దైనందిన చర్య అయిన తినటం ప్రాణాగ్నిహోత్రమనే పూజగా మారుతుంది. ఈ విధమైన నిష్కామభక్తి పాటిస్తే, అది క్రమంగా జ్ఞానయోగ్యతకు, తద్వారా జ్ఞానానికి, జ్ఞానంవల్ల వచ్చే మోక్షానికీ దారితీస్తుంది.

**5. భక్తి స్తుతి శ్లోకాలు 30 – 34–** చివరిభాగంలో కృష్ణపరమాత్మ భక్తిని స్తుతిస్తున్నాడు. భక్తిని ఏ వయస్సులోనైనా మొదలుపెట్టవచ్చు. జ్ఞానానికి రావాలంటే కొన్ని సాధనలు అవసరం. కాని భక్తికి అలాంటి అధికారిత్వం అవసరం లేదు. భక్తిలోనే ఎన్నో దశలు ఉన్నాయి. ఆర్తభక్తితో మొదలుపెట్టవచ్చు; అర్థార్థీభక్తికి రావచ్చు. ఈ రెండూ సకామభక్తిలోకి వస్తాయి. ఫర్వాలేదు, నెమ్మదిగా అదే నిష్కామభక్తిగా మారుతుంది.

**శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః ।**
**సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ॥** – 9.28

నిష్కామభక్తితో పూజచేసిన భక్తుడు సమస్త కర్మలను నాకు అర్పిస్తే శుభఫలంనుంచి, అశుభఫలంనుంచి విముక్తుడు అవుతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఘోరమైన పాపి కూడా గొప్ప భక్తుడిగా మారవచ్చు.

**అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ ।**
**సాధురేవ స మంతవ్యః, సమ్యగ్వ్యవసితో హి సః ॥** – 9.30
**క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।**
**కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥** – 9.31

ఘోరమైన పాపాలు చేసిన వ్యక్తికూడా అనన్యభక్తితో నన్ను పూజిస్తే చాలు; అతన్ని సాధువుగా పరిగణించవచ్చు. ఎందుకంటే అతను యధార్థంగా నిశ్చయబుద్ధి కలవాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

సహాయంకోసం అర్థించే భక్తుడు అచిరకాలంలోనే ధర్మాత్ముడు అవుతాడు. జ్ఞానీభక్తుడయిన మరుక్షణమే, శాశ్వతమైన శాంతిని పొందుతాడు. నా భక్తుడెన్నడూ ఆధ్యాత్మికంగా కిందపడదు. కౌంతేయ ప్రతిజానీహి – అర్జునా! నేను ఇచ్చిన మాటను నమ్ము అని హామీ ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ.

అందువల్ల, అతను లౌకికంగా ఎటువంటివాడైనా సరే, నిష్కామభక్తితో భగవంతుణ్ణి పూజిస్తే, అతను చిత్తశుద్ధి పొంది, జ్ఞానలక్షణభక్తికి వచ్చి, జ్ఞానం పొంది, శాశ్వతమైన శాంతిని అంటే మోక్షాన్ని పొందుతాడు.

తొమ్మిదవ అధ్యాయం సారాంశం టూకీగా చూస్తే –

| | |
|---|---|
| నిర్గుణ ఈశ్వర స్వరూపం | = సృష్టి స్థితి లయ కారణమ్, అసంగమ్, అకర్తా అభోక్తా, మిథ్యాజగదధిష్ఠానమ్. |
| సాధనరూపభక్తి | = కర్మరూపభక్తి → ఉపాసనరూపభక్తి → జ్ఞానరూపభక్తి |
| భావనరూపభక్తి | = సకామభక్తి → నిష్కామభక్తి |
| భక్తి స్తుతి | = శాశ్వతమైన శాంతి లేదా మోక్షం. |

# విభూతియోగము

## అధ్యాయము 10

అధ్యాయము పదిని విభూతియోగము అంటారు. ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మే స్వయంగా తన బోధను మొదలుపెడతాడు. ఈ అధ్యాయంలో మొదటిభాగంలో ఈశ్వరస్వరూపాన్ని పరిచయం చేసి, రెండవభాగంలో విభూతులను వివరిస్తున్నాడు.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా రెండు అంశాలుగా విభజించ వచ్చు. అవి –

1. ఈశ్వరస్వరూప జ్ఞానం : శ్లోకాలు 1–11
2. ఈశ్వరవిభూతి జ్ఞానం : శ్లోకాలు 12–42

**1. ఈశ్వరస్వరూప జ్ఞానం శ్లోకాలు 1–11** ఇంతకుముందు మూడు అధ్యాయాల్లో, ముఖ్యంగా ఏడు, తొమ్మిది అధ్యాయాల్లో కృష్ణపరమాత్మ ఈశ్వరుణ్ణి జగత్ కారణంగా అభివర్ణించాడు. అంటే భగవంతుడు సృష్టికర్త. సృష్టి గురించి మాట్లాడగానే దేనికైనా రెండు కారణాలు ఉంటాయి. అవి నిమిత్తకారణం, ఉపాదానకారణం.

**ఉపాదానకారణం** – ఏదైనా ఒక వస్తువును తయారు చేయాలంటే దానికి ముడిసరుకు కావాలి. కుండకు ముడిసరుకు మట్టి. ఆభరణానికి ముడిసరుకు బంగారం. ఈ ముడిసరుకును ఉపాదానకారణం అంటారు. దీన్ని మెటీరియల్‌కాజ్ అంటారు.

**నిమిత్తకారణం** – ఒక వస్తువును తయారుచేయాలంటే దానికి తెలివితేటలు, ప్రజ్ఞ ఉన్న వ్యక్తి కావాలి. మట్టి దానంతట అది కుండ అయిపోదు; బంగారం దానంతట అది ఆభరణమైపోదు. దాన్ని ఒక ఆకారంలో తీర్చిదిద్దే వ్యక్తిని నిమిత్తకారణం అంటారు. కుండకు కుమ్మరి నిమిత్తకారణం; ఆభరణానికి కంసాలి నిమిత్తకారణం. దీన్నే ఇంటిలిజెంట్‌కాజ్ అంటారు.

ఇప్పుడు ఒక వస్తువు సృష్టికి ఉపాదానకారణం వేరు, నిమిత్తకారణం వేరు. జగత్తు సృష్టి వచ్చేసరికి ఉపనిషత్తులు భగవంతుడు సృష్టికర్త అంటున్నాయి. సృష్టికి ముందు భగవంతుడు ఒక్కడే ఉన్నాడు అని కూడా చెబుతాయి. దేశం, కాలం సృష్టితోపాటు వచ్చాయి. అందువల్ల సృష్టికి ముందు భగవంతుడు మాత్రమే ఉన్నాడు.

సృష్టికి ముందు భగవంతుడు మాత్రమే ఉంటే, ఆయన నిమిత్తకారణమా, ఉపాదాన కారణమా? నిమిత్తకారణం అంటే ఉపాదాన కారణం ఏది? ఉపాదానకారణం అంటే నిమిత్తకారణం ఎవరు? భగవంతుడు ఒక్కడే ఉన్నాడు కాబట్టి ఆయనే అటు నిమిత్తకారణం, ఇటు ఉపాదానకారణం కూడా అంటాయి ఉపనిషత్తులు.

నిమిత్తకారణంగా జగత్తును సృష్టించాడు; ఉపాదానకారణంగా తానే జగత్తు అయ్యాడు.

కాని మన అనుభవం ఒప్పుకోదు. మనం చూసే ప్రతివస్తువు సృష్టి వెనకా నిమిత్త కారణం వేరు, ఉపాదానకారణం వేరు. కుండ విషయం తీసుకుంటే కుమ్మరి వేరు, మట్టి వేరు. ఆభరణం విషయం తీసుకుంటే కంసాలి వేరు, బంగారం వేరు. కాని ప్రతి నియమానికి ఒక ఉల్లంఘన ఉంటుంది. ప్రతి ఉత్సర్గకు ఒక అపవాదం ఉంది అంటారు. మామూలుగా అయితే అందరూ ట్రాఫిక్ సిగ్నల్సును పాటించాలి. కాని ఆంబులెన్స్‌కు ఈ నియమం వర్తించదు. అలాగే సాలెపురుగు ఈ నియమానికి ఉల్లంఘన.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ ...** ముండకమ్ 1.1.7

సాలెపురుగు తనలోంచే ముడిసరుకు తీసుకుని, తనే అద్భుతంగా సాలెగూడును కడుతుంది.

**అభిన్న నిమిత్త ఉపాదాన కారణం** – అభిన్నం అంటే నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ భిన్నంగా లేవు. సాలెపురుగు గూడు అద్భుతాలలో ఒక అద్భుతం. ఒక మామూలు సాలెపురుగు అదే నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ అవగా లేనిది సర్వజ్ఞుడు, సర్వవిత్, సర్వశక్తివంతుడు అయిన భగవంతుడు అభిన్న నిమిత్త ఉపాదాన కారణం అవలేడా? అలా భగవంతుడు కూడా తనలోంచే ముడిసరుకు తీసుకుని జగత్తును సృష్టిస్తాడు. తనే అభిన్న నిమిత్త ఉపాదాన కారణమని కృష్ణపరమాత్మ ఈ అధ్యాయం మొదటిభాగంలో వర్ణిస్తాడు.

**మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవస్తథా ।**
**మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః ॥** – 10.6

సప్తఋషులు, వారికి ముందు నలుగురు మానసపుత్రులు, పద్నాలుగురు మనువులు, నా సంకల్పంనుంచి పుట్టారు. వీరినుంచి ఈ లోకంలో సమస్తప్రాణులూ పుట్టాయి.

కృష్ణపరమాత్మ 'మొత్తం సృష్టి నానుంచి వచ్చింది. నేను ఉపాదానకారణం, నిమిత్త కారణం కూడా,' అంటాడు. నిమిత్తకారణం గురించి చెప్పేటప్పుడు **సృష్టించాడు** పదం వాడతాము. కుమ్మరి కుండను సృష్టించాడు అన్నట్టుగా భగవంతుడు జగత్తును సృష్టించాడు అంటాము. అదే ఉపాదానకారణం విషయానికి వచ్చేసరికి మట్టి కుండగా **అయింది** అంటాము. అలాగే భగవంతుడు తానే జగత్తు **అయ్యాడు** అంటాము. మట్టి కుండను సృష్టించింది అనము. అదే విధంగా భగవంతుడు ఉపాదానకారణం అన్నప్పుడు జగత్తును సృష్టించాడు అనము; భగవంతుడు తానే జగత్తు అయ్యాడు అంటాము.

భగవంతుని గురించి చెప్పేటప్పుడు మొదటిదశలో భగవంతుడు జగత్తును సృష్టించాడు అంటుంది శాస్త్రం. ఈ స్థాయిని **ఏకరూప ఈశ్వరుడు** అంటారు. కొంతకాలం భగవంతుణ్ణి

ఆ స్థాయిలో కొలిచాక, భగవంతుడు సర్వవ్యాపకుడు అయితే, ఆయనే మొట్టమొదట ఉంటే, మరి ఈ సృష్టికి కావాల్సిన ముడిసరుకులు ఎక్కడనుంచి వచ్చాయి అనే ప్రశ్న ఉదయిస్తుంది. అప్పుడు శాస్త్రం రెండవస్థాయిని వివరిస్తుంది. భగవంతుడు తానే జగత్తు అయ్యాడు అంటుంది. దానికి వాడే పదం ఈశ్వరుడు. జగత్తుకు ఉపాదానకారణం ఈశ్వరుడు. ఈ స్థాయిని **అనేకరూప ఈశ్వరుడు** అంటారు. ముందు స్థాయిలో భగవంతుడు ఎక్కడో అలవైకుంఠపురంలో ఉన్నాడు అనుకుంటాము. కాని రెండవస్థాయిలో భగవంతుడు వేరు, జగత్తు వేరు కాదు.

మళ్ళీ ఒక ఉదాహరణ చూద్దాము. ఆభరణాలు చేతిలో పట్టుకుని, బంగారం ఎక్కడ ఉందని అడిగితే, ఏం చెప్పాలి? ఆభరణాలకేసి చూడకుండా, కళ్ళు మూసుకుని బంగారం మీద ధ్యానం చేయమని చెప్పాలా? 'బంగారం ఎక్కడ ఉంది?' అని వారు అడిగితే, 'ఆభరణంలో ఎక్కడ లేదు?' అని అడగాలి.

ఇది అర్థమయితే, భగవంతుణ్ణి తెలుసుకోవటానికి కళ్ళు మూసుకుని కూర్చోనవసరం లేదు. ప్రత్యేకమైన ప్రదేశాలకు వెళ్ళనవసరం లేదు. ఒంటికాలిమీద నిల్చుని ఘోరమైన తపస్సు చేయనవసరం లేదు. మీ దృక్పథాన్ని మార్చుకుంటే చాలు. ఆభరణానికి బంగారం ఉపాదానకారణంగా ఆభరణం అంతటా ఉంటుందని అర్థం చేసుకుంటే, బంగారంకోసం వెతకరు. ఎందుకంటే ఉపాదానకారణం కార్యం అంతటా ఉంటుంది. అదే విధంగా, భగవంతుడు ఈ జగత్తుకు ఉపాదానకారణం అని అర్థం చేసుకుంటే, భగవంతుడు జగత్తు అంతటా ఉంటాడని తెలుసుకుని, భగవంతునికోసం వెతకరు.

**2. ఈశ్వరవిభూతి జ్ఞానం శ్లోకాలు 12-42** ఈ జగత్తు ఈశ్వరునియొక్క ప్రకటితరూపం అని అర్థం చేసుకోవటమే విభూతియోగం. జగత్తులో కనిపించే విభూతులన్నీ భగవంతుని ప్రత్యేకదర్శనంగా అర్థం చేసుకోవాలి. ఆ విధంగా భగవంతుడు రెండురకాలుగా దర్శనమిస్తాడు. ఒకటి ఒక ఆకారరూపంలో ప్రత్యక్షమవటం, ఇంకొకటి ప్రత్యేకరూపంలో దర్శనమివ్వటం. భూతిః అంటే ప్రత్యక్షమవటం, కనిపించటం, తెలియటం. గొలుసు, బంగారంయొక్క భూతి; ఉంగరం, బంగారంయొక్క భూతి; కుర్చీ, చెక్కయొక్క భూతి; వస్త్రం, దారంయొక్క భూతి. అదే సూత్రం ప్రకారం ఈ సృష్టి మొత్తం భగవంతునియొక్క భూతి లేదా భావన.

ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ మొత్తం అన్ని ప్రకటితరూపాల గురించీ చెప్పడు; ప్రత్యేకించి కొన్ని విశేష ప్రకటితరూపాల గురించి చెబుతాడు. విశేష అంటే ప్రముఖమైనవి, ప్రత్యేకమైనవి, అసాధారణమైనవి. భూతి అంటే కనబడటం అని చూశాము. విభూతి (వి+భూతి) అంటే భగవంతునియొక్క విశేషమైన ప్రకటితరూపాలు. ఈ విశేష అంశాల గురించి చెప్పటంవల్ల, ఈ జగత్తులో ఏ విభూతిని చూసినా, భగవంతుణ్ణి గుర్తు తెచ్చుకుంటారు.

ఒక అందమైన భవనాన్ని చూస్తే, ఆ భవనం కట్టిన ఆర్కిటెక్ట్‌ను మెచ్చుకుంటారు; ఒక అందమైన అమ్మాయిని చూస్తే, ఆ అమ్మాయి తల్లిదండ్రులను మెచ్చుకుంటారు. అదే విధంగా జగత్తులో ఒక ప్రత్యేకమైన విభూతిని చూస్తే, భగవంతుణ్ణి ఆరాధించకుండా ఉండలేరు. అందువల్ల కృష్ణపరమాత్మ అటువంటి కొన్ని విభూతులను పేర్కొన్నాడు. ఇంకా కొన్ని విభూతులను వివరించమని అడుగుతున్నాడు అర్జునుడు.

**విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।**

**భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥** – 10.18

ఓ జనార్దనా! పరమాత్మవైన నీ యోగశక్తి గురించి, విభూతుల గురించి ఇంకా వివరంగా చెప్పు. ఎందుకంటే వాటి గురించి ఎంత విన్నా, నాకు తృప్తిగా లేదు అంటున్నాడు అర్జునుడు.

అర్జునుడు కృష్ణపరమాత్మయొక్క అన్ని విభూతుల గురించి అడిగాడు కాని, అన్నింటి గురించి చెప్పటం సాధ్యం కాదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే** – 10.19

ప్రధానమైన విభూతులు మాత్రమే చెబుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకో తనే కారణం కూడా చెబుతున్నాడు. నా విభూతులకు అంతం లేదు. నా విభూతులు విశ్వమంతా వ్యాపించి ఉన్నాయి.

విభూతి అసలు అర్థం వేరే ఉంది. విభూతి అంటే ఐశ్వర్యం అని ఒక అర్థం ఉంది. పవిత్రమైన బూడిద అని ఇంకో అర్థం ఉంది. వీటికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, విభూతి పిడకలనుంచి వస్తుంది; పిడకలు ఆవుపేడనుంచి వస్తాయి. ఆవు లక్ష్మీదేవికి నెలవు. లక్ష్మీదేవి ఐశ్వర్యానికి చిహ్నం. అందువల్ల లక్ష్యార్థం తీసుకుంటే విభూతి అంటే ఐశ్వర్యం.

రెండవ అర్థం, విభూతి అంటే పవిత్రమైన బూడిద. దేన్ని కాల్చినా, చివరికి మిగేలిది బూడిద మాత్రమే. మొత్తం కాలిపోయినప్పుడు ఏమంటాము? అంతా కాలి బూడిదైపోయింది అంటాము. అంటే అన్నీ కాలగా మిగిలేది బూడిద మాత్రమే. భగవంతుడు ఎవరు? ప్రళయంలో అన్నీ నశించిపోగా, మిగిలేది బ్రహ్మ మాత్రమే. అన్నీ కాలితే మిగిలేది బూడిద; అన్నీ లయమయితే మిగిలేది బ్రహ్మ. అందువల్ల బూడిద = బ్రహ్మ.

ప్రళయకారుడు అయిన మహేశ్వరుడు తన ఒంటినిండా విభూతి రాసుకునే ఉద్దేశ్యం ఇదే. అన్నీ నాశనమయ్యాక మిగిలేది చిటికెడు బూడిద మాత్రమే సుమా అని సూచించటానికి రాసుకుంటాడు. అందువల్ల విభూతి అంటే పవిత్రమైన బూడిద. కాని ఇక్కడ ఈ రెండు అర్థాలు – ఐశ్వర్యం, పవిత్రమైన బూడిద – కుదరవు. అధ్యాయం పదిలో విభూతి అంటే **భగవంతునియొక్క ప్రత్యేకమైన మహిమలు.**

కృష్ణపరమాత్మ అన్నింటినీ వివరించటం కుదరదు. ఎందుకంటే నా విభూతులకు అంతులేదు అన్నాడు. మనం కూడా ఇప్పుడు అన్నీ చూడబోవటం లేదు. కృష్ణపరమాత్మ చెప్పినవాటిల్లోంచి వేదాలకు సంబంధం ఉన్న విభూతులను మాత్రమే చూద్దాము.

1. **వేదాలలో సామవేదాన్ని నేను.**

**వేదానాం సామవేదోఽస్మి** – 10.22

వేదాలలో సామవేదాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. వేదాలే భగవంతుణ్ణుంచి వచ్చాయి. అందువల్లనే వేదాలను అపౌరుషేయం అంటారు. అంటే పురుషబుద్ధినుంచి రాలేదు. వేద అంటే జ్ఞానాన్ని ఇచ్చేది.

**విదంతి చతురః పురుషార్థాన్ అనేన ఇతి వేదః**

మనకు నాలుగు పురుషార్థాలను ఇచ్చింది వేదం. అవి ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థాలు. పురుషార్థాలను ఇవ్వటమే కాదు, వాటిని ఎలా పొందాలో కూడా బోధిస్తుంది వేదం. అందువల్ల దాన్ని వేదం అంటారు.

మనకు నాలుగు వేదాలు ఉన్నాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం. ఋగ్వేదంలో మంత్రాలు పద్యరూపంలో ఉంటాయి. యజుర్వేదంలో మంత్రాలు గద్యరూపంలో ఉంటాయి. సామవేదంలో గీతరూపంలో ఉంటాయి. వాటిని సంగీతంలా పాడటానికి అనువుగా ఉంటాయి.

**గీతారూపాః మంత్రాః సామమంత్రాః**

అథర్వణ వేదంలోని మంత్రాలను ప్రధానంగా అథర్వణ ఋషి, అంగిరస ఋషి అందుకొన్నారు. అందువల్ల అథర్వణ వేదాన్ని అథర్వాంగిరసవేదం అనికూడా అంటారు.

ఈ నాలుగు వేదాల్లో కృష్ణపరమాత్మ సామవేదాన్ని ఎందుకు ఎన్నుకున్నాడు అంటే సామవేదాన్ని గానం చేస్తారు కాబట్టి. సామగానం వీనులవిందుగా ఉంటుంది. ఏ గానమైనా కూడా మనస్సును ఆకట్టుకుని, ఆహ్లాదపరచి, విశ్రాంతి చేకూరుస్తుంది. అందువల్ల కృష్ణపరమాత్మ **వేదాలలో సామవేదాన్ని నేను** అంటున్నాడు.

2. **విద్యలలో ఆత్మవిద్యను నేను.**

**అధ్యాత్మవిద్యా విద్యానాం** – 10.32

విద్యలలో బ్రహ్మవిద్యను నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. వేదాలలోని బోధను ఆధారంగా చేసుకుని చెబుతున్నాడు ఈ అంశాన్ని. వేదాలను ప్రధానంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి వేదపూర్వభాగం, వేదాంతభాగం. వేదపూర్వభాగం లౌకిక విజయాలను ఎలా పొందాలో నేర్పిస్తుంది. మీరు ఆనందంగా, సుఖంగా ఉండటానికి ప్రపంచాన్ని మీకు అనుకూలంగా ఎలా మలుచుకోవాలో, బాహ్యంగా ఉన్న అంశాలను ఎలా మెరుగు పరచుకోవాలో

నేర్పిస్తుంది. అంటే మంచియిల్లు కొనుక్కోవటం, ఇంకా ఎక్కువ ధనసంపాదన చేయటం, పుత్రుని నడవడికను తీర్చిదిద్దటం, ఇలా మీ సుఖసౌఖ్యాలకోసం అనేక మార్గాల్లో ప్రయత్నించటం నేర్పిస్తుంది వేదపూర్వభాగం.

**పుత్రకామో యుంజీత, పశుకామో యుంజీత**

పుత్రులను ఎలా పొందాలి, పశువులను అంటే ఐశ్వర్యాన్ని ఎలా పొందాలి? వీటన్నిటికీ యజ్ఞయాగాదులు ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కర్మకాండ అనేక కర్మలను సూచిస్తుంది.

కాని వేదఅంతభాగానికి వచ్చేసరికి, ప్రపంచాన్ని మీకు కావాల్సినట్టుగా మలచుకోవటం అర్థంలేని పని అంటుంది. మీకున్న తక్కువ జ్ఞానంతో, మీకున్న తక్కువ పరిమితులతో ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నించటంవల్ల మీరు ఆశించిన ఆనందాన్ని పొందలేరు అంటుంది వేదాంతం. మీరు ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నించి, ప్రపంచాన్ని మార్చినా, అది ఎప్పటికీ ఒకేలా ఉండదు; మీ మనస్సు కూడా ఎప్పటికీ ఒకేలా ఉండదు. అందువల్ల ప్రపంచాన్ని మార్చాలనుకోవటం తెలివితక్కువ పని.

ప్రపంచాన్ని మీకు కావాల్సినట్టుగా సర్దటం కూడా కుదరదు. ఎందుకంటే ప్రపంచం మొత్తం సవికార ప్రపంచం లేదా అపరాప్రకృతి. దాని లక్షణమే నిరంతరం మార్పుచెందటం. అందువల్ల, వేదాంతం ప్రకారం మీరు మీక్కావాల్సిన ఆనందం పొందటానికి, మీకు తగ్గట్టుగా ప్రపంచాన్ని మార్చటం తెలివితక్కువ పని అంటుంది.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన**

– ముండకమ్ 1.2.12

లోకాన్ని బాగా పరీక్షించాక, కర్మలవల్ల శాశ్వతమైన ఫలితాన్ని పొందలేమని గ్రహించాక, బ్రాహ్మణుడు నిర్వేదం పొందుతాడు.

కర్మలవల్ల శాశ్వతమైన ఫలాన్ని పొందలేరు కాబట్టి, బాహ్యపరిస్థితులు ఎలా ఉన్నా తట్టుకునే స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥** – 2.56

**యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥** – 2.57

ఎవరి మనసైతే దుఃఖానికి కృంగిపోదో, ఎవరి మనసైతే సుఖానికి పొంగిపోదో, ఎవరైతే రాగం, భయం, క్రోధాలకు అతీతంగా ఉంటారో, అతనిని స్థితప్రజ్ఞుడు అంటారు.

ఎవరికైతే స్వార్థపూరితమైన కోరిక ఉండదో, ఎవరైతే అనుకూలపరిస్థితులకు పొంగిపోకుండా, ప్రతికూలపరిస్థితులకు కృంగిపోకుండా ఉంటారో, అతను జ్ఞానంలో స్థిరంగా నెలకొని ఉంటాడు.

పరిస్థితులు ఎప్పటికీ ఒక్కలాగే ఉండవు. కాని జ్ఞానికి ఎటువంటి పరిస్థితులు ఎదురైనా చలించని ఆత్మస్థైర్యం ఉంటుంది. మీరు దోవపొడుగునా ముళ్ళు, గులకరాళ్ళు, గాజుపెంకులు ఉన్న రోడ్డుమీద నడవాల్సివస్తే మీ కాళ్ళు గుచ్చుకుని, రక్తం కారే ప్రమాదం ఉంది. ఈ సమస్యను తప్పించుకోవాలంటే మీరు ఏంచేయాలి? మీకు రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి, మీరు ఆ మార్గాన్నంతా శుభ్రం చేసుకుంటూ రావటం. రెండవ మార్గం, ముందు దానికన్నా తక్కువ శ్రమతో, తక్కువ ఖర్చుతో కూడుకున్నదే కాక తెలివైన మార్గం. ఏమిటది? దోవనంతా శుభ్రం చేసుకుంటూ రాకుండా, మీ కాలికి మీరు చెప్పులు తొడుక్కోవటం. మీ పాదాలకు హాని కలుగకుండా, మీ పాదాలను సంరక్షించుకోవటం. మీ పాదాలను మీరు కప్పుకుంటే, మొత్తం భూమినే కప్పినంత పని చేసినట్టు అవుతుంది.

**సర్వత్ర సంపదస్తస్య సంతుష్టం యస్య మానసమ్**
**ఉపానగూఢపాదస్య నను చర్మావృతైవ భూః** – సూక్తిముక్తావళి 128.5

తెలివైన వ్యక్తి తన పాదాన్ని చెప్పులతో కప్పుకుంటే, మొత్తం భూమండలానికే తివాచీ పరిచినంత పని. మీ మనస్సు, మొత్తం జగత్తు, మనుష్యులు ఈ రోడ్డుతో సమానం. మీ మనస్సు ఎన్నో సందర్భాలలో ఎందరో మనుష్యులతో కలిసి, మెలసి ఉండాల్సివుంటుంది. అటువంటి మనస్సును మార్చాలనుకోవటం ఎంత అర్థంలేని పని! ఎంత అసాధ్యమైన పని! వేదాంతం ఆ అర్థంలేని పనిని మానేసి, మానసిక జోళ్ళను ధరించమంటుంది. మానసిక జోళ్ళు అంటే జ్ఞానం.

మానసిక జోళ్ళు వేసుకుంటే మనస్సుకు కవచం తొడిగినట్టే. ఏ పరిస్థితి ఎదురైనా మనస్సు చలించదు. ఈ విధంగా ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకునే జ్ఞానాన్ని ఆధ్యాత్మికవిద్యా లేదా ఆత్మవిద్య అంటారు.

బాహ్యప్రపంచాన్ని మీకు అనువుగా మార్చేలా నేర్పించే విద్యను అపరావిద్య అంటారు. అది వేదపూర్వభాగంలో వస్తుంది. బాహ్యప్రపంచానికి అనువుగా మీరు మారేలా నేర్పించే విద్యను పరావిద్య అంటారు. అంటే పరిస్థితులు ఎలా ఉన్నా, మీరు తట్టుకోగలిగే ఆత్మస్థైర్యాన్ని మీకు అందిస్తుంది వేదాంతం. దీన్ని అధ్యాత్మవిద్య అంటారు. అంటే మిమ్మల్ని మీరు మలుచుకోవటం. అది ఆత్మజ్ఞానం కలుగజేస్తుంది. అందువల్ల కృష్ణపరమాత్మ **విద్యలలో అధ్యాత్మవిద్యను నేను** అంటున్నాడు.

3. **యజ్ఞాలలో జపయజ్ఞం నేను.**

**యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి** – 10.25

యజ్ఞాలలో జపయజ్ఞం నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇది వైదికయజ్ఞంలోకి వస్తుంది. వేదాలలో అనేక సాధనలు, అనేక కర్మలు వస్తాయి. వాటిలో కొన్నింటిని కృష్ణపరమాత్మే అధ్యాయం నాలుగులో పేర్కొన్నాడు.

**ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే ।**
**స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥** – 4.28

**ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।**
**కర్మజాన్ విద్ధి తాన్ సర్వాన్ ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥** – 4.32

కొందరు ద్రవ్యయజ్ఞాలను, కొందరు తపోయజ్ఞాలను చేస్తే, మరికొందరు యోగయజ్ఞాలను చేస్తారు. మరికొంతమంది అహింసాది తీక్షణమైన వ్రతాలను చేపట్టి, స్వాధ్యాయ రూపజ్ఞానయజ్ఞాలను చేస్తారు.

ఈ విధంగా వేదాలలో అనేక యజ్ఞాలు చెప్పబడ్డాయి. వేదాలలో అనేక సాధనలు చెప్పబడ్డాయి అని చూశాము. ఈ ఆధ్యాత్మిక సాధనలన్నీ కూడా భగవంతునియొక్క ప్రకటితరూపలే. కాని ఈ యజ్ఞాలన్నింటిలోకి జపయజ్ఞం గొప్ప యజ్ఞం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

జపయజ్ఞం అంటే భగవంతుని నామాన్ని పదేపదే జపించటం. జపయజ్ఞం శ్రేష్ఠమైనది ఎందుకంటే, ఈ జపయజ్ఞాన్ని నాలుగు ఆశ్రమాలకు చెందినవారిలోనూ, నాలుగు వర్ణాలకు చెందినవారిలోనూ, ఎవ్వరైనా సరే వర్ణాశ్రమభేదం లేకుండా చేయవచ్చు. దానికి ఏమీ విభజనలు లేవు. కాని కొన్ని యజ్ఞాల విషయానికి వచ్చేసరికి కొంతమందే వాటిని చేయగలరు. బ్రాహ్మణులు చేసే కొన్ని యజ్ఞాలను క్షత్రియులు చేయలేరు; క్షత్రియులు చేసే కొన్ని యజ్ఞాలను బ్రాహ్మణులు చేయలేరు. అలాగే కొన్ని క్రతువులను పురుషులు మాత్రమే చేయాలి, స్త్రీలు చేయకూడదు. కాని అందరూ సమానంగా చేయగలిగిన యజ్ఞం, అదికూడా యజ్ఞోపవీతం కూడా లేకుండా, ఏదైనా ఉందంటే అది జపయజ్ఞం మాత్రమే.

జపయజ్ఞం విభూతి అందరికీ సమానంగా అందుబాటులో ఉండటం. అంతేకాదు, జపయజ్ఞం చేయటానికి ఏమీ ఖర్చు పెట్టనవసరం లేదు. అగ్నిప్రమేయం లేకుండా, ధన సహాయం కోరకుండా చేయగలిగిన సాధన ఏదైనా కావాలంటే, అది జపయజ్ఞం మాత్రమే. నిజానికి వాచికజపంకన్నా మానసజపం శ్రేష్ఠం. అదికాక, జపయజ్ఞంలో ఏ విధమైన హింసా ఉండదు. అందువల్ల యజ్ఞాలలో జపయజ్ఞం శ్రేష్ఠం.

**జకారో జన్మ విచ్ఛేదః పకారః పాపనాశనః**

**జన్మపాపహరో యస్మాత్ జప ఇతి ఉచ్యతే బుధైః**

ఇదీ జపంయొక్క నిర్వచనం. జప పదంలో రెండు అక్షరాలు ఉన్నాయి. అవి – జ,ప. జ అంటే జన్మవిచ్ఛేదః – అంటే జననమరణాల వృత్తి నుంచి తప్పిస్తుంది. ప అంటే పాపనాశనః– పాపాలను నశింపజేస్తుంది. జన్మపాప హరో యస్మాత్ – ఈ సాధన పాపాలన్నీ తొలగించి, తద్వారా సంసారచక్రానికి ముగింపు పలుకుతుంది. పాపాలలోకి అజ్ఞానం కూడా వస్తుంది. జప ఇతి ఉచ్యతే బుధైః – కాబట్టి దీన్ని మేధావులు జపం అంటారు.

ఇంతకీ జపం అంటే ఏమిటి? మంత్ర ఆవృత్తి. జపః. అంటే ఒక నామాన్ని తీసుకుని దాన్ని పదేపదే ఉచ్చరించటం. ఉదాహరణకు ఓం నమశ్శివాయ తీసుకుంటే, ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ అని ఉచ్చరించుకుంటూ పోవటం. ఆ విధంగా జపయజ్ఞం శ్రేష్ఠం. అందువల్ల కృష్ణపరమాత్మ **యజ్ఞాలలో జపయజ్ఞం నేను** అంటున్నాడు.

4. **ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును నేను.**

**గాయత్రీ ఛందసామహమ్** – 10.35

ఛందస్సులలో గాయత్రీ ఛందస్సును నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నాలుగు వేదాలలో అనేక మంత్రాలు ఉన్నాయి. వేదాలు సాక్షాత్తూ పరమాత్మనుంచే వచ్చాయి కాబట్టి, అవన్నీ కూడా శ్రేష్ఠమైనవే. కాని శ్రేష్ఠమైనవాటిల్లో శ్రేష్ఠమైన మంత్రం గాయత్రీమంత్రం. గాయత్రీమంత్రంయొక్క ప్రత్యేకత గురించి శాస్త్రాల్లో అనేకచోట్ల చూస్తాము.

గాయత్రీమంత్రాన్ని ఉపనయనం చేసేటప్పుడు ప్రతిద్విజునికి బోధిస్తారు. గాయత్రీ మంత్రం జపిస్తే, మొత్తం వేదాలను జపిస్తున్నట్టు అర్థం.

**ఆయాతు వరదాదేవి అక్షరం బ్రహ్మ సంహితమ్**

బ్రహ్మ సంహితంలో బ్రహ్మ అంటే వేదాలు; సంహితం అంటే వేదాలకు సమానమైనది. అందువల్ల గాయత్రీజపం చేస్తే ఒక్కటి కాదు, మూడు వేదాల పారాయణం చేసినంత ఫలం వస్తుంది. గాయత్రీమంత్రం ఇది –

**తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్**

జపం చేయటానికి వీలుగా ఓం భూర్భువస్సువః కలుపుతారు. ఇందులో మూడు పాదాలు ఉన్నాయి. పాదం అంటే ఆ మంత్రంలోని మూడవ భాగం. మూడు పాదాలు మూడు వేదాలసారం.

ఒకసారి బ్రహ్మదేవుడు వేదసారంకోసం వేదాలను చిలికాడట.

**త్రిభ్య ఏవ తు వేదేభ్యః పాదం పాదమదూదుహత్**
**తదృర్చోఽస్యాః సావిత్ర్యాః పరమేష్ఠీ ప్రజాపతిః** – మను 2.77

పరమేష్ఠీ ప్రజాపతిః అంటే బ్రహ్మదేవుడు. బ్రహ్మదేవుడు మూడు వేదాలను తీసుకున్నాడు. అథర్వణవేదం ఎక్కువగా రాదు. ఎందుకంటే అది ఎక్కువగా లౌకిక విషయాల గురించి బోధిస్తుంది. తక్కిన మూడు వేదాల్లో యజ్ఞయాగాదులు, కర్మకాండ వస్తాయి. మూడు వేదాలసారంగా, గాయత్రీమంత్రంలో మూడు పాదాలు వచ్చాయి.

**ఋగ్వేద సారం – తత్సవితుర్వరేణ్యం**
**యజుర్వేద సారం – భర్గో దేవస్య ధీమహి**
**సామవేద సారం – ధియో యో నః ప్రచోదయాత్**

అలా ఒక్కొక్క పాదంగా వచ్చింది.

అహం ఋగ్ శాఖాధ్యాయీ అంటే ఋగ్వేదం అధ్యయనం చేశానని అర్థం.

అహం యజుశ్శాఖాధ్యాయీ అంటే యజుర్వేదం అధ్యయనం చేశానని అర్థం.

అహం సామ శాఖాధ్యాయీ అంటే సామవేదం అధ్యయనం చేశానని అర్థం.

కలియుగంలో మనుష్యులకు ఇవన్నీ అధ్యయనం చేసే తీరిక ఉండదని తెలిసి, బ్రహ్మ వాటి అధ్యయనాన్ని తేలిక చేశాడు. గాయత్రీమంత్రం నేర్చుకుంటే అహం వేదత్రయాధ్యాయీ అని చెప్పవచ్చు. ఎందుకంటే గాయత్రీమంత్రం మూడు వేదాలసారం.

గాయత్రీమంత్ర జపం చేస్తే, జీవనవిధానం మెరుగుపడుతుంది. మామూలుగా మనం, మన జీవితాన్ని మనకు నచ్చినట్టుగా జీవించేస్తూ ఉంటాము. శాస్త్రం విధించే విధినిషేధాలను పాటించకుండా, ధర్మాధర్మాలను పట్టించుకోకుండా, మంచిచెడులకు తావివ్వకుండా నడిపే వ్యక్తిని ప్రాకృతపురుషుడు అంటారు. అంటే సంస్కారంలేని వ్యక్తి అని అర్థం. ఉదాహరణకు లేవగానే ఆకలివేసినా, స్నానపానాదులు గావించి, దైవపూజ చేశాక ఏదైనా తింటే నేను సంస్కృతపురుషుణ్ణి. అంటే నా ఇంద్రియాలమీద నాకు అధికారం ఉంది. అలాకాకుండా, వెంటనే తింటే నాకు, నా ఇంద్రియాలమీద అధికారం లేదు; నేను ప్రాకృతపురుషుణ్ణి అవుతాను.

అలా ఎన్నో సహజప్రవృత్తులు ఉంటాయి. వాటిని వాటి ఇష్టారాజ్యాలకు వదిలి వేయకుండా, శాస్త్రం చెప్పిన విధి, నిషేధాలకు అనుగుణంగా నా జీవితాన్ని మలుచుకోవాలి. అలా మలుచుకోగలిగితే, నేను ప్రాకృతపురుషుని స్థాయినుంచి సంస్కృతపురుషుని స్థాయికి ఎదుగుతాను.

అందువల్లనే ఒక బ్రహ్మచారికి గాయత్రీమంత్రోపదేశం చేసే కార్యక్రమాన్ని **బ్రహ్మోపదేశం** అంటారు. బ్రహ్మ అంటే వేదం.

**మాతురగ్రేధిజననం ద్వితీయం మౌంజిబంధనే**
**త్రితీయం యజ్ఞదీక్షాయాం ద్విజస్య శ్రుతిచోదనాత్**
**తత్ర యద్ బ్రహ్మ జన్మ అస్య మౌంజీబంధనచిహ్నితమ్**
**తత్రాస్య మాతా సావిత్రీ పితా తు ఆచార్య ఉచ్యతే** – మను 2.169, 170

రెండుసార్లు పుట్టిన వ్యక్తిని ద్విజుడు అంటారు. మొదటిసారి తల్లిగర్భంలోంచి పుడితే, రెండవసారి ఉపనయనం అయ్యాక పుడతాడు. అప్పుడు తల్లి సావిత్రి, తండ్రి ఆచార్యుడు.

**నాత్రోదకంసమం దానం న ద్వాదశ్యా పరం వ్రతమ్ ।**
**న గాయత్ర్యాః పరోమంత్రం న మాతుర్దైవతం పరమ్ ॥**

అన్న–ఉదక దానాలను మించిన దానం లేదు; ఏకాదశి వ్రతాన్ని మించిన వ్రతం లేదు; గాయత్రీమంత్రాన్ని మించిన మంత్రం లేదు. తల్లిని మించిన దైవం లేదు.

అందువల్ల గాయత్రీజపం చేసితీరాలి అంటున్నది శాస్త్రం. ఒకవేళ గాయత్రీజపం చేయకుండా వేరే ఏ సాధన చేసినాకూడా అది వృథాగా పోతుంది.

**గాయత్రీం యః పరిత్యజ్య అన్యం మంత్రమ్ ఉపాసతే ।**
**న వై సాఫల్యమాప్నోతి కల్పకోటిశతైరపి ॥**

గాయత్రీ మంత్రోపదేశం పొందిన వ్యక్తి, ఆ మంత్రాన్ని పఠించకుండా, వేరే ఎన్ని మంత్రాలు పఠించినా, కోటి మంత్రాలైనా కూడా, వాటి ఫలం కలగదు. అసలు గాయత్రీ మంత్రం ఉపదేశం పొందాక, వేరే మంత్రోపదేశం పొందనవసరం లేదు. ఆ ఒక్క మంత్రమే చాలు. అదే ఎదురుచూడని శక్తులను ఎదుర్కొని ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడుతుంది. అందువల్ల గాయత్రీమంత్రం శ్రేష్ఠమైన మంత్రం. (గాయత్రీమంత్రం ఉపదేశం పొందని వారు ఆదిత్యహృదయం చదువుకోవచ్చు.)

గాయత్రీ మంత్రసారం జీవాత్మ పరమాత్మ అభేదం. సమష్టిని సూచించే సూర్యునిలో ఉన్న చైతన్యం, వ్యష్టిని సూచించే నాలో ఉన్న చైతన్యం ఒకటే.

**స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః** – తైత్తిరీయమ్

పురుషునిలో ఉన్న చైతన్యం, ఆదిత్యునిలో ఉన్న చైతన్యం ఒకటే అని తైత్తిరీయోపనిషత్తులో వస్తుంది. అందువల్ల గాయత్రీమంత్రం మహావాక్యాన్ని సూచిస్తుంది. మహావాక్యం అంటే జీవాత్మ–పరమాత్మ ఐక్యబోధక వాక్యం. అందువల్ల కృష్ణపరమాత్మ **మంత్రాలలో నేను గాయత్రీమంత్రాన్ని** అంటున్నాడు.

5. **పదాలలో ఏకాక్షరం అయిన ఓంకారాన్ని నేను.**

**గిరామస్మ్యేకమక్షరమ్** – 10.25

శబ్దాలలో ఏకాక్షరమైన ఓంకారాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. వేదాలలో అనేక పదాలు ఉన్నాయి. వేదాలు సాక్షాత్తూ పరమాత్మనుంచి వచ్చాయి. కాబట్టి అన్ని పదాలూ శ్రేష్ఠమైనవే. అన్ని యజ్ఞాలూ శ్రేష్ఠమైనవే అయినా జపయజ్ఞం శ్రేష్ఠమైనట్టుగా, అన్ని పదాలూ శ్రేష్ఠమే అయినా, వాటిలో ఓం శ్రేష్ఠమైనది. ఏకాక్షరమైన ఓంకారం శ్రేష్ఠమైనది.

గాయత్రీమహిమ ఎంత ఉందో, అలాగే ఓంకార మహిమ కూడా అంత ఉంది. దాని గురించి చెబుతూపోతే, అది అనంతం అవుతుంది. అందులో కొన్ని ప్రత్యేకతలు చూద్దాము.

ఓంకారం ఏకాక్షరమే అయినా అది మొత్తం వేదాలసారం. ఇంతకుముందు వేదాలసారం గాయత్రీమంత్రం అని చూశాము. బ్రహ్మదేవుడు గాయత్రీమంత్రాన్నే మూడు వ్యాహృతుల కింద తగ్గించాడు.

**తత్సవితుర్వరేణ్యం సారం – భూః**
**భర్గో దేవస్య ధీమహి సారం – భువః**
**ధియో యో నః ప్రచోదయాత్ – సువః**

గాయత్రీ మంత్రసారం ఈ మూడు వ్యాహృతులు – భూః భువః సువః. ఈ మూడు వ్యాహృతులను కూడా జపించే తీరికలేని వారికోసం వాటిని ఇంకా ఏకాక్షరాలుగా కుదించాడు.

భూః – అ; భువః – ఉ; సువః – మ. వాటిని (అ+ఉ+మ) కలిపితే **ఓం** వస్తుంది. ఈ దశలన్నీ చూస్తే, మూడు వేదాలసారం ఓంకారం. అందువల్ల ఓంకారాన్ని జపిస్తేనే వేదాలను జపించినంత పుణ్యం వస్తుంది.

**యో వేదాదౌ స్వరః ప్రోక్తో వేదాంతే చ ప్రతిష్ఠితః ।**
**తస్య ప్రకృతిలీనస్య యః పరః స మహేశ్వరః ॥** – మహానారాయణోపనిషత్ 12.17

అందువల్లనే గాయత్రీమంత్రం పఠించేముందు ఓంతో మొదలుపెడతాము; మళ్ళీ ఓంతో ముగిస్తాము. అసలు గాయత్రీమంత్రం తత్సవితుర్వరేణ్యంతో మొదలవుతుంది. మనం జపం చేయటానికి వీలుగా ఓం భూర్భువః స్వః కలుపుతాం దానిముందు. దాన్ని గాయత్రి అని ఎందుకంటారంటే –

**గాతారం త్రాయతే యస్మాత్।**
**గాయత్రీ తేన గీయతే।**

గాయత్రిని జపించేవారిని ఆ మంత్రం రక్షిస్తుంది. అదేవిధంగా ఓంకారాన్ని జపించేవారిని కూడా ఓంకారం రక్షిస్తుంది. ఎందుకంటే, ఓంకారం 'అవ్' ధాతువునుంచి వస్తుంది. **అవతి రక్షతి ఇతి ఓమ్.**

**వేదాంత విశిష్ఠత** – అంతేకాదు, ఓంకారానికి ఇంకొక వేదాంత విశిష్ఠత కూడా ఉంది. అ అక్షరం జాగ్రత్ ప్రపంచాన్ని, ఉ అక్షరం స్వప్నప్రపంచాన్ని, మ అక్షరం సుషుప్తి ప్రపంచాన్ని సూచిస్తాయి. ఆ విధంగా, ఓంకారం ఈశ్వరునియొక్క విశ్వరూపానికి ప్రతీక. ఓంకారం మొత్తం సమష్టికి ప్రతీక కాబట్టి, అది పరమాత్మయొక్క అన్ని నామాలకూ చిహ్నం. రాముడు అంటే ఒక్క రామావతారానికే ప్రతీక. ఓంకారం మొత్తం భగవంతునియొక్క అన్ని నామాలకూ ప్రతీక. అందువల్ల కృష్ణపరమాత్మ పదాలలో నేను ఓంకారాన్ని అంటున్నాడు.

గిరమస్మ్యేకమక్షరమ్ అనటంలోనే ప్రత్యేకత ఉంది. ఏకం అంటే రెండవది లేనిది; అద్వైతం. పరమాత్మ కూడా అద్వైతం. ఓం పదం ఏకమ్ అక్షరమ్. అక్షరమ్ అంటే క్షరం లేనిది. బ్రహ్మకు క్షరం లేదు, ఓంకారానికి క్షరం లేదు. అందువల్ల ఓంకారం అంత శ్రేష్ఠమైనది. అందువల్ల కృష్ణపరమాత్మ **పదాలలో నేను ఓంకారాన్ని** అంటున్నాడు.

6. **అక్షరాలలో అకారాన్ని నేను.**

**అక్షరాణామకారోఽస్మి** – 10.33

అక్షరాలలో అకారాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. వేదాలలో అనేక అక్షరాలు ఉన్నాయి. ఉదాహరణకు అగ్ని పదం తీసుకుంటే అందులోని అక్షరాలు – అ+గ్+న+ఇ+ః. కాని 'అ'కారం చాలా ప్రాథమిక అక్షరం లేదా ప్రాథమిక శబ్దం. ఎందుకు? మనం నోరు తెరిచి గాలి వదిలితే 'అ' శబ్దం వస్తుంది. అది ఏ దేశస్థుడు నోరు తెరిచినా 'అ' శబ్దమే బయటకు వస్తుంది. అందువల్లనే పిల్లలు నోరు తెరవాలంటే, తల్లి 'ఏదమ్మా, అ అను,' అంటుంది కాని ఎ, ఇ, యు, ఐ, అనమనదు కదా! తక్కిన శబ్దాలన్నీ 'అ'యొక్క రూపాంతరాలే. ఒకటే మట్టిముద్దనుంచి అనేక ఆకారాలు వచ్చినట్టుగా, ఒకటే 'అ'కారం నుంచి అనేక శబ్దాలు వస్తాయి.

ఉదాహరణకు నోరు వెడల్పుగా తెరిచి, పళ్ళు చూపిస్తే 'ఈ' అవుతుంది. 'ఇ'కారం పలకాలంటే నోరు తెరిస్తే ముందు 'అ'కారం వస్తుంది. నోటిని కొంచెంగా తిప్పితే, 'ఇ'కారం వస్తుంది. అకారంలో చిన్నమార్పు 'ఇ'కారం అవుతుంది. 'అ' కారణ అక్షరం; తక్కిన అక్షరాలన్నీ కార్య అక్షరాలు. అంటే ఇది తక్కిన అక్షరాలకు ఉపాదానకారణం. వేదమే చెబుతున్నది ఈ విషయాన్ని. అక్షరాలను మనం అక్షరాలా సరస్వతీదేవిగా కొలుస్తాము. వర్ణమాలలోని అక్షరాల్లో, తెలుగులోనే కాదు, అనేక భారతీయ భాషల్లో మొదటి అక్షరం 'అ'. అందువల్ల శాస్త్రంలో **అకారః వై సర్వా వాక్** అంటారు. ఒక్కొక్క అక్షరానికీ ఒక అధిష్ఠాన

దేవత ఉంటుంది. 'అ'కారానికి అధిష్ఠానదేవత సాక్షాత్తూ సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే. అందువల్ల కృష్ణపరమాత్మ **అక్షరాలలో నేను 'అ'కారాన్ని** అంటున్నాడు.

భగవంతునియొక్క ప్రకటిత విభూతులలో ఉదాహరణకు కొన్ని, వేదపరంగా చూశాము. అవికాక, కృష్ణపరమాత్మ అనేకం పేర్కొన్నాడు. ఉదాహరణకు కృష్ణపరమాత్మ దేవతలలో నేను ఇంద్రుణ్ణి; ఋషులలో భృగుమహర్షిని; జంతువులలో సింహాన్ని; నదులలో గంగానదిని; పర్వతాలలో హిమాలయాన్ని; జలాలలో సముద్రాన్ని; వృక్షాలలో అశ్వత్థవృక్షాన్ని అన్నాడు. ఇలా చాలా అంశాలు పేర్కొన్నాక, ముక్తాయింపుగా ఇలా అన్నాడు.

**నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।**
**ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా ॥** – 10.40

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥** – 10.41

అర్జునా, నేను నా విభూతుల గురించి చెప్పటం ఆపానంటే, దానికి కారణం అవి అయిపోయాయని కాదు. ఎందుకంటే వాటికి అంతం లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నువ్వు స్వంతంగా ఒక పట్టికను తయారుచేసుకోవచ్చు అంటున్నాడు. ఏ వస్తువును చూస్తే నీకు అద్భుతంగా అనిపిస్తుందో, అది నా విభూతి అని గ్రహించు అంటున్నాడు.

అంతేకాదు, పాండవులలో నేను అర్జునుణ్ణి, కవులలో నేను వ్యాసుణ్ణి, వృష్ణులలో నేను కృష్ణుణ్ణి అంటున్నాడు. ఆ విధంగా ఏ వస్తువును చూస్తే నీకు అద్భుతంగా అనిపిస్తుందో, అది నీకు భగవంతుణ్ణి తలపింపజేయాలి అంటున్నాడు. ప్రకృతిలో ఎన్ని అందాలు ఉన్నాయి! ఏ అందాన్ని చూసినా దేవుని సృష్టి ఎంత అద్భుతం అనుకోకుండా ఉండలేము. అర్జునునితో ఈ విభూతులను ఆస్వాదించమంటున్నాడు కృష్ణపరమాత్మ.

# విశ్వరూపదర్శనయోగము

## అధ్యాయము 11

మన శాస్త్రం భగవంతుణ్ణి మూడు రూపాల్లో పరిచయం చేస్తుంది. మన మానసిక పరిపక్వతనుబట్టి ఆయా స్థాయిల్లో ఉన్న భగవంతుణ్ణి కొలుస్తాము. ఆ మూడు రూపాలు– ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు.

**ఏకరూప ఈశ్వరుడు** – మొదటిస్థాయి భక్తిలో భగవంతుణ్ణి ఒక వ్యక్తిగత దేవునిగా కొలుస్తాము. ఒక రూపం ఇచ్చి, ఆ రూపం వర్ణన ఇస్తాము.

**మేఘశ్యామం పీతకౌశేయవాసం శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగమ్।**

– విష్ణు సహస్రనామం

**శుద్ధస్ఫటికసంకాశం త్రినేత్రం పంచవక్త్రకమ్ ।**
**గంగాధరం దశభుజం సర్వాభరణభూషితమ్ ॥** – రుద్రం, ధ్యానశ్లోకాలు

**సింధూరార్ణవ విగ్రహాం త్రినయనాం మాణిక్యమౌళిస్ఫురత్।** – లలిత

ఈ విధంగా, ఈ దశలో భగవంతుణ్ణి ఒక ఆకారంలో కొలవటానికి ఇష్టపడతారు. దీన్ని ఇష్టదేవతా ప్రార్థన అంటారు. ఈ భక్తిని కూడా అంగీకరిస్తుంది శాస్త్రం. ఎందుకంటే దీని ద్వారా భక్తుడు జీవితంలో ఆధ్యాత్మికంగా ఎదుగుతాడు. నిజానికి ఈ భక్తి చాలా అవసరం కూడా. దైనందిన జీవితంలో మనం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటాము. మనస్సు విప్పి కష్టం, సుఖం చెప్పుకునేందుకు ఒక తోడు ఉంటే, అదే భాగ్యం అనుకుంటాము. ఆ తోడు ఎవరైనా కావచ్చు. తల్లి, తండ్రి, అన్న, భార్య, స్నేహితుడు – ఎవరైనా కావచ్చు. కాని చాలా సందర్భాలలో వీరెవరికీ తీరిక లేకపోవచ్చు. తల్లి అర్థం చేసుకోలేదు, తండ్రికి క్షణం తీరదు, అన్న సమస్యలు అన్నకున్నాయి, భార్యకు వినే తీరిక ఉండకపోవచ్చు, స్నేహితుడు అందుబాటులో ఉండడు.

మన కష్టం సుఖం చెప్పుకునే ఒక ఆత్మీయుడు మనుష్యులలో దొరకకపోతే, భగవంతునిలోనే వెతుక్కుంటాము. అలా దేవునికి మనస్సు విప్పి చెప్పుకోవాలంటే, దేవునికి ఒక నామం, రూపం ఉండాలి. రూపం లేకపోతే ఎవరికి చెప్పుకుంటాము? పురాణాల్లో ఇలా ఇష్టదేవతతో కబుర్లు కలబోసుకునే భక్తులనెందరినో చూస్తాము. అందువల్ల, మనకు కూడా ఒక ఇష్టదేవత కావాలి. ఇష్టదేవతను ప్రార్థించండి, తప్పులేదు. కాని అక్కడే ఆగిపోకండి, పైకి రండి అంటుంది శాస్త్రం.

**అనేకరూప ఈశ్వరుడు** – భగవంతునికి ఒక్క నామం, ఒక్క రూపానికే పరిమితి విధించకుండా, అంతటా చూడటం నేర్చుకోమంటుంది. మీ ఇష్టదేవతను తోటి మానవుల్లో,

జంతువుల్లో, చెట్టులో, పుట్టలో – అంతటా చూడమంటుంది. ఎప్పుడైతే భగవంతుణ్ణి ఇష్టదేవత స్థాయినుంచి సమష్టిరూప స్థాయికి చూడటానికి ఎదుగుతామో, అప్పుడే ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు అవుతాడు. ప్రతిసహస్రనామం భగవంతుణ్ణి ముందు ఏకరూప ఈశ్వరునిగా వర్ణించి, మళ్ళీ అనేకరూప ఈశ్వరునిగా వర్ణిస్తుంది. ఉదాహరణకు విష్ణుసహస్రనామం చూద్దాం.

**క్షీరోధన్వత్ప్రదేశేశుచిమణి విలసత్ సైకతే మౌక్తికానామ్।**

క్షీరసాగరంమీద పడుకున్న ఏకరూప ఈశ్వరుని వర్ణన ఇది. కాని వెంటనే రెండవ శ్లోకంలోనే విశ్వరూపదర్శనం వస్తుంది.

**భూః పాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్రసూర్యౌ చ నేత్రే।**
**కర్ణావాశాశ్శిరో ద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయమబ్ధిః।**
**అంతఃస్థం యస్య విశ్వం సురనరఖగగోభోగిగంధర్వదైత్యైః।**
**చిత్రం రం రమ్యతే తం త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి॥**

అలాగే రుద్రంలో కూడా ఏకరూప ఈశ్వర వర్ణన, అనేకరూప ఈశ్వర వర్ణన వస్తుంది.

**శుద్ధస్ఫటిక సంకాశం త్రినేత్రం పంచవక్త్రకమ్** – ఏకరూప వర్ణన
**పీఠం యస్య ధరిత్రీ జలధరం కలశం లింగమాకాశమూర్తిమ్।**
**నక్షత్రం పుష్పమాల్యం గ్రహగణకుసుమం చంద్రవహ్న్యర్క నేత్రమ్।**
**శుక్తి సప్తసముద్ర హిమగిరిశయనం సపాతాలపాదం**
**వేదం వక్త్రం షడంగ దశదిశివదనం దివ్యలింగం నమామి॥** – అనేకరూప వర్ణన

భాగవత పురాణం చదివితే, అనేక సందర్భాలలో కృష్ణపరమాత్మయొక్క విశ్వరూపదర్శనం వస్తుంది. అందువల్ల ఏకరూప ఈశ్వరభక్తిస్థాయినుంచి అనేకరూప ఈశ్వరభక్తిస్థాయికి ఎదగాలి. **అరూప ఈశ్వరుడు** – ఇంకా పైకి ఎదగాలి; అక్కడితో ఆగకూడదు అంటుంది అదే వేదం.

**ఏకరూపం వా అనేకరూపం వా ఇష్టదేవతా రూపం వా విశ్వరూపం వా భవతు**

ఏకరూపాన్ని కొలిచినా, అనేకరూపాన్ని కొలిచినా; ఇష్టదేవతని కొలిచినా, విశ్వరూపాన్ని కొలిచినా, అవి దేశం, కాలం పరిమితిలోకి వస్తాయి. ఎందుకంటే ఉనికి ఉన్న ఏదైనా దేశం, కాలం పరిమితిలోకి వస్తుంది. అంతేకాదు, రూపం ఉన్నదేదైనా వికారాలకు లోనవుతుంది. అందువల్ల ఏకరూప ఈశ్వరుడు అవనీ, అనేకరూప ఈశ్వరుడు అవనీ, ఆ రూపం దేశకాల పరిధిల్లోకి వస్తుంది. అందువల్ల రూపానికి అతీతంగా ఎదగాలి.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథారసం నిత్యమగంధవచ్చ యత్** – కఠ 1.3.15

బ్రహ్మ శబ్దస్పర్శరూపరసగంధాలకు అందదు. ఇది అరూప ఈశ్వరదర్శనం. ప్రతి ఒక్కరూ ఏకరూప ఈశ్వరభక్తితో మొదలుపెట్టి, అనేకరూప ఈశ్వరభక్తికి వచ్చి, చివరికి అరూప ఈశ్వరజ్ఞానం పొందాలి.

భగవద్గీతలో ఏకరూప ఈశ్వరభక్తి లేదా ఇష్టదేవతాభక్తి గురించి ఎక్కువగా ప్రస్తావన ఉండదు. ఎందుకంటే, గీత నేర్చుకునే మీరు ఆ స్థాయినుంచి ఎదిగారు అని కృష్ణపరమాత్మ భావిస్తున్నాడు. అందువల్ల భగవద్గీతలో రెండు, మూడు స్థాయిలను మాత్రమే – అంటే విశ్వరూపం, అరూపం మాత్రమే చూస్తాము. ఈ రెండు స్థాయిల గురించి బోధించటానికి కృష్ణపరమాత్మ ఏడు, తొమ్మిది అధ్యాయాలలో పునాది వేశాడు. వాటిల్లో భగవంతుడు ఉపాదానకారణంగా జగత్తంతటా ఉన్నాడని చూశాము. ఎలాగైతే బంగారం ఉపాదాన కారణంగా ఆభరణాలు అంతటా ఉంటుందో, ఎలాగైతే మట్టి ఉపాదానకారణంగా కుండలన్నింటిలోనూ ఉంటుందో, అలా ఒక్క ఈశ్వరుడు ఉపాదానకారణంగా ఈ జగత్తు అంతటా తానే ఉన్నాడు.

**సచ్చ త్యచ్చాభవత్। నిరుక్తం చానిరుక్తం చ। నిలయనం చానిలయనం చ। విజ్ఞానం చావిజ్ఞానం చ। సత్యం చానృతం చ సత్యమభవత్ । యదిదం కించ। తత్సత్యమిత్యాచక్షతే।**
– తైత్తిరీయమ్

ఆ భగవంతుడే సత్, అసత్ కూడా! ఆ భగవంతుడే మూర్తప్రపంచం, అమూర్త ప్రపంచం; రూపం ఉన్నది, రూపం లేనిదీ కూడా. ఆకాశం, వాయువు అసత్, అమూర్తం; జలం, అగ్ని, పృథివి సత్, మూర్తంలోకి వస్తాయి. అంటే ఆకాశం, వాయువులకు రూపం లేదు; తక్కినవాటికి రూపం ఉన్నాయి. అలాగే శరీరానికి రూపం ఉంది కాని మనస్సుకు రూపం లేదు. భగవంతుడు జగత్తు రూపంలో ప్రకటితమవుతున్నాడు.

ఈ సత్యాన్ని శాస్త్రంలో నేర్చుకుంటే, భగవంతుణ్ణి జగత్తు అంతటా చూడగలుగుతాము. అంతకుముందు, భగవంతుణ్ణి ప్రత్యేకించి కొన్ని ఆలయాల్లో, కొన్ని విగ్రహాల్లో, కొన్ని పూజాగదుల్లో మాత్రమే కొలిచేవారము. అంతకుముందు జగత్తులో కొన్నింటిలో భగవంతుణ్ణి చూస్తే, ఇప్పుడు భగవంతుడే జగత్తు **అయ్యాడు** అంటాము.

భగవంతుడే జగత్తు అయ్యాడు అనేటప్పుడు కూడా మనం రెండు దశలు దాటాలి అని భావిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే, మనం జగత్తును రెండు భాగాలుగా విభజించి చూస్తాము. ఇవి మంచివి, ఇవి చెడ్డవి అంటాము; ఇవి అందమైనవి, ఇవి భీకరమైనవి అంటాము; ఇవి మనకు మేలు చేస్తాయి, ఇవి మనకు హాని చేస్తాయి అంటాము. అలా జగత్తులో ఒక భాగాన్ని చెడుగా, భీకరమైనదిగా, కీడు చేసేదిగా విభజించినప్పుడు, ఆ భాగం కూడా భగవంతుడే అంటే జీర్ణించుకోవటం కష్టం.

ఆవును గోమాతగా పూజించటానికి వెనుకాడము కాని దోమనో, బొద్దింకనో భగవంతునిగా స్వీకరించటానికి మనస్సు అంగీకరించదు. అందువల్ల, కృష్ణపరమాత్మ అధ్యాయం పదిలో సృష్టిలో ఉన్న మంచి అంశాలనే తన విభూతులుగా ఎన్నుకున్నాడు. దాన్ని విభూతియోగములో చూశాము.

ఇప్పుడు అధ్యాయం పదకొండులో మంచి–చెడు, అందం–అందవికారం అన్నింటినీ భగవంతునిలో చూడాలి. అన్నింటినీ భగవంతునిగా చూడాలి అంటే, మానసిక పరిపక్వత చెందాలి. సృష్టిలో ప్రతిదీ అందమైనదే! దానివల్ల ఏదో ఒక ప్రయోజనం కూడా ఉన్నదే! ఆ విషయం మనం అర్థం చేసుకోలేక ఒక వస్తువును చెడ్డదానిగా ముద్రిస్తున్నాము. అంటే ఆ దోషం వస్తువులో లేదు, మన దృష్టిలో ఉంది.

వేదాంతం సృష్టిని ఈశ్వరసృష్టి, జీవసృష్టిగా విభజిస్తుంది. ఈశ్వరసృష్టి అంటే ఈశ్వరుడు సృష్టించిన జగత్తు. దాన్ని ఉన్నదున్నట్టుగా చూడాలి. కాని జీవుడు తన దృష్టిపరంగా ఈశ్వరసృష్టిని చూస్తున్నాడు. అందువల్ల జీవదృష్టి, జీవసృష్టిగా మారుతున్నది. ఈశ్వరసృష్టిని మనం రాగద్వేషాలనే దృష్టితో చూస్తున్నాము. అందువల్ల జగత్తులో కొన్ని వస్తువులు చెడుగా, అందవికారంగా, భయంకరంగా, ఎందుకూ పనికిరానివిగా కనిపిస్తున్నాయి.

ఇప్పుడు ఆ రాగద్వేషాలనే కళ్ళజోడు తీసిచూస్తే, ఈశ్వరసృష్టిని ఉన్నదున్నట్టుగా చూస్తాము. ఈశ్వరసృష్టిని సరిగ్గా అర్థం చేసుకుంటే, జగత్తులో ద్వంద్వాలు లేవు; అవి మిథునసృష్టి అని అర్థం చేసుకుంటాము. మిథునం అంటే జంట. ఆ జంట కలిస్తేనే అది పూర్ణం అవుతుంది. ఉదాహరణకు పగలు–రాత్రి కలిస్తేనే ఒకరోజు అవుతుంది. అవి భిన్న విషయాలు కావు. పగలునో, రాత్రినో తీసేసి చూద్దామంటే రోజు పూర్తవదు.

అంతేకాదు, నిజానికి ఏది మంచో, ఏది చెడో మనకే స్పష్టంగా తెలియదు. ఒక అంశం మంచిదా, కాదా అంటే మన కోణంలోంచే చూస్తాము. దీనికి ఒక ఉదాహరణ చూద్దాము. మీరు తిరుపతి క్యూలో వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవటానికి కొన్ని గంటలుగా వేచివున్నారు. అసలు క్యూ కొంచెం కూడా ముందుకు జరుగుతున్నట్టు అనిపించటం లేదు. మీకు చిరాకు వచ్చి, అక్కడ ఉన్న వాలంటీర్లకు ఫిర్యాదు చేస్తారు. బొత్తిగా లైను ముందు జరగటం లేదు అంటారు. అవి విన్న వాలంటీర్లు 'జరగండి, జరగండి,' అంటూ భక్తుల వేగం పెంచారు. మీరు త్వరగా వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవచ్చని మురిసిపోతారు. కాని అది ఎంతసేపు?

అదే వాలంటీర్లు మీరు దేవుని సన్నిధిలో నిల్చుని మనసారా ఆ దివ్యమంగళ స్వరూపం చూద్దామనుకునేసరికి 'జరగండి, జరగండి,' అని మిమ్మల్ని కూడా పక్కకి తోసేస్తారు.

క్షణంలో పదోవంతు సేపైనా దర్శనం కలగలేదు. ఇప్పుడు మీరు వాలంటీర్లమీద అరవగలరా? అంతకుముందు క్యూ వేగంగా కదలాలనుకున్న మీరే, ఇప్పుడు నిదానంగా కదిలితే బాగుండును అనుకుంటున్నారు. ఈ స్వార్థపూరితమైన మనస్సుతో చూస్తే విశ్వరూపాన్ని ఆనందించలేరు. మీ దృక్పథాన్ని విశాలం చేసుకోవాలి.

నేను ఐదు నిముషాలు దేవుని ముందు నిల్చోవాలి అనుకుంటే, తక్కినవారికి కూడా ఐదు నిముషాల సమయం ఇవ్వాలనే చిన్న ప్రకృతిసూత్రాన్ని అర్థం చేసుకోవాలి. ఏ ప్రకృతి సూత్రాన్నైనా ఇతరులకు మాత్రమే వర్తిస్తుంది, నాకు కాదు అనుకుంటే, అప్పుడు అది జీవదృష్టి అవుతుంది. అది సంసారానికి దారితీస్తుంది.

విశ్వరూపదర్శనం చేసుకోవాలంటే, ఈ జీవదృష్టిని వదులుకోవాలి; స్వార్థాన్ని మానాలి. హ్రస్వదృష్టి పోవాలి. వస్తువులను ఉన్నదున్నట్టుగా చూడాలి. అది పూర్ణత్వదృష్టిని ఇస్తుంది. అర్జునుడు ఆ పూర్ణత్వదృష్టిని కోరుకున్నాడు, అలాగే చూశాడు కూడా; కాని తరువాత తను దాన్ని ఆనందించే పరిపక్వతను పొందలేదు అనుకున్నాడు. కృష్ణపరమాత్మ విశ్వరూప దర్శనం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నా, దాన్ని ఆనందించి, ఆస్వాదించే పరిపక్వత అర్జునునికి లేదు. అందువల్ల అర్జునుడు, 'శాంతించు, నీ విశ్వరూపాన్ని విరమించు,' అని కోరుకున్నాడు. అర్జునుడు చూసిన విశ్వరూపదర్శనం మనం కూడా చూడబోతున్నాము ఈ అధ్యాయంలో. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగుపెడదాము.

పదకొండవ అధ్యాయాన్ని ప్రధానంగా ఏడు భాగాలుగా విభజించవచ్చు. అవి –

| | |
|---|---|
| 1. ఉపోద్ఘాతం | : శ్లోకాలు 1–14 |
| 2. విస్మయం లేదా ఆశ్చర్యం | : శ్లోకాలు 15–22 |
| 3. భయం | : శ్లోకాలు 23–30 |
| 4. అర్జునుని ప్రశ్న, కృష్ణపరమాత్మ జవాబు | : శ్లోకాలు 31–34 |
| 5. శరణాగతి లేదా భక్తి | : శ్లోకాలు 36–46 |
| 6. ఉపసంహారం | : శ్లోకాలు 47–55 |

**1. ఉపోద్ఘాతం : శ్లోకాలు 1–14** అర్జునుడు కృష్ణపరమాత్మతో ఇలా అంటున్నాడు.

**భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।**
**త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ ॥** – 11.2

**ఏవమేతద్యథాత్థ త్వమ్ ఆత్మానం పరమేశ్వర ।**
**ద్రష్టుమిచ్ఛామి తే రూపమ్ ఐశ్వరం పురుషోత్తమ ॥** – 11.3

ఓ కృష్ణా, నువ్వు ప్రాణులయొక్క సృష్టి, లయల గురించి వివరంగా చెప్పావు. అంతేకాదు! శాశ్వతమైన నీ మహిమలు గురించి కూడా విస్తారంగా చెప్పావు.

ఓ పరమేశ్వరా, ఓ పురుషోత్తమా, నువ్వు బోధిస్తున్నది నాకు చక్కగా అర్థమయింది. నాకు నీ విశ్వరూపం చూపించు అంటున్నాడు అర్జునుడు.

ఇంకో విధంగా చెప్పాలంటే, అర్జునుడు అంటున్నాడు, 'ఓ కృష్ణా! నువ్వు ఈ జగత్తు సృష్టికి ఉపాదానకారణం అని నాకు అర్థమయింది. నువ్వే సృష్టి, స్థితి, లయ కారకుడవు. అందువల్ల నువ్వే ఈ విశ్వంగా ప్రకటితమవుతున్నావు. బంగారం లేనిదే ఆభరణాలు లేనట్టుగా; నువ్వు లేనిదే ఈ సృష్టే లేదు. నువ్వే జగత్తు, జగత్తే నువ్వు. అది నాకు స్పష్టంగా అర్థమయింది. అంతేకాదు, జగత్తులో ఏ మహిమ ఉన్నా, ఆ మహిమలన్నీ కూడా నీకే చెందుతాయని అర్థమయింది.'

జగత్తులో ఉన్నదంతా ఈశ్వరుడే అయితే, నేను జగత్తులో ఈశ్వరుణ్ణి దర్శించాలి. కాని ఆ విశ్వరూపదర్శనం నేను చేయలేకపోతున్నాను. నాలో ఏదో లోపం ఉన్నట్టుంది. అందువల్ల, 'ఓ కృష్ణా! నేను నీ విశ్వరూపదర్శనం చేసేలాగా చేయి,' అంటున్నాడు.

**మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో ।**
**యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మానమవ్యయమ్ ॥** – 11.4

ఓ కృష్ణా! నీ దివ్యరూపాన్ని చూసే అర్హత నాకుందని నువ్వు భావిస్తే, అది నాకు చూపించు అంటున్నాడు అర్జునుడు.

ఇక్కడ యోగేశ్వర పదం వేశాడు అర్జునుడు. యోగీశ్వరుడు అంటే లీలలు చేయగల శక్తి ఉన్నవాడు. ఓ కృష్ణా! నీకున్న లీలను ఉపయోగించి, నా కళ్ళకు లేదా నా మనస్సుకు కప్పుకున్న పొరలను తాత్కాలికంగా తొలగించి, నాకు నీ విశ్వరూపదర్శనం చేయించు అంటున్నాడు.

**న తు మాం శక్యసే ద్రష్టుమ్ అనేనైవ స్వచక్షుషా ।**
**దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥** – 11.8

నా విశ్వరూపదర్శనం చేసుకోవటానికి నీకు నీ చర్మచక్షువులు సరిపోవు. అందువల్ల నీకు నేను దివ్యచక్షువులను ఇస్తాను. అప్పుడు నా దివ్యయోగశక్తిని చూస్తావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఆ విధంగా కృష్ణపరమాత్మ దివ్యచక్షువులను ప్రసాదిస్తే, దానితో అర్జునునికి విశ్వరూప దర్శనం అయింది. ఈ విశ్వరూపాన్ని ముందు సంజయుడు వర్ణిస్తాడు.

**అనేకవక్త్రనయనమ్ అనేకాద్భుతదర్శనమ్ ।**
**అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥** – 11.10

**దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్ ।**
**సర్వాశ్చర్యమయం దేవమ్ అనంతం విశ్వతోముఖమ్ ॥** – 11.11

అనేక నోళ్ళతో, అనేక కళ్ళతో కూడి, అనేక దివ్యాభరణాలు ధరించి, అనేక దివ్యాయుధాలను చేతబట్టి, దివ్యమైన మాలలను, వస్త్రాలను ధరించి, దివ్యపరిమళాలను దశదిశలా వ్యాపించజేస్తూ, సర్వాశ్చర్యకరమైనదీ, అనంతమైనదీ, అనేక ముఖాలతో కూడినదీ అయిన విశ్వరూప ఈశ్వరుడు అన్నింటికన్నా గొప్ప అద్భుతం.

ఇంత అద్భుతమైన విశ్వరూపాన్ని అర్జునుడు దర్శించాడు.

విశ్వరూపదర్శనం అవగానే సాధారణంగా భగవంతునికి వేలాది చేతులు, కాళ్ళు, మొహాలు, కళ్ళు, చెవులు ఉన్నట్టుగా వర్ణిస్తారు. ఇక్కడ మనం కొంచెం లోతుగా ఈ విశ్వరూపదర్శనం అంటే ఏమిటో విశ్లేషించాలి.

విశ్వరూపం అంటే ఒక ప్రత్యేకమైన ఆకారంలో కృష్ణపరమాత్మ అర్జునునికి దర్శనం ఇచ్చాడు అని అర్థం చేసుకుంటారు చాలామంది. కాని, నిజానికి లోతుగా విశ్లేషిస్తే, అటువంటి అర్థం సరిపోదని అర్థమవుతుంది. ముందు విశ్వరూపం అర్థం చూద్దాము.
**విశ్వం ఏవ రూపం యస్య సః విశ్వరూపః** – విశ్వం అంటే ప్రపంచం, జగత్తు. విశ్వరూపం అంటే జగత్తు రూపంలో ఉన్న ఈశ్వరుడు. జగత్తు ముందే ఉంది. మనముందు ఉన్నది ఈ జగత్తు, ఈ ప్రపంచం, ఈ విశ్వం. నిజానికి సృష్టి చేసేటప్పుడే, భగవంతుడు విశ్వరూపాన్ని చూపించాడు.

**సచ్చ త్యచ్చాభవత్। నిరుక్తం చానిరుక్తం చ।** – తైత్తిరీయమ్

భగవంతుడే ప్రకటితరూపంలో, అప్రకటితరూపంలో ఉన్నాడు; నిర్వచించగలిగిన దానిలో, నిర్వచించలేని దానిలో ఉన్నాడు.

**ఆకాశస్సంభూతః, ఆకాశాద్వాయుః** – తైత్తిరీయమ్

ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథివి – అన్నీ భగవంతునియొక్క విశ్వరూపాలు. భగవంతుడు విశ్వరూపాన్ని ఒక ప్రత్యేకమైన కాలంలో ప్రకటించడు. ఎందుకంటే అది సృష్టి జరిగినప్పటినుంచీ ఉంది. ఆ రూపం ప్రళయంలోనే పోతుంది. అందువల్ల విశ్వరూపం అంటే ప్రత్యక్షమై మాయమయ్యే, ఒక ప్రత్యేకమైన రూపంగా ఎన్నడూ భావించలేము. అలా భావిస్తే, అది విశ్వరూపం పదం అర్థానికి భిన్నంగా ఉంటుంది.

విశ్వరూపాన్ని వేదాలే వర్ణిస్తాయి. భగవద్గీతలోని ఏ విషయం గురించి సందేహం వచ్చినా, వేదాల్లో చూస్తే వాటి గురించిన స్పష్టత వస్తుందనే విషయం గుర్తుంచుకోవాలి.

విశ్వరూపదర్శనం గురించి ముండకోపనిషత్‌లో ఇలా వస్తుంది.

**అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః।**
**వాయుఃప్రాణో హృదయం విశ్వమస్య పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాంతరాత్మా॥**
– ముండకమ్ 2.1.4

నిశ్చయంగా, భగవంతుడు సర్వభూతాలకు అంతరాత్మగా ఉన్నాడు. అగ్ని ఆయన తల; సూర్యచంద్రులు నేత్రాలు; దిక్కులు చెవులు; వేదాలు ఆయన వాక్కు; వాయువు ఆయన ప్రాణం; విశ్వం ఆయన హృదయం; ఆయన పాదాలనుంచి పృథివి ఉద్భవించింది.

ఈ విధంగా భగవంతుడు విశ్వరూపంగా ఉంటే, భగవంతుడు ఇప్పుడు ఉన్నట్టా, లేనట్టా? వాయువు ఆయన ప్రాణం అయితే – **నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి** అని ప్రార్థించటం తెలివైన పని. విష్ణుసహస్రనామంలో కూడా **భూః పాదౌ** అని చూస్తాము. వీటి అర్థం విశ్వరూపం అన్నివేళలా, అందరికీ అందుబాటులో ఉంది. అంతేకాదు, కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు, 'పరాప్రకృతి, అపరాప్రకృతి రెండూ నేనే. నేనే విశ్వరూపంగా వచ్చాను.'

**మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ ।**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥** – 7.7

అందువల్ల విశ్వరూపం అంటే మన కళ్ళ ఎదురుగా, మన ముందు ఉన్న జగత్తు అని స్పష్టంగా తెలుస్తున్నది. విశ్వరూపదర్శనంకోసం మనం ఎక్కడికో విడిగా వెళ్ళనవసరం లేదు. భగవంతుడు కూడా విశ్వరూపాన్ని ప్రదర్శించటానికి ప్రత్యేకించి ఏమీ చేయనవసరం లేదు. అందువల్ల విశ్వరూపాన్ని ఇంకొక రూపంగా నిర్వచించకూడదు. ఒకవేళ విశ్వరూపాన్ని ఇంకొక రూపంగా అర్థం చేసుకుంటే, వేలాది చేతులు, కాళ్ళను ఎలా వివరిస్తారు? అటువంటి ఆకారాన్ని ఊహించలేరు.

ఇప్పుడొక సందేహం రావచ్చు. ఒకవేళ జగత్తుగా విశ్వరూపం మన కళ్ళముందు ఎప్పుడూ ఎదురుగా ఉంటే, అర్జునుడు విశ్వరూపదర్శనం ప్రసాదించమని ప్రత్యేకించి ఎందుకు కృష్ణపరమాత్మను అడిగాడు. కృష్ణపరమాత్మ కూడా నువ్వు మామూలు చక్షువులతో చూడలేవు, నీకు దివ్యచక్షువులను ఇస్తాను అని ఎందుకు అన్నాడు?

**న తు మాం శక్యసే ద్రష్టుమ్ అనేనైవ స్వచక్షుషా ।**
**దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥** – 11.8

మనం జగత్తును అనునిత్యం చూస్తున్నా, జగత్తు భగవంతునియొక్క దివ్యరూపం అనేది సత్యమే అయినా, మనకు జగత్తును విశ్వరూపంగా దర్శించేటంత దృక్పథం కాని, గౌరవం కాని లేదు. ఆలయంలో విగ్రహాన్ని భగవంతునిగా కొలిచినట్టుగా, జగత్తును భగవంతునిగా చూడలేకపోతున్నాము. ఒక విదేశీయునికి భగవంతుని విగ్రహం చూపిస్తే, అతను ఆ విగ్రహం రాతితో చేయబడిందా, పాలరాయితో చేయబడిందా, ఎన్ని సంవత్సరాల

క్రిందట చేయబడింది అనే విషయాలమీద శ్రద్ధ చూపుతాడు. అంటే అతను విగ్రహాన్ని భగవంతునిగా చూడడు, ఒక రాతిబొమ్మగా చూస్తాడు. అదే మనం ఆ విగ్రహం ముందు నిల్చుంటే, ఆ విగ్రహాన్ని రాయిగా చూడము, భక్తిగా నమస్కారం పెడతాము. భగవంతునితో మన కష్టసుఖాలను మొరపెట్టుకుంటాము కూడా. అది ఒక విగ్రహం అని మనకు తెలియదా? తెలుసు, అయినా కూడా ఆ విగ్రహానికి దైవత్వాన్ని ఆపాదిస్తాము.

కాని జగత్తును మాత్రం, ఆ విదేశీయునిలాగా, జగత్తుగానే చూస్తాము కాని ఈశ్వర దర్శనం చేయము. నిజానికి ఈ జగత్తునంతటినీ ఒకే భగవానునిగా చూడాలి. జగత్తులో ఉన్న ప్రతి ఒక్కరినీ గౌరవించాలి; ప్రతిదాన్నీ అభిమానించాలి; ఆఖరికి ఒక చిన్న దోమ కూడా భగవంతుని రూపమే. ఎప్పుడైతే అలా చూస్తామో, అప్పుడే మనం ఒక దోమను కూడా చంపలేము. అహింసకు మారుపేరులా మారతాము.

జగత్తుమీద ఇంత పూజ్యభావం పెంపొందించుకోవాలంటే దృక్పథంలో మార్పు రావాలి. దాన్నే **దివ్యచక్షువులు** అంటారు. దివ్యచక్షువు ఉంటే మన వ్యక్తిగత భావాలను మర్చిపోతాము, మన రాగద్వేషాలను మర్చిపోతాము. అంతా ఈశ్వరమహిమగా కొలుస్తాము. అందువల్ల దివ్యచక్షువు అంటే రాగద్వేషాలతో కూడిన, వ్యక్తిగతభావాలతో కూడిన **జీవదృష్టిని** పారద్రోలటం, ఈ జగత్తునే భగవానుని విశ్వరూపంగా చూడటం.

అర్జునుడు చేయబోతున్నది అదే. అందువల్లనే శంకరాచార్యులవారు విశ్వతో ముఖమ్ (11.11) పదానికి తన భాష్యంలో ముఖాలుగా వివరించలేదు. విశ్వతోముఖమ్ అంటే విరాట్ అన్నారు.

భక్తుడు అందరి ముఖాలలోనూ భగవంతుని రూపాన్ని చూడాలి – **సహస్రశీర్షా పురుషః** ఇది నా ముఖం అని అంటే, మీరు ఇంకా జీవితంలో కిందస్థాయిలోనే ఉన్నట్టు అర్థం. నా ఈ ముఖం నాది కాదు, ఇది కూడా భగవంతుని ముఖం అని చెప్పగలగాలి. సహస్రాక్షః. అన్ని కళ్ళూ భగవంతుని కళ్ళగా చూడగలగాలి. అలాగే అన్ని చెవులు, అన్ని కాళ్ళు భగవంతునికి చెందుతాయి. అంతేకాని, ఒకటే శరీరానికి అనేక కాళ్ళు, చేతులు ఉన్న కొత్త ఆకారం కాదు.

మొత్తం మానవాళిని విష్ణుమీశం నమామి అనగలగాలి. పంచభూతాలను దివ్యలింగం నమామి అనగలగాలి. అందువల్లనే మనకు పంచభూత లింగక్షేత్రాలు ఉన్నాయి. శివుణ్ణి పంచభూతాలలో కొలుస్తాము. పరమాత్మ ఆకాశంలో లేదు, పరమాత్మే ఆకాశం. చిదంబరంలో ఆకాశలింగం అంటాము. అలాగే జంబుకేశ్వర క్షేత్రంలో పరమాత్మ నీటిలో లేదు; పరమాత్మే నీరు. పరమాత్మ వాయువులో లేదు, పరమాత్మే వాయువు. పరమాత్మ అగ్నిలో లేదు, పరమాత్మే అగ్ని. పృథివిలో పరమాత్మ లేదు, పరమాత్మే పృథివి. అందువల్ల పృథివిని పరమాత్మగా

కొలిస్తే, వాయువును పరమాత్మగా కొలిస్తే, మనకు విశ్వరూపదర్శనం అయినట్టే అర్థం. ఇలా పంచభూతాలను మాత్రమే భగవంతునిగా కొలవటం కాదు, పాంచభౌతిక ప్రపంచాన్ని కూడా భగవంతునిగా కొలవాలి. అలా కొలిస్తే దివ్యచక్షువు లేదా రాగద్వేషరహిత చక్షువు పొందినట్టే. దివ్యచక్షువు ఉంటే ప్రపంచాన్ని ఈశ్వరునిగా చూస్తాము.

అర్జునుడు ఈ దివ్యచక్షువులను పొందుతాడు. అది పొందాక, మూడు రకాల భావాలను వెలిబుచ్చుతాడు.

**తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః ।**
**ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత ॥** – 11.14

ఎప్పుడైతే అర్జునుడు తన దివ్యచక్షువుతో విశ్వరూప ఈశ్వరుణ్ణి దర్శించాడో, అప్పుడే అర్జునుడు ఆశ్చర్యచకితుడై, నిక్కబొడుచుకున్న రోమాలతో, ఆ విరాట్ పురుషునికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

**2. విస్మయం లేదా ఆశ్చర్యం : శ్లోకాలు 15–22**– మొదటి స్పందన విస్మయం లేదా ఆశ్చర్యం. ఏదైనా ఎంత పెద్దదిగా ఉంటే, మనకు అది అంత అద్భుతంగా అనిపిస్తుంది. అందువల్లనే ఆకాశం, సముద్రం, పర్వతం, జలపాతాలు మనను ఎక్కువగా ఆకర్షిస్తాయి. నయాగరా జలపాతం అంటే ఎందుకంత ఆకర్షణ మనకు? ఏం, మనం ఎన్నడూ నీరు చూడలేదా, జలపాతాలు అసలే చూడలేదా? అయినా అంత అద్భుతంగా అది ఎందుకు కనిపిస్తుందంటే, అది అంత పెద్దదిగా ఉంది కాబట్టి. అలాంటప్పుడు విశ్వరూపం గురించి ప్రత్యేకంగా చెప్పాలా?

**నో టైమ్ టు సీ ఇన్ బ్రాడ్ డేలైట్; స్ట్రీమ్స్ ఫుల్ ఆఫ్ స్టార్స్ లైక్ స్కైస్ ఎట్ నైట్**

తీరిక లేదు ఆస్వాదించేందుకు ఆకాశంలోని నక్షత్రాలలా, మధ్యాహ్నపుటెండలో సెలయేరులో తళుకులీనే నీటిబుడగలను.

డేవిస్ అనే కవి తన కవితలో మనకు ప్రకృతి అందాలను తీరికగా నిలుచుని ఆస్వాదించే మనస్సు లేదు, అని బాధపడతాడు.

**వాట్ ఈజ్ దిస్ లైఫ్, ఇఫ్ ఫుల్ ఆఫ్ కేర్**

ఏమిటీ జీవితం, ఆందోళనలతో నిండివుంటే ప్రకృతి అందాలను ఆస్వాదించనీయకుండా పరుగులు తీయించే ఈ జీవితం ఒక జీవితమేనా అని వాపోతాడు ఆ కవి. గాలిని కలుషితం చేస్తున్నాము, అగ్ని అందాలను మెచ్చుకోలేకపోతున్నాము. 'మనకున్న అనేక సమస్యలకు కారణం మనిషి ప్రకృతికి దూరంగా జరిగిపోవటమే,' అనేది ఒక అద్భుతమైన సిద్ధాంతం. అనేక అనారోగ్యాలకు అది కారణభూతమవుతున్నది. అమెరికాలో కొంతమంది

వైద్యులు, వారి చికిత్సలో భాగంలో, మనుష్యులను ప్రకృతి ఒడిలోకి వెళ్ళి యోగా చేయమంటున్నారు. దానికి డబ్బు చెల్లించి వెళుతున్నారు వారు. నిజానికి మనమంతా విశ్వరూపం ఒడిలోనే ఉన్నాము. అది అర్థం చేసుకుంటే ఏ అనారోగ్యమూ ఉండదు.

అర్జునుడు నేను, నీ ఆది, మధ్యమ, అంతాలు చూడలేకుండా ఉన్నాను; అందువల్ల నువ్వు అనంతానివి అంటున్నాడు. నువ్వు తేజోరాశివి, నీ కాంతి ఎంత మిరుమిట్లు గొలిపేదిగా ఉందంటే, నేను నా కళ్ళను కూడా పూర్తిగా తెరచి చూడలేకపోతున్నాను. నువ్వు అక్షరం బ్రహ్మవు, నువ్వు కాలాతీతుడవు, నీ కళ్ళు సూర్యచంద్రులు, అగ్నిదేవత నీ ముఖం అని కీర్తిస్తున్నాడు అర్జునుడు.

**3. భయం : శ్లోకాలు 23–30** – విశ్వరూపదర్శనాన్ని అర్జునుడు విస్మయంతో వీక్షిస్తుండగానే అతను భగవంతుని నోరు చూడటం తటస్థించింది.

**పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం** – 11.19

భగవంతుని నోరును బాగా ప్రజ్వలిస్తున్న అగ్నితో పోల్చటం జరిగింది. నోరును అక్షరాలా నోరుగా తీసుకోకూడదు. ఇక్కడ నోరు కాలతత్త్వాన్ని సూచిస్తుంది. కాలతత్త్వాన్ని కూడా సృష్టికర్తగా కాకుండా లయకర్తగా చూపిస్తున్నాడు. కాలమే జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయలకు కారణం. భగవంతునికి, ఈ మూడు అంశాలకు మూడు పేర్లు పెట్టుకున్నాము. సృష్టికర్త బ్రహ్మ, స్థితికర్త విష్ణువు, లయకర్త శివుడు అన్నాము.

ఇక్కడ అర్జునుడు భగవంతుని నోరుకేసి చూస్తే, అది కాలాగ్నిలా ఉందిట. అంటే లయకర్తగా ఉంది. భగవంతుణ్ణి లయకర్తగా చూస్తే భయపడతారు. అర్జునుడు కూడా లయకర్తను చూసి భయపడుతున్నాడు.

విశ్వరూపంలో ద్వంద్వవస్తువులు ఉంటాయి. విశ్వరూపదర్శనం చేయాలనుకుంటే, అందులో ఒక భాగాన్ని స్వీకరించి, ఇంకొక భాగాన్ని తృణీకరిస్తే అది దృష్టిదోషం అవుతుంది. విశ్వరూపం ద్వంద్వాలతో కూడినది. అవి వ్యతిరేక అంశాలు కాదు. అవి విడదీయరాని, విడదీయలేని జంటలు అని గుర్తించగలిగితే ఈ భయం వేయదు. వాటిని పరస్పర భిన్న అంశాలుగా చూస్తే భయం; వాటిని ఈడూ–జోడూగా చూస్తే నిశ్చింత.

విడదీయరాని, విడదీయలేని మొట్టమొదటి అత్యంత ముఖ్యమైన జంట – చావుపుట్టుకలు. పుట్టిన ప్రతిదానికీ మరణం తప్పదు.

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ** – 2.27

పుట్టినవారు మరణించక తప్పదు; మరణించిన వారికి పునర్జన్మ తప్పదు. అంటే జన్మ మృత్యువులు అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండుపక్కలు. అందువల్ల విశ్వరూపదర్శనం

చేయాలంటే జన్మమృత్యువులు రెండింటినీ మంగళకరంగా చూడాలి తప్ప ఒకదానిని మంగళకరంగానూ, ఇంకొకదానిని అమంగళంగానూ చూడకూడదు. అలా చూస్తే అది జీవదృష్టి అవుతుంది.

అర్జునుడు వందల్లో, వేలల్లో తన ఆత్మీయుల మరణాన్ని చూస్తున్నాడు.

**వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రాకరాళాని భయానకాని ।**
**కేచిద్విలగ్నా దశనాంతరేషు సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః ॥** – 11.27

ముఖ్యయోధులందరూ నీయొక్క భయంకరమైన కోరలతో గూడి భీతిని గొల్పు నోళ్ళలో త్వరపడుతూ ప్రవేశిస్తున్నారు. కొందరు నుగ్గునుగ్గ కావింపబడిన శిరస్సులతో నీ దంతాల మధ్య చిక్కుకున్నారు.

వేలాది యోధులు భగవంతుని నోటిలోకి వెళుతున్నట్టుగా వర్ణిస్తున్నాడు అర్జునుడు. దీన్ని కవి హృదయంగా తీసుకోవాలి గాని, నిజంగా అంతమంది సైనికులు పరుగెత్తుకుంటూ వెళ్ళి నోట్లో దూరటం జరగదు. ఎవరెవరు వెళుతున్నారో కూడా అర్జునునికి తెలుస్తున్నది. ధృతరాష్ట్రుని పుత్రులు, అనేక రాజులు, భీష్మద్రోణులు, కర్ణుడు, అనేక యోధులు పరుగులు పెడుతూ వెళుతున్నారు. అంతమంది ఒకేసారి భగవంతుని నోళ్ళలోకి ప్రవేశించటంవల్ల వారి పరిస్థితి రకరకాలుగా ఉంది. కొంతమంది దంతాల మధ్య చిక్కుకుని అవస్థ పడుతున్నారు; కొంతమంది నుగ్గునుగ్గు కావింపబడ్డ శిరస్సులతో ఉన్నారు.

కాలతత్త్వానికి రెండు శక్తులు ఉన్నాయి – సృష్టించే శక్తి, నాశనం చేసే శక్తి. అర్జునుడు సృష్టించే శక్తిని చూసివుంటే, ఏమీ భయపడి ఉండేవాడు కాదు. అర్జునుడు నాశనం చేసే శక్తిని చూస్తున్నాడు. అందువల్ల ఈశ్వరదృష్టి పోయి, జీవదృష్టి వచ్చింది. ఎప్పుడైతే జీవదృష్టి వస్తుందో, అప్పుడే మరణం భయానకం అవుతుంది. కాని మరణం అనేది లేకుండా పోతేనో, యమధర్మరాజు తన కర్తవ్యాన్ని నిర్ణయించనని తీర్మానించుకుంటేనో, పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించండి! ప్రకృతిసూత్రం దీన్ని స్వీకరించదు. లా ఆఫ్ కన్సర్వేషన్ అంటారు దీన్ని. దాని ప్రకారం ప్రతిదీ ఒక వృత్తాకారంలో సాగాలి. ఒక తరం వెళ్ళిపోయి, రాబోయే తరానికి చోటు ఇవ్వాలి.

నిజానికి ఒక చెట్టు ఎండిపోతే, అది ఇంకొక చెట్టుకు ఎరువుగా మారుతుంది. మనం ఈ భూమిని వదిలివెళితేనే, ముందుతరం ఈ భూమ్మీద పుట్టటానికి చోటు ఉంటుంది. అందువల్ల మరణం అమంగళకరం కాదు; నిజానికి మరణం మంగళకరం. ముందు తరానికి మార్గం ఇస్తుంది కాబట్టి. అందువల్లనే ఈశ్వరుణ్ణి శివః అంటారు. శివః అంటే మంగళరూపుడు.

కాని మనం మరణాన్ని రెండు చేతులతోనూ ఆహ్వానించలేము. మనమేకాదు, మన దగ్గరవారు కూడా శాశ్వతంగా ఉండాలనుకుంటాము. వేరే ఎవరైనా మరణిస్తే మనకేం అభ్యంతరం లేదు. పుట్టుట గిట్టుట కొరకే అంటాము. అర్జునునికి కూడా ఇంకా పూర్తిగా పరిపక్వత రాలేదు; అందువల్ల అతను భగవంతునిలోని రెండవ అంశాన్ని చూడలేక పోతున్నాడు. అందువల్ల ఎవరెవరు మరణిస్తున్నారో చెప్పుకొస్తున్నాడు. భీష్మోద్రోణః అంటున్నాడు. భీష్మపితామహుడు, ఆచార్యుడు ద్రోణుడు నీ నోటిలో ప్రవేశిస్తున్నారు అంటున్నాడు. వారి మరణం గురించిన ఆలోచనకే తట్టుకోలేకపోయిన అర్జునుడు, ఇప్పుడు ఏకంగా వందల్లో, వేలల్లో తన ఆత్మీయుల మరణాన్ని చూస్తున్నాడు. అందువల్ల విస్మయం కాస్తా భయానికి దారితీస్తున్నది.

**దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్** – 11.23

నీ మహారూపాన్ని చూసి లోకాలు భయకంపితులు అవుతున్నాయి. అలాగే నేను కూడా భయంతో వణికిపోతున్నాను.

**4. అర్జునుని ప్రశ్న, కృష్ణపరమాత్మ జవాబు : శ్లోకాలు 31–34** – అర్జునుడు ప్రాథమిక ప్రశ్న వేస్తున్నాడు. 'ఓ భగవంతుడా, ఎవరు నువ్వు? నువ్వు సౌమ్యమైన ఈశ్వరునివా, ఉగ్రరూపం ధరించిన భగవంతునివా?'

**లేలిహ్యసే గ్రసమానః సమంతాత్** – 11.30

నువ్వు మాటిమాటికీ చప్పరిస్తున్నావు. ఈ లోకంలో ఉన్న అందరినీ కబళిస్తున్నావు. ఎవరు నువ్వు?

**కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః ।**
**ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥** – 11.32

సర్వలోకాలను సంహరించటానికి విజృంభించిన మహాకాలుణ్ణి. ఇప్పుడు ఈ యుద్ధంలో పాల్గొంటున్న వారందరినీ సంహరించబోతున్నాను. నువ్వు యుద్ధం చేయకపోయినా సరే. వీరెవరూ జీవించి ఉండరు. అందరూ మరణించాల్సిందే.

భగవంతుడు కాలతత్త్వం. కాలతత్త్వంగా రెండు విధులు లేదా కర్తవ్యాలు ఉన్నాయి. అవి సృష్టి, లయ. రెండింటినీ ఈశ్వరమహిమగా స్వీకరించటం నేర్చుకోవాలి. పుట్టుకతో పాటు మరణాన్ని స్వీకరించాలి; సంయోగవియోగాలను ఈశ్వరమహిమగా స్వీకరించాలి; రాత్రిపగళ్ళను ఈశ్వరమహిమగా స్వీకరించాలి; వేసవికాలాన్ని, చలికాలాన్ని ఈశ్వర మహిమగా స్వీకరించాలి. నిజానికి దేన్నైనా సరే, ఉన్నదున్నట్టుగా స్వీకరించాలి. దేని గురించీ బాధపడకూడదు. దాని తర్వాత ఒక ప్రత్యేకమైన మాట చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

**తస్మాత్ త్వముత్తిష్ఠ యశో లభస్వ జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్ ।**
**మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥** – 11.33

అందువల్ల లే, లేచి యుద్ధం చేయి; యుద్ధం చేసి కీర్తి పొందు. శత్రువులను జయించి సర్వసంపదలతో తులతూగుతున్న రాజ్యాన్ని అనుభవించు. వీరందరూ ఇంతకుముందే నాచేతనే చంపబడ్డారు. ఓ సవ్యసాచీ! ఓ అర్జునా! నువ్వు నిమిత్తమాత్రుడవు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ శ్లోకాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. లేకపోతే దీన్ని పొరపాటుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. ఇక్కడ కృష్ణపరమాత్మ చెప్పినదాని అంతరార్థం ఇది. 'ఈ యోధులందరి ప్రారబ్ధకర్మ ముగిసింది అర్జునా! భీష్మ, ద్రోణ, కర్ణ, కౌరవ వీరులందరికి మృత్యువు సమీపిస్తున్నది. వారి కర్మే వారికి మరణాన్ని తెచ్చింది. నేను భగవంతుణ్ణి కాబట్టి, నేను కర్తను కాదు కాబట్టి, నిన్ను నా పరికరంగా ఎన్నుకున్నాను. నీ ద్వారా వారికి ముగింపు పలుకుతున్నాను.' నువ్వు నిమిత్తమాత్రుడవు అంటే నువ్వు నా పరికరానివి అని అర్థం. ఈ విధంగా ఈ శ్లోకాన్ని అర్థం చేసుకోవాలి.

## ఫ్రీవిల్‌నా, విధినా–

ఈ సందర్భంలో మనిషిని నడిపించేది ఫ్రీవిల్‌నా, విధిరాతనా అనేది చర్చనీయాంశం.

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్**

చాలామంది ఈ వాక్యాన్ని తీసుకుని, దాన్ని వేరే సందర్భాలలో అన్వయించి, భగవంతుడు జగన్నాటక సూత్రధారి అనీ, మనం ఆయన చేతుల్లో కీలుబొమ్మలం మాత్రమే అనీ అంటారు. అంటే భగవంతుడు మనను ఈ భూమ్మీదకు పంపినప్పుడే మన తలరాతను రాసి పంపిస్తాడనీ, మనం ఆ విధిరాతను తప్పించుకోలేమని అంటారు.

**హరిణాపి హరేణాపి బ్రహ్మణాపి సురైరపి।**
**లలాటలిఖితారేఖా పరిమార్ష్టుం న శక్యతే**

ఇది విధిని నమ్మే శ్లోకం. లలాట లిఖితరేఖను నమ్మే శ్లోకం. విష్ణుమూర్తి, శివుడు, బ్రహ్మ, దేవతలు ఎవరూ కూడా మనరాతను మార్చలేరు. మన తలరాత ఎలా ఉంటే, అలా అవుతుంది అనుకోవటాన్ని **ఫేటలిజమ్** అంటారు.

శాస్త్రం పూర్తిగా విధిమీదే ఆధారపడే సిద్ధాంతాన్ని ఒప్పుకోదు. ఎందుకంటే మనం లలాట లిఖితరేఖను నమ్మితే, మనకు ఫ్రీవిల్ ఉందనే సిద్ధాంతాన్ని తృణీకరించినట్టు అవుతుంది. శాస్త్రం మనిషిని బుద్ధిజీవి అంటుంది. అతనికి ఫ్రీవిల్ ఉంది అంటుంది. అందువల్లనే శాస్త్రం మనిషికి నాలుగు లక్ష్యాలను నిర్దేశించింది. వాటిని పురుషార్థాలు

అంటుంది. పురుషార్థాలు అంటే ఫ్రీవిల్‌ను ఉపయోగించి, మనిషి ఎన్నుకునే లక్ష్యాలు. భగవద్గీతలో కూడా దీన్నే సమర్థిస్తాడు కృష్ణపరమాత్మ.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్** – 6.5

నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి అర్జునా అన్నాడు కృష్ణపరమాత్మ.

మనం జీవితంలో పైకి వచ్చినా, కిందకి దిగజారినా దానికి మనమే బాధ్యులు. అందువల్ల భగవంతుణ్ణి నిందించి లాభం లేదు. భగవంతుడు ఫ్రీవిల్‌ను పారద్రోలడు. మన ఫ్రీవిల్‌ను ఉపయోగించి మనం ప్రయత్నిస్తే, భగవంతుడు దానికి తగ్గ ఫలాన్ని ఇస్తాడు.

**సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥** – 9.29

కృష్ణపరమాత్మ నాకు అందరూ సమానమే. ఎవరిమీదా నాకు పక్షపాతవైఖరి లేదు అన్నాడు.

**యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః ।**
**భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మామ్ ॥** – 9.25

పితృలోకానికి వెళ్ళాలనుకునేవారు పితృలోకాలకి వెళతారు. దేవలోకాన్ని కోరేవారు దేవలోకానికి వెళతారు. ఎవరే ఫలం కోరితే వారు ఆ ఫలాన్ని పొందుతారు. నన్నే కోరేవారు మోక్షాన్ని పొందుతారు అన్నాడు. అంటే దీని అర్థం, ఎన్నుకోవటం మీ చేతిలో ఉంది; విధిరాతలో లేదు. మీరేది ఎన్నుకున్నా భగవంతుడు దీవించటానికి సిద్ధంగా ఉంటాడు.

మన చేతిలో ఏంలేదు, అంతా బ్రహ్మలిఖితం అంటే దానివల్ల వచ్చే సమస్యలను చర్చిద్దాము.

ఎ) **ఈశ్వరుని మహాసంసారిత్వమ్** – ఒక్క భగవంతుడే అంతా చేస్తున్నాడు, మనం ఆయన చేతిలో కీలుబొమ్మలం అంటే భగవంతుడు కర్తా, మనం కరణం అవుతాము. ఇక్కడ కరణం అంటే పరికరం. కర్మసిద్ధాంతంలో ఒక సూత్రం ఉంది. అది, ఎవరైతే కర్మ చేస్తారో, వారు మాత్రమే ఆ కర్మఫలాన్ని అనుభవించాలి. అంటే ఇప్పుడు భగవంతుడు కర్తా కాబట్టి, పుణ్యపాపాలు అన్నీ ఆయనకే చెందుతాయి. మనం చేసే కర్మలు మనను సంసారిని చేస్తే, మనమందరం చేస్తున్న కర్మలనన్నింటినీ భరిస్తున్న భగవానుడు మహాసంసారి అవాలి.

అంతేకాదు మనం కరణం అయితే, మనకు కర్మఫలం అంటదు. ఉదాహరణకు ఒక కారు ఒక వ్యక్తిని ఢీకొంటే, ఆ వ్యక్తి మరణిస్తే, శిక్ష కారుకు వేయరు కదా! ఈ సూత్రాన్ని ఇక్కడ అన్వయిస్తే మనం అసంసారులం అవుతాము; భగవంతుడు మహాసంసారి అవుతాడు.

బి) **నైర్ఘుణ్యదోషమ్** – భగవంతుడే అంతా చేస్తుంటే, మన చేతిలో ఏమీ లేకపోతే, మనం జీవితంలో పడే కష్టాలన్నీ ఎవరివల్ల కలుగుతున్నాయి? సాక్షాత్తూ భగవంతుని వల్లనే. మనకొక అనారోగ్యం కలిగినా, ఎక్కడో యుద్ధం జరిగినా, మరెవరో బాంబులు వేసినా, వాటివల్ల జరిగే నష్టాలన్నీ భగవంతుడు కలుగజేసినట్టు అవుతుంది. అప్పుడు భగవంతుణ్ణి కరుణామయుడు, దయాసాగరుడు అనలేము.

అలా భగవంతుడు నిర్దయగా ప్రవర్తిస్తే, దాన్ని నైర్ఘుణ్యదోషం అంటారు. నైర్ఘుణ్యం అంటే జాలి లేకపోవటం. భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు, దయాసాగరుడు కాబట్టి మానవాళి కష్టాలన్నీ చేత్తో తీసినట్టు తీసివేయాలి. అయినా మానవుల కష్టాలకు ఎందుకు ముగింపు పలకటం లేదు? అప్పుడు భగవంతునికి నైర్ఘుణ్యదోషం ఉన్నట్టు అవుతుంది.

సి) **వైషమ్యదోషమ్** – దేవునిమీదే అంతా భారం వేసేస్తే దేవుడు కరుణామయుడు కాదని ఇంతకుముందు చూశాము. ఇప్పుడు, ఇంకో కోణంలోంచి చూస్తే, కొంతమంది భోగభాగ్యాలతో తులతూగుతుంటే, కొంతమంది అవస్థ పడుతున్నారు. అంటే భగవంతుడు తనకు తోచినట్టు సుఖాలను ఇచ్చినట్టు అవుతుంది. అంటే కొంతమందిమీద పక్షపాతం చూపించినట్టు అవుతుంది. కొంతమంది నవ్వుతారు; కొంతమంది ఏడుస్తారు; కొంతమంది ఏడుస్తూ నవ్వుతారు; కొంతమంది నవ్వుతూ ఏడుస్తారు. ఈ పక్షపాతధోరణిని వైషమ్యదోషం అంటారు.

డి) **ధర్మశాస్త్ర నిష్ప్రయోజనమ్** – భగవంతుడు కర్త అయితే, మనం కరణం మాత్రమే అవుతామనీ, అంటే మనం చేసే కర్మలకు మనం బాధ్యులం కామనీ చూశాము కదా! అంటే పుణ్యపాపాలు, ధర్మాధర్మాల గురించి మనం నేర్చుకోనవసరం లేదు. రోడ్డుమీద వెళ్ళే కారు ట్రాఫిక్ రూల్స్ నేర్చుకోనవసరం లేదు; కారుని నడిపే వ్యక్తి నేర్చుకోవాలి. అలా భగవంతునివల్ల నడపబడే మనం ధర్మశాస్త్రం నేర్చుకోనవసరం లేదు. ధర్మశాస్త్రంవల్ల ప్రయోజనముండదు. మనను నడిపే భగవంతుడే నేర్చుకోవాలి. ఎందుకంటే మనం నిమిత్తమాత్రులమే. మనం ధర్మశాస్త్రాన్ని నేర్చుకోనవసరం లేదు కాబట్టి దాన్ని ధర్మశాస్త్ర నిష్ప్రయోజనమ్ అంటారు.

ఇ) **వికల్ప అభావః** – భగవంతుడు కర్త అయితే, మనం కరణం మాత్రమే అయితే, కరణంగా మనకు జీవితంలో ఏ ఘర్షణా ఉండదు. ఎందుకంటే ఏ పని చేయాలో ఒక పరికరం నిర్ణయించనవసరం లేదు. ఎప్పుడైతే ఏ పని చేయాలో నిర్ణయించనవసరం లేదో, అప్పుడే మనకు జీవితంలో ఏ ఘర్షణా ఉండదు. ఆ ఘర్షణ కూడా భగవంతుడే పడతాడు. మన ఇంటికి వెళ్ళటానికి రెండు మార్గాలు ఉంటే, ఏ మార్గంలో వెళ్ళాలో ఆ నిర్ణయం ఏదో మనమే తీసుకోవాలి. ఎక్కడ ఫ్రీవిల్ ఉంటే అక్కడ సంఘర్షణ ఉంటుంది. అంటే ఫ్రీవిల్, ఛాయిస్, కాన్ఫ్లిక్ట్ ఒక ప్యాకేజీ డీల్. జీవితంలో ప్రతిదీ ఒక సంఘర్షణే.

జంతువులకూ, మనుష్యులకు మధ్యనున్న భేదం ఈ ఫ్రీవిల్లే. మనిషి బుద్ధిజీవి. అతను తన బుద్ధిని ఉపయోగించి, మంచి–చెడు విచక్షణ చూపించాలి. కాని భగవంతుడే అంతా చేస్తే, ఈ వికల్ప అభావం కలుగుతుంది.

ఈ విధంగా ఫ్రీవిల్+విధి=భవిష్యత్తు. రెండూ కలిపి మనిషి భవిష్యత్తును నిర్ణయిస్తాయి. రెండూ మన జీవితాన్ని ప్రభావితం చేసేటట్టయితే కృష్ణపరమాత్మ 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్,' అని ఎందుకన్నాడు? నువ్వు నిమిత్తమాత్రుడివి అంటే ధార్మికమైన జీవనం గడపాలని అర్థం. భగవంతుడు జగత్తును ధర్మసూత్రాల ఆధారంగా నడుపుతాడు. మన జీవితంలో ఎన్నుకోవాల్సి వచ్చినప్పుడల్లా మనకు రెండు మార్గాలు ఉంటాయి. ధర్మపరంగా పోవాలా, రాగద్వేషాల మాట వినాలా? మనం ధర్మపరంగా నిర్ణయం తీసుకుంటే, మనం ధర్మశాస్త్రానికి కట్టుబడి ఉన్నట్టు అవుతుంది. అప్పుడు భగవంతుని చేతిలో పరికరంగా ఉన్నట్టు అనిపిస్తుంది.

అర్జునుడు అటువంటి ధర్మసంకటంలో పడ్డాడు. ధర్మశాస్త్రం అతను యుద్ధం చేయాలి అంటున్నది. క్షత్రియుని ధర్మం యుద్ధం చేయటం. బుద్ధి యుద్ధం చేయమంటున్నది. కాని అతని మనస్సు భీష్మద్రోణులమీద రాగమోహాల్లో పడిపోయింది. భీష్మద్రోణులు అధర్మం వైపు నిల్చున్నారు. వారిని చంపటం ధర్మాన్ని పాటించటమే అవుతుంది. అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, 'ఓ అర్జునా! నీకు భీష్మద్రోణులను సంహరించాలని లేకపోయినా ధర్మశాస్త్రాన్ని పాటించు. నువ్వు నిమిత్తమాత్రుడివి అవు.'

కృష్ణపరమాత్మ చేసిన బోధ సారాంశం – నీ రాగద్వేషాలకు లొంగకు; ధర్మాన్ని పాటించు. ధర్మాన్ని పాటిస్తే, భగవదేచ్ఛను పాటించినట్టు అవుతుంది. రాగద్వేషాలకు లొంగితే, ఫ్రీవిల్‌కు లొంగినట్టు అవుతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే ధర్మపథంలో నడిస్తే ఫ్రీవిల్‌ను సరిగ్గా ఉపయోగించినట్టు; అధర్మఫథంలో నడిస్తే ఫ్రీవిల్‌ను దుర్వినియోగం చేసినట్టు అవుతుంది.

ధర్మమార్గాన్ని ఎన్నుకోవాలంటే, రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవాలి. ఉదయం ఎనిమిదిగంటల దాకా పడుకోవాలని ఉంటే, మీ ఫ్రీవిల్ శాస్త్రానికి భిన్నంగా ఉంది. ఎందుకంటే ధర్మశాస్త్రం సూర్యోదయం అయ్యాక పడుకోకూడదు అంటుంది. శాస్త్రాన్ని గౌరవించి, మీ జీవనవిధానాన్ని మార్చుకోవాలి. అప్పుడు ఘర్షణ ఉండదు. ధర్మఫథంలో నడిస్తే, ఈశ్వర ఇచ్ఛను పాటించినట్టు అవుతుంది. ఇదీ 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్,' అంటే అర్థం.

దీనితో ఫ్రీవిల్లా, విధామీద ప్రత్యేక విశ్లేషణ ముగిసింది.

**5. శరణాగతి లేదా భక్తి : శ్లోకాలు 36–46** – ఇక్కడ్నుంచీ మళ్ళీ అర్జునుని స్పందనను చూస్తాము. ఇది మూడవ దశ. మొదటి రెండూ – ఆశ్చర్యం, భయం. ఇది శరణాగతి.

నువ్వు ఎవరు అన్న ప్రశ్నకు నేను కాలతత్త్వాన్ని అన్నాడు కృష్ణపరమాత్మ. జీవితాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించటమో, పూర్తిగా తిరస్కరించటమో చేయగలము కాని దానిలో ఎన్నుకునే అధికారం లేదు మనకు. ఉన్నదున్నట్టుగా స్వీకరించటమంటే ద్వంద్వాలతో కూడిన జీవితాన్ని స్వీకరించాలి. అంటే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను, ఆటుపోట్లను, హెచ్చుతగ్గులను, ఎత్తుపల్లాలను చిరునవ్వుతో స్వీకరించాలి. చావుపుట్టుకలను, ఎదుగుదల వినాశనాలను, సంయోగవియోగాలను చిరునవ్వుతో స్వీకరించాలి.

ఇది సత్యం; ఈ సత్యాన్ని అర్జునుడు కొంతమేరకు జీర్ణించుకుంటాడు. విశ్వరూపదర్శనం గురించిన జ్ఞానం కలిగేసరికి నెమ్మదిగా భయం స్థానంలో శరణాగతి భావన చోటు చేసుకుంటోంది. అందువల్ల పదేపదే నమస్కారాలు చేస్తున్నాడు.

**నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ ।**
**అనంతవీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః ॥** – 11.40

నీకు ముందునుంచి, వెనకనుంచి నమస్కరిస్తున్నాను. నీకు అన్నివైపులనుంచి నమస్కారాలు. నీకు అనంతమైన శక్తి ఉంది; నువ్వు సర్వాంతర్యామివి; సర్వమూ నువ్వే అంటున్నాడు అర్జునుడు.

నువ్వు యమధర్మరాజు రూపంలో వచ్చినా నిన్ను కీర్తిస్తాను.

**యమాయ ధర్మరాజాయ మృత్యవే చాంతకాయ చ।**
**వైవస్వతాయ కాలాయ సర్వభూతక్షయాయ చ॥**

యముడిని ధర్మరాజుగా ప్రార్థించాలి. ఆయన ధర్మాన్ని పాటిస్తాడు. అందువల్ల భగవంతుని ఇచ్చను పాటిస్తున్నాడు. భగవంతుడు యమధర్మరాజులో కూడా ఉన్నాడు. ఎప్పుడైతే అర్జునుడు ఇది గ్రహించాడో, అప్పుడే విశ్వరూపానికి అనేక విధాలుగా నమస్కారం చేస్తున్నాడు.

ఇక్కడితో శరణాగతి అయిపోయింది.

ఇక్కడ అర్జునుడు మిశ్రమభావాలను ప్రకటిస్తున్నాడు. మనస్సు ఒకపక్క తను చాలా అదృష్టవంతుడని మురిపిస్తోంది; ఇంకొకపక్క ఎర్రగా మండుతున్న నోళ్ళను చూసి భయపెడుతోంది. ఎవరూ కనీవినీ ఎరుగని విశ్వరూపదర్శన భాగ్యం ఒక్క అర్జునునికే కలిగింది. అందరూ అతనిని చూసి ఈర్ష్యపడతారు. అర్జునునికీ మురిపెంగానే ఉంది. కాని ఇంకొకపక్క భీకరంగా తెరిచివున్న నోళ్ళలో పరుగెత్తుకుంటూ వెళ్ళి పడిపోతున్న తనవారందరూ కనిపిస్తున్నారు. అది విపరీతమైన భయాన్ని కలుగజేస్తోంది. మింగాలేక, కక్కాలేక ఉన్నట్టుగా ఉంది అతని పరిస్థితి.

**అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే ।**
**తదేవ మే దర్శయ దేవరూపం ప్రసీద దేవేశ జగన్నివాస ॥** – 11.45

అంతకుముందెన్నడూ చూడని నీ విశ్వరూపాన్ని చూసి మురిసిపోయాను కాని నా మనస్సు భయంతో నిండిపోయింది. ఓ భగవంతుడా, నాకు నా స్నేహితుని రూపం చూడాలని ఉంది. విశ్వాధారుడవైన నువ్వు ప్రసన్నుడవు కమ్ము అంటున్నాడు అర్జునుడు.

6. **ఉపసంహారం : శ్లోకాలు 47–55** కృష్ణపరమాత్మ, నీ భక్తికి మెచ్చి, నీ శ్రద్ధకు మెచ్చి చూపించాను నీకు అంటున్నాడు. ఎలా చూపించాడు? దివ్యచక్షువులను ప్రసాదించటం ద్వారా. 'విశ్వరూపం చాలా ప్రకాశవంతమైనది. అనేకవేల నక్షత్రాల కూటములకు ఉండేటంత కాంతి ఉంది. ఓ అర్జునా, నువ్వు చాలా అదృష్టవంతుడివి. ఎవరికీ దక్కని విశ్వరూపదర్శనం నీకు దక్కింది,' అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరికీ దక్కని అదృష్టం అర్జునునికి మాత్రమే ఎందుకు దక్కిందో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. దానికి అర్జునుని అనన్యభక్తే కారణం.

అర్జునుడు కోరినట్టుగా కృష్ణపరమాత్మ విశ్వరూపదర్శనాన్ని ఉపశమించాడు. విశ్వరూప దర్శనాన్ని ఉపశమించాడు అంటే అర్జునునికి ప్రసాదించిన దివ్యచక్షువులను తీసేశాడు. అంటే అర్జునుని మనస్సులో మార్పు తెచ్చాడు. దివ్యచక్షువులు అంటే అహంకార మమకారాలకు లోనుగాని అంతరాత్మ అని చూశాము. ఇప్పుడు అర్జునునికి ఆ దివ్యచక్షువులను తీసేశాడు కాబట్టి అర్జునుడు మళ్ళీ నేను, నావారు అనే అహంకార మమకారాల్లో పడిపోయాడు.

**భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥** – 11.54

అయితే ఓ అర్జునా, విశ్వరూపుడనైన నన్ను దర్శించటానికి, తత్త్వజ్ఞానం ద్వారా తెలుసుకోవటానికి, ఏకీభావస్థితిని పొందటానికి అనన్యభక్తి ద్వారానే సాధ్యం.

అనన్యభక్తి ఉన్నవ్యక్తి మాత్రమే విశ్వరూపదర్శనాన్ని చేసుకోగలడు. ముముక్షుత్వభక్తినే ఇక్కడ అనన్యభక్తి అంటున్నాడు కృష్ణపరమాత్మ. భక్తి ఉంటే, భక్తే మిమ్మల్ని పరిపక్వత చెందేలాగా చేస్తుంది. ఏకరూపభక్తినుంచి అనేకరూపభక్తికి ఎదిగేలా చేస్తుంది. రాగద్వేషాలు తగ్గుతాయి; ఇష్టాయిష్టాలు తగ్గుతాయి. అప్పుడు విశ్వరూపదర్శనం చేయగలగటమే కాదు, దాన్ని ఆస్వాదించగలుగుతారు కూడా.

దాని తర్వాత, విశ్వరూపదర్శనంనుంచి అంటే అనేకరూపభక్తినుంచి అరూపభక్తికి ఎదుగుతారు. అవ్యక్తరూప, చైతన్యరూప, పరాప్రకృతి, బ్రహ్మరూపదర్శనానికి ఎదుగుతారు. అరూప ఈశ్వరజ్ఞానం పొందితే, మీరు ఈశ్వరునికి భిన్నంగా లేరని అర్థం చేసుకుంటారు.

**జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** – 7.18

జ్ఞానీభక్తుడు, పరమాత్మ–జీవాత్మ ఐక్యజ్ఞానాన్ని పొందుతాడు కాబట్టి తాను భగవంతునికి భిన్నంగా లేడని అర్థం చేసుకుంటాడు. ఐక్యజ్ఞానం పొందితే, ద్వైతభావం పోతుంది. అంటే భావనలో మార్పు వస్తుంది. భక్తి ఉంటే ఇవన్నీ అవుతాయి. ఈ భావనను ఆఖరి శ్లోకంలో ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।**
**నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥** – 11.55

ఓ అర్జునా, ముందు కర్మయోగివి కమ్ము, నా భక్తుడివి కమ్ము; నెమ్మదిగా తీవ్రముముక్షువు కమ్ము, సంగత్వం తగ్గించుకో, ద్వేషంనుంచి దూరంగా జరుగు. అలా చేస్తే ఖచ్చితంగా నన్నే పొందుతావు.

ఈ శ్లోకాన్ని సూత్రభూత శ్లోకం అంటారు. ఇందులో భక్తియొక్క నిర్వచనాన్ని చూస్తాము. ఈ నిర్వచనాన్ని పన్నెండవ అధ్యాయంలో విస్తారంగా చూస్తాము. భక్తి అంటే ఏ ఒక్క సాధనో కాదు. అన్ని ఆధ్యాత్మిక సాధనలూ భక్తిలోకే వస్తాయి.

కర్మయోగరూపభక్తి + ఉపాసన యోగరూపభక్తి + జ్ఞానయోగరూపభక్తి = భక్తి

ఈ విధమైన భక్తి చూపితే ఖచ్చితంగా పరమాత్మనే పొందుతాము. ఈ విధంగా భక్తిని స్తుతించటం ద్వారా విశ్వరూపదర్శనయోగము పూర్తి అయినది.

# భక్తియోగము

## అధ్యాయము 12

భగవద్గీతలోని అధ్యాయము 12 మధ్యమ షట్కముయొక్క ఆఖరి అధ్యాయము. భగవద్గీతను మూడు షట్కాలుగా విభజించవచ్చు. షట్కము అంటే ఆరు. మొదటి ఆరు అధ్యాయాలను కలిపి ప్రథమషట్కము అనీ, తక్కిన ఆరు అధ్యాయాలను (7–12) కలిపి మధ్యమషట్కము అనీ, ఆఖరి ఆరు అధ్యాయాలను (13–18) కలిపి చరమషట్కము అనీ అంటారు.

ఈ మధ్యమషట్కములో కృష్ణపరమాత్మ చాలా విస్తారంగా అధ్యాయాలు 7–11 వరకు ఈశ్వర స్వరూపాన్ని వివరించాడు. ఈ అధ్యాయాలలో ఈశ్వరుణ్ణి జగత్కారణంగా అభివర్ణించాడు. ఈ నిర్వచనాన్ని మూడు స్థాయిల్లో చూస్తాము. అది భక్తునియొక్క స్థాయీ భేదాన్ని ఆధారం చేసుకుని వచ్చింది.

1. **నిమిత్తకారణం** – మనం మొదటిస్థాయి భక్తిలో ఉండి జగత్కారణం ఎవరు అని అడిగితే, భగవంతుడు జగత్కారణం అని చెబుతుంది శాస్త్రం. భగవంతుడు జగత్తును సృష్టించాడు అంటే, సహజంగా మన ఆలోచన ఎలా ఉంటుందంటే, ఒకచోట వడ్రంగి కూర్చుని సామాన్లను సృష్టించినట్టుగా; కంసాలి ఒకచోట కూర్చుని ఆభరణాలను సృష్టించినట్టుగా; భగవంతుడు ఒకచోట కూర్చుని జీవులను సృష్టించాడు అనుకుంటాము. మన ప్రమేయం లేకుండా, ఆయన ఎక్కడో దూరాన కూర్చుని మనలను సృష్టించాడు అనుకుంటాము.

2. **ఉపాదానకారణం** – భగవంతునిమీద భక్తి ఏర్పడ్డాక, ఇంకొక మెట్టు ఎక్కిస్తుంది శాస్త్రం. భగవంతుడు జగత్తును సృష్టించటమే కాదు, జగత్తు తానే అయ్యాడు అంటుంది. అంటే ముడిసరుకు కూడా భగవంతుడే. బంగారం ఆభరణం అంతటా ఉన్నట్టుగా భగవంతుడు జగత్తు అంతటా ఉన్నాడు. భగవంతుడే ఉపాదానకారణంగా జగత్తు అంతటా ఉన్నాడనేసరికి జగత్తుమీద ఆరాధనాభావన, భక్తిభావన కలుగుతుంది. మన వైదికమతం గొప్పతనం అదే. మనం జగత్తులో ప్రతిదాన్ని పూజిస్తాము (తక్కిన మతాలవారికి ఈ భక్తిభావన అర్థం కాదు). మనం ఆకాశలింగం, వాయులింగం, అగ్నిలింగం, జలలింగం, పృథివీలింగంగా ఈశ్వరుణ్ణి కొలుస్తాము. ఆ విధంగా పంచభూతాలే మనకు భగవంతుడు. ఎందుకంటే భగవంతుడు ఆకాశాన్ని సృష్టించలేదు. భగవంతుడే ఆకాశం. చిదంబరంలో ఆకాశలింగంగా కొలుస్తాము.

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥** – 7.8

నేను నీటిలో రుచిని, తేజస్సులో సూర్యచంద్రులను, శబ్దాల్లో ఓంకారాన్ని, పురుషులలో పౌరుషాన్ని అన్నాడు కృష్ణపరమాత్మ.

**అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।**

**మంత్రోఽ హమహమేవాజ్యమ్ అహమగ్నిరహం హుతమ్ ॥** – 9.16

నేను క్రతువును, నేను యజ్ఞాన్ని, నేను పితృదేవతలకు వేసే స్వధను, నేను ఔషధాన్ని, నేను మంత్రాన్ని, నేను ఆజ్యాన్ని, నేను అగ్నిని, నేను ఆహుతిని కూడా అన్నాడు కృష్ణపరమాత్మ.

ఒక్కముక్కలో చెప్పాలంటే, 'అంతటా నేనే ఉన్నాను.' ఇది రెండవస్థాయి భక్తి. ఇందులో భగవంతుడు తానే జగత్తు అయ్యాడు.

3. **అధిష్ఠానం** – ఈ రెండు స్థాయిల భక్తినీ మనం బాగా అర్థం చేసుకుని, జీర్ణించుకుంటే మనం మూడవస్థాయికి చేరుకోవటానికి బుద్ధిపరంగా సిద్ధంగా ఉన్నట్టు అర్థం. ఈ స్థాయిలో భగవంతుడు తానే జగత్తు అయ్యాడు అనము. ఎందుకంటే జగత్తు అయ్యాడు అంటే అది మార్పును సూచిస్తుంది; మార్పు వస్తే సంసారం వస్తుంది. భగవంతుడెలా మారతాడు? అందువల్ల భగవంతుడు మార్పు చెందకుండా జగత్తు తానే అయ్యాడు అంటాము. దీన్ని వివర్త ఉపాదానకారణం అంటారు. ఇది మూడవస్థాయి భక్తి.

ఈ స్థాయిలోనే అద్వైతసిద్ధాంతం అయిన బ్రహ్మ సత్యం జగన్మిథ్య సూత్రాన్ని వంటబట్టించుకుంటాడు జ్ఞానీభక్తుడు. జగత్తు బ్రహ్మయొక్క ప్రకటితరూపం కాబట్టి, బ్రహ్మే జగత్తంతా ఉన్నాడు కాబట్టి, జగత్తుకు బ్రహ్మ లేకుండా స్వతంత్రంగా ఉనికి లేదు. స్వతంత్రంగా ఉనికి లేనిదాన్ని మిథ్య అంటారు.

| | |
|---|---|
| భగవంతుడు జగత్తును సృష్టించాడు | – ద్వైతం |
| భగవంతుడు తానే జగత్తు అయ్యాడు | – విశిష్టాద్వైతం |
| భగవంతుడు జగత్తుగా ప్రకటితమవుతున్నాడు | – అద్వైతం |

ప్రతి ఒక్క భక్తుడు కూడా ఈ మూడు దశలూ అనుభవించాలి. ముందుగా భగవంతుణ్ణి సృష్టికర్తగా కొలుస్తాడు కాబట్టి మొత్తం కర్మకాండను స్వీకరించాలి. తరువాత భగవంతుడు తానే జగత్తు అయ్యాడు అనగలగాలి. తరువాత భగవంతుడు జగత్తుగా ప్రకటితమవుతున్నాడు అనే స్థాయికి ఎదగాలి. అంటే ద్వైతభక్తి నుంచి విశిష్టాద్వైతానికి ఎదిగి, అక్కడ్నుంచి అద్వైతానికి రావాలి.

ఈ మూడు స్థాయిల్లో కృష్ణపరమాత్మ 7–11 అధ్యాయాల్లో రెండవస్థాయి భక్తి గురించి చెప్తూకొచ్చాడు. అలా ఎలా చెప్పగలము?

కృష్ణపరమాత్మ కొన్ని ఉదాహరణలు ఇచ్చి, చివరలో ఎందులో ఏ విభూతి చూసినా అది నా విభూతే అన్నాడు.

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥** – 10.41

ఏ వస్తువును చూస్తే అది నీకు అద్భుతంగా అనిపిస్తుందో, అది నా విభూతి అని గ్రహించు అర్జునా అన్నాడు కృష్ణపరమాత్మ. బలవంతులలో బలాన్ని నేను; తేజోవంతులలో తేజస్సును నేను; బుద్ధిమంతులలో బుద్ధిని నేను అన్నాను. అలా ఎన్నో అంశాలు పేర్కొన్నాడు. ఈ అధ్యాయాలన్నింటిలోనూ సారాంశం **ఈశ్వరుడు తానే జగత్తు అయ్యాడు**. ఆ విధంగా ఈ అధ్యాయాలలో ఈశ్వరస్వరూపాన్ని వర్ణించాడు.

**ఈశ్వరకృప** – ఈ అధ్యాయాలలో కృష్ణపరమాత్మ ఈశ్వరస్వరూపాన్నే కాదు, ఈశ్వర కృపను కూడా నొక్కివక్కాణించాడు. ఆధ్యాత్మికంగా ఎదగాలంటే శరణాగతి చూపి, ఈశ్వర కృప కోరాలి అని నిరూపించాడు. నిజానికి ఈ మధ్యమ షట్కము మొదలు పెట్టటమే దానితో మొదలుపెట్టాడు.

**మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్ మదాశ్రయః** – 7.1

నా ఆశ్రయాన్ని కోరు అంటే ఈశ్వరకృప కోరు అని అర్థం.

**యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్** – 8.13

ఈ స్థితిలో ఎవరైతే శరీరాన్ని వీడుతారో, వారు నన్నే పొందుతారు.

ఆ విధంగా, అడుగడుగునా ఈశ్వరకృప లేదా ఈశ్వర అనుగ్రహం గురించి నొక్కి వక్కాణిస్తూనే ఉన్నాడు. ముందే చూసినట్టుగా, మొదటి షట్కంలో ఫ్రీవిల్ ప్రాముఖ్యతను వర్ణిస్తే, ఇక్కడ ఈశ్వరకృపను వర్ణిస్తున్నాడు. ఈశ్వరకృపను గుర్తించని వ్యక్తి గర్వంగా ఉంటాడు. అతనికి గర్వభంగం తప్పదు. అదను చూసి గర్వభంగం కలిగిస్తాడు భగవంతుడు. కేనోపనిషత్‌లో దేవతలలో ఇంద్రుడు, అగ్ని, వాయువు తమవల్లనే రాక్షసులతో యుద్ధంలో గెలిచామని విర్రవీగుతుంటారు. ఈశ్వరుడు యక్షుని రూపంలో ప్రత్యక్షమయి, అగ్నికి, వాయువుకు గర్వభంగం కలిగిస్తాడు ముందు. భగవంతుణ్ణి శరణు వేడితే, గర్వం పోతుంది.

ప్రపంచంలో రెండురకాల మనుష్యులు ఉంటారు. అహంకారంతో నిండినవారు, తలరాతను నమ్మేవారు. అహంకారంతో నిండినవారు అంతా తమ గొప్పేనని విర్రవీగుతారు. తలరాతను నమ్మేవారు అంతా ఈశ్వరుని చేతిలో ఉంది; తమ చేతిలో ఏమీలేదు అంటారు. తెలివైనవారు మాత్రమే తమ విజయానికి కారణం ఈ రెండూ అని గ్రహిస్తారు. తమ కృషి, ఈశ్వరకృప రెండూ ఉండాలి. ఈశ్వరకృప స్థానంలో కృషిని పెట్టలేము; అలాగే కృషి స్థానంలో ఈశ్వరకృపను పెట్టలేము. రెండూ జతగా ఉండాల్సిందే.

**యథా హి ఏకేన చక్రేణ న రథస్య గతిర్భవేత్ ।**
**ఏవం పురుషకారేణ వినా దైవం న సిద్ధ్యతి ॥**

ఎలాగైతే ఒక రథం కేవలం ఒక చక్రంమీద నడవలేదో, అదే విధంగా మనిషి ఆధ్యాత్మిక ప్రయాణం పురుషప్రయత్నం లేకుండా కేవలం దైవకృపమీద నడవదు. ఈ విధంగా, ఈ మధ్యమ షట్కంలో కృష్ణపరమాత్మ ఈశ్వరకృప గురించి వివరించాడు.

మధ్యమ షట్కంలో మూడు అంశాలను చర్చిస్తాడని చూశాము. అవి ఈశ్వర స్వరూపం, ఈశ్వరకృప, ఈశ్వరధ్యానం. వీటిలో రెండు అంశాలను చూశాము ఇప్పటివరకు. అవి ఈశ్వర స్వరూపం, ఈశ్వరకృప. ఇక్కడ ఈశ్వరధ్యానం గురించి చెప్పబోతున్నాడు. అంటే భక్తి గురించి చెప్పబోతున్నాడు.

భక్తిని రెండు భిన్నమార్గాల్లో అర్థం చేసుకోవచ్చు. సందర్భాన్నిబట్టి భక్తికి రెండు భిన్న అర్థాలు కూడా ఇవ్వవచ్చు. అవి భావనారూపభక్తి, సాధనారూపభక్తి.

**భావనారూపభక్తి** – భక్తి అంటే ఒక అర్థం భగవంతునిమీద ప్రేమ. భగవంతునిమీద చూపించే భావనను భక్తి అంటారు.

**సా తు అస్మిన్ పరమప్రేమస్వరూపా** – నారద భక్తిసూత్రాలు

భక్తి అంటే ప్రేమ స్వరూపంగా వర్ణించారు నారదులవారు. ఈ భావనారూపభక్తిని ఏడవ అధ్యాయంలో వివరించాడు కృష్ణపరమాత్మ. అక్కడ భక్తిని మూడు స్థాయిల్లో వివరించాడు కృష్ణపరమాత్మ. మందభక్తి, మధ్యమభక్తి, ఉత్తమభక్తి.

**మందభక్తి** – మందభక్తిలో సకామభక్తి ఉంటుంది. అది లౌకిక విజయాలకోసం చేసే పూజ. ఈ భక్తిలో భగవంతునితో ఫక్తు వ్యాపారశైలిలో ఉంటుంది. ఇది అన్నింటికన్నా తక్కువస్థాయి భక్తి.

**మధ్యమభక్తి** – ఈ భక్తిలో కూడ కోరిక ఉంటుంది కాని, ఇందులో కోరిక లౌకిక విజయాలమీద కాదు. ఇందులో ఆధ్యాత్మిక ఎదుగుదల, ఆధ్యాత్మిక ఉన్నతి, చిత్తశుద్ధి కలుగుతుంది. దీన్ని సాధన చతుష్టయ సంపత్తి అంటారు. ఈ స్థాయిభక్తిలో అతనికి మోక్ష ఇచ్ఛ, శాస్త్రజ్ఞాన ఇచ్ఛ కలుగుతుంది. శాస్త్రజ్ఞానం పొందాలంటే గురువు కావాలి. తను గురువును వెతుక్కోలేనని, గురువును పంపమని భగవంతుణ్ణే దబాయిస్తాడు. ఇది కూడా వ్యాపారధోరణే. కాని కృష్ణపరమాత్మ అలా వ్యాపారధోరణికి కూడా నేను సిద్ధమే అన్నాడు.

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే ॥** – 10.10

అలా నిరంతరం విశ్వరూప దర్శనం చేసేవారికి నేను బుద్ధియోగం అంటే జ్ఞానయోగాన్ని ప్రసాదిస్తాను. దానిద్వారా వారు నన్నే పొందుతారు.

చిత్తశుద్ధి కావాలన్నా, జ్ఞానయోగ్యత పొందాలన్నా కూడా, అది సకామభక్తి కిందికే వస్తుంది. ఆ కోరిక తీర్చటానికి కూడా భగవంతుడు సిద్ధమే. అందువల్లనే విష్ణుసహస్రనామం ఫలశ్రుతిలో ఇలా వస్తుంది.

**ధర్మార్థీ ప్రాప్నుయాత్ ధర్మమ్ అర్థార్థీ చార్థమాప్నుయాత్ కామాన్ అవాప్నుయాత్ కామీ**

ఇందులో కూడ కోరిక ఉన్నా, ఇది ఆధ్యాత్మిక కోరిక కాబట్టి ముందుదానికన్నా ఉన్నతమైనదే. అందువల్ల దీన్ని మధ్యమభక్తి అంటారు.

**ఉత్తమభక్తి** – దీన్ని జ్ఞానీ భక్తి అంటారు. ఇందులో భక్తునికి ఏ విధమైన కోరికా ఉండదు. అతను జ్ఞానాన్ని కోరదు; మోక్షాన్ని కోరదు. ఈ భక్తుడు మోక్షం కోరదు అంటే అతనికి మోక్షం విలువ తెలియదని కాదు, అతను ముందే ముక్తపురుషుడు కాబట్టి మోక్షం కోరదు. అతను ముందే మోక్షం పొందేశాక, ఇంక అతనికి దేనిమీద కోరిక ఉంటుంది? లౌకిక విజయాలు కోరతాడా, ఆధ్యాత్మిక ఉన్నతి కోరతాడా? ఈ రెండు దశలూ దాటేశాడు అతను.

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥** – 3.18

అటువంటి జ్ఞాని కర్మలు చేసినా, చేయకపోయినా అతనికి ఏ విధమైన ప్రయోజనమూ ఉండదు. అతనికి ఎవరితోనూ బంధమూ ఉండదు.

జ్ఞానీభక్తుడు భగవంతుడు వేరు, తను వేరూ కాదని అర్థం చేసుకుంటాడు. అందువల్ల ఇతని భక్తి ఉత్తమభక్తి. మందభక్తిలో లౌకికవిజయాలు కోరితే, మధ్యమభక్తిలో ఆధ్యాత్మిక ఉన్నతి కోరితే, ఉత్తమభక్తిలో ఏ కోరికా ఉండదు.

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥** – 7.16

ఓ అర్జునా! నాలుగు రకాల భక్తులు నన్ను ప్రార్థిస్తారు. వారు ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు, జిజ్ఞాసభక్తుడు, జ్ఞానీభక్తుడు.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ పేర్కొన్న నలుగురిలో ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు లౌకిక విజయాలు కోరే సకామభక్తుడు కిందకు వస్తారు. అంటే మందభక్తుడులోకి వస్తారు. జిజ్ఞాసుభక్తుడు ఆధ్యాత్మిక ఉన్నతి కోరే మధ్యమభక్తునిలోకి వస్తాడు. జ్ఞానీభక్తుడు ఉత్తమ భక్తుని కిందకు వస్తాడు. అలా ఎలా చెప్పగలము? కృష్ణపరమాత్మే స్పష్టం చేస్తాడు ఈ విషయాన్ని.

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః ॥** – 7.17

ఈ చతుర్విధ భక్తులలో నిత్యం నన్నే ధ్యానించే జ్ఞానీభక్తుడు శ్రేష్ఠుడు. జ్ఞానికి నేనంటే ఇష్టం; నాకు కూడా అతనంటే చాలా ఇష్టం.

జ్ఞానీభక్తుడు అందరిలోకి శ్రేష్ఠుడు. ఎందుకంటే అతని భక్తి షరతులతో కూడని భక్తి. జ్ఞానీభక్తుని భక్తి స్వచ్ఛమైన భక్తి. ఈ వివరాలు గుర్తుంచుకోవాలి. ఎందుకంటే కృష్ణపరమాత్మ,

**యో మద్భక్తస్స మే ప్రియః** – 12.14

స మమ ప్రియః – జ్ఞానీభక్తుడు నాకు ప్రియమైనవాడు అంటాడు కృష్ణపరమాత్మ. అంతేకాదు, ఇంకొక అడుగు ముందుకు వెళ్ళి,

**ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** – 7.18

అందరు భక్తులూ శ్రేష్ఠమే అయినా జ్ఞానీభక్తుడు అందరిలోకి శ్రేష్ఠుడు అన్నాడు.

జ్ఞానీభక్తుడు భగవంతుడు, తాను ఒక్కరే అని అర్థం చేసుకుంటాడు. కాని తక్కిన భక్తులు ద్వైతభక్తిలోనే నిలిచిపోతారు. జ్ఞానీభక్తుడు మాత్రం అహం బ్రహ్మ అస్మి అనే ధ్యాసలో ఉంటాడు.

ఇదంతా భావనారూపభక్తి కిందికి వస్తుంది. దీన్ని అధ్యాయం 7లో చర్చించాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు భక్తిని ఇంకొక కోణంలోంచి చూడబోతున్నాము. దీన్ని సాధనారూప భక్తి అంటారు. కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో ఈ సాధనారూపభక్తిని బోధిస్తాడు. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయాన్ని చూద్దాము.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. భక్తియోగము : శ్లోకాలు 1–12
2. భక్తియోగఫలము : శ్లోకాలు 13–20

**1. భక్తియోగము : శ్లోకాలు 1–12** భక్తియోగములో ఒక సాధకుడు ప్రయాణించవలసిన సాధన దశల గురించి వస్తుంది. అందువల్ల దీన్ని సాధనరూపభక్తి అంటారు. సాధన దిగ్విజయంగా చేసి, తన లక్ష్యం పొందాక సాధకుడు సిద్ధపురుషుడు అవుతాడు. ఇంక అతను చేరాల్సిన గమ్యం ఉండదు. ప్రయాణం ముగిసిపోతుంది. అందువల్ల భక్తియోగఫలాన్ని సిద్ధభక్తి అని కూడా అంటారు. మొదటి భాగం భక్తిని మార్గంగా వర్ణిస్తే, రెండవభాగం భక్తిని లక్ష్యంగా వర్ణిస్తుంది.

ఈ అధ్యాయంలోని మొదటిభాగం చూస్తే, భక్తి గురించి ఉన్న అపోహను తొలగిస్తుంది. భక్తి ఒక ప్రత్యేక సాధన కాదు. అనేక ఆధ్యాత్మిక సాధనలతో కూడినది. ఈ ఆధ్యాత్మిక సాధనలను వేదాలు మూడుగా వర్ణిస్తాయి. అవి కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగం.

భగవద్గీత ఉపనిషత్తుల సారం కాబట్టి అందులో కూడా ఈ మూడు సాధనలనూ చూస్తాము. నిజానికి భక్తి అనే పదాన్ని విడిగా వేదాల్లో కాని, ఉపనిషత్తుల్లో కాని చూడము.

**కర్మయోగరూపభక్తి + ఉపాసనయోగరూపభక్తి + జ్ఞానయోగరూపభక్తి = భక్తియోగం**

ఎందుకు ఈ మూడింటినీ శాస్త్రం భక్తియోగంగా పేర్కొంది? ఎందుకంటే, ఈశ్వరభక్తి ఉంటేనే ఈ మూడు యోగాలూ సాధ్యమని కృష్ణపరమాత్మ కూడా భావిస్తున్నాడు. ఈశ్వరభక్తి లేనిదే వీటిని ఆచరించలేము. అందువల్ల ఈ మూడింటినీ కలిపి భక్తియోగం అనవచ్చు. ఒక బస్సు డ్రైవరు కూడా, బస్సు నడపటానికి స్టీరింగ్‌వీల్ ముట్టుకునే ముందు, బస్సులో తన ఎదురుగా పెట్టుకున్న భగవంతునికి భక్తిగా నమస్కారం చేస్తాడు. అది సాధన. అలా అన్ని సాధనల వెనకా భక్తి ఉంటుంది.

మనం ఇక్కడ మూడు సాధనల గురించి చెప్పినా, శాస్త్రం అనేక ఆధ్యాత్మిక సాధనల గురించి చెబుతుంది. కృష్ణపరమాత్మే కొన్నింటిని నాలుగవ అధ్యాయంలో పేర్కొన్నాడు. ఆ సాధనలకు యజ్ఞం పేరు వాడాడు.

**ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే ।**
**స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥** – 4.28
**అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాపరే ।**
**ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః ॥** – 4.29

కొంతమంది ద్రవ్యసంబంధమైన యజ్ఞాలను, మరికొంతమంది తపస్సును, కొందరు యోగాన్ని చేస్తారు. మరికొంతమంది స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాన్ని చేస్తే, కొంతమంది అహింసాది వ్రతాలను పాటిస్తారు.

కొంతమంది అపానవాయువుమీద ప్రాణవాయువును, మరికొంతమంది ప్రాణవాయువు మీద అపానవాయువును హవనం చేస్తారు.

ఆ విధంగా మనం చేసే ప్రతి ఒక్క పనీ ఒక ఆధ్యాత్మిక సాధన. ప్రాణాయస్వాహా అని నివేదన చేయటం కూడా ఒక యజ్ఞమే. ఆఖరికి ఇంద్రియసుఖాలను అనుభవించటం కూడా యజ్ఞంలా చేయవచ్చు. కృష్ణపరమాత్మ దానిని విషయభోగయజ్ఞం అంటాడు.

**ఆత్మా త్వం గిరిజా మతిః సహచరాః ప్రాణాః శరీరం గృహం**
**పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః ।**
**సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో**
**యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శమ్భో తవారాధనమ్ ॥** శివమానసపూజా 4

ఆ విధంగా అనంతంగా ఉన్నాయి సాధనలు. వాటన్నింటి గురించీ చెప్పటం అసాధ్యం. వాటన్నింటినీ సాధారణంగా మూడు ప్రధాన సాధనలుగా చూడవచ్చు. అవి కర్మరూపభక్తి, ఉపాసనరూపభక్తి, జ్ఞానరూపభక్తి.

1. **కర్మరూపభక్తి** – మొదటిస్థాయిలో భక్తిని కర్మరూపభక్తి అంటారు. ఈ భక్తి శరీర ప్రధానంగా ఉంటుంది. అందువల్ల దీన్ని కాయికపూజ అంటారు. మనం చేసే యజ్ఞ యాగాదులన్నీ ఈ కర్మరూపభక్తిలోకి వస్తాయి.

2. **ఉపాసనరూపభక్తి** – రెండవస్థాయిలో భక్తిని ఉపాసనరూపభక్తి అంటారు. ఇందులో కాయికపూజ ఉండదు. ఇంద్రియాలను అంతర్ముఖం చేస్తారు. ఈ భక్తి మనస్సు ప్రధానంగా ఉంటుంది. ఒకచోట కూర్చుని ధ్యానం చేస్తాడు ఉపాసకుడు. మనకెన్నో మానసపూజలు ఉన్నాయి. వాటిలో శివమానసపూజ ఒకటి.

**కల్లోలోల్లసితామృతాఖిలహరీ మధ్యే విరాజన్మణి–**
**ద్వీపే కల్పకవాటికాపరివృతే కాదమ్బవాట్యుజ్జ్వలే ।**
**రత్నస్తమ్భసహస్రనిర్మితసభామధ్యే విమానోత్తమే**
**చింతారత్నవినిర్మితం జనని తే సింహాసనం భావయే ॥1॥**

– మంత్రమాతృకా పుష్పమాల

ఈ మంత్రమాతృకా పుష్పమాలస్తవం శంకరాచార్యులవారిచే రచించబడిన అద్భుత స్తోత్రం. 16 శ్లోకాలు ఉంటాయి ఇందులో. ఇది దేవికి అర్పించిన మానసపూజ. ఇలా మనస్సుతో చేసే పూజను ఉపాసనరూపభక్తి అంటారు.

3. **జ్ఞానరూపభక్తి** – మూడవస్థాయి, చివరిస్థాయి అయిన భక్తిని జ్ఞానరూపభక్తి అంటారు. ఈ స్థాయిలో భక్తి విచారణ రూపంలో ఉంటుంది. భగవంతుని స్వరూపం గురించి వేదాంతాన్ని అధ్యయనం చేసి తెలుసుకోవటం. ఇన్నాళ్ళూ భగవంతుని స్వరూపం ఏమిటో తెలుసుకోవాలనే ప్రయత్నం కూడా చేయకుండా పూజిస్తూ వచ్చాము. ఇప్పుడు ఆ స్వరూపాన్నే తెలుసుకోవాలనే తపన ఏర్పడుతుంది. దాన్ని జ్ఞానరూపభక్తి అంటారు.

బ్రహ్మజ్ఞానం పొందాలంటే శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు ద్వారా శాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనం చేయాలి. ఇప్పుడు మనం చేస్తున్నది ఈ జ్ఞానయజ్ఞమే. ఇది కూడా ఒక విధమైన పూజలోకి వస్తుంది. నిజం చెప్పాలంటే, కృష్ణపరమాత్మ నాలుగవ అధ్యాయంలో చెప్పినట్టు, ఇది ఒక విధమైన పూజ మాత్రమే కాదు, ఇది అత్యున్నతమైన పూజ.

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥** – 4.33

ఓ అర్జునా! ద్రవ్యమయ యజ్ఞంకంటే జ్ఞానయజ్ఞం అత్యంత శ్రేష్ఠమైనది. కర్మలన్నీ జ్ఞానంలోనే పరిసమాప్తి చెందుతాయి.

జ్ఞానయజ్ఞం భక్తిలో అత్యున్నతమైన స్థాయి.

**కర్మ, ఉపాసన లేనిదే జ్ఞానం అసాధ్యం**
**జ్ఞానానికి రానిదే కర్మ, ఉపాసన అసంపూర్ణం**

అందువల్లనే ఒక సాధకుడు కర్మరూపభక్తితో మొదలుపెట్టి, అక్కణ్ణుంచి ఉపాసనరూప భక్తికి వచ్చి, జ్ఞానరూపభక్తికి చేరుకోవాలి.

కాని, ఈ మూడు దశలే ఉంటే, సామాన్య మానవులకు అవి ఎక్కటం కష్టమవవచ్చు. కొన్నిచోట్ల మెట్లు చాలా ఎత్తుగా ఉంటే, వాటిని పడగొట్టి ఇంకా చిన్న మెట్లు చేస్తారు. ఆ విధంగా కృష్ణపరమాత్మ కూడా ఈ మూడు స్థాయిలను ఐదు స్థాయిలు చేశాడు. అధ్యాయంలో కృష్ణపరమాత్మ పైమెట్టుమీంచి కింది మెట్టుకు వస్తాడు. కాని మనం ఈ దశలను అర్థం చేసుకుని, ఒక్కొక్క మెట్టూ పైకెక్కటానికి వీలుగా, మనం కిందినుంచి పైకి వెళదాము (కేజీనుంచి పీజీకి వెళ్ళినట్టుగా).

## ఐదు మెట్ల భక్తియోగం

| | | | |
|---|---|---|---|
| కర్మయోగం స్థాయి | 1 | – సకామకర్మప్రధాన కర్మయోగం | – 1 |
| కర్మయోగం స్థాయి | 2 | – నిష్కామకర్మప్రధాన కర్మయోగం | – 2 |
| ఉపాసనయోగం స్థాయి | 1 | – ఏకరూప ఈశ్వరధ్యానం | – 3 |
| ఉపాసనయోగం స్థాయి | 2 | – అనేకరూప ఈశ్వరధ్యానం | – 4 |
| జ్ఞానయోగం | | – అరూప / అక్షర ఉపాసన | – 5 |

ఆ విధంగా కృష్ణపరమాత్మ కర్మయోగాన్ని రెండు దశలుగా, ఉపాసనయోగాన్ని రెండు దశలుగా విభజించాడు. జ్ఞానయోగాన్ని అలాగే ఉంచాడు. 2+2+1=5. వీటిని వివరంగా చూద్దాము.

1. **సకామకర్మప్రధాన కర్మయోగం** – రెండు దశల కర్మయోగాల్లో సూక్ష్మభేదం ఉంది. మోక్షంమీద కోరిక లేనివారు, మానవసేవమీద ఆపేక్ష లేనివారు, స్వార్థపూరితులుగా ఉండేవారు ఈ రకం కేవలకర్మఠుల కిందకు వస్తారు. వారు ప్రాపంచిక సుఖాలు, లౌకిక లక్ష్యాలు కోరతారు. చాలామంది సకామభక్తితోనే మొదలుపెడతారు. నిజానికి మన మతమే సకామభక్తిని ముందు పరిచయం చేస్తుంది. భగవంతుణ్ణి ఈ కోరికలు తీర్చుకోవటానికి ప్రార్థించవచ్చు అంటుంది. అందువల్ల కృష్ణపరమాత్మ కూడా అలా కోరితే తప్పేంలేదు అంటాడు.

స్వార్థపూరితంగా ఉండండి తప్పులేదు. మీ విజయాలకోసం ఎన్నైనా సకామకర్మలు చేయండి కాని, రెండు నిబంధనలు పాటించండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఎ) **ధర్మబద్ధం** – ఏ కోరికలు కోరినా, ఏ లక్ష్యాలు పొందినా వాటిని ధర్మపరంగానే పొందాలి. అక్రమపద్ధతిలో సాధించకూడదు.

బి) **ఈశ్వర ప్రసాదం** – ఇది ఇంకా ముఖ్యమైన నిబంధన. ఈశ్వర ప్రసాదబుద్ధితో ఫలాన్ని స్వీకరించండి. జీవితంలో ఏం సాధించినా, ఆ ఫలాలను, ఆ సుఖాలను అనుభవించే ముందు వాటిని మీ గొప్పదనంగా భావించకూడదు. ఫలాన్ని అనుభవించండి కాని, 'నేను చేశాను, నేను సాధించాను,' అని పొంగిపోకండి. ఫలాన్ని అనుభవించండి కాని, దాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించండి. పేరులో చిన్న మార్పు అంతే. అంతకుముందు దాన్ని కర్మఫలం అంటే ఇప్పుడే అదే కర్మఫలాన్ని ఈశ్వరప్రసాదం అంటున్నారు అంతే. దీనివల్ల మీ దృక్పథంలో మార్పు వస్తుంది.

వ్యాపారంలో మీరు పొందే విజయం, మీరు పొందే లాభాలు, మీరు ఎంతో ప్రణాళికలు వేసి ముచ్చటపడి మీరు కొనుక్కున్న ఇల్లు – అన్నీ ఈశ్వరప్రసాదమే. కొత్త ఇంటికి లక్ష్మీనిలయం అని భగవంతుని పేరుపెట్టి, లక్ష్మీదేవి పటం పెట్టారనుకోండి, దాని అర్థం పరోక్షంగా మీ ఇంటిని ఒక ఆలయంగా భావిస్తున్నారు. భగవంతుని ఆలయంలో మీరు కూడా ఉండటానికి భగవంతుని అనుమతి కోరుతున్నారు. దానివల్ల దృక్పథంలో పెద్ద మార్పు వస్తుంది.

**మొదటిస్థాయి కర్మయోగం – ఈశ్వర ప్రసాదబుద్ధ్యా సకామకర్మ అనుష్ఠానం.**

2. **నిష్కామకర్మప్రధాన కర్మయోగం** – ఇది కూడా కర్మ ప్రధానంగానే ఉంటుంది. కాని భేదం ఎక్కడంటే, ఇందులో సకామకర్మలు తగ్గుతాయి, స్వార్థం తగ్గుతుంది; ఆత్మవిమర్శ మొదలవుతుంది. ఇంద్రియసుఖాల వెంట పరుగులు తీయటం మాని, ధనం వెంట పరుగులు తీయటం మాని, సమాజశ్రేయస్సుకోసం ఆలోచిస్తాడు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆంతర ఎదుగుదలకోసం ప్రయత్నిస్తాడు. అలా ఆంతర ఎదుగుదలకు తోడ్పడే కర్మలు ఉన్నాయంటుంది శాస్త్రం. వాటిని విహితకర్మలు అంటుంది. ధనం సంపాదించినా కూడా స్వార్థంకోసం సంపాదించడు. దాన్ని లౌకిక విజయాలకోసం కాకుండా, చిత్తశుద్ధికోసం సంపాదిస్తాడు.

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥** – 18.5

యజ్ఞం, దానం, తపస్సు అనే కర్మలను త్యజించకూడదు. వాటిని నిత్యం అనుష్ఠించాలి. ఎందుకంటే, యజ్ఞదానతపస్సులే బుద్ధిమంతులైన వారిని పవిత్రులుగా చేస్తుంది.

ఈ స్థాయిలో చేసే పరోపకారకర్మలు, నిష్కామకర్మలు పంచమహాయజ్ఞాలలోకి వస్తాయి.

ఎ) **దైవయజ్ఞం** – లౌకిక విజయాలు కోరకుండా, నిష్కామంగా పూజలు చేయటం.

బి) **పితృయజ్ఞం** – పితృదేవతలకు తర్పణాలు వదలటం, శ్రాద్ధకర్మలు చేయటం.

సి) **బ్రహ్మయజ్ఞం** – ఋషులు అందజేసిన శాస్త్రాన్ని అధ్యయనం చేయటం, శాస్త్రాన్ని నలుగురికీ చేరేలా కృషిచేయటం.

డి) **మనుష్యయజ్ఞం** – తోటి మానవులకు సేవ చేయటం.

ఇ) **భూతయజ్ఞం** – జంతువులను ప్రేమగా చూడటం, వృక్షాలను పరిరక్షించటం.

ఈ దైవయజ్ఞం, పితృయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం – ఈ ఐదింటినీ కలిపి పంచమహాయజ్ఞాలు అంటారు. స్వార్థచింతన లేకుండా, పరులమీద శ్రద్ధతో చేసే ఈ కర్మలవల్ల అంతకంతకూ చిత్తశుద్ధి పెరుగుతుంది.

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణాః వివిదిషంతి యజ్ఞేన దానేన తపసా అనాశకేన**

– బృహదారణ్యకమ్ 4.4.22

దీనివల్ల వేదాంతంమీద ఆసక్తి పెరుగుతుంది.

ఈ రెండు స్థాయిలూ కర్మప్రధానమైనవి. మొదటిదాంట్లో స్వార్థపూరితకర్మలు చేస్తే, ఇందులో నిస్వార్థకర్మలు చేస్తారు. మొదటిస్థాయిలో ఈశ్వరప్రసాద బుద్ధితో ఫలాన్ని స్వీకరిస్తే రెండవస్థాయిలో ఈశ్వరార్పణ భావనతో కర్మ చేస్తారు.

**రెండవస్థాయి కర్మయోగం – ఈశ్వరార్పణ భావనయా నిష్కామకర్మ అనుష్ఠానం.**

కర్మయోగం = ఈశ్వరార్పణ బుద్ధి + ఈశ్వరప్రసాద బుద్ధి

ఈ రెండు స్థాయిలు దాటితే, మీరు మూడవస్థాయి భక్తికి అర్హులు అవుతారు.

3. **ఏకరూప ఈశ్వరధ్యానం** – ఈశ్వరార్పణబుద్ధితో కర్మలు చేసి, ఈశ్వరప్రసాదబుద్ధితో కర్మఫలాన్ని స్వీకరించటం నేర్చుకుంటే, చిత్తశుద్ధి పెరిగి నెమ్మదిగా కర్మలను తగ్గించటం నేర్చుకుంటారు. కర్మలు మానుతున్నాననే అపరాధభావన లేకుండా, ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం పాటుపడతారు. కర్మయోగంలో బహిర్ముఖులుగా ఉంటారు; ఉపాసనయోగంలో అంతర్ముఖులవుతారు. ఉపాసనను కూడా రెండు స్థాయిలుగా విభజిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

మొదటిస్థాయిలో ఏకరూప ఈశ్వరధ్యానం వస్తుంది. దీన్నే ఇష్టదేవతా ఉపాసన అనికూడా అంటారు. ఈ ధ్యానాన్ని కృష్ణపరమాత్మ అభ్యాసయోగం అంటున్నాడు. భగవంతుణ్ణి ఒక రూపంలో కొలుస్తారు ఇందులో. రాముడు, కృష్ణుడు, దేవి, లక్ష్మి, సరస్వతి – ఈ రూపాల్లో ఏదో ఒకరూపంలో కొలుస్తారు. అంటే స్త్రీరూపంలోనో, పురుషరూపంలోనో, జంతురూపంలోనో, సగం పురుషుడు సగం జంతువు రూపంలోనో ఉన్న భగవంతుణ్ణి తీసుకుని ధ్యానం చేయవచ్చు.

ధ్యానం అంటే ఉపాసన; ఈశ్వర అంటే భగవంతుడు; ఏకరూప అంటే ఒక ఆకారం. అందువల్ల ఏకరూప ఈశ్వరధ్యానం అంటే ఇష్టదేవతా ఉపాసన. ఏ దేవుడు ఎక్కువ శక్తిమంతుడు అనే శంక పెట్టుకోనవసరం లేదు. అందరు దేవుళ్ళూ సమానంగా శక్తిమంతులే. కృష్ణపరమాత్మే అది చెప్పాడు.

**యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥** – 7.21

ఎవరు ఏ దేవతా స్వరూపాలను భక్తిశ్రద్ధలతో పూజింప నిశ్చయించుకున్నా కూడా, ఆ భక్తునికి ఆయా దేవతలమీదే భక్తిశ్రద్ధలు స్థిరంగా ఉండేలాగా నేను చేస్తాను అన్నాడు కృష్ణపరమాత్మ.

**మొదటిస్థాయి ఉపాసనయోగం – ఏకరూప ఈశ్వరధ్యానం.**

4. **అనేకరూప ఈశ్వరధ్యానం** – ఇది కూడా ఉపాసనే. ఏకరూపభక్తిలో ఉన్నప్పుడు, ఆ ఇష్టదేవతమీద బంధం పెంచుకునే అవకాశం ఉంది. బంధం పెంచుకుంటే ఫర్వాలేదు, కాని ఆ బంధం ఎంత తీవ్రరూపం దాలుస్తుందంటే, తక్కిన దేవతలను ద్వేషించే స్థాయికి తీసుకువెళుతుంది. దాని మూలాన మతకలహాలు ఏర్పడతాయి. పరమతాలలో కాదు, హిందూమతంలోనే శివభక్తులకూ, విష్ణుభక్తులకూ మధ్య తీవ్రమైన కలహాలు చెలరేగుతాయి. దాన్నే మతోన్మాదం అంటారు. శివుడు ఎక్కువ అని శివభక్తులు అంటే, విష్ణుమూర్తే దేవుడు అని విష్ణుభక్తులు అంటారు.

అలా ఏకరూప ఈశ్వరుణ్ణి కొలవటంలో ఇంకొక ప్రమాదం కూడా ఉంది. భగవంతునికి ఒక రూపం ఇచ్చేసరికి ఆయనకి దేశపరిమితి, కాలపరిమితి కూడా విధించిన వారవుతారు. అప్పుడు మతం మీకు బలాన్ని ఇవ్వాల్సింది పోయి, అంతులేని బెంగను, ఆందోళనను కలుగజేస్తుంది. దేవుడు బలాన్నిచ్చే బదులు, భయహేతువు అవుతున్నాడంటే, దానికి కారణం భగవంతుణ్ణి ఎలా కొలవాలో తెలియకపోవటమే.

ఈ అవస్థనుంచి బయటపడేయటానికి కృష్ణపరమాత్మ నాలుగవ దశ భక్తిని పరిచయం చేస్తున్నాడు. దాన్ని అనేకరూప ఈశ్వరధ్యానం అంటారు.

**సహస్రశీర్షాః పురుషః సహస్రాక్షః సహస్రపాత్ స భూమిం విశ్వతో వృత్వా। అత్యతిష్ఠద్దశాంగులమ్ ॥** – పురుషసూక్తం

**సర్వతః పాణిపాదం తత్ సర్వతోऽక్షిశిరోముఖమ్ ।**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥** – 13.14

ఆ పరమాత్ముని చేతులు, పాదములు, నేత్రములు, చెవులు, శిరస్సులు, ముఖములు సర్వత్ర స్థితములై ఉన్నాయి. అతను సర్వాన్నీ ఆవరించి ఉన్నాడు.

**విశ్వతశ్చక్షురుత విశ్వతో ముఖో విశ్వతో హస్త ఉత విశ్వతస్పాత్**
**సం బాహుభ్యాం నమతి సం పతత్రైర్ద్యావా పృథివీ జనయన్ దేవ ఏకః**

– మహానారాయణోపనిషత్ 1.13

స్వయంప్రకాశక పరమాత్మ, ఏకం అయిన పరమాత్మ భూమిని, ఊర్ధ్వలోకాలను కూడా సృష్టించాడు. కళ్ళు, ముఖాలు, చేతులు అంతటా ఉన్న పరమేశ్వరుడు, తన కాళ్ళు, చేతులతో అంతటినీ నియంత్రిస్తాడు.

భగవంతునికి ముఖాలు అంతటా ఉన్నాయి అంటే అర్థం, అందరి ముఖాలు భగవంతునివే. భగవంతుడు తానే జగత్తు అయ్యాడు అన్నాము. అందువల్ల అందరూ భగవంతుడే. సహస్రశీర్ష పురుషుడు ఆయన. దీన్ని విశ్వరూప ఉపాసన అంటారు. ఏ దేవుని ధ్యానశ్లోకం చూసినా ఈ విశ్వరూప వర్ణన వస్తుంది.

**క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణి విలసత్ సైకతే మౌక్తికానాం।**
**మాలాక్లుప్తాసనస్థః స్ఫటికమణినిభైః, మౌక్తికైః మణ్డితాంగః।**
**శుభ్రైరభ్రైరదభ్రైః ఉపరి విరచితైః ముక్తపీయూషవర్షైః।**
**ఆనందీ నః పునీయాత్ అరినలినగదాశంఖపాణిః ముకుందః॥** – విష్ణుసహస్రనామం

విశ్వంగా భగవంతుడు ఉన్నాడు. ఈ విశ్వరూపంమీద ధ్యానం చేయాలి. దీన్నే అనేకరూప ఈశ్వరధ్యానం అంటారు. విశ్వరూపదర్శనం మనం అధ్యాయం 11లో చేసుకున్నాము.

**రెండవస్థాయి ఉపాసన యోగం – అనేకరూప ఈశ్వరధ్యానం.**

ఈ రెండు ఉపాసనలూ సగుణఈశ్వర ధ్యానంలోకే వస్తాయి. ఇంతవరకూ నాలుగు దశలు చూశాము. వాటిని టూకీగా చూస్తే –

| | | |
|---|---|---|
| కర్మయోగం 1, 2 | – ఈశ్వరార్పణబుద్ధి | + ఈశ్వరప్రసాదబుద్ధి |
| ఉపాసనయోగం 1, 2 | – ఏకరూప ఈశ్వరధ్యానం | + అనేకరూప ఈశ్వరధ్యానం |

ఇందులో అన్ని దశలూ ముఖ్యమే, అన్ని దశలూ అవసరమే. స్కూల్లో ఒక్కొక్క క్లాసుగా ఎలా ఎక్కుతూ వస్తారో, అలా ఆధ్యాత్మిక స్కూల్లో ఈ దశలు కూడా ఒక్కొక్కటీ ఎక్కుతూ రావాలి. అన్నీ ముఖ్యమే కాబట్టి, వీటిలో ఏదో ఒక దశను ఎన్నుకునే ప్రశ్నేలేదు. అందరూ ఇదే వరుసక్రమాన్ని పాటిస్తూ పైకి ఎక్కుతూ రావాలి. ఈ నాలుగు స్థాయిలూ పాటిస్తే, వాటితో జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. అప్పుడు ఐదవస్థాయి అయిన జ్ఞానయోగంలోకి రావచ్చు.

5. **అరూప అక్షరధ్యానం** – ఆఖరిదశ అయిన ఐదవదశ జ్ఞానప్రధానభక్తి. జ్ఞానం అంటే విచారణ, అంటే శాస్త్రఅధ్యయనం చేయటం. ఈ దశలో గురువు చాలా ముఖ్యం. కృష్ణపరమాత్మే ఆ విషయాన్ని చెప్పాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

ఆత్మజ్ఞానాన్ని గురువు ద్వారానే పొందాలి. కాని ఆత్మజ్ఞానం దాకా వస్తారా లేదా అనేది వారి ఇష్టం. కృష్ణపరమాత్మ అందరినీ బలవంతపెట్టడు. నిజానికి, ఈ సలహా కృష్ణపరమాత్మ అర్జునునికి ఇవ్వనవసరం లేదు. ఎందుకంటే ఇప్పటికే అర్జునుడు కృష్ణపరమాత్మను శరణు వేడి, గురువుగా మార్చుకుని, ఆయన బోధను వింటున్నాడు. కాని ఎందుకు చెబుతున్నాడు? అర్జునుని ద్వారా మానవాళికి ఈ నియమం చెబుతున్నాడు. గురువు ద్వారానే శాస్త్ర అధ్యయనం చేయాలి. అదే భక్తిసాధనలో ఆఖరిదశ. శాస్త్రఅధ్యయనంలో ఈశ్వర విచారణ జరుగుతుంది. ఈశ్వరవిచారణలో మళ్ళీ మూడు దశలు ఉన్నాయి. అవి శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

ఈశ్వరవిచారణ ద్వారా భగవంతుడు ఏకరూప ఈశ్వరుడు కాదు, అనేకరూప ఈశ్వరుడు కాదు అని నేర్చుకుంటారు. ఈ రెండూ కూడా సగుణబ్రహ్మ రూపాల్లోకే వస్తాయి అని చూశాము. ఇప్పుడు ఈశ్వరుడు అంటే నిర్గుణబ్రహ్మ లేదా అరూపఈశ్వరుడు అని అర్థం చేసుకుంటారు. భగవంతునికి ఒకరూపం లేదు, అనేక రూపాలు లేవు, భగవంతుడు అంటే నిరాకారం, నిర్గుణం అని నేర్చుకుంటారు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్ తథారసం నిత్యమగంధవచ్చ యత్** – కఠ 1.3.15

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు లేవు. భగవంతుడు అప్రాణః, అమనః, అశరీరః. శరీరం, మనస్సు, ప్రాణం లేవు. అపాణిపాదం – కాళ్ళు చేతులు లేవు. ఈ వర్ణన ఉపనిషత్తులలో చూస్తాము. ఇది భగవంతునియొక్క పరాప్రకృతి, నిర్గుణస్వరూపం.

ఈ నిర్గుణస్వరూప భక్తికి వస్తే, ఇంక కాయికపూజ లేదు, మానసధ్యానం లేదు. ఎందుకంటే నిర్గుణఈశ్వరుడు ఉపాస్యవస్తువు కాదు. ద్వైతభావన లేదు. మనస్సు సగుణ వస్తువునే అర్థం చేసుకోగలదు. ఎందుకుంటే మనస్సు కూడా ఒక ఇంద్రియమే.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి। నో మనః** – కేన 1.3

అక్కడికి (బ్రహ్మ దగ్గరికి) కన్ను వెళ్ళదు, వాక్కు వెళ్ళదు, మనస్సు కూడా వెళ్ళదు.

అందువల్ల నిర్గుణభక్తి అంటే నిర్గుణబ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోలేము అని తెలుసుకోవటమే. ఆబ్జెక్టుగా చూడలేము, తెలుసుకోలేము, అర్థం చేసుకోలేము అనగానే, నిర్గుణబ్రహ్మ లేదు అనుకుంటాము. కాని ఉపనిషత్తులు లేదు లేదు, నిర్గుణబ్రహ్మ ఉన్నాడు

అంటాయి. ఉనికి ఉంది కాని, ఆబ్జెక్టు కాదు అంటే ఏమిటి? దానికి జవాబు ఒక్కటే – **తత్ త్వమ్ అసి.**

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
**అనుభవిస్తున్న నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

నిర్గుణభక్తి అంటే వేదాంతవిచారణ ద్వారా చైతన్యపరంగా నేను, నిర్గుణబ్రహ్మ వేరు కాదని అర్థం చేసుకోవటం.

**అహమేవ సః స ఏవ అహమస్మి**
**నేనే బ్రహ్మను, బ్రహ్మే నేను.**

ఈ మహావాక్యాన్ని అర్థం చేసుకోవాలి. ఈ జ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారానే పొందగలరు.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, ఒక శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గర వేదాంత అధ్యయనం చేయటం. బోధ కష్టమేమీ కాదు. తత్ త్వం అసి అని నేర్పిస్తుంది. నువ్వే ఆ బ్రహ్మవు అంటుంది. ఇందులో ప్రతి ఒక్క పదాన్ని అర్థం చేసుకుని, దాని లక్ష్యార్థం గ్రహించటానికి ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాల్సి ఉంటుంది. కెమిస్ట్రీలోని ఈక్వేషన్‌ను ఎంత క్రమపద్ధతిలో నేర్చుకుంటామో, ఆధ్యాత్మిక విద్యలో జీవుడు = ఈశ్వరుడు ఈక్వేషన్‌ను కూడా అంత క్రమపద్ధతిలోనూ నేర్చుకోవాలి.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయీ**– బృహదారణ్యకమ్

ఆత్మజ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనం ద్వారానే పొందాలి. ఇదికాక వేరే మార్గం లేదు. ఒకవేళ ఈ జ్ఞానాన్ని స్పర్శదీక్ష ద్వారానో, నయనదీక్ష ద్వారానో పొందగలిగి ఉంటే, కృష్ణపరమాత్మ ఆ మార్గాన్నే ఉపయోగించి ఉండేవాడు. కాని రణరంగంలో కూర్చుని అంతసేపు అర్జునునికి బోధించి ఉండేవాడు కాదు. కృష్ణపరమాత్మకు ఈ దగ్గరి దోవ తెలియలేదు అంటే వేరే ఎవరికీ తెలిసే అవకాశం లేదు. అంటే దీని అర్థం జ్ఞానం పొందటానికి వేరే దగ్గరి దోవ లేదు; ఒక క్రమపద్ధతిలో శాస్త్ర అధ్యయనం చేయటం ఒక్కటే మార్గం. ఆ విధంగా మొదటిదశ శ్రవణం. **శ్రవణం అజ్ఞాన నివృత్తి చేస్తుంది.**

**మననం** – ఏదైనా నేర్చుకునేటప్పుడు, మధ్యలో సందేహాలు రావటం సహజం. ఆ సందేహాలను తీర్చుకు తీరాలి. ఎందుకంటే, సందేహాలతో కూడిన జ్ఞానం, అజ్ఞానంతో సమానం. ఉదాహరణకు ఇక్కడొక వైర్ ఉంది. అది కరెంట్ వైరో కాదో మీకు తెలియదు. మీరు పక్కనున్నవారెవరినో అడుగుతారు. అతనేమో కరెంట్ వైర్ కాదు అంటాడు. మీరు దాన్ని పట్టుకోబోతుండగా, '99 శాతం అది కరెంట్ వైర్ కాదనుకుంటాను, కాని ఒక శాతం సందేహంగా ఉంది,' అంటాడు. మీరు ఒక శాతమే కదా అని దాన్ని పట్టుకుంటారా?

ఒక్కశాతం సందేహం ఉన్నాకూడా అది మొత్తం పరిస్థితిని గురించిన పూర్తి అజ్ఞానంతో సమానమే. మీరు వైర్‌ను పట్టుకునే సాహసం చేయరు. ఇలా మీకేమైనా సందేహాలు ఉంటే, మననం దశలో తీర్చుకోవచ్చు. **మననం సంశయనివృత్తి చేస్తుంది.**

**నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం మనకూ భగవంతునికీ మధ్య ఉన్న భేదదృష్టిని పారద్రోలుతుంది. ఎందుకంటే మనం సంవత్సరాల తరబడీ, భగవంతుడు శ్రేష్ఠుడు, మనం అల్పులం అనే భావనలో కూరుకుపోయాము. భగవంతుడు శ్రేష్ఠుడు అనుకోవటంలో తప్పులేదు. నిజానికి అది భక్తియొక్క చిహ్నం. ఆ భావన అద్భుతం. కాని తరువాత అంశంతోనే వస్తుంది చిక్కంతా. 'నేను అల్పజ్ఞుణ్ణి, నేను పరిమితి ఉన్న జీవిని, నేను నిస్సహాయుణ్ణి,' భావనలు దాసోహం, దీనోహం ప్రవృత్తితో నింపివేస్తాయి మనను. ఈ ఆత్మన్యూనతాభావన, ఆత్మనింద ఎంత ఎక్కువగా ఉంటాయంటే, మనం విధించుకున్న పరిమితులనుంచి అంత తేలికగా బయటపడలేము. సంసారం నిర్వచనమే 'నేను పరిమితి ఉన్న జీవిని,' అనే భావనలో కూరుకుపోవటం.

అందువల్ల భగవంతుడు శ్రేష్ఠుడు అని మాత్రం నేర్చుకుంటే చాలదు. అది మన పరిమితులను తొలగించదు. ఇంకా మాట్లాడితే పరిమితి భావనను ఇంకా ఎక్కువ చేస్తుంది. నేను దాసుణ్ణి అనే భావనను ఇంకా పెంచి పోషిస్తుంది. అందువల్ల దైవపూజ, యజ్ఞ యాగాదులు చేయటంవల్ల భగవంతుణ్ణి కొలుస్తాము కాబట్టి లౌకిక విజయాలు పొందుతాము నిజమే. కాని భక్తితోపాటు దానికి సమాంతరరేఖలా, మనను మనం కించపరచుకోవటం కూడా పెరుగుతుంది.

అందువల్ల వేదాంతం భగవంతుడెవరో చెప్పి ఊర్కోదు; మనమెవరో కూడా నేర్పిస్తుంది. మన స్వస్వరూపాన్ని వర్ణిస్తుంది. 'నువ్వు ఒక మామూలు బాధాతప్త పాపివి కాదు, నువ్వు అమృతానివి; నువ్వు నిత్యశుద్ధముక్త స్వరూపుడివి,' అని నేర్పిస్తుంది. ఈ జ్ఞానం జీర్ణం చేసుకున్న శిష్యుడు ఇలా అంటాడు.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**మయి సర్వం లయం యాతి తత్ బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥** – కైవల్యమ్ 19

నానుంచే సృష్టి వచ్చింది, నేనే స్థితికారకుణ్ణి, నాలోనే అంతా లయమవుతుంది. బ్రహ్మ అద్వయం, ఆ బ్రహ్మను నేనే.

**అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ। ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోక్షితః ఇతి త్రిశంకోర్వేదానువచనమ్ ॥**

నేను సంసారవృక్షానికి మూలాన్ని. నా కీర్తి పర్వత శిఖరమంత ఎత్తైనది. పవిత్రమైన వారిలో పవిత్రుణ్ణి నేను. నేను అమృతాన్ని. నేను సూర్యునివంటివాణ్ణి. ఇవన్నీ నేను

కాంతివంతమైన ఆత్మజ్ఞానంవల్ల పొందాను. నేను సర్వజ్ఞుడైన, శాశ్వతమైన బ్రహ్మను. దీన్ని త్రిశంకు ఋషి తను జ్ఞానం పొందాక చెప్పాడు.

ఉపనిషత్తులన్నీ ఏకగ్రీవంగా ఒకటే మాటను ఘోషిస్తున్నాయి. 'ఇన్నాళ్ళూ మిమ్మల్ని మీరు కించపరచుకున్నది చాలు, మీ స్వస్వరూపాన్ని తెలుసుకోండి, సింహంలా గర్జించండి.' వివేకానందులవారు 'మేకలా అరవద్దు, గాడిదలా ఓండ్రించవద్దు; సింహంలా గర్జించండి,' అంటారు. అహం బ్రహ్మ అస్మి అని సింహంలా గర్జించగలగటమే నిదిధ్యాసనం.

అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందితే చాలదు. దాన్ని అణువణువునా జీర్ణించుకోవాలి. దానికి కాఫీలో పంచదార కలిపే ఉదాహరణ చక్కగా సరిపోతుంది. మీరు కాఫీలో పంచదార వేసి, కాఫీ తాగి చూస్తే, 'తీయగా లేదు,' అంటారు. ఎవరో మరో రెండు చెంచాల పంచదార వేస్తారు. అయినా తీయగా అనిపించదు. రెండు కాదు, మరో రెండు చెంచాలు వేసినా లాభం లేదు. ఎందుకంటే ఆ పంచదారను చెంచాతో కాఫీలో కలిసేలా కలపలేదు. అవసరమైనంత పంచదార వేస్తే చాలదు, అవసరమైనంత మేరకు దానిని కలపాలి కూడా. నిజానికి కలపటమే ముఖ్యం. అలాగే, అవసరమైనంత జ్ఞానం పొందితే చాలదు, ఆ పొందిన జ్ఞానాన్ని మీలో కలుపుకోవాలి. అంటే అణువణువునా జీర్ణించుకోవాలి. ఇలా జీర్ణించుకోవటానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. మీలో పాతుకుపోయిన విపరీతభావనలను పారద్రోలి, జ్ఞానంలో నిలబెడుతుంది. విపరీతభావనలను విపర్యయ భావనలు అనికూడా అంటారు. అందువల్ల **నిదిధ్యాసనం విపర్యయ నివృత్తి చేస్తుంది.**

జ్ఞానయోగం = శ్రవణం + మననం + నిదిధ్యాసనం

ఈ నేపథ్యంతో కృష్ణపరమాత్మ బోధను చూద్దాము.

కృష్ణపరమాత్మ ఐదవదశతో, అంటే అన్నింటికన్నా పైమెట్టుతో మొదలుపెడుతున్నాడు.

**యే త్వక్షరమనిర్దేశ్యమ్ అవ్యక్తం పర్యుపాసతే ।**
**సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ॥** – 12.3

ఇంద్రియ అగోచరం, మనో అగోచరం, అనిర్వచనీయం, సర్వవ్యాపకం, అచలం, నిర్వికారం, శాశ్వతం అయిన నిర్గుణబ్రహ్మజ్ఞానం ఎవరు పొందుతారో, వారు నన్నే పొందుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లోకాలు మూడు, నాలుగుల్లో నిర్గుణబ్రహ్మ నిర్వచనం చూస్తాము. కృష్ణపరమాత్మ బ్రహ్మను అక్షరం బ్రహ్మ అని నిర్వచిస్తున్నాడు. అక్షరం బ్రహ్మ పరమమ్ అని ఎనిమిదవ అధ్యాయంలో పేర్కొన్నాడు. అక్షరం బ్రహ్మ అంటే నిర్గుణబ్రహ్మ. కృష్ణపరమాత్మ ఇచ్చిన నిర్వచనాల వరుస క్రమాన్ని మార్చుకున్నాము. ఆ నిర్వచనాలను చూద్దాము.

అవ్యక్తమ్ – ఇంద్రియ అగోచరం; అచింత్యమ్ – మనో అగోచరం; అనిర్దేశ్యమ్ – అనిర్వచనీయం. ఈ మూడూ కలిపి బ్రహ్మ అప్రమేయం అని చెప్పవచ్చు. అంటే ఆబ్జెక్టు కాదని అర్థం. సర్వత్రగమ్ – సర్వవ్యాపకం; అచలమ్ – చలనం లేదు. ఈ రెండూ కలిపి బ్రహ్మ అనంతం అని చెప్పవచ్చు. కూటస్థమ్ – నిర్వికారం; ధ్రువమ్ – శాశ్వతం.

బ్రహ్మజ్ఞానం పొందటం ఐదవదశ, ఆఖరిదశ. కాని ఈ దశకు చేరుకోవటం కష్టమని కృష్ణపరమాత్మే చెబుతున్నాడు.

**క్లేశోఽధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥** – 12.5

ఆ సచ్చిదానంద నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందటం దేహాభిమానం గలవారికి చాలా కష్టం.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ నిర్గుణధ్యానం చాలా కష్టమని ప్రత్యక్షంగా చెబుతున్నాడు. అంటే పరోక్షంగా జ్ఞానయోగం చాలా కష్టమని చెప్పినట్టే అర్థం. నిర్గుణబ్రహ్మను అర్థం చేసుకోవటానికి చాలా పదునైన బుద్ధి ఉండాలి. ఇంతవరకూ **అధరం మధురం, నయనం మధురం** అని ఏకరూపభక్తి చూపటం అలవాటైంది. ఇప్పుడు భగవంతుడు నిరాకారుడు అంటే జీర్ణించుకోవటం కష్టం. ఈ ఐదవమెట్టుమీద నిలబడలేను అంటే, మరేం ఫర్వాలేదు, మిమ్మల్ని బలవంతపెట్టను, నాలుగవ మెట్టుమీదకు దిగండి,' అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥** – 12.8

నామీదే మనస్సును లగ్నం చేయి. నామీదే బుద్ధిని నిలుపు. అప్పుడు నాలోనే ఉంటావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ శ్లోకంలో నాలుగవ దశను చూస్తాము. **ఉపాసనయోగం స్థాయి 2 – అనేకరూప ఈశ్వరధ్యానం**. నీ బుద్ధి విశ్వరూపదర్శనం గురించి నమ్మాలి అంటున్నాడు. సర్వం ఈశ్వరమయం జగత్ అని అర్థం చేసుకోవాలి. నేను అది కూడా జీర్ణించుకోలేను అంటే మూడవమెట్టుమీదకు రా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లోకం తొమ్మిదిలో మూడవదశను చూస్తాము. **ఉపాసనయోగం స్థాయి 1 – ఏకరూప ఈశ్వరధ్యానం.** ఒకవేళ నువ్వు నా విశ్వరూపదర్శనంమీద మనస్సు పెట్టి ఉపాసన చేయలేకపోతే, అభ్యాసయోగం చేయి అంటే ఇష్టదేవత ఉపాసన చేయి అంటున్నాడు. ఇష్టదేవత ఉపాసన ద్వారా నన్ను పొందటానికి ప్రయత్నించు అంటున్నాడు అంటే నెమ్మదిగా పైమెట్టుకు రా అని అర్థం. అభ్యాసయోగం కూడా చేయలేను అని భావిస్తే ఇంకొకమెట్టు దిగిరా అంటున్నాడు.

**అభ్యాసేప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి ॥** – 12.10

అభ్యాసయోగం కూడా చేయలేకపోతే, కర్మలను చేయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇది రెండవదశ. **కర్మయోగం స్థాయి 2 – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం.**

అభ్యాసయోగం కూడా చేయలేను అని నువ్వు భావిస్తే, ఫర్వాలేదు. నువ్వు కర్మలను చేయి. కర్మలను చేయి కాని నిష్కామకర్మలను చేయి; అప్పుడు మోక్షం పొందుతావు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ప్రతిదశకు మనం పరంపరగా మోక్షాన్ని పొందుతావు అంటున్నాడని కలుపుకోవాలి.

కొంతమంది నిష్కామకర్మకు కూడా రాలేమంటారు. ఎందుకంటే వారికి ఎన్నో బాధ్యతలు ఉంటాయి; దానికి సంబంధించిన కోరికలు కోరాలి. అయినా ఫర్వాలేదు, నిష్కామకర్మ లేదా పరోపకారకర్మ చేయకపోయినా ఫర్వాలేదు. సకామకర్మ చేయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. మొదటిమెట్టుకి దిగివస్తున్నాడు.

శ్లోకం 11 మొట్టమొదటి స్థాయిని సూచిస్తుంది. **కర్మయోగం స్థాయి 1 – సకామకర్మ ప్రధాన కర్మయోగం.** సకామకర్మ చేసినా ఫర్వాలేదు కాని రెండు నియమాలు జోడించాలి. ఒకటి – అది ధర్మపరంగా ఉండాలి. రెండు – దాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. సమాజానికి సేవ చేయకపోయినా ఫర్వాలేదు. కాని వచ్చిన ఫలాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. పిల్లలు కూడా మీనుంచి వచ్చినవారు కాదు, మీ ద్వారా వచ్చారని గ్రహించాలి. పిల్లలు భగవంతుని ప్రసాదం. అందువల్లనే పూర్వం పిల్లలకు శివప్రసాదు అనీ రామప్రసాదు అనీ పేర్లు పెట్టేవారు. పిల్లలే కాదు మీయిల్లు, మీ శరీరం కూడా దైవకృపే. వాటికి మీరు ధర్మకర్త మాత్రమే. మీరు ధర్మకర్త మాత్రమే అని జీర్ణించుకోగలిగితే, మీరు దేనిగురించీ ఆందోళన చెందరు. భగవంతుడు మీరు వారితో కలిసి ఉండే అవకాశాన్ని మీకు కల్పించాడు అంతే. ఆ మనుష్యులను కాని, వస్తువులను కాని ఎప్పుడు కావాలంటే అప్పుడు వెనక్కి తిరిగి తీసేసుకునే హక్కు ఆయనకి ఉంది. ఆ తీసుకోవటం కూడా తాత్కాలికంగా తీసుకోవచ్చు, లేదా శాశ్వతంగా తీసుకోవచ్చు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

ఎవరైతే నన్నే నిరంతరం అనన్యభక్తితో చింతన చేస్తారో, వారి యోగక్షేమాలను నేనే వహిస్తాను అన్నాడు కృష్ణపరమాత్మ.

అలా మొదటిస్థాయిలో మొదలుపెట్టినా, క్రమేపీ పైమెట్టుమీదకు వస్తాడు సాధకుడు. ఈ విధంగా ఈ ఐదుమెట్ల భక్తియోగాన్ని వివరించాడు కృష్ణపరమాత్మ.

ఈ ఐదుదశల భక్తిని వివరించటం ద్వారా కృష్ణపరమాత్మ అర్జునుని ప్రశ్నకు జవాబు కూడా చెప్పకనే చెబుతున్నాడు. అర్జునుని ప్రశ్న – సగుణభక్తి ఉపాసకుడు శ్రేష్ఠుడా, నిర్గుణబ్రహ్మజ్ఞాని శ్రేష్ఠుడా? దానికి కృష్ణపరమాత్మ పరోక్షంగా ఇచ్చిన జవాబు అసలు ఆ ప్రశ్నే తప్పు. ఎందుకంటే రెండు వస్తువులను పోల్చాలి అంటే అవి సమానవస్తువులై ఉండాలి. మీరు ప్యాంటు, షర్టు కొనుక్కోవాలంటే, రెండు ప్యాంట్లలో ఏది బాగుంది అని తేల్చుకోగలరు లేదా రెండు షర్టులలో ఏది బాగుంది అని తేల్చుకోగలరు. కాని ప్యాంటు బాగుందా, షర్టు బాగుందా అని అడగలేరు.

అదే విధంగా సగుణభక్తి, నిర్గుణభక్తుల మధ్య ఏది గొప్పదో తేల్చుకోలేరు. ఎందుకంటే సగుణభక్తి **మార్గం** కిందికి వస్తే నిర్గుణభక్తి **లక్ష్యం** కిందకు వస్తుంది. ఒకటి సాధన అయితే, ఇంకొకటి సాధ్యం. సాధన, సాధ్యాల మధ్య పోలిక చూసే ఆస్కారమే లేదు. ప్రతి ఒక్కరూ ఇప్పుడు మనం చూసిన ఐదుమెట్లనూ ఎక్కుతూ రావాలి. అంటే సగుణభక్తి ద్వారానే నిర్గుణభక్తికి రావాలి.

**నిర్గుణభక్తికి రానిదే సగుణభక్తి అసంపూర్ణం**

**సగుణభక్తి లేనిదే నిర్గుణభక్తి అసాధ్యం**

ఆ విధంగా అర్జునుని ప్రశ్నకు కూడా పరోక్షంగా జవాబు చెప్పటం జరిగింది. దీనితో మొదటి అంశం అయిన భక్తియోగము అయింది.

### 2. భక్తియోగఫలము – శ్లోకాలు 13–20

ముందు భాగంలో భక్తియోగంలో ఐదుదశలను చూశాము. ఈ ఐదుదశలనూ దాటి జ్ఞానం పొందిన వ్యక్తిని జ్ఞాని అంటారనీ, స్థితప్రజ్ఞుడు అంటారనీ రెండవ అధ్యాయంలో చూశాము. రెండవ అధ్యాయంలో, నాలుగవ అధ్యాయంలో కూడా జ్ఞాని లక్షణాలను చూశాము. ఇందులో కూడా కృష్ణపరమాత్మ జ్ఞాని లక్షణాలను వివరించబోతున్నాడు.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**

**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥** – 12.13

ఎవరికి ఎవరిమీద ద్వేషభావం ఉండదో, స్వార్థరహితమైన ప్రేమను, కరుణను చూపుతాడో, అహంకార మమకారాలు ఉండవో, సుఖదుఃఖాలకు చలించడో, క్షమాగుణం ఉంటుందో అటువంటి భక్తుడు నాకు ఇష్టుడు.

ఈ భాగంలో కృష్ణపరమాత్మ చెప్పిన జ్ఞాని లక్షణాలు ఇవి. ఎ) అద్వేష్టా సర్వభూతానామ్– ద్వేషభావం ఉండదు; బి) మైత్రః – మిత్రభావన ఉంటుంది; సి) కరుణః – దయ ఉంటుంది; డి) నిర్మమః – మమకారం ఉండదు; ఇ) నిరహంకారః – అహంకారం ఉండదు; ఎఫ్) సమదుఃఖసుఖః – సమత్వం పాటిస్తాడు; జి) క్షమీ – క్షమాగుణం ఉంటుంది;

హెచ్) సంతుష్టః – పరిపూర్ణత ఉంటుంది; ఐ) యోగీ – జ్ఞానం ఉంటుంది; జె) యతాత్మా– ఆత్మసంయమనం ఉంటుంది; కె) దృఢనిశ్చయః – స్థితప్రజ్ఞత ఏర్పడుతుంది; ఎల్) మయ్యర్పిత మనోబుద్ధిః – అంకితభావం కలుగుతుంది; ఎమ్) హర్షా మర్షభయోద్వేగైః ముక్తః – జీవన్ముక్తి కలుగుతుంది; ఎన్) అనపేక్షః – దేన్నీ ఆశించడు; ఒ) శుచిః – శుచిగా ఉంటాడు; పి) దక్షః – పని చేసే తీరులో దక్షత ఉంటుంది; క్యూ) ఉదాసీనః – పక్షపాత వైఖరి ఉండదు; ఆర్) గతవ్యథః – దుఃఖాలనుంచి ముక్తి చెందుతాడు; ఎస్) సర్వారంభ పరిత్యాగః – బంధించే కర్మలను పరిత్యజిస్తాడు; టి) న హృష్యతి న శోచతి – ద్వంద్వాతీతుడు అవుతాడు.

ఈ లక్షణాలను ఇంత వివరంగా చూడకుండా, ఇంకో కోణంనుంచి వాటి సారం మాత్రమే చూస్తే అతను మనోనిగ్రహం పొందుతాడు. రాగద్వేషాలనుంచి విడివడతాడు. కామక్రోధలోభమోహమదమాత్సర్యాలకు అతీతంగా ఎదుగుతాడు. ఈ భావోద్రేకాలు మనలను సంసారంలో పడవేస్తాయి. జ్ఞాని ఈ సంసారబంధంనుంచి విముక్తి పొందుతాడు. అటువంటి జ్ఞాని నాకు ప్రియం అని ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।**
**శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః ॥** – 12.20

ఎవరైతే ఈ భక్తియోగాన్ని చెప్పింది చెప్పినట్టుగా పాటిస్తారో, వారు జ్ఞాని అవుతారు. అంటే ఇంతవరకు చెప్పిన ఐదు దశలనూ పాటించాలి. అలా పాటించిన భక్తులు నాకు అత్యంత ప్రియభక్తులు అవుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్రద్ధ ఉంటే ఈ ఐదు దశల భక్తియోగం ఫలితం ఇచ్చి తీరుతుంది. భగవంతునికి ఐదవదశకు చేరుకున్న జ్ఞానీభక్తుడే కాదు, ఏ దశలో ఉన్న భక్తుడైనా, శ్రద్ధ ఉంటే ప్రియమైన భక్తుడే అవుతాడు. అందువల్ల ఐదుమెట్ల భక్తిని పాటించండి, మీరు ఐదు మెట్ల నిచ్చెనలో మొదటిమెట్టుమీద ఉన్నా, రెండవమెట్టుమీద ఉన్నా, మూడవమెట్టుమీద ఉన్నా, నాలుగవ మెట్టుమీద ఉన్నా కూడా భగవంతునికి ఇష్టమే. అందువల్ల ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ వచ్చి, జ్ఞానం పొంది, జీవన్ముక్తి పొందండి. భక్తినుంచి ముక్తికి రండి.

ఇదీ ఈ అధ్యాయంయొక్క సారాంశం.

# క్షేత్ర-క్షేత్రజ్ఞవిభాగయోగము

## అధ్యాయము 13

భగవద్గీతలో మూడు షట్కాలు ఉన్నాయి. ఒక్కొక్క షట్కంలో ఆరు అధ్యాయాలు ఉంటాయి.

| | | |
|---|---|---|
| మొదటి షట్కము | - అధ్యాయాలు 1-6 | త్వమ్ పద విశ్లేషణ |
| రెండవ షట్కము | - అధ్యాయాలు 7-12 | తత్ పద విశ్లేషణ |
| మూడవ షట్కము | - అధ్యాయాలు 13-18 | అసి పద విశ్లేషణ |

ఈ మూడు షట్కాలూ కలిపి తత్త్వమసి (తత్ + త్వమ్ + అసి) మహావాక్యాన్ని విశ్లేషిస్తాయి. అందువల్ల భగవద్గీత మోక్షశాస్త్రం.

ఒక్కొక్క షట్కంలోనూ మూడేసి అంశాలు చర్చించబడ్డాయి. మొదటి షట్కంలో జీవస్వరూపం - త్వమ్ పద విశ్లేషణ, కర్మయోగసాధన, పురుషప్రయత్నం లేదా ఫ్రీవిల్ చర్చించబడ్డాయి. రెండవ షట్కంలో ఈశ్వరస్వరూపం - తత్ పద విశ్లేషణ. ఈశ్వర ఉపాసన, ఈశ్వరకృప చర్చించబడ్డాయి.

ఇప్పుడు మనం మూడవ షట్కంలోకి అడుగుపెడుతున్నాము. దీన్ని చరమ షట్కం అనీ, అంతిమ షట్కం అనీ అంటారు. ఈ షట్కంలో కూడా మూడు అంశాలు చర్చించబడ్డాయి.

**మూడవ షట్కంలోని మూడు అంశాలు**

1. జీవ ఈశ్వరస్వరూప ఐక్యం - అసి పద విశ్లేషణ
2. జ్ఞానయోగసాధన
3. విలువలు

1. **జీవ ఈశ్వరస్వరూప ఐక్యం - అసి పద విశ్లేషణ** - తత్ అంటే పరమాత్మ, త్వమ్ అంటే జీవాత్మ; అసి అంటే ఐక్యం. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని చూపిస్తుంది కాబట్టి ఈ వాక్యాన్ని మహావాక్యం అంటారు. ఇంకో విధంగా చెప్పాలంటే వ్యష్టి-సమష్టి స్వరూప ఐక్యాన్ని సూచిస్తుంది మహావాక్యం. జీవ-ఈశ్వర ఐక్యాన్ని సూచించే ఏ వాక్యాన్నైనా మహావాక్యం అంటాయి ఉపనిషత్తులు. అందువల్ల గీతలోని ఈ చరమ షట్కం సారాంశం మహావాక్య విచారణ అని చెప్పవచ్చు.

మహావాక్యవిచారణను విస్తారంగా అధ్యాయాలు 13, 14, 15లలో చూస్తాము. ఈ మూడింటిలో అధ్యాయం 13 చాలా ముఖ్యమైన అధ్యాయం. ఎందుకంటే ఇందులో ఉపనిషత్తుల సారాన్ని లేదా మహావాక్యాలను చాలా స్పష్టంగా చూస్తాము. ఇప్పుడు ఈ అధ్యాయంయొక్క సారాంశాన్ని చూద్దాము. ఎవరైనా భగవద్గీతలో అత్యంత ముఖ్యమైన

అధ్యాయం ఏమిటని అడిగితే, అధ్యాయం 13 అని చెప్పాలి. కాని వచ్చిన చిక్కేమిటంటే, ఈ అధ్యాయం చాలా లోతైన, ఆధ్యాత్మిక విషయాలతో కూడి ఉంటుంది కాబట్టి, చాలామంది దీన్ని వదిలేసి, నిజజీవితంలో ఆచరణలో పెట్టటానికి అనువైన అధ్యాయాలను ఎన్నుకుంటారు.

2. **జ్ఞానయోగసాధన** – ఈ షట్కంలో కృష్ణపరమాత్మ నొక్కివక్కాణించే ఇంకొక అంశము **శాస్త్ర అధ్యయనం**. కాని, దురదృష్టవశాత్తూ ఈ రోజుల్లో చాలామంది మోక్షం పొందటానికి ఆత్మజ్ఞానం పొందాలనే విషయాన్ని ఒప్పుకున్నా కూడా, దానికి శాస్త్ర అధ్యయనం చేయాలనే విషయానికి ప్రాముఖ్యతనివ్వరు. చాలామంది ధ్యానం ద్వారానో, ఇంట్యూషన్ ద్వారానో జ్ఞానం పొందవచ్చు అంటారు. కాని శాస్త్రం దాన్ని ఒప్పుకోదు.

ధ్యానం ద్వారా జ్ఞానాన్ని పొందలేము; ఇంట్యూషన్ ద్వారా పొందలేము; ఇన్ ట్యూషన్ పొందాలి అంటుంది శాస్త్రం. అంటే శ్రవణం ద్వారానే జ్ఞానాన్ని పొందాలి. శ్రవణ, మననాలు చేసి, నిశ్చయజ్ఞానం పొందాక, ఆ జ్ఞాననిష్ఠలో నిలబడటానికి ధ్యానం చేయాలి. ఆ ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. ధ్యానం ద్వారా కాదు, గురువు ద్వారానే జ్ఞానం పొందాలని కృష్ణపరమాత్మ నాలుగవ అధ్యాయంలోనే స్పష్టంగా చెప్పేశాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

ఆత్మజ్ఞానం పొందటానికి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువువద్దకు వినయంగా వెళ్ళి, ఆయనకు సేవలు చేసి, భక్తిశ్రద్ధలతో ప్రశ్నలు వేస్తే, గురువు సంప్రీతులై, ఆ పరమాత్మ తత్త్వజ్ఞానాన్ని బోధిస్తారు.

వేదాంత జ్ఞానాన్ని పొందటాన్ని వేదాంత విచారణ అనీ, బ్రహ్మజిజ్ఞాస అనీ ఉత్తరమీమాంస అనీ అంటారు. ఈ వేదాంత విచారణను స్వయంగా చేయకూడదనీ, గురువు ద్వారానే చేయాలనీ ఉపనిషత్తులు, కృష్ణపరమాత్మ కూడా నొక్కివక్కాణిస్తున్నారు. ఈ అంశం చాలా ముఖ్యం, దీన్ని తప్పించుకోలేరు. వేదాంత విచారణ చేయటానికి ఎవరైనా ఏ కారణం వల్లనైనా సిద్ధంగా లేకపోతే, వేదాంతం ఏమీ బలవంతపెట్టదు. 'సరే, ఆలస్యంగానే రండి, కాని ఎప్పటికైనా రాకతప్పదు,' అంటుంది. అసలు ఈ జన్మలోనే రాలేను అన్నాకూడా, వేదాంతం, 'మరేం ఫర్వాలేదు, వచ్చే జన్మలోనే రండి!' అంటుంది.

దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే ఇప్పుడో, తరువాతో, వచ్చే జన్మలోనో వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలకు రాకతప్పదు. ఎవరైనా ఈ దశలు దాటకుండా జ్ఞానం పొందారు అని మీరు అంటే దానికి శాస్త్రం చెప్పే జవాబు ఒక్కటే. ఆ వ్యక్తి ఈ మూడు దశలను ముందు జన్మలోనే దాటేసి ఉంటాడు. ఈ శ్రవణ, మనన, నిదిధ్యాసనల దశలను

తప్పించుకోవటం కుదరనే కుదరదు. అందువల్ల కృష్ణపరమాత్మ జ్ఞానయోగాన్ని నొక్కివక్కాణిస్తున్నాడు. దీన్ని ఐదు దశల భక్తియోగంలో ఐదవదశగా చూశాము. ఒక సాధకుడు రెండుదశల కర్మరూపభక్తిని దాటి, రెండుదశల ఉపాసనరూపభక్తిని దాటి, జ్ఞానయోగానికి రావాలని చూశాము.

3. **విలువలు** – ఈ చరమషట్కములో విలువలయొక్క విలువను కూడా నొక్కివక్కాణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. నైతికజీవనం గడపాలంటే విలువలను పాటించి తీరాలి. మన సాంప్రదాయంలో నైతికవిలువలు మన ఆధ్యాత్మికతకు భిన్నంగా ఉండదు. ఆధ్యాత్మికత మన జీవనవిధానాన్ని నిర్దేశిస్తుంది. జీవనవిధానంలో నైతికవిలువలు లేదా ధర్మం ఒక భాగం. ధర్మాన్ని పాటించకుండా వేదాంతం నేర్చుకుంటే, అది థియరీ మాత్రమే అవుతుంది. అలా థియరీగా మిగిలిపోతే, పుస్తకపరిజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప, వ్యక్తిత్వంలో మార్పు తీసుకురాదు. వేదాంతం మీ జీవితంలో మార్పు తీసుకురావాలి అంటే దానితోపాటు విలువలను కూడా నేర్చుకోవాలి. అందువల్లనే కృష్ణపరమాత్మ ఈ షట్కములో విలువలయొక్క విలువను గురించి కూడా బోధిస్తున్నాడు.

ఈ నేపథ్యంతో మనం అధ్యాయం 13లో అడుగుపెడదాము. ఈ అధ్యాయాన్ని కూడా మూడు అంశాలుగా ప్రధానంగా విభజించవచ్చు. అవి –

1. మహావాక్యవిచారణ
2. జ్ఞానయోగసాధనలు
3. ప్రయోజనం.

(వీటిని శ్లోకాల పరంగా చూడటంలేదు.)

1. **మహావాక్యవిచారణ** – మొదటి భాగంలో జీవస్వరూపం, ఈశ్వరస్వరూపం గురించి చూస్తాము. తత్త్వమసి మహావాక్యపరంగా చూడాలంటే త్వం పదవిచారణ (జీవస్వరూపం), తత్ పదవిచారణ (ఈశ్వరస్వరూపం) చూస్తాము. ఈ విచారణ ద్వారా జీవుడు, ఈశ్వరుడు స్వరూపరీత్యా ఒకటే అని అర్థం చేసుకుంటాము.

జీవ ఈశ్వరస్వరూప ఐక్యము అని చెప్పటం ద్వారా పైపైన చూస్తే, జీవునికీ, ఈశ్వరునికీ మధ్య భేదాలు ఉన్నాయని చెప్పకనే చెప్పినట్టయింది. బాహ్యంగా వీరి మధ్య భేదం ఉన్నా కూడా, స్వరూపరీత్యా ఇద్దరూ ఒకటే. ఈ విషయం అర్థం అవటానికి శాస్త్రంలో మనం చూసే ఉదాహరణ అల-సముద్రం.

అలకూ, సముద్రానికీ మధ్య భేదం ఉందా, లేదా? పైపైన చూస్తే వాటికి చాలా పెద్ద భేదమే ఉంది. అందువల్లనే అలను అల అనీ, సముద్రాన్ని సముద్రం అనీ అంటారు. అల చాలా చిన్నది; సముద్రం చాలా పెద్దది. అల కార్యం, సముద్రం కారణం; అల జీవితం

చాలా చిన్నది; సముద్రం జీవితం చాలా ఎక్కువ. కాని వాటి స్వరూపాన్ని లోతుగా విశ్లేషిస్తే రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఒక్కటే – అది నీరు. నీరు లేకుండా అలా లేదు, సముద్రమూ లేదు. అలలోనూ, సముద్రంలోనూ ఉన్నది ఒకే నీరు. ఒకే నీరుకు రెండు నామరూపాలు – అల, సముద్రం. ఇంతవరకూ నామరూపాలను చూస్తున్నాము. కాని రెండింటిలోనూ సమానంగా ఉన్న నీటిని అధిష్ఠానం అంటారు. అంటే అధిష్ఠానమైన నీటి దృష్ట్యా అల, సముద్రం రెండూ ఒకటే.

అదే విధంగా జీవాత్మ, పరమాత్మలను పైపైన చూస్తే అనేక భేదాలు ఉన్నాయి కాని జీవాత్మ అంటే జీవ+ఆత్మ, పరమాత్మ అంటే పరమ+ఆత్మ. అంటే రెండింటిలోనూ సమానంగా ఉన్నది – ఆత్మ. ఆత్మను చైతన్యతత్త్వం అంటారు. చైతన్యతత్త్వాన్ని అధిష్ఠానం అంటారు. అంటే అధిష్ఠానమైన చైతన్యం దృష్ట్యా జీవాత్మ, పరమాత్మ రెండూ ఒకటే. దీన్ని జీవాత్మ పరమాత్మ స్వరూప ఐక్యం అంటారు. దీన్నే అసి పదార్థ విశ్లేషణ అంటారు.

2. **జ్ఞానయోగసాధనలు** – ఈ అధ్యాయంలో రెండవ అంశం జ్ఞానయోగ్యతను పొందటానికి అవసరమైన సాధన. దీన్ని సహకారీ సాధన అంటారు. **మహావాక్య విచారయోగ్యతా ధర్మం** అని కూడా అంటారు. ఇంకో విధంగా చెప్పాలంటే మహావాక్యవిచారణ చేయటానికి అవసరమైన జ్ఞానసాధనలు లేదా విచారణ సాధనలు. విచారణ అంటే విశ్లేషణ.

3. **ప్రయోజనం** – ఈ జ్ఞానయోగ విచారణ చేస్తే కలిగే ఫలాన్ని చూస్తాము ఈ భాగంలో.

వీటిని వివరంగా చూద్దాము.

1. **మహావాక్యవిచారణ** – ఈ భాగంలో కృష్ణపరమాత్మ ముందు జీవస్వరూపాన్ని విశ్లేషిస్తున్నాడు. దీనికి సాంకేతిక పదాలు క్షేత్ర–క్షేత్రజ్ఞ వివేకం. ఉపనిషత్తుల పరిభాషలో చెప్పాలంటే ఆత్మ–అనాత్మ వివేకం. 'నేను' అని మనం వాడినప్పుడు, 'నేను' అంటే ఒక యూనిట్ అనుకుంటాము కాని, నిజానికి ఆ 'నేను'లో రెండు అంశాలు లేదా రెండు భాగాలు ఉన్నాయంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని మనకు వేదాంతానికి రాకముందు నేను అంటే ఇలా రెండు అంశాలు ఉన్నాయని తెలియనే తెలియదు. ఆ రెండూ ఎంతగా ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయంటే, పాలు–నీళ్ళు కలిసిపోయినంతగా.

**క్షీరనీరవివేకజ్ఞో హంస ఏవ న చేతరః ।**
**ఆత్మానాత్మ వివేకజ్ఞో యతిరేవ న చేతరః ॥** – అద్వైతానుభూతి 5.77

హంస తప్ప ఇతర పక్షులు పాలు–నీళ్ళని విడదీయలేవు; అలాగే జ్ఞాని తప్ప వేరే ఎవరూ ఆత్మను, అనాత్మను విడదీయలేరు (వివేకం చూపలేరు).

ఒక వ్యక్తిని వ్యష్టి అంటారు. అతనిలో ఉన్న రెండు అంశాలు క్షేత్రం – క్షేత్రజ్ఞుడు లేదా అనాత్మ – ఆత్మ లేదా పదార్థం – చైతన్యం. చైతన్యాన్ని ఆత్మ అనీ, పదార్థాన్ని అనాత్మ అనీ అంటారు.

చైతన్యం అంటే ఏమిటి? దీని గురించిన స్పష్టమైన నిర్వచనం లేదు. ఒక్కొక్క దర్శనం ఒక్కొక్క నిర్వచనం ఇస్తుంది. న్యాయదర్శనంలో నిర్వచనం వేరు, సాంఖ్యదర్శనంలో నిర్వచనం వేరు. విజ్ఞానశాస్త్రం ఇప్పటికీ చైతన్యం అంటే ఏమిటో పరిశోధనలు జరుపుతూనే ఉంది. కాని అద్వైత వేదాంతంలో చైతన్యం గురించిన స్పష్టమైన వివరణ వస్తుంది. అద్వైత వేదాంతం చైతన్యానికి ఐదు లక్షణాలను ఇస్తుంది. అవి –

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
2. చైతన్యం స్వతంత్రవస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపజేస్తుంది.
3. చైతన్యం శరీరసరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. చైతన్యం శరీరపతనానంతరం కూడా ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి చైతన్యం తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

**సాన్ద్రానన్దావబోధాత్మకమనుపమితం కాలదేశావధిభ్యాం**
**నిర్ముక్తం నిత్యముక్తం నిగమశతసహస్రేణ నిర్భాస్యమానమ్ ।**
**అస్పష్టం దృష్టమాత్రే పునరురుపురుషార్థాత్మకం బ్రహ్మతత్త్వం**
**తత్తావద్భాతి సాక్షాద్గురుపవనపురే హన్త భాగ్యం జనానామ్ ॥** – నారాయణీయమ్ 1.1

ఈ చైతన్యాన్ని వేదాంతం ఆత్మ అనీ, చేతనతత్త్వం అనీ అంటుంది. ఈ చైతన్యాన్ని అర్థం చేసుకోవటమెలా? వేదాంతం చైతన్యాన్ని తేలికగా అర్థం చేసుకోవటానికి వీలుగా రెండు ఉదాహరణలను ఇస్తుంది. వాటిని ఈ అధ్యాయంలో చూస్తాము కూడా. అవి ఆకాశం, కాంతి. ఈ రెండూ చైతన్యానికి దగ్గరి ఉదాహరణలు. జాగ్రత్తగా గమనించండి, ఆకాశం చైతన్యం అనటం లేదు; ఆకాశం చైతన్యానికి సమీప ఉదాహరణ అంటున్నాము. రెండవ ఉదాహరణ కాంతి.

మనం రెండవ ఉదాహరణ అయిన కాంతిని తీసుకుందాము. నేను, నా చేతిని చూపించి ఇక్కడేముంది అంటే మీరు 'చేయి ఉంది,' అంటారు. 'ఇంకేముంది?' అంటే 'చేతికి రేఖలు ఉన్నాయి,' అంటారు. ఇంకా ఇదే ప్రశ్నను రెట్టిస్తే, చేతిమీద దుమ్ము ఉందనో, వేళ్ళకు ఉంగరాలు ఉన్నాయనో చెబుతారు తప్ప, అసలైన విషయాన్ని చెప్పరు. చేతిమీద కాంతి

పడుతున్నది కాబట్టి చేతిని చూడగలుగుతారు. కాని కాంతిని పట్టించుకోరు. ఇప్పుడు కాంతి గురించి నేర్చుకున్నాక ఏం ఉంది అంటే చేయి + కాంతి ఉంది అంటారు. ఇది రెండవ దశ.

మూడవదశలో చేయి ఉన్నా లేకపోయినా కాంతి ఉంది అని నేర్చుకుంటారు. అక్కడ చైతన్యం – శరీరం పరంగా చెప్పిన 5 లక్షణాలను ఇప్పుడు కాంతి–చేయి పరంగా చూద్దాము. కాంతిని చైతన్యంగానూ, చేతిని శరీరంగానూ తీసుకోవాలి.

1. కాంతి చేతిలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.

2. కాంతి స్వతంత్ర వస్తువు. అది చేయి అంతటా వ్యాపించి, చేతిని ప్రకాశింపజేస్తుంది.

3. కాంతి చేయి సరిహద్దులకే పరిమితమవలేదు.

4. కాంతి చేయి తీసేస్తే పోదు. చేయి లేకపోయినా కాంతి ఉంటుంది.

5. కాంతి చేయి లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి చైతన్యం తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఈ అంశాలను కొంచెం వివరంగా చూద్దాము.

1. కాంతి చేతిలో ఒక భాగం కాదు. ఒకవేళ కాంతి చేతిలో ఒకభాగం అయితే, చేతి లక్షణం అయితే, అక్కడ చీకటిగా ఉన్నా చేయి ప్రకాశించాలి. కాని అలా లేదే! అంటే కాంతి చేతితో అంతగా పెనవేసుకునిపోయి ఉన్నాకూడా, కాంతి చేతిలో ఒకభాగం కాదు.

2. కాంతి స్వతంత్రవస్తువు. కాంతి చేతిలో ఒకభాగం కాదు అంటే కాంతి ఉనికి చేతిమీద ఆధారపడిలేదు. కాని కాంతివల్లనే చేయి ప్రకాశిస్తున్నది.

3. కాంతి చేయి సరిహద్దులకే పరిమితమవలేదు. చేయి సరిహద్దులు దాటికూడా కాంతి ఉంది. అందువల్లనే నా చేతిని ఎటు కదిపినా, మీరు నా చేతిని చూడగలుగుతున్నారు.

4. కాంతి చేయి తీసేస్తే పోదు. చేయి అంతటా వ్యాపించి, చేతిని ప్రకాశింపజేసే కాంతి చేయి తీసేస్తే పోదు.

5. కాంతి చేయి లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. కాంతి, చేతిని ప్రకాశింపజేస్తే, చేయి కాంతిని ప్రకటింపజేస్తుంది. కాంతిని తెలుసుకోవాలంటే, దాన్ని ప్రకటింపజేసే మాధ్యమం ఒకటి ఉండాలి. మాధ్యమం లేకపోతే అక్కడ కాంతి ఉన్నా తెలియదు. మనకు తెలియనంత మాత్రాన కాంతి లేనట్టు కాదు. చేయి ఉంది, ప్రకటితమయినప్పుడు అది వ్యక్తప్రపంచం అవుతుంది. చేయి లేకుండా, కాంతి తెలియనప్పుడు అది అవ్యక్త ప్రపంచం అవుతుంది. అవ్యక్తం అంటే ఉనికి లేనట్టు కాదు.

ఇవే సూత్రాలు చైతన్యం-శరీరానికి వర్తిస్తాయి. చైతన్యం శరీరంలో ఒక భాగం కాదు; చైతన్యం స్వతంత్రం; చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది; చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. శరీరం ఉంటే చైతన్యం వ్యక్తచైతన్యం అవుతుంది, శరీరం లేకపోతే అవ్యక్తచైతన్యం అవుతుంది. వ్యక్తచైతన్యమైనా, అవ్యక్తచైతన్యమైనా చైతన్యం ఎప్పుడూ ఉంటుంది.

**వ్యక్తం వా అవ్యక్తం వా చైతన్యం సర్వదా అస్తి**

ఈ చైతన్యాన్ని ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ క్షేత్రజ్ఞుడు అనీ, శరీరాన్ని క్షేత్రం అనీ అంటున్నాడు.

**జీవస్వరూపం** - ప్రతి ఒక్క వ్యక్తి కూడా ఈ **క్షేత్రం-క్షేత్రజ్ఞుల** మేలుకలయిక. **క్షేత్రం + క్షేత్రజ్ఞుడు = జీవుడు.** క్షేత్రం శరీరం అంటే శరీరం ఒక్కటే కాదు, దాన్ని కార్యకరణసంఘాతం అంటారు. ఇంగ్లీషులో చెప్పాలంటే బాడీ-మైండ్ కాంప్లెక్స్. తేలికగా చెప్పాలంటే మనశ్శరీరాలు. మనశ్శరీరాలు జడం. వేదాంతం మనస్సు కూడా జడమే అంటుంది. వేదాంతం ప్రకారం మనస్సు, శరీరం రెండూ జడమే. కాకపోతే శరీరం స్థూలం అయితే, మనస్సు సూక్ష్మం. సైన్స్ ప్రకారం మనస్సు-శక్తి. శక్తి అంటే వేరే ఏదో కాదు; సూక్ష్మరూపంలో పదార్థం. అందువల్ల మనశ్శరీరాలు అనాత్మ, చైతన్యం ఆత్మ. ప్రతి ఒక్కరూ ఈ ఆత్మ-అనాత్మల మేలుకలయిక. ఇది మొదటి పాఠం.

ఇప్పుడు నేను ఆత్మ అనాత్మల మేలుకలయిక అయితే, నా అసలు స్వరూపం ఏమిటి? నా ఆగంతుక స్వరూపం ఏమిటి? ఆగంతుక స్వరూపానికి రాకపోకలు ఉంటాయి. అది నా స్వస్వరూపం అవదు. స్వస్వరూపం అంటే మార్పులేనిది, నిత్యమైనది, శాశ్వతమైనది. ఉదాహరణకు అగ్ని స్వస్వరూపం వేడి. ఎందుకంటే చల్లటి ప్రాంతంలో కూడా అగ్ని వేడిగానే ఉంటుంది. అదే నీటియొక్క వేడి తీసుకుంటే అది ఆగంతుకం. ఎందుకంటే ఆ వేడి కాసేపే ఉంటుంది. తరువాత చల్లారిపోతుంది.

ఈ సూత్రాన్ని మనశ్శరీరాలకు అన్వయించి చూద్దాము. మీరు మేలుకుని ఉండగా నేను లావుగా ఉన్నాను అనో, సన్నగా ఉన్నాను అనో అంటారు. నేను వయస్సులో ఉన్నాను అనో, వయస్సు పైబడిపోతోంది అనో అంటారు. ఇది శరీరానికి సంబంధించినది. అలాగే మీరు మేలుకుని ఉండగా మీకు ఒకరిమీద రాగం, ఇంకొకరిమీద ద్వేషం ఉంటుంది. ఈ భావనలేవీ శాశ్వతంగా ఉండవు. మీరు గాఢనిద్ర పోయినప్పుడు శరీరం గురించిన ధ్యాస ఉండదు; రాగద్వేషాలు అంతకన్నా ఉండవు. మీరు జీవన్ముక్తులతో సమానం అవుతారు. అందువల్లనే శాస్త్రం ప్రతిరాత్రీ ఒకవ్యక్తి మోక్షాన్ని అనుభవిస్తాడు అంటుంది.

నిద్రలో మనశ్శరీరాలు పడుకున్నా, ఒక వృత్తి (ఆలోచన) మాత్రం కొనసాగుతుంది. అది 'నేను చైతన్యాన్ని,' అనే వృత్తి. ఆ చైతన్యవృత్తి ఉండటంవల్లనే, మీరు గాఢనిద్ర పోయి లేచాక, 'నేను బాగా నిద్రపోయాను, నాకేమీ తెలియలేదు,' అనగలుగుతారు. అంటే ఏమిటి అర్థం? నిద్రలో మీరు అన్నీ వదులుకున్నారు ఒక్క చైతన్యాన్ని తప్ప. నిద్రలో కూడా చైతన్యం ఉంది కాబట్టి, మీ స్వస్వరూపం చైతన్యం అంటుంది వేదాంతం. అదికాక తక్కినదంతా అంటే మీ శరీరం, మీ మనస్సు ఆగంతుకాలే. నిజానికి మనశ్శరీరాలు మీరు ప్రపంచంతో వ్యవహారం నడపటానికి మీకు ఇవ్వబడ్డాయి అంటుంది వేదాంతం. శరీరం, మనస్సు రెండూ అద్దాలున్న మీ కళ్ళజోడు అనవచ్చు. కళ్ళజోడుతో మీరు ఎలా ప్రపంచాన్ని చూస్తారో, అలా ఈ మనశ్శరీరాలతో మీరు ప్రపంచంతో వ్యవహారం నడుపుతారు.

ఒకసారి ఆలోచించండి! మీరు మనశ్శరీరాలతో జాగ్రదావస్థలో అనేక వ్యవహారాలు నడుపుతారు. కాని సుషుప్తి అవస్థలో వీటిని వాడరు. అవి పడుకుంటాయి. అంటే అప్పుడు మీరు ప్రపంచంతో వ్యవహారం నడపలేరు; ప్రపంచాన్ని అనుభవించలేరు. అనుభవించే 'మీరు' అప్పుడు ఉండరు కాని చైతన్యం అయిన 'మీరు' ఉంటారు. అందువల్ల మీ జీవితం కొనసాగుతుంది. అందువల్లనే మీరు హాయిగా, ప్రశాంతంగా నిద్రపోతారు.

ఒకవేళ మీరు పడుకుంటే, ఇంక మీరు ఉండరు అనే అనుమానం మీకు వస్తే, మీరు పడుకుంటారా? ససేమిరా పడుకోరు! కాని నిశ్చింతగా ఎందుకు పడుకుంటున్నారు? ఎందుకంటే, వ్యవహారాలు లేకపోయినా, మీరు శుద్ధచైతన్యంగా ఉంటారు. దీన్నిబట్టి చైతన్యం మీ స్వస్వరూపం అనీ, కార్యకరణసంఘాతం మీ ఆగంతుక స్వరూపం అనీ అర్థం చేసుకోవాలి. అంటే దశలవారీగా మీ దృక్పథం మార్చుకుంటూ రావాలి.

**1. నేను శరీరాన్ని.**

**2. నేను శరీరాన్ని; నాకొక ఆత్మ ఉంది.**

**3. నేను ఆత్మను; నాకు ఆగంతుక శరీరం ఉంది.**

వేదాంతానికి రాకముందు, ఆత్మ ఉందనే తెలియదు. అందువల్ల నేను శరీరాన్ని అనుకుంటారు. తరువాత నేను శరీరాన్ని, నాకొక ఆత్మ ఉంది అనుకుంటారు. వేదాంతం మీ దృక్పథాన్ని మార్చండి అంటుంది. నేను ఆత్మను, నాకు ఆగంతుక శరీరం ఉంది అనగలగాలి. వైన్ డైయర్ అనే అమెరికా శాస్త్రవేత్త వేదాంత వాక్యానికి ధీటుగా ఇలా అంటారు – 'మీరు ఆధ్యాత్మిక అనుభవం ఉన్న మనిషి కాదు; మీరు ఆగంతుక మానవ అనుభవం ఉన్న ఆధ్యాత్మిక జీవి.' మానవఅనుభవం మానవశరీరం ఉన్నంతవరకే ఉంటుంది. అందువల్ల అది తాత్కాలికం. కాని చైతన్యంగా **మీరు** శాశ్వతంగా ఉంటారు.

మానవశరీరం వదిలివేసి, మరుజన్మలో మీరు దేవతాశరీరం ధరించినా, లేక జంతు శరీరం ధరించినా, చైతన్యంలో మీరు శాశ్వతంగా ఉంటారు. అనుభవంలో మార్పు వస్తుంది అంతే. ఇంతకుముందు మనుష్య అనుభవం ఉంటే, ఇప్పుడు దేవత లేదా జంతువు అనుభవం వస్తుంది కాని ప్రాథమికంగా మీరు చైతన్యమే.

జగత్తుకు, శరీరానికి, మనస్సుకు భిన్నంగా ఉన్న చైతన్యం మీరు అనే సత్యాన్ని కనుగొనాలంటే, మీరు వేదాంతంలోని ప్రాథమిక సత్యాన్ని జీర్ణించుకోవాలి. అది – **మీకు అనుభవంలోకి వచ్చేదేదీ మీరు కాదు.**

అనుభవంలోకి వచ్చినదేదైనా ఆబ్జెక్టులోకి వస్తుంది. అనుభవించే నేను సబ్జెక్టులోకి వస్తాను. సబ్జెక్టు ఎప్పటికీ ఆబ్జెక్టుకు భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు కళ్ళను తీసుకోండి. మీ కళ్ళతో మీరున్న గదిలో ప్రతిదీ చూడగలరు కాని, మీ కళ్ళను చూడలేరు. అవునా, కాదా? అద్దంలో చూడగలను అనకండి, అద్దంలో మీరు చూసేది మీ ప్రతిబింబాన్నే, మీ అసలు కళ్ళను కాదు. ఒకదేశంలో అసలు అద్దం కాని, ప్రతిబింబించే మాధ్యమం కాని ఏదీ లేదనుకుందాము. ఎంత దారుణంగా ఉంటుంది వారి పరిస్థితి! మీవి విశాలనేత్రాలు అని ఎవరైనా పొగిడితే, ఆ విశాలనేత్రాలను మీ కళ్ళారా చూడలేరు. అలాగే ఇప్పటి ఉదాహరణ తీసుకుంటే మీ సెల్‌ఫోన్‌నుంచి మీకు మీరు ఎన్నడూ ఫోన్ చేయలేరు.

అందువల్ల సబ్జెక్టును ఎన్నడూ ఆబ్జెక్టుగా చూడలేరు. సబ్జెక్టును ప్రమాత అనీ, ఆబ్జెక్టును ప్రమేయం అనీ అంటారు. ప్రమాత ఎన్నటికీ ప్రమేయం కాలేదు. అలాగే ప్రమేయం ఎన్నటికీ ప్రమాత కాలేదు. అందువల్ల 'నేనెవరు?' అని మీకు తెలుసుకోవాలని ఉంటే, మీకు అనుభవంలోకి వచ్చిన ప్రతిదాన్ని 'నేతి, నేతి,' అని కొట్టివేస్తూ రమ్మంటుంది వేదాంతం. 'నేతి' అంటే 'న ఇతి'. అంటే 'నేను ఇది కాదు.'

మీకు అనుభవంలోకి వచ్చినదేదీ మీరు కాదు. అలా విశ్లేషిస్తూ వద్దాము. ముందు మీకు అనుభవంలోకి వచ్చే జగత్తు మొత్తం మీరు కాదు. మీ శరీరం విషయం ఏమిటి? ఈ శరీరాన్ని కూడా మీరు చాలా సన్నిహితంగా అనుభవిస్తున్నారు. ఈ అనుభవం కూడా వచ్చిపోతుంది. జాగ్రదావస్థలో శరీరాన్ని అనుభవిస్తారు కాని స్వప్నావస్థలో శరీరం మాయమవుతుంది. అంటే శరీరం కూడా ఆబ్జెక్టుగా అనుభవంలోకి వచ్చేదే. మరయితే మనస్సు మాటేమిటి? మనస్సు కూడా చాలా సన్నిహితంగా అనుభవంలోకి వస్తుంది. మనస్సులో కలిగే భావోద్రేకాలు మీకు తెలుస్తున్నాయి.

ఆ విధంగా మీరు జగత్తును అనుభవిస్తారు, శరీరాన్ని అనుభవిస్తారు, మనస్సును అనుభవిస్తారు. అందువల్ల వీటన్నింటినీ అనుభవించే మీరు, మీరు అనుభవించేవాటికి భిన్నంగా

ఉన్నారు. ఈ ప్రక్రియను దృక్‌దృశ్య వివేకం అంటారు. సబ్జెక్టు–ఆబ్జెక్టు–భేదం. ఈ ప్రక్రియ ద్వారా నేను శాశ్వతమైన చైతన్యాన్ని, నాకు వ్యవహారం నడపటానికి తాత్కాలికమైన కార్యకరణసంఘాతం ఇవ్వబడింది అనే జ్ఞానాన్ని పొందుతారు. ఒకరోజు ఈ శరీరం రాలిపోతుంది. శరీరమనే మాధ్యమం లేనందువల్ల మీరు వ్యవహారం నడపలేరు. ఇది మీకు ప్రతిరాత్రీ అనుభవంలోకి వస్తూనే ఉంది. సుషుప్తిలో ఈ శరీరం పడుకుంటుంది కాబట్టి మీరు ఏమీ వ్యవహారం చేయరు. వ్యవహారం ముగిసిందంటే, మీ జీవితం ముగిసినట్టు కాదు. 'మరయితే నేను ఎవరు?' ఈ ప్రశ్న మీకు వస్తుంది.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

ఈ ఆత్మ ఎన్నడూ పుట్టదు, మరణించదు. ఆత్మకు షడ్వికారాలు లేవు. ఇది జన్మ లేనిది. నిత్యం, శాశ్వతం, పురాతనం; శరీరం మరణించినా ఆత్మకు మరణం లేదు.

శరీరం రాలిపోయినా, చైతన్యం అయిన నేను రాలిపోను. శరీరపతనానంతరం కూడా ఉంటాను. ఇంతవరకూ వ్యష్టి గురించిన విశ్లేషణ చూశాము. కృష్ణపరమాత్మ ఇదంతా తను చెప్పిన మొదటి శ్లోకంలో చెప్పాడు.

**ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే ।**
**ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥** – 13.2

ఓ కౌంతేయ, ఈ శరీరాన్ని క్షేత్రం అంటారు. దీనిని గురించి ఎవరు తెలుసుకుంటారో అతన్ని క్షేత్రజ్ఞుడు అని తత్త్వజ్ఞానులు అంటారు.

(అర్జునుని ప్రశ్న కొన్ని పుస్తకాల్లో రాదు. అది కలుపుకుంటే ఇది శ్లోకం 2 అవుతుంది.)

ఈ శరీరాన్ని అనుభవిస్తున్నాడు కాబట్టి అది ఆబ్జెక్టు. ఈ స్థూలశరీరం పంచభూతాల నుంచి వచ్చింది, మళ్ళీ పంచభూతాలలో కలిసిపోతుంది. ఈ శరీరాన్ని మీరు వాడతారు కాని మీరు శరీరం కాదు. మీరు శరీరాన్ని వాడుతున్నారు. దీన్ని జీవవిచారణ అంటారు.

**అహం చైతన్యతత్త్వమ్ అస్మి**

నేను చైతన్యాన్ని, శరీరం నాకు వ్యవహారం నడపటానికి ఇవ్వబడింది. ఇంతవరకూ జీవస్వరూపం చూశాము. ఇప్పుడు ఈశ్వరస్వరూపాన్ని చూద్దాము.

**ఈశ్వర స్వరూపం** – ఇప్పుడు ఈశ్వరవిచారణ చేద్దాము. ఎలాగైతే జీవుడు క్షేత్రం, క్షేత్రజ్ఞుల మేలుకలయికో, అదే విధంగా ఈశ్వరుడు కూడా ప్రకృతి పురుషుల మేలుకలయిక.

**ప్రకృతి + పురుషుడు = ఈశ్వరుడు.**

ఈ ప్రకృతి, పురుషుడు ఎవరు? కృష్ణపరమాత్మ ఈ రెండింటి మధ్య ఉన్న సమాన ధర్మాలను, భేదాలను వివరించాడు. సమాన ధర్మాలు రెండు – అనాదిత్వం, కారణత్వం.

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి।**

ప్రకృతి, పురుషుడు ఈ రెండూ కూడా ఆదిలేనివి అని తెలుసుకో.

ప్రకృతికి, పురుషునికి మధ్య భేదాలు ఏమిటి? ఈ ప్రకృతి, పురుషులను అపరాప్రకృతి, పరాప్రకృతి పేరిట అధ్యాయం 7లో చూశాము. అక్కడ నాలుగు భేదాలను చూశాము. అవే ఇక్కడ ప్రకృతి, పురుషుల మధ్య భేదంగా చూస్తాము.

| **పురుషుడు** | **ప్రకృతి** |
|---|---|
| ఎ) చేతనతత్త్వం | అచేతనతత్త్వం |
| బి) నిర్గుణతత్త్వం | సగుణతత్త్వం |
| సి) నిర్వికారతత్త్వం | సవికారతత్త్వం |
| డి) సత్యం | మిథ్య |

ప్రకృతి ఒక జడపదార్థం. ప్రకృతినుంచే ఈ జగత్తు మొత్తం వచ్చింది. నిజానికి ప్రకృతి గురించి సరిగ్గా అర్థం చేసుకోవాలి. ప్రకృతి గురించి సరిగ్గా అర్థం చేసుకోవాలంటే, ముందు ఒక ప్రాథమిక సూత్రం తెలుసుకోవాలి. పదార్థాన్ని సృష్టించలేము, నాశనం చేయలేము. సైన్సు కూడా అంగీకరిస్తుంది ఈ సూత్రాన్ని. పదార్థంలో ఒక అంగుళాన్ని కూడా ఎవరూ, భగవంతునితో సహా కొత్తగా సృష్టించలేరు. భగవంతుడు సర్వశక్తిమంతుడే, ఒప్పుకుంటాము కాని, భగవంతుడు కూడా కొత్తగా దేన్నీ సృష్టించలేడు.

'భగవంతుడు ఈ జగత్తును సృష్టించాడు.' ఈ వాక్యం తర్కానికి విరుద్ధంగా ఉంటుంది. అది తెలిసీ ఈ వాక్యం చెబుతాము మొదట్లో. అందువల్లనే 'భగవంతుడు తీరికూర్చుని ఈ జగత్తును ఎందుకు సృష్టించాడు?' అనే ప్రశ్నకు సరియైన జవాబు లేదు. ఇంచుమించుగా ప్రతి ఒక్కరూ ఏదో సమయంలో అడిగే ప్రశ్నే ఇది. 'భగవంతుడు తీరికూర్చుని ఈ జగత్తును ఎందుకు సృష్టించాడు? జగత్తును సృష్టిస్తే సృష్టించాడు, దోమలనెందుకు సృష్టించాడు? అనారోగ్యాన్ని ఎందుకు సృష్టించాడు, నేరస్థులనెందుకు సృష్టించాడు? భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, కరుణామయుడు అంటారు కదా! మరి ఇన్ని బాధలనెందుకు ఇచ్చాడు?' ఇలా జీవితంమీద విసుగుపుట్టినప్పుడల్లా ఈ ప్రశ్నలు వేస్తూ ఉంటారు.

ఈ ప్రశ్నలకు వేదాంతం జవాబు ఒక్కటే! అసలు మీ ప్రశ్నే తప్పు అంటుంది. తప్పుడు ప్రశ్నకు ఎన్నడూ సరియైన జవాబు రాదు. 'సంస్కృత అకాడమీనుంచి మైలాపూర్‌కు మధ్యనున్న దూరం ఎన్ని కిలోగ్రాములు?' ఈ ప్రశ్న ఎవరైనా అడిగితే దీనికి జవాబు

చెప్పగలరా? అసలు ప్రశ్నే తప్పు. దూరాన్ని ఎవరూ కిలోగ్రాములలో కొలవరు. అలాగే భగవంతుడు ఎందుకు సృష్టించాడు అనే ప్రశ్నే తప్పు. జగత్తును సృష్టించవచ్చు అనే అపోహనుంచి వచ్చిన ప్రశ్న ఇది.

వేదాంతం మీ ప్రశ్నే తప్పు; ఎవరూ జగత్తును సృష్టించలేదు అంటుంది. జగత్తు పదార్థం. పదార్థాన్ని ఎవరూ సృష్టించలేరు, నాశనం చేయలేరు. ఇది ప్రాథమిక సూత్రం. అందువల్ల జగత్తు అంతకుముందూ ఉంది, ఇప్పుడూ ఉంది, ఎప్పుడూ ఉంటుంది. కాని ఈ ప్రశ్నకు జవాబు చెప్పితీరాలంటే ఈ విధంగా చెప్పవచ్చు. జగత్తు అవ్యక్తంగా పరమాత్మలో ఉంది. ఒక చెట్టు ఎలాగైతే అవ్యక్తంగా విత్తనంలో ఉంటుందో, అలాగే జగత్తు, పరమాత్మలో అవ్యక్తంగా ఉంటుంది. చెట్టు విత్తనంలో ఉంటే అది కారణ–అవస్థ అవుతుంది; చెట్టుగా మారితే అది కార్య–అవస్థ అవుతుంది. జగత్తు కూడా అంతే.

**బీజస్యాంతరివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పునః**
**మాయాకల్పితదేశకాలకలనా వైచిత్ర్యచిత్రీకృతమ్ ।**
**మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యస్స్వేచ్ఛయా।**
**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥** – దక్షిణామూర్తి స్తోత్రం 2

చిన్నవిత్తనంలో మహావృక్షం దాగివున్నట్టుగా, బాహ్యంగా కనబడే ఈ మహాజగత్తంతా, దేశకాలావృత్తమైన సమస్త చరాచర ప్రపంచాన్నీ, ఇంద్రజాలకునిలాగా, మహాయోగిలాగా, బహిర్గతం చేసి, తన మాయాశక్తితో స్వేచ్ఛగా జగన్నాటకాన్ని నడిపే మహాత్ముడైన నా గురువుకు, శ్రీ దక్షిణామూర్తికి ఇవే నా నమస్కృతులు.

ఆ విధంగా జగత్తు అవ్యక్తరూపంలో ఉంది. సైన్సులో కూడా బిగ్‌బ్యాంగ్ థియరీ గురించి వస్తుంది. ముందు అంతా అవ్యక్తంలో ఒక్కటిగా ఉంది. తరువాత ఒకక్షణంలో వెయ్యోవంతు సమయంలో విశ్వం వచ్చింది. దానిలో కొత్తగా ఏమైనా వచ్చిందా? లేదు! అవి అవ్యక్తంలో ముందే ఉన్నాయి. ఉనికి లేనిదాన్ని కొత్తగా సృష్టించలేము. అలా ఉనికి లేనిదాన్నుంచి ఏదైనా కొత్తగా వచ్చేటట్టయితే, ఇసుకనుంచి తైలాన్ని తీయగలిగేవారం. కాని అలా కుదరదే! నూనెగింజలనుంచి మాత్రమే నూనెను తీయగలము.

జగత్తు అవ్యక్తంలో ఉన్నప్పుడు దాన్ని **కారణ అవస్థ** అంటారు. కారణ అవస్థను బీజ అవస్థ లేదా నిర్వికల్ప అవస్థ అనికూడా అంటారు. ఈ విషయాన్ని నిరూపించటానికి ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు. చెట్టుయొక్క గింజ, పాపాయియొక్క పిండరూపం. తల్లిగర్భంలో పిండరూపంలో ఉండగా, ఆ పిండం ఎలా ఆకారం దిద్దుకుంటుందో తెలియదు; అన్ని అంగాలు సలక్షణంగా ఉంటాయో లేదో తెలియదు. భగవంతునిమీద భారం వేయటం తప్ప ఏమీ చేయలేము. అంగవైకల్యంతో పుడతాడో, కంటిచూపు సరిగ్గా ఉంటుందో లేదో

తెలియదు. కొన్ని అనారోగ్యాలైతే బాబు 14-16 సంవత్సరాలు ఎదిగేవరకూ బయటపడవు. జన్యుశాస్త్రంలో ఈ జీన్స్ గురించి, డి.ఎన్.ఎ. గురించీ పరిశోధనలు చేస్తున్నారు.

ఇంతకీ చెప్పొచ్చింది, జగత్తు మొత్తం అవ్యక్త అవస్థలో ఉంది అంటుంది వేదాంతం. సైన్సు శక్తి అంటే, వేదాంతం ప్రకృతి, మాయ, అవ్యక్తం, అవిద్య అంటుంది. అందువల్ల సృష్టి జరగకముందు, రెండు ప్రాథమిక అంశాలు ఉన్నాయి అంటుంది వేదాంతం. అవి సర్వవ్యాపకమైన, శాశ్వతమైన, చైతన్యతత్త్వమైన పురుషుడు; మూలపదార్థమైన ప్రకృతి మాత్రమే ఉన్నాయి.

**పురుషుడు + ప్రకృతి = ఈశ్వరుడు.**

ఈశ్వరుడు కేవలం చైతన్యమూ కాదు, కేవలం పదార్థమూ కాదు; ఈ రెండింటి మేలుకలయిక. దీన్ని మన పురాణాల్లో అర్ధనారీశ్వరతత్త్వంగా, సూచనప్రాయంగా వర్ణిస్తారు. అర్ధనారీశ్వరుడు అంటే వేరే ఏమీ కాదు - ప్రకృతి పురుషుల మేలుకలయిక. విష్ణుమూర్తి వక్షస్థలంలో లక్ష్మీదేవి కొలువైవుంటుంది; బ్రహ్మ నాలుకమీద సరస్వతి నాట్యమాడితే, శివుని అర్ధభాగంగా పార్వతీదేవి నెలకొని ఉంటుంది.

పురుషుడు, ప్రకృతిల భేదాలను చూశాము. ఎ) పురుషుడు చేతనతత్త్వం అయితే, ప్రకృతి అచేతనతత్త్వం. బి) పురుషుడు నిర్వికారం అయితే, ప్రకృతి సవికారం. సి) పురుషుడు నిర్వికల్పం అయితే, ప్రకృతి సవికల్పం. ఆకాశం, కాంతిలాగా చైతన్యం కూడా భాగాలు లేనిది. ఆకాశాన్ని భాగాలుగా చేయలేము. అలాగే ఇక్కడ కాంతి ఎక్కువ ఉందని కొంత భాగాన్ని కోసి, ఇంకోచోటికి తీసుకువెళ్ళలేము. అలాగే చైతన్యానికి కూడా భాగాలు లేవు. కాని ప్రకృతికి భాగాలు ఉన్నాయి. డి) చైతన్యం సత్యం అయితే పదార్థం మిథ్య. ఇది పూర్తిగా సాంకేతిక భేదం. చైతన్యానికి స్వతంత్రమైన ఉనికి ఉంది, స్వయంప్రకాశకం; పదార్థానికి విడిగా ఉనికి లేదు. దాని ఉనికిని నిరూపించటానికి చైతన్యం కావాలి.

స్వామీజీ ఒక మైకు ముందు కూర్చుని బోధ చేస్తుంటే, మైకుకు స్వామీజీ దానిముందు ఉన్నారని తెలియదు. ఇక్కడ మైకు ఉందని నిరూపించాలంటే, దానికొక చేతనతత్త్వం ఉండాలి. అందువల్ల చైతన్యం సత్యం, పదార్థం మిథ్య. ఇది వేదాంతంలో ముఖ్యమైన అంశమే అయినా, ఇప్పుడు ఆ వివరాలలోకి మనం వెళ్ళటం లేదు.

ఇప్పుడు మళ్ళీ సృష్టి విషయానికి వద్దాము. సృష్టి జరగకముందు ఉన్న అవస్థను ప్రళయ అవస్థ అంటారు. ఈ అవస్థలో అంటే సృష్టికి ముందు పురుషుడు, ప్రకృతి (ఈశ్వరుడు) మాత్రమే ఉన్నారు. ముందే చూసినట్టుగా, పురుషుడు ఎటువంటి మార్పుకూ లోనుగాడు. ఎందుకంటే పురుషుడు నిర్వికారం. కాని ప్రకృతి మార్పుకు లోనవుతుంది. కర్మ సిద్ధాంతాన్నిబట్టి ప్రకృతి అనువైన సమయంలో మార్పు చెందుతుంది.

ప్రకృతి మార్పు చెందటానికి సిద్ధమవుతుంది మొదటి దశలో. ప్రకృతి మార్పు చెందేటప్పుడు ముందు సూక్ష్మపంచభూతాల సృష్టి జరుగుతుంది. సూక్ష్మపంచభూతాలనుంచి స్థూలపంచభూతాలు వస్తాయి. పంచభూతాలు అంటే ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి. ఈ ఐదూ జగత్తుయొక్క సృష్టికి తోడ్పడతాయి. సూక్ష్మపంచభూతాలనుంచి సూక్ష్మప్రపంచసృష్టి జరిగితే, స్థూలపంచభూతాలనుంచి స్థూలప్రపంచసృష్టి జరుగుతుంది. స్థూలశరీరం స్థూలసృష్టికి ఉదాహరణ అయితే, మనస్సు సూక్ష్మసృష్టికి ఉదాహరణ. సూక్ష్మం అంటే కంటికి కనబడనిది. నా మనస్సును మీరు చూడలేరు, మీ మనస్సును నేను చూడలేను; కాని నా శరీరాన్ని మీరు చూడగలరు, మీ శరీరాన్ని నేను చూడగలను. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే కంటికి కనబడేదంతా స్థూలం అయితే, కంటికి కనబడనిది సూక్ష్మం. రెండూ ప్రకృతినుంచి వచ్చినవే. శాస్త్రం దీన్ని **వికృతి** అంటుంది. వికృతి అంటే మార్పుచెందిన ప్రకృతి. ఈ జగత్తు మొత్తం వికృతి; మనస్సు వికృతి; శరీరం వికృతి. అన్నీ ప్రకృతియొక్క వ్యక్తరూపాలు.

ఈ మార్పు చాలా చాలా నిదానంగా జరుగుతుంది. ఒక పిల్లవాడు రాత్రికి రాత్రి యువకుడు అయిపోడు. బాల్యం, కౌమార్యం దశలు దాటుకుంటూ రావాలి. అదే విధంగా ప్రపంచం కూడా సూక్ష్మప్రపంచం దశనుంచి స్థూలప్రపంచం దశకు రావాలి. ఇన్ని మార్పులు జరుగుతున్నంతసేపూ, మారని చైతన్యంగా పురుషుడు నిత్యమూ ఉంటూనే ఉంటాడు.

ఉదాహరణకు ఒకగదిని తీసుకోండి. అందులోని ఆకాశం ఈ గది ఏర్పడ్డాకా ఉంది, ఈ గది ఆకారం రాకముందూ ఉంది, గదిని కడుతున్నప్పుడూ ఉంది. అదే విధంగా చైతన్యం సృష్టి జరగకముందూ ఉంది, సృష్టి జరిగాకా ఉంది, సృష్టి మళ్ళీ అంతరించిపోయాకా ఉంటుంది. సృష్టికి ముందు చైతన్యం + అవ్యక్తప్రకృతి ఉంది; మళ్ళీ ప్రళయంలోకి వెళ్ళిపోయినప్పుడూ చైతన్యం + అవ్యక్తప్రకృతి ఉంటుంది. మధ్యదశలో చైతన్యం + వ్యక్త ప్రకృతి ఉంటాయి.

ఉదాహరణకు, మీరు నిద్రపోయినప్పుడు, మీ ఇంద్రియాలను వెనక్కి లాక్కుంటారు. అప్పుడు మీ భావోద్రేకాలు, మీ జ్ఞానం, మీ కార్యకలాపాలు, అన్నీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. మర్నాడు పొద్దున్న మీరు మళ్ళీ లేచినప్పుడు, మళ్ళీ అన్ని కార్యకలాపాలలోకి దిగుతారు. అందువల్లనే సృష్టిని భగవంతుని జాగ్రదావస్థ అనీ, ప్రళయాన్ని భగవంతుని నిద్ర అనీ అంటారు.

**ఉన్మేష నిమిషోత్పన్నవిపన్న భువనావళిః** – లలితా సహస్రనామమ్

ప్రకృతి జగత్తుగా వ్యక్తమవుతుంది; మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది.

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥** – 2.28

ఓ అర్జునా! ప్రాణులన్నీ పుట్టుకకు ముందు అవ్యక్తాలు; మరణానంతరం కూడా అవి అవ్యక్తాలే. ఈ జనన మరణాల మధ్యకాలంలోనే అవి ప్రకటితాలు అవుతాయి. అలాంటప్పుడు వాటికోసం పరితపించటం నిష్ప్రయోజనం.

వేదాంతం ప్రకారం సృష్టి ఒక సరళరేఖలో సాగలేదు. అది ఒక వృత్తాకారంలో జరుగుతుంది. వృత్తానికి ఎలా ఒక ఆది, అంతం ఉండదో, అలా సృష్టికి కూడా ఆది, అంతం ఉండదు.

**న రూపమస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా** – 15.3

ఈ సంసారవృక్షాన్ని బాగా పరిశీలించి చూస్తే, దానికొక ఆది, అంతం, సరియైన స్థితి లేదు.

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ ॥** – 13.20
**కార్యకరణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే ।** – 13.21

ప్రకృతి, పురుషుడు కూడా అనాదిగా వస్తున్నారు. ప్రకృతినుంచి ఈ విశ్వం వచ్చింది. అందువల్ల ప్రకృతి గుణాలు ప్రపంచంలో వస్తాయి. ప్రకృతినుంచే స్థూలశరీరం, మనస్సు వచ్చాయి.

జగత్తు ప్రకృతి, పురుషుల మేలుకలయిక. పురుషుడు అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా ఉంటాడు. ఈ జగత్తంతా ప్రకృతినుంచి వస్తే, మరి పురుషుణ్ణి ఎక్కడ చూడాలి? ఈ పురుషునికోసం వెతికే ప్రయత్నం చేస్తారు కొందరు. వేదాంతం పురుషుణ్ణి తెలుసుకోవటానికి అద్భుతమైన మార్గాన్ని సూచిస్తుంది.

ప్రకృతి, పురుషుల మధ్య భేదాలు చూసినప్పుడు ఒక భేదం ఏమన్నాము? ప్రకృతి సవికారం, పురుషుడు నిర్వికారం. అందువల్ల పురుషుణ్ణి తెలుసుకోవాలంటే, నిర్వికార పురుషుణ్ణి తెలుసుకోవాలంటే, మార్పు ఉన్న ప్రతిదాన్నీ తిరస్కరిస్తూ రావాలి. మార్పు ఉన్నదేదైనా ప్రకృతి కాబట్టి, మార్పులేనిది ఏది మిగులుతుందో, అది పురుషుడు.

బాహ్యప్రపంచంలో చూద్దామా అంటే బాహ్యప్రపంచం అనేక మార్పులకు లోనవుతుంది. అత్యంత సూక్ష్మమైన అణువునుంచి అత్యంత పెద్ద నక్షత్రం దాకా ప్రతిదీ మార్పుకు లోనవుతుంది. అందువల్ల ముందు జగత్తును కొట్టివేయండి. తరువాత శరీరానికి రండి. కాని శరీరం కూడా షడ్వికారాలకు లోనవుతుంది. అందువల్ల శరీరం కూడా ప్రకృతే.

మనస్సు పురుషుడు అందామా అంటే మనస్సు అనేక రాగద్వేషాలకు లోనవుతుంది. అందువల్ల శరీరం, మనస్సు కూడా ప్రకృతి కిందికే వస్తాయి. అందువల్ల జగత్తును త్రోసిపుచ్చుతారు; శరీరాన్ని త్రోసిపుచ్చుతారు; మనస్సును త్రోసిపుచ్చుతారు; ఈ విధంగా ప్రకృతిని త్రోసిపుచ్చుతారు. మరయితే పురుషుడు ఎక్కడ ఉన్నాడు?

ఉపనిషత్తులేమో జగత్తు అంతా ప్రకృతి, పురుషుల మేలుకలయిక అంటున్నాయి. కాని ప్రకృతిని త్రోసిపుచ్చితే ఏమీ మిగలలేదే! కొందరు అంటారు, 'పన్నెండు సంవత్సరాలుగా నేను ధ్యానం చేస్తున్నాను. ఆలోచనలను పారద్రోలి మనస్సును శూన్యం చేశాను. ప్రకృతిని పారద్రోలితే, పురుషుడు మిగలాలి కదా! కాని నాకేమీ పురుషుడు కనబడటం లేదే!' ఆ పురుషునికోసం వెతకవద్దు అంటుంది వేదాంతం. ఎందుకంటే మారే ప్రకృతిని చూస్తున్న నువ్వే మారని పురుషుడివి అంటుంది. జగత్తును, శరీరాన్ని, మనస్సును సాక్షిగా చూస్తున్న నువ్వే పురుషుడివి. జగత్తును, శరీరాన్ని, మనస్సును సాక్షిగా చూస్తున్న నన్ను నేను చూసుకోవటమెలా? దాన్ని చూశారంటే అది ఆబ్జెక్టు అవుతుంది.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

అనుభవించే వస్తువులను చూసే నేను పురుషుణ్ణి.

**పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్ ।**
**కారణం గుణసంగోఽస్య సదసద్యోనిజన్మసు ॥** – 13.22

పురుషుడు, ప్రకృతిలో వచ్చే అనేక భావాలను సాక్షిచైతన్యంగా చూస్తున్నాడు. కాని ప్రకృతికి చెందిన గుణాలతో తాదాత్మ్యం చెందటంవల్ల ఈ సంసారచక్రం ఏర్పడుతున్నది.

పురుషుడు సాక్షిచైతన్యంగా అన్ని మనశ్శరీరాలలో ఉంటే మన సమస్య ఏమిటి? 'నేను సాక్షి చైతన్యాన్ని,' అని తెలుసుకునే బదులు, మనం ప్రకృతితో మమేకం చెందుతున్నాము.

ఇప్పుడు ఈశ్వరస్వరూపం అంశంయొక్క సారాంశాన్ని చూద్దాము. పరమాత్మ ఎవరు? పురుషుడు+ప్రకృతి. జీవాత్మ ఎవరు? క్షేత్రజ్ఞుడు+క్షేత్రం. వ్యక్తి స్వరూపం ఏమిటి? క్షేత్రజ్ఞుడు. పరమాత్మ స్వస్వరూపం ఏమిటి? పురుషుడు. కృష్ణపరమాత్మ పురుషుడే క్షేత్రజ్ఞుడు, క్షేత్రజ్ఞుడే పురుషుడు అంటున్నాడు. పరమాత్మలోనూ, జీవాత్మలోనూ ఉన్న చైతన్యం ఒకటే. భేదాలన్నీ ప్రకృతిస్థాయిలోనే వస్తాయి. వ్యష్టిపరంగా చూస్తే మీకు, నాకు కూడా భేదాలు ఉంటాయి, శరీరపరంగా, మనస్సుపరంగా కూడా. మీ శరీరం వేరు, నా శరీరం వేరు. నిజానికి ఈ భేదం ఉండాలి. లేకపోతే ఎవరు ఎవరో గుర్తుపట్టలేము. అందువల్ల వ్యవహారం నడపటానికి భేదాలు ఉండాలి. ప్రకృతిస్థాయిలో, మనస్సుపరంగా కూడా భేదాలు

ఉంటాయి. కాని చైతన్యపరంగా చూస్తే, నాలో ఉన్న చైతన్యమూ, ఇతరులలో ఉన్న చైతన్యమూ ఒకటే. చివరగా భగవంతునిలో ఉన్న చైతన్యం కూడా అదే. అంటే సమష్టిలోనూ, వ్యష్టిలోనూ ఉన్న చైతన్యం ఒకటే.

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత** - 13.3

ఓ అర్జునా, నేను అన్ని క్షేత్రాలలో ఉన్న క్షేత్రజ్ఞునిగా తెలుసుకో అన్నాడు కృష్ణపరమాత్మ.

ఈ వాక్యం మొత్తం వేదాంతానికే ఆయువుపట్టు అయిన వాక్యం. సమష్టిలో ఉన్న చైతన్యం, వ్యష్టిలో ఉన్న చైతన్యం ఒకటే అంటున్నాడు. అంటే జీవాత్మ-పరమాత్మ అభేదాన్ని సూచించే వాక్యం ఇది. ఆ ఐక్యం పారమార్థికస్థాయిలో, వ్యావహారికస్థాయిలో కాదు. కాని ఈ విషయం గ్రహించక, నేను మారని, శాశ్వతమైన చైతన్యాన్ని అని తెలియక, మీరు అశాశ్వతమైన శరీరంతో మమేకం చెంది, దేహాభిమానం పెంచుకుంటే, సంసారం తప్పదు అనికూడా చెబుతున్నాడు.

మనం మరణాన్ని అంత తేలికగా స్వీకరించలేము. ఎందుకంటే మన స్వస్వరూపం అమృతత్వం. కాని ఆ అమృతత్వం ఆత్మది. అది తెలియక శరీరానికి కోరుకుంటున్నాము. శరీరానికి మరణం లేకుండా చేయటం సాధ్యం కాదు. ఎవరైనా శాస్త్రజ్ఞుడు ఒక ప్రత్యేకమైన ఇంజెక్షన్ కనిపెట్టకపోతాడా, మరణించినవారు తిరిగి జీవం పోసుకోకపోతారా అని ఆశగా ఎదురుచూస్తారు. కాని వేదాంతం శరీరపరంగా నిత్యంగా ఉండటం అసాధ్యం అంటుంది. అసాధ్యమైనదాన్ని సాధ్యం చేయటానికి ప్రయత్నిస్తే, జీవితం సమస్యలపాలు కాకతప్పదు. అమృతత్వం కావాలంటే దానికి ఒకటే మార్గం. మీ దృష్టిని అశాశ్వతమైన శరీరంనుంచి, శాశ్వతమైన ఆత్మవైపు మళ్ళించటమే.

**యావత్సంజాయతే కించిత్ సత్త్వం స్థావరజంగమమ్ ।**
**క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్ తద్విద్ధి భరతర్షభ ॥** - 13.27

మొత్తం ఈ చరాచర ప్రాణులన్నీ కూడా, జననమరణ వృత్తంలోపడి తిరగాల్సిందే. నేను క్షేత్రజ్ఞుణ్ణి అనే విషయంలో అజ్ఞానం ఉండటంవల్ల నేను క్షేత్రం అనుకుని దానిమీద అభిమానం పెంచుకుంటున్నాను. దీన్ని ఆత్మ-అనాత్మ అధ్యాస అంటారు.

ఈ అధ్యాస పోవాలంటే, ఆత్మజ్ఞానం పొందాలి. నేను శరీరాన్ని కాను, నేను శాశ్వతమైన ఆత్మను అని తెలుసుకోవాలి. ఇక్కడితో మహావాక్యవిచారణ భాగం పూర్తయింది.

2. **జ్ఞానయోగసాధనలు** - కృష్ణపరమాత్మ జ్ఞానం పొందటానికి కొన్ని సాధనలు పేర్కొన్నాడు.

**అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్ ।**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥** - 13.8

కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో జ్ఞానప్రాప్తి సాధనలకు 20 విలువలను పేర్కొన్నాడు. వాటిపేర్లు చూద్దాము. అవి – అమానిత్వం, అదంభిత్వమ్, అహింస, క్షాంతి, ఆర్జవం, ఆచార్యోపాసనం, శౌచం, స్థైర్యం, ఆత్మవినిగ్రహం, ఇంద్రియార్థేషు వైరాగ్యం, అనహంకారం, జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనం, అసక్తి, పుత్రదారగృహాదిషు అనభిష్వంగం, నిత్యం సమచిత్తత్వం, అనన్యయోగభక్తి, వివిక్తదేశసేవిత్వమ్, అరతిర్జనసంసది, తత్త్వజ్ఞానార్థదర్శనం, అధ్యాత్మజ్ఞాననిత్యత్వం.

**వివేకం** – సమస్య ఎక్కడ ఉంది అంటే, మిమ్మల్ని మీరు సరిగ్గా అర్థం చేసుకోకపోవటంలో ఉంది. దయానందస్వామీజీ అద్భుతంగా చెబుతారు 'సమస్య నువ్వే, పరిష్కారమూ నువ్వే.' మీకున్న సమస్యను అర్థం చేసుకోవాలి అంటే, ముందుగా మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవాలి. దీన్ని **వివేకం** అంటారు. రోగనిర్ధారణ సరిగ్గా జరగకపోతే, మందులు సరియైనవి తీసుకోలేరు.

ఒకసారి మన జీవితాన్ని లోతుగా విశ్లేషిస్తే, ఎంత ఉన్నా తనివితీరని భావనే మన సమస్యకు కారణమని అర్థమవుతుంది. ఎంత ఉన్నా, ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. నాకు కావాలి, నాకు కావాలి అనేది తంబూర శ్రుతిలాగా వినిపిస్తూనే ఉంటుంది. వెయ్యి రూపాయలు ఉంటే లక్ష కావాలనిపిస్తుంది; లక్ష ఉంటే ఇంకో లక్ష కావాలనిపిస్తుంది. కోటికి పడగలెత్తిన వ్యక్తి కూడా ఇంకో కోటికోసం పరుగులు తీస్తాడు. నిజానికి అత్యంత ధనికుడు అత్యంత బీదవాడు అని చెప్పవచ్చు. ఎందుకంటే వెయ్యి రూపాయలు ఉన్న వ్యక్తి ఇంకొక వెయ్యి వస్తే చాలనుకుంటాడు. కాని కోటి ఉన్న వ్యక్తి ఇంకో కోటి కావాలంటాడు. అందువల్ల ఎంత ధనవంతుడైతే అంత బీదవారుగా మారిపోతున్నారు.

ఎక్కువ విషయాలు తెలిసినవ్యక్తి అందరికన్నా ఎక్కువగా అవస్థ పడతాడు. అసలేమీ తెలియని వ్యక్తి నిశ్చింతగా ఉంటాడు. ఎంత నేర్చుకున్నా మీరు నేర్చుకున్నది చాలా తక్కువ అనిపిస్తుంది; ఎంత పొందినా మీరు పొందినది చాలా తక్కువ అనిపిస్తుంది; ఎంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా మీ స్థాయి చాలా తక్కువ అనిపిస్తుంది. అందువల్ల మీ కొరతను తీర్చటానికి ఇంకా ఇంకా వస్తువులను సమకూర్చుకుంటారు; ఆస్తులు పెంచుకుంటారు; ఉద్యోగాలు మారతారు.

సమస్య ఎక్కడుందో ముందు అర్థం చేసుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. సమస్య ఆత్మ అజ్ఞానం. పరిష్కారం ఆత్మజ్ఞానం. ఈ విషయాన్ని గ్రహించటం **వివేకం**.

**వైరాగ్యం** – ఎప్పుడైతే ఆత్మజ్ఞానమే సమస్యలన్నింటికీ పరిష్కారం అని అర్థం చేసుకుంటారో, అప్పుడే అది జీవితంలో మీకు ప్రముఖస్థానంలోకి చేరుకుంటుంది; తక్కినవన్నీ కిందిస్థాయికి వెళ్ళిపోతాయి. అవి కూడా అవసరమే, కాదనటం లేదు. కాని జీవితంలో ఏది అత్యంత ముఖ్యమో ఇప్పుడు తెలుసుకున్నారు మీరు. జీవితాంతం ఆనందాలలో

తెలియాడకూడదు; జీవితాంతం డబ్బు సంపాదనలో పడిపోకూడదు. ఎవరూ జీవితాన్ని ఆనందించవద్దనీ చెప్పరు, డబ్బు సంపాదించవద్దనీ చెప్పరు. కాని వాటిల్లోనే మునిగిపోకూడదు. వేదాంతం నేర్చుకునే శిష్యునికి తనకు జీవితంలో ఏది ముఖ్యమో బాగానే తెలుసు. తక్కిన అన్ని లక్ష్యాలు మార్గం కిందికి వస్తాయి; ఆత్మజ్ఞానం లక్ష్యం అవుతుంది. ఈ విచక్షణాశక్తిని **వైరాగ్యం** అంటారు.

**మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ** – 13.11

నామీద అనన్యయోగభక్తి ఉండి ఏకాగ్రతతో పూజించాలి.

జీవితంలో విజయం సాధించాలంటే దైవకృప మెండుగా ఉండాలి. నిజానికి సరియైన గురువును పొందటానికి కూడా దైవకృప ఉండాలి. అందువల్ల కృష్ణపరమాత్మ పేర్కొన్న ఈ విలువల్లో ముఖ్యమైనవి వివేకం, వైరాగ్యం,భక్తి. మరికొన్ని విలువలు పదహారవ అధ్యాయంలో చూస్తాము.

3. **ప్రయోజనం** – ఈ విచారణ చేస్తే కలిగే ఫలం కూడా చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఎప్పుడైతే మీరు పురుషుడు అని అర్థం చేసుకుంటారో, అప్పుడే ప్రకృతితో మమేకం చెందకుండా ఉంటారు. ప్రకృతితో మమేకం చెందకుండా ఉండగలిగితే, సంసారంనుంచి విడివడతారు. అలా మీ శరీరం, మీ మనస్సు మీకు భిన్నంగా ఉందని అర్థం చేసుకుంటే, వ్యతిరిక్తత చూపకుండా ప్రకృతి సూత్రాలను స్వీకరిస్తారు.

ముందుగా శరీరాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరిస్తారు. శరీరానికి షడ్వికారాలు ఉన్నాయని అర్థం చేసుకుంటారు. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. చివరికి శరీరం కృశించి, నశించిపోతుంది. శరీరం మరణించినా, మీకు మరణం లేదని అర్థం చేసుకుంటారు కాబట్టి దుఃఖించరు. మీరు శరీరంనుంచి విడివడతారు కాబట్టి దుఃఖం ఉండదు. ఈ జ్ఞానంవల్ల కలిగే అద్భుతమైన ఫలం ప్రకృతిని వ్యవహారానికి ఉపయోగిస్తారు, ప్రకృతిని ఆనందిస్తారు.

స్విమ్మింగ్‌పూల్ ఆనందహేతువా, దుఃఖహేతువా? దానికి జవాబు అందులోకి దిగేవారిని బట్టి ఉంటుంది. ఈత కొట్టటం రాకపోతే, స్విమ్మింగ్‌పూల్‌లో దిగితే కోరి మరణాన్ని తెచ్చుకున్నట్టే అవుతుంది. అలా కాకుండా, ఈత వచ్చి అందులోకి దిగితే, అది ఒక క్రీడగా మారుతుంది. ప్రకృతి విషయంలో కూడా అంతే. ప్రకృతి ఒక స్విమ్మింగ్‌పూల్, మీరు ప్రకృతి గురించి పొందే జ్ఞానం తరణవిద్యలాంటిది. ఈ జ్ఞానంతో ప్రకృతిలో ఈత కొడితే, జీవితం ఒక క్రీడగా, ఆనందంగా సాగుతుంది. ఈ జ్ఞానం లేకుండా ప్రపంచంలో జీవిస్తే, ఎక్కడికక్కడ అవస్థలు పడకతప్పదు. అందువల్ల కృష్ణపరమాత్మ అంటున్నాడు –

**క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ అంతరం జ్ఞానచక్షుషా ।**
**భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ ॥** – 13.35

ఈ విధంగా జ్ఞాననేత్రం ద్వారా ఎవరైతే క్షేత్ర–క్షేత్రజ్ఞుల మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకుని, ప్రకృతికి స్వతంత్రంగా ఉనికి లేదని తెలుసుకుంటారో, వారు మోక్షం పొందుతారు.

ఎవరైతే ఆత్మజ్ఞానం పొందుతారో, వారు మోక్షం పొందుతారు. వారు మోక్షాన్ని మరణించాక, ఇంకొక లోకానికి వెళ్ళి పొందరు. ఇక్కడే, ఇప్పుడే, జీవించి ఉండగానే పొందుతారు. దానిని జీవన్ముక్తి అంటారు. జీవితం ఇంక వారిని బాధించదు. జీవితం ఒక ఆటలా సాగుతుంది. అందువల్ల మహావాక్యవిచారణ చేసి, ఆత్మజ్ఞానాన్ని పొంది, జీవన్ముక్తులు కండి.

# గుణత్రయవిభాగయోగము

## అధ్యాయము 14

మహావాక్య విచారణను ఈ అధ్యాయంలో కూడా చూస్తాము. జీవాత్మ-పరమాత్మ ఐక్యాన్ని బోధించే వాక్యాన్ని మహావాక్యం అంటారు. అదేకాక, ఈ విచారణ చేయటానికి అవసరమైన సాధనలను, ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలమూ చూస్తాము ఈ అధ్యాయంలో. ఈ గుణత్రయ విభాగయోగము అనే ఈ అధ్యాయంలో ముఖ్యంగా మూడు అంశాలను చూస్తాము. అవి - జ్ఞానము, జ్ఞానసాధనలు, జ్ఞానఫలము. కాని కృష్ణపరమాత్మ ఈ అంశాన్ని వేరే కొత్త కోణంలో వివరించుకొస్తాడు.

ఈ అధ్యాయాన్ని అర్థం చేసుకోవాలంటే, మనం ఒకసారి మళ్ళీ పదమూడవ అధ్యాయంలో ఈశ్వరుణ్ణుంచి వచ్చిన సృష్టిక్రమం గురించి కృష్ణపరమాత్మ ఏం చెప్పాడో, అది గుర్తు తెచ్చుకోవాలి. ఈశ్వరుని నిర్వచనం పురుషతత్త్వం + ప్రకృతితత్త్వం. పురుషుడు అంటే చైతన్యం, ప్రకృతి అంటే పదార్థం.

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ ॥** - 13.20

ప్రకృతి, పురుషుడు కూడా ఆదిలేనివి అని తెలుసుకో. రాగద్వేషాలు, సత్త్వరజస్తమో గుణాలు ప్రకృతినుంచే ఉత్పన్నమైనట్టుగా తెలుసుకో.

అనాది చైతన్యం, అనాది ప్రకృతుల మేలుకలయికను ఈశ్వరుడు అంటారు. ఈ ఈశ్వరుణ్ణుంచే సృష్టి వచ్చింది. అందువల్ల జగత్తు మొత్తం కార్యం అని, ఈశ్వరుడు జగత్కారణం అని చెప్పవచ్చు. ఎప్పుడైతే ఈశ్వరుణ్ణి కారణంగానూ, జగత్తును కార్యంగానూ అర్థం చేసుకుంటామో అప్పుడే ఉపాదానకారణం గురించిన ఒక సూత్రాన్ని గుర్తు తెచ్చుకోవాలి.

**కారణ గుణాః కార్యే అనువర్తంతే**

కారణంయొక్క గుణం కార్యమంతటా ఉంటుంది. ఒక ఆభరణం బంగారంతో చేయబడితే, ఆభరణం అంతటా బంగారం ఉంటుంది. అంతేకాదు, బంగారంలో ఒకవేళ 6% రాగి ఉంటే, ఆభరణంలో కూడా అంతశాతం రాగి ఉంటుంది.

ఈ సూత్రాన్ని మనం మన నిజజీవితంలో కూడా గమనించవచ్చు. తల్లిదండ్రుల లక్షణాలను, రూపురేఖలను పుణికిపుచ్చుకుంటారు పిల్లలు. కొంతమంది పిల్లలకు తండ్రి లక్షణాలు ఎక్కువగా ఉంటే, మరికొందరిలో తల్లి లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్లనే, ఒక ఇంట్లో చిన్నపాపాయి పుట్టగానే, ఎవరైనా అడిగే మొట్టమొదటి ప్రశ్న,

'తల్లి పోలికా, తండ్రి పోలికా?' జవాబు తల్లి పోలిక అనో, తండ్రి పోలిక అనో రావాలి. కాని ఈ విషయంలో కూడా వాదించుకుంటారు. తల్లి పోలిక అని ఒకరంటే, తండ్రి పోలిక అని ఇంకొకరంటారు. దీనికి కారణం మనం చూసిన సూత్రమే! కారణ గుణాః కార్యే అనువర్తంతే.

ఈ సూత్రాన్ని జగత్తుకు వర్తింపజేస్తే, ఈశ్వరుదు జగత్కారణం అయితే, జగత్తు ఆయననుంచి వచ్చిన కార్యం అయితే, జగత్తు అటు పురుషుడు, ఇటు ప్రకృతి ఇద్దరి లక్షణాలూ పుణికి పుచ్చుకోవాలి.

**పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్** – 13.22

పురుషుడు ప్రకృతిలో వచ్చే అనేక భావాలను సాక్షిచైతన్యంగా చూస్తున్నాడు.

ప్రకృతినుంచి మొత్తం భోగ్యప్రపంచం వచ్చింది. ఈ భోగ్యప్రపంచంలోకి నా మనశ్శరీరాలు కూడా వస్తాయి. నేను ఈ ప్రపంచాన్ని, నా మనశ్శరీరాలను సాక్షిగా చూస్తున్నాను. ప్రకృతి లక్షణాలు వీటిలోకి వస్తాయి. ప్రకృతి జడం, సవికారం. జగత్తు కూడా జడం, సవికారం. అవికాక ప్రకృతికి మూడు గుణాలు ఉన్నాయి. వాటిని గుణత్రయం అంటారు. ఆ గుణాలను శాస్త్రం సత్త్వగుణం, రజోగుణం, తమోగుణంగా వర్ణిస్తుంది. ప్రకృతి, పురుషులలో ప్రకృతి త్రిగుణాత్మకం.

మరి పురుషుని గుణం ఏమిటి? పురుషుడు నిర్గుణం లేదా గుణాతీతం. ప్రకృతిలో ఉన్న ఈ మూడు గుణాలు జగత్తులో కూడా ఉండాలి. అందువల్ల జగత్తు కూడా ప్రకృతిలాగా త్రిగుణాత్మకమే. అంటే జగత్తులో కూడా సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం ఉన్నాయి. జగత్తులోని పంచభూతాలలో కూడా ఈ మూడుగుణాలూ ఉన్నాయంటుంది శాస్త్రం. ఉదాహరణకు ఆకాశం తీసుకుంటే, ఆకాశంలో సత్త్వరజస్తమో గుణాలు ఉన్నాయి. జగత్తులో మన మనశ్శరీరాలు కూడా వస్తాయని చూశాము కాబట్టి, ఈ సూత్రం ప్రకారం శరీరానికి, మనస్సుకు కూడా ఈ మూడు గుణాలూ ఉన్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే జగత్తు త్రిగుణాత్మకం, శరీరం త్రిగుణాత్మకం, మనస్సు త్రిగుణాత్మకం. కాని వీటిని అనుభవించే నేను గుణాతీతం.

ఇప్పుడు, ప్రకృతియొక్క ఈ మూడు గుణాలే మనను సంసారంలో కట్టి పడేస్తాయి అంటుంది శాస్త్రం. ఈ మూడు గుణాలవల్లనే మనం సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము కాబట్టి, ముందు ఈ గుణాలేమిటో, ఎలా ఉంటాయో, వాటిని ఎలా నివారించాలో బాగా లోతుగా అధ్యయనం చేయాలి. ఈ పద్ధతిని వైద్యరంగంలో చూస్తాము. ముందు ఒక రోగం పొడచూపింది అంటే, శాస్త్రజ్ఞులు ఆ రోగం ఏ వైరస్ లేదా బాక్టీరియావల్ల వచ్చిందో పరిశోధన చేసి, దాన్ని విడదీసి, దాన్ని నివారించటానికి మందులు కనిపెడతారు.

ఇంకో విషయం తెలుసా మీకు? సంస్కృతంలో గుణం అనే పదానికి ఇంకొక అర్థం ఉంది. అది తాడు లేదా గొలుసు. ఆశ్చర్యంగా లేదూ! ఈ మూడు గుణాలూ మూడు రకాల తాడులాగా ఉన్నాయి – ఇనుపతాడు, వెండితాడు, బంగారుతాడు. బంగారుతాడు ఖరీదైనదే కావచ్చు, కాని మనను ఆ తాడు సంకెళ్ళలో కట్టిపడేసేదైతే ఏం లాభం? సంకెళ్ళు సంకెళ్ళే, అవి ఇనుప సంకెళ్ళు కానీ, వెండి సంకెళ్ళు కానీ, బంగారు సంకెళ్ళు కానీ! అందువల్ల ఈ సంకెళ్ళను ఎలా ఛేదించుకోవాలో దాన్ని ప్రధానంగా విశ్లేషిస్తుంది ఈ అధ్యాయం.

ఈ అధ్యాయాన్ని ముఖ్యంగా మూడు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. గుణత్రయ విచారణ : శ్లోకాలు 1–18
2. గుణాతీతంగా ఎదగటం : శ్లోకాలు 19,20
3. గుణాతీత లక్షణం, సాధన : శ్లోకాలు 21–27

ఇప్పుడు ఒక్కొక్క అంశాన్ని తీసుకుని వాటిని వివరంగా చూద్దాము.

1. **గుణత్రయ విచారణ : శ్లోకాలు 1–18** – మూడు గుణాల లక్షణాలు, బంధించే తీరుతెన్నులు, ఫలితం. కృష్ణపరమాత్మ ఈ గుణత్రయ విచారణను ఐదు కోణాల్లో చేస్తున్నాడు. అవి గుణత్రయ లక్షణం, బంధం, లింగం, గతి, ఫలం. వీటిని మళ్ళీ ఒక్కొక్కటిగా చూద్దాము.

ఎ) **లక్షణమ్** – అంటే నిర్వచనం.

(i) సత్త్వగుణం నిర్మలాత్మకం. మనస్సు నిర్మలంగా ఉంటుంది. నిర్మలంగా ఉండటంవల్ల తక్కిన రెండు గుణాలు మలినం చేయలేవు కాబట్టి ప్రకాశవంతంగా ఉంటుంది. సత్త్వగుణంలో శుద్ధం, శాంతం, నిర్మలాత్మకంగా ఉంటుంది మనస్సు.

(ii) రజోగుణం కర్మాత్మకంగా ఉంటుంది. రజోగుణంలో భావోద్రేకాలు, అనుబంధాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల రజోగుణాన్ని రాగాత్మకం అని కూడా అంటారు. రజోగుణాన్ని సానుకూలంగా వర్ణించాలంటే అతను ఉత్సాహంతో చిందులు వేస్తుంటాడు. అదే ప్రతికూలంగా చెప్పాలంటే, అసహనంగా ఉంటాడు.

(iii) తమోగుణం మోహాత్మకంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనే తపన ఉండదు. ఈ బద్ధకం అటు ప్రశాంతతను, ఇటు ఉత్సాహాన్నీ అధిగమిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఈ రెండింటికీ భిన్నలక్షణం ఇది. దీన్ని బద్ధకం, సరియైన లక్ష్యం లేకపోవటం, నిరాసక్తత అంటారు.

ఈ విధంగా మొత్తం జగత్తులో ఈ మూడు లక్షణాలను చూస్తాము. అవి నిర్మలాత్మకం, కర్మాత్మకం, మోహాత్మకం.

బి) **బంధన ప్రకారః** – బంధన అంటే బంధకత్వం; ప్రకార అంటే పద్ధతి. ఏ గుణం ఎవరిని ఏ విధంగా బంధిస్తుందో చూద్దాము. బంధించే పద్ధతి ఏమిటి?

**సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।**

**జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత ॥** – 14.9

సత్త్వగుణం సుఖంలో ముంచెత్తితే, రజోగుణం కర్మలో బంధిస్తే, తమోగుణం జ్ఞానాన్ని కప్పివేసి, నిర్లక్ష్యంలో ముంచివేస్తుంది.

i) **సత్త్వగుణం** – సత్త్వగుణం జ్ఞానసంగం ఏర్పరుస్తుంది. జ్ఞానసముపార్జన చేయటానికి ప్రశాంత వాతవరణం ఉండాలి. జ్ఞానం పొందాలనుకోవటం, ప్రశాంతత కోరుకోవటం తప్పేమీకాదు కాని, దానికి బందీ అయితే మాత్రం అతని ప్రశాంతతకు ఏ మాత్రం ఆటంకం ఏర్పడినా, కలత చెందుతాడు. తన చుట్టూ కాస్తకూడా శబ్దాలను భరించలేకపోవటం కూడా ఒక బలహీనతే. కాకి అరిస్తే చిరాకు పడిపోతాడు; ఎవరైనా బెల్ కొడితే మండిపడతాడు. ఎందుకంటే, అతను ధ్యానం, ప్రశాంతత, నిశ్శబ్దాన్ని ఇష్టపడతాడు. కాని ఈ శబ్దాలేవీ లేకుండా చేయటం సాధ్యమయే పనేనా?

ఎలాగో కష్టపడి శబ్దాలన్నీ సద్దుమణిగేలా చేస్తే, ఫ్యాన్ తిరిగే చప్పుడు పెద్దగా వినిపిస్తుంది. ఫ్యాన్‌ను ఆపేసినా లాభంలేదు. దోమలు స్వైరవిహారం చేస్తూ రొదచేస్తాయి. ఇవేవీ లేకపోతే గడియారం 'టిక్, టిక్' మంటూ కొట్టుకుంటూనే ఉంటుంది. గడియారం చప్పుడును కూడా ఎలాగో ఆపినా, కాసేపటికి మీ పేగులే అరుస్తాయి. ఆకలేస్తోంది బాబోయ్, ఏదైనా ఆహారం నాకు వేయి అంటాయి.

అందువల్ల ప్రశాంతతను ప్రేమించండి, తప్పులేదు కాని ప్రశాంతతకు బానిస అవకండి. జ్ఞానసముపార్జన చేయండి కాని జ్ఞానసంగంలో కూరుకుపోకండి. ధ్యానం చేయండి కాని ధ్యానమే చేస్తూ ఉండాలనుకోకండి. సత్త్వగుణం నిజానికి మంచి గుణమే. ఎందుకంటే నిర్మల మనస్సును, ప్రశాంత మనస్సును చేకూరుస్తుంది; కాని ఏదీ మితిమీరకూడదు. అది ఎక్కువైతే అది కూడా ఒక వ్యసనంలాగా మారుతుంది. మంచివిషయం వ్యసనం ఎలా అవుతుంది?

సత్త్వగుణం ఉంటే మీరు ధర్మాన్ని ప్రేమిస్తారు. అదే వ్యసనమైతే, ధర్మాన్ని ఎంతగా ప్రేమిస్తారంటే, అధర్మాన్ని కొంచెం కూడా భరించలేరు. నిజానికి మీరు ఒక సినిక్‌గా మారతారు. వార్తాపత్రికలో ఏమూల చూసినా అంతటా అధర్మమే రాజ్యమేలుతున్నది అని వాపోతారు. 'నువ్వు ఏదైనా చేయి,' అంటే 'నేనేం చేయలేను,' అంటారు కాని అధర్మాన్ని మాత్రం భరించలేరు. అందువల్ల సత్త్వగుణం కూడా బంధమే. అందువల్లనే మోక్షం పొందాలంటే సత్త్వగుణానికి కూడా అతీతంగా ఎదగాలంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ** – 18.66

సర్వధర్మాలను పరిత్యజించి నన్ను శరణు వేడు అన్నాడు.

అధర్మం ఒకవిధంగా కట్టివేస్తే, ధర్మం లేదా మంచితనం ఇంకొక విధంగా బంధించి వేస్తుంది. అందువల్ల సత్త్వం సుఖే సంజయతి అన్నాడు కృష్ణపరమాత్మ.

ii) **రజోగుణం** – రజోగుణం కర్మసంగం. రజోగుణం ఉన్న వ్యక్తి కర్మతో బంధం పెంచుకుంటాడు. కర్మ చేయటంవల్ల సమస్య లేదు; కర్మకు బానిస అయితే వస్తుంది సమస్య. అలా కర్మల్లో కూరుకుపోయిన వ్యక్తిని వర్కహాలిక్ అంటారు. అతను ఒక్కక్షణం కుదురుగా కూర్చోలేడు. ఏదో ఒక కర్మ చేస్తూనే ఉంటాడు. ఎక్కువ కర్మ చేస్తే ఎక్కువ కర్మఫలం వస్తుంది; ఎక్కువ కర్మఫలం వస్తే ఎన్నో జన్మలు ఎత్తాల్సి ఉంటుంది; ఎన్నో జన్మలు ఎత్తితే ఆ జన్మల్లో మళ్ళీ కర్మలు చేయాల్సి ఉంటుంది.

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం**

మళ్ళీ జన్మ, మళ్ళీ మరణం, మళ్ళీ తల్లిగర్భంలో ఉండటం.

ఆ విధంగా కర్మలు ఎక్కువ చేయటంవల్ల రజోగుణం బంధిస్తుంది.

iii) **తమోగుణం** – తమోగుణం ప్రమాదసంగం ఏర్పరస్తుంది.

**జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత** – 14.9

ప్రమాద అంటే నిర్లక్ష్యం, బద్ధకం, పట్టించుకోకపోవటం, నిద్రకు లోనవటం.

ఆ విధంగా ఈ మూడు గుణాలూ బంధిస్తాయి. ఆ బంధించే తీరు వరుసగా **జ్ఞానసంగం, కర్మసంగం, ప్రమాదసంగం** అంటారు.

సి) **లింగమ్** – లింగం అంటే ఏ గుణం ఎక్కువగా ఉందో తెలుసుకునే సూచిక. ఈ గుణాలు ప్రత్యక్షంగా తెలియవు కాబట్టి వాటిని ఒకవ్యక్తి లక్షణాలనుబట్టి తర్కం ఉపయోగించి తెలుసుకోవాలి. తర్కం ఉపయోగించాలంటే, దానికొక ప్రత్యక్షం ఉండాలి. కొండమీద అగ్ని ఉంది అని చెప్పాలంటే, అక్కడ పొగ కనబడాలి. అలాగే ఒకవ్యక్తిలో ఫలానా గుణం ఉంది అనాలంటే, అతనిలో ఒక లక్షణం ఉండాలి. ఏమిటా లక్షణం?

i) **సత్త్వగుణం** – సత్త్వగుణం ఉంటే జ్ఞానవృద్ధి జరుగుతుంది. అంటే అతనిలో అన్ని జ్ఞానేంద్రియాలూ ప్రకాశవంతంగా ఉంటాయి. మనస్సు నిర్మలంగా ఉంటుంది కాబట్టి, ఇంద్రియాలు చురుకుగా పనిచేస్తాయి. ఇంద్రియాలు చురుకుగా పనిచేస్తాయి కాబట్టి, గ్రహింపుశక్తి చురుకుగా ఉంటుంది. గ్రహింపు శక్తి చురుకుగా ఉంటుంది కాబట్టి జ్ఞానం కూడా నిమిషాలమీద పొందుతాడు. అతను వింటాడు, చదువుతాడు, గ్రహిస్తాడు. అలా జ్ఞానవృద్ధి కలుగుతుంది; మేధాశక్తి – పొందిన జ్ఞానాన్ని నిలుపుకునే శక్తి –ఉంటుంది.

ii) **రజోగుణం** – కర్మవృద్ధి జరుగుతుంది. రజోగుణం ఎక్కువగా ఉన్నవ్యక్తిలో జ్ఞానం పెరగదు, కర్మ ఎక్కువగా చేస్తాడు. అనేక కర్మలను వీర ఉత్సాహంతో చేస్తాడు. ఒక్కక్షణం కూర్చోడు. ప్రణాళికలు వేస్తూనే ఉంటాడు, కర్మలు చేస్తూనే ఉంటాడు.

iii) **తమోగుణం** – ప్రమాదవృద్ధి జరుగుతుంది. ప్రమాద అంటే నిర్లక్ష్యం, మోహం, బద్ధకం ఎక్కువగా ఉంటుంది. తమోగుణం ఉన్నవ్యక్తి ఏపనీ చేయదు. ఒకవేళ పొరపాటుగా చేసినా కూడా, దాన్ని చాలా అశ్రద్ధగా చేస్తాడు. ఒక్కపనిలో పది తప్పులు దొర్లుతాయి. అలా ఎన్ని పనులు చేస్తే, అంత చేటు తప్పులు దొర్లుతాయి. ఈ ప్రమాదవృద్ధినే మోహవృద్ధి లేదా నిద్రావృద్ధి అనికూడా అనవచ్చు. మోహం అంటే స్పష్టమైన ఆలోచన ఉండదు. నిద్రావృద్ధి ఎందుకంటే ఎప్పుడూ బద్ధకంగా ఉంటాడు.

ఈ మూడు గుణాలను ఈ విధంగా గుర్తించవచ్చు. అవి వరుసగా జ్ఞానవృద్ధి, కర్మవృద్ధి, ప్రమాదవృద్ధి.

డి) **గతి** – గతి అంటే ప్రయాణం; మరణానంతర ప్రయాణం. ఏయే గుణం ప్రధానంగా ఉంటే, ఏయే లోకాలకు మరణానంతరం ఒక జీవియొక్క జీవాత్మ ప్రయాణం చేస్తుందో వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

**యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్ ।**
**తదోత్తమవిదాం లోకాన్ అమలాన్ ప్రతిపద్యతే ॥** – 14.14

సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి మరణిస్తే, ఉత్తమ కర్మలను ఆచరించేవారు వెళ్ళే నిర్మలమైన స్వర్గలోకాలకు వెళతారు.

i) **సత్త్వగుణం** – ఊర్ధ్వగతి – సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి ఊర్ధ్వలోకాలకు వెళతాడు.

ii) **రజోగుణం** – మధ్యమ గతి – రజోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి మనుష్యలోకంలో పుడతాడు. ఎందుకంటే అదొక్కటే కర్మభూమి. తక్కిన లోకాలన్నీ భోగలోకాలు.

iii) **తమోగుణం** – అధోగతి – తమోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి అధోలోకాలకు వెళతాడు. ఒకవేళ భూలోకంలోనే పుట్టినా ఫ్రీవిల్, బుద్ధి ఉన్న మనుష్యజన్మ పొందదు. ఏ పశుపక్ష్యాదులుగానో, క్రిమికీటకాలుగానో, వృక్షాలుగానో పుడతాడు.

మూడు గుణాలలో సత్త్వగుణం ఉన్నవారు ఊర్ధ్వగతి పొందితే, రజోగుణం ఉన్నవారు మధ్యమగతి పొందితే, తమోగుణం ఉన్నవారు అధోగతి పాలవుతారు.

ఇ) **ఫలమ్** – గతికీ, ఫలానికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. గతి అంటే మరణించాక పొందే ఫలమయితే, ఫలం అంటే జీవించి ఉండగానే పొందే ఫలం.

i) **సత్త్వగుణం** – పుణ్యం, జ్ఞానం పొందుతారు. సాత్త్విక పురుషుడు చేసే కర్మలు మంచివి కాబట్టి, అతనికి వచ్చే ఫలం కూడా మంచిదే వస్తుంది. అతను జ్ఞానం పొందుతాడు, మనస్సు నిర్మలంగా ఉంటుంది.

ii) **రజోగుణం** – దుఃఖం, లోభం కలుగుతాయి. అతను హుషారుగా ఉండి, చాలా పనులు చేస్తాడు నిజమే కాని అన్ని పనులు నెత్తిన వేసుకోవటంవల్ల ఆందోళన, ఒత్తిడి, కోపం, చిరాకు, అసహనం చోటుచేసుకుంటాయి.

iiii) **తమోగుణం** – అజ్ఞానం, మోహం కలుగుతాయి. తమోగుణం ఎక్కువగా ఉన్న వ్యక్తికి కలిగే ఫలం అజ్ఞానం. అజ్ఞానం కొత్తగా పొందదు, అజ్ఞానంలోనే కూరుకుపోతాడు.

మూడు గుణాలలో సత్త్వగుణం ఉన్నవారు పుణ్యం, జ్ఞానం పొందితే, రజోగుణం ఉన్నవారికి దుఃఖం, లోభం కలిగితే, తమోగుణం ఉన్నవారికి అజ్ఞానం, మోహం కలుగుతాయి.

ఈ విధంగా కృష్ణపరమాత్మ గుణత్రయ విచారణ చేశాడు. దీనివల్ల కృష్ణపరమాత్మ చెప్పదలుచుకున్న అంశం – మూడు గుణాలూ మనిషిని బంధించి వేస్తాయి. సత్త్వగుణం ఉన్నవ్యక్తి ఉన్నతమైన వ్యక్తి. తనకోసం ఏమాత్రం ఆందోళన చెందదు కూడా. కాని అతను నిస్స్వార్థజీవి కాబట్టి, సంఘశ్రేయస్సు కోరతాడు కాబట్టి, తన గురించి ఆందోళన చెందకుండా, ప్రపంచంలో అందరి గురించీ ఆందోళన చెందుతూ ఉంటాడు. ఏ రాయి అయితేనేం పళ్ళు ఊడగొట్టుకోవటానికి! తన గురించి ఆందోళన చెందినా, ఇతరుల గురించి ఆందోళన చెందినా, ఆందోళన ఆందోళనే. అది బంధాన్ని కలుగజేస్తుంది. అందువల్ల మూడు గుణాలు కూడా బంధకత్వాన్ని కలుగజేస్తాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల గుణాతీతునిగా ఎదగాలి. ప్రకృతిలాగా గుణాత్మకం కాకుండా, పురుషునిలా నిర్గుణం అవాలి.

**2. గుణాతీతంగా ఎదగటం : శ్లోకాలు 19,20** – ఈ గుణాలకు అతీతంగా ఎదిగే సాధన. గుణాతీతంగా ఎలా ఎదగాలి? దానికి పాటించాల్సిన సాధనలు ఏమిటి? గుణాతీతునిగా క్రమంగా ఎదగటానికి ఒక వరుసక్రమంలో కొన్ని సాధనలు నిర్దేశించింది శాస్త్రం. రాత్రికి రాత్రి ఎవరిలోనూ మార్పు వచ్చేయదు. అలా తిరుగుబాటు చర్యలా మార్పు రావాలని కూడా ఆశించదు శాస్త్రం. ఎందుకంటే హఠాత్తుగా వచ్చే మార్పు కాని, తిరుగుబాటుతత్త్వం కాని మంచిది కాదు.

కొంతమంది అలా విపరీత ధోరణులు పోతూవుంటారు. ఒక్కసారిగా 50 కేజీల బరువు తగ్గే క్రాష్ కోర్సులో చేరతారు. వారం రోజులు గుమ్మడికాయ రసం తప్ప ఏమీ తాగరు. ఈ పద్ధతి మంచిది కాదు. అలా విపరీతంగా చేసి, విపరీతంగా బరువు తగ్గినా, ఒకసారి వెనక్కి వచ్చి, మామూలు భోజనంలోకి దిగిపోతే, తగ్గిపోయిన బరువు అంత వేగంగానూ

దూసుకువచ్చేస్తుంది. ఇంత వీరావేశంగా బరువు తగ్గినవారిలో కొందరు అనారోగ్యంపాలు కూడా అవకపోలేదు. అందువల్ల శాస్త్రం తిరుగుబాటు తత్త్వాన్ని ఒప్పుకోదు. ఏ మార్పు వచ్చినా కూడా నెమ్మదిగా, కాలక్రమేణా రావాలి. ప్రకృతిలో దేన్ని చూసినా, ఏదీ అర్థాంతరంగా మారదు; ప్రతిదీ నిదానంగా, క్రమంగా మారుతుంది.

ఇప్పుడు మన శరీరం బరువు, పొడుగు ఒక కొలతలో ఉందంటే, అది రాత్రికి రాత్రి రాలేదు. బాల్యంనుంచి వృద్ధాప్యం వరకూ నెమ్మదిగా పెరుగుతూ వచ్చింది. మొగ్గ తొడిగిన పువ్వు పూర్తిగా విరబూయటానికి కూడా కొంత సమయాన్ని తీసుకుంటుంది. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇన్‌స్టంట్ కాఫీ, ఇన్‌స్టంట్ ఇడ్లీ, ఇన్‌స్టంట్ సాంబార్ పదాలు వింటున్నాము. ఇన్‌స్టంట్ సాంబార్ పొడి కొని వేడినీళ్ళలో పెడితే, ఘుమఘుమలాడే సాంబార్ రెడీ అంటారు.

అదే సూత్రం ప్రకారం మీరు కొంత 'ఇన్‌స్టంట్ లిబరేషన్ పౌడర్' కొని, మీరు వేడినీళ్ళలో కూర్చుంటే, మోక్షం వచ్చేయదు. మీరు వేడినీళ్ళలో మిగులుతారు అంతే. అందువల్ల సంసారిగా ఉన్న మీరు రాత్రికి రాత్రి మోక్షం పొందలేరు. ఒకవేళ ఎవరైనా మీకు ఇన్‌స్టంట్ మోక్షం ఇప్పిస్తాము రండి అన్నా దాన్ని నమ్మకండి. అది సత్యం కాదు, ఆచరణీయం కాదు, శాస్త్రం అలాంటి మార్గం చూపలేదు. అందువల్ల గుణాతీతంగా ఎదగాలి అంటే అది క్రమేపీ జరగాలి అని అర్థం చేసుకోండి.

మరయితే ఎలా ఎదుగుతాము? కృష్ణపరమాత్మ వివరంగా చెప్పదు కాని, ఈ అధ్యాయంలో కొన్ని సూచనలను ఇచ్చాడు. వాటిని కలుపుకోవాలి మనం.

నిజానికి మన జీవితం తమోగుణంతో మొదలవుతుంది. మనం పాలుత్రాగే పాపాయిలుగా ఉన్నప్పుడు రోజంతా మందకొడిగా పడుకుని, ఆకలి వేస్తే పాలకోసం లేచేవారం. అది తమోగుణాన్ని సూచిస్తుంది. ఎందుకంటే అప్పుడు ఏమీ కర్మ చేయలేదు. ఒకవేళ ఏవైనా చేసినా, అవి పుట్టుకతో వచ్చిన పనులే కాని, తెలిసి తెలిసి ఆలోచనాపూర్వకంగా చేసినవి కావు. అప్పుడు మనం ప్రాకృత జీవులంగా ఉన్నాము.

ఇలా ఏ కర్మా చేయని, తమోగుణం ప్రధాన జీవనంనుంచి, నెమ్మదిగా కర్మచేసే స్థాయికి ఎదగాలంటుంది శాస్త్రం. ఆ కర్మ స్వార్థపూరితమైనా ఫర్వాలేదు. నిజానికి అలా స్వార్థపూరిత కర్మలు చేయటానికి అనేక తాయిలాలను సూచిస్తుంది. లౌకికంగా కూడా చూడండి, మీరు అనేక వస్తువులను కొనటానికి అనేక ప్రకటనలు ఇస్తారు వ్యాపారస్థులు. ప్యాంటు కొంటే షర్ట్ ఫ్రీ అంటారు; సర్ఫ్ పౌడర్ కొంటే ఒక ప్లాస్టిక్ స్పూన్ ఉచితం అంటారు. ఏదైనా ఫ్రీగా వస్తోందంటే ఎగబడతారు కొంతమంది.

మనకు అనేక కామ్యకర్మలను సూచిస్తుంది. ఆ కామ్యకర్మలు చేసి అయినా తమోగుణం నుంచి రజోగుణానికి వస్తారని అలా చెబుతుంది. తమోగుణం ఉన్నవ్యక్తిని **గుణశూద్రుడు**

అంటారు. ఇలా కామ్యకర్మలు చేసి రజోగుణానికి ఎదిగిన వ్యక్తిని **గుణవైశ్యుడు** అంటారు. గుణవైశ్యుడు చాలా హుషారుగా, చలాకీగా, ఉత్సాహంతో ఉరకలు వేస్తూ ఉంటాడు. కాని అతను చేసే పనులన్నీ స్వార్థపూరితంగా ఉంటాయి. తన సంపాదనలో ఇతరులకు చిల్లిగవ్వ రాలనివ్వడు. 'అది నా కష్టార్జితం,' 'నా స్వంతం,' 'నేనే అనుభవించాలి,' అంటాడు.

**కృపణేన సమో దాతా న భూతో న భవిష్యతి ।**
**అస్పృశ్యన్నేవ విత్తాని యః పరేభ్యః ప్రయచ్ఛతి ॥** – కృపణనిందా 1

ఒక లోభి తను ఏదీ దానం చేయకపోయినా కూడా గొప్ప దానకర్ణుడు. తను జీవించి ఉండగా తనూ అనుభవించడు, ఎవరికీ దానం ఇవ్వడు కాని యమధర్మరాజు అతన్ని తీసుకువెళ్ళగానే అతను తన సొమ్మును ముట్టుకోకుండానే, అతని సొమ్ము పరుల చేతుల్లోకి వెళ్ళిపోతుంది.

ఏది ఏమైనా, అతను గుణశూద్రుని స్థాయినుంచి గుణవైశ్యుని స్థాయికి ఎదిగాడు. ఇది మొదటి దశ. కాని ఇక్కడే ఆగిపోకూడదు అంటుంది శాస్త్రం. స్వార్థపూరితమైన కర్మలు చేసే స్థాయినుంచి నిస్స్వార్థకర్మలు చేసే స్థాయికి నెమ్మదిగా ఎదగాలి. ఇంకో విధంగా చెప్పాలంటే, సకామకర్మ ప్రధానంనుంచి నిష్కామకర్మ ప్రధానానికి ఎదగాలి. నిష్కామకర్మ చేస్తే గుణక్షత్రియుడు అవుతాడు. అందువల్ల గుణవైశ్యుని స్థాయినుంచి ఇంకొక మెట్టు ఎక్కి గుణక్షత్రియుడు అవాలి. గుణక్షత్రియుడు కూడా గుణవైశ్యునిలాగానే కర్మలు చేస్తాడు కాని ఇతని కర్మలు స్వార్థంతో కూడినవి కావు. సమాజశ్రేయస్సు కోరేవిగా ఉంటాయి. ఇప్పటిదాకా రెండు దశలు చూశాము. అకామకర్మనుంచి సకామకర్మకు రావాలి; సకామకర్మ నుంచి నిష్కామకర్మకు రావాలి.

దాని తరువాతి దశ ఏమిటి? 'ఇంతవరకూ బాహ్యాముఖంగా ఉండి, హుషారుగా అనేక కర్మలు చేశారు. ఇంక చాలు, ఇప్పుడు మీరు మనస్సును ప్రశాంతచిత్తంగా చేసుకోవాలి. ఎందుకంటే అసహనంగా ఉన్న మనస్సు జ్ఞానాన్ని పొందలేదు,' అంటున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞానం పొందటానికి కావాల్సిన సాధనలు శ్రవణం, మననం, నిదిధ్యాసనం, ప్రశాంతచిత్తం. పరుగులు తీసే మనిషి మనస్సు కూడా అతని వెంట పరుగులు తీస్తుంది. వేదాంతబోధ జీర్ణించుకోవాలంటే మనస్సు కుదురుగా, నిశ్చలంగా ఉండాలి. అందువల్ల 'మీరు ఇన్నాళ్ళూ సమాజానికి చేసిన సేవ చాలు; ఇంక గుణక్షత్రియుని స్థాయినుంచి గుణబ్రాహ్మణ స్థాయికి ఎదగండి,' అంటుంది శాస్త్రం. శాస్త్రం నేర్చుకోవాలంటే ప్రశాంతంగా ఉన్న మనస్సు ఉండాలి. చిత్త ఏకాగ్రత ఉండాలి.

**న చక్షుషా గృహ్యతే నాపి వాచా నాన్యైర్దేవైస్తపసా కర్మణా వా ।**

**జ్ఞానప్రసాదేన విశుద్ధసత్త్వస్తతస్తు తం పశ్యతే నిష్కలం ధ్యాయమానః ॥** – ముండకమ్

ఏకాగ్రతతో, శుద్ధసత్త్వగుణంతో ఉన్న సాధకుడు నిదిధ్యాసనంచేత నిర్గుణ ఆత్మలో నిలబడతాడు.

మనస్సు ప్రశాంతంగా ఉండాలి. గుణక్షత్రియుణ్ణుంచి గుణబ్రాహ్మణుడు అవాలి. దానికి ఏం చేయాలి? వేదం ఉపాసనను నిర్దేశిస్తున్నది. నిష్కామకర్మనుంచి ఉపాసనకు రావాలి. ఉపాసన అంటే ధ్యానం. అది రెండు రకాలుగా చేయవచ్చు. ఏకరూప ధ్యానం లేదా అనేకరూప ధ్యానం. ఉపాసనలో బాహ్యముఖంగా పరుగులు తీసే మనస్సును వెనక్కి లాగి, అంతర్ముఖం చేస్తారు. అలా బాహ్యముఖంగానే ఉండిపోతే వేదాంతం నేర్చుకోవటం కష్టం.

**పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూః తస్మాత్పరాజ్ పశ్యతి నాంతరాత్మన్**
**కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షదావృత్తచక్షురమృతత్వమిచ్ఛన్** – కఠ 2.1.1

ఇంద్రియాలను భగవంతుడు బహిర్ముఖం చేయటంవల్ల అందరూ బాహ్యప్రపంచాన్ని చూస్తున్నారు. ఎవరూ ఆత్మ వైపు తిరగటం లేదు. అమృతత్వాన్ని కోరే ఎవరో వివేకవంతుడు మాత్రమే ఆత్మను చూస్తాడు.

సమాజసేవ చేసే వ్యక్తి అద్భుతంగా సేవ చేస్తున్నాడు, అందులో ఏమీ సందేహం లేదు. కాని అతను దానివల్ల కొంత నష్టపోతాడు కూడా. అంత బహిర్ముఖంగా ఉన్న వ్యక్తి వేదాంతాన్ని అర్థం చేసుకోలేడు. వేదాంతం నేర్చుకోవాలంటే, ముందు బాహ్యంగా తీసే పరుగులు ఆపి, స్థిరంగా నిలబడి, ఉపాసన చేయాలి. ఉపాసన ద్వారా బహిర్ముఖంగా ఉన్న మనస్సును అంతర్ముఖం చేయగలుగుతాడు. అప్పుడు గుణక్షత్రియుడు గుణబ్రాహ్మణుడు అవుతాడు. గుణబ్రాహ్మణుడు అంటే సత్త్వగుణం ప్రధానంగా కలవ్యక్తి.

ఈ విధంగా, ఒక సాధకుని ప్రయాణం సాగుతుంది. అసలేమీ కర్మ చేయని స్థాయి నుంచి, స్వార్థపూరిత కర్మలు చేసి, స్వార్థపూరిత కర్మలనుంచి నిస్స్వార్థకర్మలు చేసే దశకు వచ్చి, నిస్స్వార్థకర్మలను కూడా మాని ఉపాసన చేయగలగాలి. అంటే గుణశూద్రుని దశ నుంచి గుణవైశ్యుడు అయి, తరువాత గుణక్షత్రియుడుగా మారి, చివరికి గుణబ్రాహ్మణుని స్థాయికి ఎదగాలి. ఎవ్వరైతే కర్మయోగం, ఉపాసనయోగం పాటిస్తారో వారి మనస్సు సత్త్వగుణ ప్రధానంగా మారి, గుణబ్రాహ్మణుని స్థాయికి ఎదుగుతారు. ఏ జాతిలో పుట్టినా, అతను గుణబ్రాహ్మణునిగా ఎదగవచ్చు.

పుట్టుకతో బ్రాహ్మణుడు కాకపోతే, కర్మబ్రాహ్మణుడు కాకపోవచ్చు కాని సాధన ద్వారా గుణబ్రాహ్మణుడుగా ఎదగవచ్చు. గుణబ్రాహ్మణుడు గుణాతీతునిగా మారటానికి ఎక్కువ శ్రమ పడనవసరంలేదు. ఎందుకంటే గుణబ్రాహ్మణుడు సత్త్వగుణ ప్రధానంగా ఉంటాడు; గుణాతీతునిగా ఎదగటానికి కూడా ఈ సత్త్వగుణమే ఉండాలి.

ఇప్పుడు, గుణబ్రాహ్మణుడు గుణాతీతుడు ఎలా అవుతాడు అనేది ప్రశ్న. గుణాతీతునిగా ఎదగటానికి ఏ సాధన చేయాలి? నిర్గుణ పురుషుడుగా మారాలంటే ఏంచేయాలి? సగుణంగా ఉన్నవ్యక్తి నిర్గుణంగా ఎలా మారగలడు? ఇక్కడ ప్రశ్నే జాగ్రత్తగా వేయాలి. సగుణం ఎన్నటికీ నిర్గుణం కాలేదు. ఒక సగుణం మారి ఇంకొక సగుణం అవగలదు అంతే. ఎందుకంటే సగుణం ప్రకృతి లక్షణం; నిర్గుణం పురుషలక్షణం. ప్రకృతి ఎన్నటికీ పురుషుడు కాలేదు; పురుషుడు ఎన్నటికీ ప్రకృతి కాలేదు. పదార్థం ఎన్నటికీ చైతన్యం కాలేదు; చైతన్యం ఎన్నటికీ పదార్థం కాలేదు. పరిమితి ఉన్నదేదీ అపర్యాప్తం అవలేదు; కాలానికి లోబడినదేదీ కాలాతీతం అవలేదు. అందువల్ల సగుణం ఎన్నటికీ నిర్గుణం కాలేదు. సగుణాన్ని, నిర్గుణాన్ని కలిపే నడవ ఏదీ లేదు. మరయితే, నేను నిర్గుణం అవటానికి ఏంచేయాలి?

**నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥** – 14.19

ఎప్పుడైతే తెలివైన సాధకుడు ఈ మూడు గుణాలవల్ల చేసే కర్మలు అనాత్మకు చెందినవనీ, తను గుణాతీతమైన ఆత్మను అని అర్థం చేసుకుంటాడో, అతను పూర్ణత్వాన్ని పొందుతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

పద్నాలుగవ అధ్యాయంలో ఈ శ్లోకం మహావాక్యశ్లోకం.

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత** – 13.3

ఈ శ్లోకం పదమూడవ అధ్యాయంలో మహావాక్య శ్లోకం. మహావాక్యం అంటే జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని సూచించే వాక్యం. ఈ అధ్యాయంలో గుణబ్రాహ్మణుడు గుణాతీతునిగా ఎలా ఎదగగలడో చూపించే శ్లోకం మహావాక్య శ్లోకం. ఎలా ఎదగగలడు?

**గుణేభ్యః పరం వేత్తి** – గుణాతీతునిగా ఎదగటానికి జ్ఞానం ఒక్కటే మార్గం.

**క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ అంతరం జ్ఞానచక్షుషా ।**
**భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ ॥** – 13.35

క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్యగల భేదాన్ని జ్ఞానం ద్వారానే అర్థం చేసుకోగలరు.

జ్ఞానం మాత్రమే మోక్షాన్ని ఇవ్వగలదు అనగానే అయితే కర్మ, భక్తివల్ల ఏమీ ప్రయోజనం లేదా అనేస్తారు. కర్మ, ఉపాసనలు ఎన్నటికీ అనవసరం కాదు. కాని అవి మోక్షాన్ని ఇవ్వవు అంటున్నాము అంతే. మోక్షం ఇవ్వకపోతే మరి ఇంక కర్మ, ఉపాసనలను పాటించటం ఎందుకు, వాటిని వదిలేస్తాను అంటే, లేదు లేదు అవి చాలా అవసరం అంటాము. 'మీరు రెండు పరస్పరభిన్నవాక్యాలు చెబుతున్నారు. వాటివల్ల ప్రయోజనం లేకపోతే, వాటిని ఎందుకు పాటించాలి?' అంటారు మీరు. కర్మ, ఉపాసన అవసరం లేదని ఎవరన్నారు?

కర్మ, ఉపాసనలవల్ల మోక్షం రాదంతే. మోక్షం పొందాలంటే జ్ఞానయోగ్యతాప్రాప్తి కలగాలి. జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందటానికి ఇవి రెండూ తోడ్పడతాయి. **కర్మయోగంవల్ల చిత్తశుద్ధి కలిగి, ఉపాసనవల్ల చిత్తఏకాగ్రత కలిగి, సాధకుణ్ణి జ్ఞానానికి సంసిద్ధుణ్ణి చేస్తాయి.**

గీతాసారం ఒక్కముక్కలో చెప్పాలంటే జ్ఞానం అంగీ; కర్మ, ఉపాసనలు అంగాలు.

మళ్ళీ మన ప్రశ్నకు వస్తున్నాము. గుణబ్రాహ్మణుడు గుణాతీతునిగా జ్ఞానం ద్వారా ఎలా ఎదగగలడు? మీరే కదా అంటున్నారు, సగుణం ఎన్నటికీ గుణాతీతం లేదా నిర్గుణం అవలేదని? దానికి జవాబు ఒక్కటే – జ్ఞానంవల్ల మీరు కొత్తగా గుణాతీతులుగా ఎదగరు. మనశ్శరీరాలతో కూడిన ఈ కార్యకరణసంఘాతం ఎప్పటికీ సగుణమే. అది ఎన్నటికీ నిర్గుణం కాలేదు. అలాగే ఆత్మ లేదా చైతన్యం ఎప్పటికీ నిర్గుణమే. అది ఎన్నటికీ సగుణం కాలేదు. సగుణం నిర్గుణంగా గానీ, నిర్గుణం సగుణంగా గానీ మారే ప్రసక్తే లేదు. మరి జరిగేదేమిటి? జ్ఞానం పొందకముందు మీరు 'నేను మనశ్శరీరాలను,' అనుకున్నారు. మనశ్శరీరాలతో మమేకం చెందటంవల్ల, మనశ్శరీరాలు సగుణం అవటంవల్ల, మీరు కూడా సగుణం అనుకున్నారు.

**దేహే పుష్టే అహం పుష్టః దేహే నష్టే అహం నష్టః॥**

అనుకుంటారు అంటున్నారు శంకరాచార్యులవారు తన భాష్యంలో. శరీరం బాగుంటేనే తాము బాగుంటామనీ, లేకపోతే బాగుండమనీ అనుకుంటారు.

కొత్తగా కారు కొనుక్కునవారిని చూస్తే అర్థమవుతుందీ విషయం. కారుకి ఇంత చిన్న గీత కూడా పడకుండా అపురూపంగా చూసుకుంటారు దాన్ని. ఎవరైనా కొంచెం దగ్గరికి వెళితే, ఘోరం జరిగిపోయినట్లు గట్టిగా అరుస్తారు, 'వెళ్ళకండి, వెళ్ళకండి.' ఇంటికి కొత్తగా రంగులు వేసినా అంతే. గోడమీద ఎవరైనా చేయి వేసినా వీరు విలవిలలాడిపోతారు. ఎందుకంటే కారుని కాని, గోడని కాని వారి స్వంతం అనుకుంటారు. దీన్ని తన్మయత్వం అంటారు లేదా తాదాత్మ్యం అంటారు. అంటే ఒక వస్తువుతో మమేకం చెంది, ఆ వస్తువుయొక్క గుణాలను వారికి ఆపాదించుకుంటారు.

అందువల్ల అజ్ఞాన అవస్థలో సగుణశరీరంతో మమేకం చెందటంవల్ల తను గుణబ్రాహ్మణుడు, గుణక్షత్రియుడు, గుణవైశ్యుడు లేదా గుణశూద్రుడు అనుకుంటారు. అంటే సత్త్వగుణ ప్రధాన శరీరంతోనో, రజోగుణ ప్రధాన శరీరంతోనో, తమోగుణ ప్రధాన శరీరంతోనో తాదాత్మ్యం చెందుతారు. 'నేను బ్రాహ్మణుణ్ణి,' లేదా 'నేను క్షత్రియుణ్ణి,' అనే అభిమానం కూడా ఒక విధమైన సంసారం. ఈ శరీర అభిమానం ఎందుకు ఏర్పడింది? అజ్ఞానంవల్ల. శాస్త్రాన్ని అధ్యయనం చేసి, జ్ఞానం పొందితే మీరు సగుణశరీరాన్ని మార్చరు.

సగుణశరీరంతో మీకున్న తన్మయత్వంనుండి విడివడతారు. శరీరాన్ని, మనస్సుని కూడా మీకు భిన్నంగా ఉన్న ఆబ్జెక్టుగా చూడటం నేర్చుకుంటారు.

జ్ఞానం పొందాక, మీరు సగుణశరీరం కాదు, సగుణమనస్సు కాదు, మీరు వీటిని సాక్షిగా చూసే చైతన్యం; చైతన్యమైన మీకు సత్త్వరజస్తమో గుణాలు లేవు అని అర్థం చేసుకుంటారు.

**అహం గుణాతీతచైతన్యమ్ అస్మి**

నేను గుణాతీత చైతన్యాన్ని అంటారు. అందువల్ల మీరు కొత్తగా ఏమీ మారలేదు. మీ దృక్పథాన్ని మార్చారు అంతే. అంతకుముందు మీరు ప్రకృతి అనుకున్నారు, ఇప్పుడు మీరు పురుషుడు అని అర్థం చేసుకున్నారు. అలా మీ దృష్టిని శరీరంనుంచి శరీరికి, దేహంనుంచి దేహికి, అనాత్మనుంచి ఆత్మకు మార్చారు. ఇలా దృష్టిని మార్చటాన్ని గుణాతీతంగా 'ఎదగటం' అంటారు.

దీనికొక ఉదాహరణ చూద్దాం. ఇద్దరు స్నేహితులు బస్సులో వెళుతున్నారు. ఒక వీధిలోకి రాగానే ఒక పాడుబడిన ఇల్లు కనిపిస్తుంది. అది చూపిస్తూ రాము సోముతో ఇలా అంటాడు, 'ఇది మా ఇల్లు. దాన్ని బాగుచేయించి, అద్దెకి ఇవ్వాలని నా ప్రయత్నం. కాని ఇంతవరకూ కుదరలేదు. అది నాకు చాలా భారంగా తయారయింది.' ఇల్లు దాటి అరగంటయినా, అతను ఆ ఇంటి గురించి వాపోవటం ముగియలేదు. సోముకు వినీ వినీ విసుగుపుడుతుంది. ఎందుకంటే ఆ ఇంటి ప్రహసనం ఒకరోజు వ్యవహారం కాదు. ఆ వీధినుంచి వీరు వెళుతున్నప్పుడల్లా అది జరుగుతున్న భాగోతమే!

కాని ఆశ్చర్యం! ఒకరోజు, ఆ వీధిమీంచి వెళుతున్నా, రాము ఈ భాగవతాన్ని విప్పలేదు. ఏమయింది? ఒకవేళ అనుకున్నట్టుగా ఇంటికి మరమత్తులు చేయించి, అద్దెకి ఇచ్చేశాడా అని ఆశ్చర్యంగా వీధిలోకి తొంగిచూశాడు సోము. ఇల్లు అదే శిథిలావస్థలో ఉంది. ఏమీ చెక్కుచెదరలేదు. అలాంటప్పుడు తన స్నేహితుడెలా చెక్కుచెదరకుండా కూర్చున్నాడు? అదే విషయం ఆశ్చర్యంగా అడిగాడు. 'ఏమీలేదు, ఇప్పుడు నేను ఆ ఇంటిని అమ్మేశాను అంతే,' అన్నాడు నిదానంగా. ఇంటి విషయంలో ఏమీ మార్పులేదు, కాని ఇంటియొక్క యాజమాన్యం రామునుంచి ఇంకొకరికి మారింది. అంటే ఆ తలకాయనొప్పి అంతా కొత్తగా కొనుక్కున్న ఆ వ్యక్తికి మారింది. ఇతను భారం దింపుకున్నాడు. దీన్నే దృక్పథంలో మార్పు అంటారు.

మీరు చేయబోయేదీ అదే. జ్ఞానం పొందకముందు మీరు శరీరం, మీరు మనస్సు అనుకున్నారు. ముక్కు బండగా ఉందనో, నెత్తిమీద జుట్టు ఊడిపోతోందనో, ఏదో ఒక బెంగ పట్టిపీడిస్తూండేది. ముక్కు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నా, జుట్టు సమస్యకు హెయిర్

ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నా, ఏదో ఒక సమస్య శరీరపరంగా పీడిస్తూనే ఉంది. కాని ఎప్పుడైతే నేను శరీరం కాదు, నేను ఆత్మను అని మీరు అర్థం చేసుకుంటారో, అప్పుడే మీ సమస్యలన్నీ మటుమాయమైపోతాయి. మీరు భగవంతునికి ఉత్తరం రాస్తారు. 'ఇన్నాళ్ళూ నేను శరీరం అనుకున్నా కాని, శరీరం అనాత్మకు చెందినది. అది అనాత్మనుంచి వచ్చింది, అనాత్మకు తిరిగి వెళ్ళిపోతుంది. ఈ శరీరంమీద నాకేం హక్కు లేదు. నేను దానికి ధర్మకర్మను మాత్రమే,' అంటారు. మరయితే మీరు ఎవరు?

**మనోబుద్ధ్యహ్మారచిత్తాని నాహం।**
**న చ శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణనేత్రే ।**
**న చ వ్యోమభూమిర్న తేజో న వాయుః।**
**చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్** ॥1॥

నేను మనస్సు కాదు, బుద్ధి కాదు, అహంకారం కాదు, చిత్తం కాదు. నేను చెవులు కాదు, నాలుక కాదు, ముక్కు కాదు, కన్ను కాదు. నేను ఆకాశం కాదు, భూమి కాదు, అగ్ని కాదు, వాయువు కాదు. నేను సత్ చిత్ ఆనంద స్వరూపాన్ని.

అంతేకాదు నాకు ద్వేషరాగాలు లేవు. నాకు లోభమోహాలు లేవు. నాకు గర్వం లేదు, ఈర్ష్య లేదు. అలా ఒక పట్టిక కొనసాగుతుంది.

**స్థూలసూక్ష్మ కారణశరీరాత్ వ్యతిరిక్తః పంచకోశాతీతః సన్**
**అవస్థాత్రయసాక్షీ సచ్చిదానంద స్వరూపః సన్ యత్తిష్ఠతి స ఆత్మా** – తత్త్వబోధ

స్థూలసూక్ష్మకారణశరీరాలకు వ్యతిరిక్తంగానూ, పంచకోశాలకు అతీతంగానూ, అవస్థాత్రయానికి సాక్షిగాను, సచ్చిదానంద స్వరూపంతోనూ ఏదైతే ఉందో అది ఆత్మ.

జ్ఞానం నన్ను ఈ గుణాతీత స్థాయికి తీసుకువెళుతుంది. తీసుకువెళుతుంది అంటే నా గుణాతీత స్వరూపాన్ని నాకు తెలియజేస్తుంది.

**గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।**
**జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోఽమృతమశ్నుతే ॥** – 14.20

జ్ఞానం పొందిను జీవుడు ఈ దేహం పుట్టటానికి కారణమైన ఈ మూడు గుణాలను అధిగమించి, జన్మమృత్యుజరాదుఃఖాలనుంచి విముక్తుడై అమృతత్వాన్ని పొందుతాడు.

అందువల్ల జ్ఞానం భక్తియోగంలో ఐదవదశ.

జ్ఞానం ఐదవదశ అంటే తక్కిన నాలుగు దశలు ఏవి? మొదటి దశ – మీరు తమోగుణ ప్రధానదశలో ఉంటే, దాన్నుంచి రజోగుణ ప్రధానదశకు రావాలి. అంటే గుణశూద్రుని దశనుంచి గుణవైశ్యుని దశకు రావాలి. ఒకవేళ మీరు ముందే గుణవైశ్యుడు అయితే

ఈ మధ్యదశలను వదిలేసి, ఐదవదశకు సరాసరి వచ్చేయవచ్చు. స్వార్థపూరిత కర్మలు చేయమని అందరికీ చెప్పకూడదు. ఆ భక్తుడు ఏ స్థాయిలో ఉన్నాడో చూసి, దాని ప్రకారం సలహా ఇవ్వాలి.

గుణశూద్రునిగా ఉన్నవ్యక్తికి పోయి ధ్యానం చేయమని చెప్పకూడదు. ఎందుకంటే అతను అసలే బద్ధకంగా, మందకొడిగా, నిద్రలో తూగుతూ ఉంటాడు. అటువంటి వ్యక్తిని ధ్యానం చేయమంటే, వెంటనే ఒప్పుకుంటాడు. ఎందుకంటే ధ్యానం సాకుతో అతను కర్మ చేయకుండా తప్పించుకోవచ్చు. పైపెచ్చు పడుకుని నిద్రపోయే బదులు, ఇప్పుడు ధ్యానం పేరుతో కూర్చునే నిద్రపోవచ్చు. అందువల్ల మొదటిదశలోనే ధ్యానం సూచించకూడదు. కాని వచ్చిన చిక్కేమిటంటే, ఇప్పుడు చాలా సంస్థలు ధ్యానాన్ని బాగా ప్రచారం చేస్తున్నాయి. మన సాంప్రదాయం దాన్ని ఎన్నడూ అంగీకరించదు.

భగవద్గీతలో ధ్యానం ఆరవ అధ్యాయంలో వచ్చింది. ధ్యానాన్ని నేర్పించే అష్టాంగయోగంలో కూడా పతంజలి ఋషి ధ్యానాన్ని ఏడవదశలో వేశారు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి. ఇదీ వరుసక్రమం. మొదటి ఆరు దశలు విజయవంతంగా దాటితేనే, ఏడవదశ అయిన ధ్యానం వస్తుంది. అందువల్ల 'తక్షణ ధ్యానం,' 'తక్షణ మోక్షం' కుదరని పని. ఒక్కొక్కదశా దాటుకుంటూ రావాలి. అసలేమీ కర్మ చేయని దశనుంచి స్వార్థపూరిత కర్మలు చేసి, నిస్స్వార్థకర్మలు చేసి, ఉపాసన చేసి, వేదాంత విచారణకు రావాలి. అంటే గుణశూద్రుని దశనుంచి గుణవైశ్యుడయి, గుణక్షత్రియుడయి, గుణబ్రాహ్మణుడయి, చివరికి గుణాతీతుడవాలి. గుణాతీతుడు అవాలంటే జ్ఞాని అయితీరాలి. ఎందుకంటే సాధనలోని ఆఖరిదశ జ్ఞానం. ప్రతి ఒక్క గుణాతీతుడూ స్థితప్రజ్ఞుడు అవుతాడు. ఈ దశకు చేరుకోవాలంటే భక్తిలో ఐదు దశలూ దాటితీరాలి. అందువల్ల ప్రతి గుణాతీతుడూ పరాభక్తుడు కూడా అవుతాడు.

ఇప్పుడు మూడు పర్యాయ పదాలను చూశాము – గుణాతీతుడు, స్థితప్రజ్ఞుడు, పరాభక్తుడు. అన్నింటి అర్థం ఒకటే. కృష్ణపరమాత్మే భిన్నసందర్భాలలో భిన్నపదాలను వాడాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే** – 2.55

**సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః** – 12.16

**శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః** – 12.20

**మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।**
**స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥** – 14.26

అనన్య భక్తియోగం ద్వారా నన్నే నిరంతరం పూజించే వ్యక్తి ఈ మూడు గుణాలకు పూర్తిగా అతీతమైన వ్యక్తి, సచ్చిదానంద పరబ్రహ్మను పొందటానికి అర్హుడవుతాడు.

ఇక్కడ కృష్ణపరమాత్మ భక్తియోగేన పదం వేశాడు. భక్తియోగం అంటే ఇప్పుడు మనం చూసిన ఐదుదశలు తప్ప మరేం కాదు. అవి – గుణశూద్రుడు, గుణవైశ్యుడు, గుణక్షత్రియుడు, గుణబ్రాహ్మణుడు, గుణాతీతుడు. వీటిని పన్నెండవ అధ్యాయంలో కూడా చూశాము.

**3. గుణాతీత లక్షణం, సాధన శ్లోకాలు 21–27** ఈ గుణాలకు అతీతంగా ఎదిగితే కలిగే ఫలం. గుణాతీతుని లక్షణాలు ఎలా ఉంటాయని అర్జునుడు ప్రశ్న వేస్తే, దానికి జవాబుగా గుణాతీతుని లక్షణాలను చెప్పుకొస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**కైర్లింగైః త్రీన్ గుణానేతాన్ అతీతో భవతి ప్రభో ।**
**కిమాచారః కథం చైతాన్ త్రీన్ గుణానతివర్తతే ॥** – 14.21

ఈ మూడు గుణాలకు అతీతంగా ఎదిగినవ్యక్తి లక్షణాలు ఎలా ఉంటాయి? అతను ఎలా ప్రవర్తిస్తాడు? గుణాతీతునిగా ఎదగటానికి ఏ సాధనలు చేయాలి అని అడిగాడు అర్జునుడు.

ఈ విధంగా మూడు ప్రశ్నలు అడిగాడు అర్జునుడు. గుణాతీతుని లక్షణాలు (లింగమ్), గుణాతీతుడు ప్రవర్తించే తీరు (ఆచారః) , గుణాతీతునిగా ఎదగటానికి అవసరమైన సాధనలు (సాధన). గుణాతీతుని లక్షణాలనే పన్నెండవ అధ్యాయంలో పరాభక్త లక్షణాలుగా చర్చించబడ్డాయి.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥** – 12.13

ఏ ప్రాణిమీద ద్వేషభావన లేనివ్యక్తి, అందరిమీద అవ్యాజమైన ప్రేమ, కరుణ కలవ్యక్తి, మమతా అహంకారాలు లేనివ్యక్తి, సుఖదుఃఖాలలో సమభావము కలిగిన వ్యక్తి పరాభక్తుడు.

అక్కడ పరాభక్తునికి చెప్పిన లక్షణాలలోంచి కొన్నీ, ఇక్కడ ఈ అధ్యాయంలో చెప్పిన వాటినుంచి కొన్నీ తీసుకుని చూద్దాము ఇప్పుడు. స్థితప్రజ్ఞుడు, పరాభక్తుడు, గుణాతీతుడు– ఏ పేరుతో పిలిచినా, అతనికి అన్ని విలువలూ అప్రయత్నంగా అలవడతాయి. అవి అతనికి స్వాభావికం అవుతాయని అద్భుతంగా వర్ణించారు శంకరాచార్యులవారు.

సాధకుడు ఏ సాధన చేయ్యాలి? జ్ఞానికి ఏ విలువలైతే అప్రయత్నంగా అలవడతాయో, వాటిని సాధకుడు శ్రద్ధగా, ప్రయత్నపూర్వకంగా సాధన చేయాలి.

**జ్ఞానినః లక్షణాని అజ్ఞానినః సాధనాని భవంతి**

ఏ లక్షణాలైతే జ్ఞానికి స్వాభావికాలో, వాటిని అజ్ఞాని సాధనలుగా తీసుకోవాలి. జ్ఞానికి సహజంగా అబ్బితే, అజ్ఞాని ప్రయత్నపూర్వకంగా సాధన చేయాలి. అంత ప్రయత్నపూర్వకంగా సాధన చేసినా విఫలమవవచ్చు కూడా. అయినా మానకూడదు, ప్రయత్నం చేసితీరాలి. ఆ సాధనలు చేయాలంటే ఈ క్రింది భాగాలను అధ్యయనం చేయాలి. భగవద్గీతను అభ్యసించే ప్రతి ఒక్కరూ కూడా – మూడు అధ్యాయాల చివర్లో ఇచ్చిన ఈ విలువలను ఒకచోట కూర్చుకుని, వాటిని సాధన చేయాలి. తన జీవనవిధానం ఆ సాధనలకు దగ్గరలో ఉందో లేదో బేరీజు వేసుకోవాలి. అవి 2, 12, 14 అధ్యాయాల చివర్లో వస్తాయి. ఆ విలువలను ఎంత ఎక్కువగా పెంపొందించుకుంటే అంత ఎక్కువ అర్థవంతంగా ఉంటుంది తన వేదాంత అధ్యయనం. విలువలు పెంపొందించుకోకుండా, వేదాంత అధ్యయనం మాత్రం చేస్తే, దాని ఫలితం ఉండదు.

గుణాతీతుని లక్షణాలను వివరించటంలో దాగివున్న మరొక ఉద్దేశ్యం – అతని లక్షణాలు, సాధకునికి ఒక ప్రేరణగా ఉంటుంది. జ్ఞాని స్తుతి విని, జ్ఞాని ఎంత ఆనందంగా, ఎంత నిశ్చింతగా, ఎంత హాయిగా ఉంటాడో గమనిస్తే, సహజంగానే సాధకునికి కూడా ఆ గుణాతీతునిలాగా ఉండాలనే కోరిక పుడుతుంది. జ్ఞాని అతనికి ఆదర్శపురుషుడవుతాడు. ఎప్పుడైతే జ్ఞానిలా ఉండాలని అనిపిస్తుందో, అప్పుడే, ఇదుగో ఈ లక్షణాలను పెంపొందించుకో అంటుంది భగవద్గీత.

పన్నెండవ అధ్యాయంలోంచి **అద్వేష్టా సర్వభూతానామ్** అంశమూ, ఈ అధ్యాయంలోంచి **సమబుద్ధి** అంశమూ చూద్దాము.

**అద్వేష్టా సర్వభూతానామ్** – జ్ఞాని ఎవరినీ ద్వేషించడు. మనం పెంపొందించుకోవలసిన విలువల్లో అతికష్టమైనది ఎవరినీ ద్వేషించకుండా ఉండగలగటం. దీన్ని కొంచెం లోతుగా విశ్లేషిద్దాము. శాస్త్రం ప్రకారం, 'న్యాయబద్ధంగా ద్వేషించటం' అనేది ఎక్కడా లేదు. ఎటువంటి ద్వేషం కూడా మంచిది కాదు. అందువల్ల మీరు వేదాంతానికి వచ్చారు అంటేనే ఈ ద్వేషభావనను పోగొట్టుకోవాలి. సాధారణంగా మనం ఏం చేస్తామంటే, ద్వేషభావనను సమర్థించుకోవటానికి చూస్తాము. ఎదుటివారు చేసిన తప్పులు ఎత్తిచూపి, అందువల్ల అతన్ని ద్వేషిస్తున్నాను, అతన్ని ద్వేషించటంలో తప్పులేదు అని సమర్థించుకుంటాము కూడా.

మన శాస్త్రం దీన్ని అంగీకరించదు. న్యాయమైన, సకారణమైన, సరియైన ద్వేషం అంటూ ఏదీలేదు అంటుంది. ఎటువంటి ద్వేషభావన కూడా సరియైనది కాదు. ప్రతి ఒక్కరూ కూడా సాధుపురుషుడు, ఉన్నతమైన వ్యక్తి, ప్రేమించదగ్గ వ్యక్తి అంటుంది శాస్త్రం. ఎవరూ ద్వేషించదగ్గ వ్యక్తిగా ఉండడు. అందువల్ల ఎవరినైనా ద్వేషించటం సబబు కాదు అంటుంది శాస్త్రం. 'సరే, శాస్త్రం చెప్పినట్టు ఒకవ్యక్తి సాధుపుంగవునిగా, ఉన్నతంగా, ప్రేమించదగ్గవానిగా

ఉండవచ్చు కాక, కాని అతని చర్యలు, అతని ప్రవర్తన చూస్తే అతనిలో ఏమాత్రం సాధుస్వభావం కనబడటం లేదు. శాస్త్రం చెప్పింది నమ్మశక్యంగా లేదు,' అంటారు మీరు. అందువల్ల మేము చెప్పేది అతని తప్పుడు ప్రవర్తన గురించి అంటారు.

అతని తప్పుడు ప్రవర్తనను కూడా ద్వేషించకూడదు అంటుంది శాస్త్రం. ఒకవ్యక్తినీ ద్వేషించకూడదు, అతని చర్యలనూ ద్వేషించకూడదు. ఒకవ్యక్తిని ద్వేషించటంవల్ల అతని ప్రవర్తనను కాని, అతని చర్యలను కాని మార్చలేరు, మెరుగుపరచలేరు, సరికదా మీ ద్వేషం మీరు ద్వేషిస్తున్న వ్యక్తికన్నా ద్వేషిస్తున్న మీకే ఎక్కువగా హానికరం అంటుంది శాస్త్రం. అది మీ హృదయంలో ఆమ్లాలను (ఏసిడ్స్‌ను) మోస్తున్నట్టు ఉంటుంది. ఎందుకంటే ఆమ్లానికి మండే శక్తి ఉంది. దాన్ని ఎందులో వేస్తే, దాన్నే నాశనం చేస్తుంది. అందువల్ల మీ ద్వేషం మిమ్మల్నే తినేస్తుంది. ఇంకా విచారకరమైన విషయం, మీరు ఎవరినైతే ద్వేషిస్తున్నారో, అతనికి మీరు అతన్ని ద్వేషిస్తున్నారని తెలియదు. అందువల్ల ఎదుటివ్యక్తిని ప్రేమించండి, ద్వేషించకండి అంటుంది శాస్త్రం. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే, దానికి కావాల్సింది ద్వేషం కాదు; ఆరోగ్యకరమైన స్పందన.

'ఆరోగ్యకరమైన స్పందన' అంటే ఏమిటి? అది అనేక పరిస్థితులమీద ఆధారపడి వుంటుంది. ఎవర్నైనా కదిలించండి, ఎవరికి వారికే, వారు ద్వేషించటానికి ఇష్టపడే కొందరు మనుష్యులు ఉంటారు. కాని కృష్ణపరమాత్మ 'అద్వేష్టా సర్వభూతానామ్' అన్నాడు. సర్వభూతానామ్ పదంలో జీవరాశులన్నీ వస్తాయి. దోమలతో సహా!

అందువల్ల మీ స్పందన ఎలా ఉండాలి? మీరు స్పందన చూపేముందు, మీరు ద్వేషించే వ్యక్తియొక్క తప్పుడు ప్రవర్తన మీరు మార్చగలిగే పరిధిలో ఉందా అని ఆలోచించండి. ఆ వ్యక్తి చర్యను మీరు మార్చగలరా? ఆ వ్యక్తిమీద మీకు అధికారం ఉందా? ఒకవేళ ఆ వ్యక్తి మీకన్నా పెద్దవారైతే మీరు వారిని మార్చలేకపోవచ్చు. తండ్రి, మీ పై అధికారి, మీ భర్త అయితే వారిమీద మీకు అధికారం లేకపోవచ్చు. అల్లుడు మీకన్నా చిన్నవాడైనా జామాతా దశమో గ్రహః అంటారు. అతనిమీద కూడా మీకు అధికారం ఉండకపోవచ్చు. అతను మీ అమ్మాయిని అడ్డుపెట్టుకుని ఒక ఆటాడిస్తాడు, మీరు ఏదైనా తిరిగి అంటే, దాని ప్రభావం మీ అమ్మాయిమీద పడుతుంది (ఈ సూత్రం ఇప్పటి అల్లుళ్ళకు వర్తించదు). వీరిమీద మీకు అధికారం లేదనుకుందాము.

ఇప్పుడు ఇంకొక ప్రశ్న. మీకు అధికారం లేనివారిలో ఎవరైనా మిమ్మల్ని బాధిస్తున్నారా? వారి చర్యలతోనో, ప్రవర్తనతోనో వారు మిమ్మల్ని హింసించకుండా ఉంటే, మీరు అదృష్టవంతులే. కాని, వారు మిమ్మల్ని బాధిస్తున్నారనుకుందాము. అప్పుడెలా తప్పించుకుంటారు? మీరు ఆ వ్యవస్థను మార్చండి. ఉదాహరణకు మిమ్మల్ని చిరాకు పరుస్తున్నది

మీ కింది ఉద్యోగి అయితే అతన్ని ఉద్యోగంలోంచి తీసివేయవచ్చు. మీకు కోపం తెప్పిస్తున్నది, మీ పొరుగువారైతే, మీరు అతని పొరుగున అవస్థపడుతూ ఉండేకన్నా, ఇల్లు మారిపోవచ్చు. ఆ విధంగా ఎక్కడ తప్పించుకోగలరో అక్కడ తప్పించుకోండి.

'లేదు, నేను వ్యవస్థను మార్చలేను,' అని మీరంటే అది చాలా బాధాకరమైన పరిస్థితి. 'సరే, నేను అతని ప్రవర్తనను మార్చలేను, అతన్నుంచి దూరంగానూ పారిపోలేను, అతనేమో నన్ను చాలా బాధపెడుతున్నాడు. ఇప్పుడు నేను అతన్ని ద్వేషించవచ్చా?' అని మీరు అడిగితే, ఇప్పుడు కూడా అతన్ని ద్వేషించకూడదనే చెబుతుంది శాస్త్రం. మీరు 'అవస్థ పడండి, తప్పదు,' అంటుంది. ఒకవ్యక్తిని ద్వేషించినంత మాత్రాన అతను మారడు. అతన్ని కాకుండా అతని చర్యను ద్వేషించినా కూడా, మీరు ఆ చర్యను మార్చలేరు.

మరయితే ఏంచేయాలి? మీరు చేయగలిగింది ఒక్కటే. 'ప్రార్థన చేయటం.' ఏమిటా ప్రార్థన? ప్రార్థన రెండు రకాలుగా చేయవచ్చు. ఒక విషయం గుర్తుంచుకోండి. ఎదుటి వ్యక్తి ఏదైనా తప్పు చేసినా, ఆ చర్య చేసిన వ్యక్తికన్నా, దాన్ని ద్వేషించే మిమ్మల్నే ఎక్కువగా బాధిస్తుంది. ఉదాహరణకు మీకు బాగా కోపం వస్తే, మీ కోపం మీ చుట్టూ ఉన్నవారిని హడలగొడుతుంది నిజమే కాని, మీ కోపంవల్ల ఎక్కువ అవస్థపడేది ముందుగా మీరే. మీ శరీరం అవస్థ పడుతుంది. అందువల్ల మీ ప్రార్థన ఇలా ఉండాలి, 'ఓ దేవా! అతను ప్రవర్తించే తీరువల్ల నేను బాధపడటమే కాదు, అతను కూడా ఏదో ఒకవిధంగా బాధపడతాడు. అందువల్ల, ఓ దేవా, అతని ప్రవర్తనను మార్చు.' ఇది ప్రార్థనలో ఒకభాగం.

అతని ప్రవర్తనలో మార్పు వచ్చేదాకా, మీరు ప్రార్థనలో రెండోభాగం కూడా చేయాలి. 'ఓ దేవా! అతని తప్పుడు ప్రవర్తనను నేను భరించగలిగే శక్తిని నాకు ప్రసాదించు. నన్ను శుద్ధిపరచటానికి ఇది నువ్వు నాకు కలుగజేస్తున్న అవకాశంగా భావించేలా చేయి.' మీ దృక్పథాన్ని మీరు మార్చుకోండి. భగవంతునిమీద భక్తిని పోగొట్టుకోకండి. మిమ్మల్ని శుద్ధి పరచుకోవటానికి ఇది భగవంతుడు మీకిచ్చిన ఒక అవకాశంగా భావించండి. ఒక కత్తిని పదును చేయాలంటే, దాన్ని మెత్తని స్పాంజ్‌మీద రుద్దితే ఫలితం రాదు. ఆ కత్తిని గరుకు ఉపరితలంమీద రుద్దాలి. అదే విధంగా మీరు మార్చలేని పరిస్థితులను మీకు భగవంతుడు ఏర్పాటు చేసేది, మిమ్మల్ని మార్చటానికి; మిమ్మల్నిమెరుగుపెట్టటానికి.

**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి** – 2.27

మార్చలేని పరిస్థితుల గురించి నీకు శోకించే అధికారం లేదు అన్నాడు కృష్ణపరమాత్మ.

యాక్సెప్ట్ అండ్ అకామడేట్ అంటారు దీన్ని. మీరు మార్చలేని పరిస్థితులు ఎదురై, మీరు అవస్థ పడాల్సివస్తే, మీకు ఈ అవస్థను కలుగజేసిన వ్యక్తిని ద్వేషించకండి. అతన్ని మార్చటానికి

ఒక ప్రార్థన, మిమ్మల్ని మీరు దిటవు పరచుకోవటానికి మరొక ప్రార్థన చేయండి. జ్ఞానికి ఈ అద్వేష్టం చాలా సునాయాసంగా, సహజంగా అలవడుతుంది.

**సర్వత్ర సమబుద్ధి** – ఈ సమత్వాన్ని కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో చెప్పాడు.

**సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।**
**తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః ॥** – 14.24

త్రిగుణాతీతుడు సుఖదుఃఖాలను సమానంగా స్వీకరిస్తాడు. మట్టి, రాయి, బంగారాలను సమభావంతో చూస్తాడు. అతడే వివేకవంతుడైన జ్ఞాని. ప్రియాప్రియాలకు కాని, నిందాస్తుతులకు కాని లొంగడు. అన్నింటిలోనూ సమభావాన్ని చూపిస్తాడు.

జీవితం ఎప్పుడూ సాఫీగా సాగదు. రహదారి అన్నిచోట్లా సాఫీగా ఉండదు. ఎగుడు దిగుళ్ళు ఉంటూనే ఉంటాయి. మీరు రోడ్డును సాఫీ చేయలేరు. అందువల్ల మీ కారుకు షాక్ అబ్సార్బర్లు ఏర్పాటు చేసుకుంటారు. అలాగే మీరు ఎదుటివారిని కాని, వారి ప్రవర్తనను కాని మార్చలేరు. మీకు మీరే షాక్ అబ్సార్బర్లను ఏర్పాటు చేసుకోవాలి. ఆ షాక్ అబ్సార్బర్లు ప్రాథమిక దశలో భక్తి, పరిపక్వత చెందాక జ్ఞానం. భక్తిలో మీకాశక్తి భగవంతుణ్ణుంచి వస్తే, జ్ఞానంలో ఆ శక్తి మీనుంచే వస్తుంది. జ్ఞానం ద్వారా మనస్సును దిటవు పరచుకుంటే, మానావమానాలు ఎదురైనా, సుఖదుఃఖాలు కలిగినా మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. సాధకునికి సమత్వం ఒక సాధన; జ్ఞానికి సమత్వం స్వాభావికం.

ఈ రెండు విలువలూ – ద్వేషభావన లేకపోవటం, సమత్వం పాటించటం. జ్ఞానంవల్ల లేదా గుణాతీతతత్త్వంవల్ల కలిగే అనేక ప్రయోజనాల్లో రెండు ప్రయోజనాలు.

కృష్ణపరమాత్మ తన బోధను భక్తియోగం గురించి నొక్కివక్కాణించటంతో ముగిస్తున్నాడు.

**స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే** – 14.26

గుణాతీతుడైన వ్యక్తి సచ్చిదానందపరబ్రహ్మప్రాప్తికి అర్హుడవుతాడు. దీన్నే బ్రహ్మభావన అంటారు. దీన్నే మోక్షం అంటారు. దీన్నే జీవన్ముక్తి అంటారు.

ఆ విధంగా కృష్ణపరమాత్మ అర్జునుడు అడిగిన మూడు ప్రశ్నలకు జవాబు చెప్పాడు.

| | |
|---|---|
| గుణాతీత లింగమ్ | – మనశ్శరీరాలను సాక్షీభూతంగా చూడటం |
| గుణాతీత ఆచారః | – సమత్వం, బంధవిముక్తి |
| గుణాతీతుని సాధన | – అవ్యభిచారభక్తి |

# పురుషోత్తమయోగము

## అధ్యాయము 15

భగవద్గీతను 'స్మృతిగ్రంథము' అంటారు. మన ప్రాథమిక గ్రంథములు వేదాలు. వాటిని శ్రుతిగ్రంథములు అంటే, శ్రుతిని ఆధారంగా చేసుకుని వచ్చినవాటిని స్మృతిగ్రంథాలు అంటారు. భగవద్గీత శ్రుతిని ఆధారంగా చేసుకుని వచ్చింది కాబట్టి, భగవద్గీతను వేదాలసారం అని అంటారు.

**తదిదం గీతాశాస్త్రం సమస్తవేదార్థసారసంగ్రహభూతమ్**

ఈ గీతాశాస్త్రం వేదాలసారం అని శంకరాచార్యులవారు తన గీతాభాష్యంలో పేర్కొన్నారు. దీన్ని ఆధారంగా చేసుకుని మొత్తం భగవద్గీతను మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి ప్రథమషట్కము, మధ్యమషట్కము, చరమషట్కము. ప్రథమషట్కములో ఎక్కువగా కర్మ గురించి వస్తుంది. అందువల్ల దానిని **కర్మప్రధాన షట్కము** అనవచ్చు. కర్మలను యోగంగా మలుచుకుని ఎలా చేయవచ్చో, తద్వారా ఎలా చిత్తశుద్ధిని పొందవచ్చో నేర్పిస్తుంది ఆ షట్కము.

**చిత్తశుద్ధి సంపాదనార్థం కర్మానుష్ఠానమ్**

మధ్యమషట్కములో ఉపాసన గురించి వస్తుంది. అందువల్ల దానిని **ఉపాసనాప్రధాన షట్కము** అనవచ్చు. భగవంతుణ్ణి మూడుస్థాయిల్లో కొలుస్తాము. ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు. కాని ఈ షట్కములో ఏకరూప ఈశ్వరధ్యానం కాని, అరూప ఈశ్వరధ్యానం కాని చూడము. ఇది అనేకరూప ఈశ్వరధ్యానాన్ని వివరిస్తుంది. దీన్నే విశ్వరూప ఉపాసన అనికూడా అంటారు. ఈ ధ్యానం చేయటంవల్ల మనస్సు విశాలంగా అయి, చిత్తఏకాగ్రత కూడా కుదురుతుంది.

**చిత్తైకాగ్రతాసంపాదనార్థమ్ ఉపాసనా**

ఇప్పుడు మనం చరమషట్కములో అడుగుపెట్టాము. ఈ షట్కములో జ్ఞానం గురించి ప్రధానంగా వస్తుంది. ఆధ్యాత్మిక సాధనలో చివరిసాధన జ్ఞానయోగం.

**జ్ఞానసంపాదనార్థం జ్ఞానాః**

ఇంతకుముందు చూసిన పదమూడు, పద్నాలుగు అధ్యాయాల్లో జ్ఞానం గురించి చూశాము. ఈ జ్ఞానం వేదాలసారంగా చెప్పబడింది. ఇప్పుడు మనం చూడబోయే ఈ పదిహేనవ అధ్యాయం కూడా జ్ఞానం గురించే బోధిస్తుంది. ఇది కూడా జ్ఞానప్రధాన అధ్యాయము. నిజానికి ఈ అధ్యాయంతో జ్ఞానబోధ పూర్తవుతుందని చెప్పవచ్చు. ఎందుకంటే

తరువాత రాబోయే అధ్యాయంలో ఈ జ్ఞానం గురించి ఉండదు. పదహారు, పదిహేడు అధ్యాయాల్లో జ్ఞానసాధనల గురించి ఎక్కువగా వస్తే, పద్దెనిమిదవ అధ్యాయం గీతాసారంగా, ఉపసంహార అధ్యాయంగా వస్తుంది.

అందువల్ల ఈ పదిహేనవ అధ్యాయం మొత్తం ఉపనిషత్తుల సారాన్ని వివరిస్తుంది. ఉపనిషత్తులు బోధించేది బ్రహ్మజ్ఞానం లేదా ఈశ్వరజ్ఞానం. ఈ అధ్యాయాల్లో ఈశ్వరుణ్ణి పురుషోత్తముడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ఈ అధ్యాయానికి పురుషోత్తమ యోగము అనేపేరు వచ్చింది. ఇది చాలా చిన్న అధ్యాయం. 20 శ్లోకాలే ఉన్నాయి. కాని ఇవి చాలా ముఖ్యమైన శ్లోకాలు. ఎందుకంటే ఇందులో మొత్తం ఉపనిషత్తుల సారం వస్తుంది. అందువల్ల ఈ అధ్యాయం చాలా ప్రసిద్ధి పొందింది. ఈ అధ్యాయాన్ని పారాయణం చేయటానికి ఉపయోగిస్తారు చాలామంది.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా మూడు అంశాల కింద చూడవచ్చు. అవి –

1. సంసార వర్ణనమ్ : శ్లోకాలు 1–3
2. మోక్షసాధనాని, ఫలమ్ : శ్లోకాలు 4–6
3. ఈశ్వరస్వరూపమ్ : శ్లోకాలు 7–20

**1. సంసార వర్ణనమ్ : శ్లోకాలు 1–3** ఇందులో మానవాళిని పట్టిపీడించే సంసారసమస్య వర్ణనను చూస్తాము. సంసారవర్ణన చూస్తే మనలో వైరాగ్యం ఏర్పడుతుంది. వైరాగ్యం ఏర్పడితే, అది ఆత్మజ్ఞానం పొందటానికి పునాది అవుతుంది.

**అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణవల్లభే ।**
**జ్ఞానవైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతీ ॥**

ఓ పార్వతీ, అన్నపూర్ణా, ఎప్పటికీ పూర్ణరూపిణీ, శంకరుని ప్రాణవల్లభీ! జ్ఞానవైరాగ్య భిక్షను ప్రసాదించు దేవీ.

కృష్ణపరమాత్మ సంసారాన్ని పెద్ద అశ్వత్థవృక్షంతో పోలుస్తున్నాడు.

**ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్** – 15.1

నిత్యమైన అశ్వత్థవృక్షానికి వేళ్ళు ఊర్ధ్వంగా ఉన్నాయి. శాఖలు కిందికి ఉన్నాయి అంటారు.

ఈ పోలిక కృష్ణపరమాత్మ స్వంతంగా కనుగొన్నది కాదు. కృష్ణపరమాత్మ కఠోపనిషత్తులోని మంత్రంయొక్క సారాన్ని గ్రహించాడు.

**ఊర్ధ్వమూలోఽవాక్శాఖ ఏషోఽశ్వత్థః సనాతనః ।**
**తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే ।**
**తస్మింల్లోకాః శ్రితాః సర్వే తదు నాత్యేతి కశ్చన । ఏతద్వై తత్॥** – కఠ 2.3.1

ఈ అశ్వత్థవృక్షం వేళ్ళు పైకి, శాఖలు కిందికి ఉన్నాయి. అది శుద్ధం, అది బ్రహ్మ, అది అమృతం.

సంసారం లేదా ఈ ద్వైతప్రపంచం ఒక వృక్షంలా ఉంది. సంసారాన్ని వృక్షంతో ఎందుకు పోలుస్తున్నారు? ఒకదాన్ని, ఇంకొకదానితో పోల్చాలంటే, రెండింటి మధ్య కొన్ని సమాన ధర్మాలు ఉండాలి.

**ఉపమా యత్ర సాదృశ్యలక్ష్మీరుల్లసతీ ద్వయోః।** – కువలయానంద 1

ఉపమాలంకారం వాడాలంటే రెండు వస్తువుల మధ్య పోలిక అనే ఐశ్వర్యం స్పష్టంగా ఉండాలి.

సాదృశ్యం అంటే సమానధర్మాలు. రెండు వస్తువుల మధ్య సమానధర్మాలు ఉంటేనే పోల్చగలరు. శంకరాచార్యులవారు, తన భాష్యంలో సంసారానికీ, వృక్షానికీ మధ్య అనేక పోలికలను వర్ణిస్తారు.

1. **మహత్వమ్** – పెద్దది. రెండూ చాలా పెద్దవి. సంసారం సంగత్వంవల్ల లేదా సంబంధంవల్ల చాలా విస్తరించివుంది. అందువల్లనే మన చుట్టాన్ని బంధువు అంటాము. బధ్నాతి ఇతి బంధుః. బంధించే వ్యక్తి బంధువు. మన బంధువు ఎక్కడో దూరంగా కాలిఫోర్నియాలో ఉన్నాసరే, అక్కడ అతని జీవితంలో ఏ ఒడిదుడుకులు ఎదురైనాసరే, ఇక్కడ మనం విలవిలలాడిపోతాము. కాలిఫోర్నియాలో మనకు ఎవరూ బంధువు లేకపోతే అక్కడేం జరిగినా మనం చలించము. కాని అక్కడ మన మూడో అల్లుడో, నాలుగో కూతురో, బాబాయో, పెదనాన్నో ఉంటే మాత్రం – ఆ దేశంలో, ఆ ఊర్లో ఏం జరిగినా మనం బెంబేలెత్తిపోతాము. ఈ బంధువులు ప్రపంచవ్యాప్తంగా ఉంటారు. ఇది ఒక బంధం. అశ్వత్థవృక్షం చాలా పెద్దది – మహత. సంసారవృక్షం కూడా మహత. అందువల్ల **మహత్వం** మొదటి పోలిక.

2. **ఆద్యంత రహితమ్** – ఆది అంతాలు లేనిది. సంసారానికి, ఈ వృక్షానికి కూడా ఆది అంతాలు లేవు. నేనెందుకు పుట్టాను ప్రశ్నకు అసలైన జవాబు – నువ్వు చేసుకున్న కర్మవల్ల పుట్టావు. నేను కర్మ ఎప్పుడు చేశాను? నీ పూర్వజన్మల సుకృతంవల్ల పుట్టావు. పూర్వజన్మ కర్మ ఎలా వచ్చింది – అంతకుముందు జన్మవల్ల వచ్చింది. కాని మొట్టమొదటి జన్మకు ఏ పూర్వజన్మ ఉంది? దానికి జవాబుగా అది అనాది అంటుంది శాస్త్రం.

**నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా।** – 15.3

ఈ సంసారవృక్షానికి అంతం లేదు, ఆది లేదు.

జన్మవల్ల కర్మ, కర్మవల్ల జన్మ ఏర్పడుతుంది. ఈ వృత్తం ఇలా అనంతంగా కొనసాగుతుంది. వృక్షం విషయంలో కూడా ఇదే అనంత వృత్తాన్ని చూస్తాము. చెట్టు ముందా, విత్తు ముందా? ఈ ప్రశ్నకు జవాబు లేదు. చెట్టు ఎలా వచ్చింది? విత్తనంనుంచి వచ్చింది. విత్తనం ఎలా వచ్చింది? అంతకుముందు చెట్టునుంచి వచ్చింది. అందువల్ల రెండూ అనాది.

**అనాది అవిద్యా వాసనయా ప్రవర్తమానే అస్మిన్ మహతి సంసారచక్రే విచిత్రాభిః కర్మగతిభిః విచిత్రాసు పశుపక్షిమృగాదియోనిషు అనేకదా పునః పునః జనిత్వా, కేనాపిపుణ్యకర్మవిశేషేణ ఇదానీంతన మానుష్యే ద్విజన్మవిశేషం ప్రాప్తవతః మమ జన్మభ్యాసాత్ జన్మ ప్రభృతి ఏతద్ క్షణ పర్యంతమ్ ...**

అందువల్ల ఆది గురించి చెప్పలేము; అంతం గురించీ చెప్పలేము. ఎందుకంటే ఈ జన్మ మరుజన్మకు దారితీస్తే, మరుజన్మ మరొక జన్మకు దారితీస్తుంది. అందువల్ల వృత్తంగా కొనసాగే దానికి రెండవ పోలిక – **ఆద్యంతరహితమ్**.

3. **అనిర్వచనీయమ్** – నిర్వచించలేనిది. తార్కికంగా నిరూపించలేము. దాన్ని తార్కికంగా నిరూపించలేము, నిర్వచించలేము; ఈ తెగలోకి వస్తుంది అని చెప్పలేము. ఈ జన్మ కారణమా కార్యమా అని అడిగితే, దానికి మన దగ్గర జవాబు లేదు. పూర్వజన్మతో పోలిస్తే ఈ జన్మ దాన్నించి వచ్చింది కాబట్టి ఈ జన్మ కార్యం. కాని ఇదే జన్మ వచ్చే జన్మకు కారణం అవుతుంది. అందువల్ల ఈ జన్మ కార్యమనీ చెప్పలేము, కారణమనీ చెప్పలేము. ఈ కార్యకారణ వాదాన్ని గౌడపాదాచార్యులవారు వివరంగా మాండూక్య కారికల్లో చూపిస్తారు.

ఇదే సూత్రం వృక్షానికి కూడా వర్తిస్తుంది. చెట్టు కారణమా, కార్యమా? చెట్టుపరంగా చూస్తే చెట్టు కారణం; విత్తనం దాన్నుంచి వచ్చిన కార్యం. అదే విత్తనం పరంగా చూస్తే, విత్తనం కారణం, చెట్టు కార్యం. అందువల్ల మీరు లోతుగా విశ్లేషించిన కొద్దీ అది మరింత అర్థంకానిదిగా మిగిలిపోతుంది. విజ్ఞానశాస్త్రంలో కూడా అంతే. లోతుల్లోకి వెళ్ళినకొద్దీ స్పష్టంగా ఏమీ తెలియదు. ఒక్కటే స్పష్టంగా చెప్పగలము అంటారు. ఏమిటది? దేన్ని గురించీ స్పష్టంగా చెప్పలేమని స్పష్టంగా చెప్పగలము అంటారు. నిర్వచించలేనిదాన్ని మాయ అంటారు. మూడవ పోలిక **అనిర్వచనీయమ్**.

4. **మూలమ్** – వేరు ఉన్నది. చెట్టుకు వేరు ఉంటుంది. వేరు అనే మూలం లేకుండా చెట్టు ఉండనే ఉండదు. కాని తమాషా ఏమిటంటే, చెట్టు కనబడుతుంది, కాని భూమి లోపల ఉన్న వేరు కనబడదు. అంటే చెట్టు ప్రమాణగోచరం కాని వేరు కాదు. కాని వేరు కనబడకపోయినా, వేరు ఉందని తెలుసు. ఎందుకంటే వేరు లేకుండా చెట్టుకు ఉనికి లేదని మనకు తెలుసు.

ఈ సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే, జగత్తుకు కూడా ఒక మూలం ఉండివుండాలి. ఆ మూలాన్నే భగవంతుడు లేదా ఈశ్వరుడు అంటారు. ఆ ఈశ్వరుడు అప్రమేయం, సర్వ ఇంద్రియ అగోచరం, వేరులాగానే.

ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అని కృష్ణపరమాత్మ అన్నప్పుడు ఇక్కడ ఊర్ధ్వం అంటే 'పైన' అనికాదు అర్థం. ఊర్ధ్వం అంటే ఈశ్వరుడు; ఊర్ధ్వమూలం అంటే ఈశ్వరమూలం లేదా బ్రహ్మమూలం. నాలుగవ పోలిక – **మూలమ్**.

5. **శాఖావత్త్వమ్** – కొమ్మలు. ఒక పెద్ద వృక్షానికి అనేక శాఖలు లేదా కొమ్మలు ఉంటాయి. అశ్వత్థవృక్షం చాలా పెద్దది కాబట్టి దానికి చాలా కొమ్మలు ఉంటాయి. కొన్ని చాలా కిందికి ఉంటే, కొన్ని మధ్యభాగంలో ఉంటే, మరికొన్ని శాఖలు ఆకాశంలోకి విస్తరించి ఉంటాయి. అదే విధంగా, సంసారవృక్షానికి శాఖలు లోకాలు ఉంటాయి. ఈ పద్నాలుగు లోకాలను తీసుకుంటే భూలోకం మధ్యలో ఉంది. భువర్లోక సువర్లోకాలు ఊర్ధ్వముఖంగా ఉంటే, పాతాళలోకాలు అధోముఖంగా ఉన్నాయి. అలాగే ఉత్తమ, అధమ, మధ్యమ శరీరాలు ఉన్నాయి. దేవశరీరం ఊర్ధ్వలోకాలను సూచిస్తే, పశుశరీరం అధోలోకాలను సూచిస్తే, మనిషి శరీరం మధ్యమ లోకాలను సూచిస్తుంది.

**అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాలాః ।**
**అధశ్చమూలాన్యనుసంతతాని కర్మానుబంధీని మనుష్యలోకే ॥** – 15.2

పెద్ద సంసారవృక్షంయొక్క కొమ్మలు సర్వత్రా వ్యాపించివున్నాయి. కొన్ని శాఖలు బాగా పైకి వ్యాపించి ఉంటే, కొన్ని శాఖలు బాగా కిందికి ఉన్నాయి. మరికొన్ని మధ్యలో ఉన్నాయి. ఐదవ పోలిక – **శాఖావత్త్వమ్**.

6. **సుఖదుఃఖమిశ్రఫలవత్త్వమ్** – ఫలాలు. చాలా వృక్షాలకు ఫలాలు ఉంటాయి. ఆ ఫలాలకు మూడు రకాల రుచులు ఉంటాయి. కొన్ని తియ్యగా ఉంటాయి; కొన్ని పుల్లగా ఉంటాయి; కొన్ని మధ్యరకంగా ఉంటాయి. సంసారంలో కూడా మూడు రకాల ఫలాలను పొందుతాము. తీపిఫలం అంటే ఆశించిన ఫలం; పుల్లఫలం అంటే ఇష్టంలేని ఫలం; మధ్యరకం ఫలం అంటే మధ్యరకం భావన కలుగజేసే ఫలం.

**అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।**
**భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్ ॥** – 18.12

మామూలు మనుష్యుల కర్మలకు మంచి, చెడు, మిశ్రమ అని మూడు విధాల ఫలాలు ఉంటాయి. మరణానంతరం వారు వాటిని తప్పక అనుభవించి తీరాలి. కాని కర్మఫలత్యాగం చేసిన కర్మయోగులు తమ కర్మఫలాలను అనుభవించాల్సిన పనిలేదు.

మూడు రకాల ఫలాలు ఉంటాయి కాబట్టి సంసారం దుఃఖాలయం అయింది. ఆరవ పోలిక – **సుఖదుఃఖమిశ్రఫలవత్వమ్.**

7. **పక్షి ఆశ్రయత్వమ్** – పక్షులకు ఆశ్రయం. వృక్షాలమీద పక్షులు గూళ్ళు కట్టుకుని నివాసం ఉంటాయి. ఆ వృక్షాలు పండించే ఫలాలు పక్షులకు ఆహారం అవుతాయి. అవి వాటి కిలకిలా రావాలతో సందడి చేస్తాయి. అలాగే సంసారవృక్షంలో కూడా వేలాది జీవులు ఉంటారు. ఈ జీవులు ఊర్ధ్వ, మధ్యమ, అధోలోకాలలో సుఖదుఃఖమిశ్రిత ఫలాలనే అనుభవిస్తారు.

**ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః ।**
**జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥** – 14.18

సత్త్వగుణం ఉన్నవారు ఊర్ధ్వలోకాలకు వెళితే, రజోగుణం ఉన్నవారు మనుష్యలోకంలోనే ఉంటారు. తమోగుణం ఉన్నవారు అధోగతిని నరకాన్ని పొందుతారు అంటే కీటపశుపక్ష్యాది యోనులను పొందుతారు.

పక్షులు వృక్షాలమీద ఫలాలను అనుభవిస్తే, జీవులు కర్మఫలాలను భోక్తలుగా అనుభవిస్తారు. పక్షులు కిలకిలారావాలు చేస్తే, మనుష్యులు ఆనందంతో కేరింతలు కొట్టటమో, దుఃఖంతో విలపించటమో, కోపంతో హింసించటమో చేస్తారు. ఏడవ పోలిక– **పక్షి ఆశ్రయత్వమ్.**

8. **చలత్వమ్** – అంత పెద్ద వృక్షం కూడా గాలికి ఊగుతుంది. చిరుగాలి వీస్తే కదలికలు చిన్నవిగా ఉంటాయి. అదే పెనుతుఫాను వీస్తే విపరీతంగా ఊగిపోతుంది.

సంసారవృక్షంలో జీవులను కదిపేది ప్రారబ్ధకర్మ అనే గాలి. ఆ గాలి ఒక్కోసారి చిరుగాలిలా ఆహ్లాదకరంగా వీచవచ్చు; ఒక్కోసారి పెనుతుఫాను గాలిలా మారి వేరే ఊరికో, వేరే దేశానికో విసిరివేయవచ్చు. మీరు కోరుకున్నచోటికి కాక ఇంకొక దేశంలో, కొత్త పరిస్థితుల్లో, కొత్త వాతావరణంలో పడవేయవచ్చు, ఈ ప్రారబ్ధకర్మ అనే గాలి. అంటే భారతదేశంలోనే చెన్నై నుంచి ఏ అస్సామ్‌కో వెళ్ళవచ్చు లేదా ఏ సౌదీఅరేబియాకో వెళ్ళవచ్చు. ఈ కర్మ ప్రభావం ఈ జన్మలోనే కాదు, మరో జన్మకు కూడా ఉంటుంది. మరణించాక ఏ లోకానికి వెళ్ళాలనేది మన చేతిలో లేదు, మన ప్రారబ్ధకర్మలు నిర్ణయిస్తాయి. ఎనిమిదవ పోలిక – **చలత్వమ్.**

9. **ఛేద్యత్వమ్** – పెకలించి వేయటం. అంత మహావృక్షాన్ని కూడా కష్టపడి ప్రయత్నం చేస్తే కూకటివేళ్ళతో సహా పెకలించివేయవచ్చు. దానికి సరియైన గొడ్డలి వాడాలి. దానితో ఆ వృక్షం మళ్ళీ పెరగదు.

సంసారవృక్షాన్ని కూడా తీవ్రమైన ప్రయత్నం చేస్తే కూకటివేళ్ళతో సహా పెకలించి వేయవచ్చు. దానికి వాడాల్సిన గొడ్డలి జ్ఞానం. జ్ఞానం అనే గొడ్డలితో సంసారవృక్షాన్ని ఖండించి, జనన మరణచక్రంనుంచి శాశ్వతంగా బయటపడవచ్చు. చీకటి సొరంగం చివర వెలుతురు వచ్చినట్టే, ఇంత శక్తివంతమైన సంసారాన్ని కూడా జ్ఞానంతో ఛేదించవచ్చు. సంసారం అనాది అయినా, జ్ఞానం ద్వారా విడివడి మోక్షం పొందవచ్చు. తొమ్మిదవ పోలిక – **ఛేద్యత్వమ్.**

10. **పర్ణవత్త్వమ్** – ఆకులు. వృక్షానికి అనేక ఆకులు ఉంటాయి. ఒక్కో చెట్టుకు ఆకులు ఎంత దట్టంగా ఉంటాయంటే ఆ చెట్టుయొక్క కాండం, కొమ్మలు కనబడకుండా ఆకులు కప్పేస్తాయి. అదే విధంగా జగత్తనే వృక్షానికి వేదాల్లోని కర్మకాండ లేదా కర్మ అనే ఆకులు ఉన్నాయి.

కర్మకాండను చెట్టుయొక్క ఆకులతో ఎలా పోలుస్తారు? ఒక వృక్షం పెరిగి పెద్దదవటానికి ఆకులు తోడ్పడతాయి. నిజానికి ఆకులవల్లనే చెట్టు పదికాలాలు ఉంటుంది. ఆకులకున్న ఆకుపచ్చరంగు, దానికున్న క్లోరోఫిల్‌వల్ల వచ్చిందనీ, అది కిరణజన్య సంయోగక్రియ అనే పద్ధతి ద్వారా ఆహారాన్ని వండుతుందనీ, ఆ ఆహారంవల్లనే చెట్టు పదికాలాలు ఉంటుందనీ నేర్చుకున్నాము చిన్నప్పుడు.

అదే విధంగా కర్మకాండే జగత్తు అనే వృక్షాన్ని పెంచిపోషిస్తుంది.

**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్** –15.1

సంసారవృక్షాన్ని పెంచిపోషించేది శాస్త్రం విధించిన కర్మలు అని ఎవరైతే తెలుసుకుంటారో, అతనే జ్ఞాని.

మనిషి అనేక కర్మలు చేస్తాడు. సహజంగా అతను చేసిన అనేక కర్మలు అనేక కర్మఫలాలను ప్రసాదిస్తాయి. కర్మఫలాలంటే పుణ్యపాపాలు. పుణ్యపాపాలు పెరిగినకొద్దీ పునరపి జననం, పునరపి మరణం కలుగజేస్తాయి. ఆ విధంగా కర్మకాండ సంసారమనే వృత్తంలో కొనసాగటానికి తోడ్పడుతుంది.

జ్ఞానకాండ సంసారవృక్షానికి ముగింపు పలికితే, కర్మకాండ సంసారవృక్షాన్ని పెంచి పోషిస్తుంది. కర్మకాండ కొంతమేరకు ఫలదాయకం, కాని మరీ ఎక్కువ చేస్తే, సంసారంలోనే ఉండిపోయేలా చేస్తుంది. పదవ పోలిక – **పర్ణవత్త్వమ్.**

శంకరాచార్యులవారు ఇంకా ఎన్నో పోలికలు చెప్పారు. అవి కూడా పెద్దపెద్ద సమాసాలతో, మంచి కవితాశైలిలో వర్ణించారు. మనం వాటిలో కొన్నింటిని చూశాము. కృష్ణపరమాత్మ వీటిలో చాలా అంశాలను వర్ణించాడు. అవికాక, కొన్ని పోలికలు తను విడిగా చెప్పాడు.

కృష్ణపరమాత్మ ఈ విధంగా సంసారవర్ణన చేశాడు. సుఖదుఃఖాలను అనుభవిస్తూ సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. ఒకదాని తర్వాత ఒకటి వస్తే మనం సంసిద్ధంగా ఉండవచ్చు కాని ఇలాగే వస్తుందనే నియమం లేదు. ఏది ఎప్పుడు వస్తుందో తెలియదు కాబట్టి మనం సంసారంలో బందీలవుతున్నాము. కాని దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, దీన్నుంచి బయటకు రావటానికి మొగ్గు చూపించము. పూరిగుడిసెలలో నివసించే వారికి ప్రభుత్వం మంచి ఇళ్ళు కట్టి ఇచ్చినా, కొందరు ఆ ఇళ్ళు అద్దెకిచ్చేసి, పూరిగుడిసెల్లోనే ఉండటానికి ఇష్టపడతారు. అలాగే మనకు సంసారంనుంచి బయటపడే మార్గం ఉన్నా, త్వరగా బయటపడాలని కోరుకోము. కాని సంసారంమీద వైరాగ్యం పెంచుకోవాలంటున్నాడు కృష్ణపరమాత్మ.

**2. మోక్షసాధనాని, ఫలమ్ : శ్లోకాలు 4-6** ఇదంతా వింటే, కొంతమందిలోనైనా వైరాగ్యం ఏర్పడుతుంది. వారు ఈ సంసారవృక్షాన్ని ఛేదించుకుని, మోక్షం పొందాలనుకుంటారు. వారికి మోక్షసాధనాన్ని ఇస్తున్నాడు కృష్ణపరమాత్మ. అంటే సంసారనివృత్తి ఉపాయాలు బోధిస్తున్నాడు. కృష్ణపరమాత్మ దానికి కొన్ని సాధనలు చెప్పాడు. అందులో మూడు సాధనలను చూద్దాము. అవి -

ఎ) **శరణాగతి** - కృష్ణపరమాత్మ నొక్కివక్కాణించిన మొట్టమొదటి సాధన. 'జగత్తుమీద ఆధారపడటం తగ్గించుకోండి.' మీరు కోరే శాంతి, భద్రత, ఆనందాలకోసం జగత్తుమీద ఆధారపడుతున్నారు. జగత్తు అంటే మీ ఆస్తిపాస్తులు, మీ బంధుత్వాలు, మీ హోదా. అవి లేనిదే ఉండలేని పరిస్థితికి చేరుకుంటున్నారు. ఇలా జగత్తుమీద ఆధారపడటం సంసారం. ఎందుకంటే ఈ సంసారం ప్రారబ్ధకర్మ అనే గాలి ఎటు వీస్తే, అటు తీసుకు వెళుతుంది మిమ్మల్ని. ప్రారబ్ధకర్మ అనే గాలి ఎటు వీస్తుందో తెలియదు కాబట్టి, మీరు దేనిమీదో ఆధారపడితే అది మిమ్మల్ని రక్షిస్తుందో లేదో ఖచ్చితంగా తెలియదు. అందువల్ల నమ్మకంగా భద్రతను ఇస్తుందని చెప్పలేరు.

**ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం యాతి క్షయం యౌవనం**
**ప్రత్యాయాంతి గతాః పునర్న దివసాః కాలో జగద్భక్షకః**
**లక్ష్మీస్తోయతరంగభంగ చపలా విద్యుచ్చలం జీవితం**
**తస్మాన్మాం శరణాగతం కరుణయా త్వం రక్షరక్షాధునా ॥**

- శివాపరాధ క్షమాపణ స్తోత్రం

చూస్తూ చూస్తుండగానే రోజురోజుకూ ఆయుష్షు తగ్గిపోతుంది; యౌవనం రోజురోజుకూ కనుమరుగైపోతుంది; గతించిన రోజులు తిరిగిరావు; కాలం ప్రపంచాన్ని మింగేస్తుంది; సంపద శాశ్వతం కాదు, అలలమీద ఏర్పడిన బుడగలా మాయమైపోతుంది జీవితం.

మెరుపులా మెరిసి మాయమైపోతుంది. కాబట్టి ఓ దేవా, పరమేశ్వరా, నీ శరణు కోరుతున్న ఈ భక్తుణ్ణి శాశ్వతంగా రక్షించు.

మీకోసం ప్రాణం పెట్టే ఆత్మీయులు మీకున్నా కూడా, వారిమీద ఎప్పటికీ ఆధారపడలేరు. అందువల్ల జగత్తుమీద ఆధారపడటం తగ్గించి, ఈశ్వరునిమీద ఆధారపడటం నేర్చుకోండి.

**తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ।** – 15.4

ఈ పురాతనమైన సృష్టి రావటానికి ఎవరైతే మూలకారణమో, ఆ భగవంతుణ్ణి నేను శరణు వేడుతున్నాను.

ఆ విధంగా భగవంతునిమీద ఆధారపడాలి. నిజానికి భగవంతుడే చెప్పాడు ఆ మాటను.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే।** – 9.22

పరమేశ్వరుడనైన నన్నే నిరంతరం అనన్యభక్తితో సేవించేవారి యోగక్షేమాలను నేను చూస్తాను.

ఇంకో హామీ కూడా ఇస్తాడు కృష్ణపరమాత్మ.

**మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి।** –18.58

నామీదే మనస్సును నిలిపితే, నా అనుగ్రహంవల్ల అన్ని ఆటంకాలనుంచి సునాయాసంగా బయటపడగలవు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

దీన్నే ప్రపత్తి అంటారు; దీన్నే శరణాగతి అంటారు; దీన్నే భక్తి అంటారు. జగత్తుమీద ఆధారపడే స్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడే స్థాయికి మారాలి. దానికి మీకు భగవంతునియొక్క స్వరూపం తెలియనవసరం లేదు; భగవంతుని గురించి పూర్తిగా తెలియనవసరం లేదు. మీ ఇష్టదేవతగా ఏదో ఒక రూపాన్ని ఎన్నుకోండి – రాముడు, కృష్ణుడు, దేవీ, బాలాజీ – ఎవరైనా సరే! ఆ భగవంతునితో మనస్సు విప్పి మాట్లాడటం నేర్చుకోండి. గొప్ప భక్తులు ఎలా మనస్సు విప్పి భగవంతునితో రమిస్తారో, అలా మీరూ చెప్పుకోండి. మీకేదైనా బాధ కలిగి, మీ ఆత్మీయులెవరూ అందుబాటులో లేకపోయినా, మీరు పిలవగానే పలికే ఆత్మీయుడుగా ఒక్కడై ఎప్పుడూ అందుబాటులో ఉంటాడు. అదే మీ ఇష్టదేవత. ఆయన ఆర్తత్రాణపరాయణుడు. భక్తుల యోగక్షేమాలు కోరతాడు. అందువల్ల జగత్తునుంచి భగవంతుని వైపు తిరగటం మొట్టమొదటి సాధన.

బి) **ద్వంద్వాలనుంచి విముక్తి** – రెండవ సాధన ద్వంద్వాలనుంచి విముక్తి పొందటం. జీవితంలో ద్వంద్వాలు రాకతప్పదు అనే నగ్నసత్యాన్ని నేర్చుకోవాలి. అందువల్లనే దాన్ని వ్యావహారిక సత్యం అంటారు. వ్యవహారంలో మంచి–చెడు; కష్టం–సుఖం; లాభం–నష్టం జంటలుగా వస్తాయి. గెలుపు ఉంటే, ఓటమి కూడా ఉంటుంది; లాభం ఉంటే దాన్ని

వెన్నంటే నష్టం కూడా ఉంటుంది; ఎదుగుదల ఉంటే పతనం కూడా ఉంటుంది; అనుబంధం ఏర్పడితే, అనుబంధం వీగిపోతుంది కూడా; వెలుగు ఉంటే చీకటి కూడా ఉంటుంది; మంచివారు ఉంటే, దుర్మార్గులు కూడా ఉంటారు; ఆరోగ్యం ఉంటే, అనారోగ్యం కూడా పొంచివుంటుంది. అందువల్ల జీవితంలో భిన్న అంశాలు చెట్టాపట్టాలు వేసుకుని వస్తాయి.

ఈ వ్యావహారిక జగత్తుతో మీరు వ్యవహారం నడుపుతున్నంత వరకూ ఈ భిన్న అంశాలను అనుభవించక తప్పదు. అందువల్ల ద్వంద్వాలను ఎదుర్కోకతప్పదు. **యాక్సెప్ట్ అండ్ అకామడేట్** అంటారు దీన్ని. ద్వంద్వాలు తప్పవని గ్రహించి, వాటిని చిరునవ్వుతో స్వీకరించటం నేర్చుకోవాలి. అందువల్ల జీవితంలో ఎదురైన ఆటుపోట్లను నవ్వుతూ స్వీకరించాలి తప్పితే, వాటితో కృంగిపోకూడదు. చిన్నదోమ కుడితే ఏం చేస్తారు? సూదితో వేలు గుచ్చుకుంటే ఏం చేస్తారు? బెంబేలెత్తిపోతారా? వాటిని అసలు పట్టించుకోరు.

జీవితంలో ఎదురయ్యే ద్వంద్వాలను కూడా అంత చిన్నవిగా తీసిపారేయాలి. **ఈవెన్ దిస్ విల్ పాస్ ఎవే** అంటారు. ఇది కూడా ఒకరోజు వెళ్ళిపోతుంది. ఎంత పెద్ద కష్టం ముంచుకువచ్చినా, దానంతట అదే వెళ్ళిపోతుంది. అలా దాన్ని వదిలివేయాలి. అలా వదిలివేయకుండా, మీకు కాస్త జలుబు చేసినా జ్యోతిష్యుని దగ్గరికి పరుగులు తీస్తే, ఆయన మీకు పరిహారకర్మను దేన్నో సూచిస్తారు. అలా ప్రతిచిన్న సమస్యకూ పరిహారం చేస్తూపోతే, మీ జీవితమంతా ప్రాయశ్చితకర్మలను చేయటంతోనే సరిపోతుంది. ఇంక శాస్త్రవిచారణ చేయటానికి సమయమేది? ఆధ్యాత్మిక ఎదుగుదలకు తీరికేది? అందువల్ల ద్వంద్వాలనుంచి విముక్తి పొందటం రెండవ సాధన.

సి) **పరిమార్గనం** – పరిమార్గనం లేదా ఈశ్వరవిచారణ మూడవ సాధన.

**తతః పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్ గతా న నివర్తంతి భూయః** – 15.4

ఈ సాధనలు పాటించాక, ఈశ్వరవిచారణ చేయాలి. ఈ విచారణ చేస్తే, మళ్ళీ సంసారానికి తిరిగివచ్చే ప్రసక్తి లేదు.

ఈశ్వరవిచారణను బ్రహ్మజిజ్ఞాస అంటారు. ఈశ్వరవిచారణ ఎలా చేయాలో బృహదారణ్యకోపనిషత్తులో వస్తుంది.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయీ**– బృహదారణ్యకమ్

మైత్రేయీ, ఆత్మజ్ఞానాన్ని శాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందాలి.

ఈశ్వరవిచారణ అంటే భగవంతుని స్వరూపం గురించి తెలుసుకోవటం. ఈ విచారణ రెండు ముఖ్యమైన అంశాల ద్వారా చేయాలి. లేకపోతే ఈ విచారణ సాధ్యం కాదు. ఆ అంశాలు – ఆచార్యుడు, శాస్త్రం.

భగవంతుడు అంటే వైకుంఠపురంలోనో లేదా కైలాసంలోనో కొలువైవున్న ఏకరూప ఈశ్వరుడు కాదు. అలా భావించటంలో తప్పులేదు. కాని అక్కడితో ఆగిపోకూడదు. ఆ దశ భక్తియొక్క ప్రారంభదశ. దానితో ఆగిపోతే, భగవంతుని స్వరూపం అసంపూర్ణంగా ఉండిపోతుంది. అలా అసంపూర్ణ జ్ఞానంతో మరణించకూడదు. భగవంతుణ్ణి ఏకరూప ఈశ్వరునిగా కొలిస్తే, ఆయనను ఒక కాలానికి, ఒక దేశానికి, ఒక రూపానికి పరిమితి చేస్తున్నారు. అప్పుడు భగవంతుడు కూడా పరిచ్ఛిన్న దేవుడు అవుతాడు. ఒకపక్కేమో భగవంతుడు సర్వవ్యాపకుడు అని చెబుతూ, ఇంకొకపక్క ఒక చిన్నరూపం ఇవ్వటంలో అర్థంలేదు. ఒకరూపం ఇస్తే, సరిహద్దులు ఇచ్చినట్టు అవుతుంది. అవునా, కాదా?

ఈ గదియొక్క రూపు ఏమిటి? నలుచదరంగా ఉందా అని అడిగితే ఎలా తెలుస్తుంది? ఈ గది రూపురేఖలు తెలుసుకోవాలంటే ఈ గదియొక్క సరిహద్దులు గమనించాలి. అదే విధంగా భగవంతునికి ఒక రూపు ఇస్తే, ఆయనకు కూడా సరిహద్దులు ఏర్పడతాయి. భగవంతునికి కూడా పరిమితులు విధిస్తే, ఆయన కూడా మనలాగే 'సంసారి' అవుతాడు. అందువల్ల ఏకరూప ఈశ్వరుని స్థాయినుంచి అరూపఈశ్వరుని స్థాయికి ఎదగాలి. అరూప ఈశ్వరుని స్థాయికి ఎదగాలంటే అరూప ఈశ్వరజ్ఞానం పొందాలి. ఈ జ్ఞానాన్ని పరిమార్గనం లేదా బ్రహ్మవిచారణ అంటారు. పరిమార్గనం మూడవ సాధన.

ఈ విధంగా మూడు సాధనలు ఉన్నాయి. అవి శరణాగతి, ద్వంద్వాలనుంచి విముక్తి, పరిమార్గనం.

ఈ మూడు సాధనలలో రెండు సాధనలు సహకారీ సాధనలు, ఒకటి సాక్షాత్ సాధన. సాక్షాత్ సాధనను పరిమార్గనం లేదా బ్రహ్మవిచారణ అంటారు. దీన్ని ముఖ్యసాధన అని ఎందుకంటారంటే, అన్ని సాధనలూ దీనితోనే ముగియాలి. సాక్షాత్తూ కృష్ణపరమాత్మే అన్నాడు ఆ విషయం.

**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే।** – 4.33

అన్ని కర్మలూ జ్ఞానంలోనే పరిసమాప్తి చెందుతాయి.

అందువల్ల ఏ స్థాయిలో ఉన్నా జ్ఞానయోగానికి రాకతప్పదు.

**ఫలమ్** – మోక్షసాధనల గురించి చెప్పాక, జ్ఞానం పొందితే కలిగే ఫలం ఏమిటో కూడా చెప్పుకొస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏమిటా ఫలమ్? శుద్ధచైతన్యం గురించిన జ్ఞానం పొందుతారు.

**న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః।**
**యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥** – 15.6

సూర్యుడుగాని, చంద్రుడుగాని, అగ్నిగాని బ్రహ్మచైతన్యాన్ని ప్రకాశింపచేయలేవు. బ్రహ్మతో ఐక్యజ్ఞానం పొందాక, మళ్ళీ సంసారంలో తిరిగిపడరు.

భగవద్గీతను కృష్ణపరమాత్మ స్వంతంగా బోధించటం లేదు; ఉపనిషత్తుల సారం చెబుతున్నాడు. కఠోపనిషత్తు మంత్రాలను ఎక్కువగా చూస్తాము గీతలో. కొన్ని శ్లోకాలైతే ఇంచుమించుగా అలాగే వస్తాయి.

ఇప్పుడు చూడబోయే కఠమంత్రాన్ని ఆలయాల్లో దీపారాధన చేసేటప్పుడు పఠిస్తారు.

**న తత్ర సూర్యోభాతి న చంద్రతారకం నేమా విద్యుతో భాంతి కుతోఽ యమగ్నిః।**
**తమేవ భాంతమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి॥** – కఠ 2.2.15

బ్రహ్మను ఏ ప్రమాణంతోనూ ఆబ్జెక్టుగా తెలుసుకోలేము. బ్రహ్మను ఏదీ ప్రకాశింప చేయలేదు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మెరుపు, అగ్ని – ఏవీ కూడా ఆత్మను ప్రకాశింపజేయలేవు. ఆత్మ స్వయంప్రకాశకం. **జ్యోతిషాం జ్యోతిః.**

బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోలేము. బ్రహ్మను ఏదీ ప్రకాశింపజేయలేదు. ఈ అర్థాన్ని వివరించటానికి ఉపనిషత్తు జ్యోతి ఉదాహరణ తీసుకుంది. జ్యోతికి సాంకేతిక అర్థం – జ్యోతి సమక్షంలో వస్తువులు తెలిసి, ఆ జ్యోతి లేకపోతే వస్తువులు తెలియకపోవటం. అందువల్ల జ్యోతి అంటే స్వయంప్రకాశకజ్యోతి.

ఈ నిర్వచనం ప్రకారం కన్ను ఒక జ్యోతి. కన్నువల్లనే తక్కిన వస్తువులు తెలుస్తున్నాయి. ఇదే భావం తక్కిన ఇంద్రియాలకు కూడా వర్తిస్తుంది. చెవి అనే ఇంద్రియం పనిచేయకపోతే ఏ ధ్వనీ వినిపించదు. అలా **ఇంద్రియాలు ఒక జ్యోతి**.

ఇంద్రియాలు వాటివెనుక మనస్సు ఉంటేనే పనిచేస్తాయి. ఒక ప్రసంగానికి వెళ్ళినా, మనస్సు కల్లోలంగా ఉంటే, ఆ ప్రసంగం అర్థం కాదు. అందువల్ల **మనస్సు ఒక జ్యోతి**. అదేవిధంగా **వాక్కు ఒక జ్యోతి**. వాక్కు శబ్దప్రమాణం అవుతుంది. మనస్సు దానంతట అది చూడగలదా? అది కూడా జడమే. మనస్సనే జ్యోతిని ప్రకాశింపజేసేది ఇంకోటుంది. అది ఆత్మజ్యోతి లేదా **చైతన్యజ్యోతి**. ఇది దేనివల్ల ప్రకాశిస్తోంది? దీనివెనుక ఇంకో జ్యోతి లేదు. అందువల్ల ఇది ఒక జ్యోతి అనకూడదు. ఇదే జ్యోతి. ఇది **స్వయంప్రకాశకజ్యోతి**. ఇది తనంతట తాను ప్రకాశిస్తూ, తక్కినవాటిని ప్రకాశింపజేస్తుంది. అందుకే అది జ్యోతిషాం జ్యోతిః అయింది.

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మెరుపు, అగ్ని – ఈ ఐదూ బాహ్యమైన పంచజ్యోతులు. ఇవి ప్రమాణాలు అవుతాయి. ప్రమాణం ద్వారా ప్రమాత తెలుసుకునేదాన్ని ప్రమేయం అంటారు. ఒక వస్తువుగా, ఆబ్జెక్టుగా తెలుసుకునేదాన్ని ప్రమేయం అంటారు. కాని బ్రహ్మ

ప్రమేయం కాదు. అందువల్ల ప్రమాణానికి అందదు. ఈ బాహ్యమైన జ్యోతులే ఆత్మను ప్రకాశింపజేయలేనప్పుడు, మనకున్న పంచేంద్రియాలు, మనస్సు ఏం చేయగలవు?

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః** – కేన 1.3

ఇంద్రియాలే కాదు, మనస్సు కూడా వెళ్ళలేదు. అంటే ప్రమాణగోచరం కాదు. ఆత్మవల్లే అన్నీ ప్రకాశింపబడుతున్నాయి కాని ఆత్మను వాటితో చూడలేము. ప్రకృతిసూత్రం – ప్రకాశింపజేసేది వేరేదానిచేత ప్రకాశింపబడదు. సూర్యకాంతి కుర్చీని ప్రకాశింపజేస్తోంది; కాని కుర్చీ సూర్యకాంతిని ప్రకాశింపజేయలేదు.

**దృగేవ న తు దృశ్యతే** – దృక్‌దృశ్య వివేకమ్

ప్రకాశింపజేసేదే కాని ఎన్నటికీ ప్రకాశింపజేయబడదు.

ఆత్మ ఆబ్జెక్టు కాదు, కాని ఆత్మ ఉంది. అయితే ఆత్మ ఎవరు? ఆత్మకు ఉనికి ఉండి, ఆబ్జెక్టు కాకపోతే, దానికి ఒక్కటే జవాబు – ఆ ఆత్మను నేనే, సాక్షిచైతన్యంగా నేనే అన్నీ చూస్తాను కాని, చైతన్యాన్ని చూడలేను. ఈ చైతన్యంవల్లనే అన్నింటినీ అనుభవిస్తాను కాని, చైతన్యాన్ని అనుభవించలేను.

**అదృష్టో ద్రష్టాఽ శ్రుతశ్శ్రోతాఽ మతోమంతాఽ విజ్ఞాతో విజ్ఞాతా** – బృహదారణ్యకమ్

**అదృష్టో ద్రష్టా** – చైతన్యం ఎప్పటికీ చూసేది కాని చూడబడేది కాదు.

**అశ్రుతః శ్రోతా** – చైతన్యం ఎప్పటికీ వినేది కాని వినబడేది కాదు.

**అమతో మంతా** – చైతన్యం ఎప్పటికీ ఆలోచించేది కాని ఆలోచన కాదు.

**అవిజ్ఞాతో విజ్ఞాతా** – చైతన్యం ఎప్పటికీ తెలుసుకునేది కాని తెలియబడేది కాదు.

ఆత్మను ప్రమేయంగా చూడలేము, వినలేము, ఆలోచించలేము, తెలుసుకోలేము. ఒక్కముక్కలో చెప్పాలంటే ఆత్మ చైతన్యతత్త్వము. అది జడాన్ని ప్రకాశింపజేస్తుంది కాని, జడంవల్ల చైతన్యతత్త్వం ప్రకాశించదు. ఆత్మ లక్షణం ఏమిటి?

చైతన్యస్వరూపం బ్రహ్మ; చిద్రూపం బ్రహ్మ; సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ

ఈ బ్రహ్మ ఎక్కడ ఉంది? ఈ చైతన్యం ఎక్కడ ఉంది? అంతటా ఉంది! మీలో చైతన్యం ఉంది! నాలో చైతన్యం ఉంది. ఏమిటి నిదర్శనం? మీలో చైతన్యం లేకపోతే అసలు మీరు ఈ ప్రశ్నే అడగలేరు.

**జాగ్రత్స్వప్నసుషుప్తిషు స్ఫుటతరా యా సంవిదుజ్జృమ్భతే**
**యా బ్రహ్మాదిపిపీలికాన్తతనుషు ప్రోతా జగత్సాక్షిణీ ।**

**సైవాహం న చ దృశ్యవస్త్వితి దృఢప్రజ్ఞాపి యస్యాస్తి చే-**
**చ్చాణ్డాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురురిత్యేషా మనీషా మమ ॥** – మనీషా పంచకమ్

చైతన్యం చిన్న చీమనుంచి బ్రహ్మదాకా అంతటా వ్యాపించివుంది. ఈ చైతన్యాన్ని బ్రహ్మ అంటారు. నిజానికి బ్రహ్మ అంటేనే చాలా పెద్దది. **బృహత్తమత్వాత్ బ్రహ్మ.** బ్రహ్మ సర్వవ్యాపకమైతే బ్రహ్మరూపం ఏమిటి? రూపంలేదు. అరూప ఈశ్వరుడు. ఈ అరూప ఈశ్వరుడు, బ్రహ్మయొక్క అసలు స్వరూపం. కృష్ణపరమాత్మ మాయామానుషవేషధారి. మానవజాతిని ఉద్ధరించటానికి అవతారాన్ని ఎత్తాడు విష్ణుమూర్తి. తన ఉన్నతస్వరూపాన్ని కృష్ణపరమాత్మ తొమ్మిదవ అధ్యాయంలో వివరించాడు.

**మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా** – 9.4

నిరాకార పరబ్రహ్మనైన నాచేతనే ఈ జగత్తంతా పరిపూర్ణమై ఉంది.

ఈ విధంగా మోక్షసాధన చేస్తే కలిగే ఫలం బ్రహ్మజ్ఞానం పొందుతారు.

**3. ఈశ్వరస్వరూపమ్ : శ్లోకాలు 7–20** – ఈ అధ్యాయంలో చర్చించబడిన మూడవ అంశం **ఈశ్వర స్వరూపమ్**. ఇది ఈ అధ్యాయంలో చర్చించబడిన లోతైన అంశం. నిజానికి భగవద్గీతలోనే చివరిసారిగా చెప్పబడిన లోతైన అంశంగా చెప్పవచ్చు. ఈశ్వరస్వరూపాన్ని రెండుగా వివరిస్తాడు కృష్ణపరమాత్మ. అంతకుముందు అపరాప్రకృతి, పరాప్రకృతి అన్నాడు. అపరాప్రకృతి అంటే భగవంతునియొక్క తక్కువస్థాయి; పరాప్రకృతి అంటే భగవంతునియొక్క ఉన్నతస్థాయి.

ఈ అధ్యాయంలో ఇదే అంశాన్ని ఇంకో కోణంలోంచి బోధిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ భగవంతునియొక్క రెండు స్థాయిలను చూపించటానికి మొత్తం జగత్తును రెండుగా విభజిస్తున్నాడు. అవి – భోక్తృప్రపంచం, భోగ్యప్రపంచం. భోక్తృప్రపంచాన్ని జీవుడు అంటే, భోగ్యప్రపంచాన్ని జగత్తు అంటారు. జీవుడు, జగత్తులు కలిసి మొత్తం విశ్వం అవుతుంది.

నేనే జీవుణ్ణి, జగత్తును కూడా అంటున్నాడు కృష్ణపరమాత్మ. నేను పారమార్థికస్థాయిలో ఒంటరిగా ఉండటంవల్ల నన్ను నేను అనేకంగా విభజించుకున్నాను.

**బహుస్యాం ప్రజాయేయేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా ఇదగ్ం సర్వమసృజత। యదిదం కిం చ।**

నేను అనేకంగా అగుదును గాక! ఈ విధంగా సంకల్పం చేశాక, తన సంకల్పంవల్ల ఈ జగత్తును అంతటినీ సృష్టించాడు.

భగవంతుడు తనను తాను చేతనప్రపంచంగా, అచేతనప్రపంచంగా విభజించుకున్నాడు. అదెలా సాధ్యం? ఎందుకు సాధ్యం కాదు. మీరు రోజూ చూసేది అదే కదా అంటుంది

శాస్త్రం. అదేమిటో మీరు చెప్పగలరా? మీరు సృష్టించే స్వప్నప్రపంచం. మీరు మంచంమీద పడుకున్నప్పుడు, మీరు ఒంటరిగా ఉన్నారు. కాని మీరు పడుకున్నాక, మిమ్మల్ని మీరు రెండుగా విభజించుకుంటారు. మీరు సృష్టించే స్వప్నప్రపంచంలో స్వాప్నికునిగా ప్రవేశిస్తారు. స్వప్నంలో చంద్రుడు, నక్షత్రాలు, కొండలు – అన్నీ సృష్టిస్తారు. వాటిని మీరే అనుభవిస్తారు. అంటే మీరే భోక్త, మీరే భోగ్యప్రపంచం కూడా అవుతారు. కాని వచ్చిన చిక్కేమిటంటే, ఆ విషయం మీకు గుర్తుండదు. అది మీరు సృష్టించిన ప్రపంచమే అని మీకు గుర్తుంటే అద్భుతంగా ఉంటుంది. కాని మీరు స్వప్నంలో అడుగుపెట్టిన క్షణమే, మిమ్మల్ని మీరు మర్చిపోతారు. మీరు స్వప్నంతో ఎంతగా మమేకం చెందుతారంటే, మీ స్వప్నం ఒక అనుభవంగా మారుతుంది. అదేవిధంగా ఒక ఈశ్వరుడే జీవుడు, జగత్తుగా తనను తాను విభజించుకుంటున్నాడు.

**మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః ।**
**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥** – 15.7

జీవులందరిలోని ప్రతిబింబచైతన్యాన్ని జీవుడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. జీవాత్మ అంటే మనస్సు+చిదాభాస. ఇది సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అంశం. తత్త్వబోధలో పరమాత్మను బింబచైతన్యం అనీ, జీవాత్మను ప్రతిబింబచైతన్యం లేదా చిదాభాస అనీ అంటారు. ఈ బింబచైతన్యాన్ని బ్రహ్మ అనీ, చిత్ అని కూడా అంటారు. ఈ బింబచైతన్యాన్ని మనస్సు ప్రతిబింబింపజేస్తుంది. అందువల్ల మనస్సును ప్రతిబింబమాధ్యమం అనీ, అలా ఏర్పడిన ప్రతిబింబాన్ని ప్రతిబింబచైతన్యం అనీ అంటారు.

ఇది అర్థం చేసుకోవటానికి అద్దం ఉదాహరణ చూద్దాము. ఆకాశంలో పట్టపగలు సూర్యుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు. దాన్ని బింబసూర్యకాంతి అంటారు. ఒక చీకటిగదిలో, ఒక అద్దాన్ని తెచ్చి ఒక ప్రత్యేకమైన కోణంలో పెడితే, బింబసూర్యకాంతిని ఈ అద్దం ప్రతిబింబింపజేస్తుంది. అందువల్ల అద్దాన్ని ప్రతిబింబ మాధ్యమం అనీ, అలా ఏర్పడిన సూర్యప్రతిబింబాన్ని ప్రతిబింబ సూర్యకాంతి అనీ అంటారు. అద్దం జడం. దానికి విడిగా కాంతిలేదు. కాని సూర్యకాంతికి ఎదురుగా పెడితే, అది సూర్యకాంతిని ప్రతిబింబింప జేసింది. అద్దం సూర్యకాంతిని ప్రతిబింబింపజేయటంవల్ల, అది కాంతివంతమవటమే కాక, చీకటిగదిని కూడా ప్రకాశవంతంగా చేసింది.

ఇప్పుడు ఈ సూత్రాన్నే మనస్సుకు అన్వయించి చూద్దాము. ముందు ఈ జగత్తును చూద్దాము. జగత్తు ఏమిటి? జగత్తు జడం. అది పాంచభౌతికం, అందువల్ల అచేతనం. దానికి జీవం లేదు. స్వామీజీ మైకులో బోధ చేస్తున్నారు; శిష్యులు వింటారు కాని మైకు

వినలేదు. ఎందుకంటే మైకు జడం. శిష్యులు కూర్చున్న కుర్చీలు వినలేవు. అవి జడం. అవన్నీ అచేతన ప్రపంచం.

శాస్త్రం మన స్థూలశరీరం కూడా జడమే అంటుంది. ఎందుకంటే, అది కూడా పాంచభౌతికమే. జగత్తులో ఉన్న రసాయనాలే మన శరీరంలో కూడా ఉన్నాయి. అందువల్లనే బయోకెమిస్ట్రీ ప్రాణుల గురించి వర్ణిస్తుంది. అలా శరీరం జడం; మనస్సు కూడా జడమే. మనస్సు సూక్ష్మపంచభూతాలనుంచి వచ్చింది. అందువల్లనే శరీరంలో ఏవైనా రసాయనాల సమతుల్యత దెబ్బతింటే, అది మనస్సును కూడా ప్రభావితం చేస్తుంది. మానసిక రుగ్మత ఏర్పడినా, మనస్సు నిరాశానిస్పృహలకు లోనయినా, అది కూడా రసాయనాల లోపమే అని, దానికి తగ్గ మందు ఇస్తారు వైద్యులు. దాన్నిబట్టి శరీరం, మనస్సు కూడా అచేతనం లేదా జడం.

మనస్సు, శరీరం అచేతనమైనా కూడా, మనస్సుకు ఒక ప్రత్యేకమైన శక్తి ఉందంటుంది శాస్త్రం. అది పదార్థం; నిజమే కాని, అది అతిసూక్ష్మమైన తత్త్వంతో చేయబడింది. సర్వవ్యాపకమైన చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే శక్తి మనస్సుకు ఉంది. మనస్సులో ఏర్పడిన ప్రతిబింబంవల్ల మనస్సు చేతనంగా అవుతుంది. మనస్సులో ఏర్పడిన ప్రతిబింబచైతన్యాన్ని చిదాభాస అంటారు; మనస్సును ప్రతిబింబ మాధ్యమం అంటారు. అద్దం జడం అయినా సూర్యకాంతిని ప్రతిబింబింపజేసినట్టుగా, మనస్సు జడమైనా చైతన్యాన్ని ప్రతిబింబింప జేస్తుంది.

మనస్సులో ఏర్పడిన ఈ చిదాభాసను జీవాత్మ అంటారు. ఈ చిదాభాసవల్ల మనస్సు చైతన్యవంతం అవుతుంది. మనస్సువల్ల శరీరం కూడా చైతన్యవంతం అవుతుంది. అప్పుడు అన్ని వ్యవహారాలు జరుగుతాయి. అందువల్ల మనం శరీరంలో చైతన్యాన్ని అనుభవిస్తున్నామంటే అది ఈశ్వరుని ప్రకటితరూపమే. బ్రహ్మచైతన్యం, మనస్సు ద్వారా శరీరమంతటా ప్రకటితమవుతుంది. అందువల్లనే, కృష్ణపరమాత్మ మీరు ఏ అనుభవం పొందినా, తనను గుర్తు తెచ్చుకోమంటున్నాడు.

**ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।**

**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥** – 15.10

జీవుడు శరీరాన్ని వదులుతున్నప్పుడు లేదా శరీరంలోనే స్థితుడై ఉన్నప్పుడు లేదా భోగాలను అనుభవిస్తున్నప్పుడు అజ్ఞానులు తెలుసుకోలేరు. జ్ఞానులు మాత్రమే తమ జ్ఞాననేత్రాల ద్వారా తెలుసుకోగలరు.

ఈ శరీరం చైతన్యవంతంగా ఉందంటేనే, ఆ చేతనత్వం ఈశ్వరుడువల్లనే. భగవంతుణ్ణి పొందాలనుకుంటున్నారా? మీరు స్వామీజీ బోధ వింటున్నారనుకోండి, మీరు వింటున్నారంటేనే,

భగవంతుని అనుభవం పొందుతున్నట్టే అర్థం. మీరు ప్రాణంతో ఉన్నారు కాబట్టి వినగలుగుతున్నారు. ఇది ఈశ్వరప్రసాదం కాక మరేమీ కాదు. ఇది జీవుని గురించి. పరమాత్మే జీవాత్మగా అందరిలోనూ ఉన్నాడు.

**జగత్తు** – ఇప్పుడు జగత్తు గురించి చూద్దాము. జీవుడు మాత్రమే నా వ్యక్తరూపం కాదు, జగత్తు కూడా నా వ్యక్తరూపమే అంటున్నాడు పరమాత్మ. అందువల్ల నేను చేతనాన్ని, అచేతనాన్ని కూడా అంటున్నాడు. ఇప్పుడు నేనే అన్నింటిగా కనిపిస్తున్నాను అంటున్నాడు. అన్నింటిలో ఉన్నాడని, ఆ పట్టిక ఇస్తూపోవాలంటే జరిగే పనికాదు. అందువల్ల కృష్ణపరమాత్మ సృష్టిలో ఉన్న కొన్ని ముఖ్యమైన అంశాలను తీసుకుని, అవి నా ప్రకటితరూపాలే అంటున్నాడు. భగవంతుడు వాటిలో మాత్రమే కాదు, అలా అన్నింటిలోనూ ఉన్నాడని అర్థం. కృష్ణపరమాత్మ తీసుకున్న అంశాలు మనం నిరంతరం అనుభవిస్తున్న ప్రాథమిక, సహజమైన శక్తులు. ఈ సహజమైన శక్తులు లేకుండా జగత్తు కొనసాగలేదు. అవి సూర్యశక్తి, చంద్రశక్తి, అగ్నిశక్తి. కృష్ణపరమాత్మ శక్తి పదం బదులు తేజః అంటున్నాడు.

ఈ మూడు చాలా గొప్ప శక్తులు. సూర్యశక్తి మొత్తం జగత్తును ప్రకాశింపజేస్తుంది. నిండు పున్నమిరాత్రి చంద్రుడు కురిపిస్తున్న పండువెన్నెల పుచ్చపువ్వులా ఈ భూమి అంతటినీ ప్రకాశింపజేస్తుంది. అలాగే అగ్ని కూడా చాలా ముఖ్యం. మన శాస్త్రం విధించిన నిత్యనైమిత్తిక కర్మలలో అగ్ని ఉపాసన ఉంటుంది. పగలు సూర్యకాంతి, రాత్రి చంద్రకాంతి, రోజంతా అగ్ని ఉంటాయి. వీటి సమక్షంలో వ్యవహారాలు జరుగుతాయి. అందువల్ల వ్యవహారాలన్నీ నావల్లనే జరుగుతున్నాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అగ్నితత్త్వాన్ని రెండు విధాలుగా వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అవి బాహ్యఅగ్ని, ఆంతర అగ్ని. బాహ్యఅగ్ని అంటే యజ్ఞాలలో వాడే అగ్ని; ఆంతర అగ్ని అంటే మన ఉదరంలో ఉన్న అగ్ని. దాన్ని జఠరాగ్ని అని, వైశ్వానరాగ్ని అనికూడా అంటారు. ఈ వైశ్వానరాగ్ని మనం తిన్న ఆహారాన్ని మళ్ళీ లోపల వండుతుంది. బృహదారణ్యకోపనిషత్తులో వైశ్వానరాగ్ని మీద ప్రత్యేకమైన ఉపాసన ఉంది.

**అయమగ్నిర్వైశ్వానరో యోఽయమన్తః పురుషే యేనేదమన్నం పచ్యతే**

మనుష్యులు తీసుకున్న ఆహారాన్ని లోపలున్న అగ్ని జీర్ణం చేస్తుంది. ఈ జీర్ణశక్తి మీద ఉపాసన చేయాలి.

ఇదే అగ్ని గురించి కృష్ణపరమాత్మ కూడా చెబుతున్నాడు.

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥** – 15.14

నేను సకలప్రాణులయొక్క దేహంలో ఉండి, ప్రాణాపానాలతో కూడిన వైశ్వానరాగ్నిగా, నాలుగు విధాలైన ఆహారాన్ని జీర్ణింపజేస్తాను.

**సర్వస్య చాహం హృది సన్నివిష్టో మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ ।**

**వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥** – 15.15

పరమాత్మ అయిన నేను అందరి హృదయాలలో కొలువైవుంటాను. నావల్లనే మనస్సులో జరిగే కార్యకలాపాలైన జ్ఞానం పొందటం, జ్ఞాపకం పెట్టుకోవటం, మర్చిపోవటం జరుగుతున్నాయి. వేదాల ద్వారా తెలుసుకొనదగినవాడను నేనే. వేదాలను నేర్చుకునే శిష్యుణ్ణి కూడా నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

దీనితో కృష్ణపరమాత్మ రెండవ అంశాన్ని ముగిస్తున్నాడు. ముందు పరమాత్మ జీవుని రూపంలో ఉన్నాడు అన్నాడు. ఇప్పుడు పరమాత్మ జగత్తురూపంలో ఉన్నాడు అంటున్నాడు. రెండూ కలిపితే బ్రహ్మ సర్వాత్మకత్వం వస్తుంది. దీని అర్థం సర్వం బ్రహ్మమయం.

**పురుషోత్తముడు** – చివరిగా, కృష్ణపరమాత్మ భగవంతునియొక్క ఉన్నతతత్త్వం గురించి మరొక కోణంలో వర్ణించబోతున్నాడు.

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**

**క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥** – 15.16

**ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।**

**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥** – 15.17

**యస్మాత్ క్షరమతీతోఽహమ్ అక్షరాదపి చోత్తమః ।**

**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥** – 15.18

ఈ జగత్తులో రెండురకాల పురుషులు ఉన్నారు. వారు క్షరపురుషుడు, అక్షరపురుషుడు. అన్ని వస్తువులు, అన్ని ప్రాణులు క్షరపురుషుడు. అవ్యక్తవస్తువు లేదా మాయ అక్షరపురుషుడు.

వీరికి భిన్నంగా ఇంకొక పురుషుడు ఉన్నాడు. ఆ భిన్నపురుషుని పేరు ఉత్తమపురుషుడు. ఈ ఉత్తమ పురుషుణ్ణి లేదా చైతన్యాన్ని అన్ని ఉపనిషత్తులలోనూ పరమాత్మగా వ్యవహరిస్తారు. ఈ ఉత్తమ పురుషుడు ముల్లోకాల్లోనూ సర్వవ్యాపకంగా, అధిష్ఠానంగా ఉన్నాడు.

క్షరపురుషుడు, అక్షరపురుషులకన్నా ఉత్తముడు ఈ ఉత్తమపురుషుడు. క్షర, అక్షర పురుషులకన్నా చైతన్యం శ్రేష్ఠం కాబట్టి, చైతన్యం పురుషోత్తమునిగా లోకంలోనూ, వేదంలోనూ ప్రసిద్ధి పొందింది.

పురుషోత్తముడు పదాన్ని నిర్వచించటానికి కృష్ణపరమాత్మ మొత్తం విశ్వాన్ని మూడు భాగాలుగా విభజించాడు. దాన్ని అంశత్రయమ్ అంటారు. అవి క్షరపురుషుడు, అక్షరపురుషుడు, ఉత్తమపురుషుడు.

**క్షరపురుషుడు** – క్షరపురుషుడు అంటే కంటికి కనబడే జగత్తు. ఇంద్రియాలు ఈ జగత్తును శబ్దస్పర్శరూపరసగంధాల ద్వారా చూపిస్తాయి. ఇది వ్యక్తం, ఇది జడం. జగత్తును పదార్థం అంటారు. విజ్ఞానశాస్త్రం ప్రకారం పదార్థాన్ని కొత్తగా సృష్టించలేము, నాశనం చేయలేము అని నేర్చుకుంటాము. పదార్థం శక్తిగా మారుతుంది.

**అక్షరపురుషుడు** – పదార్థం శక్తిగా మారుతుందని విజ్ఞానశాస్త్రం అంటే వ్యక్తమయిన జగత్తు, అవ్యక్తంలోకి వెళుతుంది అంటుంది వేదాంతశాస్త్రం. సృష్టి జరిగినప్పుడు వ్యక్తంలోకి వస్తుంది; మళ్ళీ ప్రళయంలో అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. అవ్యక్తంలో ఉన్నది అక్షరపురుషుడు.

**ఉత్తమపురుషుడు** – ఉత్తమపురుషుడు అంటే చేతనతత్త్వం. ఈ చేతనతత్త్వం స్వతంత్రమైనది. అటువంటి స్వతంత్రమైన ఉనికి ఉన్న చైతన్యాన్ని ఉత్తమపురుషుడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఒక్కముక్కలో చెప్పాలంటే క్షరపురుషుడు పదార్థం; అక్షరపురుషుడు శక్తి; ఉత్తమపురుషుడు చైతన్యతత్త్వం. క్షర, అక్షరపురుషులు భగవంతునియొక్క తక్కువస్థాయి అయితే, ఉత్తమ పురుషుడు ఉన్నతస్థాయి. ఉత్తమపురుషుడు ఉన్నతస్థాయి కాబట్టి ఉత్తమపురుషుడు పదాన్ని తిరగేస్తే పురుషోత్తముడు అని వస్తుంది. పురుషోత్తముడు అంటే భగవంతునియొక్క ఒక ప్రత్యేకమైన రూపం కాదు. పురుషోత్తముడు అంటే నిర్గుణతత్త్వం, నిర్వికారం, నిర్వికల్పం. పురుషోత్తముడు అశబ్దం, అస్పర్శ, అరూప, అరస, అగంధ చైతన్యస్వరూపం. భగవంతునియొక్క ఈ మూడు అంశాలు తెలిస్తేనే భగవంతునియొక్క స్వస్వరూపం తెలిసినట్టు అర్థం. లేకపోతే మీ జ్ఞానం అసంపూర్ణజ్ఞానం అవుతుంది. అందువల్ల కృష్ణపరమాత్మ ఇలా అంటున్నాడు.

**యో మామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।**
**స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత ॥** – 15.19
**ఇతి గుహ్యతమం శాస్త్రమ్ ఇదముక్తం మయానఘ ।**
**ఏతద్ బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత ॥** – 15.20

జ్ఞాని పురుషోత్తముని గురించి తెలుసుకుంటాడు కాబట్టి అతను సర్వజ్ఞుడు అవుతాడు. నిరంతరం అన్ని విధాలుగా పూజిస్తాడు.

బ్రహ్మ గురించిన ఈ బోధ ఎంతో రహస్యమైనది. అటువంటి అరుదైన విద్యను నేను నీకు బోధిస్తున్నాను. ఈ జ్ఞానాన్ని నువ్వు అందుకుని, దాన్ని జీర్ణించుకో. దాన్ని జీర్ణించుకుంటే నువ్వు జ్ఞానివి అవుతావు. జ్ఞానివి అయితే పరిపూర్ణత్వం ఏర్పడుతుంది.

కృష్ణపరమాత్మ పరమాత్మయొక్క రెండు అంశాలను ముందు నుంచీ చెబుతూనే ఉన్నాడు. ఏడవ అధ్యాయంలో తన తక్కువస్థాయిని అపరాప్రకృతి, ఉన్నతస్థాయిని పరాప్రకృతి అన్నాడు. పదమూడవ అధ్యాయంలో వాటిని క్షేత్రం, క్షేత్రజ్ఞుడు అన్నాడు. పద్నాలుగవ అధ్యాయంలో మళ్ళీ వాటినే సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ అన్నాడు. ఇప్పుడు ఈ అధ్యాయంలో క్షర, అక్షర పురుషులు, ఉత్తమపురుషుడు అంటున్నాడు. ఎవరైతే ఈ పురుషోత్తముని గురించిన జ్ఞానం పొందుతారో, వారు సర్వజ్ఞులు అవుతారు. ఈ జ్ఞానంవల్ల జీవితంలో పరిపూర్ణత్వం ఏర్పడుతుంది. ఈ పూర్ణత్వాన్నే మోక్షం అంటారు.

అందువల్లనే కృష్ణపరమాత్మ ఓ అర్జునా, ఇది చాలా గుహ్యతమమైన విద్య. అటువంటి అరుదైన విద్యను నేను నీకు బోధిస్తున్నాను. ఈ జ్ఞానాన్ని నువ్వు అందుకుని, దాన్ని అర్థం చేసుకుని, పరిపూర్ణత పొంది, మోక్షం పొందుదువు గాక.

ఈ అధ్యాయంలో ముఖ్యాంశం పురుషోత్తముడైన ఈశ్వరుని గురించిన బోధ ఉంది కాబట్టి ఈ అధ్యాయానికి పురుషోత్తమయోగము అనే పేరు వచ్చింది.

# దైవాసురసంపద్విభాగయోగము

## అధ్యాయము 16

భగవద్గీతలో ఏ అధ్యాయం అధ్యయనం చేసినాకూడా, భగవద్గీతయొక్క సారాంశం గురించిన పూర్తి అవగాహన ఉండాలి. భగవద్గీతయొక్క సారం ఏమిటో తెలుసుకోకుండా, ఏ అధ్యాయానికి ఆ అధ్యాయం విడిగా అధ్యయనం చేస్తే, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేము. అందువల్ల భగవద్గీతను అధ్యయనం చేసేటప్పుడు మధ్యమధ్యలో ఆగి, ఈ ప్రశ్నలు వేసుకోవాలి.

1. **భగవద్గీత తాత్పర్యం** – భగవద్గీతయొక్క సారం ఏమిటి? భగవద్గీత ఎందుకు చెప్పబడింది? ఈ ప్రశ్నలకు జవాబు భగవద్గీతయొక్క ఉపోద్ఘాతంలో దొరుకుతుంది. గీతాబోధ మొదలవక ముందు, అర్జునుడు కృష్ణపరమాత్మను శరణువేడి, తన నిస్సహాయస్థితిని వర్ణించుకున్నాడు.

**న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్ యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్ ।**
**అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥** – 2.8

ఇంద్రియాలను శుష్కింపజేసే శోకాన్ని పోగొట్టే ఉపాయమేమిటో తెలియటం లేదు. భూలోకంలో శత్రుబాధ లేని సమృద్ధమైన రాజ్యాన్ని పొందినా, దేవేంద్ర పదవి పొందినా ఈ శోకం తొలగిపోదు అని చెప్పుకున్నాడు అర్జునుడు.

అర్జునుడు తీవ్రమైన దుఃఖంలో, దానివల్ల కలిగిన మోహంలో పడిపోయాడు. ఈ మోహం తన బుద్ధిని మందగించిపోయేలా చేస్తోంది. దీన్నుంచి పారిపోయే మార్గం కూడా కనబడటం లేదు. ఒకవేళ ఇప్పుడు తప్పించుకున్నా, మళ్ళీ ఈ శోకం పట్టుకునేటట్టుగా ఉంది. అర్జునునికి పేరుప్రతిష్ఠలు ఉన్నాయి; గొప్ప విలుకాడు; ఉన్నతవంశంలో పుట్టాడు; ఓటమి ఎరుగడు. ఇన్ని హంగులు ఉన్నా, ఇవేవీ నా శోకాన్ని తొలగించలేవు అన్నాడు అర్జునుడు. నాకు మూడు లోకాల ఆధిపత్యం వచ్చినాకూడా నా స్వజనులను చంపను. అలాంటప్పుడు ఈ భూమండల విషయం గురించి చెప్పేదేముంది? త్రిలోకాల విజయమే వీటి ముందు దిగదుడుపు అంటే ఈ చిన్న రాజ్యవిషయం గురించి ప్రత్యేకించి చెప్పేదేముంది అన్నాడు అంతకుముందు అర్జునుడు. ఇప్పుడు సురాణామపిచాధిపత్యమ్ – సాక్షాత్తూ స్వర్గలోకానికే అధిపతినైనా కూడా నా దుఃఖం పోదు అన్నాడు.

ఈ శ్లోకంవల్ల రెండు ముఖ్యమైన విషయాలు అర్థం చేసుకోవాలి. ఒకటి పేరుప్రతిష్ఠలు, ఆస్తి, హెూదా, అనుబంధాలు, లౌకిక విజయాలవల్ల దుఃఖాన్ని పారద్రోలలేము. రెండు, ఈ దుఃఖాన్ని పారద్రోలాలనే తపన అర్జునునిలో కనిపిస్తున్నది. తనకు తెలిసిన పద్ధతిలో

తను స్వయంగా పారద్రోలలేనని కూడా అర్జునుడు గ్రహించాడు. గ్రహించటంవల్లనే కృష్ణపరమాత్మను శరణువేడాడు. ఈ నేపథ్యంలో భగవద్గీత ప్రారంభమయింది. సహజంగానే, కృష్ణపరమాత్మ అర్జునుని విషాదానికి మందు వేయాలి. అంటే సంసారమనే భవరోగానికి మందు వేయాలి. కృష్ణపరమాత్మ తన బోధ మొదటి శ్లోకంలోనే తను అర్జునుని సమస్యను అర్థం చేసుకున్నానని స్పష్టంగా చెప్పటమే కాక, దానికి పరిష్కారాన్ని కూడా సూచించాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥** – 2.11

శోకింపదగని వారికోసం శోకిస్తున్నావు. నిన్ను నువ్వే తెలివైన వ్యక్తిగా భావించుకుని మాట్లాడుతున్నావు. జ్ఞానులు జీవించి ఉన్నవారికోసం బాధపడరు; మరణించిన వారికోసం బాధపడరు.

**పండితాః న అనుశోచంతి** – పండితులు బాధపడరు అన్నాడు కృష్ణపరమాత్మ. పండితులు శోకించరు అని చెప్పటంవల్ల, కృష్ణపరమాత్మ పరోక్షంగా ఇంకొక భావాన్ని అందజేశాడు. ఏమిటది? పండితులు శోకించరు కాబట్టి ఎవరైతే శోకిస్తారో వారు పండితులు కారు! అజ్ఞానులే శోకిస్తారు, జ్ఞానులు శోకించరు.

దీన్నే ఇంకొక విధంగా చెప్పాలంటే, దుఃఖానికి కారణం అజ్ఞానం; జ్ఞానం ఒక్కటే దుఃఖానికి పరిష్కారం. ఇక్కడ జ్ఞానం అంటే ఆత్మజ్ఞానం. పండితాః అంటే జ్ఞానిః అని శంకరాచార్యులవారు తమ భాష్యంలో రాశారు. అందువల్ల పండితుడు అంటే ఆత్మజ్ఞానం లేదా బ్రహ్మజ్ఞానం పొందినవ్యక్తి అని అర్థం. అందువల్ల, గీతయొక్క ప్రాథమిక బోధ జ్ఞానప్రధానంగా ఉంటుంది. సంసారమనే సమస్యకు మందు ఆత్మజ్ఞానం ఒక్కటే అని చూపిస్తుంది. భాగవతంలో భీష్మస్తుతిలో అదే అంటారు భీష్మాచార్యులవారు.

**వ్యవహితా పృథనాముఖం నిరీక్ష్య స్వజనవధాద్విముఖస్య దోషబుద్ధ్యా ।**
**కుమతిమహరదాత్మవిద్యయా యశ్చరణరతిః పరమస్య తస్య మే అస్తు** – భీష్మస్తుతి

అర్జునుడు కురుక్షేత్రంలో కౌరవసేన చూసి వారంతా తన బంధువులనే వ్యామోహంలో కూరుకుపోయినప్పుడు, అతనికి చెమటలు పట్టాయి; తల తిరిగింది; తన విల్లుని వదిలేసి నేను యుద్ధం చేయను అన్నాడు. ఆ సమయంలో అర్జునుని మోహాన్ని, అతని మనస్సుయొక్క మాయను పోగొట్టటానికి మీరు కురుక్షేత్రంలో గీతను బోధించారు. అటువంటి గీతాచార్యుని దివ్యపాదాలను నేను శరణు వేడుతున్నాను.

అర్జునుడు యుద్ధభూమిలో మోహంలో పడ్డప్పుడు కృష్ణపరమాత్మ అతనికి ఆత్మవిద్యను బోధించాడు. ఈ ఒక్క శ్లోకం చాలు, భగవద్గీతయొక్క తాత్పర్యం ఆత్మవిద్య అని

నొక్కివక్కాణించటానికి. అదికాక, భగవద్గీత ఉపనిషత్తుల సారమని తెలుసు మనకు. ఉపనిషత్తులను నేర్చుకుంటే, ఉపనిషత్తుల తాత్పర్యం ఆత్మజ్ఞానమే అని తెలుసుకుంటాము.

**సర్వే వేదాః యత్పదమామనంతి తపాగ్ంసి సర్వాణి చ యద్వదంతి ।**
**యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తే పదగ్ం సంగ్రహేణ బ్రవీమి ॥**
**ఓమ్ ఇతి ఏతత్** – కఠ 1.2.15

అన్ని వేదాలూ ఏ లక్ష్యాన్ని బోధిస్తున్నాయో, ఏ లక్ష్యాన్ని తపస్సులు నిర్దేశిస్తున్నాయో, ఏ లక్ష్యంకోరి బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నారో, ఆ లక్ష్యం గురించి నీకు సంగ్రహంగా చెబుతాను. అది ఓమ్ అంటున్నాడు యమధర్మరాజు.

అన్ని వేదాల లక్ష్యం లేదా తాత్పర్యం ఆత్మజ్ఞానం కాబట్టి మొత్తం భగవద్గీత తాత్పర్యం కూడా ఆత్మజ్ఞానం తప్ప వేరే ఏమీకాదు. అందువల్లనే ప్రతి అధ్యాయం చివర ఇలా వస్తుంది –

**ఓం తత్సదితి శ్రీ మద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే ...**

అటు ఉపనిషత్తులు, ఇటు భగవద్గీత కూడా సంసారనివృత్తికి మార్గం ఆత్మజ్ఞానం అనీ, ఆత్మజ్ఞానం అనేకానేక మార్గాలలో ఒకటి కాదనీ, ఆత్మజ్ఞానం **ఒక్కటే** నివారణోపాయం అనీ నొక్కివక్కాణిస్తున్నాయి. అన్ని దారులూ రోమ్ మహానగరానికి దారితీస్తాయి అనే నానుడి ఇక్కడ చెల్లదు. మోక్షానికి అనేక దారులు లేవు. ఉన్నదొకటే మార్గం.

**తమేవ విద్వాన్ అమృత ఇహ భవతి నాన్యః పంథా అయనాయ విద్యతే । –** పురుషసూక్తం

అనేక పంథాలు అంటే అనేక మార్గాలు లేవు జ్ఞానం పొందటానికి. ఉన్నదొకటే మార్గం. కృష్ణపరమాత్మ కూడా ఆ విషయం చెప్పాడు.

**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః** – 5.15
**జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।**
**తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥** – 5.16

అజ్ఞానంతో జ్ఞానం కప్పబడి ఉండటంవల్ల ప్రాణులు మోహంలో పడుతున్నారు. కాని వారి అజ్ఞానం పరమాత్మ తత్త్వజ్ఞానప్రాప్తి ద్వారా తొలగిపోతుంది. అప్పుడు ఆ జ్ఞానం వారికి సచ్చిదానంద పరమాత్మను సూర్యునిలాగా దర్శింపజేస్తుంది.

మనకున్న ఏకైక సమస్య అజ్ఞానం. అజ్ఞానం పారద్రోలటానికి ఏకైక పరిష్కారం – ఆత్మజ్ఞానమే. అందువల్ల ఈ ఆత్మజ్ఞానం అనేకానేక మార్గాల్లో ఒకటి కాదు. అది ఒక్కటే మార్గం. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాల్లో, ఏ యుగంలో చూసినా కూడా అజ్ఞానాన్ని

ఒక్క ఆత్మజ్ఞానం మాత్రమే తొలగించగలదు అని తెలుస్తుంది. అందువల్ల మనం గుర్తుంచుకోవలసిన మొట్టమొదటి అంశం – భగవద్గీతయొక్క తాత్పర్యం – ఆత్మజ్ఞానం.

2. **ప్రమాణం** – ఇంకొక విషయం కూడా మనం గుర్తుంచుకోవాలి. అది జ్ఞానం పొందటానికి ఉన్న **ఏకైక** ప్రమాణం మనస్సు లేదా బుద్ధి. మనస్సు, బుద్ధి పదాలు ఒకే ప్రమాణాన్ని సూచిస్తాయి.

**మనః – మనుతే జానాతి అనేన ఇతి మనః**

**బుద్ధిః – బుధ్యతే అనయా ఇతి బుద్ధిః**

జ్ఞానం పొందాలంటే దానికి ప్రమాణం మనస్సు లేదా బుద్ధి ఒక్కటే అని అర్థం చేసుకోవాలి. ఆమాటకొస్తే ఒక్క ఆత్మజ్ఞానానికే కాదు, లౌకికంగా కూడా ఏ జ్ఞానం పొందాలన్నా కూడా మనస్సు లేదా బుద్ధి ఒక్కటే మార్గం. అది ఫిజిక్స్ కాని, కెమిస్ట్రీ కాని, ఎకనామిక్స్ కాని, ఉన్నదొకటే మార్గం. లౌకికవిద్యకు బుద్ధిని ఉపయోగించాలి కాని ఆత్మవిద్యను వేరే మార్గం ద్వారా పొందవచ్చు అనుకుంటారు కొంతమంది. ఇది అపోహ మాత్రమే. శాస్త్రం చాలా స్పష్టంగా చెబుతుంది – లౌకికవిద్య పొందాలన్నా, ఆత్మజ్ఞానం పొందాలన్నా కూడా బుద్ధి మాత్రమే ప్రమాణం అని.

**ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యో యస్మిన్ ప్రాణః పంచధా సంవివేశ।** – ముండకమ్ 3.1.9

ఆత్మజ్ఞానాన్ని మనస్సువల్లనే పొందగలము.

**మనసా ఏవ అనుద్రష్టవ్యం నేహ నానాస్తి కించన**

**మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి** – బృహదారణ్యకమ్ 4.4.19

ఆత్మజ్ఞానం పొందిన మనస్సు మాత్రమే ఆత్మ గురించి తెలుసుకోగలదు. ఎవరైతే ఈ జగత్తులో నానాత్వాన్ని దర్శిస్తారో, వారు జనన–మరణ వృత్తంలో పడి తిరుగుతుంటారు.

**ఏష సర్వేషు భూతేషు గూఢోఽఽత్మా న ప్రకాశతే।**

**దృశ్యతే తు అగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః** – కఠ 1.3.12

అన్ని జీవులలోనూ ఉన్న ఆత్మ అందరికీ తెలియదు. అత్యంత సూక్ష్మబుద్ధి ఉన్నవారికి మాత్రమే ఆత్మజ్ఞానం కలుగుతుంది.

**బుద్ధ్యా దృశ్యతే** – బుద్ధి ద్వారానే ఆత్మజ్ఞానాన్ని పొందగలము.

అందువల్ల ఆత్మజ్ఞానం లక్ష్యం; మనస్సు మార్గం.

కాని మీకొక సందేహం కలుగవచ్చు. మనస్సును ఆత్మజ్ఞానం పొందటానికి ప్రమాణంగా ఎలా చెప్పగలము? శాస్త్రమే అనేకచోట్ల మనస్సు ఆత్మను తెలుసుకోలేదు అని వస్తుంది.

**యన్మనసా న మనుతే యేనాహుః మనో మతమ్** – కేన 1.6

ఆత్మను మనస్సు ద్వారా తెలుసుకోలేము, కాని దానివల్లనే మనస్సును తెలుసుకోగలము అని పండితులు అంటారు.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః** – కేన 1.3

ఆత్మ దగ్గరకు కళ్ళు వెళ్ళలేవు, వాక్కు వెళ్ళలేదు, మనస్సు వెళ్ళలేదు.

**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ** – తైత్తిరీయమ్ 2.4.1

వాక్కు, మనస్సు కూడా దేన్నుంచి వస్తాయో అవి దాని గురించి తెలుసుకోలేవు.

ఇలా అనేక మంత్రాలు మనస్సు ద్వారా ఆత్మ గురించి తెలుసుకోలేము అని చెబితే, మనస్సు ద్వారానే తెలుసుకోగలము అని కూడా అనేక మంత్రాలు ఉన్నాయి ఉపనిషత్తుల్లోనే. సహజంగానే ఏ మంత్రాలు సరియైనవి అనే సందేహం మీకు కలుగకమానదు. రెండు వాక్యాలూ సబబే అంటారు గురువులు. అదెలా సాధ్యం? అంటే ఆ వాక్యాల ముందు సరియైన విశేషణాన్ని వేసుకుంటే సబబే అవుతాయి. మనస్సు తెలుసుకోలేదు అంటే అసంస్కృత అంతఃకరణ తెలుసుకోలేదు అని అర్థం. అలాగే మనస్సు మాత్రమే తెలుసుకోగలదు అంటే సంస్కృతమనస్సు మాత్రమే తెలుసుకోగలదు అని అర్థం. అంతేకాదు, మనస్సు సంసిద్ధంగా ఉండాలి. అందువల్లనే దృశ్యతే తు అగ్ర్యయా బుద్ధ్యా అంది కఠోపనిషత్తు. మనస్సు సంసిద్ధంగా ఉండాలి. ఈ విషయాన్ని కృష్ణపరమాత్మే చెప్పాడు కూడా.

**యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ ।**
**యతంతోఽ ప్యకృతాత్మానో నైనం పశ్యంత్యచేతసః ॥** – 15.11

జ్ఞానులు శరీరంలో ఉన్న ఈ బ్రహ్మను జీవాత్మగా తెలుసుకుంటారు. అజ్ఞానులు, వారి మనస్సును శుద్ధి చేసుకోకపోతే, వారు శాస్త్రాన్ని అధ్యయనం చేసినా కూడా, వారికి ఆత్మజ్ఞానం కలుగదు.

అకృతాత్మా అంటే సంస్కరించబడని మనస్సు గలవారు. కృతాత్మా అంటే సంస్కరించబడిన మనస్సు కలవారు. ఆత్మజ్ఞానం పొందాలంటే మనస్సు సంస్కరించబడాలి. అంటే సాధన చతుష్టయ సంపత్తిని పొందాలి. దురదృష్టవశాత్తూ మనం ప్రాకృత అంతఃకరణతో పుట్టాము. అందువల్ల మనం ప్రాకృత అంతఃకరణను సంస్కృత అంతఃకరణగా మలచుకోవాలి.

అలా ఎందుకు మలుచుకోవాలి? మన అంతిమ లక్ష్యం జ్ఞానేన దుఃఖనివృత్తిః. దీన్ని పరమలక్ష్యమని కూడా అంటారు. కాని అంతిమలక్ష్యానికి వెళ్ళేముందు తక్షణ లక్ష్యం ఇంకొకటి ఉంది. అది ప్రాకృత అంతఃకరణను సంస్కృత అంతఃకరణగా మలచుకోవాలి. ఈ మార్పును సంస్కారం అంటారు. అందువల్ల మన తక్షణ సాధన అంతఃకరణ సంస్కారం.

తరువాత సాధన జ్ఞానప్రాప్తికోసం చేస్తాము. ఆ విధంగా మనకు రెండురకాల సాధనలు ఉన్నాయి. సంస్కారప్రాప్త్యర్థ సాధన, జ్ఞానప్రాప్త్యర్థ సాధన. దీనికోసం వేదమే రెండు భాగాలుగా విభజించబడివుంది. వేదపూర్వభాగం, వేదాంతభాగం. వేదపూర్వభాగం సంస్కారాలను బోధిస్తే, వేదాంతభాగం జ్ఞానాన్ని బోధిస్తుంది.

నిజానికి వేదం ఈ సంస్కారాలు పొందటానికి వీలుగా ఒక జీవనవిధానాన్ని నిర్దేశిస్తుంది. అందువల్లనే మన సాంప్రదాయంలో తల్లి గర్భధారణ సమయంనుంచి అనేక ప్రార్థనలు, క్రతువులు ఉన్నాయి. వీటన్నిటిని సంస్కారాలు అంటారు. ఒకవ్యక్తికి తల్లిగర్భంనుంచి స్మశానంవరకు 41 సంస్కారాలు నిర్దేశించింది శాస్త్రం. కళ్యాణం కూడా ఒక సంస్కారమే. అలాగే ఒకవ్యక్తి మరణించాక చేసే కర్మను కూడా దహనసంస్కారం అంటారు. అగ్నికి ఈ శరీరాన్ని ఆహుతిగా వేసి, వచ్చే జన్మలో మంచి జన్మరావాలి, తద్వారా జ్ఞానం పొందాలి అని చెబుతారు.

**అనేకజన్మసంసిద్ధః తతో యాతి పరాం గతిమ్** – 6.45

అనేక జన్మల సంస్కారముల ప్రభావంచేత, ఈ జన్మలోనే సిద్ధిని పొంది, పాపరహితుడై, మోక్షాన్ని పొందుతాడు.

సంస్కారం పొందటానికి సమయం పడుతుంది. జ్ఞానం పొందటానికి ఎక్కువ సమయం పట్టదు. వంట చేయటానికి బోలెడు సమయం పడుతుంది. కూరగాయలు బజారునుంచి తెచ్చుకోవాలి, శుభ్రం చేయాలి, తరగాలి, వండాలి. కాని వండిన వంటను తినటానికి ఎంతో సమయం పట్టదు. అదే విధంగా సంస్కారం పొందటానికి సమయం పడుతుంది. సంస్కారం పొందాక, తత్త్వమసి అనే మహావాక్యాన్ని అర్థం చేసుకోవటానికి ఎంతో సమయం పట్టదు. అదే మనస్సు సంస్కరింపబడకపోతే, ఎంత నేర్చుకున్నా వేదాంతం వంటబట్టదు. అర్థంకాని జ్ఞానాన్ని జీర్ణించుకోలేరు. అందువల్ల ముందు మనస్సును సంస్కరించుకోవాలి.

భగవద్గీతలో 13–15 అధ్యాయాలు జ్ఞానప్రాప్తిని కలుగజేస్తాయి. కాని జ్ఞానం పొందటానికి కావలసిన అర్హతను సంపాదించుకోకుండా జ్ఞానానికి వస్తే, గీత అర్థం కాదు. ఈ విషయం కృష్ణపరమాత్మకు బాగానే తెలుసు. అందువల్ల అర్జునునికి ఈ సమస్య ఉన్నా, లేకపోయినా, అర్జునుని ద్వారా కృష్ణపరమాత్మ మానవాళిని సంసిద్ధం చేయదలుచుకున్నాడు. అందువల్ల పూర్తిగా రెండు అధ్యాయాలను ఈ అంతఃకరణ సంస్కారంకోసం కేటాయించాడు. ఈ సంస్కారం పొందాక, జ్ఞానయోగానికి వస్తే, అప్పుడు జ్ఞానం కలుగుతుంది.

సరే, సంస్కారం అంటున్నారు, సంస్కారం అంటే ఏమిటి? ఏ సంస్కారాన్ని తీసుకున్నా కూడా, దానికి రెండు తతంగాలు ఉంటాయి. దోష అపనయనమ్, గుణ ఆధానమ్. దోష

అపనయనం అంటే అశుద్ధిని తొలగించటం; గుణ ఆధానం అంటే గుణాలను కొత్తగా చేర్చటం. ఉదాహరణకు స్నానం చేసేటప్పుడు సబ్బు, నీరు వాడతారు. అవి వాడటంవల్ల శరీరంమీద ఉన్న మురికి పోతుంది కాబట్టి దాన్ని దోష అపనయనం లేదా మల అపనయనం అంటారు. స్నానం చేసివచ్చాక అద్దం ముందు నిల్చుని, పౌడర్ రాసుకుంటారు, కుంకుమ, చందనం, విభూతి పెట్టుకుంటారు, సెంట్ రాసుకుంటారు. అవన్నీ గుణ ఆధానం కింద వస్తుంది. అలాగే ఇల్లు శుభ్రం చేస్తే అది దోష అపనయనం అవుతుంది; ఇంటికి రంగులు వేస్తే అది గుణ ఆధానం అవుతుంది.

ఇదే సూత్రాన్ని మనస్సుకు కూడా అన్వయించుకోవాలి. మనస్సులో ఉన్న ప్రతికూల ఆలోచనలను, అనారోగ్యకరమైన ఆలోచనలను పారద్రోలటం దోష అపనయనమ్ అంటే, మంచి, ఆరోగ్యకరమైన, సానుకూలమైన ఆలోచనలను పెంపొందించుకోవటాన్ని గుణ ఆధానం అంటారు.

వీటికి కృష్ణపరమాత్మ కొత్త పేర్లు ఇస్తున్నాడు. సానుకూల గుణాలను దైవీసంపత్తి అంటున్నాడు. ఈ గుణాలవల్ల భూమ్మీద ఉన్న మనుష్యులు దైవీగుణాన్ని పెంపొందించు కుంటారు. ప్రయత్నపూర్వకంగా పారద్రోలాల్సిన ప్రతికూల గుణాలను ఆసురీసంపత్తి అంటారు. ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ మనం పెంపొందించుకోవాల్సిన దైవీసంపత్తిని, మనం పారద్రోలాల్సిన ఆసురీసంపత్తిని వివరిస్తున్నాడు. అందువల్ల ఈ అధ్యాయాన్ని దైవాసురసంపద్విభాగ యోగము అంటారు. ఇది వేదాంతభాగంలో రాదు; వేదపూర్వభాగంలోకి వస్తుంది. అంటే ఇది జ్ఞానకాండలోకి రాదు; ధర్మశాస్త్రంలోకి వస్తుంది. కృష్ణపరమాత్మ వాటి ప్రత్యేకత గురించి కూడా చెబుతున్నాడు.

**దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా** – 16.5

దైవీసంపద ముక్తిదాయకం, ఆసురీసంపద బంధహేతువు.

దైవీసంపత్తి జ్ఞానాన్ని పెంపొందింపజేసి, మోక్షం రావటానికి తోడ్పడుతుంది. ఇది ఒక ఉత్ప్రేరకంగా తోడ్పడుతుంది. దానికి భిన్నంగా ఆసురీసంపత్తికి ప్రతికూల ప్రభావం ఉంటుంది. అది మిమ్మల్ని కిందికి లాగుతుంది. మిమ్మల్ని వెనక్కు లాగుతుంది. 'అందువల్ల అర్జునా, ఏది మంచో, ఏది చెడో తెలుసుకోవాలి నువ్వు,' అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నిజానికి కృష్ణపరమాత్మ ఏది మంచో, ఏది చెడో ప్రత్యేకించి ఒక పట్టికను ఇవ్వనవసరం లేదు. కొంచెం ఇంగితజ్ఞానం ఉపయోగిస్తే, ఏ విలువలను పాటించాలో, వేటిని పారద్రోలాలో మీకే తెలుస్తుంది. మిమ్మల్ని ఒక పట్టిక తయారుచేయమంటే మీరు అతి సులువుగా తయారు చేయగలరు. దానికోసం గీతలో ఈ అధ్యాయందాకా రానవసరం లేదు.

**శ్రూయతాం ధర్మసర్వస్వం శ్రుత్వా చైవావధార్యతామ్ ।**
**ఆత్మనః ప్రతికూలాని పరేషాం న సమాచరేత్ ॥ –** పంచతంత్రం

ఈ సలహాను జాగ్రత్తగా విని, దాని సారాంశాన్ని అర్థం చేసుకోండి. ఎదుటివారు చేసినదానిలో మీకు ఏది బాధ కలిగిస్తుందో, దాన్ని మీరు ఎదుటివారికి చేయకూడదు. అదే ధర్మమంటే.

మీరేం పనులు చేయాలి? ఎదుటివారు మీకేమి చేయాలని మీరు ఆశిస్తారో, వాటిని మీరు చేయాలి. మామూలుగా ఎవరైనా కోరుకునేది ఏమిటి? 'ఇతరులు నన్నే ప్రేమించాలి; ఇతరులు నామీద దయచూపాలి; వారు సత్ప్రవర్తన కలిగివుండాలి; వారు నాకు సహాయం చేయాలి.' మీరెలాగైతే ఇవి కోరుకుంటారో, అవే ఇతరులు కూడా కోరుకుంటారని అర్థం చేసుకుని మీరు అవి చేయాలి.

మరయితే, ఏవి చేయకూడదు? జవాబు చాలా తేలిక! ఏదైతే మీకు ఇతరులు చేయకూడదనుకుంటారో, అవి మీరు ఇతరులకు చేయకూడదు. మీరు సాధారణంగా ఇతరులు మీకు చేయకూడదు అనుకునేవి ఏవి? 'ఇతరులు నన్ను అవమానపరచకూడదు; నన్ను విమర్శించకూడదు; నామీద అరవకూడదు, నన్ను ద్వేషించకూడదు.' సహజంగానే ఇతరులు కూడా మీరు ఈ పనులు చేయకూడదని ఆశిస్తారు కాబట్టి, మీరు కూడా ఆ పనులు అసలు చేయకూడదు. మీరు ఇతరులకు చేసే మంచిపనులు దైవీసంపత్తి, చేయకూడని చెడుపనులు ఆసురీసంపత్తి. ఇదీ వీటి గురించిన సామాన్యసూత్రం. కాని కృష్ణపరమాత్మ మనమీద ఉన్న మహత్తరమైన ప్రేమకొద్దీ, దైవీసంపత్తికీ, ఆసురీసంపత్తికీ పెద్ద పట్టికనే ఇస్తున్నాడు.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా రెండు అంశాలుగా చూడవచ్చు. అవి –

1. దైవీసంపత్తి : శ్లోకాలు 1–3
2. ఆసురీసంపత్తి : శ్లోకాలు 4–21

**1. దైవీసంపత్తి : శ్లోకాలు 1–3**

**శ్రీ భగవాన్ ఉవాచ**

**అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః ।**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥** – 16.1
**అహింసా సత్యమక్రోధః త్యాగః శాంతిరపైశునమ్ ।**
**దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥** – 16.2
**తేజః క్షమా ధృతిః శౌచమ్ అద్రోహో నాతిమానితా ।**

**భవంతి సంపదం దైవీమ్ అభిజాతస్య భారత ॥** – 16.3

ఈ మొదటి మూడు శ్లోకాల్లో కృష్ణపరమాత్మ 26 విలువలను పేర్కొన్నాడు. అభయం, సత్త్వసంశుద్ధి, జ్ఞానయోగ వ్యవస్థితి, దానం, దమం, యజ్ఞం, స్వాధ్యాయం, తపస్సు, ఆర్జవం, అహింస, సత్యం, అక్రోధం, త్యాగం, శాంతి, అపైశునమ్, దయాభూతేషు, అలోలుప్త్వం, మార్దవం, హ్రీ, అచాపలం, తేజస్సు, క్షమ, ధృతి, శౌచం, అద్రోహం, నాతిమానితా. ఈ 26 విలువలూ దైవీసంపత్తి ఉన్నవ్యక్తిలో ఉంటాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మనం వీటిలో ఆరు ముఖ్యమైన విలువలను మాత్రమే వివరంగా చూద్దాము. అవి పెంపొందించుకుంటే, దైవీసంపత్తి పెరిగితీరుతుంది. ఆ ఆరు – అభయం, దమం, ఆర్జవం, నాతిమానితం, శౌచం, దయాభూతేషు. వీటిని ఒక్కొక్కటిగా చూద్దాము.

1. **అభయం** – అభయం అంటే ధైర్యం, ఆత్మస్థైర్యం. ఈ అభయం విలువ అనే పునాది మీద తక్కిన ఆధ్యాత్మిక సాధనలు పెంపొందించుకోవచ్చు. మీమీద మీకు నమ్మకం లేకపోతే, జీవితంలో ఏదీ సాధించలేరు. మీమీద మీకు నమ్మకం ఉంటేనే మీరు ఏదైనా సాధించగలరు.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్** – 6.5

ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి.

ప్రతి మనిషికీ నాలుగు కృపలు ఉంటాయి. అవి – దైవకృప, శాస్త్రకృప, గురుకృప, ఆత్మకృప. మొదటి మూడూ తేలికగానే వస్తాయి కాని ఆత్మకృపే ఉండదు చాలామందికి. మీమీద మీకు నమ్మకం లేకపోతే, భగవంతుడు మీకు సహాయం చేయటానికి సిద్ధంగా ఉన్నా కూడా, మీరేమీ సాధించలేరు. మీరు ప్రతిదీ విధి మీద తోసేసి, ప్రతిదీ విమర్శిస్తూ ప్రతికూల ఆలోచనలతో ఉంటారు.

చివరికి మీరు ఆరోగ్యకరమైన జీవనం గడపాలన్నాకూడ, మీరు సానుకూలంగా ఆలోచించాలి. ఈ మాట వైద్యులు కూడా చెబుతారు. ఎవరికైతే డాక్టరుమీద, వారు ఇచ్చే మందుమీద నమ్మకం ఉంటుందో, ఎవరైతే ఈ వైద్యంవల్ల నేను బాగా కోలుకుంటాను అని నమ్ముతారో, వారిలో రోగనిరోధకశక్తి బాగుంటుంది. ఇది వారు ఊరికే చెప్పటంలేదు. వారు సర్వే చేసి మరీ ఈ విషయాన్ని నిరూపించారు. సానుకూల ఆలోచన ఉన్నవారికి రోగనిరోధకశక్తి ఎక్కువగా ఉంటే, ప్రతికూల ఆలోచన చేసేవారికి రోగనిరోధకశక్తి బలహీనంగా ఉంటుంది.

మానసికంగానే కాదు, శారీరకంగా కూడా ఆత్మస్థైర్యం కావాలి. అందువల్లనే కృష్ణపరమాత్మ ఓం ప్రథమంగా ఈ అభయం విలువతో దైవీసంపత్తిని మొదలుపెట్టాడు. మీమీద మీరు నమ్మకం పెట్టుకోండి; మీ ఆత్మస్థైర్యాన్ని పెంచుకోండి అంటున్నాడు. అంతేకాదు,

నేను నామీద నమ్మకం పెంచుకోలేను బాబో అని అంటే, కృష్ణపరమాత్మ పదేపదే చెబుతున్నాడు– మీకు నమ్మకం లేకపోతే, నన్ను ఆశ్రయించండి అంటున్నాడు.

**మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి।** –18.58

నువ్వు ఎప్పటికీ నామీదే మనస్సును నిలిపితే, నా అనుగ్రహంవల్ల సమస్త సమస్యలనుంచి అనాయాసంగా బయటపడగలవు.

మీరు నడవటానికి ప్రయత్నిస్తే, ఎవరైనా చేయూతనిస్తారు. మీరసలు ప్రయత్నమే చేయకపోతే, ఎవరైనా ఎలా ముందుకు తోయగలరు? అందువల్ల మీరొక శుభారంభం చేయండి, తక్కినవన్నీ వాటంతట అవే జరిగిపోతాయి. ఎక్కడో ఒకచోట ఆరంభించండి. అందువల్ల మొట్టమొదటి విలువ అభయం. అభయం అంటే ధైర్యం, ఆత్మస్థైర్యం, ఓడిపోతాననే భయంనుంచి విముక్తి. ఆరంభించాలి, ఆగకుండా కొనసాగాలి. ఈ పట్టువదలని దృఢసంకల్పంతో ఏది ఎదురొచ్చినా చివరిదాకా సాగి, ఫలితం పొందినవాటిలో భగీరథుని ప్రయత్నం, అమృతమథనం ముఖ్యమైన నిదర్శనాలు.

2. **దమం** – దమం అంటే ఇంద్రియనిగ్రహం. భగవంతుడు మనను 19 అంగాలతో దీవించాడు. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు. మనిషికి మాత్రమే ఇవి ప్రత్యేకంగా ఉన్నాయి. ఎవరో ఈ విషయాన్ని అద్భుతంగా వర్ణించారు.

**మహతా పుణ్యపుణ్యేన క్రీతేయం కాయనౌస్త్వయా ।**
**పారం దుఃఖోదధేర్గంతుం తర యావన్న భిద్యతే ॥**

ఎంతో గొప్ప పుణ్యం చేసుకోవటంవల్ల మనకు ఈ మనుష్య శరీరమనే పడవ ఇవ్వబడింది. ఈ శరీరమనే పడవతో మనం గమ్యాన్ని చేరుకోవాలి.

భగవంతుడు ఇచ్చిన ఈ స్థూలశరీరంతో మోక్షంకోసం ప్రయత్నించాలి. మనుష్యులు మాత్రమే ప్రయత్నించగలరు; జంతువులు ప్రయత్నించలేవు. అంతేకాదు, మనకిచ్చిన ఈ 19 అంగాలను మనం అదుపులో పెట్టుకోవాలి. ఆ అంగాలను కరణాలు అంటారు. మనను కర్త అంటారు. కర్త అయిన మనం, కరణాలను అదుపులో పెట్టుకోవాలి కాని, కరణాలు మనను అదుపులో పెట్టకూడదు.

కొంతమంది వారి కుక్కలను తీసుకుని వాహ్యాళికి వెళతారు. ఒక్కోసారి వారి కుక్క వారికన్నా వేగంగా ముందుకు పరిగెడుతూ, వారిని తనవెంట పరుగులు తీయిస్తుంది. అప్పుడు వారి పరిస్థితి చూస్తే, వారు కుక్కను తీసుకెళుతున్నారో, కుక్కే వారిని నడిపిస్తోందో అర్థంకాదు! మన కరణాల విషయంలో అలా జరగకూడదు! వీటిని అదుపులో పెట్టటానికి

మనకు అనేక వ్రతాలు, తపస్సులు నిర్దేశించింది శాస్త్రం. మన స్థూలశరీరాన్ని నియంత్రించుకోవాలి; మాటలను నియంత్రించుకోవాలి; ఇంద్రియాలను నియంత్రించుకోవాలి; ఆలోచనలను నియంత్రించుకోవాలి. ఇవన్నీ చేయాలి.

**బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః ।**
**అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ ॥** – 6.6

మనస్సును, ఇంద్రియాలను, శరీరాన్ని జయించిన జీవుడు తనకు తానే మిత్రుడు. అలా జయించనివ్యక్తి తనకు తానే శత్రువు.

మీ మనశ్శరీరాలే మీకు మిత్రులు; మీ మనశ్శరీరాలే మీకు శత్రువులు కూడా. ఆరోగ్యకరమైన శరీరం ఉంటే అది మీ స్నేహితుడు; అనారోగ్యకరమైన శరీరం మిమ్మల్ని బాధిస్తుంది కాబట్టి, అది మీకు శత్రువు. అలాగే ఆనందంగా, విశ్రాంతిగా ఉన్న మనస్సు మీకు స్నేహితుడు; అది అద్భుతాలు సాధించగలదు. కాని నిరాశతో కృంగిపోయిన మనస్సు, భారంగా ఉన్న మనస్సు, చిరాకుగా ఉన్న మనస్సు, అసహనంగా ఉన్న మనస్సు మీకు శత్రువు అవుతుంది. అశాంతస్య మనోభావః.

అలాగని వీటిని అణగద్రొక్కకూడదు. అలా అణగద్రొక్కితే అది బలవంతమవుతుంది. నిగ్రహం పాటిస్తే అవి ఆరోగ్యకరంగా ఉంటాయి. వాటిని సానుకూలంగా నిగ్రహించుకోవటానికి పతంజలి అష్టాంగయోగం ఉంది.

3. **ఆర్జవం** – ఆర్జవం అంటే త్రికరణశుద్ధిగా ఉండటం. మనస్సు, వాక్కు, కర్మ – ఈ మూడూ ఒక్కత్రాటిమీద నడవాలి. అంటే మనస్సు ఆలోచించేదే వాక్కు రూపేణ బయటకు రావాలి; వాక్కు చెప్పినదే కర్మగా ఆచరించాలి. దీన్ని మనోవాక్కాయ కర్మలు అంటారు.

దీనికి ఉదాహరణ ఒక సంగీతకచేరీ. ఒక సంగీతకచేరీలో సంగీతవిద్వాంసుడు పాట పాడితే, దానికి అనుగుణంగా ఫిడేలు, మృదంగాలను ఆయా రంగాల్లో నిష్ణాతులు పలికిస్తారు. అన్నీ ఒక్కతాళంగా ఉండాలి. సంగీత విద్వాంసుడు ఆదితాళం పాడితే, ఫిడేలు పలికించే వ్యక్తి రూపకతాళంలో పలికిస్తే, మృదంగం వాయించే వ్యక్తి త్రిపుటతాళంలో వాయిస్తే, ఆ పాట ఎలా ఉంటుంది? కర్ణకఠోరంగా ఉంటుంది. ఎన్ని వాయిద్యాలు ఉన్నా, అన్నీ ఒక్క తాళంలో, ఒక్క శ్రుతిలో సాగాలి. అప్పుడే పాట రసరమ్యంగా ఉంటుంది.

ఈ సూత్రం మీ జీవితమనే సంగీతకచేరీకి కూడా వర్తిస్తుంది. మీ బుద్ధి ఒక విషయంలో నిర్ణయం తీసుకోవాలి; మీ మనస్సు సహకరించాలి; మీ ఇంద్రియాలు ఆచరణలో పెట్టాలి. ఉదాహరణకు, స్వామీజీ చెప్పే బోధకు వెళ్ళాలని మీ బుద్ధి నిర్ణయం తీసుకుంది.

మీ కర్మేంద్రియాలు మిమ్మల్ని బోధకు తీసుకువెళ్ళాయి; కాని మీ మనస్సు మీ చెవుల వెనక లేదు. అది ఇంట్లోనో, ఇంట్లో ఉన్న సమస్యలతోనో చిక్కుకుపోయింది. ఫలితం? మీ శరీరమే అక్కడ ఉంది కాని, మనస్సు లేదు. మనస్సు లేకపోతే వినలేరు. విన్నా అర్థంకాదు.

అందువల్ల ఈ అంగాలన్నీ ఏకత్రాటిమీద నడిస్తే దాన్ని ఆర్జవం అంటారు. దానికి భిన్నంగా అవి భిన్నమార్గాల్లో పరుగులు తీస్తుంటే, లోపల విపరీతమైన ఒత్తిడి ఏర్పడుతుంది. ఈ ఒత్తిడి మీరు చేతులారా చేసుకుంటున్నది. దీనివల్ల అనారోగ్యం ఏర్పడుతుంది. అందువల్ల ఆర్జవం పెంపొందించుకోవాలి.

4. **నాతిమానితా** – నాతిమానితా అంటే అమానిత్వం లేదా గర్వం లేకపోవటం. అభయం (ఆత్మస్థైర్యం), ఆర్జవం, దమం (ఇంద్రియ నిగ్రహం) – ఈ మూడూ పెంపొందించుకుంటే, జీవితంలో ఏదైనా సాధించవచ్చు. ఈ విలువలు విజయాన్ని తెచ్చిపెడతాయి. కాని వీటితో పాటు ఇంకొక విలువ పాటించకపోతే, ఈ విజయం తలకెక్కుతుంది. అంటే గర్వాన్ని తెచ్చిపెడుతుంది. అలా విజయం సాధించినప్పుడు, మీరు ఒక విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలి. ఏమిటది? ఈ విజయం మీ ఒక్కరిదీ కాదు, అనేకమంది సహాయ సహకారాల వల్ల వచ్చింది; అనేక అంశాలు తోడవటంవల్ల వచ్చింది. తోటిమనుష్యుల సహకారం లేకపోతేనూ, భగవంతుని కృప లేకపోతేనూ ఏమీ సాధించలేరు. అందువల్ల మీరు ఏ విజయం సాధించినా అది మీ ఒక్కరివల్లనే పొందలేదు అని అర్థం చేసుకోవాలి.

ఇలా గర్వం వచ్చినప్పుడల్లా గర్వభంగ కథలు వింటూ ఉంటాము. కేనోపనిషత్తులో దేవతలకు ఒకసారి గర్వం వస్తుంది. రాక్షసులతో యుద్ధం చేసి గెలిచారు. తమవల్లనే గెలిచాము అని ఎవరికి వారే అనుకుంటారు. భగవంతుడు యక్షునిరూపంలో ప్రత్యక్షమై, వారికి గర్వభంగాన్ని కలుగజేస్తాడు. అన్నింటినీ కాల్చివేసే శక్తి ఉన్న అగ్నిని ఒక చిన్న ఎండుగడ్డి పరకను కాల్చమంటే, కొంచెం కూడా కాల్చలేకపోయాడు. అప్పుడు అగ్నికి తనకున్న దహించివేసే శక్తి తనది మాత్రమే కాదనీ, భగవంతుని కృప అనీ అర్థమవుతుంది. అలాగే అన్నింటినీ గాలిలోకి లేపే వాయువు, అదే ఎండుగడ్డి పరకను కొంచెం కూడా లేపలేకపోయాడు. అప్పుడు వాయువుకు కూడా తన శక్తి తనది మాత్రమే కాదని, భగవంతుని కృప అనీ అర్థమవుతుంది. అందువల్ల నాతిమానితా అనే విలువను కూడా పెంపొందించుకోవాలి.

5. **శాంతి** – శాంతి అంటే ప్రశాంతమైన మనస్సు; ఒత్తిడి, ఆందోళనలు లేని మనస్సు. మనస్సు శుద్ధంగా ఉండాలి. అంటే మనస్సులో వచ్చే ఆలోచనలు మంచివిగా ఉండాలి. చేసే పనుల వెనుక ప్రేరణ కూడా మంచిదిగా ఉండాలి. ఆలోచనలు శుద్ధంగా ఉన్నాయో లేవో ఎలా తెలుస్తుంది? ప్రస్తుతం, మీ ఆలోచనలు మీకు మాత్రమే తెలుసు. అందువల్ల

మీరు ప్రశాంతంగా ఉన్నారు. మీలో ఏ ఆలోచన రేగినా ఫర్వాలేదు అనుకుంటారు.

కాని, హఠాత్తుగా మీ మనస్సులో కలుగుతున్న ఆలోచనలన్నీ అసంకల్పితంగా అచ్చు వేయబడి, నలుగురికీ పంచబడ్డాయనుకోండి! అప్పుడెలా ఉంటుంది మీ పరిస్థితి? నిజానికి మీ ఆలోచనలన్నీ భగవంతునికి తెలుసు. మీ ఆలోచనలను ఎవరినుంచైనా దాచగలరేమో కాని, భగవంతుని దృష్టినుంచి తప్పించుకోలేరు. కాని మీ ఆలోచనలు ఇలా రూపు దిద్దుకుంటున్నాయో లేదో అని బయటకు వచ్చి, ఇతరులకు తెలిసిపోతున్నాయనుకోండి. వీటిలో ఎన్ని ఆలోచనలు బయటకు వచ్చినా ఫర్వాలేదు అనుకుంటున్నారు?

మనస్సు ఎంత అశుద్ధంగా ఉంటే, అంత ఎక్కువగా ఉంటాయి నలుగురితో పంచుకోలేని ఆలోచనలు! దానికి భిన్నంగా మనస్సు ఎంత శుద్ధంగా ఉంటే, అంత ఎక్కువగా మీ ఆలోచనలను పంచుకోగలరు! మీ మనస్సు తెల్లకాగితంలా స్వచ్ఛంగా, శుద్ధంగా ఉంటే, మీ ఆలోచనలన్నీ అచ్చువేయబడినా, నలుగురికీ చాటిచెప్పబడినా, మీరేమీ బెంబేలెత్తిపోరు. దీన్ని శుద్ధ అంతఃకరణం అంటారు.

ఆత్మజ్ఞానం పొందటానికి ఈ శుద్ధ అంతఃకరణం ఉండాలి. ఒక్క చెడు ఆలోచన కూడా ఉండకూడదు. ఇలా మనస్సును నిగ్రహించుకోవటాన్ని శమం అనికూడా అంటారు. శమం పెంపొందించుకోవటం చాలా కష్టం. కాని పాటించాల్సిన మంచి విలువ. ఎందుకంటే శమం పాటిస్తే కలిగే **శాంతి** మాటల్లో వర్ణించలేనంత అద్భుతంగా ఉంటుంది.

6. **దయాభూతేషు** – దయ అంటే జాలి; భూతేషు అంటే తోటి మానవులే కాదు, సర్వప్రాణకోటి. అంటే జంతువులు, చెట్లమీద కూడా జాలి చూపించాలి. ఇది చాలా ముఖ్యమైన విలువ. ఎదుటివ్యక్తి భావాలకు విలువనివ్వటం నేర్చుకుంటారు ఈ విలువను పెంపొందించుకుంటే. సాధారణంగా ఎదుటివ్యక్తి భావాలను మనం అంతగా పట్టించుకోము. అతను అసహనంగా ఉన్నాడో, కోపంగా ఉన్నాడో, నిరాశానిస్పృహలతో ఉన్నాడో, దుఃఖంతో ఉన్నాడో తెలియదు.

కాని మనస్సుకు సున్నితత్వం పెంపొందించుకున్నకొద్దీ, ఎదుటివారిలోని సున్నితభావాలు కూడా తెలుస్తూ వస్తాయి. ఎదుటివారు బాధపడుతున్నారని తెలిస్తే, సహజంగానే మీరు వారికి ఎన్నడూ హానిచేయరు. ఎందుకంటే వారు బాధపడుతుంటే మీకు కూడా ఆ బాధ తెలుస్తుంది. అలా ఎదుటివ్యక్తి కష్టానికి స్పందించగలగటానికి చాలా సున్నితమైన మనస్సు ఉండాలి. అలా దయ ఉంటే మీరు సానుభూతి బాగా చూపించగలరు. సానుభూతితో ఎదుటివారి కష్టనష్టాలను ఓపికగా వినగలరు. వారి దుఃఖంలో పాలుపంచుకోగలరు. అంతేకాదు, వారి బాధ మీ ముఖంలో ప్రతిబింబిస్తుంది.

ఆనందాన్ని పంచుకుంటే రెట్టింపు అవుతుంది; దుఃఖాన్ని పంచుకుంటే సగం భారం తీరుతుంది. మానసిక నిపుణులు ఇతరుల కష్టాలను మనం వినాలని చెబుతారు. నిజానికి ఎవరికైనా వారి బాధలను సానుభూతితో విని, నాలుగు ఓదార్పు మాటలు పలికి, స్నేహభావంతో అక్కున చేర్చుకునేవారుంటే, వారి బాధ తీవ్రత చాలా తగ్గుతుంది. అందువల్ల మీరు ఇతరుల బాధను పంచుకోవాలి.

నాకంత మంచిమనస్సు లేదు, నేనెవరి కష్టసుఖాలను పంచుకోను, నాకది ఇబ్బందిగా ఉంటుంది అంటే మరేం ఫర్వాలేదు, కనీసం వారికి ఉన్న బాధకు తోడు, అదనంగా బాధను పెంచకండి. ఎవరినీ మీరు పనికట్టుకుని కష్టపెట్టకూడదు. ఈ దయాగుణం చాలా ముఖ్యమైన విలువ. ముఖ్యంగా గృహస్థు ఈ విలువను పెంచుకోవాలి. ఎందుకంటే అతను నలుగురి మధ్యలో మసలాలి. ఎవరినీ బాధపెట్టకుండా మసలాలి.

కృష్ణపరమాత్మ ఈ విలువను దయాభూతేషు అన్నాడు. దయ అంటే జాలి అని చూశాము. మనుష్యేషు అనలేదు కృష్ణపరమాత్మ; భూతేషు అన్నాడు. అంటే మనుష్యులమీదే కాదు, తోటిప్రాణులన్నింటిమీద దయ చూపాలి. జంతువులు, చెట్లమీద కూడా దయ చూపాలి. అకారణంగా ఒక చెట్టునుంచి ఆకును కూడా కోయకూడదు. ఇలా తక్కిన ప్రాణుల గురించి సున్నితంగా ఆలోచించగలగటం చాలా విలువైన విలువ.

ఒక **విలువ**కు మీరు **విలువ** ఇస్తేనే, ఆ **విలువ**కు **విలువ** ఉంటుంది. అందువల్ల మంచి విలువలు పెంపొందించుకోవాలి. కృష్ణపరమాత్మ 26 విలువలు చెబితే, మనం ఆరు చూశాము. అవి పెంచుకున్నా చాలామటుకు విలువలు పాటించినట్టే అవుతుంది. ఈ విలువలను ఇక్కడ కృష్ణపరమాత్మ దైవీసంపత్తి అంటున్నాడు.

**2. ఆసురీసంపత్తి : శ్లోకాలు 4–21**– దీని తరువాత కృష్ణపరమాత్మ ఆసురీసంపత్తి గురించి కూడా విపులంగా చర్చించాడు. కాని అందులో కూడా మనకు బాగా తెలిసిన ఆరు విలువలను గురించి చూద్దాము. వాటిని అరిషడ్వర్గాలు అంటారు. అవి ఆంతర శత్రువులు. అవి మన దేశంలో మన మధ్యలో ఉన్న టెర్రరిస్టులతో సమానం. పొరుగు దేశాలు మనమీద యుద్ధానికి వస్తే, వారితో పోరాడి గెలవటం తేలిక. కాని మన దేశంలోనే దేశవిరోధులు ఏర్పడి, దేశానికి హాని కలుగజేస్తుంటే, వారిని గుర్తుపట్టటం, వారిని మట్టుపెట్టటం చాలా కష్టం. అందువల్ల కృష్ణపరమాత్మ ఇంతవరకూ బాహ్యాశత్రువులతో పోరాడింది చాలు; ఇకనైనా ఆంతర శత్రువులను ఎదుర్కోవటానికి ప్రయత్నించండి అంటున్నాడు. ఆంతర శత్రువులైన ఈ అరిషడ్వర్గాలు ఏమిటి? అవి కామ,క్రోధ,లోభ,మోహ,మద,మాత్సర్యాలు. వాటిని వివరంగా చూద్దాము.

1. **కామం** – కామం అంటే కోరిక.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥** – 3.37

కోరిక రజోగుణంనుంచి పుడుతుంది. కోరిక తీరకపోతే క్రోధరూపాన్ని దాలుస్తుంది. కోపం వస్తే పాపం చేస్తారు. ఈ రెండూ నీ శత్రువులని తెలుసుకో అన్నాడు కృష్ణపరమాత్మ.

కోరికను శత్రువు అని రెండు కారణాలవల్ల చెప్పవచ్చు. కోరిక తీరకపోతే అది క్రోధానికి దారితీస్తుంది. అది **కామాత్ క్రోధోఽభి జాయతే**.

ఒకవేళ కోరిక తీరినా ప్రమాదమే! అది లోభానికి దారితీస్తుంది.

**నిఃస్వో వష్టిశతం శతీ దశశతం లక్షం సహస్రాధిపః**
**లకేశః క్షితిపాలతాం క్షితిపతిః చక్రేశతాం వాంఛతి।**
**చక్రేశః పునరింద్రతాం సురపతిః బ్రహ్మాస్పదం వాంఛతి**
**బ్రహ్మా విష్ణుపదం హరిః హరపదం తృష్ణావధిం కో గతః॥**

– సుభాషితరత్న భాండాగారం, తృష్ణనిందా 50.

తన చేతిలో చిల్లిగవ్వలేని వ్యక్తి వందరూపాయలు కోరతాడు; వందరూపాయలు ఉన్నవ్యక్తి వెయ్యిరూపాయలు కోరతాడు; వెయ్యి రూపాయలు ఉన్నవ్యక్తి లక్షలు కోరతాడు; లక్షాధికారి చిన్నరాజ్యానికి రాజవాలనుకుంటాడు; రాజు చక్రవర్తి కావాలనుకుంటాడు; చక్రవర్తి ఇంద్రపదవి కోరుకుంటాడు; ఇంద్రుడు బ్రహ్మపదవి కోరుకుంటాడు; బ్రహ్మ విష్ణువు అవాలనుకుంటే, విష్ణువు శివుడవాలనుకుంటారు.

దీని సారం – ఎంత పొందినా ఎవరికీ తృప్తిలేదు. రమణమహర్షి దీన్ని చక్కగా వర్ణించారు.

**కృతి మహోదధౌ పతనకారణం ఫలమశాశ్వతం గతినిరోధకమ్** – ఉపదేశసారం 21

కోరిక ఒక ఊబిలో పడేస్తుంది. దాన్నుంచి ఎలా బయటపడాలో తెలియదు. అందువల్ల కోరిక ఒక శత్రువు. ఈ కోరికను జయించటమెలా?

ఎ) **ధర్మ వ్యతిరేక కోరికలను పారద్రోలాలి.** అంటే అనైతిక, అధార్మిక, చట్టవ్యతిరిక్త కోరికలు ఉండకూడదు. వాటిని పారద్రోలాలి. దాని తరువాత, చట్టపరమైన కోరికలైనా సరే, అవి మితిమీరి ఉంటే, వాటిని కూడా పారద్రోలాలి. ఎందుకంటే ఎంతసేపూ కోరికలే తీర్చుకుంటూపోతే, ఆధ్యాత్మిక సాధనకు తీరిక ఉండదు సరికదా, ప్రాథమిక విధులని కూడా నిర్వర్తించలేరు.

**యల్లభసే నిజకర్మోపాత్తం విత్తం తేన వినోదయ చిత్తమ్ –** భజగోవిందమ్ 2

ధార్మికమైన సంపాదనతో నీకు ప్రాప్తించిన ధనంతో తృప్తిపడి ఆనందంగా జీవించు.

బి) **కోరికలను తగ్గించుకోవాలి** – ఆధ్యాత్మికమైన జీవనాన్ని మానకుండా, మీకు అందుబాటులో ఉన్న ఖాళీ సమయంలో, మీకున్న చట్టపరమైన కోరికలు తీర్చుకోండి. అక్కడితో ఆగండి. మితిమీరిన కోరికలు పెంచుకోకండి. చట్టవిరుద్ధమైన కోరికల జోలికి పోకండి. మీ కోరికలు మంచివే అయినా, అవి మీరు చేసితీరాల్సిన నిత్యనైమిత్తిక కర్మలకు అడ్డు రాకూడదు. కోరికలను తగ్గించుకోవాలి. ఇది రెండవ దశ.

సి) **కోరికలు బంధించకూడదు** – చట్టపరమైన కోరికలే ఉన్నా, కోరికలను తగ్గించుకున్నా కూడా, ఆ కోరికలు మిమ్మల్ని బంధించేవిగా ఉండకూడదు. మీరు ఆశించిన కోరికలు తీరితే, దాన్ని ఈశ్వరకృపగా భావించి ఆనందించండి. ఒకవేళ తీరకపోయినా, దాన్నికూడా ఈశ్వరప్రసాదంగా భావించి, ఆనందించండి. అప్పుడు కోరికలు మిమ్మల్ని బంధించవు. అలా కోరికలు బంధించకుండా ఉండేలా చేసుకుంటే, కోరికలకు అతీతంగా ఎదిగినట్టు అవుతుంది.

ఈ మూడు దశల ద్వారా – చట్టవ్యతిరేకమైన కోరికలను పారద్రోలాలి; కోరికలు తగ్గించుకోవాలి; కోరికలు బంధించకూడదు – కామాన్ని జయించగలరు.

2. **క్రోధం** – క్రోధం అంటే కోపం. కోపం మీకు శత్రువు. ఎందుకంటే కోపం అనేక ప్రతికూల పరిణామాలకు దారితీస్తుంది.

ఎ) **హింస** – మొట్టమొదటి ప్రతికూల పరిణామం **హింస**. కోపంతో ఊగిపోతున్న వ్యక్తికి విచక్షణాజ్ఞానం ఉండదు. అతను ఇతరులను హింసిస్తాడు. ఆ హింస మాటలతో కావచ్చు, శారీరకంగా కావచ్చు. ఎలా హింసించినా హింస హింసే! అది పాపకర్మ.

**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్** –3.37

అని ఇప్పుడే చూశాము. అందువల్ల కోపం పాపానికి దారితీస్తుంది.

బి) **అన్యాయం** – కోపం అన్యాయానికి దారితీస్తుంది. ఎందుకంటే మీరు కోపంలో ఎలా ప్రవర్తించినా అది అనాలోచితంగా చేసిన చర్యే అవుతుంది కాని ఆచితూచి వేసిన అడుగు కాదు. కోపంలో మండిపడుతుండగా అప్పటికప్పుడు ఏది తోస్తే, అది చేస్తారు. అందువల్ల ఎవరినైనా అప్పుడు శిక్షిస్తే అవసరాన్ని మించి శిక్షిస్తారు. అసలు శిక్షే అవసరం లేనిచోట శిక్షిస్తారు లేదా చిన్న శిక్షతో సరిపోయేదానికి పెద్ద శిక్ష వేస్తారు. ఇదంతా అన్యాయం కిందికి వస్తుంది.

న్యాయంగా శిక్షించటానికి మనకు కోర్టులు ఉన్నాయి. కోర్టు నియమము – నేరస్థుడు తప్పించుకోవచ్చు కాని మంచివానికి అన్యాయంగా శిక్ష పడకూడదు. అందువల్లనే సుదీర్ఘమైన వాదోపవాదాలు వినటం జరుగుతుంది. ఒకవేళ ఆ ముద్దాయి తప్పు చేసినట్టు నిరూపణ అయి, అతన్ని శిక్షించాల్సివచ్చినా అది 'న్యాయం'గా ఉండాలి. అంటే అతనికి కేవలం జైలుశిక్ష విధించాల్సి ఉంటే, కఠిన కారాగారశిక్ష విధించకూడదు. అందువల్ల కోపం ఉన్న చోట విచక్షణాశక్తి పోతుంది, అన్యాయం పొడసూపుతుంది. అది మళ్ళీ పాపానికి దారితీస్తుంది.

సి) **నాశనం** – మూడవ ప్రతికూల పరిణామం కోపం నాశనానికి దారితీస్తుంది. కోపం తీవ్రరూపం దాలిస్తే, అది శరీరానికి కూడా పాకుతుంది. అంతేకాదు, ఎదుటివ్యక్తిని శారీరకంగా హింసిస్తారు. అలా శారీరక కోపం శారీరక నాశనానికి దారితీస్తుంది. అంతేకాదు, తీవ్రమైన కోపం అనుబంధాలను కూలదోస్తుంది. బంధుత్వాలు రాత్రికి రాత్రి ఏర్పడవు. ఎంతో కష్టపడి, ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తే పటిష్టంగా నిలబడతాయి కొన్ని అనుబంధాలు. అది స్నేహబంధం అవనీ, కుటుంబ బంధం అవనీ! కాని ఎంతో పటిష్టంగా కోటగోడలాగా నిలబడింది అనుకున్న అనుబంధం కూడా ఒక్కక్షణంలో వీగిపోవచ్చు! తీవ్రమైన కోపంలో మాట తూలినా, వారిని శారీరకంగా హింసించినా ఆ ఒక్కమాట, ఒక్క దెబ్బ, సంవత్సరాల తరబడి నిలుపుకువచ్చిన బంధాన్ని తెంచివేస్తుంది.

అందువల్ల కోపం మీ శత్రువు అని ముందు అర్థం చేసుకోవాలి. ఎవరో అద్భుతంగా అన్నారు: 'మీరు కోపం తెచ్చుకుని తీరాలనుకుంటే, కోపంమీద కోపం తెచ్చుకోండి. మీ కోపాన్ని మీకు వచ్చిన కోపంమీద చూపించండి.' ఎందుకు? ఎందుకంటే మీ కోపం మిమ్మల్ని కూడా బాధిస్తుంది; మీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అందువల్ల మీ శత్రువుమీద మీకు కోపం వస్తే, మీకు వచ్చిన కోపాన్ని, మీకు కోపం తెప్పించిన కోపంమీద చూపండి. ఎందుకంటే మీ శత్రువుకన్నా మొట్టమొదటి శత్రువు మీ కోపమే!

దీనికి పరిష్కారం ఏమిటి?

i) **జ్ఞానం** – మొట్టమొదటి పరిష్కారం ఈ కోరిక అనేది చాలా ప్రాణాంతకమైనది అని తెలుసుకోవటమే ('సిగరెట్ ప్యాకెట్ మీద పొగత్రాగటం హానికరం' అని హెచ్చరిక ఉన్నట్టుగా). కోరికవల్ల కలిగే హాని గురించిన జ్ఞానం ఉండాలి.

ii) **క్రోధంగా మారటం** – రెండవ పరిష్కారం ఈ కామమే క్రోధంగా మారుతుందని అర్థం చేసుకోవటం. కోపం అనేది కామంయొక్క మార్పుచెందిన రూపం. కామం విత్తనం అయితే, క్రోధం చెట్టు. విత్తనాన్ని అదుపులో పెడితే, చెట్టు దానంతట అదే అదుపులోకి వస్తుంది.

అందువల్లనే కృష్ణపరమాత్మ మూడవ అధ్యాయంలో కామాన్ని, క్రోధాన్ని కూడా మన శత్రువులుగా అభివర్ణించినా, పరిష్కారమార్గం చూపించేటప్పుడు మాత్రం కామానికి మాత్రమే చూపాడు. క్రోధానికి మందు చెప్పలేదు. ఎందుకంటే కామానికి మందు వేస్తే క్రోధం కూడా నయమవుతుంది. **కారణనాశే కార్యనాశః**

కారణాన్ని నాశనం చేస్తే కార్యం దానంతట అదే నాశనమవుతుంది.

iii) **కోపాన్ని పరికరంగా వాడాలి** – కోపాన్ని మటుమాయం చేయకూడదు, కోపం చూపించి తీరాలని కొంతమంది నమ్మకం. ఒకవేళ అదే వారి సిద్ధాంతం అయితే, కోపం నిజంగా రాకపోయినా, దాన్ని ఒక పరికరంగా వాడితీరాలి అని వారి వాదన అయితే, సరే కోపం తెచ్చుకోండి అంటాము. కోపం వారిని తెచ్చుకోకూడదు. వారు కోపాన్ని తెచ్చుకోవాలి. ఎందుకంటే వారు కోపాన్ని ఒక పరికరంగా మాత్రమే భావిస్తున్నారు కాబట్టి.

కోపాన్ని మేము తెచ్చుకుంటున్నాము అని ఎలా తెలుస్తుంది అంటారు వారు. దానికి ఒక్కటే పరీక్ష ఉంది. ఒక పరికరాన్ని ఎలా వాడతారు? మీకు ఇష్టం వచ్చినప్పుడు దాన్ని వాడుకుని, వద్దనుకున్నప్పుడు దాన్ని వదిలివేయాలి. కోపం విషయంలో కూడా ఈ సూత్రం పనిచేయాలి. మీరు ఎవరిమీదనో కోపం ప్రదర్శించితీరాలనుకుంటే, దాన్ని మీకు కావాల్సినప్పుడు తెచ్చుకుని, వద్దనుకున్నప్పుడు వదలగలుగుతున్నారో లేదో గమనించండి. మీకు కావాల్సినప్పుడు ప్రదర్శించగలగాలి; వద్దనుకుంటే మానాలి; లేదా తరువాత చూపిస్తాను అనుకుని వాయిదా వేయగలగాలి.

అందువల్ల మీరు కోపాన్ని నిజంగా పరికరంగానే వాడతాను అనేటట్లయితే, ఈ ప్రయోగం చేసిచూడండి. మీరు అరవాల్సిన వ్యక్తిమీద అరవాల్సిన సమయంలో కాకుండా, వాయిదా వేయండి. మీరు ప్రయత్నపూర్వకంగా కోపాన్ని ప్రదర్శించాలి అనుకుంటే మీరు నేను ఫలానా వ్యక్తిమీద, ఫలానా సమయంలో కోపం చూపిస్తాను అనుకోగలగాలి. కాని అలా ప్రయత్నపూర్వకంగా చూపించటం అంత తేలికైన విషయం కాదు. ఎందుకంటే కోపం ఒక చర్యకాదు. ఎదుటివ్యక్తి చేసిన చర్యకు ప్రతిచర్య.

3. **లోభం** – లోభం అంటే పీనాసితనం. మీకు ఉన్న వస్తువులను ఎవరితోనూ పంచుకోక పోవటం. కామం తీరకపోతే క్రోధానికి దారితీస్తుంది; కామం తీరితే అది లోభానికి దారి తీస్తుంది. రెండూ శత్రువులే. లోభం అంటే మనకున్న వస్తువులను ఎవరితోనూ పంచుకోవటానికి ఇష్టపడము. అంతా నాకే కావాలి; అంతా నేనే అనుభవించాలి. నాకే స్వంతం అనే ఈ భావన లోభం. అత్యాశ లోభమే; కార్పణ్యం లేదా పీనాసితనం కూడా లోభమే. ఎలా చూసినా లోభం మనకు శత్రువు.

అందువల్ల లోభాన్ని పారద్రోలాలంటే, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. 'నాది నాది అన్నది నీది కాదురా,' అంటారు. నిజానికి జీవితంలో ఏదీ మీ స్వంతం కాదు. మీకున్నవన్నీ మీరు అనుభవించటానికి భగవంతుడు మీకు తాత్కాలికంగా ఇచ్చిన కానుకలు. వాటిని అనుభవించి, వాటినుంచి పైకి ఎదగాలి. వాటిని అనుభవించి, వాటి నుంచి పైకి వచ్చి, ఆధ్యాత్మిక రంగంలోకి వచ్చి, భగవంతునికి వాటిని భక్తితో సమర్పించాలి. 'ధన్యవాదాలతో నీకు తిరిగి యిస్తున్నాను స్వామీ,' అని మనస్ఫూర్తిగా చెప్పగలగాలి.

ఈ విషయాన్ని గ్రహించి, ఇలా మీరే సంతోషంగా తిరిగి ఇవ్వకపోతే, భగవంతుడు మీనుంచి బలవంతంగా లాక్కోవాల్సివస్తుంది. అది ధనం, అనుబంధం, హోదా ఏదైనా కావచ్చు. అందువల్ల జీవితంలో వేటినైనా పట్టుకుని పాకులాడితే, జీవితం బాధాకరంగా మారకతప్పదు. అందువల్ల దేనిమీదా బంధం పెంచుకోకండి. మీకున్నదంతా అక్షరాలా భగవంతునిదే! మీరు వాటికి ధర్మకర్తలాగా వ్యవహరిస్తున్నారు అంతేనని అర్థం చేసుకోవాలి. మీకు తాత్కాలికంగా ఇచ్చాడు కాబట్టి, మీ దగ్గర ఉన్నన్నాళ్ళూ అనుభవించవచ్చు కాని అది శాశ్వతం అని పొరపాటు పడకూడదు. తాత్కాలికం పదంలో అనుబంధాలు కూడా వస్తాయి.

**ఋణానుబంధరూపేణ పశుపత్నీసుతాలయాః ।**
**ఋణక్షయే క్షయం యాంతి తత్ర కా పరిదేవనా ॥**

మీరు చేసుకున్న పూర్వజన్మ కర్మవల్ల పశువు, పత్ని, పుత్రులతో ఈశ్వరానుగ్రహంవల్ల అనుబంధం ఏర్పడుతుంది. వారితో ఋణం తీరగానే వారితో బంధం వీగిపోతుంది. మనకున్న వాటిని భగవంతుడు బలవంతంగా లాక్కుంటే మీకు బాధవేస్తుంది. కాని మీరే మీకున్నదాన్ని ఇతరులతో పంచుకుంటే, చాలా ఆనందం వేస్తుంది. అందువల్ల లోభం శత్రువు. దానికి పరిష్కారం మీకున్న వాటిని సంతోషంగా ఇతరులతో పంచుకోవాలి.

4. **మోహం** – మోహం అంటే భ్రమ లేదా అయోమయం. ఏమిటా అయోమయం? మీరు మీ ఆనందం మీకున్న వస్తువులవల్ల, బంధాలవల్ల వస్తుందనే అపోహ. శాస్త్రం మీరు ఆశిస్తున్న ఆనందం మీకేముంది అన్నదానిమీద ఆధారపడిలేదు, మీరేమిటి అనేదానిమీద ఆధారపడివుంది అంటుంది. కాని వచ్చిన చిక్కేమిటంటే మీరెన్నడూ మీరేమిటి అన్న అంశం గురించి ఆలోచించరు. ఎంతసేపూ మీకేం ఉందనే చూస్తూవుంటారు.

**బాలస్తావత్క్రీడాసక్తః,తరుణస్తావత్తరుణీసక్తః।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః,పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః॥** – భజగోవిందమ్ 7

బాల్యమంతా ఆటపాటలతో గడిచిపోతుంది. యౌవనం ఆడపిల్లల ధ్యాసతో, వృద్ధాప్యం చింతలతో గడిచిపోతుంది. పరమమైన బ్రహ్మచింతన ఎప్పటికీ లేదు!

అందువల్ల అర్థంలేని ఈ జీవితం వెంట పరుగులు తీయటం ఆపి, ఈ ప్రశ్నలు వేసుకోమంటున్నాడు గురువు.

**కస్త్వం కోఽహం కుత ఆయాతః, కా మే జననీ కో మే తాతః।**
**ఇతి పరిభావయ సర్వమసారమ్,విశ్వం త్యక్త్వా స్వప్నవిచారమ్॥** – భజగోవిందమ్ 23

నువ్వు ఎవరు? నేనెవరిని? నీ తల్లి ఎవరు? నీ తండ్రి ఎవరు? ఎక్కడనుంచి వచ్చావు? ఈ విధమైన విచారణ చేసి, జగత్తును మిథ్యగా వదిలివేయి. అదే నిజమనే మాయలో పడకు.

ఇలా నిష్కర్షగా సుత్తిదెబ్బలు వేస్తున్నారు కాబట్టి శంకరాచార్యులవారి భజగోవిందాన్ని మోహముద్గర అనికూడా అంటారు. ముద్గర అంటే సమ్మెటపోటు; మోహముద్గర అంటే మోహవిమోచనంకోసం వేసిన సమ్మెటపోటు. ఏమిటా మోహం? ఎన్ని వస్తువులు ఉంటే అంత ఆనందం కలుగుతుందనే భ్రమలో ఉండటం.

**న కర్మణా న ప్రజయా ధనేనా త్యాగేనైకే అమృతత్వమానశుః** – కైవల్యమ్

కర్మవల్ల కాని, పిల్లలవల్ల కాని, ధనంవల్ల కాని మోక్షం రాదు.

అందువల్ల మోహం ఒక పెద్ద శత్రువు. మీరు తప్పుడుమార్గంలో కృషిచేస్తూ పోతూంటే, జీవితం వృథా అవుతుంది. మీమీద మీరు కృషి చేయాల్సింది పోయి, మీ చుట్టూ ఉన్న ప్రపంచంమీద మీ శ్రమను పెడుతున్నారు. భర్త ఎంతసేపూ భార్యను ఎలా మార్చాలా అని ఆలోచిస్తాడు; భార్య ఎంతసేపూ భర్తను ఎలా మార్చాలా అని ఆలోచిస్తుంది. ఇద్దరూ తప్పుమార్గంలో ప్రయాణిస్తున్నారు. ఈ మోహం పోవాలంటే, దీనికి ఒక్కటే మార్గం. **వివేకం** పెంచుకోవాలి.

5. **మదం** – మదం అంటే గర్వం.

**ఇదమద్య మయా లబ్ధమ్ ఇమం ప్రాప్స్యే మనోరథమ్ ।**
**ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥** – 16.13

**అసౌ మయా హతః శత్రుః హనిష్యే చాపరానపి ।**
**ఈశ్వరోఽహమహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ ॥** – 16.14

ఇంత ఐశ్వర్యం ఇవాళ నాచేత పొందబడింది; ఇంకా ఇంత ఐశ్వర్యం భవిష్యత్తులో సంపాదిస్తాను. ఇప్పుడు ఇంత ఉంది; భవిష్యత్తులో ఇంకా ఇంత ఉంటుంది అనుకుంటాడు ఆసురీసంపత్తి ఉన్నవ్యక్తి.

ఈ శత్రువు నాచేత చంపబడ్డాడు; అంతేకాదు, తక్కిన శత్రువులను కూడా చంపగలను. నేనే సర్వాధిపతిని. నేనే ఈ ఐశ్వర్యాన్నంతా అనుభవిస్తాను, నేను గొప్ప శక్తివంతుణ్ణి, నేను అత్యంత గొప్ప బలవంతుణ్ణి, నేను చాలా సుఖంగా ఉన్నానని కూడా అనుకుంటాడు.

కాని జీవితం ఎప్పుడు విజయపరంపరనే తీసుకురాదు. అప్పుడప్పుడు ఓటమిలను ఎదుర్కోకతప్పదు. కాని ఈ విజయగర్వంతో విర్రవీగే వ్యక్తి కాస్త అపజయం ఎదురైతే తట్టుకోలేడు. ఓటమి ఎదురైతే, విపరీతమైన బాధకు లోనవుతాడు. మదం మాత్సర్యానికి అంటే ఈర్ష్యకు దారితీస్తుంది. నేనే గొప్పవాణ్ణి అని విర్రవీగే వ్యక్తి, తనకన్నా గొప్పవాడి నీడ కూడా భరించలేడు. అతన్ని ద్వేషిస్తాడు, అతనితో మాట్లాడడు. ఎవరైనా అతని గురించి తన దగ్గర పొగిడితే భరించలేడు. ఈర్ష్యతో భగ్గుమంటాడు.

కాని, వారికి నచ్చినా నచ్చకపోయినా వారిని మించినవారు ఉండితీరతారనేది నగ్నసత్యం. అందువల్లనే క్రీడారంగంలో, తక్కిన రంగాల్లో కూడా అంతకుముందు రికార్డులు బద్దలు కొట్టారు అనే వార్తలను చూస్తూ ఉంటాము. అందువల్ల ఎప్పటికీ ఒక్కరే ప్రథమస్థానంలో ఉండరు, ఉండలేరు. లేదు, నేను ఎప్పటికీ ప్రథమస్థానంలోనే ఉంటానని విర్రవీగితే, నిరంతరం ఈర్ష్యతో భగ్గుమనక తప్పదు.

ఈ మదం పోగొట్టుకోవాలంటే దానికి ఒక్కటే పరిష్కారమార్గం ఉంది. తను ఏం సాధించినా అది ఈశ్వరవిభూతే అని గ్రహించాలని కృష్ణపరమాత్మే చెప్పాడు. బుద్ధిమంతులలో బుద్ధిని నేను అన్నాడు; బలవంతులలో బలాన్ని నేను అన్నాడు; తాపసులలో తపస్సును నేను అన్నాడు ఏడవ అధ్యాయంలో.

ఎవరికే శక్తి ఉన్నా అది నేనే అన్నాడు. అందువల్ల మీరు ఎందులో విజేతలైనా కూడా అది భగవంతుని విభూతి మాత్రమే అని అర్థం చేసుకోవాలి. అలా అర్థం చేసుకుని తన్‌మన్‌ధన్ సబ్ కుచ్ తేరా అని చెప్పగలగాలి. అంటే నా తనువు, మనస్సు, ధనము, అన్నీ నీవే అని మనస్ఫూర్తిగా చెప్పాలి. ఈ విభూతికి భగవంతుడు మిమ్మల్ని ఎన్నుకున్నందుకు మురిసిపోవాలి.

6. **మాత్సర్యం** – మాత్సర్యం అంటే ఈర్ష్య. ఈ ఈర్ష్య ఎదుటివారితో మిమ్మల్ని పోల్చుకోవటంవల్ల ఏర్పడుతుంది. ఈ సృష్టిలో ఉన్న వస్తువుల మధ్య తారతమ్యాలు ఉంటూనే ఉంటాయి. అది తప్పనిసరి. అందువల్ల ఇతరులతో మిమ్మల్ని మీరు ఎన్నడూ పోల్చుకోకండి. ఉన్నదానితో తృప్తిపడటం నేర్చుకోండి. మీరెలా ఉంటే అలా మిమ్మల్ని మీరు స్వీకరించుకోండి కాని ఎన్నడూ ఎవరితోనూ పోల్చుకోకండి. మీకన్నా తక్కువస్థాయితో ఉన్నవారితో పోల్చుకుంటే, మీకు సుపీరియారిటీ కాంప్లెక్స్ ఏర్పడుతుంది. దానికి బదులుగా

మీకన్నా ఎక్కువస్థాయిలో ఉన్నవారితో పోల్చుకుంటే న్యూనతాభావన ఏర్పడుతుంది. ఎలా చూసినా ఏదో ఒక భావన మిమ్మల్ని కృంగదీస్తుంది. అందువల్ల మిమ్మల్ని, మీ ఎదుగుదలను చూసి మీరు ఆనందించండి.

ప్రకృతిలో అన్నీ అందమైనవే. దేని అందం దానిదే. ఒకదాన్ని ఇంకొకదానితో పోల్చలేము. గులాబీ అందం గులాబీదే! మల్లెపూవు అందం మల్లెపూవుదే. అలాగే మీ అందంమీదే. మీరు ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించటం నేర్చుకోండి. అలా స్వీకరించలేకపోవటంవల్లనే ప్లాస్టిక్ సర్జరీ అంతగా వెలుగు వెలుగుతోంది. మాత్సర్యం మీ శత్రువు అనీ, అది మీలో అయితే ఎక్కువ భావాన్నో లేకపోతే ఆత్మన్యూనతా భావాన్నో కలిగిస్తోందని గ్రహించండి. ఏ పోటీతత్త్వం ఉన్నా అది మాత్సర్యానికి దారితీస్తుంది.

నేటి సమాజంలో పోటీతత్త్వం ఉంటే, మీరు అద్భుతంగా పనిచేస్తారు అంటారు. కాని శాస్త్రం దాన్ని ఒప్పుకోదు. పోటీతత్త్వం ప్రతికూలతత్త్వం అంటుంది. ఎందుకంటే, పోటీతత్త్వం ఈర్ష్యను, కోపాన్ని, మోసగుణాన్ని పెంపొందిస్తుంది. క్రీడారంగంలో పోటీతత్త్వం ఉంటుంది కాబట్టి, అందులో గెలవటానికి ప్రత్యేకమైన మందులు ఇవ్వటం జరుగుతుంది. అందువల్ల మాత్సర్యాన్ని పారద్రోలండి.

మాత్సర్యాన్ని పారద్రోలటానికి ఒక్కటే మార్గం ఉంది. ఎదుటివారు మీకన్నా ఉన్నతస్థాయిలో ఉంటే, వారిని ఆరాధించండి. ఎవరైనా ఎందులోనైనా ఆరితేరితే, వారిని నలుగురిలోనూ మెచ్చుకోవటం నేర్చుకోండి. వారి ద్వారా భగవంతుని విభూతి ప్రకటితమవుతున్నదని గ్రహించండి. ఆ విషయంగా అతన్ని అభినందించండి.

ఆ విధంగా సానుకూల లక్షణాలను పెంపొందించుకోండి! ఈ సానుకూల లక్షణాలు సంస్కృతమనస్సును ఏర్పరస్తుంది. సంస్కృతమనస్సు ఉంటే ఆత్మజ్ఞానాన్ని, తద్వారా మోక్షాన్ని పొందటం సునాయాసం అవుతుంది. ఈ అధ్యాయం దైవీసంపత్తి గురించి, ఆసురీసంపత్తి గురించి చెబుతుంది కాబట్టి ఈ అధ్యాయాన్ని దైవాసురసంపద్విభాగయోగము అంటారు.

# శ్రద్ధాత్రయవిభాగయోగము

## అధ్యాయము 17

సంస్కృతమనస్సు మాత్రమే ఆత్మజ్ఞానాన్ని పొందగలదనీ, ప్రాకృతమనస్సు పొందలేదనీ అంతకుముందు చూశాము.

**యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ ।**
**యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్యచేతసః ॥** – 15.11

వివేకం ఉన్నవారు శరీరంలో ఉన్న ఈ బ్రహ్మను జీవాత్మగా తెలుసుకుంటారు. కాని అధికారిత్వం లేనివారు, వివేకం లేనివారు భగవంతుణ్ణి ఎన్నడూ వారి హృదయంలో చూడలేరు. వారి మనస్సు శుద్ధి చేయబడకపోతే, వారు శాస్త్రాన్ని అధ్యయనం చేసినాకూడా, వారికి ఆత్మజ్ఞానం కలగదు.

అకృతాత్మనః అంటే సంస్కరించబడని మనస్సు. మనస్సును రెండు విధాలుగా చూశాము అంతకుముందు అధ్యాయంలో. అది ప్రాకృతమనస్సు, సంస్కృతమనస్సు. అదే విధంగా ఇప్పుడు మనుష్యులను రెండు విధాలుగా చూస్తాము – ప్రాకృతమనుష్యుడు, సంస్కృత మనుష్యుడు. ముందుగా ప్రాకృతమనుష్యుడు సాధన చేసి సంస్కృతమనుష్యునిగా మారి ఆ తరువాత జ్ఞానీమనుష్యునిగా మారాలి.

చిన్మయానంద స్వామీజీ దీన్ని అద్భుతంగా వర్ణిస్తారు. ప్రాకృతమనుష్యుడు జంతు లక్షణాలతో ఉంటాడని, సంస్కృతమనుష్యుడు మనిషి లక్షణాలతో ఉంటాడని, జ్ఞానీమనుష్యుడు దైవలక్షణాలతో ఉంటాడనీను. అందువల్ల మనిషి పశుప్రవృత్తినుంచి మనుష్యప్రవృత్తికి ఎదిగి, తద్వారా దైవీప్రవృత్తికి ఎదగాలని చెబుతారు. ప్రాకృతమనుష్యుడు సరాసరి దైవీమనుష్యుని స్థాయికి ఎదగలేడు. అతను తప్పనిసరిగా మధ్యస్థాయి అయిన మనుష్య ప్రవృత్తికి ఎదిగితీరాలి.

ప్రాకృతమనుష్యునికీ, సంస్కృతమనుష్యునికీ మధ్య భేదం ఏమిటి? ఒకరు సంస్కరింపబడ్డారనీ, ఇంకొకరు సంస్కరింపబడలేదనీ ఎలా చెప్పగలరు? అది నిర్ణయించటానికి ఏమైనా సూచనలు ఉన్నాయా? సూచనలు ఇవి – ప్రాకృతమనుష్యుడు తన రాగద్వేషాలకు అనుగుణంగా ప్రవర్తిస్తాడు. అతనికి ఏదైనా నచ్చితే, దాన్ని ఖచ్చితంగా చేస్తాడు. నచ్చకపోతే ఎంతమాత్రమూ చేయడు. అంటే తను చేసే కర్మలన్నీ అతని ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంటాయి. తను చేసే పనివల్ల సమాజానికి మేలు జరుగుతుందా, కీడు జరుగుతుందా అనేది అతనికి అనవసరం. అందువల్ల రాగద్వేషాలకు తగ్గట్టు పనిచేసే వ్యక్తిని ప్రాకృత మనుష్యుడు అంటారు.

అతను ఏ నియమనిబంధనలను పాటించడు. ఏది మంచో, ఏది చెడో అతను కొంచెం కూడా ఆలోచించడు. అతనిలో పశుప్రవృత్తి ఉంటుందని చూశాము. ఒక గేదె రోడ్డు

దాటాలనుకుంటే, హాయిగా దాటుతుంది. సిగ్నల్ పడిందా, ఎదురుగుండా కారు దూసుకు వస్తోందా అనేది దానికనవసరం. అలాగే కుక్కకు 'భౌభౌ' అని అరవాలనిపిస్తే నిక్షేపంగా అరిచేస్తుంది. 'అయ్యో ఇక్కడ హాలులో గీతాబోధ జరుగుతోంది. నేను ఇప్పుడు అరవకూడదు,' అనుకోదు. అందువల్ల రాగద్వేష ప్రధానమనస్సు ఉన్నవారిని ప్రాకృతపురుషుడు అంటారు.

మరయితే సంస్కృతమనుష్యుడు ఎవరు? సంస్కృతమనుష్యునికి కూడా రాగద్వేషాలు ఉంటాయి. ఇవి బొత్తిగా లేకుండా ఉండదు. అతనికీ ఎన్నో ఇష్టాయిష్టాలు ఉంటాయి. కాని అతను వాటిని మాత్రమే లెక్కలోకి తీసుకోడు. ఏదైనా పనిచేసేముందే అతను బేరీజు వేసుకుంటాడు. 'ఈ పని నేను చేయటం సబబేనా? దీన్ని నేను చేయటంవల్ల కలిగే ఫలితాలు ఏమిటి? ఇది చేయటంవల్ల నేను మాత్రమే లాభం పొంది, తక్కినవారు ఇబ్బంది పడేటట్టయితే, అది నాకు లాభం చేకూర్చేదయినా సరే, ఇతరులను నష్టపెట్టటంవల్ల నాకు కలిగే లాభం నాకు వద్దే వద్దు.' ఈ విచక్షణాశక్తితో తను తన రాగాన్ని అదుపులో పెట్టుకుంటాడు.

ఇదే సూత్రం ద్వేషానికి కూడా వర్తిస్తుంది. అతనికి కొన్ని పనులు చేయటం ఇష్టం ఉండకపోవచ్చు. కాని ఆ పనులు చేస్తే ఎందరో లాభం పొందుతారు. అలాంటప్పుడు ఆ పనిని చేసితీరాలి. నలుగురికీ మేలు కలిగే పని చేయాలి.

**ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపన్థినౌ ॥** – 3.34

ఇంద్రియ విషయవస్తువులమీద మనుష్యులకు రాగద్వేషాలు ఏర్పడతాయి. మనుష్యులు ఈ రెండింటికీ వశం కాకూడదు. ఎందుకంటే ఈ రెండే మనిషి శ్రేయస్సుకు విఘ్నకారకాలు, మహాశత్రువులు.

మీక్కూడా రాగద్వేషాలు ఉంటాయి, నిజమే. కాని మనస్సుకు నచ్చిందల్లా చేయకూడదు. తయోర్న వశమాగచ్ఛేత్ – వాటి ఆధీనంలో మీరు పడకుండుగాక! ఈ రాగద్వేషాలు మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఆటంకాలు. అందువల్ల మీరు మీ రాగద్వేషాలకు అనుగుణంగా ప్రవర్తించే ముందు, ఒకసారి ఆగి, మిమ్మల్ని మీరు ఈ ప్రశ్న వేసుకోవాలి. ఈ పని నేను చేయటం సబబేనా? సబబే అయితే చేయండి. సబబు కాకపోతే, ఈ రాగాన్ని మొగ్గలోనే తుంచేయండి.

అదే విధంగా ద్వేషం. ఒక పని మీకు ఇష్టం లేకపోయినా, దానివల్ల మంచి జరిగేటట్టయితే అది చేసితీరాలి. ఉదాహరణకు పన్ను కట్టటం ఎవరికీ ఇష్టం ఉండదు. కాని మీరు కట్టే పన్ను సమాజానికి ఉపయోగపడుతుందంటే, కట్టాలి. అందువల్ల, మీ జీవితం అధర్మానికి కాకుండా ధర్మానికి కట్టుపడి ఉండేటట్టయితే, అప్పుడు మీరు సంస్కృతపురుషుడు అవుతారు.

ఎప్పుడైతే ఈ మార్పు మీలో కలుగుతుందో, అప్పుడే మీరు మీ జీవితాన్ని రాగద్వేష ప్రధానం నుంచి ధర్మప్రధానంగా ఉండేటట్టు మార్చుకుంటారు.

ధర్మాధర్మ విచక్షణ నేర్చుకుని, దానికి అనుకూలంగా తన జీవితాన్ని మలచుకున్న వ్యక్తినే ద్విజుడు అంటారు. మీరు పుట్టటమే అజ్ఞానమనే పెట్టుబడితో పుట్టారు. అంటే తల్లిగర్భంనుంచి బయటకు వచ్చినప్పుడు, అందరూ ప్రాకృతపురుషులే. మళ్ళీ ఇంకోసారి పుట్టాలి. ప్రాకృతపురుషుడు, సంస్క ృతపురుషుడు అవాలి. అలా ఎవరైతే మారతారో, వారిని ద్విజుడు అంటారు. రెండవజన్మలో తల్లిదండ్రులెవరు? మనుస్మృతిలో ఉపనయనం చేయబడినవ్యక్తికి తల్లి సావిత్రీ అనీ, తండ్రి ఆచార్యుడు అనీ వస్తుంది.

పుట్టినప్పుడు ప్రాకృతపురుషునిగా ఉన్నవ్యక్తి ఉపనయనం చేయించుకున్నాక అంటే గాయత్రీ ఉపదేశం పొందాక, ధార్మిక జీవనాన్ని గడపటానికి నిశ్చయించుకున్న వ్యక్తే ద్విజుడు అని వ్యవహరించబడతాడు. గాయత్రీ మంత్రోపదేశాన్ని పొందుతాడు కాబట్టి తల్లి గాయత్రీదేవి అయితే, ఉపదేశం చేసిన తండ్రి ఆచార్యుడు అవుతాడు.

ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చేసి, గురుకులంనుంచి లేదా బ్రహ్మచర్య ఆశ్రమంనుంచి బయటకు వచ్చి బ్రహ్మచారి బాధ్యతగల పౌరుడు అవుతాడు. అలా బాధ్యతకలిగిన వ్యక్తే సంస్క ృతపురుషుడు. ఏ సమాజంలో అయితే ఇలా అందరు పౌరులూ ధర్మశాస్త్రాన్ని ఔపోసన పట్టి, సంస్కృతపురుషులుగా మారుతారో, ఆ సమాజం ఆరోగ్యకరంగా ఉంటుంది. మీరు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ – ఏవి నేర్చుకున్నా కూడా అవి మిమ్మల్ని సంస్కృతపురుషులను చేయవు. కేవలం ధర్మాధర్మ విచక్షణే మిమ్మల్ని సంస్కృతపురుషులను చేస్తుంది. అందువల్ల మీ లక్ష్యం ప్రాకృతపురుషుని స్థాయినుంచి సంస్కృతపురుషుని స్థాయికి ఎదిగి, జ్ఞానీపురుషుని స్థాయికి ఎదిగేలా ఉండాలి. వేదాంతం సంస్కృతపురుషుణ్ణి జ్ఞానీపురుషునిగా మారుస్తుంది.

ప్రాకృతపురుషుడు తన రాగద్వేషాలకు అనుగుణంగా ప్రవర్తిస్తాడని చూశాము గదా! దీన్ని ఆధారంగా చేసుకుని, ప్రాకృతపురుషుణ్ణి రెండు తెగలుగా విభజించవచ్చు. ప్రాకృత ఆసురమనుష్యుడు, ప్రాకృత రాక్షసమనుష్యుడు.

**ప్రాకృత ఆసురమనుష్యుడు** – ప్రాకృతమనుష్యుని జీవితం అతని రాగాన్నిబట్టి సాగితే, అతని జీవితం స్వార్థపూరితంగా ఉంటుంది. రాగం అంటే కోరిక, స్వార్థం మొదలైనవి. అటువంటి వ్యక్తిని ప్రాకృత ఆసురమనుష్యుడు అంటారు.

**ప్రాకృత రాక్షసమనుష్యుడు** – ప్రాకృతమనుష్యుని జీవితం అతని ద్వేషాన్నిబట్టి సాగితే, అతని చర్యలు రాక్షసంగా ఉంటాయి. రాగాన్ని మించి ద్వేషం ఉంటుంది కాబట్టి ఎదుటివారిని హింసిస్తారు. వారు ఎదుటివారిని హింసించటంలో పైశాచికానందాన్ని పొందుతారు. వారికి

ప్రత్యేకించి లాభం లేకపోయినా కూడా, ఇతరులను కాలరాయటానికి కూడా వెనుకాడరు. రాగప్రధాన మనుష్యుడు కేవలం స్వార్థపూరితంగా మాత్రమే ఉంటే, ఈ ద్వేషప్రధాన మనుష్యుడు రాక్షసంగా ప్రవర్తిస్తాడు. అటువంటి వ్యక్తిని ప్రాకృత రాక్షసమనుష్యుడు అంటారు.

**సంస్కృతమనుష్యుడు** – రాగద్వేషాలపరంగా కాకుండా, ధర్మాధర్మపరంగా కర్మలను చేసే వ్యక్తిని సంస్కృతమనుష్యుడు అంటారు. ఇతను నిస్వార్థంగా ఉంటాడు.

ఆ విధంగా మనకు మూడురకాల మనుష్యులు ఉన్నారు – ప్రాకృత అసురమనుష్యుడు, ప్రాకృత రాక్షసమనుష్యుడు, సంస్కృతమనుష్యుడు. వీరి గురించి తేలిక మాటల్లో చెప్పాలంటే ప్రాకృత అసురమనుష్యుడు స్వార్థపూరితంగా ఉంటే, ప్రాకృత రాక్షసమనుష్యుడు హాని చేసేవానిగా ఉంటే, సంస్కృతపురుషుడు నిస్వార్థంగా ఉంటాడు. వీరికే శాస్త్రం సాంకేతిక పదాలను ఇస్తుంది. ప్రాకృత అసురమనుష్యున్ని రాజసపురుషుడనీ, ప్రాకృత రాక్షసమనుష్యున్ని తామసపురుషుడనీ, సంస్కృతమనుష్యున్ని సాత్త్వికపురుషుడనీ అంటుంది. అందువల్ల ఈ మూడు రకాల మనుష్యులను దైవాసుర రాక్షససంపత్తి ఉన్నవారు అనవచ్చు లేదా సాత్త్విక రాజస తామస పురుషులనీ అనవచ్చు. ఇప్పుడు ఈ రెండవకోణంలోంచి చూద్దాము.

**తామసపురుషుడు** – తామసపురుషుడు అందరిలోకీ దారుణం. ఎందుకంటే అతను చేసే పనులు సమాజానికి హాని కలుగజేసేవిగా ఉంటాయి. ఆ హానికూడా వెంటనే కలుగుతుంది. సర్జరీలో కూడా ఎమర్జెన్సీ సర్జరీ అన్నింటికన్నా దారుణమైనది. దానికి తక్షణచర్య చేపట్టాలి. అలాగే తామసపురుషుడు సమాజానికి చీడపురుగు. అతన్ని తక్షణం మార్చాలి.

**రాజసపురుషుడు** – రాజసపురుషుడు మందరకం. అతను స్వార్థపూరితుడు. అతని స్వార్థం సమాజానికి వెంటనే హాని చేయదు కాని, ముందుముందు ఎప్పుడో హానికరంగా మారుతుంది. అది సమాజానికే కాక అతనికి కూడా హాని చేస్తుంది. తామసప్రవృత్తి అధమ ప్రవృత్తి అయితే, రాజసప్రవృత్తి మధ్యమ లేదా మందప్రవృత్తి.

**సాత్త్వికపురుషుడు** – సాత్త్వికపురుషుడు ఉత్తమరకం. అతను సమాజానికి నిస్స్వార్థంగా సేవచేస్తాడు.

కృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో మనం తామసప్రవృత్తిని వెంటనే పారద్రోలాలనీ, రాజసప్రవృత్తిని నెమ్మదిగా వదులుకోవాలనీ, సాత్త్వికప్రవృత్తి వైపు మొగ్గు చూపి, దాన్ని పెంపొందించుకోవాలనీ చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ అధ్యాయంలోకి అడుగు పెడదాము.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా ఐదు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. శ్రద్ధ
2. ఆహారం
3. యజ్ఞం
4. తపస్సు
5. దానం.

ఇవికాక ఓం తత్సత్ వివరణ కూడా చూస్తాము. (వీటిని శ్లోకాల పరంగా చూడటం లేదు.)

మళ్ళీ ఈ ఐదు అంశాలను మూడు విభాగాలుగా చేస్తాడు కృష్ణపరమాత్మ. అవి – సాత్త్విక, రాజస, తామస లక్షణాలు. నిజానికి ఈ విభజన మనం కూడా చేయవచ్చు. ముందే వాటి లక్షణాలను చూశాము కాబట్టి, ఏదైతే రాక్షసంగా ఉంటుందో అది తామసప్రవృత్తి, ఏదైతే స్వార్థపూరితంగా ఉంటుందో అది రాజసప్రవృత్తి, ఏదైతే నిస్స్వార్థంగా ఉంటుందో అది సాత్త్వికప్రవృత్తి.

ఈ ఐదింటిలో శ్రద్ధ మొదటి అంశం కాబట్టి ఈ అధ్యాయానికి శ్రద్ధాత్రయవిభాగ యోగము అని పేరువచ్చింది.

1. **శ్రద్ధ** – శ్రద్ధ అనేది వారి స్వభావాన్ని బట్టి లేదా వారి మనస్సును బట్టి ఉంటుంది. ఈ శ్రద్ధను సాత్త్వికశ్రద్ధ, రాజసికశ్రద్ధ, తామసికశ్రద్ధగా విభజించవచ్చు. అది మూడు అంశాలమీద ఆధారపడి ఉంటుంది. అవి దేవత, ప్రకారః, భావన.

ఎ) **దేవత** – మన హిందూమతంలో అనేకమంది దేవతలు ఉన్నారు. సాత్త్విక, రాజసిక, తామసిక లేదా దుర్దేవతలు కూడా ఉన్నారు. సాత్త్విక దేవతలు అంటే మనం నిత్యం పూజ చేసే దేవతలు – రాముడు, కృష్ణుడు, దేవీ, శివుడు, విష్ణువు. వారు మన ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడతారు.

రాజసిక దేవతలు అంటే యక్షకిన్నెరకింపురుషులు. వీరు ఐహిక సుఖాలను కలుగజేస్తారు. బదరీనాథ్‌లో కుబేరుని విగ్రహం ఉంటుంది. ఆ కుబేరుని ముందు ఒక రూపాయి బిళ్ళ పెట్టి వెనక్కు తెచ్చుకుని, మీ బీరువాలో పెట్టుకుంటే, మీకు అక్షయంగా డబ్బు ఉంటుంది అంటారు!

తామసిక దేవతలు అంటే క్షుద్రదేవతలు. భూత, ప్రేత, పిశాచ, రాక్షస, యమదూత, శాకినీ, ఢాకినీ, సర్పదేవతలు. ఈ దేవతలు ఎదుటివారి వినాశనాన్ని కలుగజేస్తారు. దీనివల్ల ఏ దేవతకు పూజ చేస్తే ఆ పూజచేసిన వ్యక్తికి ఆ మనస్తత్వం ఉందని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది.

బి) **ప్రకారః** – అంటే పూజ చేసే విధానం. ఇందులో కూడా మూడురకాల పూజలను చూస్తాము.

సాత్త్వికపూజ ఎక్కువగా మానసిక పూజగా ఉంటుంది. ఇందులో కాయిక, వాచికపూజ తక్కువగా ఉంటుంది. అంటే ఎక్కువగా ధ్యానం లేదా జపం చేస్తారు.

రాజసికపూజలో దంభం, గర్వం, హంగు, ఆర్భాటం ఎక్కువ ఉంటుంది. చాలామంది మనుష్యులు, హడావుడి, సందడి ఉంటుంది. అందరితో కలిసి హోలీ రంగులు పూసుకోవటం, వినాయక పందిళ్ళలో పదిరోజులు కోలాహలంగా డాన్సులు పెట్టటం రాజసికపూజలోకి వస్తుంది.

తామసికపూజలో పూజచేసే విధానం శరీరాన్ని హింస పెట్టేటట్టుగా ఉండవచ్చు; అది తన శరీరాన్నైనా, ఎదుటివారిదైనా సరే. జంతుబలి, మధువును సేవించటం ఉంటాయి ఇందులో.

ఈ విధంగా పూజచేసే విధానాన్ని బట్టి కూడా అది ఎటువంటి శ్రద్ధో చెప్పవచ్చు.

సి) **భావన** – ఏ ఉద్దేశ్యంతో పూజ చేస్తున్నారో అది సంకల్పంలో తెలుస్తుంది.

సాత్త్వికపూజ నిస్వార్థంగా ఉంటుంది. సమాజశ్రేయస్సు కోరతారు – **లోకాః సమస్తాః సుఖినో భవన్తు** అంటారు. ఇటువంటి పూజ చిత్తశుద్ధిని, చిత్తఏకాగ్రతను పెంచుతుంది. ఇందులో సంకల్పం ఇలా ఉంటుంది.

**మమోపాత్త సమస్త దురితక్షయద్వారా, శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థమ్...**

రాజసికపూజలో సంకల్పం చెప్పేటప్పుడు లౌకిక విజయాలను కోరతారు.

**ధనం ధాన్యం పశుం బహుపుత్రలాభం**

రాజసికపూజలో వెంటనే జరిగే హాని ఏమీ ఉండదు. అందువల్ల కృష్ణపరమాత్మ అది చేయవచ్చు తప్పులేదు కాని వీలున్నంత త్వరలో దానినుంచి ఎదగాలనీ, లౌకిక విజయాల బదులు **జ్ఞానవైరాగ్యసిద్ధ్యర్థం** అని సంకల్పంలో చెప్పాలనీ అంటాడు. మన నిత్యపూజలో ఇలా వస్తుంది.

**అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణవల్లభే ।**
**జ్ఞానవైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి ॥**

అలా రాజసికపూజ స్వార్థపూరితంగా ఉంటుంది. అది లౌకికఫలాలతో కూడి ఉంటుంది.

తామసికపూజ ఎదుటివారి నాశనం కోరేదిగా ఉంటుంది. నాకు వచ్చినా రాకపోయినా ఫర్వాలేదు, ఎదుటివారికి మాత్రం రాకూడదు అన్నట్టుగా ఉంటుంది. అది హానికరమైన పూజ.

భర్తృహరి నీతిశతకంలో సత్పురుషులు ఇతురుల మేలుకోసం తమ మేలును కూడా పట్టించుకోరనీ, సామాన్య మానవులు వారికి ఇబ్బంది కలగకుండా ఇతరులకు మేలుచేస్తారనీ, చెడ్డవారు తమ స్వార్థంకోసం ఇతరులను కాలరాస్తారనీ, కాని కొంతమంది తమకు ఏమీ లాభం లేకపోయినా ఇతరులను ఇబ్బంది పెడతారనీ అంటారు.

ఆ విధంగా వారి పూజలో వారి భావననుబట్టి ఎటువంటి వ్యక్తులో చెప్పవచ్చు. అలా పూజయొక్క దేవత, పద్ధతి, భావనల ప్రకారం ఒకవ్యక్తి చేసే పూజ సాత్త్వికపూజో, రాజసికపూజో, తామసికపూజో చెప్పవచ్చు.

2. **ఆహారం** – కొత్తగా పుట్టిన పాపాయి చేసే మొట్టమొదటి పని ఆహారం తీసుకోవటం. అప్పుడే పుట్టిన పాపాయి నోటితో రెండు పనులు చేస్తుంది – ఏడుస్తుంది లేదా పాలు తాగుతుంది. మనమూ రెండు పనులు చేస్తాము నోటితో. అయితే మాట్లాడతాము లేదా తింటాము. ఇప్పుడు కృష్ణపరమాత్మ మూడురకాల ఆహార నియమాల గురించి చెబుతున్నాడు.

మనం తీసుకునే ఆహారం మన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తుంది అంటున్నది శాస్త్రం. ఛాందోగ్యోపనిషత్తులో మనం తీసుకున్న ఆహారం మూడుగా విభజించబడుతుందని వస్తుంది. అది అత్యంత స్థూలభాగం, సూక్ష్మభాగం, అత్యంత సూక్ష్మభాగం. అత్యంత స్థూలభాగం వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. అది మలంగా మన శరీరంనుంచి బయటకు వెళ్ళిపోతుంది. సూక్ష్మభాగం కార్బోహైడ్రేట్స్, ఫాట్స్, మినరల్స్ రూపంలో స్థూలశరీర పోషణకు వెళుతుంది. అత్యంత సూక్ష్మభాగం సూక్ష్మశరీర పోషణకు వెళుతుంది. అంటే మనస్సుయొక్క పోషణకు ఉపయోగపడుతుంది.

**అన్నమశితం త్రేధా విధీయతే తస్య యః స్థవిష్ఠో ధాతుస్తత్పురీషం**
**భవతి యో మధ్యమస్తన్మాంసం యోఽణిష్ఠస్తన్మనః॥** – ఛాందోగ్యమ్ 6.5.1

అత్యంత స్థూలభాగాన్ని పురీషం అన్నది ఉపనిషత్తు. పురీషం అంటే మలం. అది వృథా పోతుంది. మధ్యమభాగం స్థూలశరీరరానికి పోషకాలను అందజేస్తుంది. అణిష్ఠ అంశం అత్యంత సూక్ష్మ అంశం. అది సూక్ష్మశరీరానికి శక్తినిస్తుంది. మన విజ్ఞానశాస్త్రం స్థూలశరీరానికి ఏ ఆహారం మేలు చేస్తుందో చెబుతుంది కాని సూక్ష్మశరీరం గురించి చెప్పలేదు. అది శాస్త్రంలోనే చూస్తాము. కొన్ని ఆహారదినుసులు స్థూలశరీరానికి మంచి చేయవచ్చు కాని అది సూక్ష్మశరీరానికి సరిపోకపోవచ్చు. అందువల్లనే విజ్ఞానశాస్త్రం మంచి అన్న ఆహారాన్ని, శాస్త్రం ఒప్పుకోదు. అది సూక్ష్మశరీరానికి మంచిది కాదు. మీరు ఆధ్యాత్మికంగా ఎదగాలంటే అది తీసుకోకూడదు. లేదు, నాకు స్థూలశరీరం బాగుంటే చాలు అంటే మీ ఇష్టం అంటుంది. కాని ఆధ్యాత్మికత కావాలంటే స్థూల, సూక్ష్మశరీరాలు రెండింటికీ పనికివచ్చే ఆహారాన్నే తీసుకోవాలి.

**ఆహారశుద్ధౌ సత్వశుద్ధిః**

ఆహారం శుద్ధమైనదైతే మనస్సు కూడా శుద్ధంగా ఉంటుంది.

**సత్వశుద్ధౌ** ధృవా స్మృతిః

సత్వశుద్ధి ఉంటే దృఢజ్ఞానం కలుగుతుంది. ఈ ఆహారాన్ని మూడుగా విభజించవచ్చు. అవి – సాత్త్విక, రాజస, తామసిక ఆహారాలు. ఏది సాత్త్విక ఆహారం?

ఎ) **సాత్త్విక ఆహారం** – ఒక సాధారణ నియమం క్రింద చెప్పాలంటే శాకాహార భోజనం సాత్త్విక భోజనం. మన వైదిక సాంప్రదాయంలో చెప్పబడి, పరంపరగా వస్తున్న ఆహారం అది. మాంసాహారం, మద్యపానీయాలు రాజసిక, తామసిక ఆహారం క్రిందికి వస్తాయి.

భగవంతునికి అర్పించి, భగవంతుని ప్రసాదంగా స్వీకరించే ఆహారాన్ని సాత్త్వికాహారం అంటారు. ఇందులో అన్నిరకాల తీపివంటలు, మరీ పొడిగా లేకుండా నెయ్యో, నూనో ఉన్న వంటలు, కంటికి ఇంపుగా ఉండే వంటలు తినాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. తీపి వంటలు సాత్త్వికాహారం కిందకు వస్తాయి కాబట్టి, మన పండగల్లో, ప్రధానంగా తీపి వంటకాలు ఉంటాయి. విజ్ఞానశాస్త్రం తీపి తినటాన్ని నిషేధిస్తుంది. కాని గీతాశాస్త్రం దీన్ని సాత్త్వికం అంటుంది.

బి) **రాజసిక ఆహారం** – రాజసిక ఆహారం కింద ఏవి వస్తాయి?

**కట్వమ్లలవణాత్యుష్ణతీక్ష్ణరూక్షవిదాహినః** – ఈ శ్లోకం చదవటానికి కూడా కష్టమే. కటు–చేదు; అమ్ల–పులుపు; లవణ–ఉప్పు; ఉష్ణ–మరీ వేడిగా ఉండేవి; తీక్ష్ణ–విపరీతమైన కారం; రూక్ష–చాలా పొడిగా ఉన్న ఆహారం; విదాహినః–దాహం పుట్టించే ఆహారం. ఇవన్నీ రాజసిక ఆహారం కిందికి వస్తాయి. వీటిని అతి తక్కువగా తీసుకోవచ్చు కాని అతిగా తినకూడదు. ఈ అతి పదాన్ని ప్రతిపదం ముందూ కలుపుకోవాలి. అంటే మరీ ఎక్కువ చేదు, మరీ ఎక్కువ పులుపు తినకూడదు. ఈ ఆహారాన్ని అతిగా తీసుకుంటే అది ఆధ్యాత్మిక ఎదుగుదలను కుంటుపరుస్తుంది. వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేయలేరు, ధ్యానం కూడా చేయలేరు.

సి) **తామసిక ఆహారం** – సగం ఉడికిన అన్నం లేదా పచ్చికూరలు, అతిగా వండబడిన ఆహారం, నిలువ ఉంచిన ఆహారం, పాచిపోయిన ఆహారం, భగవంతునికి అర్పించని ఆహారం తామసిక ఆహారం కిందకు వస్తుంది. రాత్రి వండిన ఆహారం మర్నాటికి పనికిరాదు. అది ఆధ్యాత్మిక ఎదుగుదలకు మంచిదికాదు సరికదా పాపాన్ని కూడా కలుగజేస్తుంది. అది పాపం అని ఎలా చెప్పగలము? ఎందుకంటే సంధ్యావందనంలో నేను నిలువ ఉంచిన ఆహారం తిన్నందుకు నన్ను క్షమించు అని వస్తుంది. అంటే ఆ పాపాన్ని కడిగివేయి అని ప్రార్థన చేస్తారు.

ఆ విధంగా ఆహారనియమాల్లో ఏది పాటిస్తే ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడుతుందో చూశాము.

తరువాత మూడు అంశాలు – యజ్ఞం, దానం, తపస్సు. ఈ మూడు నియమాలను అంటే యజ్ఞదానతపస్సులను ప్రతి వైదికుడూ పాటించి తీరాలని మన శాస్త్రం పదేపదే చెబుతుంది.

**తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసానాశకేనైతమేవ విదిత్వా మునిర్భవతి।** – బృహదారణ్యకమ్ 4.4.22

యజ్ఞం అంటే భగవంతునికి చేసే పూజ. ప్రార్థన మీ దైనందిక జీవితంలో ఒక భాగంగా ఉండాలి. నాకు దైవచింతన చేయటానికి సమయం లేదు అనకూడదు. ఎంత హడావుడిగా ఉన్నా, తినటానికి కొంత సమయాన్ని కేటాయించుకుంటామా లేదా? అదే విధంగా భగవంతుని ప్రార్థనకు కూడా సమయాన్ని కేటాయించుకోవాలి.

దానం అంటే ఏదైనా ఇవ్వటం. మన శాస్త్రం నిర్దేశించినట్టుగా దానం చేయాలి మనం. దానం గురించి కృష్ణపరమాత్మ కొత్తగా చెప్పటం లేదు; అది ఉపనిషత్తే నిర్దేశించింది.

**శ్రద్ధయా దేయమ్ అశ్రద్ధయాఽదేయమ్। హ్రియా దేయమ్।**
**భియా దేయమ్। సంవిదా దేయమ్।** – తైత్తిరీయమ్

ఏ దానం చేసినా శ్రద్ధగా చేయాలి; అశ్రద్ధగా ఇవ్వకూడదు.

**దానం యజ్ఞానాం వరూథం దక్షిణా లోకే దాతారం**
**సర్వభూతాన్యుపజీవంతి।** – మహానారాయణోపనిషత్ 79.6

అందువల్ల ప్రతి ఒక్కరూ, వారి శక్తిమేరకు దానం చేయాలి. అందరూ లక్షరూపాయలు ఇవ్వాలనేం నియమం లేదు. వారికున్నదానిలో కనీసం కొంతశాతం దానం చేయాలి.

మూడవ అంశం తపస్సు. తపస్సు అంటే ఏదీ మితిమీరి చేయకూడదు. ఏ లక్ష్యం సాధిస్తున్నాకూడా కొంత హద్దుల్లోనే ఉండాలి. అతిగా చేయకూడదు. ఈ మధ్యమమార్గం బుద్ధభగవానుడు బోధించాడు అనుకుంటారు కొందరు. కాని బుద్ధభగవానుడు రాకముందే, శాస్త్రం ఈ మధ్యమమార్గాన్ని బోధించింది.

**యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥** – 6.17

ఆహార విహారాల్లోనూ, కర్మాచరణలోనూ, జాగ్రద్ స్వప్నాల విషయంలోనూ అతిగా చేయకుండా, మధ్యమమార్గం పాటించే వ్యక్తి యోగుడవుతాడు.

అంటే ఏదీ అతిగా చేయకూడదు. కటిక ఉపవాసమూ చేయకూడదు; అతిగానూ తినకూడదు. మధ్యమంగా ఉండాలి ఏంచేసినా!

ఈ యజ్ఞదానతపస్సుల గురించి కృష్ణపరమాత్మ పద్దెనిమిదవ అధ్యాయంలో కూడా నొక్కివక్కాణిస్తాడు.

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥** – 18.5

యజ్ఞం, దానం, తపస్సు అనే ఈ మూడు కర్మలను మాత్రం ఎన్నడూ త్యజించకు అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే అవి చిత్తశుద్ధిని కలుగజేస్తాయి.

ఒక వైదికుడు ఈ మూడు ప్రాథమిక అంశాలను ఎన్నడూ మానకూడదు. కుంటిసాకులు చెప్పి తప్పించుకోకూడదు. అందువల్ల కృష్ణపరమాత్మ ఈ మూడింటిని ఎన్నుకున్నాడు. మళ్ళీ వాటిని మూడేసి రకాలుగా విడదీసి వివరిస్తాడు. అదేమిటో చూద్దాము.

3. **యజ్ఞం** – మన శాస్త్రం మానవాళి ప్రయోజనంకోసం అనేక కర్మలను నిర్దేశించింది. ఆ కర్మలన్నిటినీ యజ్ఞం అంది. ఇప్పుడు వరుసగా సాత్త్వికయజ్ఞం, రాజసికయజ్ఞం, తామసిక యజ్ఞాల గురించి చూద్దాము. అవి కూడా రెండు కోణాల్లోంచి చూద్దాము. అవి కర్మతీరు, ఫలం.

ఎ) **సాత్త్వికయజ్ఞం** – శాస్త్రంచేత విధించబడిన కర్మ, మన ఆంతర ఎదుగుదలకోసం విధించబడిన ప్రార్థనలు, జపం, పూజ, పంచమహాయజ్ఞాలు – ఇవన్నీ సాత్త్విక కర్మలు. వీటిని నిష్కామకర్మలనీ, నిత్యనైమిత్తిక కర్మలనీ అంటారు. ఈ కర్మలను మానకుండా, కర్తవ్యంగా భావించి ఏకాగ్రతతో చేయాలి.

ఈ కర్మలను ఫలాపేక్ష లేకుండా, త్రికరణశుద్ధిగా చేయాలి.

బి) **రాజసయజ్ఞం** – రాజసయజ్ఞంలో కర్మలను దంభంకోసం చేస్తాము. దంభం అంటే ఆడంబరం. ఏ దానం చేసినా మనపేరు మొదటిపేజీలో పెద్ద అక్షరాలతో రావాలి. ఏదైనా కార్యక్రమం అయితే వందన సమర్పణలో మనపేరు విధిగా ఉండితీరాలి.

వీరు కోరే ఫలం పేరుప్రఖ్యాతులు, ధనం, హోదా, పదవి, ఆస్తి, పరపతి.

సి) **తామసయజ్ఞం** – తామసయజ్ఞంలో శాస్త్రం విధించిన కర్మలకు భిన్నంగా ఉంటాయి ఈ కర్మలు.

తామసకర్మ చేసే వ్యక్తి ఏమీ ఇవ్వటానికి ఇష్టపడడు. ఒకవేళ ఇచ్చితీరాలంటే కూడా వీలున్నంత తక్కువ ఇస్తాడు. దానం చేయడు, దక్షిణా ఇవ్వడు, శ్రాద్ధకర్మలు చేయడు.

మీకు ఆధ్యాత్మిక ఉన్నతిమీద శ్రద్ధ ఉంటే తామసికయజ్ఞాలను వెంటనే మానుకోవాలి. రాజసికయజ్ఞాలను అంతకంతకూ తగ్గించుకోవాలి. సాత్త్వికకర్మలు చేయాలి.

4. **తపస్సు** – తపస్సు అంటే లక్ష్యార్థం. ఒక అర్థం మీ ఇంద్రియాలమీద మీరు గెలుపొందటం. తపస్సు అంటే సాధారణ అర్థం ఎటువంటి క్రమశిక్షణ అయినా అది తపస్సు కిందికే వస్తుంది. అది దైవపరంగా చేసేదైనా సరే, ఆధ్యాత్మికంగా చేసేదైనా సరే. తపస్సును మళ్ళీ రెండు రకాల తపస్సుగా వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ. అవి కారణదృష్ట్యా త్రివిధం తపః, గుణదృష్ట్యా త్రివిధం తపః.

ఎ) **కారణదృష్ట్యా త్రివిధం తపః** – కారణదృష్ట్యా చేసే తపస్సులు – కాయిక, వాచిక, మానసిక తపస్సులు.

**కాయికతపస్సు** – కాయికం అంటే శరీరపరంగా చేసే పూజ. శబరిమలైకి నడుచుకుంటూ వెళ్ళటం, తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణం చేయటం గొప్ప కాయికతపస్సు.

**దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్ ।**
**బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥** – 17.14

దేవతలను, బ్రాహ్మణులను, గురుజనులను, జ్ఞానులను పూజించటం, పవిత్రంగా ఉండటం, మనోవాక్కాయ కర్మలను ఏకత్రాటిమీద ఉంచటం, బ్రహ్మచర్యం పాటించటం, అహింస పాటించటం – వీటన్నింటినీ కాయికతపస్సు అంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శరీరంతో చేసే కర్మలనీ కాయికతపస్సు కింద వస్తాయి. శాస్త్రం ఈ కాయికకర్మలకు ఎందుకింత ప్రాముఖ్యతనిచ్చింది? మనలో ఉన్న తమోగుణాన్ని పారద్రోలటానికి ఇచ్చింది. మనలో చాలామటుకు ఈ బద్ధకం పేరుకుపోయి ఉంటుంది. చలనం లేకుండా, స్థిరంగా ఉన్న వస్తువు దానంతట అది కదలదు; బాహ్యంగా ఏదైనా వచ్చి కదపాలి దాన్ని. ఈ సూత్రం వస్తువులకే కాదు, మనుష్యులకు కూడా వర్తిస్తుంది.

**ఆలస్యం హి మనుష్యాణాం శరీరస్థో మహాన్ రిపుః ।**
**నాస్త్యుద్యమసమో బంధుః కృత్వా యం నావసీదతి ॥** – నీతిశతకం 86

మనిషికి గొప్ప శత్రువు బద్ధకం అనటంలో ఏమాత్రం సందేహం లేదు. హుషారుగా ఉండగలగటం గొప్ప బంధువు.

అందువల్ల ఈ గొప్ప శత్రువును పారద్రోలాలంటే కాయికతపస్సు చేయాలి. బ్రహ్మచర్యం ఒక తపస్సు. నమస్కారం చేయటం, అందులోనూ సాష్టాంగనమస్కారం చేయటం మంచి తపస్సు.

**వాచికతపస్సు** – వాక్కుపరంగా చేసే కర్మలను వాచికకర్మలు అంటారు. వాచికతపస్సు గురించి తెలుసుకునేముందు అసలు వాగింద్రియంయొక్క గొప్పతనం గురించి తెలుసుకోవాలి. సాధారణంగా మనిషిని బుద్ధిజీవి అని పొగుడుతారు కాని, నిజానికి బుద్ధి ఎంత గొప్పదో, వాక్కు కూడా అంత గొప్పది. బుద్ధి ఆలోచించి పొందిన జ్ఞానాన్నంతటినీ వాక్కుగా మార్చగలదు. అలా మార్చగలిగే శక్తివల్లనే ఈరోజు మనకు ఇంత పుస్తకభాండాగారాలు వచ్చాయి. ఇంటర్నెట్‌లో పొందుపరచగలిగారు. ఇవన్నీ ఏమిటి? వాచికరూపంలో పొందుపరచబడిన జ్ఞానం. అంటే వాక్కు ద్వారా వెలువడినదే, తరువాత అక్షరరూపంలో నిలువ చేయబడింది.

ఉదాహరణకు **కుర్చీ** పదం తీసుకోండి. కుర్చీగా రాయబడిన పదం, కుర్చీగా వాక్కు పలికిన పదానికి అక్షరరూపం; వాక్కు పలికిన పదం ఆ వస్తువు గురించి పొందిన జ్ఞానానికి ప్రతీక. అందువల్ల పలికిన పలుకులు అవనీ, రాసిన మాటలు అవనీ, అవన్నీ జ్ఞానానికి ప్రతీకలు. ఈ జ్ఞానమే మనిషిని తక్కిన జీవులకన్నా భిన్నంగా నిలబెడుతోంది.

వేదాలు శబ్దరూపంలో ఈరోజుకు కూడా పొందుపరచబడి ఉన్నాయి. ఈ శబ్దంవల్లనే మనం ఈరోజుకు కూడా వేదాలను నేర్చుకోగలుగుతున్నాము. అందువల్ల వాక్కు మనిషిని చాలా శక్తివంతుణ్ణి చేస్తుంది. ప్రముఖశాస్త్రవేత్త న్యూటన్ కనుగొన్న భూమ్యాక్షరణశక్తిని అక్షరాలలో పొందుపరిచే మార్గమే లేకపోయిందనుకోండి, అంతగొప్ప సూత్రం ఎవరికీ తెలిసేది కాదు. వాక్కుకు అంత శక్తి ఉంది.

నిజానికి వాక్కుని రెండువైపులా పదునుగా ఉన్న కత్తితో పోలుస్తారు. ఎందుకంటే మీరు మాట్లాడే మాటలు ప్రేమపూరితంగా ఉండి, మీకు మిత్రులను తీసుకునిరావచ్చు లేదా అవి చాలా అవమానపరిచేవిగా ఉండి, మీకు శత్రువులను ఏర్పరచవచ్చు. నిజానికి అవి మీకు మృత్యువును కూడా తీసుకురావచ్చు. అందువల్ల మాట్లాడేముందు ఆచితూచి మాట్లాడాలంటారు. మాట్లాడిన మాటలకు పన్ను కట్టనవసరం లేదు కాబట్టి కొంతమంది అలా నిరంతరం మాట్లాడుతూనే ఉంటారు. కాని వాచికతపస్సు పాటించాలి. మాట్లాడే నోరును అదుపులో పెట్టుకోవాలి.

వాక్కును అదుపులో పెట్టుకోవటానికి కృష్ణపరమాత్మ నాలుగు నియమాలను బోధించాడు. మన మాటలను బయటకు వదిలేముందు, ఒకటి కాదు, రెండు కాదు, నాలుగు మెటల్ డిటెక్టర్లను దాటించి వదలాలి. వాక్‌నిరోధం ఆధ్యాత్మిక సాధనకు మొట్టమొదటి సాధన అని శంకరాచార్యులవారు అంటారు.

**యోగస్య ప్రథమం ద్వారం వాక్ నిరోధోఽ పరిగ్రహః** – వివేకచూడామణి 367

వాక్కుని నియంత్రించుకుంటే తక్కిన అన్ని అంగాలు వాటంతట అవే నిరోధించబడతాయి. ఒక్క వాక్కుని నియంత్రిస్తేనే ఎనిమిది ఇంద్రియాలు – నాలుగు జ్ఞానేంద్రియాలు, నాలుగు కర్మేంద్రియాలు – నియంత్రించబడతాయి.

కృష్ణపరమాత్మ సూచించిన నాలుగు నియమాలు ఏమిటి?

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే ॥** – 17.15

ఉద్వేగం కలిగించనిది, ప్రియమైనది, హితకరమైనది, యథార్థమైనది అయిన మాటలు మాట్లాడాలి. దీన్ని వాచికతపస్సు అంటారు.

**అనుద్వేగకరం** – మొట్టమొదటి నియమం మీరు మాట్లాడే మాటలు ఇతరులను బాధించేవిగా, వారికి ఇబ్బందికరంగా, ఉద్వేగం తెప్పించేవిగా ఉండకూడదు. మీరు ఎదుటి వ్యక్తితో మాట్లాడుతున్నారు కాని అతనికి మీ మాటలమీద శ్రద్ధ లేకపోతే, అదికూడా ఒక విధమైన హింస కిందకే వస్తుంది. నిజానికి చాలామందికి ఎదుటివారి మాటలు వినే తీరికా, ఓపికా ఉండదు. ఎలా ఆ బాధనుంచి తప్పించుకుందామా అనే చూస్తారు. అటువంటివారిని కూర్చోబెట్టి బలవంతంగా వారితో మాట్లాడటం వారికి హింసే!

అందువల్ల మీరు మాట్లాడేటప్పుడు రెండు వాక్యాలు మాట్లాడి, రెండు నిముషాలు ఆగి చూడండి. అతను ఇంకా వినాలనుకుంటే అప్పుడు చెప్పండి. ఒక్కోసారి మీ ఉద్దేశ్యంలో మీరొక రసవత్తరమైన సన్నివేశాన్ని, మీకు జరిగిన సన్నివేశాన్ని వివరిస్తున్నారు. మధ్యలో మీకు ఏదో ఫోను వచ్చింది. వెళ్ళి మాట్లాడివచ్చారు. వెనక్కి తిరిగివచ్చాక, అది అంత రసవత్తరమైనదైతే, ఎదుటివ్యక్తి, ఆ తరువాత ఏమైంది అని అడగాలి కదా! కాని, సాధారణంగా ఎవరూ అడగరు. అలా అడగకపోయినా, మీరే మళ్ళీ కొనసాగిస్తారు, మామూలుగా అయితే. కాని కృష్ణపరమాత్మ అలాంటప్పుడు దాన్ని ఆపేయాలి అంటున్నాడు.

ఇంకో పొరపాటు ఏంచేస్తారు? ఎదుటివ్యక్తి తనకైన అనుభవం ఏదో చెబుతుంటాడు. మీరు వినరు. వినకుండా, మీకు కూడా అయిన అటువంటి అనుభవాన్నే సమాంతరరేఖగా చెప్పుకుపోతారు. అతను మీమాట వినడు, మీరు అతని మాట వినరు. ఏదో గందరగోళంగా ఉంటుంది తప్పితే, ఏమీ సమాచరం వెళ్ళదు.

ఇంకొక పొరపాటు మాటలతూటాలు వదులుతుంటారు. ఎదుటివారిని విమర్శిస్తారు, తిడతారు, అమర్యాదపూర్వకంగా మాట్లాడతారు. లేకపోతే చెవులు బద్దలయ్యేటట్టుగా గట్టిగా మాట్లాడతారు. ఇవేవీ చేయకూడదు. ఒక్కముక్కలో చెప్పాలంటే అహింసాత్మక మాటలు మాట్లాడాలి.

**సత్యం** – సత్యం అంటే నిజం చెప్పటం. ఇక్కడ మీరు పాటించాల్సిన అంశం సత్యం పలకటంకన్నా, అసత్యం పలుకకూడదు. సత్యం పలకటం ఎంత ముఖ్యమో, అసత్యం పలకకుండా ఉండటం కూడా అంతే ముఖ్యం. ఇటువంటి నియమాన్ని **పరిసంఖ్యావిధి**

అంటారు. ఈ విధివాక్యంలో సానుకూలవిధికన్నా ప్రతికూలవిధిమీద ఎక్కువ నియమం ఉంటుంది. అంటే ఇక్కడ నొక్కివక్కాణించాల్సింది 'సత్యం పలుకు,' మీద కాదు, 'ఎన్నడూ అసత్యం పలకకు,' మీద. అసత్యం చెప్పకుండా నిశ్శబ్దంగా ఉండండి. చెప్పితీరాల్సిన పరిస్థితి వస్తే మాత్రం సత్యమే చెప్పాలి. సత్యం అంటే ఇది. అన్ని ఉపనిషత్తుల్లోనూ ఈ సత్యం గురించి వస్తుంది.

**సత్యమేవ జయతే** – ముండకమ్

సత్యం మాత్రమే జయిస్తుంది. ఇది ఆధ్యాత్మిక విజయం. శాస్త్రం విజయం గురించి మాట్లాడితే, అది ఆధ్యాత్మిక విజయం మాత్రమే. సమాజం భ్రష్టుపట్టిపోయి ఉన్నప్పుడు, మీరు సత్యాన్ని పాటిస్తే మీరు లౌకికంగా విజయం సాధించలేకపోవచ్చు. మీరు దాన్ని పట్టించుకోకూడదు. లౌకికంగా విజయం సాధించినా, సాధించలేకపోయినా మీరు ఆధ్యాత్మిక విజయం పొందుతారు. అందువల్ల సత్యమేవ జయతే అంటే **సత్యమేవ మోక్షం జయతే** అని మార్చుకోవాలి. మోక్షం పొందాలంటే సత్యం పలకాలి.

**ప్రియం** – మీ భాష చాలా మృదువుగా, మర్యాదగా, తీయగా, మన్ననగా ఉండాలి. చెప్పే విషయం ఎదుటివారికి నచ్చని విషయమైనా కూడా, చెప్పే విధానం ప్రియంగా ఉండాలి. కొంతమంది మనస్సు మంచి గంధంలా ఉంటుంది కాని మాట కటువుగా ఉన్నట్టుగా ఉంటుంది. అందువల్ల మాట ప్రియంగా ఉండాలి; అది చెప్పే తీరు కూడా ప్రియంగా ఉండాలి.

**హితం** – హితం అంటే మీరు మాట్లాడే మాటలు ఎదుటివారికి ఉపయోగపడేలా ఉండాలి. చాలామంది గలగలా మాట్లాడతారు; వారికి కాలక్షేపం కావాలి కాబట్టి ఎదుటివారిని కాలక్షేపం బఠానీ చేసి కబుర్లు చెప్పేస్తుంటారు. ఇది హితం కాదు. మీరు చెప్పే మాటలు మీకూ, ఇతరులకూ కూడా హితవుగా ఉండాలి. నిజానికి ఈ ఒక్క నియమాన్ని పాటిస్తే చాలు, ఇతరులమీద బురద జల్లటం, వారిమీద పుట్టించే అర్థంపర్థంలేని పుకార్లు ఆగిపోతాయి. ఈ వాచికతపస్సు పాటించకపోవటంవల్లనే ఈ పుకార్లు.

అందువల్ల అనుద్వేగకరం, సత్యం, ప్రియం, హితం అనే ఈ నాలుగు నియమాలూ పాటించితీరాలి వాచికతపస్సుకు.

**మానసికతపస్సు** –

**మనఃప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।**
**భావసంశుద్ధిరిత్యేతత్ తపో మానసముచ్యతే ॥** – 17.16

ప్రశాంతమైన మనస్సు, శాంతస్వభావం, మౌనం, మనోనిగ్రహం, మంచి ఆలోచన, స్వచ్ఛమైన ఆలోచన కలిగివుండటాన్ని మానసికతపస్సు అంటారు.

వీటిల్లో కృష్ణపరమాత్మ ప్రత్యేకించి నొక్కివక్కాణిస్తున్నవి – భావసంశుద్ధి, మనఃప్రసాదః.

**భావసంశుద్ధి** అంటే స్వచ్ఛమైన మనస్సు. స్వచ్ఛమైన మనస్సు ఎలా ఉండాలో అంతకుముందు కూడా చూశాము. మీ ఆలోచనలను మీకు తెలియకుండా ఎవరైనా బట్టబయలు చేసే అవకాశం ఉందని తెలిస్తే, మీరు చెడు ఆలోచనలు చేయరు. అందువల్ల ఎవరికైనా తెలిసినా ఫర్వాలేదు అనగలిగే స్వచ్ఛమైన ఆలోచనలనే కలిగివుండాలి. మీ మనస్సును ఎదుటివారు చదవగలిగేటంత స్వచ్ఛంగా ఉండాలి.

**మనఃప్రసాదః** అంటే ప్రశాంతమైన మనస్సు కలిగివుండటం. ఎటువంటి ఆందోళనలు, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండగలగటం. ఈ రోజుల్లో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు కనిపిస్తున్నాయి ఎక్కడ చూసినా. కాని నిజానికి ఆ కోర్సులు ఏర్పాటు చేసేవారికి కూడా స్ట్రెస్ ఉంటుంది. ఆశించిన జనం వస్తారో లేదో అనే ఆందోళన ఉంటుంది. అందువల్ల ఆందోళన చెందకూడదు.

ఇంతవరకూ కారణదృష్ట్యా త్రివిధం తపః చూశాము. అంటే కాయిక, వాచిక, మానసిక తపస్సు చూశాము.

బి) **గుణదృష్ట్యా త్రివిధం తపః** – గుణదృష్ట్యా చేసే తపస్సులు – సాత్త్విక, రాజసిక, తామసిక తపస్సులు.

కాయిక, వాచిక, మానసిక తపస్సులను ఎవరెలా ఆచరిస్తారో, ఏ దృక్పథంతో ఆచరిస్తారో, వాటికి వారు ఇచ్చే విలువేమిటో, దాన్నిబట్టి ఆ తపస్సు ఏ గుణంలోకి వస్తుందో చెప్పవచ్చు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సాత్త్విక తపస్సు** – ఎవరికోసమో మొక్కుబడిగా చేయకుండా, శాస్త్రం విధించిందని బలవంతంగా చేయకుండా, ఆ తపస్సుమీద ఉన్న గౌరవంకొద్దీ అపారమైన శ్రద్ధతో చేస్తే, దాన్ని సాత్త్వికతపస్సు అంటారు. ఇందులో ఫలాన్ని కోరకుండా నిస్వార్థంగా చేస్తారు.

**రాజసిక తపస్సు** – దీన్ని పరిణతి చెందని వ్యక్తులు పాటిస్తారు. వీరు తపస్సును లక్ష్యంగా కాక మార్గంగా ఉపయోగిస్తారు. వీరు ఇతరులనుంచి సత్కారాలను, గౌరవాలను, పూజలు అందుకోవటంకోసం చేస్తారు. వీరు పనులు దంభంతో చేస్తారు. వీరికి వచ్చే ఫలం చలం, అధ్రువమ్. అంటే ఫలం ఖచ్చితంగా వచ్చితీరుతుందని చెప్పలేము. వచ్చినా శాశ్వతం కాదు. వీరిది స్వార్థపూరితమైన తపస్సు.

**తామస తపస్సు** – వీరు తపస్సును తప్పుడు ఉద్దేశ్యంతో, తప్పుడు సంకల్పంతో, అనారోగ్యకరమైన నిర్ణయాలతో, నికృష్టమైన కార్యాలకు ఉపయోగిస్తారు. ఎవరిమీదో పగ తీర్చుకోవటంకోసం తీవ్రమైన తపస్సు చేస్తారు. పురాణాల్లో రాక్షసులు బ్రహ్మకోసం ఘోరమైన తపస్సు చేసి, బ్రహ్మ ప్రత్యక్షమైతే మరణం లేకుండా చేయమని కోరతారు. అది అసాధ్యం అంటే అనేక వరాలు కోరతారు. ఇదంతా తామసిక తపస్సులోకి వస్తుంది.

మనం వెంటనే తామసిక తపస్సు మాని, నెమ్మదిగా రాజసిక తపస్సునుంచి సాత్త్విక తపస్సుకు ఎదగాలి.

5. **దానం** – దానాన్ని కూడా వరుసగా సాత్త్విక, రాజసిక, తామసిక దానాలుగా వివరిస్తాడు.

ఎ) **సాత్త్వికదానం** – సరియైన ప్రాంతంలో, సరియైన సమయంలో, సరియైన వ్యక్తికి దానం చేస్తే అది సాత్త్వికదానం.

**దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే।**
**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥** – 17.20

దానం చేసినప్పుడు, దానంయొక్క విలువను గురించి తెలిసి చేయాలి. ప్రతిఫలం ఆశించకుండా చేయాలి. దేశకాల పాత్రలను ఎరిగి దానం చేయాలి.

బి) **రాజసిక దానం** – సాత్త్వికదానాలలో దానాన్ని లక్ష్యంగా చూస్తే, రాజసిక దానంలో దానాన్ని మార్గంగా చూస్తారు.

**యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః।**
**దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥** – 17.21

ఏ దానమైతే ప్రత్యుపకారాన్ని ఆశించి చేస్తారో, లేదా పుణ్యంకోసం చేస్తారో, అది రాజసికదానం.

ఆనందంగా ఇచ్చేబదులు, ఆర్భాటంగా ఇస్తారు. అతను దానం చేసేది పేరుప్రతిష్ఠల కోసం. అందువల్ల తన పేరు పేపర్లలో కొట్టొచ్చినట్టుగా కనబడేలా చూస్తాడు. తామసిక దానంకన్నా ఇది నయమే!

సి) **తామసిక దానం** – తామసిక దానంలో దేశకాల పాత్రలను ఎరగకుండా చేస్తాడు. అవమానపరుస్తూ, అగౌరవంగా చూస్తూ ఇస్తాడు.

**అదేశకాలే యద్దానమ్ అపాత్రేభ్యశ్చ దీయతే।**
**అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్ ॥** – 17.22

దానం పుచ్చుకునేవారిమీద గౌరవం లేకుండా తృణీకారభావంతో ఇవ్వటం, ఉచితం కాని దేశంలో, ఉచితం కాని కాలంలో, అర్హులు కానివారికి ఇచ్చే దానాన్ని తామసిక దానం అంటారు.

బదరీనాథ్ వెళుతున్న వ్యక్తి మిమ్మల్ని స్వెట్టర్ ఇమ్మని అడిగితే, మీరు అప్పుడు ఇవ్వకుండా, అతను తిరిగివచ్చాక, మంచి ఎండాకాలంలో అతనికి స్వెట్టర్ ఇచ్చి లాభమేమిటి? ఏదైనా ఇచ్చినా, అతన్ని అవమానపరుస్తూ ఇవ్వకూడదు. లేదా పదిసార్లు మీచుట్టూ తిప్పించుకుని ఇవ్వకూడదు. ఇది మంచి పద్ధతి కాదు కాని, అసలు దానం చేయకపోవటంకన్నా నయమే. కాని తామసిక దానం మాని, రాజసిక దానం తగ్గించుకుని, సాత్త్వికదానానికి రావాలి.

**ఓం తత్సత్ వివరణ** – ఈ క్రింది భావనతో ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. మీకు సాత్త్విక పురుషునిగా మారాలనే సదుద్దేశం ఉన్నాకూడా, మీకు తెలియకుండానే మీ కర్మలు రాజసిక కర్మలుగానో, తామసిక కర్మలుగానో మారే ప్రమాదం ఉంది. కృష్ణపరమాత్మ, అయినా ఏం ఫర్వాలేదు అంటున్నాడు. తప్పులు చేయటం మానవసహజం. కాని దానికొక పరిష్కారం ఉంది. చేసే కర్మను మీరు చేశాక, దాన్ని 'ఓం తత్ సత్' అని పలికి భగవంతునికి అర్పించండి. అప్పుడది సాత్త్వికకర్మ అవుతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః ।**
**బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥** – 17.23

ఓం, తత్, సత్ అనే మూడు పదాలు భగవంతుని నామాలు. ఈ మూడుపదాలవల్ల బ్రాహ్మణులు, వేదాలు, యజ్ఞాలు సృష్టించబడ్డాయి.

**ఓం** – ఓం అంటే జగద్రక్షకుడు.

అవతి రక్షతి పాలయతి ఇతి ఓమ్

అందువల్ల ఓం అంటే రక్షణకర్త, పాలనకర్త అంటారు.

**తత్** – తత్ అంటే ప్రమేయం గురించి. జ్ఞానం పొందే ప్రమాణాలకు అందని భగవంతుడు. అంటే సర్వప్రమాణ అగోచరం. అంటే అప్రమేయం.

**సత్** – సత్ అంటే శాశ్వతమైన తత్త్వం. ఉనికిరూపంలో సదా ఉండే భగవంతుడు.

ఇప్పుడు ఓం తత్ సత్ మూడు పదాల అర్థాలను కలిపితే, పూర్తి అర్థం ఇలా వస్తుంది. ప్రమాణాలకందని, శాశ్వతమైన ఉనికి ఉన్న జగద్రక్షకుడు భగవంతుడు.

అందువల్ల మీరు ఏ కర్మను చేసినా, ఓం తత్సత్ కృష్ణార్పణమస్తు అనో, ఓం తత్సత్ రామార్పణమస్తు అనో భగవంతునికి భక్తిగా అర్పించండి. ఈ మంత్రం ఎంత శక్తివంతమైనదంటే, ఓం తత్ సత్ అని పలికి భగవంతునికి అర్పిస్తే, మీరు చేసే కర్మలు రాజసిక కర్మలు అయినా, తామసిక కర్మలు అయినా కూడా అవి సాత్త్విక కర్మలుగా మారతాయి.

మీరు చేసిన పూజలో ఏమైనా తప్పులు ఉన్నా, మంత్రాలు సరిగ్గా పఠించకపోయినా, భగవంతుడు క్షమిస్తాడు. అలాగని కావాలని తప్పులు చేయకూడదు. మంత్రాలను సరిగ్గా పఠించాలి. మీకు తెలియకుండా తప్పులు దొర్లితే మాత్రం ఓం తత్ సత్ పనిచేస్తుంది. ఉదాహరణకు, మీరు చూడకుండా ఎవరి కాలో తొక్కితే, మీరు 'సారీ' అంటారు. వారు కూడా 'ఫర్వాలేదండి,' అంటారు. అదే మీరు కావాలని వారి కాలుతొక్కి, 'సారీ,' అంటే వారేం చేస్తారు? వారు కూడా అదేపని చేసి, 'సారీ అండీ,' అంటారు. అందువల్ల 'ఓం తత్ సత్,' మంత్రాన్ని అపహాస్యం చేయకూడదు. శ్రద్ధాభక్తులతో వాడాలి.

దీనితో పదిహేడవ అధ్యాయం ముగిసింది. కాని ఈ రెండు (పదహారు, పదిహేడు) అధ్యాయాల్లోనూ కృష్ణపరమాత్మ చర్చించని ఒక అంశాన్ని చూద్దాము ఇక్కడ. అది చాలా అవసరం, ముఖ్యం, మీకు లాభదాయకం కూడా.

### ఐదు సూత్రాల సాధన

ఈ రెండు అధ్యాయాలలోనూ కృష్ణపరమాత్మ మనం పెంపొందించుకోవాల్సిన దైవీసంపత్తి గురించి, మనం పారద్రోలాల్సిన ఆసురీసంపత్తి, రాక్షసప్రవృత్తుల గురించి చెప్పాడు. కాని అవి ఎలా చేయాలో చెప్పలేదు. ఒకటి పెంచుకోవాలన్నాడు; ఇంకో రెండు పారద్రోలాలన్నాడు. వాటిని ఎలా చేయాలో మనమే వెతుక్కోవాలి. నిజానికి మనం కొత్తగా ఏమీ నేర్చుకోనవసరం లేదు. శాస్త్రమే ప్రతిదీ నేర్పిస్తుంది. శాస్త్రమే వీటికి పద్ధతులను కూడా ఇచ్చింది. మనం ఇక్కడ చేస్తున్నదల్లా చెదురుమదురుగా ఉన్న ఆ సాధనలను ఏరుకుని, ఐదు సూత్రాల సాధనగా పేర్చుకుంటున్నాము అంతే. ఈ ఐదు సూత్రాల సాధన చేస్తే దైవీసంపత్తిని పెంపొందించుకుని, ఆసురీసంపత్తి, రాక్షసప్రవృత్తులను పారద్రోలవచ్చు. అవేమిటో చూద్దాము.

ఎ) **వివేకం** – వివేకం అంటే కృష్ణపరమాత్మ పేర్కొన్న విలువలలో ఒక్కొక్క విలువయొక్క విలువ గురించి అధ్యయనం చేయాలి. ఉదాహరణకు **సత్యం** విలువ తీసుకోండి. నేను అబద్ధం చెబితే కలిగే పరిణామాలు ఏమిటి అని మీరు మీకు విశ్లేషించుకోవాలి. మీరు అబద్ధం చెబితే, మనస్సులో మార్పులు రావటమే కాదు, శారీరకంగా కూడా మార్పులు ఏర్పడతాయి. దానివల్లనే **లై డిటెక్టర్లు** వచ్చాయి. సూక్ష్మశరీరాన్ని కూడా ప్రభావితం చేస్తుంది.

అందువల్ల ప్రతి ఒక్క విలువనీ తీసుకుని, దాని గురించి పూర్తి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. ఇవన్నీ ఆధ్యాత్మిక సూత్రాలు. ఈ ఆధ్యాత్మిక సూత్రాలను అలవరచుకునేలా మీ మనస్సును సున్నితంగా చేసుకోవాలి. ఒక విలువను ఉల్లంఘిస్తే, అది ఆధ్యాత్మిక నష్టానికి దారితీస్తుంది. ధర్మానికి ప్రతీకగా నిలిచిన ధర్మరాజు అశ్వత్థామ అతః

కుంజరః అని పలికినప్పుడు, అది పూర్తి అబద్ధం కాకపోయినా, ధర్మరాజు రథం నేలను తాకింది. అది ఆధ్యాత్మిక పతనానికి సంకేతం. ఆ విషయం గ్రహించాలంటే, మనస్సు చాలా సూక్ష్మంగా ఉండాలి. అందువల్ల విలువలను అధ్యయనం చేసేముందు మనస్సును సూక్ష్మంగా చేసుకోవాలి.

మనం ఎన్నడూ విలువలను అంతగా పట్టించుకోము. అందువల్ల స్వామీ దయానందజీ ఎప్పుడూ అంటారు, **'ఒక విలువ, విలువైనది అవాలంటే, ఆ విలువయొక్క విలువకు మీరు విలువ ఇవ్వాలి.'** ఇది చాలాచాలా ముఖ్యమైన వాక్యం. విలువయొక్క విలువ తెలియాలంటే విలువ గురించి పూర్తి జ్ఞానం ఉండాలి. ఆ జ్ఞానాన్ని **వివేకం** అంటారు.

బి) **సంకల్పం** – సంకల్పం అంటే ఒక దృఢనిశ్చయం చేసుకోవటం. హరిశ్చంద్రుడు సత్యమే పలుకుతానని దృఢనిశ్చయం చేసుకుని, సత్యానికి ప్రతీకగా నిలిచాడు. అందువల్లనే ఆయనను సత్యహరిశ్చంద్రుడు అంటారు. అదే విధంగా మీరు కూడా ఏది ఏమైనా ఈ విలువను నేను పాటించి తీరుతాను అని దృఢంగా నిశ్చయించుకోవాలి. అలా ఆ నిశ్చయంలో నిలబడాలంటే, రోజంతా దాన్ని నెమరువేసుకుంటూ ఉండాలి. అంతేకాదు, మీరు ఆ విలువను అతిక్రమించినప్పుడల్లా దానికి ప్రాయశ్చిత్తకర్మ చేసేలా చూసుకోవాలి. గాంధీగారు తను ఒక విలువను పాటించలేదు అని తను భావించినప్పుడల్లా ఉపవాసం ఉండేవారు. ఆయన చేసిన ప్రాయశ్చిత్తకర్మ ఉపవాసం ఉండటం. అందువల్ల సంకల్పం చేసుకోండి. దాన్ని ఆటోసజెషన్ అనో, వ్రతం అనో అనవచ్చు.

సి) **ప్రతిపక్షభావన** – ప్రతిపక్షభావన అంటే మీకు కలిగిన భావనకు ప్రయత్నపూర్వకంగా భిన్నమైన భావనను పెంపొందించుకోవటం. మీరు ఎవరినైనా ద్వేషిస్తున్నట్టయితే, ప్రయత్నపూర్వకంగా 'ప్రేమ' సాధన చేయండి. ఇది ఒక విధమైన బౌద్ధమత ధ్యానం. మీరు ద్వేషిస్తున్న వ్యక్తిని మానసికంగా మీముందు నిలబెట్టండి. అలా వారిని తలుచుకోగానే మీ రక్తపోటు పెరుగుతుంది, మాకు తెలుసు; అయినాసరే వారిని మీముందు నిలబెట్టి (మానసికంగా) పువ్వులు అందించి (అదీ మానసికంగా), 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను,' అని చెప్పండి. అలాగే మీరు పీనాసులుగా ఉంటే, ప్రయత్నపూర్వకంగా దానం చేయండి. ఇలా చేయటాన్ని ప్రతిపక్షభావన అంటారు.

డి) **సత్సంగం** – సత్సంగం అంటే సత్పురుషులతో సాంగత్యం చేయటం. వారితో కలిసి ఉండటంవల్ల, మీకు తెలియకుండానే వారి లక్షణాలను మీరు పుణికిపుచ్చుకుంటారు. అందువల్ల సత్సంగం చేస్తే, మీకు తెలియకుండా, ఎక్కువ శ్రమ పడకుండా, అనుకోకుండా మంచి విలువలను పెంపొందించుకుంటారు. అందువల్ల సత్సంగం అప్రయత్నంగా మీలో కనబడే మార్పును తీసుకువస్తుంది.

ఇ) **ప్రార్థన** – ఈ పైన చెప్పిన వాటిలో ఏ ఒక్కటీ ఫలించకపోతే, భగవంతునికి ప్రార్థన చేయండి.

**తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సంతు ।**

'ఓ దేవా! ఉపనిషత్తులు పేర్కొన్న విలువలను నేను నా ప్రయత్నంవల్ల పెంపొందించుకోకుండా ఉన్నాను. నువ్వే నాకు మార్గం చూపాలి,' అని ప్రార్థించండి.

ఆ విధంగా వివేకం, సంకల్పం, ప్రతిపక్షభావన, సత్సంగం, ప్రార్థన అని ఐదు సాధనలు చేస్తే సంస్కృతపురుషుడయి, దాని తరువాత జ్ఞాని అయి ముక్తపురుషుడవుతాడు. ఈ అధ్యాయం మూడు రకాల శ్రద్ధ గురించి వివరిస్తుంది కాబట్టి దీన్ని శ్రద్ధాత్రయవిభాగయోగము అంటారు.

# మోక్షసన్యాసయోగము

## అధ్యాయము 18

భగవద్గీతలో రెండవ అధ్యాయము, పద్దెనిమిదవ అధ్యాయము చాలా ముఖ్యమైన అధ్యాయాలు. ఎందుకంటే ఈ రెండింటిలోనూ కృష్ణపరమాత్మ మొత్తం గీతాసారాంశాన్ని సంగ్రహంగా బోధించాడు. కాకపోతే రెండింటి మధ్యా సూక్ష్మభేదం ఉంది. రెండవ అధ్యాయంలో చెప్పిన సంగ్రహం – ఉపోద్ఘాతం, దాన్ని ఉపక్రమసంక్షేపము అంటారు. పదిహేడవ అధ్యాయము వరకూ ఆ సారాన్ని విస్తారంగా చెప్పుకువస్తాడు. పద్దెనిమిదవ అధ్యాయము ఉపసంహారసంక్షేపము.

| | |
|---|---|
| అధ్యాయము 2 | – ఉపక్రమసంక్షేపము |
| అధ్యాయాలు 3–17 | – విస్తారము |
| అధ్యాయము 18 | – ఉపసంహారసంక్షేపము. |

అందువల్ల ఈ అధ్యాయంలో కొత్త విషయాలేమీ చూడము. అంతకుముందు బోధించిన వాటినే మళ్ళీ నొక్కివక్కాణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈ అధ్యాయాన్ని మన వీలుకోసం నాలుగు భాగాలుగా విభజించుకుందాము. అవి –

1. మూడు విధాల సాధనలు
2. కర్మయోగ సారాంశం
3. జ్ఞానయోగ సారాంశం
4. గీతాబోధ సారాంశం

ఇవికాక ఉపసంహారం ఇలా చూస్తాము –

ఎ) సాంప్రదాయ విధి

బి) కృష్ణార్జునుల సంవాద ఉపసంహారం

సి) సంజయుడు చెప్పిన ఫలశ్రుతి

(వీటిని శ్లోకాల పరంగా చూడటం లేదు.)

1. **మూడు విధాల సాధనలు** – మూడు విధాల సాధనలు – సాత్త్విక, రాజసిక, తామసిక సాధనలు. ఈ మూడు సాధనల కింద ఐదు అంశాలను పదిహేడవ అధ్యాయంలో చూశాము. అవి – శ్రద్ధ, ఆహారం, యజ్ఞం, తపస్సు, దానం. వీటన్నిటిలోనూ సాత్త్విక పద్ధతినే పాటించాలని, తామసిక పద్ధతిని వెంటనే మానుకోవాలనీ, రాజసిక పద్ధతిని కాలక్రమేణా తగ్గించుకుంటూ రావాలనీ చూశాము. ఇప్పుడు అదే పద్ధతిలో మూడు విధాల సాధనల

గురించి చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఏడు అంశాలు తీసుకుని ప్రతి ఒక్కదానిలో ఈ మూడు సాధనలనూ చర్చించబోతున్నాడు. ఆ అంశాలు – **సన్న్యాసం, జ్ఞానం, కర్మ, కర్త, బుద్ధి, ధృతి, సుఖం.** వీటన్నిటిలోనూ సాత్త్విక లక్షణాన్నే పాటించాలనేది లక్ష్యం. ఉదాహరణకు మనం కర్మలు చేస్తే చాలదు; ఆ కర్మలు సాత్త్విక కర్మలై ఉండాలి. అలాగే సుఖాలు అనుభవిస్తే చాలదు; ఆ సుఖం సాత్త్విక సుఖమై ఉండాలి. కృష్ణపరమాత్మ వివరించిన ఆ ఏడింటినీ సూక్ష్మంగా చూద్దాము.

ఎ) **మూడు రకాల సన్న్యాసం – సాత్త్విక సన్న్యాసం** అంటే నియతకర్మలను చేస్తూ, వాటి ఫలాలను త్యజించటం. ఫలాలను త్యజించటం అంటే ఫలం గురించిన ఆందోళనలను త్యజించటం.

**రాజసిక సన్న్యాసం** అంటే దేహాభిమానంవల్ల నియతకర్మలు త్యజించటం. ఆ నియత కర్మలు ముఖ్యం అని తెలిసినా కూడా శరీరాన్ని కష్టపెట్టటం ఇష్టంలేక చేయరు. ఎందుకంటే జీవితాన్ని హాయిగా, శారీరకశ్రమ లేకుండా గడిపేయాలి అనుకుంటారు. అందువల్ల తెలిసి తెలిసీ ధర్మాన్ని పరిత్యజించటాన్ని రాజసిక సన్న్యాసం అంటారు.

**తామసిక సన్న్యాసం** అంటే అజ్ఞానంవల్ల నియతకర్మలను త్యజించటం. ఈ నియత కర్మలు ఆంతర ఎదుగుదలకు తోడ్పడతాయనే జ్ఞానం లేకపోవటంవల్ల చేయరు.

ఈ మూడింటిలో సాత్త్విక సన్న్యాసం పాటించాలి. అంటే కర్మను చేయాలి, ఆందోళనను త్యజించాలి.

బి) **మూడు రకాల జ్ఞానం – సాత్త్వికజ్ఞానం** అంటే **ఆత్మ ఏకత్వజ్ఞానం**. శరీరానికి భిన్నంగా ఆత్మ ఉందనీ, ఆ ఆత్మ సర్వవ్యాపకం అనీ, అన్ని శరీరాల్లోనూ అదే ఆత్మ ఉందనీ అర్థం చేసుకోవటం. ఉదాహరణకు ముత్యాలగొలుసులోని దారం తీసుకుంటే, ఆ దారం ముత్యాలకు భిన్నంగా ఉంది కాని అన్ని ముత్యాలకూ ఆధారంగా ఉంది, వాటిని ఏకత్రాటి మీద ఉంచుతున్నది.

**సూత్రే మణిగణాః ఇవ**

ముత్యాలు అనేకం, సూత్రం ఏకం. నేను ఆత్మను. ఆత్మ ఏకం, నిర్వికారం, అవ్యయం, అవిభక్తం అంటారు.

**రాజసిక జ్ఞానం** అంటే **ఆత్మ బహూత్వజ్ఞానం**. వీరు కూడా శరీరానికి భిన్నంగా ఆత్మ ఉంది అంటారు కాని ఎన్ని శరీరాలు ఉంటే, అన్ని ఆత్మలు ఉన్నాయి అంటారు. నిజానికి ఉన్నది ఒకటే ఆత్మ. వారు ఆత్మ అంటే మనస్సు అనుకుంటారు. అందువల్ల వీరు నేను మనస్సును, అనేక జీవాత్మలు ఉన్నాయి అంటారు.

**తామసిక జ్ఞానం** అంటే **శరీరమే ఆత్మ** అనుకోటం. శరీరానికి భిన్నంగా ఆత్మ అనేది ఇంకొకటి ఉందని ఒప్పుకోరు వీరు. దాన్ని దేహాత్మబుద్ధి అంటారు. అందువల్ల వీరి జ్ఞానం నేను శరీరాన్ని, అనేక శరీరాలు ఉన్నాయి.

సి) **మూడు రకాల కర్మ – సాత్త్విక కర్మ** అంటే ధర్మప్రధాన కర్మలు, రాగద్వేష అప్రధాన కర్మలు, నియతకర్మలను చేయటం. మొత్తం సమాజానికి మేలు చేసే కర్మలు, వ్యక్తిగత రాగద్వేషాలను పట్టించుకోకుండా ఇతరుల మంచి కోరే కర్మలు. సమాజం మేలు కోరి చేసే కర్మలవల్ల మీరు కూడా లాభం పొందుతారు. లోకాః సమస్తాః సుఖినో భవంతు అన్నాక మా అబ్బాయి కూడా బాగుండాలి అని కోరాలా అంటే అవసరం లేదు. ఎందుకంటే సమస్త లోకంలో మీ అబ్బాయి కూడా ఉన్నాడు కాని, లోకం బయట లేడుకదా! అలాగే సమస్తలోకంకోసం ఫలాపేక్ష లేకుండా చేసే కర్మవల్ల మీరు కూడా లాభం పొందుతారు. అందువల్ల సాత్త్వికకర్మ అంటే ధర్మప్రధానకర్మ, రాగద్వేష అప్రధానకర్మ.

**రాజసిక కర్మ** అంటే రాగద్వేష ప్రధానకర్మ. లౌకికవిజయాలకోసం, అహంకార దర్పంతో, ఒత్తిడి, ఆందోళనలకు లోనై చేసే కర్మ.

**తామసిక కర్మ** అంటే ద్వేషప్రధాన కర్మ. సమాజానికి హానిచేసే కర్మ.

డి) **మూడు రకాల కర్త** – కర్త అంటే కర్మ చేసేవ్యక్తి. అసలైతే సాత్త్విక కర్మ చేసేవ్యక్తి సాత్త్విక కర్త; రాజసిక కర్మ చేసేవ్యక్తి రాజసిక కర్త; తామసిక కర్మ చేసేవ్యక్తి తామసిక కర్త. కాని కృష్ణపరమాత్మ వారిని వేరే విధంగా నిర్వచిస్తున్నాడు. కృష్ణపరమాత్మ ఆదిగురువు. ఒక మంచిగురువు, శిష్యుడు అర్థం చేసుకుంటాడులే అని ఏదీ వదిలివేయడు. అందువల్ల కర్తను మూడు రకాలుగా నిర్వచించబోతున్నాడు.

**సాత్త్విక కర్త –**

**ముక్తసంగోఽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।**
**సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥** – 18.26

సంగత్వం, అహంకారం లేని, పట్టుదల, ఉత్సాహం ఉన్న, జయాపజయాలకు చలించని కర్తను సాత్త్విక కర్త అంటారు.

**రాజసిక కర్త –**

**రాగీ కర్మఫలప్రేప్సుః లుబ్ధో హింసాత్మకోఽశుచిః ।**
**హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥** – 18.27

రాగం, విజయాలమీద మక్కువ, లోభత్వం, హింసాత్మకత్వం, అనుమానం, హర్షశోకాలు ఉన్న కర్తను రాజసిక కర్త అంటారు.

**తామసిక కర్త –**

**అయుక్తః ప్రాకృతః స్తబ్ధః శఠో నైష్కృతికోఽలసః ।**
**విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥** – 18.28

యోగికాని వ్యక్తి, ప్రాకృతపురుషుడు, మూర్ఖుడు, మాయావి, ఇతరుల పనికి అడ్డం వచ్చే వ్యక్తి, సోమరిపోతు, పనిని వాయిదా వేసే కర్తను తామసిక కర్త అంటారు.

ఇ) **మూడు రకాల బుద్ధి** – బుద్ధి అంటే తెలివితేటలు.

**సాత్త్విక బుద్ధి** – సాత్త్విక బుద్ధి అంటే ధర్మాధర్మాలు, కార్యాకార్యాలు, భయాభయాలు, బంధమోక్షాల గురించిన విచక్షణ ఉన్న బుద్ధి.

**రాజసిక బుద్ధి** – రాజసిక బుద్ధి అంటే ధర్మాధర్మాలు, కార్యాకార్యాల గురించిన పూర్తి జ్ఞానం లేని బుద్ధి.

ఫలానా రైలు ఎప్పుడు వెళుతుంది అని వీరిని అడిగితే, 'ఏడుగంటలకు వెళుతుంది, అనుకుంటాను,' అంటారు. అనుకుంటాను అంటే మీరు ఆ సమాచారాన్ని ఖచ్చితంగా తీసుకోలేరు. అలా సందేహంతో కూడిన జ్ఞానం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. అది అజ్ఞానంతో సమానం. అందువల్ల సాత్త్వికజ్ఞానం నిశ్చయజ్ఞానం అయితే రాజసికజ్ఞానం సంశయజ్ఞానం. జ్ఞానాన్నిబట్టి సాత్త్విక బుద్ధి, రాజసిక బుద్ది అంటారు.

**తామసిక బుద్ధి** – తామసిక బుద్ధి అంటే ధర్మాధర్మాలు, కార్యాకార్యాల గురించిన విచక్షణ అసలు లేకపోయినా, అంతా నాకే తెలుసు అనుకునే బుద్ధి. అతనికి తెలిసినది తప్పు. కాని అతనికి సరియైన జ్ఞానం లేదనే సందేహమే రాదు. అక్కడ తాడు ఉండి, చిరుచీకటిగా ఉంటే, అది తాడు, తాడు మాత్రమే అని ఎవరైనా అంటే అతనికి సాత్త్విక జ్ఞానం ఉంది, అతనిది సాత్త్వికబుద్ధి అని చెప్పవచ్చు. అలా కాకుండా ఏమో, అది తాడు అవచ్చు లేదా పాము అవచ్చు అంటే అతనిది రాజసికజ్ఞానంతో కూడిన రాజసిక బుద్ధి. ఇంకొక వ్యక్తి వచ్చి అది తాడు కాదు, పాము మాత్రమే అని నిశ్చయంగా చెబితే, అది తామసిక జ్ఞానంతో కూడిన తామసిక బుద్ధి. ఈ చివరివ్యక్తి తనకు తెలియదు, ఇంకొకరు చెబితే వినడు. అటువంటి జ్ఞానాన్ని విపర్యయ జ్ఞానం అంటారు. ఈ విపర్యయ జ్ఞానాన్ని ఇచ్చేది తామసబుద్ధి.

**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః** – 1.36

వారు ఆతతాయిలైనా, వారిని చంపితే పాపం వస్తుంది అన్నాడు అర్జునుడు.

దుర్యోధనాదులను ఆతతాయిలు అన్నాడు. అంటే వారు ఘోరమైన నేరాలు చేసినవారు. అటువంటి నేరస్తులను శిక్షించటం ధర్మం, కాని అర్జునుడు అప్పుడు వారిమీద మోహంలో

ఉన్నాడు. వారిని నేను చంపితే, నేను పాపం మూటకట్టుకుంటాను అన్నాడు. ఈ బుద్ధి ఏ బుద్ధి? సాత్త్వికమా, రాజసికమా, తామసికమా? ఇది మహాతామసికం.

అదృష్టం ఏమిటంటే, అర్జునుడు ఆలస్యం కాకుండా, తను మోహంలో పడ్డాడని గ్రహించాడు.

**కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః** – 2.7

నేను మోహంలో పడ్డాను, ధర్మాధర్మ విచక్షణ కోల్పోయాను అన్నాడు. అప్పుడది తామసిక బుద్ధి. ఈ విధంగా మూడు రకాల బుద్ధి గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ.

ఎఫ్) **మూడు రకాల ధృతి** – ఆధ్యాత్మిక ఉన్నతి పొందాలంటే విచక్షణాశక్తి ఉన్న బుద్ధి ఒక్కటే చాలదు. పట్టుదల కూడా దానికి తోడవాలి. దాన్ని విల్‌పవర్ అంటారు ఇంగ్లీషులో.

**సాత్త్విక ధృతి** – మనస్సు, ప్రాణం, ఇంద్రియాలు చేసే క్రియలను ఆధ్యాత్మిక చింతన వైపు యోగా ద్వారా ఏకీకృతం చేసే ధృతి. ఎటువంటి ఆటంకం ఎదురైనా ఆగరు.

**రాజసిక ధృతి** – వీరికి కూడా ఫ్రీవిల్ ఉంటుంది. సాత్త్విక ధృతి ఉన్నవారు ఆధ్యాత్మికత వైపు మొగ్గుచూపితే, రాజసిక ధృతి ఉన్నవారు ధర్మార్థకామాల వెంట, లౌకికవిజయాల కోసం, తీవ్రమైన కోరికలతో పరుగులు తీస్తూనే ఉంటారు. 'నేను మద్రాసుకు నాలుగు అణాలతో వచ్చాను. ఈరోజు నా సామ్రాజ్యాన్ని ఏర్పరచాను,' అంటాడు గర్వంగా. నిజమే! అది సామాన్యమైన విషయం కాదు. ఏమీలేని స్థాయినుంచి అంత సామ్రాజ్యాన్ని ఏర్పరచాలంటే, దానికి ఎంతో విల్‌పవర్, ఉండాలి; ఎంతో కష్టపడి, రాత్రింబవళ్ళు పని చేయాలి. కాని ఇది రాజసిక ధృతి.

**తామసిక ధృతి** – ఈ తెగవారికి కూడా విల్‌పవర్ ఉంటుంది కాని, ఏపనీ చేయకూడదనే దృఢనిశ్చయం ఉంటుంది. వారు అటు ఆధ్యాత్మిక సాధనా చేయరు, ఇటు లౌకిక విజయాల కోసమూ ప్రయత్నం చేయరు. ఆమాటకొస్తే అసలు ఏపనీ చేయరు. ఇటువంటివారిని, 'లేవగానే ఆకలి అంటారు; తినగానే నిద్ర అంటారు,' అని వర్ణిస్తారు. అంటే తినటం, పడుకోవటం తప్ప వేరేపనేం చేయరు వారు. ఇలా పశుప్రవృత్తితో ప్రవర్తించే వారిది తామసిక ధృతి అంటారు. పగటికలలు కంటూ, భయం, శోకం, విషాదం, మదం అనే గుణాలను వదిలిపెట్టకుండా చేసే ధృతి ఇది.

జి) **మూడు రకాల సుఖం** – సుఖం అంటే ఆనందం. ప్రతివ్యక్తి కూడా ఆనందం కావాలని కోరుకుంటాడు. ఆ కోరిక స్వతహాగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆనందం కావాలని కోరుకోవటం వరకూ అందరూ సమానమే. కాని ఆ కోరుకునే ఆనందం మనిషి మనిషికీ మారుతుంది.

**సాత్త్విక సుఖం** – మొదట విషతుల్యంగా అనిపించినా, చివరికి అమృతంలా ఉండి, ఆత్మజ్ఞానంవల్ల కలిగే ఆనందాన్ని సాత్త్విక సుఖం అంటారు. తనలోనే ఆనందం పొందుతాడు.

**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే** – 3.17

అతను ఆత్మలోనే రమిస్తాడు. అటువంటి వ్యక్తికి ఎటువంటి కర్తవ్యమూ ఉండదు.

**విషయేంద్రియసంయోగాత్ యత్తదగ్రేఽమృతోపమమ్ ।**
**పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥** – 18.38

**రాజసిక సుఖం** – మొదట అమృతంలా ఉండి, తరువాత విషతుల్యంగా ఉండే విషయవస్తువులవల్ల కలిగే సుఖాన్ని రాజసిక సుఖం అంటారు.

బాహ్యవస్తువులలో ఆనందం ఉంది అనుకుంటాడు. నాకు ఐశ్వర్యం ఉంది కాబట్టి నేను ఆనందంగా ఉన్నాను; నా పిల్లలు నా మాట వింటారు కాబట్టి నేను ఆనందంగా ఉన్నాను; నేను మంచి హోదాలో ఉన్నాను కాబట్టి నేను ఆనందంగా ఉన్నాను అనుకుంటాడు. అది మొదట్లో అమృతంలా ఉన్నా, ఎప్పుడైతే అతని ఆనందానికి కారణం మాయమవుతుందో, అప్పుడే ఆనందం కూడా మాయమవుతుంది. ఆనందం పోయి దుఃఖం వస్తుంది. ఆ వస్తువు ఉంటే ఎంత ఆనందం కలుగుతుందో, అది పోతే అంత బాధ కలుగుతుంది. ఆనందం స్థాయిలో బాధకూడా ఉంటుంది.

**తామసిక సుఖం** –

**యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః ।**
**నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥** – 18.39

మొదట, చివర కూడా మనస్సును మోహంలో పడవేసి నిద్ర, సోమరితనం, నిర్లక్ష్యాల వల్ల కలిగే సుఖాన్ని తామసిక సుఖం అంటారు.

ఈ వ్యక్తికి అటు ఆధ్యాత్మిక చింతనా ఉండదు; ఇటు లౌకిక విజయాలమీద తపనా ఉండదు. ఈ రెండింటికీ ఫ్రీవిల్ కావాలి. తామసికవ్యక్తి దాన్ని నమ్మడు; ఒకవేళ పొరపాటుగా నమ్మినా వాడడు. అంత ఓపిక ఉండదు అతనికి. ఆధ్యాత్మిక చింతన ఉండాలంటే బుద్ధి పదునుగా ఉండాలి; లౌకిక విజయాలు కావాలంటే హుషారుగా ఉండాలి. ఈ రెండూ ఉండవు అతనికి. అతని బుద్ధి మందకొడిగా ఉంటుంది; శరీరం బద్ధకానికి ప్రతీకగా ఉంటుంది. జంతువులకీ, అతనికీ మధ్య ఏమీ భేదం ఉండదు.

ఈ విధంగా సృష్టిలో ఏ వస్తువు కూడా ఈ మూడు గుణాలు లేకుండా లేవు అని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ప్రకృతిలో ఈ మూడుగుణాలు ఉన్నాయి కాబట్టి, అవి కార్యం

అంతటా ఉంటాయి. ఈ మూడుగుణాల లక్షణాలను సరిగ్గా అర్థం చేసుకుంటే, మీరు మీ జీవితాన్ని సరియైన బాటలో నడిపించుకోవచ్చు.

2. **కర్మయోగ సారాంశం** – గీతాబోధలోని ఒక ముఖ్య అంశమైన కర్మయోగం సారాంశాన్ని మళ్ళీ చెప్పదలుచుకున్నాడు కృష్ణపరమాత్మ.

కర్మయోగం = సరియైన కర్మ + సరియైన దృక్పథం

ఇదంతా వివరంగా మూడవ అధ్యాయంలో చూశాము.

**సరియైన కర్మ** – సరియైన కర్మ అంటే మీరు ఎన్నుకున్న వృత్తి ద్వారా సమాజానికి సేవ చేయటం. వృత్తి అంటే మీకు జీవనోపాధిని ఏర్పాటుచేసి, తద్వారా మీరు సంఘసేవ చేసేలా చేసేది. సాధారణంగా ఎవరైనా ఉద్యోగం చేసేది డబ్బు సంపాదించటంకోసం అంటారు. ఉదరనిమిత్తం బహుకృత వేషం! అందువల్ల వస్తుంది సమస్యంతా.

సమాజసేవ ముందుండాలి; స్వసుఖం తరువాత రావాలి. అందువల్ల సరియైన రంగాన్ని ఎన్నుకోవటం, ఆ రంగంలో మీరు చేసే పనిని సమాజసేవగా మలుచుకోవటం సరియైన కర్మ. ఏ రంగంలో చేయాలి? ఇది ఒక సమస్య. ఏ రంగంలో ఎన్నుకోవాలి అంటే మూడు రకాలుగా ఎన్నుకోవచ్చు. అవి – మీకు ఇష్టమైన వృత్తిని ఎన్నుకోవటం; వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని ఎన్నుకోవటం; అధిక సంపాదనకు ఆస్కారం ఉన్నది ఎన్నుకోవటం.

ఎ) **మీకు ఇష్టమైన వృత్తిని ఎన్నుకోవటం** – మీకు ఇష్టమైన వృత్తిని ఎన్నుకోవటం అన్నింటికన్నా శ్రేష్టమైన మార్గం అంటున్నాడు కృష్ణపరమాత్మ. అది గుణప్రధానంగా లేదా స్వభావప్రధానంగా ఉంటుంది. ఎందుకు ఇది అన్నింటికన్నా ఉత్తమం? అనేక లాభాలు చెప్పవచ్చు. ముందుగా మీరు మనస్ఫూర్తిగా ఎన్నుకుంటారు కాబట్టి, మీరు ఎన్నుకున్న ఆ పనిలో బాగా శ్రద్ధపెట్టి పనిచేస్తారు. మనసా, వాచా, కర్మణా చేస్తారు ఆ పనిని. మీరు చేసే పనినే మీరు ప్రేమిస్తారు. ఆ పనియొక్క ఫలంకోసం ఎదురుచూడరు. పనిలోనే ఆనందం పొందుతారు. మంచి ఫలం వస్తే అది బోనస్ అవుతుంది. జీతం కూడా బోనసే అవుతుంది.

బి) **వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని ఎన్నుకోవటం** – గుణాన్నిబట్టి ఎన్నుకోవటం శ్రేష్ఠం, బాగానే ఉంది కాని, మీ గుణమేదో మీరు తేల్చుకోలేకపోతే, వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని ఎన్నుకోవటం మంచిది. మీ వంశంలో ఏ వృత్తి వస్తోందో, దాన్ని మీరు చిన్నప్పటినుంచీ చూస్తూవస్తారు. మీకు తెలియకుండానే మీకు ఆ వృత్తిలోని మెళకువలు తెలుస్తాయి. అది మీకు తెలియకుండానే మీ గుణంగా మారుతుంది. సంగీతవిద్వాంసుల ఇంట్లో పుట్టిన అమ్మాయి, చిన్నతనంనుంచే పాడటం మొదలుపెడుతుంది. అంటే రెండవ మార్గం – జాతినిబట్టి ఎన్నుకోవటం.

సి) **అధిక సంపాదనకు ఆస్కారం ఉన్నది ఎన్నుకోవటం** – ఎక్కువ డబ్బు, తక్కువ పని ఉండే వృత్తిని ఎన్నుకుంటారు కొంతమంది. భగవద్గీత మొదటి రెండింటినీ స్వీకరిస్తుంది కాని మూడవ పద్ధతిని అసలు ఒప్పుకోదు. అందువల్ల కృష్ణపరమాత్మ 'నీ స్వభావాన్నిబట్టి నీ కర్మను ఎన్నుకో అర్జునా,' అంటున్నాడు. అతని స్వభావం క్షత్రియస్వభావం. అతనిది రాజసిక ప్రవృత్తి. రాజసిక ప్రవృత్తి ఉన్నవ్యక్తి ఒక్కక్షణం కూడా ఖాళీగా కూర్చోలేడు. ఒకవేళ అటువంటి వ్యక్తి సన్న్యాసం స్వీకరించి, ఋషీకేష్‌కి వెళ్ళినా, అక్కడ ఖాళీగా ఉండక, సన్న్యాసులందరినీ పోగేసి, వారికొక సంస్థను ఏర్పాటుచేసి, వారి హక్కుకోసం పోరాడతాడు.

**స్వభావజేన కౌంతేయ నిబద్ధః స్వేన కర్మణా ।**
**కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోఽపి తత్ ॥** – 18.60

ఓ అర్జునా! మోహప్రభావంవల్ల యుద్ధకర్మను నువ్వు చేయటానికి ఇక్కడ ఇష్టపడకపోయినా, నీ స్వభావంవల్ల నువ్వు యుద్ధం చేస్తావు. అందువల్ల నీ స్వభావానికి కట్టుబడి ఉండు.

ఏ వృత్తిని మీరు ఎన్నుకున్నా, అది మీ స్వభావానికి అనుగుణంగా ఉండాలి. అప్పుడే మీ వ్యక్తిత్వం మిమ్మల్ని బాధించదు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. పాండవులు అడవిలో ఉండగా అవస్థలు పడ్డారు. మహాభారతయుద్ధంకోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూశారు. తీరా ఇప్పుడు యుద్ధభూమిలోకి వచ్చి, నేను యుద్ధం చేయను, అడవిలోకి తిరిగి వెళ్ళిపోతాను అంటున్నాడు. వనవాసం అంతగా నచ్చితే, యుద్ధానికి ఎందుకు వచ్చినట్టు? అక్కడే ఉండిపోవాల్సింది.

అక్కడేమో యుద్ధం చేయాలనే తపన అర్జునుణ్ణి పట్టిపీడించింది. యుద్ధం చేయటంకోసం ఆయుధాలను ప్రోగేసుకున్నాడు. పాశుపతాస్త్రం పొందటానికి తీవ్రమైన తపస్సు చేశాడు. స్వర్గానికి వెళ్ళి ఆయుధాలు పొందాడు. ఇవన్నీ ఎందుకు చేశాడు? యుద్ధం చేయటం కోసం. ఇప్పుడేమో యుద్ధం చేయటంకన్నా భిక్షాటనం చేసి జీవించటం మేలు అంటున్నాడు. ఎందుకు? అతను మోహంలో పడ్డాడు కాబట్టి. కాని, అతను తన స్వభావాన్నిబట్టి కర్మను ఎన్నుకోవాలి. అందువల్ల నీ క్షత్రియధర్మాన్ని పాటించు, యుద్ధం చేయి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

బ్రాహ్మణకర్మ అంటే శాస్త్ర అధ్యయనం, శాస్త్ర అధ్యాపనం ఉంటుంది; క్షత్రియకర్మ అంటే రాజ్యపాలన ఉంటుంది; వైశ్యకర్మ అంటే వ్యాపారం చేయటం ఉంటుంది; శూద్రకర్మ అంటే తక్కిన వర్ణాలవారికి సేవ చేయటం ఉంటుంది. వీటిలో ఏ కర్మనైనా మీ స్వభావాన్ని బట్టికాని, మీ జాతినిబట్టి కాని ఎన్నుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇది సరియైన కర్మ.

**సరియైన దృక్పథం** – సరియైన దృక్పథం అంటే మీరు ఏ కర్మను ఎన్నుకున్నా, దానిలో ఆనందాన్ని పొందాలి. ఉదాహరణకు మీరు బ్రాహ్మణకర్మను ఎన్నుకుంటే, శాస్త్రాన్ని నేర్చుకోవటంలోనూ, దాన్ని నలుగురికీ నేర్పించటంలోనూ ఆనందం పొందాలి. చేస్తున్న వృత్తిలో ఆనందం పొందకుండా, బలవంతంగా చేస్తే అనారోగ్యం కలుగుతుంది. మీ వ్యక్తిత్వానికీ, మీ వృత్తికీ మధ్య నిరంతరం ఘర్షణ జరుగుతూ ఉంటుంది. అలా ఘర్షణతోనే రిటైరయ్యేదాకా ఆ వృత్తిలో కొనసాగితే, అది ఎంత తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుందో ఆలోచించండి. దానికి భిన్నంగా మీరు చేసే పనిని మీరు ఆనందిస్తే, శారీరకంగా కూడా మీరు ఆరోగ్యకరంగా ఉంటారు.

అర్జునునికి క్షత్రియకర్మ సరియైన కర్మ. క్షత్రియకర్మ ఏమిటి? విల్లంబులు తీసుకుని యుద్ధం చేయటం. యుద్ధానికి కూడా ఎప్పుడు వచ్చాడు? సామదానభేద మార్గాలు విఫలమయ్యాక, దండోపాయం తప్పనిసరి కాబట్టి వచ్చాడు. అది కూడా ధర్మరక్షణకోసం వచ్చాడు. ఈ ధర్మయుద్ధంలో అధర్మం వైపు ఆత్మీయులు, గురువులు ఉంటే అతను రాగ, మోహాల్లో పడకూడదు.

**స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః ।**
**స్వకర్మనిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥** – 18.45

మీరు ఉన్న వృత్తిలోనే అంకితభావంతో పనిచేయండి. మీరు పనిమీద మీ దృక్పథాన్ని మార్చుకుంటే, మీరు చిత్తశుద్ధిని పొందుతారు. చిత్తశుద్ధిని ఎలా పొందాలో నేర్పిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మీరు చేసే కర్మను పూజగా మలుచుకోవాలి. పూజ అంటే పూజగదిలో కూర్చుని, భగవంతుని పటాలకు నాలుగు పూవులు పెట్టటం కాదు; లేదా ఏ ఆలయానికో వెళ్ళి అర్చన చేయటం మాత్రమే కాదు. పూజ అనేది ఎక్కడైనా చేయవచ్చు, అన్నిచోట్లా చేయవచ్చు. ఆఖరికి యుద్ధభూమిలో కూడా చేయవచ్చు. అందువల్ల మీరు భగవంతునికి ఏది అర్పిస్తున్నారు అనేది కాదు ముఖ్యం; ఎలా అర్పిస్తున్నారు అనేది ముఖ్యం.

మీరు చేసే నిత్యపూజ కూడా మీరు సరియైన దృక్పథంతో చేయకపోతే పూజ కాదు. దానికి భిన్నంగా మీరు చేసే పనిని సరియైన దృక్పథంతో చేస్తే, అది చిత్తశుద్ధి అవుతుంది. అందువల్ల నువ్వు చేసే యుద్ధాన్ని పూజగా మలుచుకో అంటున్నాడు. ఇక్కడ కృష్ణపరమాత్మ స్వకర్మ అంటున్నాడు. అంటే మీరు ఏ కర్మను ఎన్నుకున్నా దాన్ని మార్చుకోనవసరం లేదు అంటున్నాడు. మీరు బ్రాహ్మణవృత్తిలో ఉంటే అందులో కొనసాగండి. వ్యాపారం చేస్తుంటే, వ్యాపారం కొనసాగించండి. సైనికుడయితే, సైనికుడిగానే ఉండండి. ఇల్లాలైతే ఇల్లాలిగానే

ఉండండి. నేను ఇల్లాలిని మాత్రమే అంటే మీకా పని నచ్చనట్టు అర్థం వస్తుంది. నేను ఇల్లాలిని అని గర్వంగా ఎందుకు చెప్పలేరు? అది కూడా ఈశ్వర ఆరాధనే!

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**

**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥** – 9.27

ఓ కౌంతేయా! నువ్వు ఏ కర్మను చేస్తున్నా, ఏది తింటున్నా, ఏ హోమం చేస్తున్నా, ఏ దానం చేస్తున్నా, ఏ తపస్సు చేస్తున్నా, దాన్ని నాకు అర్పించు అన్నాడు కృష్ణపరమాత్మ.

**మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా ।**

**నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥** – 3.30

నువ్వు చేసే కర్మలన్నీ అంతర్యామిని, పరమాత్మను అయిన నాకే అర్పించి, ఆశా మమతా సంతాపాలను వదిలి, యుద్ధం చేయి అర్జునా అన్నాడు కృష్ణపరమాత్మ.

ఇప్పుడు అదే భావాలను ఈ క్రింది శ్లోకంలో తెలియజేస్తున్నాడు.

**యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**

**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥** – 18.46

ఏ భగవంతుణ్ణుంచి సమస్త ప్రాణులు వచ్చాయో, ఏ భగవంతుడు అంతటా ఉన్నాడో, ఆ భగవంతునికి మీ కర్మలను అర్పించండి. అలా చేస్తే, ఆ కర్మలు మిమ్మల్ని సంస్కరిస్తాయి. మీరు ఈశ్వరార్పణభావనతో కర్మ చేస్తే భగవంతుణ్ణి విమర్శించరు. ఏది వచ్చినా ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తారు.

కర్మయోగం = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి

అలా కర్మయోగంగా కర్మను మలుచుకుంటే చిత్తశుద్ధి పొందుతారు.

3. **జ్ఞానయోగ సారాశం**

జ్ఞానయోగం అంటే ఏమిటి? జ్ఞానయోగంలో రెండు దశలు ఉన్నాయని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. దీని సారం రెండు దశలుగా బోధిస్తున్నాడు.

– చైతన్యాన్ని శరీరంనుంచి విడదీయటం

– చైతన్యాన్ని విడదీశాక, చైతన్యం వైపు దృష్టి మరల్చటం.

**చైతన్యాన్ని శరీరంనుంచి విడదీయటం** – చైతన్యాన్ని శరీరంనుంచి విడదీయాలి అంటే శారీరకంగా కాదు. అది సాధ్యమూ కాదు. బుద్ధితో విడదీయాలి. రెండవ అధ్యాయంలో ఎలా విడదీయాలో చూశాము. చైతన్యంయొక్క ఐదు లక్షణాలను ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

1. చైతన్యం, శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువుకాని కాదు.

2. చైతన్యం, స్వతంత్రవస్తువు. అది శరీరమంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింప జేస్తుంది.

3. చైతన్యం, శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

4. చైతన్యం, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.

5. చైతన్యం, శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. చైతన్యాన్ని ప్రతిబింబిపజేసే మాధ్యమం లేదు కాబట్టి చైతన్యం తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఈ లక్షణాలను అర్థం చేసుకోవటానికి కాంతి–చెయ్యి ఉదాహరణ చూశాము.

1. కాంతి, చేతిలో ఒక భాగం కాని, లక్షణం కాని, చేతినుంచి ఉత్పత్తి చెందిన వస్తువు కాని కాదు.

2. కాంతి, స్వతంత్రవస్తువు. అది చేయంతా వ్యాపించి, చేతిని ప్రకాశింపజేస్తుంది.

3. కాంతి, చేతి సరిహద్దులకే పరిమితమవలేదు.

4. కాంతి, చేతిని తీసేసినా ఉంటుంది. చెయ్యి ఉన్నా, లేకపోయినా కాంతి ఉంటుంది.

5. కాంతి, చెయ్యి లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. కాంతిని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి కాంతి కనబడదు. అంతమాత్రాన కాంతి లేనట్టు కాదు.

ఇది వేదాంతంలో మొట్టమొదటి పాఠం; దీన్ని వివరంగా రెండవ అధ్యాయంలోనూ, పదమూడవ అధ్యాయంలోనూ చూశాము.

**చైతన్యాన్ని విడదీశాక, చైతన్యం వైపు దృష్టి మరల్చటం –** చైతన్యాన్ని బుద్ధితో విడదీస్తే చాలదు. ఆ చైతన్యాన్ని నేను అని అర్థం చేసుకోవాలి. ఇన్నాళ్ళూ శరీరంతో మమేకం చెందుతూ వచ్చారు. ఇప్పుడు నేను చైతన్యాన్ని అని అర్థం చేసుకోవాలి. ఇది అన్నిటికన్నా అత్యంత కష్టమైన విషయం.

'నేను శరీరాన్ని, నాలో చైతన్యం ఉంది,' అనే దశనుంచి, 'నేను చైతన్యాన్ని, నేను వ్యవహారం నడపటానికి నాకొక శరీరం ఉంది,' అని అనగలగాలి. శరీరం పడిపోయినా, నేను పోను. మరి ఏమిటి పోతుంది? ప్రతిబింబ మాధ్యమం, శరీరం పోతుంది; అందువల్ల వ్యవహారాలు ఆగిపోతాయి. వ్యవహారాలు ఆగిపోయినా, నేను లేనట్టు కాదు. శరీరం పడిపోయాక నేను ఎలా ఉంటానో తెలుసుకోవటానికి మనం ఆ అనుభవాన్ని ప్రతిరాత్రీ

పొందేలాగా చేశాడు భగవంతుడు. ప్రతిరాత్రి తాత్కాలికంగా మరణిస్తూనే ఉన్నాము. ఎలాగంటారా? ఈ తాత్కాలిక మరణానికి ఇంకోపేరు '**సుషుప్తి**.'

ఈ సుషుప్తిలో మీరు ఉండకుండా ఉండరు. మీరు ఉంటారు, కాకపోతే వ్యవహారాలు నడిపే శరీరమనే మాధ్యమం పడుకుంటుంది కాబట్టి, వ్యవహారాలు తాత్కాలికంగా నిలిపి వేయబడతాయి. కాని, వ్యవహారం నడపని మీరు, నిద్రలో కూడా ఉన్నారు. అందులో ఏమాత్రం సందేహం లేదు! అంతేకాదు, నిద్రలో వ్యవహారం జరపరని కూడా మీకు తెలుసు. ఒకవేళ నిద్రపోతే మీరు మరణిస్తారని ఎవరైనా చెబితే, మీరు నిద్రపోతారా? చచ్చినా నిద్రపోరు! మీరు 'నేను గాఢనిద్ర పోతున్నాను,' అని కానీ, 'నిద్రలో నేను వ్యవహారాలన్నీ ఆపాను,' అని కాని చెప్పలేరు. కాని మీరు ఉన్నారు అని మీకు తెలుసు. దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. ఏమిటది? శరీరం ఒక ఆగంతుక 'స్వరూపం' మాత్రమే. అది మీరు తొడుక్కునే వస్త్రాలలాగా వచ్చిపోతుంది.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥** – 2.22

ఎలాగైతే మనిషి జీర్ణవస్త్రాలను త్యజించి, నూతనవస్త్రాలను ధరిస్తాడో, అలా జీవాత్మ పాత శరీరాన్ని వీడి, నూతనశరీరాన్ని పొందుతుంది.

**జాయతే మ్రియతే వా కదాచిత్** – శరీరం వచ్చిపోతుంది.

దీన్నే ఇంకో విధంగా చెప్పాలంటే, ఆత్మానాత్మవివేకం చూపటం మొదటిదశ; ఆత్మ వైపుకు దృష్టి మరల్చటం రెండవదశ. అలా ఆత్మ వైపు దృష్టి మరలిస్తే పొందే గొప్ప ఫలం మీ శరీరాన్ని మీరు మీకు భిన్నంగా, ఆబ్జెక్టుగా చూడటం నేర్చుకుంటారు. శరీరాన్ని బాహ్యవస్తువుగా చూడటం నేర్చుకున్నకొద్దీ శరీరాన్ని నడిపించే సూత్రాలను స్వీకరించటం నేర్చుకుంటారు. శరీరాన్ని నడిపే సూత్రాలు ఏమిటి? అవి మూడు సూత్రాలు. దేశ, కాల, ప్రారబ్ధకర్మలు.

మీరు ఉన్న ప్రాంతం మీ శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. మీ స్థూలశరీరవర్ణం మీరున్న ప్రాంతాన్నిబట్టి ఉంటుంది. చలిదేశంలో ఉంటే ఒకలాగా, ఎడారి ప్రాంతంలో ఉంటే ఇంకోలాగా ఉంటుంది. కాలం కూడా మీ శరీరాన్ని నిర్దేశిస్తుంటుంది.

**కాలః క్రీడతి గచ్ఛతి ఆయుః**

కాలం కోరల్లో ఎవరైనా చిక్కుకోక తప్పదు. కాలం గడుస్తూన్నకొద్దీ, శరీరం నెమ్మదిగా ముడతలు పడుతూ వస్తుంది. జుట్టు తెల్లబడుతుంది; శక్తి సన్నగిల్లుతుంది. శరీరాన్ని ప్రారబ్ధకర్మ కూడా నిర్దేశిస్తుంది. ఆ మూడూ మనిషిని ఒక ఆటాడిస్తాయి. జ్ఞాని కూడా

ఈ మూడింటి ప్రభావాన్ని తప్పించుకోలేడు. కాకపోతే జ్ఞాని, ఆ మూడూ శరీరాన్నిబట్టి పీడిస్తాయి కాని, తను శరీరం కాదు అని అర్థం చేసుకుంటాడు కాబట్టి, అతను వీటివల్ల చలించడు. అంటే అతను ప్రకృతిసూత్రాలను చిరునవ్వుతో స్వీకరిస్తాడు కాని వాటిమీద వ్యతిరిక్తత చూపడు.

ఈ ఆత్మకు రెండవ అధ్యాయంలో ఆరు అంశాలను చూశాము. కాని ఇక్కడ కృష్ణపరమాత్మ వాటన్నింటినీ మళ్ళీ చెప్పకుండా, ఒక్కటే అంశాన్ని నొక్కిచెబుతున్నాడు. అది –

**తత్రైవం సతి కర్తారమ్ ఆత్మానం కేవలం తు యః ।**
**పశ్యత్యకృతబుద్ధిత్వాత్ న స పశ్యతి దుర్మతిః ॥** – 18.16

**యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।**
**హత్వాపి స ఇమాన్ లోకాన్ న హంతి న నిబధ్యతే ॥** – 18.17

అజ్ఞానికి తన అసలు స్వరూపం శుద్ధ ఆత్మ అని తెలియనందువల్ల తనను తాను కర్తగా భావిస్తాడు.

దానికి భిన్నంగా జ్ఞానికి దేహాభిమానం ఉండకపోవటంవల్ల అతనికి కర్తృత్వ భోక్తృత్వ భావన ఉండదు. అందువల్ల అతను కర్మలు చేసినా కర్త అవడు; కర్మఫలం కూడా అంటదు.

జ్ఞాని ఆత్మలక్షణాలను బాగా జీర్ణించుకుంటాడు. వాటిలో ముఖ్యమైనది ఆత్మ అకర్తా, అభోక్తా. జ్ఞాని ఎప్పుడైతే తను ఆత్మను అని అర్థం చేసుకుంటాడో, అప్పుడే అతను అకర్తా, అభోక్తా అని అర్థం చేసుకుంటాడు. శరీరం పుణ్యపాపాలను తప్పించుకోలేదు కాని ఆత్మకు పుణ్యపాపాలు అంటవు. శరీరంతో మమేకం చెందినన్నాళ్ళూ పుణ్యపాపాలను తప్పించుకోలేరు. అదే మీరు ఆత్మను అని అర్థం చేసుకుని, ఆత్మలో రమిస్తే పుణ్యపాపాలకు అతీతంగా ఎదుగుతారు. అదే మోక్షం అంటే.

**తథా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్యముపైతి**
– ముండకమ్ 3.1.3

జ్ఞాని పుణ్యపాపాలకు అతీతంగా ఎదిగి, శుద్ధమైన పరబ్రహ్మను పొందుతాడు.

ఆత్మ అకర్తా, అభోక్తా, నేను ఆత్మను అనే ఈ జ్ఞానమే మోక్షాన్ని కలుగజేస్తుంది. ఇది జ్ఞానయోగ సారాంశం.

ఈ అధ్యాయం చివర్లో ధ్యానాన్ని జ్ఞానయోగంలో ఒక భాగంగా పేర్కొంటాడు కృష్ణపరమాత్మ. జ్ఞానయోగంలో ధ్యానం ఎలా భాగమవుతుందంటే జ్ఞానయోగాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారానే పొందగలము. 'నేను అకర్తా అభోక్తాను, నేను శరీరానికి

భిన్నంగా ఉన్న ఆత్మను అనే ఈ అంశాలమీద ధ్యానం చేయటం జ్ఞానయోగంలోని నిదిధ్యాసనం కిందికి వస్తుంది.

**మనోబుద్ధ్యంహంకారచిత్తాని నాహం న చ శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణ నేత్రే ।**
**న చ వ్యోమభూమిర్న తేజో న వాయుః చిదానందరూపః శివోఽ హం శివోఽ హమ్ ॥**

నేను పుణ్యపాపాలకు అతీతుణ్ణి. నేను చిదానందరూపాన్ని.

ఆ విధంగా కర్మయోగం చిత్తశుద్ధిని కలుగజేస్తే, జ్ఞానయోగం మోక్షాన్ని కలుగుజేస్తుంది.

కర్మయోగం, జ్ఞానయోగం గురించే వస్తోంది కాని భక్తియోగం గురించి రావటం లేదెందుకనే సందేహం రావచ్చు. ఎందుకు భక్తియోగాన్ని విడిగా చూడమో, నిజానికి పన్నెండవ అధ్యాయంలో చూశాము. ఒకసారి ఇక్కడ గుర్తు తెచ్చుకుందాము. భక్తియోగం కర్మయోగంలాగా, జ్ఞానయోగంలాగా విడిగా సాధన చేసేది కాదు.

భక్తియోగం = కర్మయోగరూపభక్తి + జ్ఞానయోగరూపభక్తి

తక్కువస్థాయి భక్తి కర్మయోగం అయితే, ఉన్నతస్థాయి భక్తి జ్ఞానయోగంలోకి వస్తుంది.

4. **గీతాబోధ సారాంశం**

కృష్ణపరమాత్మ తన మొత్తం బోధని ప్రఖ్యాతి చెందిన ఈ శ్లోకంతో ముగించాడు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥** – 18.66

సర్వకర్మలను త్యజించి (దేహాభిమానం త్యాగం చేసి) నన్నే (నిర్గుణబ్రహ్మను) శరణు వేడు. నువ్వు శోకింపకు. నేను నిన్ను పాపాలనుంచి విముక్తుణ్ణి చేస్తాను.

ఈ శ్లోకం మొత్తం పద్దెనిమిదవ అధ్యాయానికి మాత్రమే సారాంశం కాదు, మొత్తం భగవద్గీతకే సారాంశం అని చెప్పవచ్చు. ఇంకా మాట్లాడితే, మొత్తం వేదాంతసారం అని కూడా చెప్పవచ్చు. కాని వచ్చిన చిక్కేమిటంటే, ఈ శ్లోకాన్ని అనేక రకాలుగా వాఖ్యానించారు అనేకమంది. మనం ఇప్పుడు శంకరాచార్యులవారి భాష్యంలోంచి ఈ శ్లోకం అర్థం చూద్దాము. శంకరాచార్యులవారు దీన్ని పూర్తిగా సాంకేతిక పద్ధతిలో, మీమాంసాశాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని విశ్లేషించి, దాని అర్థాన్ని నిరూపించారు.

### శంకరాచార్యులవారి భాష్యం – మీమాంసాశాస్త్రం ఆధారంగా

**సర్వధర్మాన్ పరిత్యజ్య** – ధర్మ అంటే కర్మయోగంగా జీవితాన్ని మలుచుకోవటం. కర్మయోగం చిత్తశుద్ధి పొందటానికి తోడ్పడుతుంది. పరిత్యజ్య అంటే వదులు అని అర్థం. కర్మయోగం చిత్తశుద్ధి పొందటానికి తోడ్పడితే, దాన్ని వదలమని ఎందుకు చెబుతున్నాడు? అంటే

కర్మయోగంవల్ల చిత్తశుద్ధి పొందాక, కర్మయోగానికి అతీతంగా ఎదగాలి. పాఠశాలలో ఒక్కొక్క తరగతీ దాటుకుంటూ వస్తారు. ఒక తరగతిలో నాకు టీచరు నచ్చింది, ఇక్కడే ఉండిపోతాను అంటారా? అనరు. పాఠశాలను వదిలి కాలేజీకి రావాలి. అలాగే కర్మయోగాన్ని వదిలి, జ్ఞానయోగానికి రావాలి. అక్కడ **అథాఽతో ధర్మజిజ్ఞాసా** నేర్చుకుంటే ఇక్కడ **అథాతో బ్రహ్మజిజ్ఞాసా** నేర్చుకోవాలి. అంటే బ్రహ్మజ్ఞానం పొందటానికి శ్రద్ధ చూపాలి.

అందువల్ల సర్వధర్మాన్ పరిత్యజ్య అంటే కర్మయోగం ద్వారా చిత్తశుద్ధి పొందాక, కర్మయోగానికి అతీతంగా ఎదిగి జ్ఞానయోగానికి రావాలి. చిత్తశుద్ధి జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తుంది. అందువల్ల జ్ఞానయోగానికి రావాలి. కర్మయోగంలోనే కూరుకుపోయి, సంఘసేవ చేస్తూ కూర్చుంటే, వేదాంతం నేర్చుకోవటానికి కాని, ఆత్మజ్ఞానం పొందటానికి కాని తీరికెక్కడిది? అందువల్ల కర్మయోగం చేసి, చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగ్యతాప్రాప్తి పొంది శ్రవణ మనన నిదిధ్యాసనలు చేయటానికి జ్ఞానయోగానికి రావాలి.

**మామేకం శరణం వ్రజ** – దీని అర్థం జ్ఞానయోగ అనుష్ఠానానికి రా అంటున్నారు శంకరాచార్యుల వారు. శరణాగతి అంటే జ్ఞానయోగ అనుష్ఠానం. శరణాగతికీ, జ్ఞానయోగానికీ మధ్య సంబంధం ఏమిటి? శరణాగతి లేదా భక్తిని నవవిధభక్తి అంటారు. అవి శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చన, వందనం, దాస్యభావన, సఖ్యాభావన, ఆత్మనివేదన. ఆత్మనివేదనను శరణాగతి అంటారు. శరణాగతి అంటే అహంకారాన్ని వదులుకోవటం.

నేను అహంకారాన్ని వదులుకున్నాను, నేను అహంకారాన్ని వదులుకున్నాను అని పదేపదే చెప్పటం కూడా అహంకారంలోకే వస్తుంది. 'నేను సాధన చేస్తున్నాను,' అనే మాటను కూడా వదులుకోవాలి. నిజానికి ఒక కర్మ ద్వారా అహంకారాన్ని శారీరకంగా వదులుకోలేము అంటున్నారు శంకరాచార్యులవారు. ఇది సాంకేతికం. అహంకారాన్ని కర్మ ద్వారా ఎందుకు వదులుకోలేము? అహంకారం అజ్ఞానంనుంచి పుట్టింది. అల అనేది నిజంగా ఎలా లేదో, అహంకారం అనేది కూడా నిజంగా లేదు. అల అంటే ఏమిటి?

**వాచాఽఽరంభణం వికారో నామధేయమ్**

నిజానికి అల అనేది నిజంగా లేదు. నీటికి అల అనే పేరును వాక్కు ఇచ్చింది. అంతకుముందు, ఇప్పుడు, తరువాత కూడా ఉండేది నీరు మాత్రమే. అల కేవలం నామరూపాలు మాత్రమే. అలాగే అంతకుముందు, ఇప్పుడు, తరువాత ఉండేది బ్రహ్మ మాత్రమే. 'నేను' అనే వ్యక్తిని విడిగా లేను. అది ఒక అపోహ మాత్రమే. నేను అని విర్రవీగే ఈ అహంకారం అపోహ లేదా అజ్ఞానంవల్ల ఏర్పడింది కాబట్టి, దాన్ని పారద్రోలాలంటే జ్ఞానం ఒక్కటే మార్గం.

అందువల్ల సర్వధర్మాన్ పరిత్యజ్య అంటే కర్మయోగానికి అతీతంగా ఎదుగు; మామేకం శరణం వ్రజ అంటే జ్ఞానయోగాన్ని పాటించు. అలా చేస్తే కలిగే ఫలం ఏమిటి?

**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి** – నేను నీకు మోక్షాన్ని ఇస్తాను. నిన్ను అన్ని పాపాలనుంచి విముక్తుణ్ణి చేస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగంవల్ల చిత్తశుద్ధి కలిగితే, జ్ఞానయోగంవల్ల జ్ఞాని అవుతాడు. జ్ఞానం పొందితే దాని ఫలం మోక్షం.

**మా శుచః** – అందువల్ల నువ్వు శోకించకు.

ఈ విధంగా శంకరాచార్యులవారు ఈ శ్లోకాన్ని విశ్లేషించారు. శంకరాచార్యులవారు ఇలా ఎందుకు విశ్లేషించారు? దానికి మూడు కారణాలు శంకరులవారే ఇస్తారు.

ఎ) నిజానికి కృష్ణపరమాత్మ తన బోధను ఈ విధంగానే మొదలుపెట్టాడు.

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః** – 2.11

జ్ఞానులు మరణించిన వారి గురించి మరణించని వారి గురించి శోకించరు. శోకంనుంచి విడివడటానికి జ్ఞానం ఒక్కటే మార్గం అంటూ తన బోధను మొదలుపెట్టాడు. మళ్ళీ కర్మలను వదిలి జ్ఞానానికి రమ్మంటూ తన బోధను ముగిస్తున్నాడు. జ్ఞానంతో మొదలుపెట్టి జ్ఞానంతో ముగిస్తుంటే, శరణాగతి అంటే జ్ఞానం కాక వేరే ఏదయినా మార్గం ఉంటుందా?

కృష్ణపరమాత్మ చెప్పింది అయోమయానికి దారితీసినట్టుగా అనిపిస్తుంది కాని కృష్ణపరమాత్మ తనను తాను ఖండించుకోడు కదా! మీమాంసాశాస్త్రం ఒప్పుకోదు కూడా ఇది. ఒక మంచిగురువు తన బోధ సారాంశంగా దేన్ని మొదట ప్రతిపాదిస్తాడో, దాని గురించే చివర కూడా చెప్పాలి. కృష్ణపరమాత్మ జ్ఞానంతో మొదలుపెట్టి, ఇంక దేనితోనో ముగిస్తే కృష్ణపరమాత్మ, మీమాంసాశాస్త్రంలో పేర్కొనబడిన ఉపక్రమ ఉపసంహార నియమాన్ని ఉల్లంఘించినట్టు అవుతుంది. ఈ నియమం ప్రకారం దేనితో మొదలుపెడతారో (ఉపక్రమం), దానితోనే ముగించాలి (ఉపసంహారం). కృష్ణపరమాత్మ జగద్గురువు. మీమాంసాశాస్త్రానికి భిన్నంగా బోధ చేయడు. అందువల్ల ఈ అధ్యాయంలో పేర్కొన్న శరణాగతే మొదట్లో చెప్పిన జ్ఞానం. ఇది మొదటి కారణం.

బి) సర్వధర్మాన్ పరిత్యజ్యలో ధర్మ అంటే వేదాల్లో నిర్దేశించిన అన్ని కర్మలూ అని వస్తుంది. ధర్మానికి సాంకేతిక నిర్వచనం **చోదన లక్షణః అర్థః ధర్మః**. అంటే ఒక ప్రాథమిక కర్మను ధర్మం అంటారు. అందువల్ల, సాధకుణ్ణి అన్ని కర్మలు వదిలేసి ఇంకొక సాధన చేయమని కృష్ణపరమాత్మ నిర్దేశిస్తున్నప్పుడు, ఆ ఇంకొక సాధన ఇంకొక కర్మ అయ్యే అవకాశం లేదు. అది కర్మకు భిన్నంగా ఉండేది అయివుండాలి. శరణాగతి అంటే కర్మకు భిన్నంగా ఉన్నదై ఉండాలి. జ్ఞానం కర్మలోకి రాదు. అందువల్ల కర్మకు భిన్నంగా ఉన్నదేమిటి? జ్ఞానం. అందువల్ల శరణాగతి అంటే జ్ఞానం అని ఈ కారణంవల్ల చెప్పవచ్చు.

సి) ఇంకొక కారణం గీత వేదాలసారం. గీత వేదాలసారం కాబట్టి అది ప్రమాణగ్రంథం అయింది. గీతను స్మృతిగ్రంథం అనీ, వేదాలను శ్రుతిగ్రంథం అనీ అంటారు. ఒకవేళ స్మృతి చెప్పినది, శ్రుతి చెప్పినదానికి భిన్నంగా ఉంటే, ఈ రెండింటిలో ఏది ప్రమాణం? దానికి శాస్త్రమే ఒక సూత్రాన్ని నిర్దేశించింది.

**శ్రుతి స్మృత్యోః పరం బాధే శ్రుతిరేవ గరీయసీ।**

శ్రుతికీ, స్మృతికీ మధ్య భేదం వస్తే శ్రుతివాక్యమే చెల్లుతుంది. స్మృతి శ్రుతినుంచి వచ్చింది కాబట్టి, అది శ్రుతికి భిన్నంగా చెప్పకూడదు. కృష్ణపరమాత్మ తన బోధను వేదాల సారంగా చేస్తున్నాడు కాబట్టి, ఈ విషయం కృష్ణపరమాత్మకు కూడా తెలుసు. శ్రుతి మాట వేదవాక్కు. దానికి తిరుగులేదు. కృష్ణపరమాత్మ వేదాలను ప్రమాణంగా తీసుకున్నాడు; వేదాల్లో జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది అని అనేకచోట్ల వస్తుంది.

**త మేవం విద్వాన్ అమృత ఇహ భవతి నాన్యః పంథా అయనాయ విద్యతే** – పురుషసూక్తం

ఈ విధంగా జ్ఞానం పొందితే, మోక్షం కలుగుతుంది. మోక్షానికి జ్ఞానం తప్ప వేరే మార్గం లేదు.

కైవల్యోపనిషత్తు కూడా దీన్ని సమర్థిస్తుంది.

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**సంపశ్యన్ బ్రహ్మ పరమం యాతి నాన్యేన హేతునా ॥** – కైవల్యమ్ 1.10

తనలో తక్కిన జీవులనూ, తక్కిన జీవులలో తనను ఎవరైతే దర్శిస్తారో, వారే బ్రహ్మను పొందుతారు. వేరే ఏమార్గం ద్వారా కుదరదు.

**నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానామేకో బహూనాం యో విదధాతి కామాన్ ।**
**తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరాస్తేషాం శాంతిః శాశ్వతీ నేతరేషామ్॥** – కఠ 2.2.13

ఏ తెలివైన వారైతే పరమాత్మ తమలో ఉన్నాడని గ్రహిస్తారో, వారు మాత్రమే శాశ్వతమైన శాంతిని పొందుతారు. ఇతరులెవరూ పొందరు.

ఇలా జ్ఞానంవల్లనే మోక్షం పొందవచ్చనే వేదవాక్యాలు వందలకొద్దీ ఉన్నాయి. జ్ఞానమే మోక్షాన్ని ఇస్తుంది అంటే వేరే మార్గం ఇవ్వదు. జ్ఞానం అనేక మార్గాల్లో ఒకటి కాదు. జ్ఞానమార్గం ఒక్కటే మార్గం. శ్వేతాశ్వతర ఉపనిషత్తు కావాలంటే వేరే మార్గం ద్వారా జ్ఞానం పొందవచ్చు, కాకపోతే ఒక నియమాన్ని పాటించాలని అద్భుతంగా చెబుతుంది. ఏమిటా నియమం? ఆకాశాన్ని చాపచుట్టలా చుట్టగలిగితే మోక్షం వస్తుందిట! అది జరిగే పనేనా? అంటే అలా మోక్షం వేరే మార్గాలవల్ల రాదని ఖచ్చితంగా చెబుతున్నది.

అందువల్ల శరణాగతిని మోక్షం పొందే మార్గంగా సూచించాడు అంటే దాని అర్థం శరణాగతి అంటే జ్ఞానం. అందువల్ల సర్వధర్మాన్ పరిత్యజ్య అంటే బంధించే కర్మలన్నింటినీ త్యజించాక, మామ్ ఏకం శరణం వ్రజ. నన్ను శరణు వేడుగాక! నన్ను మాత్రమే పదాలను కూడా చాలామంది అపార్థంచేసుకుంటారు. అదుగో కృష్ణపరమాత్మ నన్ను మాత్రమే శరణు వేడమన్నాడు అంటే, వేరే ఏ దేవుణ్ణి కోరినా నీకు మోక్షం రాదని చెబుతున్నాడు అంటారు.

కాని శంకరాచార్యులవారు ఏకం అంటే నన్ను మాత్రమే అనికాదు అర్థం అంటారు.

ఇక్కడ మామ్ అంటే అరూప ఈశ్వరుడు. అది తెలియజేయటానికి 'ఏకమ్' అనే విశేషణాన్ని వాడాడు కృష్ణపరమాత్మ. ఏకం అంటే ఉన్నదొకటే, అద్వితీయం బ్రహ్మ. అద్వితీయం అంటే రెండవది లేనిది.

**సజాతీయ విజాతీయ స్వగతభేద రహితం పరంబ్రహ్మ**

ఈ నిర్వచనాన్ని మాండూక్యోపనిషత్తులో చూస్తాము.

**శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః –** మాండూక్యమ్ 1.7

శాంతం, మంగళకరం, అద్వైతం. దీనిని నాలుగవది అంటారు. ఇది ఆత్మ.

అందువల్ల నన్నే అంటే ఏకరూప ఈశ్వరుడైన కృష్ణపరమాత్మను కాదు, సర్వవ్యాపకుడైన అరూప ఈశ్వరుణ్ణి లేదా నిర్గుణబ్రహ్మను.

అందువల్ల శరణు వేడు అంటే నా ఉన్నతస్వరూపం గురించిన జ్ఞానాన్ని పొందు. నా జ్ఞానం పొందితే నిన్ను అన్ని పాపాలనుంచి బంధవిముకుణ్ణి చేస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఆ విధంగా గీతాబోధ జ్ఞానంతో మొదలయి, జ్ఞానంతో ముగుస్తున్నది. గీతాసారం ఒక్క వాక్యంలో చెప్పాలంటే ఎలా చెబుతారు?

కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది, జ్ఞానయోగానికి వచ్చి జ్ఞానం పొంది, మోక్షాన్ని పొందాలి.

ఇక్కడితో ఈ అధ్యాయంలో ముఖ్యమైన అంశాలు నాలుగు అయిపోయాయి. అవి **మూడు విధాల సాధనలు, కర్మయోగ సారాంశం, జ్ఞానయోగ సారాంశం, గీతాబోధ సారాంశం.** **ఉపసంహారం** – తన బోధను రెండు ముఖ్యమైన అంశాలు చెప్పి ముగిస్తున్నాడు.

**ఎ) సాంప్రదాయ విధి – గీత అధ్యయనానికి కావలసిన అర్హతలు**

**ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।**
**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥** – 18.67

నీచేత ఎన్నడూ తపస్సంపన్నుడు కానివానికి, భక్తి లేనివానికి, శాస్త్రం నేర్చుకోవాలనే తపన లేనివానికి, విమర్శించే ఉద్దేశ్యంతో ఉన్నవానికి ఈ రహస్యమైన గీతోపదేశం చేయబడకూడదు. అలా నాలుగు నియమాలు చెప్పాడు–**తపస్సు, భక్తి, శుశ్రూష, అనసూయ.**

**తపస్సు** – తపస్సు అంటే జీవితంలో నియంత్రణ ఉండాలి. ఏదీ అతిగా చేయకూడదు. ఏంచేసినా మితంగా చేయాలి.

**భక్తి** – భక్తి అంటే భగవంతునిమీద భక్తి ఉండాలి. భగవంతుడే లక్ష్యంగా ఉండాలి కాని వేరే లక్ష్యాలు పొందటానికి మార్గం కాకూడదు.

**శుశ్రూష** – శుశ్రూష అంటే శ్రోతుమ్ ఇచ్ఛా– శ్రవణం చేయాలనే తీవ్రమైన తపన ఉండాలి. గీత నేర్చుకోవాలనుకునే వ్యక్తికి ఈ తీవ్రమైన తపన ఉండాలి.

**అనసూయ** – అనసూయ అంటే భగవంతుని బోధను విమర్శించే ఉద్దేశ్యంతో, తప్పులు పట్టే ఉద్దేశ్యంతో శాస్త్రాన్ని అధ్యయనం చేయకూడదు. విమర్శనాత్మక బుద్ధితో వినకూడదు. గీతలో ఏ భాగాన్నైనా మీరు స్వీకరించలేకపోతే, గీతను తప్పు పట్టవద్దు. మీ అవగాహనా లోపాన్ని తప్పు పట్టండి; ఈసారి సరియైన గురువు దగ్గరకు వెళ్ళండి; గీత సరిగ్గా అర్థమయ్యేదాకా మళ్ళీ శ్రద్ధగా వినండి. గీతను మాత్రం ఎన్నడూ విమర్శించకండి; మీకు నచ్చకపోతే, మీకు అర్థమవలేదని అర్థం. అందువల్ల విమర్శనాత్మకబుద్ధితో కాకుండా, నేర్చుకోవాలనే తపనతో నేర్చుకోండి.

ఈ నాలుగు లక్షణాలు లేనివారికి గీతను బోధించవద్దని గురువులకు చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ హెచ్చరిక చేశాక, ఫలం కూడా చెబుతున్నాడు. ఎవరైతే గీతాబోధను ఇతరులకు చేస్తారో, ఆ గురువు మనుష్యులందరిలోకి నాకు అత్యంత ప్రియమైన వ్యక్తి అంటున్నాడు. ఎందుకంటే అతను భగవంతునికి చాలా ప్రియమైన పనిని చేస్తున్నాడు; భగవద్గీతను ప్రచారం చేస్తున్నాడు. అంటే మాకేం ఫలం లేదా అని గీతను వినే శిష్యులు బాధపడకుండా వారికి రెండురకాల ఫలాలు దొరుకుతాయి అంటున్నాడు.

**అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।**
**జ్ఞానయజ్ఞేన తేనాహమ్ ఇష్టః స్యామితి మే మతిః ॥** – 18.70

**శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః ।**
**సోఽపి ముక్తః శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్ పుణ్యకర్మణామ్ ॥** – 18.71

ఈ రెండు శ్లోకాల్లో శిష్యస్తుతి లేదా శిష్యమహిమ గురించి చెబుతున్నాడు. ఈ శిష్యులను మళ్ళీ రెండు రకాలుగా విభజిస్తున్నాడు.

మన ఇరువురి మధ్య సంభాషణారూపంలో ఉన్న భగవద్గీతను ఒకవేళ శ్రద్ధ ఉండి, అర్హత ఉన్నవ్యక్తి వింటే, వారిచేత నేను పూజించబడుతున్నాను.

గీతాబోధమీద శ్రద్ధ ఉండి, విమర్శనాత్మకబుద్ధి లేకపోతే అతను కాసేపు విన్నా కూడా, అంటే మనసెటో పోయినా కూడా, అతను మరణించాక స్వర్గలోకాలకు వెళతాడు.

అంటే మొదటిరకం శిష్యుడు ఉత్తముడు. అతను శ్రద్ధగా విని, జ్ఞానయోగం పాటించి జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడు. రెండవరకం శిష్యుడు మధ్యమ శిష్యుడు, అతను గీత విన్నా అది కర్మయోగం కిందికి వచ్చి, కర్మయోగులు వెళ్ళే స్వర్గలోకాలకు వెళతాడు.

బి) **కృష్ణార్జునుల సంవాద ఉపసంహారం**

కృష్ణపరమాత్మ బోధంతా చేశాక, ఓ అర్జునా, నా బోధను ఏకాగ్రచిత్తంతో విన్నావా, అంటే ఉత్తమ అధికారిగా విన్నావా? ఇంకొక ప్రశ్న – అజ్ఞానమూ, అజ్ఞానజనిత మోహమూ పోయిందా అని అడుగుతాడు.

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।**
**స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥** – 18.73

కృష్ణా! నేను ఉత్తమ శిష్యుణ్ణి, నువ్వు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువువి; నువ్వు బాగా బోధించావు. నీ బోధ ఎంత స్పష్టంగా ఉందంటే, నా అజ్ఞానం పోయింది; అజ్ఞాన జనిత మోహం కూడా పోయింది అన్నాడు అర్జునుడు.

ఇప్పుడు నా ధర్మం ఏమిటో నాకు అర్థమయింది. ఇప్పుడు యుద్ధం చేయటం ధర్మమా, అధర్మమా అనే సందేహం పోయింది. ఈ ధర్మయుద్ధం చేయటానికే నేను నిశ్చయించుకున్నాను అంటున్నాడు అర్జునుడు.

సి) **సంజయుడు చెప్పిన ఫలశ్రుతి –** ఆఖరి శ్లోకంలో మొత్తం భగవద్గీతకు ఉపసంహారం పలుకుతున్నాడు సంజయుడు. దీన్ని ఫలశ్రుతిగా తీసుకోవచ్చు.

కృష్ణపరమాత్మను భాగవతంలో అనేక దశల్లో చూస్తాము – వెన్నదొంగిలించిన చిన్నికృష్ణునిగా, గోపికలతో రాసలీలలు నడిపిన కృష్ణునిగా, గోపబాలకునిగా చూస్తాము. ఇక్కడ యోగాచార్యునిగా అంటే గీతాచార్యునిగా కృష్ణపరమాత్మను చూస్తాము. అలాగే అర్జునుణ్ణి ధనుర్ధారిగా చూస్తాము. అర్జునుడు మొదటి అధ్యాయం చివర్లో తన గాండీవాన్ని జారవిడిచి, రథంలో చతికిలబడ్డాడని చూశాము. ఇప్పుడు అతని చేతిలో గాండీవం ఉంది అంటే అతను ఇప్పుడు స్వధర్మం పాటిస్తున్నాడని అర్థం.

ఎక్కడయితే యోగీశ్వరునివంటి గురువు; స్వధర్మాన్ని పాటించే శిష్యుడు ఉంటారో, అక్కడ గీతజ్ఞానం పవిత్రగంగానదిలా ప్రవహిస్తుంది. గీతను కృష్ణపరమాత్మ చెప్పినట్టుగా ఉత్తమవిద్యార్థిగా శ్రద్ధగా వింటే అతనికి ఉత్తమఫలం కలుగుతుంది. ఇక్కడే ఇప్పుడే మోక్షం పొందుతాడు; అంత శ్రద్ధ లేకపోయినా, వింటే చాలు స్వర్గలోకాలకు వెళతాడు. ఇవికాక లౌకిక ఫలాలు కూడా జోడిస్తున్నాడు సంజయుడు. ఎక్కడ యోగాచార్యుడైన గురువును, ధనుర్ధారియైన శిష్యుణ్ణి గుర్తుపెట్టుకుంటారో, అక్కడ సిరిసంపదలు, విజయం, సకల ఐశ్వర్యాలు అన్నీ ఉంటాయి; అవికూడా కొన్ని రోజులకు వచ్చిపోయే ఫలాలు కావు. ఇవన్నీ శాశ్వతంగా నిలుస్తాయి; ఇది నా నిశ్చితాభిప్రాయం, నేను ఇచ్చే హామీ అని నొక్కివక్కాణిస్తున్నాడు సంజయుడు.

అందువల్ల మీకు మోక్షం అవసరం లేకపోయినా గీతాశాస్త్రాన్ని వదలకండి. ఎందులో రాణించాలన్నా మానవప్రయత్నం చేసి, ఈశ్వరానుగ్రహంకోసం గీతాశాస్త్రాన్ని అధ్యయనం చేయండి అని సంజయుడు చెబుతున్నాడు.

దీనితో ఉపసంహారం సంపూర్ణం; పద్దెనిమిదవ అధ్యాయం సంపూర్ణం; మొత్తం గీతాశాస్త్రం సంపూర్ణం.

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

**ఓం తత్సత్। సర్వం శ్రీకృష్ణార్పణమస్తు॥**

# గీతా హారతి

జయ భగవద్గీతే, జయ భగవద్గీతే
హరి–హియ–కమల–విహారిణి, సుందర సుపునీతే
॥ జయ ॥

కర్మ–సుమర్మ–ప్రకాశిని కామాసక్తిహరా
తత్త్వజ్ఞాన–వికాసిని విద్యాబ్రహ్మపరా
॥ జయ ॥

నిశ్చల–భక్తి–విధాయిని నిర్మల మలహారీ
శరణ–రహస్య–ప్రదాయిని సబ విధి సుఖకారీ
॥ జయ ॥

రాగ–ద్వేష–విదారిణి కారిణి మోద సదా
భవ–భయ–హారిణి తారిణి పరమానందప్రదా
॥ జయ ॥

ఆసుర భావ–వినాశిని నాశిని తమ–రజనీ
దైవీ సద్గుణదాయిని హరి–రసికా సజనీ
॥ జయ ॥

సమతా, త్యాగ సిఖావని, హరి–ముఖకీ బానీ
సకల శాస్త్రకీ స్వామిని శ్రుతియోంకీ రానీ
॥ జయ ॥

దయా–సుధా బరసావని మాతు! కృపా కీజై
హరి–పద–ప్రేమ దాన కర అపనో కర లీజై
॥ జయ ॥

హరిః ఓమ్

# ARSHA VIDYA TARANGINI

మా యూట్యూబ్ చానెల్ పేరు ఆర్ష విద్యా తరంగిణి. అతి సులభమైన తెలుగులో భగవద్గీత ఇంకా ఉపనిషత్తుల బోధ మా యూ ట్యూబ్ చానెల్ ఇది

**https://www.youtube.com/channel/UCvN1vYmtilmR1-r9AIVI6QQ/playlists**

– మా చానెల్ మీకు నచ్చితే subscribe బటన్ నొక్కండి

ఉచిత సాఫ్ట్ కాపీకోసం ఈ కింది లింకులో చూడండి–

**http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm**

మా ఉచిత ఆన్లైన్ క్లాసుల లింకులు –

మా క్లాస్ రూమ్ యాక్టివిటీస్ అప్ డేట్స్ మా వాట్సాప్ గ్రూప్ లో పొందుపరచబడతాయి. అందులో చేరటానికి 98490 92368 కి వాట్సాప్ చేయండి.

మీరీ లింకులను భగవద్గీత అంటే మక్కువ ఉన్న తెలుగు వారికి పంపండి. ధర్మప్రచారం చేద్దాం

## ఆర్ష విద్యా తరంగిణి పుస్తక ప్రచురణలు

### ప్రకరణ గ్రంథాలు

01. అద్వైతవేదాన్త పరిచయము
02. భజగోవిన్దమ్
03. దృగ్దృశ్య వివేకము

### శ్రుతి గ్రంథాలు

01. ముండకోపనిషత్
02. కఠోపనిషత్
03. తైత్తిరీయోపనిషత్
04. ప్రశ్నోపనిషత్
05. ఈశావాస్యోపనిషత్
06. ఐతరేయోపనిషత్
07. ఛాందోగ్యోపనిషత్
08. కేనోపనిషత్
09. కైవల్యోపనిషత్
10. బృహదారణ్యకోపనిషత్
11. మాండూక్యోపనిషత్

### స్మృతి గ్రంథము

01. శ్రీమద్భగవద్గీత మొదటి షట్కము
02. శ్రీమద్భగవద్గీత రెండవ షట్కము
03. శ్రీమద్భగవద్గీత మూడవ షట్కము
04. సంక్షిప్త భగవద్గీత

### న్యాయ గ్రంథము

బ్రహ్మసూత్రములు – చతుస్సూత్రీ

### ఇతర గ్రంథము

01. వేదాంత జీవన విధానము – 01